

నా భారతం
అమర భారతం
స్వామి వివేకానంద

# నా భారతం అమర భారతం

## స్వామి వివేకానంద

**రామకృష్ణ మఠం**

దోమలగూడ హైదరాబాదు – 500 029

© 2018 Ramakrishna Math, Hyderabad INDIA. All rights reserved.

**Published by:**

Adhyaksha

Ramakrishna Math

Domalguda, Hyderabad – 29

rkmath.org

**e-Book**

102v1.1.0

Date: November 23, 2018

ISBN: 9789388439053

Created by: Sriranga Digital Software Technologies Private Limited

srirangadigital.com

# విజ్ఞప్తి

భారతదేశాన్ని ప్రేమించి, భారతదేశం మళ్ళీ తన ప్రాచీన ఔన్నత్యాన్ని పొందాలని ఆశించిన వారిలో ముఖ్యులు స్వామి వివేకానంద. 'భారతదేశంపై స్వామీజీకి ఎంతటి ప్రేమ! అందులో నూట ఒక్క భాగమైనా మీలో ఉందా?' అని ప్రశ్నిస్తారు స్వామి అఖండానంద. పాశ్చాత్య దేశాలలో హంసతూలికా తల్పాన్ని సైతం త్యజించి, కటిక నేలమీద పడుకొని 'అయ్యో! నా దేశప్రజలు ఆకలి బాధతో బాధపడుతున్నప్పుడు ఈ భోగాలన్నీ నాకెందుకు?' అని విలపించినవారు కదా ఆయన.

అందువల్లనే స్వామీజీ దేశభక్తిని స్వామి అఖండానంద ఇలా చెబుతున్నారు. 'స్వామీజీ భారతదేశం పట్ల కనబరచిన ప్రేమానురాగాలు సామాన్యమైనవి కాదు. అది దేశభక్తి కాదు. అది దేశాత్మబోధం. సామాన్య వ్యక్తులలో ఉండేది దేహాత్మబోధం. అంటే శరీరమే తానుగా భావించడం. మరి స్వామీజీలో ఉండినది దేశాత్మబోధం. అంటే దేశాన్నే తానుగా భావించడం. దేశ ప్రజల సుఖ దుఃఖాలు, వారి వర్తమాన, భూత, భవిష్యత్ కాలాల గురించే ఆయన ఆలోచించారు. దేశానికి ఒక నూతన భారతదేశం యొక్క దృశ్యాన్ని ప్రదర్శించిన వారిలో ముఖ్యులుగా భాసించేది స్వామి వివేకానంద. స్వతంత్రంగా, నూతనోత్సాహంతో, క్రొత్త మెరుగులతో, సనాతన ఔన్నత్యాన్ని మళ్ళీ రాణింపజేసిన భారతదేశం యొక్క దృశ్యాన్ని ఇలా వివరిస్తున్నారు. 'ఇంతవరకు కనీవినీ ఎరుగని ప్రత్యేకత గల భారతదేశం రూపుదిద్దుకొంటూన్నదనే విషయంలో ఎలాంటి సందేహం లేదు..... అంతే! లేవండి! మేల్కొనండి! అమరమై, మహోన్నత స్థానంలో నూతన యువ ప్రాయంతో ఇంతవరకు లేని మహిమాన్వితంతో ఆమె విరాజిల్లుతుండడం చూడండి...?'

ఇలాంటి ఒక అద్భుత దృశ్యంతో స్వామీజీ నిలబడిపోయారా? ఆ దృశ్యాన్ని యదార్థం చేయడానికి ఏమి చేయాలో, దాన్ని గురించి మనతో ముచ్చటించి మరీ వెళ్ళారాయన. దానిని గురించిన విషయమే ఈ 'నా భారతం – అమర భారతం.' వంగ భాషలో 1986లో ప్రచురింపబడి పలుసార్లు పునర్ముద్రింపబడిన 'ఆమార్ భారత్ – అమర్ భారత్' అనే గ్రంథం యొక్క తెలుగు అనువాదమే ఈ గ్రంథం. వంగ భాషలోని ఈ గ్రంథాన్ని సంకలనం చేసినవారు మన మఠ సన్న్యాసులలో ఒకరైన శ్రీ లోకేశ్వరానంద స్వామి.

ఈ గ్రంథాన్ని తెలుగులోకి అనువదించడమేగాక, పుస్తక ప్రచురణకై కొంత ఆర్థిక సహాయాన్ని కూడా చేసిన శ్రీ కాశీనాథుని శివరావు (తెనాలి) గార్కి మా ధన్యవాదాలు. భారతదేశాన్ని గురించిన స్వామి వివేకానందుల ఈ అద్భుతమైన సంకలన గ్రంథం చదువరులకు భారతదేశం గురించిన ఒక క్రొత్త దృక్పథాన్ని ప్రదర్శిస్తుందనే విషయంలో ఎలాంటి సందేహం లేదు.

***– ప్రకాశకులు***



# స్వామి వివేకానందుని సందేశం

స్వామి వివేకానందను వర్ణిస్తూ ఒక పాశ్చాత్య అభిమాని ఇలా అన్నారు: "స్వామీజీ వయస్సులో చిన్నవారైనా వారి వివేక దృష్టి సార్వకాలీనమై విరాజిల్లు తుంది." ఈ నిరూపణను మనం అతిశయోక్తిగా కాక యథాతథంగా ఆమోదిస్తే వివేకానందుని తత్త్వదృష్టి ప్రస్తుత కాలానికి ఎంత ఆవశ్యకమో నిర్ధారింపబడుతుంది. వారు కనీసం 40 సంవత్సరాలు కూడా జీవించలేదు. 20 వ శతాబ్దారంభానికే కీర్తిశేషులయ్యారు. ఆ తర్వాత మనకు రెండు ప్రపంచయుద్ధాలు సంభవించాయి. శాస్త్రసాంకేతిక విజ్ఞానాల్లో మనం ఎంతో పురోగమించాం. తత్ఫలితంగా ప్రపంచం మొత్తంలో ఊహించని మార్పులు చోటుచేసుకున్నాయి. దానితోబాటు మానవుని దృక్పథంలో జీవిత విధానంలో చాలా పరిణామాలు సంభవించాయి. సిస్టర్ నివేదిత మాటల్లో వివేకానందునికి భారతదేశం అతి పునీతము, పూజనీయమైన మహారాణి. అలాంటి దేశం ప్రస్తుతం స్వతంత్ర దేశమైంది. (ఈ పరిణామాన్ని స్వామీజీ అప్పుడే సూచిస్తూ, మనదేశం 50 సంవత్సరాలలోపునే అనూహ్యమైన పరిస్థితుల్లో స్వాతంత్ర్యాన్ని సముపార్జించుకుంటుందని నిర్ధారణ చేశారు.) ఐతే మిగతా ప్రపంచ దేశాల వలెనే భారతదేశం కూడా ప్రస్తుతం వారి కాలంలో వారెరుగని సమస్యల వలయంలో చిక్కుకుంది. ఇప్పటి పరిస్థితుల్లో కూడా వివేకానందుని స్మరణ, ఆయన సూక్తులు అనుసరణీయమా? విచారిద్దాం.

## మానవోద్ధరణే వారి ఉద్యమం

మనం ఎదుర్కొంటున్న సమస్యల స్వభావాన్ని బట్టిగాక, వాటిని పరిష్కరించుకో టానికి

మనం అవలంబించాల్సిన ప్రవృత్తిని పరిగణనలోకి తీసుకున్నప్పుడు మనకు వివేకానందుని ఆవశ్యకత గోచరిస్తుంది. ఆయన దృష్టి మానవుని మీద మాత్రమే కేంద్రీకరింపబడింది. సరియైన మానవుని విషయంలో ఏ రకమైన సమస్యకూడ భయోత్పాతాన్ని సృష్టించదు. అపరిష్కృతంగా మిగలదు. మానవోద్ధరణే – అంటే మానవుని తీర్చిదిద్దటమే నా ఆశయం అని స్వామీజీ అనేవారు. ఒక దేశం యొక్క భవిష్యత్తు ఆ దేశ ప్రజల యోగ్యత, బుద్ధికుశలత, శక్తి సామర్థ్యముల మీద ఆధారపడి ఉంటుంది. ఏ దేశమైనా ఒకరిద్దరు మహాపురుషులకు జన్మనివ్వగలదు. అంతమాత్రాన ఆ దేశం గొప్పదౌతుందని రూఢిగా చెప్పలేం. కాని శక్తికి నిలయంగా ఆ దేశం నిరూపించుకుంటుంది. ఒక దేశం యొక్క సగటు స్త్రీ, పురుషుల స్థాయి ఉచ్ఛ స్థితిని సూచిస్తే తప్ప అది గొప్ప దేశంగా గణనకు రాదు. ఒక బుద్ధుడు, ఒక క్రీస్తు ఏ దేశం యొక్క ఘనతను, అదృష్టాన్ని నిర్ణయించలేదని స్వామీజీ చెబుతుండేవారు. ఏ దేశం యొక్క భవితవ్యాన్నైనా తీర్చిదిద్దాల్సింది సామాన్య మానవులు మాత్రమే. ఆయన అభిప్రాయంలో దేశం యొక్క శక్తి సామర్థ్యాలు సామాన్య ప్రజానీకం చేతుల్లోనే ఉంటాయి. సామాన్య ప్రజలను నిర్లక్ష్యం చేయటం, ఆ దేశం యొక్క మొత్తం జాతికి సంబంధించిన పాప కార్యంగా స్వామీజీ అభివర్ణించారు. దేశంలో సంభవించే చాలా కీడులకు ఇదే కారణమని కూడ ఆయన అన్నారు. సామాన్య ప్రజానీకాన్ని ఆయన ఒక సర్వశక్తిమంతమైన భారీ రూపంతో పోల్చి వారు అపరిమితమైన సర్వశక్తుల్ని కలిగియున్నప్పటికి జాతి యొక్క సమస్యల్ని పరిష్కరించే కార్యక్రమాల్లో వారికేవిధమైన అవకాశం లభించటం లేదని చింతించారు.

దేశ భవితవ్యాన్ని కొద్దిమంది మేధావులనుకునేవారు మాత్రమే నిర్ణయిస్తుండగా, సామాన్య ప్రజలు మాత్రం నిస్సహాయులైన మూగ ప్రేక్షకులుగా మిగిలిపోతున్నారు. కేవలం విశ్వవిద్యాలయాలు ఇచ్చే డిగ్రీలను కలిగియుండటం వల్ల మాత్రమే ఆ మేధావులు అధికారాన్ని చెలాయించటానికి అర్హులౌతున్నారు. వారికి సామాన్య ప్రజానీకం సమస్యల పట్ల ఏ కొంచెం అవగాహన కూడా ఉండదు. వారెప్పుడూ దేశ పరిపాలనాధిపత్యంలో వారి యొక్క

భాగస్వామ్యాన్ని గురించి మాత్రమే ఆలోచిస్తారు. అధికారాలు చెలాయించే సందర్భంలో వారి యోగ్యతకు దీటైన భాగస్వామ్యం వారికి లభించలేదని వారు అనుకున్నప్పుడు మాత్రం వారు అసంతృప్తిని వెలిబుచ్చుతారు. అంతేగాని సామాన్య ప్రజానీకం యొక్క కడగండ్లు అంటే నిరక్షరాస్యత, అమాయకత్వం, పేదరికం, అగ్రవర్ణాల చేతిలో వారు అనుభవిస్తున్న నిరాదరణ ఇవి ఏవీ వారి దృష్టికి రావు. అయినా వారు మొత్తం దేశప్రజలందరకు మేమే ప్రాతినిధ్యం వహిస్తున్నాం అంటారు. నా దృష్టిలో వారు దేశానికిగాని, దేశ ప్రజలకు గాని విధేయులుగాని భీరులు మాత్రమే. దేశాన్ని గాని, ప్రజలను గాని కించపరిచేవారిని ఎదుర్కొనే సాహసం వారికుండదు. స్వామీజీకి వారిపట్ల గర్హణీయమైన భావం ఏర్పడి వారిని మమ్మీలుగా అభివర్ణించారు. స్వామీజీ దృష్టిలో వారు అచేతనులైన జీవచ్ఛవాలు మాత్రమే. ఐనా వారు వారి పూర్వవైభవానికి చిహ్నాలుగా మసలుతూ ప్రజానీకాన్ని ప్రభావితం చేస్తున్నారు.

# సామాన్య జనోద్ధరణ

ఇప్పటికి మనకు స్వాతంత్ర్యం వచ్చి 5 దశాబ్దాలైనా, పరిస్థితులు మారినవా? ఈ రోజుక్కూడా పట్టణవాసులైన మధ్యతరగతి వారే ఇంకా ఆధిపత్యం వహిస్తున్నారు. దేశంలో జరిగే వ్యవహారాల్లో సామాన్య ప్రజకు ఏమీ ప్రమేయం లేదు. జాతి సంబంధమైన నిర్మాణ కార్యక్రమాల్లో సామాన్యుల భాగస్వామ్యం యొక్క ఆవశ్యకతను అందరూ గుర్తించినా, ఆ ప్రణాళికా రచనలోగాని, దాని అమలులోగాని వారికి ఎట్టి ప్రాతినిధ్యం ఈయబడటం లేదు. దేశం యొక్క అభ్యున్నతి చాల మందకొడిగా వుందంటే ఆశ్చర్యపడనవసరం లేదు. స్వామి వివేకానంద ఆపేక్షించిన నూతన భారత దేశంలో శూద్రులు (శ్రామిక వర్గీయులు వారి పరిభాషలో శూద్రులు) అత్యున్నత స్థానాన్ని ఆక్రమించాలి. ఆయన తాను సమతావాదినని చెప్పుకుంటూ ఆ వాదం లోపరహితం కాదని కూడ అంగీకరించారు. ఐనా పూర్తిగా ఆకలితో విలవిలలాడటం కన్నా సగం ఆకలి తీర్చగల వాదాన్ని (సిద్ధాంతాన్ని) ఆశ్రయిస్తే మెరుగని వారి అభిప్రాయం. చరిత్రపట్ల వారికున్న అవగాహన ప్రకారం ప్రపంచంలో శీఘ్రకాలంలోగాని, నిదానంగా గాని విప్లవం సంభవించటం తథ్యమని ఆయన విశ్వసించారు. ప్రథమంగా రష్యా, చైనాలో విప్లవం వస్తుందని వారు సూచించారు. 19 వ శతాబ్దం ఆఖరి దశకంలో వారీ ప్రకటన చేశారు. వారు ఈ పరిణామాన్ని ఎలా ఊహించారో అంతుపట్టదు. పై రెండు దేశాల్లోను తర్వాత సంభవించిన విప్లవ ధోరణులను, రీతులను వారు ఆమోదించి వుండేవారో లేదో కూడ మనకు గ్రాహ్యం కాదు.

భారతదేశానికి సంబంధించినంతవరకు వారు విప్లవాన్ని వాంఛించలేదు. శాంతియుత పరిణామానికే ప్రాధాన్యత నిచ్చారు. ఒక దేశం విప్లవానికి గురియైనప్పుడు దానికొరకది ఎంత మూల్యాన్ని చెల్లించవలసి యుంటుందో వారు అంచనావేసి ఉంటారా? భారత దేశంలో వారు అభిలషించింది తక్కువ స్థాయి వారిని ఉన్నత స్థాయికి చేర్చే ప్రణాళికను మాత్రమే. దాని వలన వారు విప్లవాత్మక పరిణామాలవైపు మొగ్గు చూపలేదని స్పష్టమౌతుంది. అంటే దేశంలోని

మేధావి వర్గ ప్రజల స్థాయికి శ్రామికులు ఎదుగుటకు తగిన అవకాశాలు లభింపచేయబడాలని వారి కోరిక. అంతేకాని శ్రామికులకు స్థానం కల్పించటం కోసం మేధావులు దిగజారాలని కాదు వారి అభిమతం.

# విద్య ద్వారా వ్యక్తిత్వ సాధన

శ్రమ జీవులు ఇప్పటివరకు నిర్లక్ష్యానికి గురియైనారు. విద్య వారి అందుబాటులో లేకుండాపోయింది. ప్రారంభదశలో వారు ఎదుర్కొనే వెనుకబాటుతనాన్ని అధిగ మించాలంటే వారిపట్ల దేశం ప్రత్యేక శ్రద్ధ చూపాలి. అంటే వారు విద్యను వెతుక్కుంటూ పోకుండా విద్యే వారి వద్దకు తీసికొనిపోబడాలి అని వారి ప్రతిపాదన. వారి కొరకు కేవలం ఉచిత విద్యా సౌకర్యం సమకూరిస్తే సరిపోదని వారు సరియైన నిర్ధారణ చేశారు. ఉచిత విద్యతోబాటు మరికొన్ని ఉత్పాదకాలు వారికి సమకూర్చాలి. అనగా విద్య శ్రామికుల ఇండ్ల వద్ద లభ్యపడాలి. మేధావి వర్గానికి చెందిన పిల్లవానికి ఒక్కొక్కనికి ఒక ఉపాధ్యాయుడు అవసరమైతే, శ్రామిక వర్గానికి చెందిన పిల్లవాడికి ఒక్కొక్కరికి 5 గురు ఉపాధ్యాయుల వంతున ఏర్పాటు కాబడాలి. మైసూరు రాజా తన రాజ్యంలో ఉచిత విద్యను స్థాపించ తలపెట్టినప్పుడు స్వామీజీ ఈ పై ఏర్పాటును వారికి సూచిం చారు. స్వామీజీ విద్యకు విశేషమైన ప్రాధాన్యత నిచ్చారు. భారతదేశం రుగ్మతలన్నింటికి విద్య సర్వరోగనివారిణి కాగలదని భావించారు.

కాని ఏవిధమైన విద్యను స్వామీజీ ప్రతిపాదించారు? పుస్తక పఠనం, పరీక్షల్లో ఉత్తీర్ణత, డిగ్రీలు సర్టిఫికెట్లు సంపాదించి పెట్టే విద్య మాత్రం కాదు. వారి దృష్టిలో విద్య కేవలం విజ్ఞాన సముపార్జన వరకే పరిమితం కాకూడదు. అంతకంటే అర్థవంత మైందిగా ఉండాలి. అది వ్యక్తికి వ్యక్తిత్వాన్ని ప్రసాదించాలి, జీవనోపాధిని కల్పించాలి, సద్గుణ సంపన్నునిగా అతన్ని తీర్చిదిద్దాలి. ఆ మొత్తం ప్రక్రియ విజ్ఞానాన్ని జీర్ణించు కునేలా చేయాలి. ఇంకనూ అది ఉత్పత్తి సాధనలో ఉపకరించే నైపుణ్యాన్ని ప్రసా దించాలి. ప్రస్తుతమున్న విద్యా విధానం మనిషికి స్వయం పోషకత్వాన్ని సమకూర్చదు సరికదా ఆత్మగౌరవాన్ని, ఆత్మ విశ్వాసాన్ని కూడ సాధించటంలో విఫలమైందని, ఇది చాల దయనీయమైన పరిస్థితియని స్వామీజీ చింతించారు. పాశ్చాత్య విజ్ఞాన పరిపక్వతను భారతదేశ ఆదర్శాలతో మేళవింప చేసిన నూతన విద్యా విధానం మనం నెలకొల్పాలని ఆయన వాంఛించారు. భారతదేశం చాల

ఉత్కృష్టమైన భావాల్ని సృష్టించింది. కాని వాటి నుండి కొన్నింటినైనా అమలు చేయటంలో కృతకృత్యత సాధించలేదు. మన సాంఘికపరమైన అరిష్టాలన్నిటికి ఈ వైఫల్యమే కారణం. ఈ సందర్భంలో స్వామీజీ ప్రత్యేకంగా మన కులవ్యవస్థను ఉదాహరణగా పేర్కొన్నారు. వృత్తి విభజన లేక శ్రమ విభజన ఆధారంగా ఏర్పడిన కుల వ్యవస్థ నిజంగా ఆదర్శనీయమైందే. వ్యక్తి తన ప్రతిభా పాటవాలతో ఉన్నత స్థితిని సాధించటానికి ఈ వ్యవస్థ ఉద్దేశింపబడింది. కాని గొప్ప, చిన్న, ధనిక, పేద – ఇలాంటి అంతస్థుల తారతమ్యంతోను, వంశపారంపర్యత అనే పరిణామంతోను, అసలు వ్యవస్థ భ్రష్టత చెంది నిరుపయోగ స్థితికి దిగజారింది. కులాచారాల పేరిట ప్రస్తుతం నడుస్తున్న సమాజ వ్యతిరేక చర్యలను అందరికంటే ఎక్కువగా స్వామీజీ నిరసించారు. ఈ పరిస్థితిని కూడ సరిదిద్దగల సాధనం విద్య మాత్రమే. వెనుకబడిన వారిని విద్యా వంతులుగ చేయగల్గితే వారు తమ నిజస్థితిని పొందగల్గుతారు.

# ఆధ్యాత్మిక శక్తి ద్వారా జనోద్ధరణ

వెనుకబడిన వారి పురోగతికై సమాజం తీసుకునే ప్రతి చర్యను పై తరగతివారు తప్పక స్వాగతిస్తారని స్వామీజీ తలంచారు. అంతేగాక వారే వెనుకబడ్డవారి అభ్యున్నతికై ప్రణాళికలు రచించి ఆ కార్యక్రమాన్ని మరింత వేగిరపరచటానికి అవసరమైన త్యాగాలు చేస్తారని ఆశించారు. అలాంటిది జరిగితే భారతజాతి ఆదర్శచిహ్నాలైన త్యాగశీలత, సేవాతత్పరతలను ఆ కార్యక్రమం ప్రతిబింబింప చేస్తుంది. కాని అందుకు భిన్నంగా వారు ప్రవర్తిస్తే అది వారికే గాక మొత్తం దేశానికి దుష్పరిణామం అవుతుంది. ఈ హెచ్చరిక మాత్రం చాల ఆవశ్యకమని చరిత్ర మనకు బోధిస్తుంది. సమాజ వ్యవస్థలో తలపెట్టిన మార్పును స్వార్థపరులు కొందరు నిరోధించబూనితే అలజడి, హింస ప్రజ్వరిల్లుతాయి. భారత దేశానికి సంబంధించినంతవరకు ఇప్పటికే ఆలస్యమైన ఈ మార్పు చాల ప్రశాంతంగాను, ఘర్షణా రహితంగాను జరగాలని స్వామీజీ అభిలషించారు. భారతదేశ సుదీర్ఘ చరిత్రలో ఇలాంటి కార్యక్రమాలకు అంతర్గత శక్తుల వలన, బాహ్యశక్తుల వలన కూడ అంతరాయాలు కల్గుతునే వున్నాయి. ఐనా, భారతదేశం తనదైన శైలిలో పట్టు విడుపుల ధోరణితో క్లిష్ట పరిస్థితులనన్నిటిని అధిగమిస్తూ వస్తోంది. మౌలికమైన ఆధ్యాత్మిక శీలతకు భంగంరాని విధంగా మన దేశం మార్పును ఆమోదించింది. ఈ విధంగా శతాబ్దాలు గడచినా అది తన స్వస్వరూపాన్ని నిలుపుకుంటూ వుంది. క్రొత్త భావాలను జీర్ణించుకోవటంలోను, క్రొత్త ఒత్తిడులకు అనుగుణంగా నడచుకొనటంలోను, క్రొత్త పరిస్థితులననుసరించి మసలుటలోను దేశం ప్రదర్శించిన సామర్థ్యం అమోఘమగుటవల్లనే పూర్తి నాశనాన్ని ప్రతిఘటించగల్గింది. ప్రతి క్లిష్టపరిస్థితిని ఎదుర్కొని వినూత్న ప్రకాశంతో తన సహజత్వాన్ని కోలుపోకుండా స్థిరపడింది. స్వామీజీ శ్రమ జీవుల ప్రగతిని ఊహించ గల్గారు. ఐతే దానితోబాటు సమాజంలోని సంస్కృతీపరమైన ప్రమాణాలు దిగజార వచ్చని కూడా ఆయన భయపడ్డారు. తర్వాత లభించిన సాక్ష్యాధారాలను బట్టి ఏ దేశాల్లో ప్రగతి కొరకు విప్లవాలు సంభవించాయో అక్కడ స్వామీజీ భయపడ్డట్లే

జరిగింది. అదే విధంగా భారతదేశంలో జరుగకూడదని స్వామీజీ కొన్ని హితవులను సూచించారు. శ్రమ జీవుల్ని పురోగతివైపు చైతన్యవంతుల్ని చేసే ఉద్యమంతో బాటు వారికి మన సంప్రదాయ విలువలను గురించి, తాత్త్విక జీవన విధానం గురించి బోధనలు జరగాలని స్వామీజీ హితవుల్లోని సారాంశం. 'తత్త్వబోధనాంశాలతో దేశాన్ని ముంచెత్తండి' అనే పిలుపును స్వామీజీ సమాజానికిచ్చారు. తత్త్వబోధ అంటే వారి మనసులో వున్న అభిప్రాయాన్ని వెలిబుచ్చారు. సత్యసంధత, న్యాయబద్ధత, ప్రేమ, శాంతి కాముకత, స్నేహశీలత లాంటి భావాలు భారతీయ సంస్కృతిని ప్రభావితం చేశాయి. వాటినే పునరుద్ధరింపచేయాలని స్వామీజీ ఆశ. ఈ ఆశయాలు భారతదేశ ప్రజల మనస్సులను హింసామార్గానికి వ్యతిరేకంగా నడిపాయి. స్వామీజీ తాను ఊహించిన సామాజిక ప్రగతి భారతీయ సంస్కృతికి, సాంప్రదాయాలకు హాని కల్గించకుండా వాటిని మరింత పటిష్టం చేయాలని అభిలషించారు. ఈ సంప్రదాయాలు సంరక్షింపబడి తగు స్థాయిలో కొనసాగునట్లు చూడటమే వారి ప్రథమ కర్తవ్యంగా భావించారు. భారతదేశం యొక్క పటిష్టత వానిలోనే ఇమిడి వుంది. ఆ సంప్ర దాయాలకు కట్టుబడి ఉన్నంతకాలం భారతదేశం సురక్షితం. భారతదేశం తన కొరకే గాక మొత్తం ప్రపంచదేశాలన్నిటి కొరకు కూడ ఆ సంప్రదాయాలను పరిరక్షించుకోవాలి. ఆ సంప్రదాయాలను కలిగియుండి వాటిని పరిపోషించి అనుభవించిన ఖ్యాతి ఒక్క భారతదేశానికి మాత్రమే వుంది. ప్రపంచంలో మరి ఏ ఇతర దేశానికి లేదు.

# శాస్త్ర సాంకేతిక విజ్ఞానాల ద్వారా ప్రగతి

భారతదేశ ప్రజల బీదరికం వివేకానందుని మనస్సును కలచివైచింది. గ్రామ ప్రాంతాల్లో పర్యటిస్తూ ఆయన ప్రజల దైన్యస్థితిని కనులార చూచారు. అట్టి పరిస్థితుల్లో కూడ ప్రజలు ప్రదర్శించిన ఔదార్యం ఆయన్ని ముగ్ధుణ్ణి చేసింది. భారతదేశ సంపదను మొత్తం ఒక పథకం ప్రకారం పీల్చివేసిన బ్రిటీషువారిపై స్వామీజీకి ద్వేషభావం కల్గింది. అలాగే తోటి మానవుల పరిస్థితి గమనించకుండ నిర్లక్ష్య వైఖరితో, స్వార్థ పరత్వంతో సంపన్నులైన ఉన్నత తరగతి వారమని చెప్పుకునేవారి పట్ల కూడ ఆయన అంతే ద్వేషాన్ని ప్రకటించారు. ఆయన తుది జీవితకాలంలో సాధ్యపడినంత వరకు సంపన్నుల సహచర్యాన్ని నిరాకరించారు.

కాని దేశం యొక్క బీదరిక సమస్య ఎలా నివారింపబడుతుంది? శాస్త్ర సాంకేతిక విజ్ఞానాల వల్ల పేదరిక నిర్మూలన జరగాలన్నారు. భారతదేశం పాశ్చాత్య శాస్త్ర విజ్ఞానాన్ని, సాంకేతిక నైపుణ్యాన్ని విస్తారంగా వినియోగించుకొని పారిశ్రామిక విప్లవాన్ని సాధించాలి. పాశ్చాత్యదేశాలు శాస్త్రసాంకేతిక విజ్ఞానాల ద్వారా పేదరిక సమస్యను ఎలా అధిగమించాయో ఆయన స్వయంగా వీక్షించారు. మన దగ్గర దేశమైన జపాన్ కూడ అదే మార్గంలో నడచి సౌభాగ్యాన్ని సంతరించుకుంది. కనుక బీదరికాన్ని నిర్మూలించే విషయంలో మనం ఆ దేశాల్ని అనుకరించాలి; ఇతర విషయాల్లో మాత్రం వాటికి దూరంగా వుండాలి.

# భారత ప్రజల జీవన విధానం

వస్తు (భౌతిక) సంపద విషయంలో పాశ్చాత్య దేశాలు సాధించిన ప్రగతిని స్వామీజీ శ్లాఘించారు. కాని ఆ సంపద వారి నైతిక దృక్పథాన్ని ఎంత మొరటుపరచిందో కూడ పరికించారు. భారతదేశం తన నైతిక విలువల్ని పరిరక్షించుకుంటూ భౌతిక సంపదలో పాశ్చాత్య దేశాలతో సరితూగాలని స్వామీజీ ఆకాంక్షించారు. పాశ్చాత్యులకు భోగలాలస యందు ఆసక్తి మెండు. దాన్ని స్వామీజీ గర్హించారు. భౌతిక సంపద, సునిశితమైన నైతిక దార్ఢ్యతలను కలబోసికొన్న సమాజ స్థితిని ఆయన అభిలషించారు. మన దేశ చరిత్రను ఆమూలాగ్రం శోధిస్తే ఈ జీవిత విధానమే భారత ప్రజలందు కన్పిస్తుంది.

వివేకానందుని బోధనలేవీ వర్తమానానికి చెందనివికావు. ఆయన అధునాతన భావాల్ని ప్రజలకు అందించారు. వారి దూరదృష్టికి కేవలం తక్షణ భవిష్యత్తే ముఖ్యం కాదు; చాల ముందు తరాల వారిపై దృష్టి సారించి అప్పటి ఘటనలకు కూడ ప్రాధాన్యం ఇచ్చారు. ఒక మతమే కాదు, శాస్త్రవిజ్ఞానం, కళ, సారస్వతం, చరిత్ర, రాజకీయాలు ఒకటేమిటి మానవునకు సంబంధించిన అన్ని అంశాల్లోను ఆయన ఆసక్తి చూపించారు. ఈ అంశాలపై వారి భావనలు సమగ్రమైనవి. ఉదాహరణకు భారతదేశంలో వర్గరహితమైన, కులరహితమైన సమాజం వర్ధిల్లాలని అభిలషించారు. భారతదేశం ఇస్లాం మత శరీరాన్ని, వేదాంతతత్త్వ ప్రభావిత మేధస్సులను కలిగియుండాలని ఆయన తలంచారు. వర్గ వివక్షను, కుల విభజనను ప్రోత్సహించనందున ఆ మేరకు ఇస్లాంను ఆయన కొనియాడారు. కాని స్వామీజీ అభిప్రాయంలో ఆదర్శ సమాజం కులవర్గ రహితమైనదేగాక, వేదాంత ప్రతిపాదిత పరమార్థాన్ని, ఆధ్యాత్మిక తత్త్వాన్ని పెంపొందించగలదై యుండాలి. అందుకే ఆయన ఇస్లామిక్ శీల సంపదతో ఆధ్యాత్మికోన్నతి కొరకు కృషి చేసే సమాజం వ్యవస్థీకరింప బడవలెనని వాదించారు.

పేదరికం, నిరక్షరాస్యత, కులతత్వం, అసంఘటిత ప్రతిపత్తి మొదలైనవి ప్రస్తుతం భారతదేశం ఎదుర్కొంటున్న సమస్యలు. కాని ఇవి నూతనంగా ఆవిర్భవించిన సమస్యలు కావు. స్వామీజీ కాలంలో కూడ ఇవి వున్నాయి. వాటిని గురించి ఆయన తీవ్రంగా ఆలోచించి కొన్ని పరిష్కార మార్గాలు ప్రకటించారు. ఆ మార్గాలు ఇప్పటి పరిస్థితుల్లో కూడ అమలు చేయదగ్గవే. తాత్కాలికపు పరిష్కారాలకు ఆయన వ్యతిరేకి. దేశ చరిత్రను, పరిస్థితులను దృష్టిలో వుంచుకొని నిర్ధారింపబడిన పరిష్కారాల వైపే ఆయన మొగ్గు చూపారు. ఈ విషయంలో ఇతర దేశాల్ని అనుకరించటానికి కూడ ఆయన అంగీకరించలేదు. ప్రతి దేశం తమదైన ఆలోచనా సరళి ననుసరించి తమ సమస్యలకు పరిష్కారాలు యోచించుకోవలసిందే. ప్రజల నడత, చిత్తశుద్ధి, సరియైన ప్రయత్నం వీటికే స్వామీజీ ప్రాధాన్యత ఇచ్చారు. ప్రస్తుతమున్న సమస్యలు నిర్మూ లింపబడవచ్చు. కాని క్రొత్త సమస్యలు వెంటనే తలెత్తుతుంటాయి. సమస్యలు లేని జీవితాన్ని ఊహించలేము. కాని, పైన సూచించిన విధానాలతో ఏ సమస్యగాని అపరిష్కృతంగా మిగలదు.

# స్వామి వివేకానందుని దూరదృష్టి

స్వామీజీ భవిష్యత్తులో జరుగనున్న మూడు సంఘటనలను ముందుగా ప్రకటించారు. అందులో రెండు వారు చెప్పినట్లే జరిగాయి. వానిలో మొదటిది, ప్రముఖమైనది భారతదేశ స్వాతంత్ర్యం. 19 వ శతాబ్దపు ఆఖరి దశాబ్దంలోనే అప్పటి నుండి 50 సంవత్సరాలులోపుగా అనూహ్యమైన పరిస్థితుల్లో భారతదేశం స్వతంత్ర దేశం అవుతుందని ఆయన ప్రకటించారు. ఆయన ఆ విషయం చెప్పినప్పుడు దానిని కొద్దిమంది మాత్రమే విన్నారు. విన్నవారు కూడ దానికి ఎక్కువ ప్రాముఖ్యం ఈయలేదు. అది జరగటానికి అవకాశముందని ఎవరూ ఊహించలేదు. జనబాహుళ్యం ఎక్కువగా బ్రిటీషు వారిచేత పరిపాలింపబడటమే సుఖమని భావించారు. బ్రిటీషు రాజ్యమంటే చట్టబద్ధత, న్యాయబద్ధత, సమత్వ దృష్టి – ఈ మూడింటిని పరిరక్షించే పరిపాలనగా జనులు భావించారు. ప్రజల్లో రాజకీయపరమైన ఆలోచన శూన్యమనే చెప్పాలి. రాజకీయ స్వాతంత్ర్యం అనే భావన వారికి లేనేలేదు. మేధావి వర్గం కూడ వారికేమి కావాలో తెలుసుకునే స్థితిలో లేరు. కొలది మంది మాత్రం వారికి మంచి ఉద్యోగాలు లభిస్తే చాలని, అవకాశ ముంటే దేశ పరిపాలనా యంత్రాంగంలో ద్వితీయ శ్రేణి భాగస్వామ్యం సమకూరినా చాలని తలంచారు. స్వతంత్ర భారతదేశమనే తలంపు వారి మస్తిష్కాల్లో ఎన్నడూ చోటు చేసుకోలేదు. కొంతమందయితే బ్రిటీషు పరిపాలన వారికొక వరమని కూడ తలంచకపోలేదు. దేశంలో శాంతి, అభివృద్ధి పరిఢవిల్లాలంటే బ్రిటీషు రాజ్యం వుండవలసిందేనని పలువురు భావించారు. ఈ నేపథ్యంలో స్వామీజీ యొక్క భవిష్యవాణి భారత దేశానికి 50 సంవత్సరాల్లో స్వాతంత్ర్యం లభించగలదని ప్రకటించింది.

స్వామీజీ యొక్క అతి ముఖ్యమైన రెండవ ప్రకటనను గమనిద్దాం. ప్రప్రథమంగా పారిశ్రామిక విప్లవం రష్యా దేశంలో సంభవిస్తుందన్నారు. ఇది జరుగుతుందని ఏ మేధావులు కూడా మాహించలేదు. శ్రామిక విప్లవ సారథియైన మార్క్స్ ఈ విప్లవాలు కార్మిక సంఘాలు పటిష్ఠంగా వున్న దేశాల్లో మాత్రమే సాధ్యమౌతాయి అని చెప్పారు. ఆ సిద్ధాంతం మీద

ఆధారపడి ఆయన మొదటి విప్లవం జర్మనీలో వస్తుందని ప్రకటించాడు. కాని ఆయన అంచనాలకు విరుద్ధంగా మొదటి శ్రామిక విప్లవం కార్మిక వర్గం వ్యవస్థీకరింపబడని, ప్రధానంగా వ్యవసాయ రంగానికి పరిమితమైన రష్యాదేశంలో సంభవించింది. ఇది ఎలా జరిగింది? దీనిని స్వామీజీ అంత నిశితంగా ఎలా అంచనా వేయగల్గారనేది చెప్పటం కష్టమే. స్వామీజీ చరిత్ర క్షుణ్ణంగా అధ్యయనం చేసిన వ్యక్తి. అందుచే చారిత్రక శక్తులు, చారిత్రక పరిణామాల్ని గురించిన ఆయన అవగాహన, పరిజ్ఞానము చాలా లోతైనది, నిశితమైంది.

వివేకానందుడు మరియొక సంఘటనను కూడ ఊహ చేసారు. అది కూడ సంభవిస్తుందో, లేదో వేచి చూడాలి. భారతదేశం పూర్వం సాధించిన దానికంటే మిక్కుటమైన సౌభాగ్యాన్ని, అధికారాన్ని పొందగల్గుతుందని వారి అంచనా. కాని ప్రస్తుత పరిస్థితుల్ని గమనిస్తే అలాంటి సూచన లేవీ కన్పించవు. దానికి బదులుగా దేశం సమస్యల వలయంలో చిక్కుకొని పతన దిశగా పయనిస్తోందని పలువురు భావిస్తున్నారు. ఈ సమస్యలు చాల పురాతనమైనవే, నిత్యం దేశాన్ని వేధిస్తున్నవే. పేదరికం, నిరక్షరాస్యత, కులతత్వం, ఇవి మనల్ని స్వాతంత్ర్యానికి పూర్వం నుండి కూడ వెన్నాడుతునే వున్నాయి. అవే ఇప్పుడు బలీయంగాను, ప్రమాదకరంగాను పరిణమించాయి. కాని భారత దేశం ఈ సమస్యలతో సహజీవనం చేయటం నేర్చుకుంది. కనుక వీటిని గూర్చి అంత ఆందోళన పడనవసరం లేదు. ప్రస్తుతం మరికొన్ని కొత్త సమస్యల్ని దేశం ఎదుర్కొంటోంది. జాతి విద్వేషాలు, మత ఛాందసాలు మితిమీరి ప్రజ్వరిల్లుతూ, వేర్పాటు వాదానికి దారి తీస్తున్నాయి. ఇవి చాల ప్రమాద కరమైన పరిణామాలు. ఇప్పటికే మత విద్వేషాల కారణంగా ప్రధానమైన దేశవిభజన జరిగింది. ఇంకా కొత్త విభజనలు జరిగితే దేశం ఛిన్నాభిన్నమై ప్రస్తుతమున్న రూపాన్ని కూడ కోల్పోతుంది.

# జీవించు, ఇతరులు జీవించడానికి సహకరించు

భారతదేశం రాజకీయ విషయాల్లో పాశ్చాత్య దేశాల్ని గ్రుడ్డిగా అనుసరిస్తే దేశం యొక్క ఐక్యతకు భంగం వాటిల్లగలదని స్వామీజీకి ఆనాడే తోచింది. పాశ్చాత్య దేశాల్ని అనుకరించవద్దని వీరు ఆనాడే హెచ్చరించేవారు. పాశ్చాత్యులు తమకైతాము జీవిస్తారు. కనుక వారికి అసహనము మెండు. భారతదేశం అలా కాదు. ఎప్పటికప్పుడు క్రొత్త జాతుల వారిని, వారితోబాటు, వారి ఆలోచనలను, వారి జీవిత విధానాలను స్వాగతించి వారిని తనలో కలుపుకొని స్వదేశీయులుగా పరిగణించే సంస్కారం కలది. మన దేశానికి ఏనాడో వలస వచ్చిన గ్రీకులు, స్కిదియన్లు, మంగోలులు, హూణులు ఈ రోజున వారుగా కనబడరు. వారందరూ భారతీయులతో ఏకమైపోయారు. ఈ రోజు భారతదేశం బహుళజాతి, బహుళ సంస్కృతీ సాంప్రదాయాల సమ్మేళనంతో ఏర్పడిన అందమైన రంగుల చిత్రంగా భాసిస్తోంది. దేశంలోని బహుళ జాతులు, బహుళ మతాల వారు అన్యోన్య ప్రేమావగాహనలతో మెలగే వాతావరణాన్ని ప్రోత్సహించటమే భారతీయత.

తమకంటె వెనుకబడ్డ వారి మధ్య జీవించి అభివృద్ధి సాధించిన వారు కూడ మనకు తటస్థ పడతారు. ఐనా తరతమ భేదాల్లేకుండా అన్యోన్య ప్రేమానురాగాలతో వారు సహజీవనం చేశారు. వారి సత్సంబంధాలకు హాని చేసే ఏ విధమైన ఘర్షణలు వారి మధ్య తలయెత్తేవి కావు. వారిలో చాలమంది ఆ సమాజంలో ఇమిడిపోయేవారు. అలా ఇమడ లేనివారు మాత్రం విడిగా శాంతియుతంగా జీవించటాన్ని ఎన్నుకునేవారు. తాము జీవిస్తూ ఇతరుల జీవనానికి దోహదం చేయాలనుకోవటమే భారతీయుల ఆదర్శ సూత్రం. భిన్నత్వంలో ఏకత్వాన్ని సాధించటమన్న సిద్ధాంతాన్ని భారతీయులు విశ్వసిస్తూ వస్తున్నారు. 'భగవాను డొక్కడే కనుక మనుషులందరూ ఒకటే'. ఏ వర్గ ప్రజల యొక్క స్వాతంత్ర్యాన్ని భంగపరచే ప్రయత్నం మన దేశం చేయలేదు. అందు వల్లనే ఒకే మతానికి సంబంధించిన సమాజంలో కూడ వివిధ శాఖలు వర్ధిల్లుతుండటం మనం చూస్తాం. బహుళ శాఖలు ఉండటాన్ని స్వామీజీ కూడ ప్రోత్సహించారు. ఎక్కడైతే

స్వాతంత్ర్యం విస్తరిస్తుందో అక్కడే అభివృద్ధికి అవకాశం లభిస్తుంది. అభివృద్ధి నిరాటంకంగా సాగిన చోట భిన్నత్వం వర్ధిల్లుతుంది. భిన్నత్వం సహజమైనదైతే ఏకత్వం కృత్రిమమవుతుంది. ప్రతి వ్యక్తి తనకిష్టమైన రీతిలో ప్రగతిని సాధించాలి. అలా కాని నాడు అతడు అభివృద్ధిని అసలు సాధించలేడు. భారతదేశం ఈ సిద్ధాంతాన్ని విశ్వసించి మనుగడ సాగించింది. ఐతే ప్రజల మధ్య ఐకమత్యం ఉండాలి కదా, అది ఎక్కడ? ఒకరికొకరు పరస్పరం గౌరవించుకోటంలోను, అందరూ సమాన ఆదర్శాలు పాటిం చడంలోను ఏకత్వం కన్పిస్తుంది. స్వామీజీ అభిప్రాయంలో విషయ త్యాగము, సేవ ఈ రెండూ భారత జాతి ఆదర్శములు. అంటే ప్రతి కూటమి మరొక వర్గము కొరకు తమదైన దానిని త్యాగం చేసి తద్వారా దేశ సేవకు తోడ్పడుతుంది. ఈ విధంగా భిన్నత్వం భారత ప్రజల సమైక్యతను పటిష్ఠం చేయడానికి దోహదం చేసింది. ఏ బహుళ జాతి సమాజంలోనైనా ఐక్యతను సాధించటానికిదే మార్గం. పాశ్చాత్య దేశాల రాజకీయాల్లోవలె అధికార వ్యామోహితులు కాకుండ, భారతదేశ ప్రజలు తమ జాతి ఆదర్శాలను యధాతథంగా పాటిస్తారని ఆశిద్దాం. భారతదేశ వాసులు అధికారతత్పరులు గాకుండా, సేవానిరతినే తమ ఆదర్శంగా ఎంచుకోవాలి.

# శ్రామిక వర్గం మేధావులతో సరితూగుట

భారత దేశంలో అధికారం మేధావుల (బ్రాహ్మణులు) చేతిలోగాక శ్రామికుల (శూద్రులు) అధీనంలో వుండే స్థితిలో నూతన భారతదేశం ఆవిర్భవించే రోజు ఎంతో దూరంలో లేదని స్వామీజీకి ముందుగానే తెలుసు. ఇది ఎంత వేగిరంగా జరిగితే దేశానికంత మంచిది. మేధావి వర్గం ఈ పరిణామం దేశం కొరకేగాక తమ కొరకు గూడ అని భావించి స్వాగతిస్తారని ఆయన ఆశించారు. ఇతర దేశాల్లో ఈ మార్పు హింస ద్వారా సాధించబడింది. భారతదేశం విషయంలో మేధావులు జాతి ఆదర్శాలను పాటిస్తూ నడచుకుంటే హింసకు తావుండదు. తత్కాల పరిస్థితుల కనుగుణంగా ప్రవర్తించే మెలకువను ప్రదర్శించుటకు భారత సమాజం ఎన్నడూ వెనుకాడ లేదు.

ఈ విషయంలో పూర్తిగా కాకపోయినా, కొంతవరకైనా స్వామీజీ యొక్క అంచనా నిజమైంది. ఈ రోజు శ్రామిక ప్రజలు వెనుకటి కంటె ఎక్కువ శక్తివంతులైనారు. వారి స్థితి చాల మెరుగుపడటమేగాక మేధావులతో సరియగు స్థాయిని సాధిస్తున్నారు. ఈ సామాజిక మార్పు కార్యక్రమంలో జాతి యొక్క ప్రతిభగాని, నైతికస్థాయి గాని దిగజారకూడదని స్వామీజీ అభిలషించారు. ఆ కారణంగానే శ్రామిక ప్రజల పిల్లలకు మేధావుల పిల్లల కంటె అధికమైన విద్యాబోధనావకాశాలు కల్గచేయాలని ఆయన వాంఛించారు. అంతేగాక భారతదేశం సంస్కృతీపరంగా, నైతికపరంగా పటిష్ఠతను సమకూర్చుకోవాలని ఆయన కోరారు. స్థాయి పెరుగుదలే గాని, తరుగుదల లక్ష్యం కాకూడదు. అంటే తక్కువ స్థాయి ప్రజానీకం ఉన్నత స్థాయిని చేరాలి. కాని ఉన్నత స్థాయి వారు దిగజారకూడదు. స్వతంత్ర భారతదేశంలో ఆ విధంగానే జరుగుతున్నది. ఇది ముదావహం.

# ఇస్లామిక్ శరీరం, వేదాంతతత్త్వ జిజ్ఞాస గల మేధస్సు

శ్రామిక జనులు అధికారపదవులను నిర్వహిస్తూ తమ సాంస్కృతిక, నైతిక స్థాయిలను పెంపొందించుకున్న స్థితిలో భారతదేశం వర్గరహిత, కులరహిత సమాజంగా వర్ధిల్లాలని స్వామీజీ ఊహించారు. దాన్నే వారు 'ఇస్లాం మతం శరీరంగాను, వేదాంత తత్త్వజ్ఞానం మేధస్సుగాను' ఏర్పడిన సమాజం అని వర్ణించారు. ఉన్నత స్థాయి నైతిక పరిపూర్ణత కొరకు అహర్నిశలు కృషి చేసేదే ఆదర్శ సమాజమౌతుంది. స్వామీజీ దేశం ముందుంచిన ఆ కార్యక్రమంలో పేదరిక నిర్మూలనకు ప్రథమ స్థానం వుండాలన్నారు. భారత దేశానికి అత్యావశ్యకమైన అంశం పారిశ్రామిక విప్లవమని కూడ వారికి తెలుసు. అందునిమిత్తం శాస్త్రజ్ఞానం, సాంకేతిక జ్ఞానాల అధ్యయనాన్ని దేశం నలుమూలల విస్తరింపచేయాలి. ఒకప్పుడు శాస్త్రజ్ఞానంలోను, సాంకేతిక జ్ఞానంలోను భారతదేశం ప్రపంచ దేశాల్లోనే అగ్రగామిగా వుండేది. కాని కొన్ని దశాబ్దాలుగా పురోగతి లేకుండా ఇతర దేశాల కంటె అన్ని అంశాలలోను వెనుక బడివుంది. పేదరికం దేశాన్ని భౌతికపరంగాను, తాత్త్వికపరంగాను సర్వవిధాల క్రుంగతీసింది. అన్నిటిని మించి ప్రజలను జడత్వం ఆవరించింది. పర్యవసానంగా తమకు ప్రాప్తించిన పరిస్థితులు అనివార్యమని వాటికి సమాధానపడి జీవించటం జరిగింది. ఈ అంశం స్వామీజీని అమితంగా కలవరపరచింది. ఈ పరిస్థితిని బ్రిటీషువారు తమకు అనుకూలంగా మలచుకొని దేశ ప్రజలను నిర్ధాక్షిణ్యంగా తమ ప్రయోజనాలకై సిగ్గు విడిచి వినియోగించుకున్నారు. ఆ సమయంలో స్వామీజీ, జమ్‌షెడ్జీ టాటా ఒకే ఓడలో ప్రయాణిస్తున్నారు. స్వామీజీ అమెరికాకు, టాటా జపానుకు వెళ్తున్నారు. ఒక ఉత్తమశ్రేణి పరిశోధనా సంస్థను భారతదేశంలో స్థాపించమని టాటాను స్వామీజీ ఆదేశించారు. టాటా జపాన్ దేశం నుండి పరిశ్రమలకు సంబంధించిన ఉత్పత్తులను దిగుమతి చేసుకునే ప్రయత్నంలో వున్నాడు. స్వామీజీ ఆ ప్రయత్నాన్ని హర్షించలేదు. భారతదేశాన్ని పారిశ్రామిక దేశంగా రూపొందించ టంలో టాటా మార్గదర్శకుడు కావాలని కూడ స్వామీజీ కాంక్షించారు.

అంతేగాక దేశంలో పారిశ్రామిక విస్తరణ వేగంగా జరగటానికి అవసరమైన శాస్త్రవిజ్ఞానాన్ని, నైపుణ్యాన్ని నిరాటంకంగా అందించుటకు ఒక పరిశోధనా కేంద్రాన్ని స్థాపించమని కూడ స్వామీజీ టాటాకు సలహా ఇచ్చారు. స్వామీజీ ఆదేశాలను టాటా అనుసరించారు. వెంటనే ఒక శాస్త్ర పరిశోధనా కేంద్రాన్ని ఆయన నెలకొల్పారు. అదే ప్రపంచ వ్యాప్తంగా గొప్ప ఖ్యాతి నార్జించింది. స్వామీజీని ఆ కేంద్రంలో ఒక సంచాలకునిగా (డైరెక్టర్) వుండమని టాటా అభ్యర్థించారు. దానికి స్వామీజీ ఎలా స్పందించారో తెలీదు.

# విజ్ఞాన శాస్త్రానికి మతానికి గల సంబంధం

ఒక జాతి యొక్క పుష్టిని, ప్రతిష్ఠను దాని యొక్క పరిమాణాన్ని బట్టిగాని దానికున్న సంపదను బట్టిగాని గాక జాతి యొక్క శీలాన్ని బట్టి నిర్ణయించాలని వివేకానంద భావించారు. శాస్త్ర విజ్ఞానం మానవుని భౌతిక అవసరాలను తీరుస్తుంది. మతం మానవుని యొక్క నైతిక, తాత్త్వికావసరాల విషయంలో జాగ్రత్తపడుతుంది. అటు శాస్త్రవిజ్ఞానం, ఇటు మతం, ఈ రెంటి యొక్క సమన్వయాన్ని సాధించటంలో భారతదేశం మార్గదర్శకం కావాలని స్వామీజీ అభిలషించారు. ఒక ధనికుడు అవశ్యం నీతిమంతుడు కాగలడని నియమం లేదు. మానవుని తీర్చిదిద్దటమే నా ఉద్యమ లక్ష్యం అని స్వామీజీ అన్నారు. ఏ సమాజమైనా తన మానవతను, మంచిని, పుష్టిని సమకూర్చుకొనిన గాని, తన మనుగడ సాగించలేదని స్వామీజీ గ్రహించారు. పాశ్చాత్యుల యొక్క కార్యనిర్వహణా పరిణతిని, వ్యవస్థీకరణలో సామర్థ్యాన్ని, శాస్త్ర సాంకేతిక రంగాలలో విజయసాధనను స్వామీజీ శ్లాఘించారు. వారికున్న భోగ లాలసత్వాన్ని, నైతిక జీవనం పట్ల నిర్లక్ష్య భావాన్ని కూడ వారు గమనించారు.

భౌతిక సంపదకు, నైతిక పురోగతికి మధ్య అభిలషణీయమైన సమతుల్యం పొసగితే తప్ప వ్యక్తికి శాంతి, సమాజానికి అభ్యుదయం సమకూరదని కూడ స్వామీజీ విశ్వసించారు.

కాలగమనంలో భారతదేశం నిదానంగా నైనా బీదరికాన్ని నిర్మూలించటంలో జయం సాధిస్తోంది. ఆహార రంగంలో భారతదేశం సాధించిన ఫలితాలు అమోఘం. దేశానికి స్వతంత్రం వచ్చిన వెంటనే ప్రతివ్యక్తికి సరిపడ ఆహారాన్ని సమకూర్చగల్గటానికి దిగుమతులమీద ఎక్కువగా ఆధారపడవలసి వచ్చింది. ఈ రోజున ఆహార విషయంలో స్వయం సమృద్ధిని సాధించే మార్గంలో దేశం పయనిస్తోంది. భారతదేశం వ్యవసాయ విప్లవాన్ని కూడ సాధించింది. దేశంలో వరదలు, అనావృష్టి రెండూ తరచుగా సంభ విస్తూంటవి. ఐనప్పటికి ప్రజలందరికి సరిపడ ఆహార పదార్థాల్ని బయటి సహాయం లేకుండా

సమకూర్చగల్గుతోంది. శాస్త్రసాంకేతిక రంగాల్లో ప్రపంచంలో సాంకేతిక పరంగా ముందున్న దేశాల శ్రేణిలో భారతదేశం గణనీయమైన స్థానాన్ని చేరింది. ఇంజనీరింగ్ రంగంలో స్వయం సమృద్ధిని సాధించటమేగాక ఇతర అభివృద్ధి చెందు తున్న చాలా దేశాలకు ఆ రంగంలో సహాయమందిస్తోంది.

కాని, దురదృష్టమేమంటే దేశంలో ఇంకా పేదరికంతో బాధపడే ప్రాంతా లున్నాయి. అంతేకాదు, సాంఘికపరమైన అన్యాయాలు పూర్తిగా నిర్మూలింపబడలేదు. నిరక్షరాస్యత కూడ ఇంకా సమస్యగానే మిగిలింది. ఈ సమస్యలు అపరిష్కృతంగా వున్నన్నాళ్ళు భారతదేశాన్ని గురించి స్వామీజీ భావించిన ఊహలు నిజమైనట్లు కాదు గదా! ఆయన ఈ విషయంలో చాల అసహనపరులు. భారతదేశానికి ఆత్మవిశ్వాసం, సాహసం అత్యావశ్యకములని స్వామీజీ ఎరుగును. ఈ సమస్యలు భారతదేశానికి సంబంధించినవే గనుక వాటి పరిష్కార మార్గాలు కూడ ఈ దేశమే స్వయంశక్తితో శోధించాలి. భారతదేశం ఇతర దేశాల్ని అనుకరించదు. ఇతరుల మీద ఆధారపడదు. తనకు తానే స్వయంశక్తితో ప్రస్తుతమున్న సమస్యలనేగాక భవిష్యత్తులో ఉద్భవించే వాటిని కూడ నివృత్తి చేసికోవాలి.

# నా భారతదేశం – నిత్యత్వానికి మారుపేరు భారతదేశం

## భారతదేశం యొక్క చరిత్ర, సంస్కృతి, ఆదర్శాలు

ఈ భూగోళం మీద 'పవిత్ర పుణ్యభూమి' అని ప్రశంసింపబడే ప్రదేశం ఏదైనా వుందంటే ఆ అర్హత కల్గినది భారతదేశం మాత్రమే. పుణ్యభూమి లక్షణాలు ఇవే. ఏ భూమిలో (ప్రాంతంలో) సౌకుమార్యం, ఉదారత, పవిత్రత, అత్యున్నత స్థాయిని చేరుతాయో, ఏ ప్రాంతంలో ఆత్మవిచారము, తాత్త్విక ప్రవృత్తి అధిక పాళ్లలో ప్రవర్తిల్లు తాయో అదే పుణ్యభూమి.

రాజకీయ ఆధిక్యతను కాని, సైనికశక్తి సామర్థ్యాల్నిగాని, మన జాతి గమ్యంగా ఎంచుకోలేదు. పూర్వం ఇది జరగలేదు; ఇక ముందు జరగబోదు.

మన జాతి సంపదకు ప్రాధాన్యత ఈయలేదు. భారతజాతి ఇతర దేశాలన్నింటకంటే మితిమీరిన సంపదను సేకరించినా, అది ప్రధానమని భావించలేదు. మనజాతి శతాబ్దాలుగా శక్తివంతమైన జాతి. ఐనా అధికారానికి ప్రాధాన్యం ఈయలేదు. తనదేశం నుండి బయటకు వెళ్లి ఇతర రాజ్యాలపై దాడిచేసి జయించే ప్రయత్నాలు చేయలేదు. మరొకరిపై దాడి జరపకుండా తన సరిహద్దుల్లో తానుండి సంతృప్తి చెందింది. సామ్రాజ్యం కొరకు భారతజాతి ఎన్నడూ వెంపర్లాడలేదు. కనుక సంపద, అధికారం ఈ జాతికి ఎన్నడూ ఆదర్శాలు కాలేదు.

ఉపనిషత్తుల కాలం (వేదకాలం) నాటికే భారతజాతి తన గమ్యం ఏమిటో ప్రపంచ

ప్రజల ముందు వుంచింది.

'అధికారం వల్ల కాదు, సంపదవల్ల అంతకంటే కాదు; కేవలం ప్రాపంచిక విషయాలను త్యజించుటవల్లనే అమృతత్వాన్ని (కైవల్యాన్ని) చేరుకోగలం' అనే ఈ సవాలును మనం ప్రపంచానికి ఇచ్చాం. జాతి తర్వాత జాతి — ప్రపంచ జాతులన్నీ కోరికల్ని నియంత్రించే రంగానికి సంబంధించిన ఈ చిక్కు సమస్యను స్వీకరించి పరిష్కరించటానికి వారి శక్తి సామర్థ్యాలన్నీ వినియోగించి ప్రయత్నించాయి. కాని పాతవారందరూ వారి ప్రయత్నాల్లో విఫలమయ్యారు. అధికార వ్యామోహం, ధనాపేక్ష తెచ్చిపెట్టే దుష్టత్వం, దైన్యం వీటి భారం క్రింద వారు నామరూపాలు లేకుండా పోయారు. క్రొత్తవారు కూడ అదే పథంలో నడుస్తూ పతనానికి చేరువలో వున్నారు. హింస, అహింసలు లేక యుద్ధం, శాంతిల మధ్య పోటీ జరిగితే ఏది జయిస్తుంది అనేది ఇంతవరకు తేలలేదు. అలాగే సహనమా, అసహనమా, సత్ప్రవర్తనా, లేక దుష్టత్వమా, శారీరక బలమా లేక మానసిక శక్తా, చివరిగా వ్యావహారిక శక్తా లేక ఆధ్యాత్మిక (తాత్త్విక) శక్తా — ఈ ద్వంద్వాల్లో ఏది ఆధిక్యతను సాధించగలదో ఇప్పటికీ తేలని ప్రశ్న. కాని మనం మాత్రం మన సమస్యని పరిష్కరించుకున్నాం; మన గమ్యాన్ని నిర్దేశించుకున్నాం. అదృష్ట, దురదృష్టాల మధ్య కూడ దానికే కట్టుబడి వున్నాం; చివరి వరకు దానినే నమ్ముకొని నడుస్తాం. ప్రాపంచిక విషయాలపట్ల నిరాసక్తత, వైరాగ్యం — ఇవే మనం ఎన్నుకొన్న పరిష్కారాలు.

ఇదే భారతదేశ జీవిత చర్య, జీవిత పరమార్థం, ఇదే మనం నిత్యం ఆలాపించే జాతీయ గీతాల అంతరార్థం; దేశ మనుగడకు వెన్నెముక ఇదే; దేశం ఉనికికి కూడ ఇదే పునాది; దేశ అస్థిత్వానికి సహేతుకతను ప్రసాదించేది ఇదే; — దీన్నే మనం 'మానవజాతిని తాత్త్వికులుగా, ఆధ్యాత్మిక జ్ఞానులుగా రూపొందించే కార్య క్రమంగా భావించాం. ఈ జీవిత విధానం నుండి జాతి తన దృష్టిని మరల్చలేదు; పరిపాలకులు తార్తార్‌లైనా, టర్కులైనా, మొగలాయీలైనా, ఇంగ్లీషువారైనా — ఎవరి పాలన క్రిందవున్నా మనం మన మార్గాన్ని విడనాడలేదు.

తూర్పు దేశాల్లో నివసించే స్త్రీలను పాశ్చాత్య ప్రమాణాలతో పరిశీలించి మంచి చెడులు నిర్ణయించటం ఉచితం కాదు. పశ్చిమ దేశాల్లో స్త్రీ అంటే భార్య మాత్రమే. కాని తూర్పు దేశాల్లో స్త్రీ మాతృమూర్తి, హిందువులు తల్లిని ఆరాధ్య దేవతగా భావిస్తారు. సన్యాసులు కూడ తమ మాతృమూర్తుల ఎదుట నిలచినప్పుడు తమ ఫాలభాగాలతో భూమిని స్పృశించాలి. ప్రాతివ్రత్యం అతి పునీతమైందిగా పరిగణింపబడుతుంది.

భారతదేశంలో మాతృమూర్తి కుటుంబానికి కేంద్ర బిందువు; మనకు అత్యున్నత ఆదర్శవ్యక్తి, విశ్వానికి మాత భగవంతుడే కనుక మనకు తల్లి భగవంతుని ప్రతినిధి తప్ప వేరు కాదు. భగవంతుడొక్కడే అని ప్రథమంగా నిరూపించింది ఒక తపస్వినే. ఆ సిద్ధాంతాన్నే వేదాల్లో వచ్చే మొదటి మంత్రాలుగ ఆమె నిక్షేపించింది. ప్రార్థన ద్వారా జన్మనెత్తిన వ్యక్తి ఆర్యజాతికి చెందిన వాడౌతాడు. కేవలం స్త్రీ, పురుషుల కామోద్రేక ఫలితంగా పుట్టినవాడు అనార్యుడుగా పరిగణింపబడతాడు.

భారతదేశంలో ఈ నియమం చాల గాఢమైన విశ్వాసంగా గుర్తింపబడింది. ఉదాహరణకు వివాహబంధం భగవదారాధన ద్వారా పూర్తి చేయబడితే తప్ప, మామూలుగ జరిగే వైవాహిక జీవితానికి వ్యభిచార దోషం ఆపాదించబడుతుంది. అది మన జాతి పాతివ్రత్యాని కిచ్చే విలువ, జీవిత రహస్యం. సంస్కృత వాంఙ్మయంలో రెండు ప్రధానమైన ఇతిహాసాలున్నాయి. అవి చాల పురాతనమైనవి. వానిలో ప్రాచీన భారతీయుల యొక్క నాగరికత, సాంఘిక పరిస్థితులు, ఆచారవ్యవహారాలు, జీవనశైలి విశదీకరింపబడ్డాయి. ఈ ఇతిహాసాల్లో అతిపురాతనమైంది రామాయణం. భారత జాతికి ఆదర్శ దంపతులు రాముడు, సీత; వీరి జీవిత కథనమే రామాయణ కావ్యం. పిల్లలందరూ, ముఖ్యంగా బాలలు సీతను దేవతగా పూజిస్తారు. ప్రతి స్త్రీ తాను సీతవలె జీవించాలని అతిగా ఆశిస్తుంది. సీత అంటే పవిత్ర నారి, అనుకూలవతి, కష్టాలననుభవించిన సహనశీలి.

మహాభారతం అంటే గొప్ప భారతదేశమని లేక భరతుని యొక్క గొప్ప వారసుల

(అనుయాయుల) యొక్క చరిత్ర అని అర్థం. భారతదేశంలో ఈ ఇతిహాసం చాల ప్రజాదరణ పొందింది. హోమరు యొక్క పద్యరచనలు గ్రీకులకు ఎంత ముఖ్యమో భారతీయులకు భారతం అంత ఆవశ్యక గ్రంథం. భగవంతుని నమ్మినవాడు, బలహీను డైన వృద్ధరాజు ధృతరాష్ట్రుని మనస్సులో ధర్మరక్షణకు, పుత్రవాత్సల్యానికి మధ్య చెలరేగిన అంతర్గత ఘర్షణ, పితామహుడైన భీష్ముని యొక్క శీలము, ధర్మరాజు అతని నల్గురు సహోదరుల యొక్క ఉదాత్త సద్గుణ సంపత్తి, వారి యొక్క శౌర్య సాహసాలు, వాటితోబాటు వారి దైవభక్తి, వినయశీలత, అసమాన శేముషీ ప్రతిభావిశేషాలకు నిధియైన శ్రీకృష్ణుని పాత్ర – ఇవి ప్రధానంగా భారత కథలో రంజింపచేసే అంశాలు. ఇవిగాక పైవారితో దీటైన స్త్రీ పాత్రలు కూడ కలవు. అందు ప్రముఖమైనవి రాజసంవుట్టిపడే రాణి గాంధారి, ప్రేమను వెదజల్లిన మాతృమూర్తి కుంతీ, అంకిత భావంతో పడరాని కష్టాలు అనుభవించిన పాండవ పట్టమహిషి ద్రౌపది – ఇంకా బహుళమైన ఇతర పాత్రలతో వెలసిన భారతం, అంతే ప్రతిపత్తిగల మరొక ఇతిహాసం రామాయణం – ఈ రెండూ మొత్తం హైందవ ప్రపంచానికి సంక్రమించి గడచిన కొన్ని వేల సంవత్సరాలుగా వారి ఆనందానుభూతిలో వున్న అమూల్య వారసత్వ నిధులు. పై రెండు ఇతిహాసాల్లోని పాత్రల యొక్క నడతలు నేటి హిందువుల యొక్క భావాలకు, నైతిక, ధార్మిక జీవనాలకు మార్గదర్శకాలైనాయి. యదార్థంగా ప్రాచీన ఆర్యుల యొక్క జీవిత విధానాల్ని వారి వివేకతను సమగ్రంగా ప్రతిబింబింపజేసే విజ్ఞాన సర్వస్వాలే ఈ రామాయణ మహాభారత గ్రంథాలు. ఈ రెండు ఇతిహాసాలు మానవలోకం అభిలషించే ఆదర్శ నాగరికతను ఉల్లేఖించిన ఉత్కృష్ట గ్రంథాలు.

ఈ ఐతిహాసిక పాత్రల్ని పరికించినపుడు భారతదేశ జీవితాదర్శాలు పాశ్చాత్యుల ఆదర్శాలకు ఎంత భిన్నంగా వుంటాయో తెలిసికోగలం. 'క్రియా శీలతతో నీ శక్తిని నిరూపించుకో' అనే నినాదం పాశ్చాత్యులది. 'నీ శ్రమ ద్వారా, క్షమాశీలత ద్వారా – నీ శక్తిని ప్రదర్శించు' అంటారు భారతీయులు. వ్యక్తి ఎంత సంపద సంపాదించ గలడో అన్న సమస్యను పాశ్చాత్యులు పరిష్కరించగా, వ్యక్తి ఎంత తక్కువ సంపదతో మనుగడ సాగించవచ్చునో

విశదీకరించింది భారతీయ నాగరికత.

# ప్రపంచానికి భారతదేశం ఇచ్చిన కానుక

ప్రపంచం భారతదేశానికి అమితంగా ఋణపడివుంది. చరిత్రను ఒకమారు పర్యవేక్షిస్తే మానవ వికాసానికి ఈ దేశం చేసినంత కృషి ప్రపంచంలో మరొక దేశం చేయలేదని విశదమౌతుంది. కనుక నేను నా జాతినెన్నడునూ తూలనాడను. 'మీరు ఇంతవరకు మానవలోకానికి చాలా చేశారు. ఇంకా ఎక్కువగా చేయటానికి ప్రయత్నిం చండి' అని ప్రబోధిస్తాను.

హిందూమతం అన్ని మతాల కంటె ప్రాచీనమైనదని అందరెరింగినదే.

విజ్ఞాన శాస్త్రాల విషయంలో కూడ ఇదే వర్తిస్తుంది. భారతదేశం శాస్త్రజ్ఞులైన వైద్యులను తన ప్రాచీనుల కొరకై ప్రసాదించింది. సర్ విల్లియం హంటరు నివేదిక ప్రకారం వివిధములైన రసాయన పదార్థాలు కనుగొనుట ద్వారాను, వికృత రూపంలో వున్న చెవులను, ముక్కును స్వస్వరూపాలకు తెచ్చు విషయాలను బోధించుట ద్వారాను, భారత దేశం వైద్య శాస్త్రానికి చాల ప్రయోజనాల్ని సమకూర్చింది. అంతకంటె అధికంగా గణితశాస్త్రంలో బీజగణితం, రేఖా గణితాలను ఏర్పరచింది. ఖగోళ శాస్త్ర విభాగాల్లో కూడ ఇది గణనీయమైన విజ్ఞానాన్ని సమకూర్చింది. అంతేకాక అధునాతన శాస్త్ర విజ్ఞాన విజయానికి అనుకూలమైన సంకలన గణితాన్ని ప్రథమంగా కనుగొంది ఈ దేశమే. ప్రస్తుత నాగరికతకు మూలమైన పది అంకెలను భారతదేశం కనిపెట్టింది.

వేదాంత పరిజ్ఞానంలో ఇతర ప్రపంచ దేశాల్తో పోలిస్తే గణనీయమైన పరిణతని సాధించింది మన దేశమే. ఈ సత్యాన్ని ప్రసిద్ధి చెందిన వేదాంతతత్త్వవేత్త, జర్మనీ దేశస్థుడైన స్కోపెన్ హోనరు అంగీకరించాడు. సంగీత శాస్త్రానికి వస్తే దానిలో భారతదేశం పాత్ర ప్రముఖమైంది. మూలస్వర స్థానాల్ని నిర్దేశించి స్థాయీ భేదాన్ని బట్టి సప్తస్వరాల పథకాన్ని ఆరోహణ, అవరోహణ క్రమంలో రచించి ప్రపంచానికి అందించింది. భాషా శాస్త్రంలో మన

సంస్కృత భాష మొత్తం ఐరోపా భాష లన్నింటికి మూలమైందిగా సర్వత్రా ఆమోదింపబడింది.

ఇక సారస్వత విభాగాన్ని విశ్లేషిస్తే మన ఇతిహాసాలు, పద్యకావ్యాలు, నాటకాలు మరి ఏ ఇతర భాషల వాటితో పోల్చినా, ఉన్నత స్థాయి గ్రంథాలుగా పరిగణింప బడతాయి. ఒక గొప్ప జర్మనీ కవి మన శాకుంతల నాటకాన్ని వర్ణిస్తూ స్వర్గమర్త్యలోకాల అనుసంధానమే ఆ కావ్యమన్నారు. ఏసప్ కథలు భారతదేశ సృష్టే. వానినే ఏసప్ సంస్కృత గ్రంథం నుంచి చూచి వ్రాసుకోటం జరిగింది. అలాగే అరేబియన్ నైట్సు ఈ దేశానివే; సిండరెల్లా కథ, బీన్‌స్టాక్సు కథ ఈ దేశంలో మొదట రచింపబడ్డవే. వస్తు ఉత్పత్తి రంగాన్ని పరిశీలిద్దాం. ప్రత్తి ఉత్పత్తిని, దానితోబాటు నీలిరంగు అద్దకాన్ని మొదట సాధించింది మన దేశమే. నగల తయారీలో గణనీయమైన ప్రావీణ్యత సాధించిన ఘనత మన దేశందే. పంచదారను ప్రథమంగా తయారుచేసిన కీర్తి మనదే. చదరంగం ఆటను, పేక, పాచికల ఆటలను కూడ భారతదేశం ప్రవేశ పెట్టింది. ఇలా అన్ని రంగాల్లోను భారతదేశం సాధించిన ఉన్నతి జూచి ఐరోపావారు ఆకర్షితులై సైన్యాలతో దాడిచేసి దేశ సరిహద్దుల్ని దాటారు. ఈ ఘటనే వారు అమెరికాను శోధించి కనుగొనుటకు దారితీసింది.

చరిత్ర పుటలు తిరగేయండి. భారతదేశంలో ప్రపంచాన్ని ఉఱ్ఱూత లూగించిన ఆధ్యాత్మిక జ్ఞాన ప్రవీణులకు ఏ కాలంలోనూ కొరత లేదు. ఈ సత్యాన్ని ఎవరూ కాదనలేరు. ఈ దేశం యొక్క కృషి ఆధ్యాత్మికతకు సంబంధించింది. దీనిని యుద్ధాల తోను, సైనిక దాడులతోను సాధించలేరు. ఈ దేశ సంస్కృతీ ప్రభావం ఇతర ప్రపంచ దేశాలపై నిశ్శబ్దతతో పడే హిమంవలె ప్రచ్ఛన్నంగా పడ్డది. అలాపడ్డ మంచు బిందువులు సుగంధపరిమళాలను వెదజల్లే అన్ని రకాల అందమైన పుష్పాలు వికసించుటకు దోహదం చేసినట్లే భారతీయ సంస్కృతికూడ ప్రపంచదేశాల ప్రజలను ప్రభావితం చేస్తూ వచ్చింది.

# భారతదేశ జీవన విధానంలో మతం యొక్క పాత్ర

ఈ పుణ్యభూమిలో మతమే పునాది, మతమే వెన్నెముక, మతమే జీవనాడి, సర్వస్వం మతమే. ఇతరులు రాజకీయాల్ని గురించి, వ్యాపార వాణిజ్యాల ద్వారా అమితంగా ప్రోగు చేసిన సంపదల వల్ల వచ్చే కీర్తిని గురించి, అధికారము, వ్యాపార విస్తరణను గురించి, లౌకిక వ్యవహారాల్లో ప్రవర్తిల్లే స్వేచ్ఛా వెల్లువలను గురించి చర్చించుకొందురుగాక. కాని హిందూ ప్రజలకు ఈ విషయాలు అర్థం కావు; అర్థం చేసికోటానికి ప్రయత్నం కూడ చేయరు. కాని ఆధ్యాత్మిక విషయాలుగాని, మతపరమైన అంశాలు గాని, భగవానుని గురించిగాని, ఆత్మసంబంధిత సమాచారము గాని, చర్చకు వచ్చినప్పుడు భారతీయుడైన దిగువస్థాయి కృషీవలుడు కూడ ఇతర దేశాల్లోని వేదాంతులనబడే వ్యక్తుల కంటె పై అంశాలన్నిటిపైన ఎక్కువ విజ్ఞానాన్ని ప్రదర్శించ గలడు. కాని మన నుండి ఇతర ప్రపంచ దేశవాసులు అధ్యయనం చేయవలసిన విషయాలు చాల వున్నాయి. ఈ కర్తవ్యాన్ని నిర్వర్తించటానికే భారతదేశం, వందల సంవత్సరాలుగా పరదేశీయుల పరిపాలనలో అణగిమణగి యుండి పలు ఇక్కట్లకు లోనైనను, ఇంకా తన అస్తిత్వాన్ని నిలుపుకొంటోంది. ఈ జాతి భగవంతుణ్ణి, సర్వ సంపన్నమైన మతాన్ని, ఆధ్యాత్మికతను విడనాడనంతవరకు, తన మనుగడకు అర్థాన్ని కల్పించుకొని జీవిస్తుంది.

నేను ప్రపంచంలోని ప్రాక్ పశ్చిమ దేశాల్లో పర్యటించి ఆయాజాతులను కొలదిగా నైనా పర్యవేక్షించాను. ఒక్కొక్క జాతి ఒక్కొక్క ఆదర్శాన్ని ఆధారభూతంగా నిలుపు కున్నట్లు గమనించాను. కొన్ని జాతులకు రాజకీయాలు, మరికొన్నిటికి సామాజిక సంస్కృతి, ఇంకా మరికొన్నిటికి వైజ్ఞానిక సంస్కృతి ఆదర్శాలుగా నిలుస్తున్నాయి. కాని మన మాతృభూమికి మాత్రం మతం ఒక్కటే వెన్నెముకగాను, పునాదిగాను ఏర్పడి వుంది. జాతి జీవనమనే ఈ మహాసౌధం మతమనే పునాదిపైన నిర్మితమై విలసిల్లుతోంది.

రోమ్ దేశాన్ని ఒకసారి పరిశీలించండి. ఆ దేశం యొక్క లక్ష్యం సామ్రాజ్య విస్తరణ మాత్రమే. ఆ లక్ష్యం సాధించబడగానే రోమ్ శిధిలమై నామరూపాలు లేకుండా అంతరించింది. అలాగే గ్రీకు సామ్రాజ్యం విజ్ఞాన సముపార్జనను ఉద్యమంగా పెట్టు కుంది. అది నెరవేరగానే గ్రీసు అస్తమించింది. స్పెయిన్, ఇతర నాగరిక దేశాలు కూడ తమకై ఒక గమ్యాన్ని ఏర్పాటు చేసుకున్నాయి. ఆ గమ్యానికి హాని కల్గనంతవరకు ఇతర కష్టాలను ఓర్చి అవి జీవిస్తాయి. కాని ఆ దేశం యొక్క లక్ష్యం నశింపబడగానే ఆ జాతి నిర్గమిస్తుంది.

కాని భారతదేశం తన లక్ష్యం యొక్క సౌష్ఠవాన్ని నిలుపుకుంటోంది. ఎన్ని ఛాందస భావాలు చుట్టుముట్టినా అసలు లక్ష్యాన్ని విడనాడకుండా ఇంకా తన పుష్ఠిని కాపాడుకుంటోంది. వికృతమైన మూఢాచారాలు తలెత్తుతున్నాయి. వానిలో కొన్ని వైషమ్యాలను పురిగొల్పేవి కూడ లేకపోలేదు. అయినా పరవాలేదు. జాతి తన లక్ష్యాన్ని విడనాడదు. తనకై స్థిరపరచుకొన్న జాతీయత భద్రంగా నిలబడే వుంటుంది.

భగవానుడు, భగవానుడు మాత్రమే అనే విశ్వాసానికి జాతి కట్టుబడి వుంది. కనుకనే ఇంకా ఆశకు అవకాశం వుంది.

హిందువైన ప్రతి ఒక్కడూ మతాచారాలను బట్టి తాగుతాడు, నిద్రిస్తాడు, వివాహం చేసుకుంటాడు. ఏదిచేసినా మతాన్ని అనుసరిస్తాడు. కనుక జాతి యొక్క సౌష్ఠవం, జాతి యొక్క లక్ష్యం అన్నీ మతమేనని అర్థం. ఆ లక్ష్యాన్ని ఎవరు తాకనంతవరకు, ఛేదించనంతవరకు జాతి జీవనానికి భంగంరాదు.

జీవితంలో ప్రతి ఇతర సమస్యను మన ప్రధాన ఆశయమైన మతానికి ప్రాధాన్యత నిచ్చి పరిష్కరించుకోవాలి. సంగీతంలోని శృతి సమ్మేళనానికి కూడ ఇదే ధర్మం వర్తిస్తుంది. రాజకీయమైన ఆధిపత్యం లక్ష్యంగా గల జాతి వుండవచ్చు. మతం, తదితర విషయాలు ఆ లక్ష్యానికి లోబడి వుంటాయి. అందుకు భిన్నంగా మనజాతి ఆధ్యాత్మికతను, వైరాగ్యాన్ని జీవిత

విధానంగా ఎన్నుకొంది. ప్రపంచమంతా ఆడంబరమయమూ, మాయ, మూన్నాళ్ళముచ్చట అనే హెచ్చరికను పాటిస్తున్న జాతిమనది.

# నిత్యమైన భారతదేశం

భారతదేశాన్ని వదలిరాకముందు ఆ దేశాన్ని ప్రేమించాను. ఇప్పటికీ భారతదేశం యొక్క దుమ్ము ధూళిని, అక్కడ వీచే గాలిని పవిత్ర భావంతో ఆరాధిస్తాను. ఆ దేశమొక పవిత్ర భూమి; తీర్థయాత్రల కనువైన భూమి అది.

భారతదేశం యొక్క పతనాన్ని గురించి చాల వింటుంటాం. ఒకానొకప్పుడు నేను కూడ ఆ అపవాదును విశ్వసించాను. కాని ఈ రోజు నేను గడించిన అనుభవాల ఆధారంగా అనాలోచిత నిర్ణయాల నుండి విముక్తుడనైన నేపథ్యంలో ఇతర దేశాలను వాటి నిజ స్థితిలో చూసి వేసిన అంచనాల ఆధారంగా కూడ నేను లోగడ తీసుకున్న నిర్ణయం తప్పని సవినయంగా ప్రకటిస్తున్నాను. ఆర్యులు నివసించిన పుణ్య భూమివి నీవు; నీ స్థాయి ఎన్నడూ దిగజారదు. అధికార లాంఛనాలైన కర్రలు అధికారంతోపాటు ముక్కలైనాయి. అవతల పారవేయబడ్డాయి. అధికారమనే బంతి చేతులు మారటాన్ని గమనిస్తాం. కాని భారతదేశంలోని సామాన్య ప్రజలు ఎక్కువ మంది తమకు పూర్వులనుండి సంక్రమించిన సత్సాంప్రదాయాలను, లక్ష్యాలను నిలుపుకునే ధోరణిలో సంచరిస్తారే తప్ప వారి దృష్టి రాజులు, వారి అస్థానాల వైపు మరల్చరు. వారి జీవన స్రవంతిలో ఆటుపోట్లు రావచ్చును. వారి లక్ష్యసిద్ధిలో ఆటంకాలు తగులవచ్చు. ఐనా మానవుని మూర్ఖత్వాన్ని రూపుమాపి వానిలో దైవత్వాన్ని చొప్పించి వానిని పునరుజ్జీవింప చేసే ఉద్యమాన్ని నా మాతృదేశం రాజసమైన ఠీవితో సఫలీకృతం చేసుకుంటుంది. ఆ లక్ష్యసాధనలో దేశాన్ని ఏ విధమైన శక్తులు అడ్డగించలేవు. భారతీయులారా! ఈ జాతీయ నౌక కోట్లమంది మానవులను జీవితమనే అగాధ జలరాశిని దాటిస్తున్నది. కాని మీ యొక్క తప్పిదం ద్వారా నౌకకు చిల్లిబడటం వల్ల అది లోపభూయిష్టమయింది. ఆ కారణంగా నౌకను నిందించుట సమంజసమా? ప్రపంచంలో ఏ సాధనం ఈయలేని ఫలాన్ని మీకు ప్రసాదించిన ఈ నావను ఈ సందర్భంలో శాపనార్థాలతో తూలనాడటం ఉచితమా? ఈ నావలో చిల్లులు సంభవిస్తే సామాజికులందరం కలసి వాటిని

మూసివేసే ప్రయత్నం చేద్దాం. సిద్ధంకండి. మన రక్తం ధారపోసి అయినా ఆ పని మనం నిర్వర్తించాలి. చేయలేకపోతే ప్రాణాలు అర్పించ టానికైనా వెనుదీయకూడదు. మన మెదడులనే మూతలుగా తయారుచేసి నావ కొరకు ఉపయోగిద్దాం. అంతేకాని నావను తిరస్కరించవద్దు. ఈ సమాజాన్ని గురించి ఒక పరుషవాక్యం కూడ అనవద్దు. దాని యొక్క పూర్వపు గొప్పతనాన్ని దృష్టిలో వుంచుకొని దాన్ని ప్రేమిస్తాను. మీరందరు భగవానుని సంతానం గనుక, మీరు కీర్తిప్రతిష్ఠలు కాంచిన మీ పూర్వీకుల బిడ్డలు కనుక మిమ్మల్నందరిని నేను ప్రేమిస్తున్నాను. మిమ్మల్ని ఎన్నడూ శపించను. నా శుభాశీస్సులను మీకు ఎల్లప్పుడూ అందజేస్తుంటాను. నేను నా మనస్సులోవున్న ప్రణాళికలను మీకు విశదీకరించటానికి వచ్చాను. మీరు నా బిడ్డల్లాంటివారు. మీరు వాటిని ఆమోదిస్తే మనమందరం సమిష్ఠిగా కృషి చేద్దాం. అలాగాక నన్ను ఈ దేశాన్నుండి మీరు బహిష్కరింపదలిస్తే, నేను మళ్లీ తిరిగి వచ్చైనా మనం మునిగిపోతున్నాం అని హెచ్చరిస్తాను. నేను మీతో కలసి పనిచేయటానికే వచ్చాను. మునిగితే అందరం కలసి మునుగుదాం. అంతేకాని తప్పులెన్నవద్దు. శాపాలను ఉచ్చరించవద్దు.

# భారతదేశమా! (నీ ఔన్నత్యాన్ని) మరువవద్దు

భారతదేశమా! ఆదర్శ స్త్రీ మూర్తులై భరత భూమికే వన్నెతెచ్చిన సీత, సావిత్రి, దమయంతి సాధ్వీమణులను మరుగున పడవేయవద్దు. సర్వసంగపరిత్యాగియైన మహర్షులకు మహర్షియైన శంకరుని, ఉమాధవుని మరువ వద్దు. నీ వైవాహిక జీవితం, సంపద, నీ జీవితం కేవలం ఇంద్రియ సుఖముల కొరకు, వ్యక్తిగత సౌఖ్యం కొరకు మాత్రమే కాదని మరచిపోకు. నీవు జన్మించినది మాతృదేవత కైంకర్యమునకై వినియోగపడే ఒక బలిపశువుగా మారుటకేనని కూడ మరువకుము. నీ సామాజిక ప్రవృత్తి నియమాలు అనంత విశ్వజనీన మాతృత్వ ప్రతిస్పందనలుగా రూపొందాలని కూడ జ్ఞప్తియందుంచుకో. మాతృభూమిపై జన్మించిన మానవాళి – క్రింది తరగతి ప్రజలు, అమాయకులు, బీదవారు, నిరక్షరాస్యులు, చెప్పులు కుట్టువారు, ఊడ్చువారు – అందరూ నీ రక్త మాంసాలతో జన్మించిన నీ సహోదరులేయని భావించు. ధైర్య సాహసాలు నీ జన్మహక్కని భావించు. భారతీయులందరూ నా సహోదరులు : అని సగర్వంగా ప్రకటించు. భారతీయుడెవరైనా సరే జాతి, మత తారతమ్యం లేకుండా – వాడు నిరుపేదయైనా, దిక్కు లేనివాడైనా, బ్రాహ్మణుడైనా, హరిజనుడైనా, అందరు నా సహోదరులేనని ఎలుగెత్తి చాటు. అంతే కాదు, 'భారతీయులు కొలిచే దేవతలూ, దేవుళ్లూ నాకు దైవము. భారతీయ సమాజము నా బాల్య డోలిక నా యౌవన ఉద్యానవనం. ఆ సమాజమే నాకు స్వర్గతుల్యము, వార్ధక్యంలో పాపహారిణియైన వారణాసితో సమానము' అని ప్రకటించు. "భరత భూమి ఉన్నతోన్నతమైన స్వర్గంతో సమానం. భారతదేశానికంతకూ ఏది హితమో నాకును అదే హితం" అని కూడ ప్రకటించు. 'గౌరీవల్లభుడా! ఓ జగన్మాతా! నాకు పురుషత్వాన్ని ప్రసాదించండి. నా బలహీనతను నా నుండి తొలగించండి. భీరుత్వాన్ని నా నుంచి దూరం చేయండి. నన్నొక నిజమైన మానవునిగా చేయండి' అని కూడ పదేపదే ఆ దైవాన్ని ప్రార్థించు.

# మన పతనానికి కారణాలు

## ఈ జాతిచేసిన మహాపాపం – సామన్య ప్రజలను నిర్లక్ష్యం చేయుటే

సామాన్య ప్రజానీకం యొక్క వెనుకబాటుతనాన్ని పట్టించుకోకుండా వారి అభ్యున్నతిని గురించి ప్రయత్నించకుండా వారి పట్ల ఉదాసీనతను చూపుటే మన జాతి చేసిన మహా నేరము. అదే జాతి పతనానికి ప్రధాన కారణం.

సమాజం యొక్క నిర్లక్ష్యానికి గురియైన క్రింది తరగతి భారతీయులు – ముఖ్యంగా రైతులు, చేనేత పనివారు, తదితరులు పరరాజ్య పరిపాలనలో తమ స్వేచ్ఛను కోలుపోయి, తనవారి చేతనే నిరాదరింపబడి, అనాది నుండి శ్రమజీవులై, శ్రమకు తగ్గ జీవనభృతి పొందలేక మనుగడ సాగిస్తూ వస్తున్నారు.

మనదేశంలో బీదలను, అట్టడుగు వర్గాల వారిని, పాపులను ఆదుకునేందుకు స్నేహితులుండరు. వారు ఎంత కష్టించినా వారి స్థాయి నుండి పైకి రాలేరు. వారు రోజులు గడచిన కొద్దీ ఇంకా తక్కువ స్థాయికి దిగజారుతున్నారు. సమాజం నిర్దయగా వారిని చావుదెబ్బలు కొడుతూనే వుంది. ఆ దెబ్బలు ఏ సమయంలో ఎలా వచ్చి తాకుతాయో కూడ ఆ నిస్సహాయ ప్రజలకు తెలీదు.

నిరుపేద ప్రజల నిస్సహాయ స్థితే భారత దేశంలో అనర్థాలకు మూలకారణం. పండిత వర్గం యొక్క అధికారం, దానికితోడు పరదేశ పరిపాలన శతాబ్దాలుగా వారిని పూర్తిగా

అణచివేసినాయి. పర్యవసానంగా దేశంలోని బీదలు తాము మానవుల మనే మరచిపోయారు.

# ప్రజలు మోసగింపబడ్డారు – దానికి చారిత్రక సాక్ష్యాధారాలున్నాయి.

ప్రాచీన భారత దేశంలో బ్రాహ్మణులు, క్షత్రియులు వారి వారి ఆధిపత్యాన్ని సమాజంపై సాధించటానికి పెనుగులాడారు. ఆ పెనుగులాటకై వారు రచించిన పథకాల మార్గంలో ఇరు వర్గాల మధ్య సంభవించిన ఘర్షణ శతాబ్దాలుగా దేశాన్ని రణ రంగంగా మార్చింది. సామాన్య ప్రజలపై రాజులు చెలాయించే ధర్మరహితమైన కౄర పరిపాలన, ఆ మధ్యలో కొట్టుమిట్టాడుతున్న బ్రాహ్మణత్వం ఒక ప్రక్క, బ్రాహ్మణులు తమ పరిధిలో క్రతువులు, పూజాది కార్యక్రమాలు వీటి పేరుతో ప్రజలను బంధించి తమ ఆధిపత్యాన్ని నిర్దాక్షిణ్యంగా సాధించాలనే ఉద్యమం, దానికి ఎదురుగా రాజుల యొక్క శక్తివంతమైన పోరాటం మరొక ప్రక్క చెలరేగాయి.

ఈ రెండు శక్తుల మధ్య పోరాటం మన జాతి చరిత్రలో ప్రారంభ దశ యందు సంభవించింది. శృతులలో వీని వివరాలు ఆరంభం నుండి చివర వరకు మనకు లభిస్తాయి. కాని శ్రీకృష్ణుడు క్షత్రియ వర్గానికి ఆధిపత్యం వహించి తన శక్తితోను, జ్ఞాన సంపదతోను రెండు వర్గాల మధ్య తాత్కాలికమైన సఖ్యత సాధించాడు. దాని ఫలితంగా వేదాంత సారానికి, మత ధర్మాలకు నిలయమైన గీతా ప్రబోధం జరిగింది. కాని అమాయక బీదప్రజానీకం మీద పెత్తనం వహించాలనే కోరిక ఇరు వర్గాల వారికి ఉత్పన్నమౌతూనే వుంది. అది మళ్లీ ప్రజ్వరిల్లి తీవ్రమైన ఘర్షణలకు దారి తీసింది. కాని వాటి వివరాలు అప్పటి చరిత్రలో స్పష్టంగా మనకు లభించవు. ఆ ఘర్షణల అంతిమ స్థితిలో గెలుపు క్షత్రియులకు దక్కింది. దాంతో బ్రాహ్మణత్వం సమాజానికి నిర్దేశించిన క్రతువులు, పూజావిధానాలు సంఘ మర్యాదలనుండి నిష్క్ర మించాయి. అంతేగాక ఈ విజయం జ్ఞానానిదిగాను, స్వేచ్ఛదిగాను పరిగణింప బడింది. ఈ పరిణామాన్నే బౌద్ధమతం సాధించిన గొప్ప మార్పుగా గుర్తించారు. మతపరంగా చూస్తే ఇది సమాజాన్ని మతాచారాలు, క్రతువుల జంఝూటాల్నుంచి విముక్తి కావించింది. రాజకీయ

రంగం దృష్ట్యా ఇది బ్రాహ్మణత్వం మీద క్షత్రియులు సాధించిన ఘన విజయమౌతుంది.

ఈ పరిణామానికి కారకులైన మహనీయులు శ్రీకృష్ణుడు, బుద్ధుడు ఇరువురు క్షత్రియులు కావటం గమనార్హం. అంతేకాక ఈ దైవాంశసంభూతులిద్దరూ విజ్ఞానాన్ని కుల, మత, లింగ వివక్షత లేకుండా సర్వజనులకు అందించారు.

బౌద్ధమతం గణనీయమైన నైతిక స్తోమతను సమకూర్చుకున్నప్పటికీ, ప్రజల విశ్వాసాలకు వ్యతిరేకంగా విగ్రహారాధనను నిరసించటంతో ప్రజల నిరాదరణకు గురియైంది. చివరకు ఏ భూమిపై ఉద్భవించిందో అక్కడే నశించింది. ఆ మతం తాలూకు ఏవైన అవశేషాలు మిగిలివున్నాయంటే అవి ఛాందస ఆచారాలు, క్రతువులు మాత్రమే.

ఆ విధంగా మానవావతారంలో వెలసిన బుద్ధ భగవానుడు ప్రసాదించిన జీవన స్రవంతి కూడ ఒక విషపూరిత జలాశయంగా పరిణమించింది. ఆ స్థితినుండి పునరుద్ధ రింపబడటానికి కొన్ని శతాబ్దాల తర్వాత శంకరాచార్యుడు, తరువాత వరుసగా రామానుజులు, మధ్వాచార్యులు అవతరించు వరకు వేచివుండాల్సి వచ్చింది.

ఈ మతాచార్యుల ఆగమనం దేశానికి సత్ఫలితాల్ని ప్రసాదించింది. వేదాలు దేశంలో పునరుద్ధరింపబడ్డాయి. వేదాంత ప్రచారం ఇదివరకెన్నడూ లేనంతగానలుమూలలా విస్తరించింది. ప్రతి గృహస్థు ఆరణ్యకాలను పఠించటం ఆరంభించాడు.

బౌద్ధమత ప్రచార ఉద్యమంలో క్షత్రియులు నాయకులైనారు. వారి క్రింది సామాన్య ప్రజలు బౌద్ధ మతావలంబకులుగా మారారు. నూతనత్వాన్ని, మతంమార్పిడిని సాధించే ఉద్యమ స్ఫూర్తిలో ఆయాప్రాంతాల్లో ప్రజాబాహుళ్యం భాషించేభాషలను మాత్రమే అభ్యసించటం జరిగింది. పర్యవసానంగా సంస్కృత భాషపట్లనిర్లక్ష్యం ప్రవర్తిల్లింది. తదనుగుణంగా క్షత్రియులు వైదికసారస్వతానికి, సంస్కృతాభ్యాసానికి దూరులైనారు. దక్షిణ దేశప్రాంతాల నుండి వచ్చిన ఈ నూతన విధానంకేవలం బ్రాహ్మణులకు, బ్రాహ్మణత్వానికి

అనుకూలించింది. దేశంలోని లక్షలాది ఇతరజనావళికి ఇదివరకు ఎన్నడూ ఎరుగని స్థాయిలో సంకెళ్లను సృష్టించింది.

క్షత్రియులు ఎల్లప్పుడు భారతీయులకు వెన్నెముకవలె నిల్చారు. వారుశాస్త్రవిజ్ఞానానికి, స్వేచ్ఛకు ఆలంబనగా వుండి దేశంలోని ఛాందస ప్రవర్తనలకువ్యతిరేకంగా ముక్తకంఠంతో ప్రబోధనలు చేశారు. భారతదేశ చరిత్ర అంతా పరిశీలిస్తేబ్రాహ్మణత్వ విధానాల నిర్దాక్షిణ్య ఆధిపత్యానికి నిర్భేద్యమైన అడ్డుకట్టగా క్షత్రియులునిలచినట్లు అవగతమౌతుంది.

క్రమంగా వారిలో బహు సంఖ్యాకులు అజ్ఞాతులు కాగా, మిగిలిన వారుమధ్య ఆసియా నుండి వచ్చిన అనార్యులతో చేతులు కలిపి బ్రాహ్మణత్వం యొక్క ఆధిపత్యానికి దోహదం చేశారు. ఆ విధంగా తిరిగి భారతదేశం అధఃపతనానికిచేరింది. తిరిగి క్షత్రియులు తమ పతనావస్థ నుండి తేరుకొని సమర్థతను సేకరించుకొనిమిగతా ప్రజల శృంఖలాలను ఛేదించే వరకు ఇదే స్థితి కొనసాగుతుంది.

జాతి పతనావస్థలో వుంది. లక్షల సంఖ్యలోని ప్రజల శాపాలు మనల్నిక్రుంగదీస్తున్నాయి. ఏ ప్రజలకైతే మనం అద్వైతాన్ని బోధించామో, ఏ ప్రజలకులోకాచారాల్ని గురించి ప్రబోధించామో, ఏ ప్రజల ముందు దైవసృష్టిలో అందరుమానవులు సమానులే యని సిద్ధాంతాలు మాత్రం వల్లించి ఆచరణలో నిరూపించలేకపోయామో, అసంఖ్యాకులైనవారి శాపవచనాల ఫలితంగా కూడ మనజాతి నిర్వీర్య మైంది.

# మతం పేరుతో సామాన్య ప్రజలను అణగద్రొక్కుట

ప్రపంచంలో ఏ మతం కూడ హిందూమతం వలె మానవుల గౌరవ ప్రతిపత్తికి ఉన్నత స్థాయిని కల్పించలేదు. కాని ప్రపంచంలో ఏ ఇతర మతంలో కూడ హిందూ మతంలో వలె బీదప్రజలు, అట్టడుగు ప్రజలు అణచివేయబడలేదు.

భారతదేశంలో ప్రజల నిరుపేదరికాన్ని గురించి మితిమీరిన ప్రచారం వుంది. కాని దీనజనోద్ధరణకై పాటుపడుతున్న ధార్మిక సంస్థలు ఎన్ని వున్నాయి? దేశంలోని బీద ప్రజల ఆర్తిని, కష్టాల్ని సానుభూతితో చూసి వారి కొరకు విలపించే వారెంద రున్నారు? మనం నిజంగా మానవులమేనా? ఐతే వారిని ఉద్ధరించటానికి, వారికి జీవనోపాధి కల్పించటానికి మనం ఏం చేస్తున్నాం? వారిని అస్పృశ్యులుగా పరిగణిస్తాం; వారి సహచర్యాన్ని నిరాకరిస్తాం. వేలకు మంది బ్రాహ్మణులున్నారు. వారు ఈ నిస్సహాయుల నికృష్ట జీవితాల్ని మెరుగుపరచటానికి ఏ విధమైన చేయూతనిస్తున్నారు? 'నన్ను స్పృశించకు' అనే నినాదం మాత్రమే వారి నోట ఎప్పుడూ వెలువడుతుంది. నిత్యమైన మన హిందూమతం అటువంటి వారి చేతిలో పడి ఎంత దైన్యస్థితికి దిగజారిందో ఊహించలేము. ప్రస్తుతం మన మతం అస్పృస్యతా నినాదంలో తప్ప ఎక్కడ జీవిస్తోంది?

వైదికాచార పరత్వం భారతదేశాన్ని ఆవరించిన గొప్ప అవరోధం. ఒక వ్యక్తి తోటి సహచరుని స్థాయిని దిగజార్చి తన స్థాయిని నిలుపుకొనగలడా? విశ్వమంతా ఒక్కటే అన్న అతి ముఖ్యమైన సత్యాన్ని మన పూర్వీకులు కనుగొన్నారు. వ్యక్తి తన్నుతాను నొప్పించుకోకుండా ఇతరులను నొప్పించగలడా? బ్రాహ్మణ క్షత్రియులు తాము సమాజంపై నిర్ధాక్షిణ్య వైఖరితో నెరపిన ఆధిపత్యానికి ఫలితాల్ని రెట్టింపు ప్రమాణంలో అనుభవిస్తున్నారు. వేల సంవత్సరాల దాస్య జీవనం, దైన్యస్థితి వారు చేసిన దుష్కర్మలకు ఫలితాలుగా అనివార్యమై కర్మసిద్ధాంతం ప్రకారం వారి పాలైనవి.

# మరొక కారణం – విద్యపై గుత్తాధిపత్యం

స్వాతిశయంతో అధికారాన్ని హస్తగతం చేసుకొన్న ఒక వర్గ ప్రజలు విద్యా బుద్ధులు వారివరకే పరిమితం చేసుకొనుటే భారత దేశ పతనానికి ప్రధాన కారణం.

పాశ్చాత్యులకు మనకు గల వ్యత్యాసాన్ని గమనిద్దాం. పాశ్చాత్యులు ఒక జాతిగా రూపొందారు. కాని మనం అలా కాలేదు. పాశ్చాత్య దేశాల్లో నాగరికత, విద్య కూడ సర్వసామాన్యం. అవి సామాన్య ప్రజల్లోకి చొరబడి వారిని నాగరికులుగాను, విద్యా వంతులుగాను రూపొందిస్తాయి. భారతదేశంలోను, అమెరికాలోను ఉన్నత వర్గ ప్రజల మధ్య అంతరం ఉండదు. కాని క్రింది తరగతుల ప్రజల విషయం పరిశీలిస్తే ఆ దేశం వారికి, మన దేశం వారికి ఊహకందని వ్యత్యాసం వుంటుంది. బ్రిటీషు వారు మన దేశాన్ని అంత సుళువుగా ఎలా జయించగల్గారు? వారు ఒక జాతి గనుక, మనం కాదు కనుక. మన నాయకుడెవరైనా మరణిస్తే, మరొక నాయకుడు ఉద్భవించ టానికి కొన్ని శతాబ్దాలు పడుతుంది. కాని వారిలో ఒక నేత మరణించగానే మరొకడు సిద్ధంగా నిలుస్తాడు. మనదేశంలో సమర్థులైన గొప్పవారి కొరత యున్నది. పాశ్చాత్య దేశాల్లో ప్రతిభావంతుల్ని సమకూర్చుకునే ఏర్పాట్లు పుష్కలం. మనకట్టి అవకాశాలు చాల మితంగా వుంటాయి. 300 మిలియన్ల జనాభాగల దేశంలో నాయకుల్ని సమాయత్తం చేసే ఏర్పాట్లు బహుకొలది. అదే 30, 40 మిలియన్ల జనాభా గల పాశ్చాత్యదేశాల్లో అవి విస్తార సంఖ్యలో వున్నాయి. దీనికి ప్రధాన కారణం ఆ దేశాల్లో విద్యావంతులైన స్త్రీ పురుషులు అధికంగా వుంటారు. అదే మన దేశంలో అల్ప సంఖ్యాకులైన చదువుకొన్నవారు లభిస్తారు. ఇది మన జాతిని పీడిస్తున్న గొప్ప లోపం. దీన్ని త్వరితగతిని సవరించాలి.

# మీకు అస్తిత్వం లేదని బోధించటం జరిగింది

శతాబ్దాలుగా ప్రజలకు తమ పతనానికి దారి తీసిన పరిస్థితులను గురించి విశదీకరించటం జరిగింది. వారికి అస్తిత్వం లేదని స్పష్టీకరించటం కూడ సంభవిం చింది. ప్రపంచదేశాల్లోని సామాన్య ప్రజలకు మీలో మానవధర్మాలు లోపించినాయని తెలియజేయటం జరిగింది. ఇలా శతాబ్దాలుగా ప్రజలు భయపెట్టబడి జంతు సదృశులైనారు. వారికి ఆత్మజ్ఞానం పొందే అవకాశమే శూన్యమైంది.

# సోమరితనం – అల్పత్వం

జాతిగా మనం ఏమీచేసి సాధించం. ఇతరులు ఎవరైనా కృషి చేసి సాధిద్దామని ప్రయత్నిస్తే వారిని నిరసిస్తాము. ప్రజలలోని ఈ ధోరణి మన జాతి అధోగతికి కారణం. ప్రజలలో అన్యోన్యత, శక్తి సామార్థ్యాలు కరువైన కారణంగా జాతి దైన్యస్థితికి దిగ జారింది. కనుక మనం ఆ దుస్థితి నుండి బయటపడాలి. ఏ వ్యక్తులలో ఏ రకమైన ప్రతిభ వుందో భగవంతునకే ఎరుక. కనుక మనం సర్వజనులకు సమాన అవకాశాలు ఇచ్చి చూడాలి. ఫలితాలు భగవానునికి వదలివేద్దాం. కాని ప్రజలనందరిని సమ దృష్టితో చూడటం దుర్లభమే. కాని అలా చూడగల్గనంత వరకు జాతికి మోక్షం లేదు.

# మరొక కారణం – ఇతరులతో కలియకపోవటం

భారతదేశ పతనానికి మరొక ప్రబల కారణం కూడ వుంది. తమకున్న అమూల్య సంపదను, విజ్ఞానాన్ని ఆర్యజాతికి చెందని ఇతర ప్రపంచ దేశాలకు, జాతులకు ఈయకుండ తమ వద్దనే వుంచుకొని ఇతర జాతులతో అనుబంధాలు పెట్టుకోకుండా, తమకు తామే సంకుచిత మార్గంలో ఉష్ట్రపక్షివలె ఏకాకులైనారు. మనం బయటకు పోయి ఇతర జాతుల అభ్యున్నతిని పరిశీలించటం గాని మన పోకడలను వారి విధానా లతో సరిచూచుకోవడం గాని సంభవించలేదు. ఇది కూడ మన దుస్థితికి కారణమే.

ఏ వ్యక్తి గాని, జాతిగాని పరులను ద్వేషించి మనజాలదు. భారతీయులు 'మ్లేచ్ఛ' శబ్దాన్ని సృష్టించి కలసిమెలసి పరస్పర అవగాహనతో జీవించే విధానానికి స్వస్తి చెప్పిన నాడే భారతదేశం యొక్క భవిష్యత్తుకు మూతపడింది.

వ్యక్తి ఇతరులను ద్వేషించి తనకు తాను నైతిక పతనాన్ని ఆహ్వానిస్తాడు. ఇదే భారతదేశం చేసిన గొప్ప తప్పిదం. దీన్ని ఏ విధమైన మెరుగులతోనైనా మరుగుపరచా లని యత్నించినా, అనివార్యమైన నైతిక ధర్మాలు వాటి ఫలితాల్ని అవి ఇయ్యకమానవు. ప్రాచీన జాతుల్లో ఒకప్పుడు ప్రథమ శ్రేణిలోవున్న భారతజాతి ఈనాడు ప్రపంచజాతుల మధ్య తన హీనతను, దుస్థితిని ప్రదర్శిస్తున్నది.

# వ్యవస్థీకరణ లోటు

వ్యవస్థీకరణ సామర్థ్యం మన దేశంలో పూర్తిగా శూన్యమనే చెప్పాలి. ఈ ఒక్క లోపం దేశంలో అన్ని దుస్థితులకు హేతువౌతోంది. మనం ఏ సమస్యనూ ఇతరుల ప్రమేయంతో పరిష్కరించుకోవటానికి ఇష్టపడము. వ్యవస్థీకరణకు ప్రధానంగా కావల సింది విధేయత.

ఉపనిషత్తుల గొప్పతనాన్ని మనం అంగీకరించినా, మన ప్రాచీనుల్లో మహర్షు లున్నారని ఒప్పుకున్నా, ఈ రోజున మనజాతి ఇతర జాతుల్తో పోలిస్తే బలహీనమైందిగా, నిర్వీర్యమైనదిగా పరిణమించిందనే చెప్పాలి. ప్రధానంగా మనం మానసిక, శారీరక బలహీనతలతో క్రుంగిపోతున్నాం. ఆ బలహీనతలే మన కష్టాలలో మూడువవంతునకు కారణం. మన సోమరితనం వల్ల మనం కష్టపడటానికి ఇష్టపడం. స్వార్థపరత్వంలో మనమే మిన్న. ఇతరులకు మన ప్రేమ పంచలేము. కనుక ఇతరులతో సహకరించ లేము. మనలో ముగ్గురు వ్యక్తులు కూడ ఒకరి నొకరు ద్వేషించకుండా, ఒకరిపై మరియొకరు అసూయను ప్రకటించకుండా కలసి వుండలేరు. చిలక పలుకులు ఎన్నైనా పలుకుతాం. కాని అవి కార్యరూపం దాల్చవు. ఏది వెల్లడిస్తామో దానిని ఆచరణలో పెట్టకపోవటం మనకు అలవాటైంది. దీనికంతకూ కారణం మన మానసిక, శారీరక బలహీనతలే. ముఖ్యంగా మన మానసిక శక్తిని పటిష్ఠ పరచుకోవాల్సిన ఆవశ్యకత ఎంతైనా వుంది.

# మనం చేస్తున్న మరొక గొప్ప పాపం – స్త్రీ జాతిపట్ల నిర్లక్ష్య వైఖరి

భారత దేశంలో రెండు గొప్ప దుష్కర్మలు సాగుతున్నాయి. ఒకటి స్త్రీ జాతి అణచివేత, రెండవది బీదప్రజల పట్ల కులవివక్షలతో నిర్దాక్షిణ్యవైఖరి.

ఎవరైతే భగవంతుని ఈ విశ్వంలో సర్వవ్యాపకుడుగా గుర్తిస్తూ మాతృమూర్తి యైన స్త్రీలో శక్తి స్థాపకతను దర్శించగలడో వాడే శక్తిని ఆరాధించే నిజమైన మానవుడు. ఏ కుటుంబంలో స్త్రీలు గౌరవింపబడి సుఖశాంతులతో వర్ధిల్లుతారో ఆ కుటుంబాల్నే భగవంతుడు ఆశీర్వదిస్తాడని మనువు ఉద్ఘోషించాడు. పాశ్చాత్య దేశాల్లోని పురుషులు స్త్రీలను ఉచిత రీతిని గౌరవిస్తారు. అందువల్లనే వారు సంపన్న సౌభాగ్యులై, విజ్ఞాన వంతులై, పుష్టితో, స్వేచ్ఛాయుతులై వర్ధిల్లుతున్నారు. అయితే మనం దాస్యభావంతో, నిర్జీవమైన దుఃఖమయ జీవితాల్ని ఎందుకు గడుపుతున్నామో సర్వులకు తేటతెల్లమే.

మన దేశం ప్రపంచ దేశాలన్నిటిలోను బలహీనమైందిగా వెనుకబడిందిగా వుండటానికి కారణం మనం శక్తిని నిరాదరించి అగౌరవపరచటమే.

# పునరుద్ధరణకు మార్గము నశింపచేయకు

'దేనిని నశింప చేయవద్దు' అనే సూక్తిని పాటించమని ప్రప్రథమంగా నేను మానవాళిని ప్రబోధిస్తాను. విగ్రహారాధనను నిరసించేవారు ప్రపంచానికి ఏ విధమైన మేలు చేయలేదు. దేనిని ధ్వంసము చేయవద్దు; కూలదోయవద్దు; నిర్మించు. చేతనైతే ఇతరులకు చేయూతనివ్వు, కానిచో చేతులు కట్టుకొని ప్రగతిని పరిశీలించు. ఇతరులకు సహాయము అందించకపోయినా ఇబ్బంది లేదు. ఎవరిని బాధించకు. వ్యక్తి యొక్క స్థితిని తెలుసుకొని ఆ స్థితి నుండి అతన్ని ఉన్నత స్థితికి తీసికొనివెళ్లు. యథార్థంగా విచారిస్తే నీవు, నేను ఏమి సాధించగలం? చిన్న బిడ్డకు బోధించగల శక్తి కూడ నీకు లేదు. బిడ్డ కూడ తనకు తానే నేర్చుకోగలదు.

## సామాన్య ప్రజలు – శక్తిని నలువైపుల విస్తరింప చేయగల సాధనములు

సమాజంపై ఆధిపత్యాన్ని హస్తగతం చేసుకొన్నవారు విజ్ఞానవంతులుగానీ, సంపద, సైనిక బలం కలవారుగానీ, వారికి అవసరమైన శక్తి సామాన్య ప్రజల నుండి రావలసినదే. అధికారం నిర్వహించవలసిన వారు ఆ శక్తికి ఎంత దూరమైతే వారు అంతమేరకు బలహీనులగుట సత్యము. ఆత్మ వైరాగ్యాన్ని ఆత్మప్రేమ ద్వారా సాధించవలసియున్నది. వ్యక్తి తన స్వార్థ ప్రయోజనాల్ని కాపాడుకొనుటకు మొత్తం సమాజం యొక్క శ్రేయస్సు కొరకు శ్రమిస్తాడు. జాతి యొక్క శ్రేయస్సులోనే వ్యక్తి శ్రేయస్సు ఇమిడి వుంది. జాతి సుఖశాంతులతో వర్ధిల్లుతుంటే వ్యక్తి గూడ సుఖంగా వుంటాడు. బహు ప్రజల సహకారం లుప్తమైనప్పుడు ఎక్కువ వంతు పనులు ఫలరహితమౌతాయి. ఆత్మ రక్షణ కూడ అసాధ్యమౌతుంది.

వ్యక్తి జీవితం సమాజ జీవితంతో ముడిపడి వుంది. మొత్తం మానవాళి ప్రమోదంతో వుంటే వ్యక్తి కూడ ఆనందంగా వుంటాడు. సమాజం నుంచి విడిపోయిన వ్యక్తి యొక్క ఉనికిని మనం ఊహించలేము. ఇది ఒక నిత్య సత్యం. ఈ సత్యం ఆధారంగానే విశ్వనిర్మాణం జరిగింది. ఈ అనంత విశ్వమానవాళి వైపు ప్రస్థానిస్తూ, తాదాత్మ్యభావంతో, సానుభూతితో, దాని సుఖాలే తన సుఖంగా, దాని కష్టాలే, తన కష్టాలుగా భావించి జీవించుటే వ్యక్తి యొక్క కర్తవ్యం.

# భారతదేశంలోని శ్రమ జీవులారా!

భారతదేశ శ్రమజీవులారా! మీ నిరాడంబర నిర్విరామ కృషి ఫలితంగా బాబిలోన్, పర్షియా, అలెగ్జాండ్రియా, గ్రీసు, రోమ్, వెనిస్, జెనోవా, బాగ్దాద్, సమర్‌ఖండ్, స్పెయిన్, పోర్చుగల్, ఫ్రాన్స్, డెన్మార్క్, హాలెండ్, ఇంగ్లండ్ దేశాలు సర్వాధిపత్యాన్ని, ఉన్నతిని వరుసగా సాధించాయి. అయినా మీ సేవల్ని గుర్తించి మిమ్మల్ని గురించి తలచుకునేవారు లేరు. విజ్ఞానవంతులైన మీ పూర్వీకులు కొన్ని వేదాంత గ్రంథాలను రచించారు. పురాణాలను రచించి వెలువరించారు. చాలా దేవాలయాలను నిర్మింప చేశారు. అంతమాత్రాన వారి కృషిని భూమ్యాకాశాలు మారుమోగే విధంగా ప్రజలు జయజయ ధ్వానాలు చేస్తున్నారు. కాని ప్రపంచ ప్రజల అభ్యున్నతికి రక్తం ధారవోసి శ్రమించిన వారిని గురించి కీర్తించటానికి ఎవరు శ్రద్ధ వహిస్తున్నారు? వేదాంత ప్రచారకులు, సమర యోధులు, గ్రంథ రచయితలు వారి వారి సామర్థ్యాలతో ప్రపంచ ప్రజల హృదయాల్ని జయించి మానవాళి ఆదర్శాన్ని పొందగల్గారు. కాని ప్రజల నిరాదరణను సహనంతో భరిస్తూ, ఎవరి ప్రోత్సాహానికి నోచుకోక, నిర్భర పరిస్థితుల్లో జీవిస్తూ కూడ పరిమితంలేని ఓర్పును ప్రదర్శిస్తూ, అంతులేని ప్రేమను వెదజల్లుతూ, సాహసోపేతమైన వాస్తవికతతో మానవాభ్యుదయానికి అహర్నిశలు శ్రమించుచున్న శ్రామికులకు గుర్తింపు లభించదా? వారి శ్రమలో శౌర్యసాహసాలు లేవా? చాలమంది ఏదైన ఒక ఘనకార్యం నిర్వర్తించవలసినప్పుడు వారిలోని వీరత్వం ప్రకటితమౌతుంది. ప్రజాబాహళ్యం యొక్క ప్రోత్సాహం, స్ఫూర్తి లభించిన సందర్భంలో పిరికివాడు కూడ కార్యసాధనకై తన అసువుల్ని అర్పించటానికి వెనుకాడడు. అమిత స్వార్థపరుడుసైతం నిస్వార్థంతో వ్యవహరిస్తాడు. కాని గుర్తింపులేని సందర్భాల్లో, చిన్నపనులను కూడ ఫలవంతం చేసే విషయంలో నిస్వార్థతను, బాధ్యతపట్ల అంకితభావాన్ని ప్రదర్శించగల వాడే ధన్యుడు. ఆ ప్రవృత్తి గలవారు నిస్సందేహంగా శ్రామికులైన మీరే. ఐనా మీరు అణచివేతకు గురియౌతూనే వున్నారు. అట్టి మీ ముందు తల వంచుతాను.

# సామాన్య ప్రజల అభ్యున్నతి

'సామాన్య ప్రజల మత విశ్వాసాలకు హాని కల్గకుండా వారి అభ్యున్నతిని సాధించాలి' అనే సూక్తిని పాటించండి.

పూరి గుడిసె వాసులే జాతి జీవితానికి ప్రాతినిధ్యం వహిస్తారని మరవకండి. జాతి భవిష్యత్తు సామాన్య జనుల పరిస్థితులపై ఆధారపడి వుంటుంది. వారికి ఉన్నత స్థాయిని కల్పించగలరా? వారు పోగొట్టుకొన్న వ్యక్తిత్వాన్ని వారి అంతర్గత చిత్త ప్రవృత్తికి భంగం కల్గకుండా, తిరిగి వారు పొందునట్లు చేయగలరా?

సామాన్య ప్రజలను నిర్లక్ష్యం చేయటమే మన జాతి చేసిన గొప్ప తప్పిదం. అదే మన పతనానికి ఒక కారణమైంది. భారతదేశంలోని సామాన్య ప్రజానీకం మరల విద్యావంతులై, ఆహార కొరతకు గురి కాకుండా ఆదరింపబడనంతవరకు మనం ఎన్ని రాజకీయ సిద్ధాంతాల్ని ఆశ్రయించినా ఫలం దక్కదు. వారు మన విద్యా వ్యవస్థకు సొమ్ము సమకూరుస్తారు. మన దేవాలయాలను నిర్మిస్తారు. వాటికి ప్రతిఫలంగా వారు సమాజం యొక్క తిరస్కృతిని, అవమానాల్ని స్వీకరిస్తున్నారు. వారు సర్వత్రా మనకు బానిసలు. మనం భారతదేశాన్ని పునరుజ్జీవింపచేయాలంటే వారి కొరకు కృషి చేయాలి. మన ఉద్యమం ప్రధానంగా నిస్సహాయులను, నిరుపేదలను, చదువురాని పేదరైతులను, శ్రామికులను ఉద్ధరించుటకు సాగాలి. ఇంకా కొంత సమయం మిగిలితే దానిని నాగరిక జనులకై వినియోగించవచ్చు. పేద రైతుల యొక్క, శ్రామికుల యొక్క అభిమానాన్ని ప్రేమతో పొందవచ్చు. 'స్వయంకృషితో ఆత్మోద్ధరణ సాధ్యమగును'. ఈ సత్యం అన్ని రంగాలకు వర్తిస్తుంది. ఈ సత్యాన్ని గ్రహించిననాడు అందరూ తమ పరిస్థితిని తెలుసుకొని, సహాయం మరియు అభివృద్ధిల ఆవశ్యకతను గుర్తించగల్గుతారు. వారు చేసే కృషి ఫలితాల్ని సాధిస్తోందని, అది సరియైన పద్ధతిలో కొనసాగుతోందని కూడ తెలుసుకుంటారు. పేద రైతులు, కూలీలు కొన ఊపిరితో

జీవిస్తున్నారు గనుక ధనికులైనవారు వారిని ఆదుకొని వారికి పుష్టిని సమకూర్చవలసిన ఆవశ్యకత ఎంతైనా వుంది. అది జరిగిన తర్వాత వారి సమస్యలను వారే ఎదుర్కొని పరిష్కరించుకొనునట్లు చేయవచ్చును.

# తప్పిదం మతంది కాదు

భారత దేశంలో బీద జనుల యొక్క, అట్టడుగు వర్గ ప్రజల యొక్క దీన స్థితిని తలంచుకొని నా హృదయం ఎంత తల్లడిల్లిందో వివరించలేను. వారు ఉచ్చస్థితిని చేరుటకు అవకాశమూ లేదు, ఊపాయమూ లేదు. మన దేశంలో పేదలకు, క్రింది తరగతి వారికి, తప్పుచేసిన వారికి చేయూత లభించదు. స్నేహితులుండరు. ప్రతిరోజు వారు క్రిందికి దిగజారుతునే యుంటారు. గడచినకొద్ది సంవత్సరాలలో కొందరు ఆలోచనాపరులు ఈ దుస్థితిని గమనించారు. కాని దురదృష్టమేమంటే ఆ దుస్థితికి కారణం హిందూ మతమని వారు నిర్ధారణ చేయటమే; కనుక హిందూ మతాన్ని అణగ ద్రొక్కితే పరిస్థితులు మెరుగు కాగలవని, అదొక్కటే మార్గమని వారు తలంచారు. కాని భగవత్కృప వల్ల నేను అసలు రహస్యాన్ని కనిపెట్టగల్గాను. మన దుస్థితికి మతాన్ని తప్పుపట్టలేం. వ్యక్తి యొక్క ప్రతిరూపాలే సమాజంలోని ఇతర వ్యక్తులందరూ అని మన మతం బోధిస్తుంది. ఆ సత్యాన్ని జీర్ణించుకొని అమలు చేసే సానుభూతి, సహనాలు, సహృదయం మనకు అవసరం. ఈ పరిస్థితి నుండి బయటపడాలంటే మతాన్ని ధ్వంసం చేయటం ఉపాయం కాదు. అందుకు భిన్నంగా హిందూ మత విశ్వాసాలు చేసిన ప్రబోధాలు పాటిస్తూ సహనశీలంతో బౌద్ధమత ధర్మాల్ని హిందూ మతంతో అనుసంధించి అనుసరించాలి.

వ్యక్తి స్వేచ్ఛలేకుండా అభ్యుదయానికి సార్థకతలేదు. మనప్రాచీనులు ఆత్మకు అన్నిరకాల స్వేచ్ఛను ప్రసాదించారు. అందువల్ల మతం సర్వతోభివృద్ధి చెందింది. కాని వారు శరీరాన్ని దాస్యశృంఖలాలతో బంధించారు. కనుక సమాజం అభివృద్ధి సాధించలేదు. పాశ్చాత్య దేశాల్లో ఈ పరిస్థితి విపర్యంగా కొనసాగుతోంది. అక్కడ సమాజానికి అన్ని స్వేచ్ఛలు వుంటాయి. మతానికి ఏ స్వేచ్ఛావుండదు. ఇప్పుడైతే పరిస్థితితారుమారౌతోంది. తూర్పు దేశాల్లో భౌతిక స్వాతంత్ర్యం, పాశ్చాత్యదేశాల్లో మతపరమైన స్వేచ్ఛ ప్రబలుతున్నాయి. ఆధ్యాత్మికతలోని ప్రతి చిన్న అంశాన్ని సామాజిక పురోభివృద్ధి ద్వారా సాధించాలని పాశ్చాత్య

దేశాలు వాంఛిస్తున్నాయి. అలాగే తూర్పు దేశాలు ఆధ్యాత్మిక మార్గంలో సామాజిక సాధికారతను సమకూర్చు కునేయత్నంలో వున్నాయి. ఆ విధంగా ఆధునిక సంఘసంస్కర్తలు వారి సంస్కరణకు వేరే మార్గంలేక భారతదేశ మతాన్ని అణచివేయదలచారు. కాని వారి ప్రయత్నాలన్నీ విఫలమయ్యాయి. ఎందువలన? వారిలో చాల మందికి వారి మతాన్ని గురించి కూడ సరియైన అవగాహన లేదు. వారిలో ఏ ఒక్కరూ సర్వమతాలకు మూలమైన హిందూమతాన్ని అర్థం చేసుకోటానికి అవసరమైన శిక్షణను పొందలేదు. హిందూ సమాజాన్ని ఉద్ధరించటానికి మతాన్ని నిర్మూలించనవసరం లేదు. సమాజ దుస్థితికి మతం ఏ విధంగానూ కారణంకాదు; మత ధర్మాల్ని సమాజానికి అమలు చేయవలసిన రీతిలో అమలు చేయకపోవుట చేతనే ప్రస్తుత స్థితి సంభవించింది. ఈ విషయాన్ని మన మత గ్రంథాల ద్వారా నిర్ద్వందంగా ఋజువు పరచగలను. ఈ అంశాన్నే నేను అందరికి బోధిస్తాను. దీన్ని గురించి మనమందరం జీవితాంతం పటిష్ఠమైన కృషి చేయాలి.

# నీ గతాన్ని నీవు తెలుసుకో

గతం నుండే భవిష్యత్తు రూపుదిద్దుకొంటుంది. కనుక నీ గతంలోకి వెనుదిరిగి ఎంత దూరం చూచుకోగలవో అంతవరకూ చూచుకో. గత కాలానికి సంబంధించిన నిత్యవైభవ స్రవంతిలో మునిగి తేలియాడిన పిదప భారతదేశ భవితవ్యాన్ని ఎన్నడూ లేనంతగా సుసంపన్నంగా, సర్వోన్నత స్థితికి తీసికొనివెళ్లు. మన ప్రాచీనులు అధికులు. వారి గొప్పతనాన్ని ముందు స్మృతిపథంలో వుంచుకో, మనకు ప్రాణాధారమైన ధాతువుల్ని గురించి, మన రక్తనాళాల్లో ప్రవహించే రక్తాన్ని గురించి సమగ్రంగా తెలిసికొని భారతదేశాన్ని ముందెన్నడూ లేని ఔన్నత్య స్థితికి చేర్చుటకు కృషి చేయాలి.

మన గత చరిత్రను నిత్యం మననం చేసే వారిని ఇప్పటికాలం వారందరూ ఆక్షేపిస్తారు. మనదేశం యొక్క దీనావస్థకు గతాన్ని గూర్చి అతిగా సమీక్షించుకోవటమే కారణమని చాలమంది భావన. కాని దానికి విపర్యమైన ఆలోచన సరియైనదని నా విశ్వాసం. గతాన్ని మరచి సంచరించుట చేతనే మన భారతజాతి నిర్జీవస్థితికి దిగజారింది. గత చరిత్రను వీక్షించి వ్యవహరించటం ఆరంభించిన తర్వాతనే సర్వతోముఖమైన చైతన్యం, సజీవస్థితి కానవస్తోంది. గత వైభవస్థితి నుండే భవిష్యత్తును మలచుకోవాలి. అప్పుడా గతమే భవితవ్యంగా దర్శనమిస్తుంది.

హిందువులు తమ గత చరిత్రను ఎంత ఎక్కువగా తెలిసికుంటే వారి భవిష్యత్తు అంత ఎక్కువైన ఉజ్జ్వల స్థితిని పొందుతుంది. అందువలన ఎవరైతే గత చరిత్రను దేశంలోని ప్రతివ్యక్తి యొక్క అందుబాటులోకి తెస్తాడో ఆ వ్యక్తి జాతికి మహోపకారం చేసినవాడుగా పరిగణింపబడతాడు. మన ప్రాచీనుల యొక్క ఆచారవ్యవహారాలు, చట్టాలు లోపభూయిష్టంగా వుండటమనేది భారతదేశ పతనానికి కారణం గాదు. వాటిని న్యాయమైన ముగింపు దశవరకు కొనసాగించనీయనందువల్లనే ఆ పరిణామం సంభవించింది.

మన ఉపనిషత్తులలోను, పవిత్ర గ్రంథాల్లోను, పురాణాల్లోను నిబిడీకృతమై యున్న అద్భుత సత్యాల్ని మతసంస్థల నుండి, తపోవనాల నుండి ఇతర ప్రత్యేక సంస్థల నుండి సేకరించి దేశమంతా విస్తరింపజేసి, ప్రసారం చేయాల్సిన ప్రధాన కర్తవ్యం మనపై వుంది. అలాంటి కృషి ద్వారా మనకున్న అమూల్య ధర్మ సూత్రాలు జ్యోతులై అటు ఉత్తరాన హిమాలయాల నుండి దక్షిణాన కేప్‌కామరిన్ వరకు, తూర్పున బ్రహ్మపుత్ర నుండి పశ్చిమాన సింధ్ వరకు విస్తరించిన సమస్త ప్రాంతాల్లోను ప్రస రించాలి.

# దేశంలోని మహామహుల్ని గౌరవించాలి

మహర్షులను ఆరాధించే సంస్కృతిని మనం ప్రవేశపెట్టాలి. నిత్యసత్యాల్ని సాధించిన మహాత్ములను ఆదర్శమూర్తులుగ మన ప్రజలముందు పరిచయం చేయాలి. భారతదేశానికి సంబంధించినంత వరకు శ్రీరామచంద్రుడు, శ్రీకృష్ణుడు, మహావీరుడు, శ్రీరామకృష్ణ పరమహంస మహనీయులలో కొందరు. వీరి జీవితాల్ని ప్రజలు ఆదర్శంగా పాటించాలి. శ్రీరామచంద్రుని, మహావీరుని ఆరాధన కార్యక్రమాన్ని మన దేశంలో ప్రోత్సహించగలరా? అలాగే భగవద్గీతను ఎలుగెత్తి సింహగర్జన చేసిన శ్రీకృష్ణుని స్మరణను నలుదిశల విస్తరింపజేయగలరా? ప్రస్తుత కాలంలో మనకు ఆపాదమస్తకం రజోతత్వాన్ని జీర్ణించుకున్న ఉడుకురక్తంగల ఆదర్శయోధుడు అత్యావశ్యకం. ఆ యోధుడు నిష్కృతి మార్గాన్ని కవచం గాను, జ్ఞానాన్ని ఆయుధం గాను ఉపయోగించి సత్యాన్వేషణలో సాహసంతో అసువుల్ని అర్పించటానికి కూడ వెనుదీయరాదు.

# మతానికి హాని తలపెట్టకూడదు

'సామాన్య ప్రజల అభ్యున్నతిని, వారి మతానికి హాని కల్గకుండ సాధించాలి.' ఈ ఆదర్శాన్ని ఔదలదాల్చండి. సర్వసమానత్వ భావనలో, స్వేచ్ఛలో, కృషిలో, శక్తి ప్రదర్శించుటలో నీవు పాశ్చాత్యుల్లో పాశ్చాత్యునిగా మారగలవా? అదేసమయంలో మతపరమైన ఆచరణలలోను, భావోద్రేరితములలోను పవిత్రమైన హిందువుగానూ ప్రవర్తించగలవా? వీనిని సాధించి తీరాలి. తప్పక సాధిస్తాం.

హిందూ సమాజోద్ధరణకై మతాన్ని నిర్మూలించాల్సిన ఆవశ్యకత లేదని పునరుద్ఘాటిస్తున్నాను. ప్రస్తుతం సమాజం యొక్క దుస్థితికి మతం కారణం కానేకాదు. మతాన్ని ఉచిత రీతుల్లో అవలంబించక పోవుటే ఆ పర్యవసానానికి మూల కారణం.

భారతదేశం తన పటిష్ఠతను మతం ద్వారానే సాధిస్తుంది. భారతజాతి తన ప్రాచీనుల యొక్క సర్వోత్కృష్టమైన వారసత్వాన్ని మరువనంతవరకు, ప్రపంచంలో ఏ శక్తి దాన్ని ఏ రకంగాను నష్టపరచలేదు.

దేహంలో ప్రవహించే రక్తం సౌష్ఠవం గాను, స్వచ్ఛం గాను ఉన్నంతవరకు ఏ రకమైన రోగ జీవి ఆ శరీరంలో మనలేదు. మన రక్తం ఆధ్యాత్మికతతో నిండియుంది. అది కల్మషరాహిత్యం అయితే, అది పటిష్ఠంగాను, స్వచ్ఛంగాను, శక్తివంతంగాను ప్రవహిస్తే అంతా శ్రేయస్కరంగానే జరుగుతుంది. రాజకీయ, సాంఘిక, భౌతికపరమైన అన్ని లోపాలు, చివరకు దేశంలోని పేదరికం కూడా నిర్మూలింపబడతాయి.

అందుకు భిన్నంగా నీవు నీ మత విశ్వాసాన్ని త్యజించి రాజకీయాన్ని, ఇతర విధానాల్ని ఆశ్రయించి వాటిపై కేంద్రీకరించి, జాతి జీవనాన్ని కూడ ఆ పంథాలో పటిష్ఠం చేసి అందులో విజయం సాధిస్తే, పర్యవసానంగా నీవు అంతరించటం ఖాయం. ఆ ఫలితాన్ని

నిరోధించాలంటే ప్రజలందరికి మతాన్ని శక్తిమంతం చేయ టంలో ప్రమేయం కల్పించాలి. మతశక్తి ద్వారానే సమాజానికి మేలు చేకూరాలి. ప్రతి వ్యక్తి తన మార్గాన్ని తనే ఎంచుకోవాలి. అలాగే ప్రతి జాతి కూడా. మనం ప్రాచీన కాలంలోనే మన మార్గాన్ని ఎన్నుకున్నాం. దానికే బద్ధులమైయుండాలి. మన ఎన్నిక ఏవిధంగాను చెడ్డదికాదు. విషయ విచారం వదలి ఆత్మవిచారం చేపట్టడం తప్పు కాదు కదా. అలాగే మానవుని గురించి కాక దైవాన్ని గురించి ఆలోచించటంలో దోషం లేదు. లౌకిక దృష్టిపై తీవ్రమైన వ్యతిరేకత, పరమార్ధ దృష్టిపై ఆసక్తత, విషయ వాంఛలపై వైరాగ్యం, దైవశక్తిపై అచంచల విశ్వాసం, నిత్యమైన ఆత్మ పదార్ధ మందు పూర్తి నమ్మకం – ఈ అంశాలన్నీ ప్రతి భారతీయునిలో జీర్ణించివున్నాయి. వాటి నెవ్వరూ విడనాడలేరు; ఇది నా దృఢ విశ్వాసం. నీవు మత ద్వేషివై తత్సంబంధిత ప్రలోభాలకు వశుడవై తాత్కాలికంగా ప్రలాపించవచ్చు. కాని నీ అసలు రూపం నాకు తెలుసు. నేనొక్కమారు నీ భుజం తట్టి నీ స్వరూపాన్ని జ్ఞప్తికి తెస్తే నీవు మరల దృఢమైన ఆస్తికుడవు అవుతావు. నీ సహజ ప్రవృత్తిని అంత సులభంగా నీవు మార్చుకోలేవు.

భారతదేశంలో ఏ రంగంలో అభివృద్ధి సాధించాలన్నా మతపరమైన విప్లవ చర్య అవసరం. సామాజిక పరమైన రాజకీయ పరమైన భావాలను ప్రచారం చేసే ముందు దేశం మొత్తాన్ని ఆధ్యాత్మిక ప్రబోధాలతో ముంచెత్తండి.

హిందువన్నవాడు మతాన్ని విడనాడకూడదు. మతాన్ని తగిన పరిమితుల్లో ఉంచి అభివృద్ధి సాధనకై అవసరమైన స్వేచ్ఛను సమాజానికి అనుమతించాలి.

మత ఛాందసవాద విధానాల వలన సమాజానికి సంభవించిన హానికి, పతనానికి మతమే కారణమని యెంచిన సంఘసంస్కర్తలు నాశరహితమైన మత నిర్మాణాన్ని కూలదోసే ప్రయత్నాలు చేశారు. కాని వారు సాధించిందేముంది, పరాజయం తప్ప? బుద్ధుడు తో ఆరంభించి రామమోహనరాయ్ వరకు అందరు సంస్కర్తలు కులాన్ని మత వ్యవస్థగా భావించి, కుల వ్యవస్థను దాంతో బాటు మతాన్ని సమూలంగా ధ్వంసం చేయటానికి ఉద్యుక్తులైనారు.

కాని వారు ఏమీ సాధించలేదు.

మంచి గాని, చెడు గాని మతాదర్శం వేల సంవత్సరాల నుండి భారతదేశ నాగరికతను ప్రభావితం చేస్తూ వస్తూనేవుంది. అలాగే దేశ వాతావరణం మొత్తం ఈ మతాదర్శాల మధ్య పుట్టి పెరిగింది. మత సూత్రాలు రక్తంలో మిళితమై ప్రజల శరీర నిర్మాణంలో భాగాలై జీవితానికి సజీవతను సమకూర్చాయి. అటువంటి మతాన్ని విడనాడటం సాధ్యమా? అలా విడనాడితే పర్యవసానంగా, ప్రతిఘటన చాల తీవ్ర రూపంలో వుంటుంది. వేల సంవత్సరాల నుండి నిరాటంకంగా ఒక మార్గంలో ప్రవహించిన ఈ మతమనే మహానది దాని స్థానాన్ని మరొకటి ఆక్రమించకుండా అది అంతరించే ప్రశ్న లేదు. ఒక పధంలో ప్రవహిస్తున్న గంగానదిని తిరిగి దాని పుట్టుక స్థానానికి పంపి మరొక మార్గంలో ప్రవహింపజేయగలమా? అదైనా సాధ్యమైతే కావచ్చు నేమో గాని ప్రజల జీవిత విధానానికి ఒక స్పష్టమైన దిశను నిర్దేశించిన ఈ మత జీవితాన్ని వదలి వారు రాజకీయాల్నిగాని, మరొక విధానాన్ని గాని చేపట్ట లేరు. ప్రజలు ఏ విధానంలో ప్రతిఘటన మిక్కిలి స్వల్పంగా వుంటుందో దాన్నే స్వీకరించగల్గుతారు. నిస్సందేహంగా ఈ మత జీవిత విధానం పట్ల ప్రతిఘటన అత్యల్పమనే అంగీకరించాలి. మత మార్గమే భారతదేశ ప్రజలకు జీవిత విధానం, పెరుగుదలకు మార్గం, సమాజ శ్రేయస్సుకు శరణ్యం.

అలాగని దేశానికి రాజకీయమైన, సాంఘికమైన అభివృద్ధి మార్గాలు అనవసర మనిగాదు. నా అభిప్రాయాన్ని శ్రద్ధగా గమనించండి. అవి మతం తర్వాతనే. మతానికి ప్రధాన స్థానం, వాటికి తరువాతి స్థానం మాత్రమే. భారతీయుని మనస్సు ముందు మతం మీదనే, మిగతా విషయాలన్నీ తర్వాతనే.

భారతదేశంలో సాంఘిక సంస్కరణను దేన్నైనా ప్రచారం చేయదలిస్తే, అది ఆధ్యాత్మికతను ఇంకా అతిశయింప చేయగలదా, లేదా అని విమర్శించాలి. అలాగే క్రొత్త రాజకీయ విధానాన్ని ప్రజలకు బోధించదలిస్తే ఆ విధానం వల్ల సమాజంలోని ఆధ్యాత్మిక

ప్రమాణాల యొక్క ఔన్నత్యాన్ని సాధించగలమా లేదా యని జాతి ఎదురు చూస్తుంది.

# మతం ఒక్కటే ఫలితాల్నివ్వలేదు

ముందు కడుపునిండా తిండి, తర్వాతనే మతం.

నేటి హిందూ సమాజం ఆధ్యాత్మిక జ్ఞానులకు అనుకూలంగా మాత్రమే వ్యవస్థీకరింపబడింది; మిగతా వారెవ్వరికి ప్రోత్సాహం లేదు. ఎందువలన? ప్రజల అల్పజ్ఞతను వినియోగించుకొని స్వల్పకాలిక సుఖానుభూతిని పొందదలచినవారు సాధించగల్గేదేమీ వుండదు. మన మతం అన్ని వర్గాల వారిని స్వీకరించినట్లే మన సమాజం కూడ అన్ని విధానాల వారికి అవకాశం ఈయాలి. దీన్ని సాధించాలంటే మతధర్మాల సమగ్ర అవగాహన, వాటిని సమాజానికి అనువర్తింపజేసే నైపుణ్యం అవసరం. ఈ కార్యక్రమం నిదానంగానైనా నిశ్చయంగా అమలు జరగాలి.

ఐతే వేదాంత పరిజ్ఞానం అంతగా లేనివారి విషయంలో సమాజావసరాలకు అనుగుణంగా మలచిన భౌతికవాదం శుభదాయకం కావచ్చు. కాని నిగూఢమైన ఆధ్యాత్మిక ధర్మ సూత్రాల్ని అవగాహన చేసికొనే యోగ్యతలేని వారిపై వాటిని ప్రయోగించటమనే పెద్ద తప్పిదాన్ని ఇతర దేశాలతోబాటు భారతదేశం కూడ చేయటం చాల విచారకరం. కాని, నా ఈ భావాన్ని మీరు సమర్థించాల్సిన అవసరం లేదు.

బీదలకు ఉపాధి కల్పించాలంటే భౌతికవాద ప్రభావితమైన నాగరికత, అంతేకాదు కొంత ద్రవ్యసమృద్ధి కూడ అవసరమే. నాకు ఈ లోకంలో సరిపడ తిండిని ప్రసాదించలేక స్వర్గంలో నిత్యానందాన్ని సమకూర్చే భగవంతునిపై నేను విశ్వాసముంచలేను. భారతదేశాన్ని ఉన్నత స్థితికి తీసికొని వెళ్లాలి. పేదజనానికి ఆహార మియ్యాలి, విద్యావ్యాప్తి సక్రమంగా జరగాలి, బ్రాహ్మణత్వ విధానాలకి స్వస్తిచెప్పాలి. సాంఘిక నిరంకుశ ఆధిపత్యం వుండకూడదు. సర్వజనులకు అధికాహారం, విస్తృతమైన జీవనోపాధి అవకాశాలు కల్పింపబడాలి.

సంఘశ్రేయస్కరమైన ఈ మార్పులు నిదానంగానైనా, మతం ద్వారా, సమాజ స్వేచ్ఛ ద్వారా సాధింపబడాలి. మన పాత మత విధానాల నుండి బ్రాహ్మణత్వాన్ని నిర్మూలించండి. మన మతం ప్రపంచమతాల్లోనే సర్వోత్కృష్టమైందిగా పరిణమిస్తుంది. హిందూమతం ద్వారా పాశ్చాత్య సమాజ నిర్మాణం సాధింపగలమా? తప్పక సాధించ గలమని నా విశ్వాసం.

ప్రస్తుత పరిస్థితులు సామ్యవాదం లేక ప్రజాస్వామ్య పరిపాలనకు అనుకూలంగా నడుస్తుండటం గమనిస్తాం. ప్రజలకు ఎలాగైనా తమ భౌతికావసరాలు తీరాలి; తక్కువ శ్రమ, అణచివేతకు గురికాకుండటం, అధిక ఆహారం, యుద్ధాలు లేని స్థితి సమకూరాలి. ఏ నాగరికతైనా మతం మీద ఆధారపడనంతవరకు, మానవుడు సత్ప్రవర్తకుడు కానంత వరకు స్థిరపడగలదని హామీ ఈయలేదు.

# స్త్రీ జనోద్ధరణ

భారతదేశానికి ఏదైనా మంచి జరగాలంటే స్త్రీ జనోద్ధరణ, జనచైతన్యం ప్రధానంగా సంభవించాలి. స్త్రీలకు ఉచితమైన గౌరవ ప్రతిపత్తినిచ్చుట వల్లనే ప్రపంచ జాతులు ఔన్నత్యాన్ని సాధించాయి. ఏ దేశమైతే స్త్రీలను గౌరవించదో ఆ దేశం ఉచ్చస్థితిని పొందలేదు.

# విద్య – మన ప్రాథమిక అవసరం

విద్య, విద్య, విద్య మాత్రమే – అనే నినాదం మారుమూలల్లో మారుమ్రోగాలి. ఐరోపాదేశంలో చాలా పట్టణాల్లో ప్రయాణం చేసి అచ్చటి బీద ప్రజలు కూడ అనుభ విస్తున్న సుఖమయ జీవితాల్ని, వారి విద్యా విజ్ఞానాన్ని పరిశీలిస్తున్నప్పుడు మనదేశం లోని పేద ప్రజల దుస్థితి స్మరణకు రాగా నా మనస్సు దుఃఖమయమైంది. వారి స్థితికి మన స్థితికి గల ఈ వ్యత్యాసానికి కారణం ఏమిటి? వారు విద్యావంతులు కావటం, మనం కాకపోవటమే. విద్య ఆత్మస్థైర్యాన్ని ఇస్తుంది. ఆత్మవిశ్వాసం ద్వారా ఆ దేశ ప్రజల లోని ఆత్మతత్త్వం (బ్రహ్మ పదార్థం) జాగృతమౌతోంది. కాని మనలోని ఆత్మతత్త్వం క్రమంగా నిద్రాణమౌతోంది.

సామాన్య ప్రజలను విద్యావంతులుగా జేసి వారికి తాము పోగొట్టుకొన్న వ్యక్తిత్వాన్ని సమకూర్చటమే వారికి మనం చేయవలసిన గొప్పసేవ. వారిని మనం భావుకులుగా చేయాలి. వారిచుట్టూ వున్న ప్రపంచంలో ఏం జరుగుతోందో వారు కళ్ళు తెరచి చూడగల్గాలి. చూచి పరిస్థితుల్ని అవగతం చేసికొని వారి విముక్తిని వారే సాధించుకునే కృషి చేస్తారు. ప్రతి పురుషుడు, ప్రతి స్త్రీ, ప్రతి జాతి తన విముక్తికి తానే పాటుపడాలి. వారికి భావచైతన్యాన్ని మాత్రం ఈయండి. అదే మీ నుండి వారు అభిలషించేది. ఫలితాలు క్రమంగా సహజశైలిలో సమకూరుతాయి. రసాయనాలను జోడించటం వరకే మన వంతు. సహజ పరిణామంలో వాటి రూపాల్ని అవి దిద్దుకుం టాయి. ప్రజల మస్తిష్కాల్లోకి ఆలోచనల్ని చొప్పించటం వరకే మన యత్నం; పర్యవ సానాలు వాళ్ళే సాధిస్తారు. ఇదే భారతదేశంలో జరగాల్సిన కార్యక్రమం.

సమస్యల్ని పరిష్కరించుకోగల్గటానికి అవసరమైన ఆరోగ్యకరమైన, పటిష్ఠమైన, ప్రజాభిప్రాయాన్ని తయారు చేయటానికి దీర్ఘకాలం పడుతుంది. అంతవరకు మనం వేచివుండాలి. సంఘసంస్కరణ సాధించాలంటే కొన్ని సమస్యల్ని అధిగమించాలి. కొంతమంది క్రొత్తదనాన్ని శంకించి, చెడును ఊహించి అవరోధాలు కల్పిస్తారు. కనుక జాతిని

విద్యావంతులుగా చేయాలి. దానికి కొంత సమయం అవసరం. ఏ విధంగా చూచినా సంఘ సంస్కరణను సాధించటానికి గూడ విద్య ప్రధానంగా ఆవశ్యకమని తెలుస్తుంది.

విద్య, విజ్ఞానాలు సామాన్యప్రజల్లో ఎంత ఎక్కువగా విస్తరిస్తే జాతి అంత అభ్యున్నతి సాధించినట్లు ఋజువౌతుంది. విద్య, విజ్ఞానాల్ని మొత్తం ఒక వర్గీయులు అధికార అహంకారాలతో సొంతం చేసుకోవటం భారతదేశానికి అమిత హాని కల్గటానికి ముఖ్యకారణం. మనం ఆ దుస్థితినుండి బయటపడాలంటే సామాన్య ప్రజల్ని విద్యావంతుల్ని చేయాలి.

# స్వావలంబనకు విద్య ఆవశ్యకత

మన గ్రామాల్లోని ప్రజలు తమను తాము ఉద్ధరించుకునే సామర్థ్యం లేని వారైనచో మొత్తం ప్రపంచంలోని సంపదనంతా వినియోగించినా ఒక గ్రామంలోని ప్రజలు కూడ ఉద్ధరింపబడరు. కనుక ప్రజల మధ్య నైతిక పరమైన, వైజ్ఞానిక పరమైన విద్యను విస్తరింపచేయటమే మన కర్తవ్యంగా చేపట్టాలి.

ఇచ్చి పుచ్చుకునే సిద్ధాంతం శ్రేయస్కరం. భారతదేశం తిరిగి పూర్వవైభవాన్ని సంతరించుకోవాలంటే తన సంస్కృతీ సంపదలను ప్రపంచదేశాలముందు ప్రస్ఫుటంగా ప్రకటించుకోవాలి, మన సంస్కృతిని వారిని తీసుకోనీయాలి. అట్లే ఇతర దేశాలిచ్చే వాటిని స్వీకరించుటకు మనం సంసిద్ధతను చూపాలి. విస్తరణ దృష్టి సజీవతకు చిహ్నము. సంకుచిత దృష్టి మరణ సదృశం. ప్రేమించటమే జీవితం; ద్వేషించటమే మరణం. మనం ఇతర జాతులను ద్వేషించటం ఆరంభించిన రోజునే మన జాతి మరణాన్ని ఆహ్వానించాం. మళ్లీ మనం మనవైఖరిని విస్తరించుకోగల్గితేనే తప్ప జాతి వినాశనాన్ని నివారింపలేము.

కనుక మనం ప్రపంచజాతులన్నిటితోను కలసి మెలసి జీవించటం అలవరచు కోవాలి. ఛాందస భావాలతో స్వార్థపరులైన వందల మంది ప్రజల కంటె ఇతర దేశాలలో పర్యటించటానికి వెళ్లే ప్రతియొక్క భారతీయుడు తన దేశానికి ఎక్కువ మేలును కల్గజేస్తాడు.

భారతదేశం మ్లేచ్ఛ శబ్దాన్ని సృజించి ఇతర జాతులతో వ్యవహరించటం మానిననాడే తన భవిష్యత్తుకు భరతవాక్యం పల్కింది.

ఆర్యులు, అనార్యులు అనే విభేదాన్ని సృష్టించి మన దేశం ఇతర ప్రపంచజాతుల్ని అనార్యులుగా పరిగణించి వారికి మన జీవిత ధర్మాల్ని, సంస్కృతీ సంపదల్ని అందు బాటులో వుంచకుండా పెద్ద తప్పిదం చేసింది. ఆ తప్పిదమే మన దేశ దైన్య స్థితికి, పతనానికి ప్రధాన

కారణమైంది. మనదేశం ముత్యపుచిప్ప పురుగులాగ తన గూటిలో తాను ముడుచుకొని ఏకాంతవాసం చేసే దౌర్బల్యాన్ని అవలంబించి దౌర్భాగ్య స్థితికి దిగజారింది. ప్రపంచదేశాల్తో సంబంధ బాంధవ్యాలు ఏర్పరచుకొని, ఇచ్చిపుచ్చుకునే సంస్కృతిని అలవరచుకోవాలి. శాస్త్రవిజ్ఞానాన్ని, సాంకేతిక విజ్ఞానాన్ని, ఇంకా ఇతర విషయాల్ని మనం పాశ్చాత్యదేశాల నుండి గ్రహించాలి. మనం వారికి మన మత ధర్మాల్ని, ఆధ్యాత్మిక విజ్ఞానాన్ని బోధించాలి. పరిపూర్ణ నాగరికత కోసం ప్రపంచ దేశాలన్నీ పరితపిస్తున్నాయి. భారతదేశాన్నుంచి మన ఆధ్యాత్మిక జ్ఞానం కొరకు, ఇతర సంస్కృతీ విలువల కొరకు ఆ దేశాలు ఎదురు చూస్తున్నాయి. దశాబ్దాలుగా మన దేశం దైన్యస్థితిని, పతనావస్థను చవిజూస్తున్నప్పటికి మన ప్రాచీనుల నుండి మనకు వరంగా సంక్రమించిన అద్భుతమైన ఆత్మజ్ఞాన సంపదను మాత్రం వదలకుండ రక్షించుకుంది. ఈ అమూల్యమైన సంపదను మన దేశం నుండి గ్రహించుట కొరకే ప్రపంచ దేశాలన్నీ మితిమీరిన ఉత్సుకత చూపిస్తున్నాయి. కనుక మనదేశ ప్రజలు ఇతర దేశాలకు వెళ్లాలి. వారి నుండి మనకు అవసరమైన, వారి వద్ద లభించే భౌతిక సంపదను స్వీకరించి దానికి బదులుగా వారికి మన ఆధ్యాత్మిక జ్ఞాన సంపదను ప్రదానం చేయాలి. ఆ విధంగా భౌతిక విజ్ఞానాన్ని గురించి నేర్చుకునే సందర్భంలో మనం పాశ్చాత్యులకు విద్యార్థులమైనప్పటికి ఆధ్యాత్మిక విలువలు వారికి బోధించే పరిస్థితిలో మనం వారికి బోధకులమౌతాము. సఖ్యత ఇరువురు సమాన హోదాగల వారి మధ్యనే ప్రవర్తిల్లాలి. ఆంగ్లేయునితోగాని, అమెరికా దేశస్థునితోగాని సమాన స్థాయిలో మనం వ్యవహరించాలంటే వారి వద్ద లభ్యమయ్యే విజ్ఞానాన్ని నేర్చుకుంటూ వారికి మన ఆర్ష సంపదయైన ఆధ్యాత్మిక విజ్ఞానాన్ని బోధించాలి. మన వద్ద నుండి వారు నేర్చుకోవాల్సిన ఆధ్యాత్మిక ధర్మాలు ఇంకా కొన్ని శతాబ్దాలవరకు సరిపోయే పరిమాణంలో వున్నాయి.

పాశ్చాత్య శాస్త్రవిజ్ఞానంతో బాటు మన వైదిక సంస్కృతిని జతపరచిన జీవన విధానం మనకు అవసరం. వాటితోబాటు బ్రహ్మచర్యం పాటించటం, శ్రద్ధ, ఆత్మవిశ్వా సాలు కూడ ఆవశ్యకం. అంతేగాక విదేశీయుల ప్రమేయం లేకుండా మన విజ్ఞానానికి సంబంధించిన వివిధ

శాఖల అధ్యయనం, ఆంగ్లభాష, పాశ్చాత్య విజ్ఞానము – వీటి అధ్యయనం కూడ మనకు అవసరం. ఆ విజ్ఞానంతో ప్రజలు స్వయంగా ఉపాధి కల్పించుకునే యత్నంలో పరిశ్రమల్ని ఏర్పరచుకొనవచ్చు. ఉద్యోగాలకు ఎగబడే అవసరం కల్పించుకోకూడదు.

సమత్వ భావంతో స్వేచ్ఛలోను, కృషిలోను, శక్తి యుక్తులలోను పాశ్చాత్యుల్లో పాశ్చాత్యుడవౌతూనే, మత ధర్మాల అనుసరణలో నూటికి నూరుపాళ్లు హిందువుగానూ ప్రవర్తించగలవా?

వ్యవస్థీకరణలోను, నాగరికతలోను పాశ్చాత్య భావాలు మన దేశంలో విరివిగా చొచ్చుకొని వస్తున్నట్లే, మన వేదాంత ధర్మాలు, ఆధ్యాత్మిక విజ్ఞానాలు పాశ్చాత్య దేశాల్ని ముంచెత్తుతున్నాయి. ఈ పరిణామాన్ని ఎవరూ నిరోధించలేరు. మనం కూడ పాశ్చాత్యుల కొన్ని తరహాల భౌతిక సిద్ధాంతాల్ని స్వీకరించకుండా వుండలేము. కొంత మోతాదులో వారి భౌతికవాదం మనకు శ్రేయస్కరమైనట్లే, మన ఆధ్యాత్మిక విజ్ఞానం కూడ కొంత పరిమితిలో పాశ్చాత్యులకు మేలు కల్గజేస్తుంది. ఆ విధంగా ప్రాక్ పశ్చిమ ప్రాంతాల మధ్య సమతుల్యం ఏర్పడుతుంది. ఆ విధంగా మనం పాశ్చాత్యుల విధానాలన్నింటినీ గ్రహించనవసరం లేదు. అలాగే పాశ్చాత్యులు కూడ మన ప్రత్యేక విజ్ఞాన రీతుల్ని అన్నిటినీ స్వీకరింప పనిలేదు.

ఒక బీదవాని జీవితం ఆధ్యాత్మిక, నైతిక ధర్మ సూత్రాలతో బంధింపబడింది. ఆ ధర్మసూత్రాలతో అతనికి ఏ విధమైన ప్రయోజనం లేదు. అది లేకుండా అతని జీవితం స్వేచ్ఛావాయువుల్ని పీల్చుకుంటుంది; సుఖమయమౌతుంది. ఒక క్రమ మార్గంలో అతడే ఉన్నతిని సాధిస్తాడు. విరాగియౌతాడు. ఈ జీవన సరళిలో మనం పాశ్చాత్యుల నుండి నేర్చుకోవాల్సినవి కొన్ని వున్నాయి. కాని వానిని అలవరచుకునే విషయంలో మనం జాగరూకత వహించాలి. ఇలా పాశ్చాత్యుల్ని అనుకరించిన వారిని కొంత మందిని ఉదాహరణగా పరిశీలిస్తే దాదాపు అందరూ జీవితంలో పరాజితు లైనవారేనని గమనిస్తాం. అయితే మన పురోగతిని రెండు అవరోధాలు అమిత ప్రమాద స్థాయిలో క్రుంగదీస్తున్నాయి.

అవి ఒకటి పాత ఛాందసవాదం, రెండవది ఆధునిక పాశ్చాత్య నాగరికత. ఈ రెంటిలో నేను పాత ఛాందసవాదాన్ని ఎన్నుకుంటాను. పాశ్చాత్య నాగరికతను కాదు.

భారతీయులం కొన్ని యుగాలుగా శ్రమపడి సంరక్షించుకొన్న అమూల్య విలువలను ఈ పాశ్చాత్య ప్రవృత్తి అనే ప్రభంజనం మొత్తం రూపుమాపేయగల ప్రమాదం లేకపోలేదు. నిజంగానే ఈ పాశ్చాత్య నాగరికత ఒక సుడిగుండంలాంటిది. దానిలో చిక్కుకొని మన భారతదేశం భౌతిక సుఖాల వలయం నుంచి బయటపడలేక తన నిజసంస్కృతిని విడనాడే అవకాశం కూడ వుంది. మనకు అసాధ్యమైన విదేశీయ జీవిత విధానాలను అనుకరించే యత్నంలో మన ప్రాచీన సత్సంప్రదాయాలను, ఆదర్శాలను పోగొట్టుకొని, మనకు అత్యంత ప్రీతికరమైన విషయాలను సైతం త్యాగం చేయాల్సిన ప్రమాదం కూడ పొంచివుంది.

ఈ విపత్తుల నుండి మనల్ని మనం రక్షించుకోవాలంటే మన విలువల్ని, మన సంప్రదాయ సంపదల్ని మనం అంచనా వేసుకొని, సామాన్య ప్రజలతో సహా భారతీయులమందరం జాగరూకతతో మెలగాలి. ఒక ప్రక్కన మన ప్రాచీన సంపదను సంరక్షించుకుంటూ, విదేశీయమైన, క్రాంతి పరమైన విజ్ఞాన వీచికలను ఆహ్వానించ వలసియుంటుంది. ప్రపంచం నలుమూలల నుండి ప్రసరించే కాంతి కిరణాల్ని మన శక్తి యుక్తులతో స్వాగతించాలి. వాటి నుండి దుర్భరమైనవి, దోషపూరితమైనవి వాటంతటవే నశిస్తాయి. పటిష్టమైనవి, ప్రయోజనకరమైనవి, నిత్యమైనవి మాత్రం సజీవంగా, శాశ్వతంగా నిలుస్తాయి.

ప్రపంచదేశాల్నుండి మనం నేర్చుకోవాల్సినవి ఇంకా కొన్ని వున్నాయి. భౌతిక విషయపరిజ్ఞానాంశాలు, వ్యవస్థీకరణను గురించి, అధికార వినియోగ సామర్థ్యాల విషయాలు, లఘుపరికరాల నుండి సదుపాయాలతో ఉన్నత ఫలితాలను సాధించే సందర్భంలోను మనం ఇతర దేశాల నుండి పాఠాలు నేర్చుకోవాలి. ఈ విషయాల్లో మనకు పాశ్చాత్యదేశాలు సహాయపడతాయి. కాని ఎవరైనా మనకు ఆహారవ్యవహారాలు, మనోరంజక కార్యకలాపాలు

– ఈ విషయాల్లో గాని బోధించటానికి, భౌతిక సంపదను దైవానితో పోల్చి దానికి సమున్నత స్థానాన్ని సమకూర్చుటకు ప్రయత్నిస్తే అట్టివారికి మన సమాజంలో స్థానం కల్పించం; అతని ఉపదేశాలు ఆలకించం.

నిగూఢమైన మన వేదాంత రహస్యాల్ని పశ్చిమ దేశాలకి బోధిస్తే బలిష్ఠమైన ఆ జాతుల యొక్క సానుభూతిని, ఆదరాభిమానాల్ని మనం పొందవచ్చు; ఆధ్యాత్మిక విషయాల్లో వారి బోధకులుగా కలకాలం గౌరవ స్థానాన్ని ఆక్రమించవచ్చు. ఆ జాతులవారు మనకు భౌతిక విషయ పరిజ్ఞానం విషయంలో బోధకులుగా ఎలాగూ కొనసాగుతారు. అలాగాక మన దేశీయులు ఆధ్యాత్మిక విషయాలను వారి హస్తగతం చేసి, మనం వారి పాదాల వద్ద కూర్చొని మత విషయాలను నేర్చుకోవాల్సి వచ్చిననాడు మన జాతి పతనం చెందటం, మన జాతీయత శాశ్వతంగా విచ్ఛిన్నం కావటం తథ్యం. కనుక దేశాల మధ్య ఇచ్చిపుచ్చుకునే కార్యకలాపాలు కొనసాగితే ఇరుపక్షాల వారి గౌరవమర్యాదలకు లోటు వుండదు. ఆ పరిస్థితుల్లో పశ్చిమ దేశాలు మనకీయ వలసిన వాటి విషయంలో మనం వారిని ప్రాధేయపడనవసరం లేదు. వారంతట వారే అన్నీ సమకూర్చుతారు. మన వేదాంత విషయ పరిజ్ఞానాన్ని, మత ధర్మాల్ని పాశ్చాత్య దేశాల్లో విస్తారంగా ప్రచారం చేయటం ద్వారా మన దేశం, ఆ దేశాలు కూడ అధికంగా లాభిస్తాయి. నా దృష్టిలో రాజకీయ వ్యాసంగం యొక్క ప్రాధాన్యత మత ప్రచారానికి లోబడే వుంటుంది. ఈ విశ్వాసాన్ని వమ్ముచేయకుండా ఫలదీకృతం చేయటానికి నేను అసువుల్ని అర్పించటానికి కూడ వెనకాడను. దీనికి భిన్నమైన కార్యక్రమం అమలు చేసి భారతదేశం యొక్క శ్రేయస్సును సాధించగల్గితే మీరు దాన్నే అనుసరించవచ్చు.

బాహ్య ప్రకృతిని లోబరచుకునే అంశంలో భారతదేశం ఐరోపాదేశాల ననుస రించాలి. ఆంతరంగిక ప్రకృతిపై విజయం సాధించాలంటే ఐరోపా వారు భారతీయు లను అనుగమించాలి. ఆ స్థితిలో హిందువులని, యూరోపియన్లని విడివిడి జాతులుం డవు. బాహ్య ప్రకృతిని, ఆంతరంగిక ప్రకృతిని జయించిన ఆదర్శవంతమైన మానవ జాతి ఒక్కటే

పరిఢవిల్లగలదు. మానవతలోని ఒక పార్శ్వాన్ని మనం వృద్ధి చేస్తే, రెండవ పార్శ్వాన్ని వారు పెంపొందించారు. ఈ రెండు పార్శ్వాల కలయికే మనం అభిలషించవలసిన గమ్యం.

# భారతీయ సాంప్రదాయాలతో నూతన భారతదేశం

నేటి సంఘ సంస్కర్తలందరికంటె భిన్నమైన సంస్కర్తను నేనేయని ఘంటా పథంగా వారి ముందు ప్రకటిస్తాను. వారు సంస్కరణ చాల తక్కువ పరిమాణంలో వుండాలని వాంఛిస్తారు. సంస్కరణ ఆమూలాగ్రంగా వుండాలని నేను పరితపిస్తాను. ఐతే సంస్కరణను సాధించే పద్ధతిలో మా మధ్య చాల తేడా వుంది. పూర్తి నిర్మూలనం పద్ధతి వారిదైతే, నిర్మాణాత్మక మార్గం నాది. అసలు సంస్కరణను నేను ఇష్టపడను; అభివృద్ధిని కాంక్షిస్తాను. నేను భగవంతుని స్థానంలోవుండి ప్రజలను 'మీరు ఈ మార్గంలో నడవండి, ఆ మార్గం వద్దు' అని శాసించలేను. కాని నేను రామాయణంలో ఉడుతలాగ ఉడతా భక్తితో నా వంతు శ్రమను దేశాభివృద్ధికై దానం చేస్తాను. అద్భుతమైన మన జాతి యంత్రాంగం యుగయుగాలుగా పనిచేస్తూ వస్తోంది. మహత్తరమైన మన జాతీయ జీవన స్రవంతి మన కళ్లముందు ప్రవహిస్తూ వస్తోంద జాతి నడక మంచిది కాదని గాని, అదిసరియైన మార్గంలో పోవటం లేదని కాని చెప్పటానికి సాహసించలేరు. జాతి జీవనానికి ఆవశ్యకమైన సామాగ్రిని సమకూర్చటం వరకే మనవంతు; జాతి ప్రగతిని తానే సాధించుకుంటుంది. జాతి అభివృద్ధి మార్గాన్ని ఎవరు శాసించలేరు. మన సమాజంలో లొసుగులు బహుళంగానే వున్నాయి. అలాగే ఇతర సమాజాల్లోను దోషాలు వుంటాయి. అందువలన దేన్నీ నిరసించలేము. దోషాలని ప్రతివాడు వేలెత్తి చూపించగలడు. కాని వాటి నివృత్తి మార్గాన్ని నిర్దేశించిన వాడే మానవ సమాజానికి నిజమైన శ్రేయోభిలాషి.

మీరు మన దేశ చరిత్రను చదివారా? భారతదేశంలో సంస్కర్తలకు లోటులేదని గమనించారా? రామానుజుడు, శంకరాచార్యులు, గురునానక్, చైతన్య మహాప్రభు, కబీరు, దాదు — వీరందరూ ఎవరు? వీరందరూ మహామహులైన ప్రబోధకులే. ఒకరి వెంట ఒకరు భారత దిఙ్మండలిలో తేజోమయంతో వెలుగొందిన ధృవతారలే. వారందరూ సమాజ వికాసానికై పాటుపడినవారే. వారి కృషి ఫలితాలు ఇప్పటికి కానవస్తున్నాయి. ఐతే ప్రస్తుతం

సంస్కర్తల విషయంలో వున్నట్లు వారికి ప్రచారార్భాటాలు శూన్యం. ఇప్పటి వారివలె వారు ఎన్నడూ సమాజాన్ని దూషించలేదు. నిరసనలకు బదులు వారు ఆశీస్సులనే సమాజంపై వర్షించారు. ప్రజలు దుష్ప్రవర్తకులని వారు ఎంచలేదు. వారి మంచితనాన్ని గుర్తించారు. ఇంతకంటె మంచితనాన్ని అలవర్చుకో వచ్చని నిర్దేశించారు. మన సహజత్వాన్ని కోలుపోకుండా అభివృద్ధిని సాధించాలి. పరదేశీయులు మనపై రుద్దిన విధానాలను అనుసరించుట వృధాప్రయాస. మనం మన విధానాలను విసర్జించి ఇతర జాతుల పంథాలో మెలగటం, సంచరించటం జరగని పని. దీనికి భగవత్కృపయే కారణం. నేను ఇతరజాతి వ్యవస్థలను నిరసించను. అవి వారి పరిస్థితులనుబట్టి వారికనుకూలమే; కాని మనకు కాదు. వారికి మంచి పోషకాహారమైనది, మనకు విషం కావచ్చు. ఇది మనం నేర్చుకోవాల్సిన ప్రథమ పాఠం. వారి ఇతరమైన శాస్త్రాలు, ఇతర వ్యవస్థలు, సాంప్రదాయాల నేపథ్యంలో వారి ప్రస్తుత విధానం రూపొందించబడింది. మనం మన సాంప్రదాయాలు, వేల సంవత్సరాల కర్మఫలాలు, పరిగణనలోనికి తీసికొని, మన ప్రవృత్తిని విడనాడకుండా మన వ్యవస్థను మనం నిర్మించుకోవాలి.

# ఉత్తేజపూరితులైన దేశభక్తులు మనకు అవసరం

ఆటబొమ్మలను ఆత్మీయంగా ప్రేమిస్తే అవి సజీవతను సంతరించుకోగలవని జపాన్ దేశంలోని ఆడపిల్లల దృఢవిశ్వాసం. ఆ దేశంలోని అమ్మాయి తన ఆటబొమ్మను ఎప్పుడూ పగులగొట్టదు. భారతదేశంలో కూడ ప్రజలను హృదయపూర్వకంగా ప్రేమిస్తే దేశం జాగృతిని పొందుతుంది. ప్రస్తుతమున్న లేమినుండి, దురదృష్ట పరిస్థితి నుండి, విచక్షణా రాహిత్యము నుండి, కరువుకాటకముల నుండి అసూయాభరితమైన స్థితి నుండి తేరుకునే అవకాశం జనిస్తుంది. ఉదారహృదయులైన స్త్రీ పురుషులు భోగలాల సతను విడనాడి త్యాగశీలతతో నిరాశ్రితులైన, అజ్ఞానాంధకారంలో కొట్టు మిట్టాడు తున్న కోట్లాది దీనజనుల దైన్యాన్ని, దౌర్భాగ్య స్థితిని చక్కదిద్దుటకు తమవంతు కృషి చేసిననాడే భారతదేశం జాగృతిని సాధించుకుంటుంది.

దేశభక్తులు కండు. గడచిన కాలంలో దేశ అభ్యున్నతికి, సౌభాగ్యానికి కారణభూత మైన మన జాతిని ప్రేమించండి; ఉద్ధరించండి.

దేశభక్తులారా! సంస్కర్తలారా! దేశం యొక్క యథార్థ స్థితిని గమనించండి. మహాపురుషులు, మహర్షులకు వారసులైన దేశప్రజలు ఇప్పుడు మూర్ఖులతో సహ జీవనం చేస్తున్నారు. దేశంలో పేదరికం కోట్లాది జనాన్ని పీడిస్తోంది. అజ్ఞానం కారుమేఘాల ఆకృతిలో ఆవరించివుంది. మీరీ పరిస్థితుల్ని గమనించి కలవరపడాలి; హృదయ స్పందనతో, వేదనతో ఆక్రోశించాలి. అప్పుడే నిజమైన దేశభక్తులౌతారు. అలా స్పందించి, శుష్కప్రియాలతో కాలయాపన చేయక, నిరసన వచనాలతో వారిని బాధించక, ఓదార్పుమాటలతో వారిని ఆదరించి, జీవన్మరణావస్థలో వున్న వారిని ఉద్ధరించటానికి కృషి చేయండి. అంతమాత్రాన సరిపోదు. మీ ఉద్యమంలో మీకు మీరు ఊహించని గరిష్ఠ పరిమాణంలో అంతరాయాలు రావచ్చు. యావత్ప్రపంచం మీకు ఎదురుగా నిలవవచ్చు; మీ కుటుంబ సభ్యులే మిమ్మల్ని

వ్యతిరేకించవచ్చు. మీ పేరు ప్రతిష్ఠల్ని, మీ మొత్తం సంపదను మీరు కోల్పోవచ్చు; ఇన్ని వ్యతిరేకతలను అధిగమించి మీరు విశ్వసించిన గమ్యాన్ని చేరటానికి సిద్ధపడి వున్నారా? ఎట్టి పరిస్థితుల్లోనూ పట్టువీడని పట్టుదల మీకు వుందా? ఈ శక్తుల్ని మీరు కూడగట్టుకుంటే మీలో ప్రతి ఒక్కరు అద్భుతాల్ని సాధిస్తారు.

# జాతినిర్మాణమునకు పూనుకొను వారికి నా సందేశం

ఉత్తేజితులైన యువకులను సమీకరించండి. వారిలో భావావేశాన్ని ప్రవేశ పెట్టండి. క్రమపద్ధతిలో ఆ వ్యవస్థను విస్తరిస్తూ, దాని పరిధుల్ని కూడ పెద్దవి చేయండి.

ఇప్పటి యువకుల మీద వారి ఆధునికత పైన నాకు పరిపూర్ణ విశ్వాసం వుంది. వారి నుండే నాకవసరమైన కార్యకర్తలు లభిస్తారు. వారు సమస్యల్ని సింహబలులై ఎదుర్కొంటారు.

సాహసికులైన యువకులారా! మీకు కావలసినవి మూడే విషయాలు : అవి ప్రేమ, నిజాయితి, సహనం. జీవితమంటే అభ్యున్నతి లేక విస్తరణ లేక ప్రేమ. ప్రేమమయమే జీవితం. ఇదే జీవిత పరమార్థం. స్వార్థపరత్వమే మరణం. ఇది ఇప్పటికే కాదు ఎప్పటికైనా సత్యమే. మనకు భావిలేదనుకున్నా, ఇతరులకు మంచి చేయటమే జీవితం, హాని సల్పటం మరణం. నీకు కన్పించే పశుప్రవృత్తిగల మానవుల్లో నూటికి తొంబది మంది మృతులే. ప్రేమించలేని మానవుడు జీవన్మృతుని క్రింద పరిగణింపబడుతాడు. నిరుపేదల కొరకు, అమాయక ప్రజల కొరకు, అణగద్రొక్కబడిన వారికొరకు వేదన చెందండి; పరితపించండి; భగవంతుని పాద సన్నిధిని మీ అంతర్గత వ్యధను వెల్లడించండి. తత్ఫలితంగా మీకు అజేయమైన శక్తి సామర్థ్యాలు, సహకారం సమకూరుతాయి. గత పది సంవత్సరాలుగా 'శ్రమించండి, పరిశ్రమించండి' అనే నినాదాన్ని ఇచ్చాను. ఇప్పటికీ అదే ప్రబోధాన్ని ఇస్తున్నాను. పిరికితనాన్ని విడనాడండి. మిన్ను విరిగి మీద పడుతుందని భయపడవద్దు. ధైర్యంగా ఎదుర్కుంటే అన్నిటిని వశం చేసుకోవచ్చు. సంపదవల్ల ప్రయోజనం లేదు. పేరు, కీర్తితో మనకు పనిలేదు. చదువుల వల్ల సాధించేదేమీ లేదు. కాని ప్రేమ అమూల్యమైంది. ప్రధానంగా నడతను నమ్ముకోండి. అదే దుర్భేద్యమైన కష్టాలనే కోట గోడలను కూడ ఛేదించి ప్రవేశమును సాధించగల్గుతుంది.

ధనికులైన వారిపై విశ్వాసముంచవద్దు. వారు మృత సదృశులేగాని, సజీవులు కారు. భగవంతునిపై విశ్వాసముంచి ఆత్మ విశ్వాసాన్ని వీడక శ్రమించే వినయశీలురైన క్రింది తరగతి

ప్రజలే ఏదైనా సాధించగలరు. వేరే వ్యూహరచనతో పనిలేదు. దీన జనులపై దృష్టి సారించండి. సహాయం కొరకు వేచి వుండండి. అది తప్పక లభిస్తుంది. నేను పన్నెండు సంవత్సరాలు ఈ కార్యభారాన్ని నెత్తిన వేసికొని పర్యటించాను. సంపన్నులు, గొప్పవారనుకునే వారి ప్రతి ఇంటికి వెళ్లాను. భూగోళంలో సగం భాగాన్ని పర్యటించి, హృదయ వేదనతో ఈ ప్రత్యేక భూభాగాన్ని చేరాను. భగవంతుడు కరుణామయుడు. ఆయన నాకు చేయూత నిస్తాడని తెలుసు. నేను ఈ నేలమీదే చలితోనో, ఆకలితోనో ఎక్కడో రాలిపోవచ్చు. కాని నా సందేశాన్ని మీరు అమలు చేయండి. బీదలపై కరుణ చూపండి. అమాయకులకొరకు, దీనజనుల కొరకు శ్రమించండి; వారిని ఉద్ధరించండి. పార్థసారథి కోవెలకు శ్రీఘ్రంగా వెళ్లండి. బీదలకు హితుడై, క్రింది స్థాయికి చెందిన గోపాలుర నాదరించి, హీనజాతివాడైన గుహుని కౌగలించుకొని, బుద్ధావతారంలో, ధనికుల ఆహ్వానాన్ని తిరస్కరించి, ఒక పతిత యొక్క ఆతిధ్యాన్ని స్వీకరించి ఆమెను ఉద్ధరించిన పార్థసారథికి సాష్టాంగపడి దీనజనోద్ధరణకై ఉద్యమించండి. పార్థసారథి దీనులకై అవతరించి వారిని కాపాడుట యందే ఆసక్తి కలవాడు. సంపన్నులు, గొప్పవారనుకునేవారు మనకొద్దు. హృదయం లేని మేధావులైన పత్రికా రచయితల్ని వారు ప్రకటించే పత్రికా వ్యాసాల్ని లెక్కచేయకండి. విశ్వాసం, సానుభూతి తీవ్రస్థాయిలో సంతరించుకొని, జీవన్మరణాలను గాని, ఆకలి చలి బాధలను గాని లక్ష్యపెట్టక భగవంతునిపై భారంవేసి, ఆయన నాయకత్వంలో లక్ష్యసాధనకు ఉద్యమించండి. మీకు తిరుగువుండదు. ఉద్యమంలో ఒకరు వెనుదీయ వచ్చు; మరొకరు సాహసించి పురోగమిస్తారు.

# వైరాగ్యం, సేవాతత్పరత – కీలకాంశాలు

మన విధానాన్ని సులభంగా వివరించవచ్చు. మన జాతీయ జీవిత ప్రక్రియను తిరిగి పటిష్ఠీకరించుకోవడమే అందులోని ప్రధానాంశం. బుద్ధుడు వైరాగ్యాన్ని బోధించాడు. భారతదేశం దాన్ని ఆలకించింది. కాని ఆరుశతాబ్దాలకాలంలో తిరిగిదాని పూర్వోన్నత స్థానాన్ని చేరింది. దానికి అసలు రహస్యం ఏమంటే భారతదేశం విషయ వాంఛా పరిత్యాగాన్ని దానితోబాటు సేవాదృష్టిని జాతీయ ఆదర్శాలుగా ఎంచుకోటమే. మనం ఇప్పుడు చేయాల్సిందల్లా ఆ మార్గాల్లో దేశాన్ని మరింత సౌష్ఠవపరచ టమే.

# స్వావలంబము, ఆత్మగౌరవం

భగవంతునిపై విశ్వాసం కంటె ముందు మనం ఆత్మ విశ్వాసాన్ని సమకూర్చు కోవటం ఉత్తమం. కాని మనం రోజురోజుకి ఆత్మవిశ్వాసాన్ని కోల్పోతున్నాం. ఈ విషయంలో నేను సంస్కర్తలతో విభేదిస్తాను.

మనం ముఖ్యంగా శ్రద్ధను సమకూర్చుకోవాలి. దురదృష్టమేమంటే భారతదేశం నుండి అది ఇంచుమించు నిష్క్రమించింది. ఆ కారణంగానే మనమీ దుస్థితిలో వున్నాం. శ్రద్ధ ఉండటం, లేకపోవటమనేదే వ్యక్తికి, వ్యక్తికి మధ్య వున్న వ్యత్యాసాన్ని సూచిస్తుంది. ఒక మనిషిని గొప్పవానిగా చేయటానికి, మరొకనిని దుర్బలునిగా, తక్కువస్థాయి వానినిగా చేయటానికి శ్రద్ధే కారణం. ఎవరైతే తాను దుర్బలుణ్ణని భావిస్తాడో వాడు బలహీనుడుగానే తయారౌతాడని మా గురువులు చెప్పేవారు. అది యథార్థం. ఆ అకుంఠిత శ్రద్ధ మీ అందరిలోను ప్రవేశించాలి. పాశ్చాత్య జాతులు భౌతిక సంపదను విశేషంగా సమకూర్చుకున్నారంటే దానికి వారి శ్రద్ధే ప్రధాన హేతువు. వారు వారి దేహబలం మీద విశ్వాసం నిల్పుకొని వ్యవహరిస్తారు. మీరు కూడ మీ ఆత్మబలాన్ని నమ్ముకుంటే వారి కంటే అధిక ఫలాల్ని సాధించవచ్చు.

# ఇనుమడించిన కృషితత్పరత

శక్తి, స్వతంత్ర పిపాస, స్వావలంబము, అచంచలమైన మనస్థైర్యం, క్రియా నైపుణ్యం, ఐక్యలక్ష్యం, అభ్యున్నతిపై తీవ్రతృష్ణ – ఇవన్నియు మనకు అత్యావశ్య కములు. గతంలోకి కూడ వీక్షిస్తూ, విస్తరించిన దృక్పథంతో ముందుకు సాగాలి. ఇనుమడించిన ఉత్తేజంతో, అతిశయించిన శ్రమాతత్పరతతో కార్యదీక్షకు సన్నద్ధులు కావాలి.

ఏ మానవున్నైనా, ఏ జాతినైనా ఉన్నత స్థితికి చేర్చటానికి ముఖ్యంగా ఈ క్రింది మూడు విషయాలు అత్యవసరం:

1. మంచికి గల శక్తి పై సంపూర్ణ విశ్వాసం,
2. అసూయాద్వేషాలను విసర్జించటం
3. మంచి వారికి, మంచి చేయటానికి యత్నించే వారికి చేయూతనియ్యటం.

స్వభావ సిద్ధంగా మనకు వ్యవస్థీకరణ విషయంలో సామర్థ్యం పూర్తిగా లేదనే చెప్పాలి. ఆ సామర్థ్యాన్ని కల్గజేయాలి. అసూయారహితమైన ప్రవర్తన చాల అవసరం. తోటి సహచరుల అభిప్రాయాలకి విలువ నిచ్చి సామరస్య ధోరణిలో నడచుకొనుట శ్రేయస్కరం.

ఆంగ్లేయుల నుండి మనం కొన్ని మంచి విషయాలు నేర్చుకోవటం అత్యావశ్యకం. నాయకులను అవశ్యం అనుసరించుటలోను, అసూయను విడనాడుట యందు, కార్యసాధనలో సడలని పట్టుదల ప్రదర్శించుట యందు, ఆత్మవిశ్వాసంలోను మనం ఆంగ్లేయుల్ని ఆదర్శంగా తీసుకోవాలి. ఒక పనికై ఆంగ్లేయుడు తన నాయకుని ఎన్నుకొన్న క్షణం నుండి కష్టసుఖాల్లో అతనిని విడనాడకుండా అతన్నే అనుసరిస్తాడు. మన దేశంలో దానికి భిన్నంగా ప్రతివ్యక్తి తాను నాయకుని హోదాలో ఉండటానికి అభిలషిస్తాడు. అనుసరించే వాళ్లు ఎవరూ లభించరు. కాని ప్రతివాడు తానుగా ఆజ్ఞలు ఇచ్చేముందు, ఇతరుల

ఆజ్ఞలను పాటించటం నేర్చుకోవాలి. అసూయను త్యజించి, నాయకుని అనుసరించటం తెలియనంతవరకు, మనకు వ్యవస్థీకరించుకునే సామర్థ్యం లభించదు. ఆ పరిస్థితుల్లో మనం అస్తవ్యస్తమైన జనసమూహంగా వుంటూ నిష్ప్రయోజకులుగా మనవలసినదే. అదే స్థితి ప్రస్తుతం కొనసాగుతోంది.

ఇక్కడున్న ప్రతివ్యక్తి ఆత్మవిశ్వాసంతో, దూరదృష్టితో, పట్టుదలను వీడక, కార్యసాధనకు పూనుకోవాలి. ఇతర జాతుల వలెనే క్రాంతి పథంలో ముందుకు పోతూ, మన సంప్రదాయాలను విడనాడకుండా దృఢచిత్తంతో మనం జీవిం చాలి.

# శ్రమ జీవులు ఉన్నతి సాధిస్తారు

మానవ సమాజం బ్రాహ్మణ, క్షత్రియ, వైశ్య, శూద్రులను నాల్గువర్ణాల వారి అధ్వర్యంలో నడుస్తోంది. ప్రతివారి హయాంలోను దాని గొప్పతనంతోబాటు లోపాలు కూడ వున్నాయి. బ్రాహ్మణుల హయాంలో వారసత్వపు వాదనల ఆధారంగా ఏర్పడిన స్వప్రమేయ సంకుచితతత్వం ప్రబలుతుంది. బ్రాహ్మణులు, వారి వారసులు ఒక రక్షణ వలయాన్ని నిర్మించుకొని, విద్యా, విజ్ఞానాలు వారి సొంత సొత్తుగా భావించి, ఆ విజ్ఞానాన్ని అభ్యసించే యోగ్యత ఇతర వర్ణాల వారికి లేదని తమమాట సాగించు కొంటారు. ఐతే వారి ఆధిపత్యం ప్రబలిన కాలంలో విజ్ఞాన శాస్త్రాలకి పునాది వేయ బడుతుంది. బ్రాహ్మణులు మనోవికాసానికి కృషిచేసి, దాని బలంతోనే పరిపాలన సాగిస్తారు.

క్షత్రియుల (సైనిక) పరిపాలనను పరిశీలిస్తే, అది నిరంకుశమైంది, కఠినమైంది అని చెప్పక తప్పదు. ఆ కాలంలో కళలు, సామాజిక సంస్కృతి తేజోవంతంగా విరాజిల్లుతాయని చెప్పవచ్చు.

వాణిజ్యపరమైన (వైశ్యుల) పరిపాలన గురించి విచారిద్దాం. ఆర్భాటరహితంగా సమాజాన్ని పీల్చిపిప్పి చేసే రీతిలో భయావహంగా ఈ పరిపాలన పరిణమిస్తుంది. ఐతే ప్రతి వ్యాపారి తన కొరకు అన్ని ప్రదేశాల్లో పర్యటిస్తాడు గనుక అతని ద్వారా అంతకుముందు సాగిన రెండు వ్యవస్థల్లోని పరిణామాలు విస్తృతంగా ప్రచారం జరుగుటకు మంచి అవకాశమేర్పడుతుంది. వ్యాపారులు క్షత్రియుల కంటెగూడ ఎక్కువ కలిమిడి ప్రదర్శిస్తారు. కాని వీరి హయాంలో సంస్కృతి క్రమంగా క్షీణిస్తుంది.

చివరిగా శూద్రుల (శ్రమజీవుల) అధ్వర్యం వస్తుంది. భౌతిక సుఖాలు అందరకు అందుబాటులో లభించటం ఇది సమకూర్చే అత్యధిక ప్రయోజనం. వీరి కాలంలో సంస్కృతి ఇంకా దిగజారటాన్ని గమనిస్తాం. ఇది ఈ హయాంలో వాటిల్లే ప్రధాన నష్టం. సామాన్యమైన

చదువులు ఎక్కువ మందికి లభ్యమౌతాయి. అసాధారణ ప్రతిభగల వారి సంఖ్య తగ్గుతుంది.

ఇందులో మొదటి ముగ్గురి ఆధిపత్యాలు ముగిసినాయి. ఇప్పుడు నాల్గవ వర్గంవారి సమయం ఆసన్నమైంది. వారీ అవకాశాన్ని పొందితీరాలి. ఎవరూ దాన్ని నిరోధించలేరు.

వారికున్న శ్రామికతత్వంతో శూద్రులు పైకి వచ్చే సమయం దగ్గరలోనే వుంది. ఐతే ప్రస్తుతం వీరు క్షత్రియులవలె, వణిజులవలె ప్రవర్తించి పెద్దవారౌతున్నారు. అలాగాక వీరు తమ సహజశైలిలో శ్రామికులుగానే నడుచుకుంటూ ప్రతిదేశంలోను తమ ఆధిపత్యం నెరపుతారు. పాశ్చాత్య దేశాల్లో ఈ నూతన శక్తి యొక్క శుభోదయ చిహ్నాలు ఇప్పటికే పొడసూపినాయి. అక్కడి మేధావులు ఈ నూతన పరిణామాన్ని గురించి యోచిస్తూ అవగాహన కాని స్థితిలో కలవరపడుతున్నారు. సామ్యవాదం, అరాచకత్వం, తీవ్రవాదం, ఇంకా ఇలాంటి ఇతర వాదాలు రానున్న సాంఘిక విప్లవానికి నాందీ ప్రస్తావనలుగా ముందుకు చొచ్చుకొచ్చాయి.

ప్రపంచంలో రానున్న సంఘటనల ఛాయలను నేను చూడగల్గుతున్నాను. మీకు కనబడుటలేదా? భగవంతుని కృపవలన, కొన్ని సంవత్సరాలుగా నేను చేస్తున్న పరిశీలన వలన నా దృష్టికి రాబోయే ఘటనలన్నీ గోచరిస్తున్నాయి. పర్యటన, పరిశీలన వీటి సాధన ద్వారా ఖగోళ శాస్త్రవేత్తలు దూరదర్శిని సహాయంతో తారల చలనాన్ని దర్శించినట్లు, నేను ప్రపంచంలో జరిగే కదలికలను వీక్షించగల్గుతున్నాను. కార్మికవర్గం (శూద్రులు) యొక్క అభ్యున్నతి ముందుగా రష్యా దేశంలోను, తర్వాత చైనాలోను ఉత్పన్నమౌతుంది. తర్వాత భారతదేశంలో ఇది సంభవించి భావి ప్రపంచ రాజకీయ రంగాన్ని ప్రభావితం చేస్తుంది.

బ్రాహ్మణుల కాలంలోని విజ్ఞానం, సైనిక (క్షత్రియుల) పాలనలోని సంస్కృతి, సంపదను ప్రజలకు అందచేసే వైశ్యుల ప్రవృత్తి, శూద్రుల (శ్రామికుల) సామ్యవాద అనుసరణ – ఈ అంశాలు నిర్వికల్ప ధోరణిలో అమలు జరిగితే అది ఆదర్శమైన ఆధిపత్యంగా

పరిఢవిల్లుతుంది. కాని అది సాధ్యమా?

ఇతర విధానాలన్నీ అమలు జరుపబడ్డాయి; వాటి లోపాలను చవిచూచాము. మనమిప్పుడీ నూతన విధానాన్ని ప్రయోగించుకుందాం. దాని యొక్క నూతనత్వమే దాని ప్రధాన ఆకర్షణ. ఒకే వర్గ ప్రజలు సుఖదుఃఖాల్ని అనుభవించటం కంటె, వాటినే ప్రజలందరి భాగస్వామ్యంలో అనుభవించటం యుక్తం గదా. ప్రపంచంలో ఉండే మంచిచెడుల మొత్తాన్ని అంచనా వేస్తే అది ఎప్పుడూ ఒకటిగానే వుంటుంది. కాని క్రొత్త విధానాలు మారుతూ వస్తుండటం వల్ల వాటి భారం వహించవలసిన బాధ్యత చేతులు మారుతుంటుంది.

# క్రొత్త భారతదేశం

నూతన భారతదేశం ఉద్భవించాలి. హలాన్ని చేత ధరించిన కర్షకుని నివాసం నుండి, బెస్తవాని పూరిగుడిసె నుండి, చెప్పులు కుట్టువాని వృత్తి నుండి, పారిశుద్ధ్యం చేయువాని శ్రమ నుండి నూతన కాంతులలో భారతదేశం విరాజిల్లాలి. పచారి షాపులతో, బజారులో తిరిగి విక్రయించే ఆహారపదార్థాల షాపుల సందడితో, భారత దేశం ఆవిర్భవించాలి. ఇంకా, కర్మాగారాలు, బజార్లు, తోటలు, అరణ్యాలు, కొండలు, గుట్టలు – ఈ సముదాయంతో కూడ క్రొత్త భారతదేశం కళకళలాడాలి. దేశంలోని సామాన్య ప్రజలందరూ వేలసంవత్సరాలుగా అణచివేతకు గురియైనారు. ఏ విధమైన అసంతృప్తిని ప్రకటించకుండా, దానిని వారు అనుభవించారు. తత్ఫలితంగా వారికి అచంచలమైన సహనశీలత అలవడింది. వారు చిరకాలం దైన్య స్థితిని అనుభవించిన కారణంగా వారి పటిష్ఠత ఇనుమడించింది. స్వల్ప ఆహారంతో జీవిస్తూ కూడ వారు మొత్తం ప్రపంచాన్ని కుదిపివేయగలరు. వారికి రొట్టెలో సగం ఇచ్చినా చాలు, వారి శక్తిని నిరోధించటం ప్రపంచం వల్ల కాదు. రక్తబీజ రక్కసి యొక్క శక్తితో సమమగు సౌష్ఠవాన్ని వీరు కల్గి వుంటారు. పవిత్రమైన నైతిక, ధార్మిక జీవన విధానం ద్వారా వారు పొందిన అత్యద్భుత బలపరాక్రమాలు ప్రపంచంలో మరొక చోట మనకు కన్పించవు.

ఆ ప్రశాంతత, ఆ సంతృప్తి, ఆ ప్రేమ, ఆ నిరాడంబర నిర్విరామ కృషి, కార్యాచరణపట్ల వారు ప్రదర్శించు బలాధిక్యత మనం మరొక చోట చూడము. గతంలో వారు శల్యావశిష్టులే. ఐనా భావి భారత వారసులుగా వారిప్పుడు సౌభాగ్యవంతులు.

# ఈ రోజు అందరి దృష్టి భారతదేశం మీదే

భారతీయత నశించవలసిందేనా? అలా జరిగితే ప్రపంచం నుండి తాత్త్విక ప్రవృత్తి నిష్క్రమించినట్లే; ధార్మిక దృష్టి మూలబడినట్లే; మతం పట్ల పెరిగిన ప్రసన్నత రూపుమాసినట్లే; ఆదర్శ జీవనానికి ఇక తావుండదు. వీటన్నిటి స్థానంలోను విషయ వ్యామోహం, భోగలాలస స్త్రీ పురుష దేవతలవలె తాండవిస్తాయి. ధనం పౌరోహిత్యం నెరపుతుంటే, మోసం, దౌర్జన్యం, పోటీతత్వం క్రతువులుగా రూపుదిద్దుకుంటాయి; ప్రజల ఆత్మలే దేవతల కర్పింపబడే వస్తువులవుతాయి. కాని ఆ పరిస్థితి ఎన్నటికి సంభవించదు. త్యాగం యొక్క శక్తి క్రియాశక్తి కంటే కొన్ని వేల రెట్లు అధికం. అలాగే ప్రేమ యొక్క శక్తి సౌష్ఠవాల ఎదుట ద్వేషభావానికి వున్న శక్తి నామ మాత్రమే.

దేశాన్ని ఆవరించి, దీర్ఘకాలం పీడించిన కారుచీకట్లు తొలగిపోతున్నట్లే. దౌర్భాగ్య పరిస్థితి అంతమౌతున్నట్లే. చరిత్రకు కూడ అందని దుఃఖభాజనమైన గతం, జన చైతన్యంతో, విజ్ఞాన వికాసంతో నూతన తేజాన్ని సంతరించుకుంటుంది. హిమా లయాల నుండి వీచే పిల్లవాయువుల్లాగా ఈ నూతన స్ఫూర్తి చేష్టలుడిగి నిర్జీవములైన ప్రజల ప్రాణాలకు జవసత్వాలను, పుష్టిని ఇస్తుంది. ప్రజలు నిష్క్రియత్వాన్ని విడనాడు తున్నారు. దేశ జాగృతిని పరికించలేని వారు గ్రుడ్డివారైనా కావాలి లేక మూర్ఖులైనా కావాలి. మన మాతృదేశం తన దీర్ఘనిద్ర నుండి మేల్కొంది. ప్రగతిపథంలో అడుగు పెట్టింది. దాని పురోగతిని ఏ శక్తీ నిరోధించలేదు.

ప్రాచీన కాలంలో మనం గర్వించదగ్గ మంచి విషయాలు కోకొల్లలు. ఐతే చెడు విషయాలు కూడ లేకపోలేదు. ఆ మంచి విషయాలన్నిటిని మనం భద్రపరచు కోవాలి. నేటి భారతం ప్రాచీన భారతం కంటె అధికమైన సౌభాగ్య సంపన్నతలను, సత్సంప్రదాయాలను సంతరించుకోవాలి.

మన గతం చాల సుసంపన్నమైందే, అనుమానం లేదు. కాని భావిభారత దేశం ఇంకా అధికమైన ఔన్నత్యాన్ని పొందాలి.

మనం ప్రగతిలో శిఖరాల్ని చేరతాం; కండబలంతోకాదు, తాత్త్విక జ్ఞాన స్తోమతతో; హింసాత్మక చర్యలతో కాక, శాంతిపథంలో, ప్రేమమార్గంలో; సంపదల నాశ్రయించికాదు, సన్యాస వేషంలో భిక్షాటన పాత్ర యొక్క శక్తితో మాత్రమే. మన మాతృమూర్తియైన దేశమాత తన పూర్వ వైభవాన్ని సంతరించుకొని చైతన్యవతియై, ఉజ్వల రూపంతో రత్నఖచిత సింహాసనాన్ని అధిష్ఠించి వెలుగొందుతున్న దృశ్యం నా కళ్లకు కట్టినట్లు కానవస్తోంది. ఆమెను గురించి ప్రపంచం ముందు శాంతిమయ ఆశీస్సులతో ప్రకటిద్దాం.

ప్రపంచంలో విజేతలైన జాతులు చాలావున్నాయి. మనమూ ఘనమైన విజేతలమే. ఐతే మన సార్వభౌముడైన అశోక చక్రవర్తి వివరించినట్లు మన విజయ చరిత్ర మతానికి సంబంధించింది, ఆధ్యాత్మికతకు సంబంధించింది. భారతదేశం ప్రపంచం మీద మళ్లీ విజయం సాధించాలి. మనమందరం ఆ లక్ష్యసాధనకై నడుం కట్టాలి. మన సర్వస్వం ఒడ్డాలి. మన ఆధ్యాత్మిక బలమే మనం ప్రపంచంపై ఆధి పత్యం సాధించటానికి సాధనం కావాలి. ఈ నేలమీదనే ప్రప్రథమంగా ప్రకటించినట్లు ప్రేమ ద్వేషాన్ని జయించి తీరవలసిందే; కాని ద్వేషం తన్నుతాను నిర్జించుకోలేదు. భౌతికవాదం, అది సృష్టించే యీతి బాధలు భౌతికవాదం ద్వారా విముక్తి పొందలేవు. సైనిక బలం మరొక సైన్యం మీద విజయం సాధించే ప్రయత్నంలో సైన్య సమూహాల సంఖ్యను ద్విగుణీకృతం చేసి, మానవుల్ని పశువుల్నిగా మారుస్తుంది. పాశ్చాత్యుల్ని మనం వశం చేసుకోవాలంటే అది మన ఆధ్యాత్మికత ద్వారానే సాధ్యం. పాశ్చాత్యులు తాము జాతులుగా స్థిరపడటానికి తాత్త్విక జీవన విధానమే శరణ్యమని తెలిసి కుంటున్నారు. ఆ దిశలో వారు ఆసక్తితో ఎదురు చూస్తున్నారు. కాని మన వేదాంత ధర్మాల్ని ప్రపంచం నలుమూలల పర్యటించి ప్రబోధం చేసే వారేరి? మన ఋషులు అందించిన తాత్త్వికధర్మ సూత్రాల్ని ప్రచారం చేయటానికి సాహసికులు, త్యాగమూర్తులు, సేవాతత్పరులు కావాలి.

ప్రపంచం మన తాత్త్విక విజ్ఞానాన్ని వాంఛిస్తోంది. అది లేక పోతే, వాటి నశింపు తథ్యం. ప్రస్తుతం ప్రపంచం ఒక అగ్నిగోళం మీద నిలబడివుంది. ఆ అగ్నిగోళం ఏ నిముషంలోనైనా బ్రద్దలు కావచ్చు. పాశ్చాత్యులు శాంతి విరామాల కొరకు ప్రపంచం అన్ని మూలల వెదికారు. కాని అవి ఎచ్చటనూ లభించలేదు. వారు ప్రాపంచిక సుఖాల్లో మునిగి తేలారు. కాని అవన్నియు వ్యర్థమైన ఆడంబరాలే యని గ్రహించారు. కనుక భారతదేశం తన తాత్త్విక భావాల్ని పాశ్చాత్యుల హృదయాల్లో చొప్పించాలంటే ఇదే మంచి అనువైన సమయం. మనం ప్రపంచ దేశాల్లో పర్యటిం చాలి; మన వేదాంతాన్ని, తాత్త్విక విజ్ఞానాన్ని వారికి బోధించి వారిని మన సంస్కృతివైపు మరల్చాలి. ఈ కార్యక్రమం మనం విధిగా చేపట్టితీరాలి; దీనికి ప్రత్యామ్నాయం మరొకటి లేదు.

చాలా పురాతనకాలంలో భారతదేశ తత్త్వజ్ఞానం గ్రీకు శక్తులకు పరిచయం చేయబడ్డది. దాని ఫలితంగా పారశీకులు, రోమన్లు అను గొప్ప జాతులు ఆవిర్భవిం చాయి. అలెగ్జాండరు దండయాత్రల తదనంతరం, ఈ రెండు జాతులు జలపాతాల వలె ఘర్షణమార్గంలో విజృంభించి సుమారు సగం భూభాగాన్ని క్రైస్తవ మతంలాంటి తాత్త్విక సిద్ధాంతాలతో ముంచెత్తాయి. ఇదే రీతిలో మరియొక మేళవింపు ద్వారా అరేబియా యొక్క అభ్యున్నతి, సౌభాగ్యం ఫలించాయి. తద్వారా ఆధునిక ఐరోపా నాగరికతకు పునాది ఏర్పడింది. ఈ ఘటనలన్నీ పరిశీలిస్తుంటే ఈ రెండు అతి గొప్పవైన శక్తులు సమ్మేళనం చెంది వికసించే సమయం మన తరంలోనే సంభవ మనిపిస్తుంది. ఈ పర్యాయం ఈ సంచలన సంఘటనకు భారతదేశం కేంద్రం అవుతుంది.

# విద్య – సర్వసమస్యా పరిష్కారిణి

## విజ్ఞానం – వ్యక్తికి ప్రకృతి సిద్ధం

మనం మానవునకిది తెలుసు అని చెప్పినపుడు మానసిక శాస్త్రపరిభాషలో దాని వివరణ ఇలా వుంటుంది. ఆ వ్యక్తి తన పరిశోధన ద్వారా లేక అంతవరకు ప్రచ్ఛన్నంగా వున్న దాన్ని బహిర్గతం చేయటం ద్వారా ఆ విషయ పరిజ్ఞానాన్ని పొందాడు. మన ఆత్మ అంతులేని జ్ఞాన సంపదని తనలో ఇముడ్చుకొన్న ఒక గని. ఆత్మకు ఆవరించిన కప్పును తొలగించుట ద్వారా పరిశోధనాపూర్వకంగా ఒక విషయాన్ని గూర్చి తెలిసికోవటమే నేర్చుకోవటం అవుతుంది.

న్యూటన్ మహాశయుడు భూమ్యాకర్షణ శక్తిని కనిపెట్టాడంటాం. అంటే ఆ ఆకర్షణశక్తి న్యూటన్ కోసం ఎదురుచూస్తూ గదిలో ఒక మూల దాక్కొని వుందా? కాదు. అది అతని మనస్సులోనే వుంది. దాని సమయం వచ్చింది; ఆ ఎరుకను ఆయన ఆవిష్కరించాడు. ప్రపంచంలో విస్తరించి ఉన్న విజ్ఞానానికి మనస్సే నిలయం. విశ్వ సంబంధమైన అంతులేని గ్రంథాలయం మన మనస్సులో ఇమిడి వుంది. బాహ్య ప్రపంచం సమకూర్చే సూచన, అవకాశాలు నీ మనస్సును నీవు అధ్యయనం చేసి కోటానికి ప్రేరణ కల్పిస్తాయి. కాని నీవు అధ్యయనం చేసే వస్తువు నీ మనస్సు మాత్రమే. చెట్టు నుండి పడిన ఆపిల్ ఫలం న్యూటన్‌కు ప్రేరణ ఇచ్చింది. దానిపై అతడు తన మనస్సును అధ్యయనం చేశాడు. ఆయనకు అంతకు పూర్వమున్న మనస్సు లోని భావపరంపరను నూతన సరళిలో సంకలిత పరిచాడు. తద్వారా ఆయనకు క్రొత్త అనుసంధానం లభించింది. దానినే మనం భూమ్యాకర్షణశక్తి అంటున్నాం.

అది ఆ ఫలంలోగాని, భూమి యొక్క కేంద్రంలోగాని వున్న విషయం కాదు.

కనుక విజ్ఞానమనేది, భౌతికమైందిగాని, తాత్త్వికమైందిగానీ, మానవుని మస్తిష్కంలోనే వుంది. చాలా విషయాల్లో అది కనుగొనబడటం లేదు; అది ఒకదానిచేత ఆవరింపబడి వుంటుంది. ఆ ఆవరణను నిదానంగా తొలగించాలి. అలా తొలగించే ప్రక్రియనే మనం అధ్యయనం అంటాం. ఆ మూతను ముందుగా తొలగించటం ద్వారా విజ్ఞానం మనకు లభ్యమౌతుంది. ఏ వ్యక్తి నుండి అజ్ఞానమనే ముసుగు తొలగింపబడుతుందో అతడే ఇతరుల కంటె ఎక్కువ జ్ఞానం కలవాడుగా పరిగణింప బడతాడు. ఎవరి యొక్క ముసుగు మందంగా వుండి ఆవరింపబడివుంటుందో అతడే అజ్ఞాని. ఎవరి విషయంలో ముసుగు పరిపూర్ణంగా తొలగింపబడి వుంటుందో ఆయనే మహాజ్ఞాని, సర్వం ఎరిగినవాడు. అలా సర్వజ్ఞులైన మహామహులు మనకున్నారు; ఇప్పటికి వుంటారు; ముందు జన్మలో కూడ బహుళ సంఖ్యలో వారు వర్ధిల్లుతారు.

# విద్య యొక్క సారాంశం

మానవునిలో సహజసిద్ధంగా కొన్ని పరిపక్వతలు వుంటాయి. వాటికి ప్రదర్శనా యోగ్యత నిచ్చుటయే విద్య. ఐతే ఆ మార్గంలోని అవరోధాల్ని తొలగించుట మాత్రమే ఉపాధ్యాయుని ఏకైక కర్తవ్యం.

నిజమైన విద్యను మనమింతవరకు భావించి రూపొందించలేదు. నేను దేన్నీ నిర్వచించను. ఐనా నా అభిప్రాయంలో విద్య అంటే ఒక సామర్థ్యాన్ని అభివృద్ధి చేయ టమే. అంతేకాని మాటలను ఏర్చికూర్చటం కాదు. వ్యక్తులకు సరియైన క్రమంలో, ఫలప్రదమైన తీర్మానాలు తీసికొనుటకు ఇచ్చే శిక్షణ అంతకంటే కాదు.

యాంత్రికంగా నడిచే పెద్ద నావగాని, రైలు ఇంజనుగాని మేధాశక్తి లేకుండానే కదుల్తాయి, మలుపులు తిరుగుతాయి, వేగంగా పరుగెత్తుతాయి. ఒక చిన్న కీటకం కూడ రైలు దగ్గర సంచరిస్తూ, రైలు క్రింద పడకుండా దూరంగా కదలి ప్రాణాన్ని రక్షించుకుంటుంది. దానికి ఆలోచనాశక్తి వుందా? యంత్రంలో మనస్సు ప్రదర్శింప బడదు. యంత్రం ఎన్నడూ చట్టాన్ని అతిక్రమించాలని సంకల్పించదు. కాని కీటకం చట్టాన్ని వ్యతిరేకించాలని అభిలషిస్తుంది; ఆ ప్రయత్నంలో అది జయం సాధించవచ్చు, సాధించలేకపోవచ్చు. కాబట్టి కీటకానికి సంకల్పించే మనస్సు వుందని వ్యక్తము. అలాగే సంకల్పాన్ని జయప్రదం చేసుకోగల్గిన జీవికి ఉన్నత స్థాయి, ఇనుమడించిన సౌఖ్యము ప్రాప్తిస్తాయి. దేవుని యొక్క సంకల్పము పరిపూర్ణంగా ఫలప్రదమౌతుంది. కనుక ఆయన సర్వోన్నతుడు.

విద్యాభ్యాసం అంటే ఏమిటి? కేవలం పుస్తక పఠనమా? కాదు. ఐతే వైవిధ్యమైన విజ్ఞాన సేకరణమా? అదీకాదు. సంకల్పం యొక్క భాషణను, వరవడిని క్రమబద్ధంచేసి ఫలదీకరణ మొనర్చుటకు ఇచ్చే శిక్షణను విద్య యనవచ్చును. ఐతే అభిప్రాయాలను అణగద్రొక్కి, స్వేచ్ఛా భావాల్ని అనుమతించకుండా పాత అభిప్రాయాల్ని, క్రొత్త వాటిని సమాధిచేసి, వ్యక్తిని

యంత్రంగా తయారుచేసే శిక్షణ విద్య అవుతుందా? ఆలోచిం చండి. నా అభిప్రాయంలో వ్యక్తి స్వేచ్ఛగా ఆలోచించి పొరపాట్లు చేసినా మేలేగాని, యాంత్రిక విధానంలో మంచి చేసినా శ్రేయస్కరం కాదు.

మనస్సుని అసంఖ్యాకమైన వైజ్ఞానిక విషయాలతో నింపటం విద్యకాదు. మనస్సు యొక్క సమగ్రమైన ఉత్తీర్ణతను సాధించి దానిపై సాధికారతను, నియంత్రణనుసమకూర్చుటే విద్య యొక్క ఆదర్శమై యుండాలి. చిత్తము యొక్క ఏకాగ్రతను సాధింపచేయుటే విద్య యొక్క సారాంశమని నేను భావిస్తాను. అంతేకాని కేవలం విషయగ్రహణం మాత్రమే విద్యకాదు. నేను మళ్ళీ విద్యను అధ్యయనం చేయాల్సి వస్తే, నాకావిషయంలో సంపూర్ణ స్వేచ్ఛ వుంటే, నేను విషయాల జోలికిపోను. ముందుగా నేను చిత్తంపై ఏకాగ్రతను సాధించే శక్తిని, విషయ పరిత్యాగశక్తిని పెంపొందించుకుంటాను. అప్పుడు పరిణతి చెందిన మనస్సుతో విషయగ్రహణానికి పూనుకుంటాను. విద్యతోబాటు ప్రతిచిన్నారికి ఏకాగ్రతను అలవరచి పెంపొందించాలి.

వ్యక్తి తన జీవితకాలంలో జీర్ణించుకోలేని పరిమాణంలో విషయసేకరణజేసిమెదడును కల్లోలపరచటం విద్యకానేరదు. మనం జీవించుటకవసరమైన వ్యక్తిత్వాన్నిసమకూర్చే ప్రవర్తనను తీర్చిదిద్దే భావాలను జీర్ణించుకోవాలి.

జీవితానికి, ప్రవర్తనకు అక్కరకు వచ్చే కనీసం ఐదు ఆలోచనలను మనస్సుకుపట్టించుకుంటే చాలు. దాని విలువ వ్యక్తి గ్రంథాలయంలోని గ్రంథాలనన్నింటినికంఠస్తము చేసి సాధించిన దానికంటే అత్యధికం. సమాచార సేకరణం లేక విషయగ్రహణం మాత్రమే విద్య అయితే, మన గ్రంథాలయాలు తాపసులౌతాయి; విజ్ఞానసర్వస్వాలు మహర్షులుగా ప్రజ్వలిస్తాయి. కాని మనకు అవసరమైంది అలాంటి విద్య కాదు. విద్యవల్ల సత్ప్రవర్తన అలవడాలి; మనోధార్ఢ్యత పెంపొందాలి; వివేకంవిస్తరించాలి; చివరిగా మన కాళ్ల మీద మనం నిలబడగల్గాలి.

సామాన్య ప్రజలకు జీవనోపాధికి అవసరమైన వస్తు సంపదను సమకూర్చలేనివిద్య, వ్యక్తి ప్రవర్తనకు స్తోమతనీయలేని విద్య, దాతృత్వ గుణాన్ని, ధైర్య సాహసాల్నిసృష్టించలేని విద్య — విద్యగా పరిగణింపబడదు. వ్యక్తికి స్వావలంబమునొసగేదే నిజమైన విద్య.

మరొక ముఖ్య విషయం. గాడిదను, గుఱ్ఱాన్నిగా మార్చవచ్చనే యత్నంలో ఒకవ్యక్తి గాడిదను నిర్దాక్షిణ్యంగా దండిస్తాడు. అది వృధా ప్రయత్నమని అతడికి తెలీదు. అట్లే పిల్లలను కఠినంగా దండించి విద్యను బోధించే ప్రయత్నం కూడ ఫలితాన్నీయదు.ఎవరూ ఎవరికి బోధించగల్గేది లేదు. బోధకుడు తానేదో బోధిస్తున్నాననుకోవడం ప్రమాదకరం. మన వేదాంతం ప్రకారం ప్రతి వ్యక్తిలోను విజ్ఞానం మొత్తం వుంది. ఇదిపిల్లవాండ్రకు కూడ వర్తిస్తుంది. ఐతే దాన్ని జాగృతం చేయాలి. ఆ కర్తవ్యాన్ని ఉపాధ్యా యుడు నిర్వర్తించాలి. పిల్లలు వారి హస్తాల్ని, కాళ్లను, శ్రవణేంద్రియాల్ని, చక్షువుల్నితమకు ఉపకరించే విధానంలో ఉపయోగించుటకు ఆవశ్యకమైన వివేకాన్ని సంపాదించాలి. దానికి దోహదం ఇచ్చే బోధనను మాత్రం మనం సమకూరిస్తేచాలు. తర్వాత వారు ఏది సాధించాలన్నా సుళువుగా సాధిస్తారు.

ఆ విధంగా మార్గాన్ని సుగమం చేయటమే మన వంతు; అంతా సవ్యంగానే సాగుతుంది.

ఎవరియొక్క విశ్వాసాల్ని సడలనీయవద్దు. నీకు చేతనైతే అంతకంటె మంచి విషయాల్ని సమకూర్చు. వ్యక్తి యొక్క స్థానాన్ని పదిలపరుస్తూ అతడు అంతకంటె ఉన్నతస్థాయిని చేరటానికి నీ చేతనైనంతవరకు చేయూతనివ్వు. అంతేగాని అతడు స్థిరపరచుకున్న స్థానానికి హాని కల్గించకు. అత్యంత స్వల్పవ్యవధిలో ఏ ఉపాధ్యాయుడు వేలకువేల వ్యక్తుల రూపాలలో మారగలడో అతడే నిజమైన ఉపాధ్యాయుడు. ఎవరైతే విద్యార్థి స్థాయికి దిగి తన ఆత్మను విద్యార్థి ఆత్మతో శృతి చేసి, అతని దృష్టిలో తన దృష్టిని, అతని వినికిడిలో తన వినికిడిని, అతని మనస్సులో తన మనస్సును చొప్పించ గలడో అతడే నిజమైన అధ్యాపకుడు. అతడు మాత్రమే ఉపయుక్తమైన బోధనను ఈయగలడు. అంతేగాని తిరోగమనవాదులు,

అవరోధకతత్వం గలవారు ఐన ఉపాధ్యాయులు ఏ విధమైన శ్రేయస్సును అందచేయలేరు.

# ఉపాధ్యాయునికి విద్యార్థికి మధ్య సన్నిహిత ఆత్మీయత విలసిల్లాలి

ఉపాధ్యాయునితో గురుకులవాస పద్ధతిలో వ్యక్తిపరమైన సాన్నిహిత్యం శిష్యునకు ఏర్పడాలి. గురువు యొక్క వ్యక్తిగత జీవితాన్ని కూడ శిష్యుడు అధ్యయనం చేయగల్గాలి. అప్పుడే అది నిజమైన విద్యాభ్యాసం అవుతుంది. ఈ రోజున విశ్వవిద్యాలయాల విషయం గమనించండి. అవి ఈ యాబది సంవత్సరాల కాలంలో సాధించిందే మున్నది? స్వీయ ప్రతిపత్తి గల ఒక విద్యావేత్తను కూడ రూపొందించలేదు. అవి కేవలం పరీక్షలు నిర్వహించే సంస్థలుగానే నిలుస్తున్నాయి. అంతేకాని ప్రజాసంక్షేమం కొరకు త్యాగం అవసరమనే భావన మన జాతిలో ఇంతవరకు ఉత్పన్నమవలేదు.

వ్యక్తి తన బాల్యం నుండి సత్ప్రవర్తకుడైన, ఉన్నత స్థాయి విద్యా బోధనకు ప్రతీకగా నిలచిన గురువు యొక్క సాన్నిహిత్యంలో జీవించాలి. అది పాపమని, ఇది పుణ్యమని గ్రంథాల్లో చదివినంత మాత్రాన ప్రయోజనం సిద్ధించదు. ప్రతి బాలుడు సంపూర్ణ బ్రహ్మచర్యాన్ని అవలంబించుటకు శిక్షణ తీసుకోవాలి. అప్పటికిగాని అతనికి మంచి విషయములందు శ్రద్ధ జనించదు. శ్రద్ధ లేనివాడు అసత్యాన్ని పలకటానికి వెనుదీయడు. మన దేశంలో విద్యా బోధన త్యాగులు లేక విరాగుల ద్వారానే జరుగుతూ వస్తోంది.

# విద్య – మతం

మతం విద్య యొక్క అంతర్గత కీలకాంశంగా నేను పరిగణిస్తాను. విద్యకు మూలం మతం. మతం భోజనంలో ప్రధాన వస్తువైన అన్నం అయితే, మిగతావన్నీ కూరలు మాత్రమే. కూరల్ని మాత్రమే భుజిస్తే అజీర్తి సంభవిస్తుంది. అలాగే అన్నం మాత్రమే తింటే కూడ అదే ఫలితం.

ముందు తాత్త్విక విజ్ఞాన బోధన, దాని తర్వాత భౌతికశాస్త్ర బోధనగాని, ఇతర విషయ పరిజ్ఞాన అధ్యయనం గాని జరగాలి. అందుకు భిన్నంగా తాత్త్విక విజ్ఞాన బోధన వదలి కేవలం భౌతిక విషయ జ్ఞాన బోధనపై దృష్టి నిల్పితే ప్రజల ఆమోదం లభించదు.

# మత ప్రాతిపదిక పై విద్య అనే అంశంపై స్వామీజీ ప్రణాళిక

హిందువులకు మతం ముఖ్యం కనుక విద్యాబోధనకు దేవాలయాలు శ్రేయస్కరం. కాని అచ్చట భిన్న శాఖల వారి మధ్య వివాదాలు ఉత్పన్నం కావచ్చు. కాని ఆ పవిత్ర స్థలాల్ని శాఖల కతీతంగా సమత్వ దృష్టిని పెంపొందించే వాతావరణంతో ప్రభావితం చేయాలి. 'ఓమ్' శబ్దం హిందూ మతధర్మాల ప్రకారం అందరు ఆమోదించే చిహ్నం. దీన్ని అన్ని శాఖల వారు అవలంబించవచ్చు. దేవాలయాల్లో అన్ని శాఖలవారు సమా వేశం కావచ్చు. వారి వారి బోధనలను వారి వారి పద్ధతుల్లో బోధించవచ్చు. కాని ఆ ప్రదేశాల్ని వివాద ప్రాంతాలుగా మార్చకూడదు. అందరూ సమిష్టిగా అన్ని శాఖలకు ఆమోదయోగ్యమైన అంశాలను బోధింపవచ్చును. అంతేగాని ఒక శాఖ వారు మరియొక శాఖపై అసహనం ప్రదర్శించకూడదు.

ఈ దేవాలయాల్లో అధ్యాపకులకు శిక్షణనిచ్చే వ్యవస్థకూడ నెలకొల్పబడాలి. ఆ అధ్యాపకులు దేశంలో పర్యటించి మత విషయకమైన, ఇతర వ్యావహారిక సంబంధమైన విజ్ఞానాన్ని ప్రజలకు బోధించుటలో ఉత్తీర్ణులు కావాలి. ఆ విధమైన అధ్యాపకులు, ప్రచారకులు తమ కార్యక్రమాన్ని క్రమంగా విస్తరించి దేశం నలుమూలల అలాంటి దేవాలయాలను విద్యాప్రదాన స్థలాలుగ ఏర్పరచుకోవచ్చును. ఇదే నా ప్రణాళిక.

# విద్య ఉత్సాహాన్ని పెంచాలి – నిరుత్సాహాన్ని కాదు

మనం ప్రజలకు ప్రయోజనకరమైన ప్రతిపాదనలు ఇచ్చి ఉత్సాహపరచాలి. నిరుత్సాహపరచే ఆలోచనలు వ్యక్తుల్ని బలహీనపరుస్తాయి. చాలమంది తల్లిదండ్రులు తమ పిల్లలు విద్యావంతులు కావాలనే తాపత్రయంతో వారికి కఠిన శిక్షణనిస్తూ 'నీకు చదువురాదు, నీవు బాగుపడవు' అని విసుగూ విరామం లేకుండా దూషిస్తూ కించపరుస్తూ వుంటారు. పిల్లలు కూడ విద్య యందు నిరాసక్తత పెంచుకొని వారి తల్లిదండ్రులన్నట్లే తయారవుతారు. అలాగాక పెద్దలు పిల్లల పట్ల కరుణ జూపిస్తూ వారిని అనునయించి తగిన ప్రోత్సాహమిస్తే విద్యలో ఉత్తీర్ణులౌతారు. రామకృష్ణపరమహంస తన ఆశ్రయం కోరివచ్చిన ఎంత పనికిమాలిన వారినైనా ప్రేమతోప్రోత్సహించి వారిని సన్మార్గంలో పెట్టేవారు. ఆయన తన అనుయాయులకు బోధించే పద్ధతి చాల విలక్షణమైంది.

నేను న్యూయార్కులో ఐరిష్ వలసవాసుల్ని గమనించేవాణ్ణి. వారు నిరాశ్రితులై, నిస్సహాయులై, తినటానికి తిండి, కట్టుకోటానికి బట్ట లేకుండా, దీనాతి దీనావస్థలో, జాలి చూపులతో నగరంలో ప్రవేశించటం చూచాను. కాని ఆరు నెలల తర్వాత వారిలో ఊహించని అద్భుతమైన మార్పులు గమనించాను. వారిప్పుడు కడుపునిండాతిండి తింటున్నారు; మంచి దుస్తుల్ని ధరిస్తున్నారు. వారిలోని దైన్యం నశించి, ధైర్యం, ఉత్సాహం ప్రబలంగా గోచరిస్తున్నాయి. తర్వాత కారణం తెలుసుకున్నాను. వారి స్వదేశమైన ఐర్లండులో వారిని హీనంగా చూచేవారు. 'నీవు బానిసగా జన్మించావు.బానిసగానే జీవించాలి. వేరే నీకు మార్గం లేదు' అని మొత్తం ప్రకృతి అంతా ఏకకంఠంతో హెచ్చరిస్తున్నట్లు అతనికి ధ్వనించేది. నిరాశానిస్పృహలతో తన దుస్థితికితానే జాలిపడి ఆత్మను కోల్పోయి జీవించేవాడు. కాని అమెరికాలో కాలు పెట్టిన మరుక్షణం నుండి అతని దశమారింది. అచ్చటి ప్రజలు అతని వెన్నుదట్టి, అతనిలోనిమానవుని నిద్రలేపి 'నీవు సాధించలేనిది ఏదీ లే' దని నచ్చజెప్పి అతణ్ణి స్వావలంబనదిశగా కార్యోన్ముఖుణ్ణి చేశారు. 'నిద్ర నుండి మేలుకో, పురోగమించు' అనే

ఉపనిషద్వాక్యాలు నిజమైనాయి.

ప్రస్తుతం మన పిల్లల కందజేస్తున్న విద్య దుష్ఫలితాల్ని మాత్రమే ఇస్తుంది.పాఠశాల విద్యార్థి ప్రస్తుతం నేర్చుకునేదేమీ కనబడదు. ప్రాచీన సంస్కృతిని పోగొట్టుకోవడం మాత్రం జరుగుతోంది. దానిపట్ల విశ్వాసం సడలటమే దానికి మూలకారణం.మన వేదాల్లోను, మన వేదాంత సిద్ధాంతాల్లోను విశ్వాసం నశిస్తోంది. విశ్వాసబలంతోనేనచికేతుడు యమునికి ముఖాముఖీ నిలబడి ప్రశ్నించగల్గాడు. విశ్వాసం ఆధారంగానేప్రపంచం క్రమపద్ధతిలో నడుస్తోంది. ఈ పరిస్థితుల్లో మనం వినాశానికి చేరువలోవున్నామనిపిస్తుంది. ఈ దుస్థితి నుండి దేశాన్ని కాపాడాలంటే సరియైన విద్యావిధానాన్నిప్రవేశపెట్టాలి; విస్తరింపచేయాలి. ఆత్మజ్ఞాన ప్రబోధం జరగాలి. అంటే ప్రజలుజడదారులై, దండకమండలాలతో కొండ గుహల్లోకి వెళ్లాలని కాదు నా ఉద్దేశ్యం.ద్వైతులు గాని, అద్వైతులు గాని, శైవులు గాని, వైష్ణవులు గాని, బౌద్ధులు గాని – అందరిలోని ఆత్మ ఒక్కటే. తేడా అంతా బాహ్య ప్రదర్శనలలోనే. మహోన్నతుడైన భగవానుని మొదలు హీనమైన పచ్చగడ్డి వరకు అన్నిటిలోను ఆ ఆత్మ శక్తియే వుండి నడిపిస్తోంది. కనుక మానవులందరు సమానులే. ఈ భావనను, ఆత్మశక్తిని గురించి మనం ఇంటింట ప్రచారం చేయాలి.

రెండవ విషయమేమంటే పై ప్రచారంతోబాటు విద్యను కూడ నలుమూలలబోధించాలి.

గురుకులవాస పద్ధతి, దానితోబాటు అలాంటి ఇతర పాత పద్ధతుల ద్వారా బోధించే విద్యా విధానాల్ని పునఃవ్యవస్థీకరించాలి. పాశ్చాత్య విజ్ఞానం, దానితోబాటువేదాంత విజ్ఞానం మనకు అత్యావశ్యకం. వాటితోబాటు బ్రహ్మచర్యం విధిగా పాటింపబడాలి. ఆత్మ విశ్వాసం సడలకూడదు.

విదేశీయుల ప్రమేయం లేకుండా భారతీయ సంస్కృతికి సంబంధించిన వివిధశాఖల విజ్ఞానం బోధింపబడాలి. దాంతోబాటు ఆంగ్లభాష, పాశ్చాత్య విజ్ఞానం, సాంకేతిక విద్య,

పరిశ్రమలు స్థాపించుట కవసరమగు ఇతర విషయాల పరిజ్ఞానం, ఇవన్నీ మనకు అవసరం. పరిశ్రమలు నడిపే సామర్థ్యాన్ని సేకరించుకుంటే, యువకులు ఉద్యోగాల వెంటబడకుండా స్వయం ఉపాధిని ఏర్పరచుకోగల్గుతారు.

# బలహీనతను ఉత్ప్రేరించే విద్య మనకొద్దు

బలహీనతకు దారితీసే విద్యా విధానాన్ని నేను నిరసిస్తాను. పురుషుడుగాని, స్త్రీగాని, బిడ్డగానీ వారు శారీరక, మానసిక, తాత్త్విక విషయాలలో దేనిలోనైనా శిక్షణగ్రహిస్తున్నపుడు వారు తగిన పుష్టిని కల్గియున్నారా లేదాయని విమర్శించుకోవాలి.వ్యక్తికి పుష్టిని సమకూర్చేది సత్యసంధత మాత్రమే. సత్యమే జీవితానికి మూలాధారం.సత్యం అలవరచుకోటానికి దృఢత్వం కావాలి. కనుక మనస్సును బలహీనపరచే ఏవిధానం కూడ వ్యక్తిని ఛాదస్తునిగాను, నిస్తేజునిగాను, వ్యర్థ ఆలోచనలకు నిలయునిగాను తయారుచేస్తాయి. అలాంటి సంస్థలు ఎలాంటి మంచి ఫలితాల్ని సమకూర్చకపోగా, వ్యక్తిలో మానసిక దౌర్బల్యాన్ని, నిస్తబ్దతను పెంచి సత్యాన్వేషణకు అనర్హునిగా చేస్తాయి.

# స్వావలంబము మన గమ్యం

ప్రజలు తమను తాము పోషించుకొను శక్తిమంతులుగా తయారు కాలేనిచో ప్రపంచ సంపదనంతనూ వెచ్చించినప్పటికి మన దేశంలో ఒక చిన్న పల్లెలోని ప్రజలుకూడ రక్షింపబడరు. కనుక మనం ప్రజలకు నైతికపరమైన, విజ్ఞానపరమైన విద్యనువిధిగా అందచేయాలి. ప్రజలు స్వయంపోషకత్వాన్ని, ఆర్థిక నైపుణ్యాన్ని సంపాదించుకొని కరువుకాటకాల బారిన పడకుండ రక్షించుకుంటూ జీవించగలవారగుటకు కావలసిన విజ్ఞానాన్ని మనం వారికి లభింపచేయాలి.

# ప్రస్తుత విద్యావిధానంలోని లోపాలు

ప్రస్తుత విశ్వవిద్యాలయాలు లోపభూయిష్ఠమైన విధానాన్ని అనుసరిస్తున్నాయి. ఈ విధానం గుమాస్తాలను తయారుచేసే చక్కని యంత్రంగా మాత్రమే రాణిస్తోంది. అంతకే పరిమితమైనా నేను చాలా సంతోషించేవాణ్ణి. వ్యక్తుల్ని మన ప్రాచీన విలువల పట్ల విశ్వాసరహితుల్నిగా మారుస్తోంది. వారు భగవద్గీతను మన శాస్త్రాల్లో తర్వాత చేర్చిన భాగంగా నిర్ణయిస్తారు. వేదాలు పుక్కిటి పురాణాలని నిరసిస్తారు. విదేశీయమైన జాతులకు, వారి విషయాలకు విలువనిచ్చి వాటిని ఆమూలాగ్రంగా అధ్యయనం చేయటానికి ఇష్టపడతారు. కాని వారి సొంత మూలపురుషుల వివరాలు అడిగితే కనీసం ఏడు తరాల వరకైనా వారి సంతతి వారి పేర్లను కూడ చెప్పలేరు; 14 తరాల మాట వదిలేయండి. తన సొంత చరిత్రను విస్మరించిన జాతికి ప్రపంచంలో ఉనికిలేదు. 'నేనొక ఉన్నత వంశానికి చెందినవాడను' అని పూర్తి విశ్వాసంతో, సగర్వంగా జీవించే వ్యక్తి దుష్ప్రవర్తకుడు కాలేదు. అతని ఆత్మవిశ్వాసం అతన్ని చెడు మార్గంలో నడవ నీయదు; అతడు మరణించటానికైనా సిద్ధమౌతాడు గాని దోషిగా జీవించటానికి ఇచ్చగించడు. కనుక ఒక జాతి చరిత్ర ఆ జాతి పతనం చెందకుండా సరియైన హద్దుల్లో ఉంచుతుంది. రాజప్రతినిధి (Viceroy) విశ్వవిద్యాలయ విద్యావిధానాన్ని సంస్కరించే ప్రతిపాదన చేసినందుకు కృతజ్ఞత తెల్పాలి. ఒక దృక్పథం ప్రకారం ఆయన సంస్కరణను మనం మెచ్చుకోవాలి. దాని ప్రకారం ఉన్నత విద్యకు ఆచరణలో అవకాశముండదు. దేశప్రజలకిది ఊపిరిపీల్చుకునే అవకాశం ఇచ్చింది. డిగ్రీలు పొందటానికి విపరీతమైన హంగామాకు, అలజడికి గురికావలసి వస్తుంది. ఐనా సాధించేదేమీ మనకు శ్రేయస్కరం కాదు. మనకున్న మతం, ఆచారాలు మంచివి కావని, పాశ్చాత్యులకున్నవన్నీ మంచివని మాత్రమే అక్కడ నేర్చుకోగల్గుతారు. అంత చదివినా దారిద్ర్యం నుండి బయటపడని పరిస్థితే వారికెదురౌతుంది. అలాంటి ఉన్నతవిద్య వున్నా ఒకటే, నశించినా ఒకటే. ప్రజలకు కావలసింది సాంకేతిక విద్యలో శిక్షణ. దానివలన వారు ఉద్యోగాల

కొరకు తిరిగే అవసరం లేకుండా స్వయంగా జీవనోపాధి కల్పించుకొని జీవించగల్గుతారు.

ప్రస్తుతము విద్యావిధానంలో కొన్ని మంచి అంశాలు లేకపోలేదు. కాని అది కల్గజేసే నష్టాలు చాల తీవ్రమైనవగుట చేత మంచి యొక్క పాలు అదృశ్యమౌతోంది. ప్రధానంగా ఈ విద్య వ్యక్తిత్వ వికాసానికి ఉపకరించదు. అది పూర్తిగా వ్యక్తిని తిరోగమన మార్గంలో మాత్రమే నడపగలదు. అందువలన మరణం కంటే హీనమైంది. బిడ్డ పాఠశాలలో మొదటి అంశంగా తన తండ్రి తెలివి హీనుడని, రెండవది తన తాత మతిలేనివాడని, మూడవది ఉపాధ్యాయులందరు వంచకులనీ, నాల్గవది మన పవిత్ర గ్రంథాలన్నీ అసత్యాలనీ నేర్చుకుంటాడు. పిల్లవానికి 16 సంవత్సరాల వయస్సు వచ్చే సరికి నిరాశావాదిగా, నిశ్చేతనుడుగా, పిరికిపందగా రూపొందుతాడు. ఫలితంగా, ఈ యాబది సంవత్సరాల విద్యా విధానంలో మొత్తం దేశంలో సృజనాత్మకుడైన ఒక వ్యక్తి కూడ తయారు కాలేకపోయాడు. ప్రతిభావ్యుత్పత్తులు గల ప్రతి వ్యక్తి ఇతర దేశాల్లో విద్యావంతులైనవారే తప్ప మన దేశంలో కాదు. అలా కాకపోతే, వారు దేశంలోని పాత విశ్వవిద్యాలయాలకు వెళ్లి వారి ఛాందస భావాలను ప్రక్షాళనం చేసి కొని వుంటారు.

# విద్య సామాన్య జనుల పేదరికాన్ని నిర్మూలించగలదు

విద్య, విద్య యొక్కటే మనకు అత్యవసరం. ఐరోపాలో చాల పట్టణాల్లో పయనిస్తూ, అచ్చటి బీదప్రజలు కూడ విద్యావంతులై సుఖప్రదమైన జీవనాల్ని గడపటం గమనించాను. ఆ సమయంలో మన దేశంలోని పేదవారి స్థితిగతులను స్మరించి దుఃఖాక్రాంతుణ్ణయ్యేవాడను. ఆ పరిస్థితుల వ్యత్యాసానికి కారణం విద్య మాత్రమే. విద్య ద్వారా ఆత్మవిశ్వాసం లభిస్తుంది. ఆత్మవిశ్వాసం వ్యక్తిలోని చైతన్య స్వరూపాల్ని మేలుకొలుపుతుంది. కాని మన దేశంలో విద్య కొరవడుట చేత మనలోని చైతన్య శక్తి క్రమంగా నిద్రాణ స్థితికి జారుకుంటోంది.

విద్య విస్తరించకుండా, విజ్ఞానం వికసించకుండా దేశంలో ప్రగతి ఎలా సాధ్యం కాగలదు? ముఖ్యంగా స్త్రీజనుల మధ్య, సామాన్య ప్రజానీకం మధ్య విద్య విస్తరించని నాడు దేశం యొక్క స్థితిగతులను ఏ విధంగానూ మెరుగు పరచలేము. ఇది నిశ్చయం. వ్యక్తి సర్వతోముఖాభివృద్ధి సాధించాలంటే, ఆధునిక విజ్ఞానం ద్వారా వానికి చరిత్ర, పురాణాలు, గృహయాజమాన్యం, కళలు మెదలగు వాటిని బోధించాలి. అంతేగాక విద్యార్థినులకు నైతిక, తాత్త్విక జీవన విధానాల్లో శిక్షణ నివ్వాలి. విద్యావంతులైన పుణ్యవతులైన తల్లుల గృహాల్లోనే మహాత్ములు జన్మిస్తారు.

# సామాన్య జనులకు విద్య

సామాన్య ప్రజలని విద్యావంతులు చేయండి. అప్పుడే జాతి సజీవంగా నిలు స్తుంది. గుడిసెల్లో జీవించే నిజమైన జాతి తమ పురుష ధర్మాన్ని, వ్యక్తిత్వాన్ని విస్మ రించారు. హిందువుల, మహమ్మదీయుల, క్రైస్తవుల పదఘట్టాల క్రింద అణగారిన బీదప్రజానీకం ధనికుడైన ప్రతివాని చేత అణగద్రొక్కబడటానికే తాము జన్మించామనే భావనకు సమాధానపడ్డారు. కనుక వారు పోగొట్టుకొన్న వ్యక్తిత్వాన్ని వారికి ప్రాప్తింప చేయాలి. అది సాధించాలంటే వారిని విద్యావంతులు చేయాలి. రసాయన పదార్థాలను సంయోగించటం వరకే మన కర్తవ్యం. తగిన రూపాన్ని ప్రసాదించటం ప్రకృతి ధర్మాల్ని బట్టి జరుగుతుంది. పేదప్రజల మస్తిష్కాల్లో సరైన ఆలోచనల్ని చొప్పిస్తే మిగతా విషయాలు వారే చూసుకుంటారు. కాని వారికి విద్యను సమకూర్చాలంటే అవాంతరాలు వున్నాయి. దివాలా కోరు ప్రభుత్వం ఏవిధంగాను ఆ ఉద్యమానికి దోహదం చేయ లేదు.

మనం ప్రతి గ్రామంలోను ఉచిత విద్యా సౌకర్యంతో పాఠశాలలు స్థాపించినా బీదపిల్లలు ఉపాధికోసం పొలాల్లో పనిచేసి డబ్బు సంపాదించటానికి ఇష్టపడతారు గాని పాఠశాలలకు వచ్చి చదువుకోరు. ప్రతిబాలుడు పాఠశాలకు వచ్చి విద్య నభ్యసించా లంటే పేదబాలుర ఉపాధికొరకు ధనం మనం ఇయ్యగల్గాలి. కాని ఆ శక్తి మనకు లేదు. కాని నా వద్ద వేరొక ఉపాయం వుంది. మొహమ్మద్ వద్దకు పర్వతం రాదు గనుక మొహమ్మదే పర్వతం వద్దకు వెళ్లాలి. పేదపిల్లలు చదువుకొరకు పాఠశాలలకు రారు గనుక విద్యనే వారి వద్దకు తీసుకొని వెళ్లాలి. ఆ పిల్లలు పొలాల్లో పనిచేస్తే పొలాల వద్దకు, కర్మాగారాల్లో పనిచేస్తే కర్మాగారాల్లోకి లేక మరొకచోటకు బోధకులు వెళ్లి వారికి విద్య బోధించాలి. మన దేశంలో నిస్వార్థపరులైన, సేవాతత్పరత కల్గిన విద్యావంతుల్ని బహు సంఖ్యలో సమకూర్చగలను. వారే ప్రతి పల్లెకు వెళ్లి ఇంటింటికి తిరిగి మతంతోబాట విద్యను కూడ బీదవారికి బోధించాలి. అలాగే స్త్రీలకు నేర్పుటకు వితంతువులను వ్యవస్థీకరించే మూల విధానం కూడ నా దగ్గర వుంది.

పల్లెవాసులు రోజంతా పనిచేసి తీరిక సమయంలో గ్రామంలోని చెట్టుక్రిందగాని మరొక చోటగాని కూర్చొని కాలక్షేపం చేయు సమయాల్లో విద్యావంతులైన ఇద్దరు సన్యాసులు ఆ ప్రదేశాలకు వెళ్లి వారికి దృశ్య ప్రదర్శనల ద్వారాను, ఇతర పద్ధతుల్లోను విషయాలన్నిటిని బోధించవచ్చు. అలా జరిగితే గ్రామవాసులు విషయ పరిజ్ఞానంతో, నైతిక విజ్ఞానంతో మెరుగైన రీతిలో వ్యవహరిస్తారు. అంతటితో మన కృషి ముగుస్తుంది. తదుపరి కార్యక్రమం వారే నిర్వహించుకుంటారు.

మన దేశంలో తదేక దృష్టితో నిస్వార్ధతతో పల్లెపల్లెకు వెళ్లి మతాన్ని బోధిస్తున్న విద్యావంతులైన సన్యాసులు వేలకువేలు వున్నారు. వారి నుండి కొంత మందిని లౌకిక విషయాలు బోధించే ఉపాధ్యాయులుగా సమీకరిస్తే వారే ప్రతి గ్రామానికి వెళ్లి ఇల్లిల్లు తిరిగి పేద ప్రజలకు మత ప్రచారంతోపాటు విద్యాబోధన కూడ చేస్తారు. ఈ సన్యాసుల్లో ఇద్దరు సాయంత్రపు వేళల్లో పల్లెలకు వెళ్లి వారి సమావేశ స్థలాల్లో కెమెరాలు, గ్లోబులు, దేశ పటములు, ఇతర దృశ్య పరికరాల సహాయంతో వారికి ఖగోళశాస్త్ర విషయాలు, భూగోళ శాస్త్ర విషయాలు బోధించవచ్చు. అలాగే కథల రూపంలో వివిధ జాతుల చరిత్రలు చెప్పుట ద్వారా, పుస్తకాల ద్వారా చదివినదాని కంటె వెయ్యిరెట్లు సులభంగా, ఎక్కువ విషయాల్ని వారికి బోధించవచ్చు.

ప్రకృతి సృష్టించిన అసమానతలను సరిదిద్దాలంటే స్తోమత ఉన్నవారికంటె స్తోమతలేని వారికి అవకాశాలు అధికంగా సమకూర్చాలి. వివరంగా చెప్పాలంటే, గ్రహణశక్తి అధికంగా వున్న బ్రాహ్మణునకంటె, ఆశక్తి తక్కువున్న క్రింది జాతి ఛండాలు నకు విద్యాబోధనావకాశాలు మెండుగా అమర్చాలి. బ్రాహ్మణ బాలునకు ఒక ఉపాధ్యాయుడు అవసరమైతే చండాల బాలునకు పదిమంది బోధకులు అవసరం. జన్మతః ప్రకృతి బుద్ధి సూక్ష్మతను ప్రసాదించని వానికి మనం అధిక ప్రమాణంలో సహాయావకాశాలు కల్పించవలసి వుంటుంది.

# స్త్రీ విద్య

మతం, కళలు, శాస్త్ర విజ్ఞానం, గృహయాజమాన్యం, వంటవార్పు, కుట్టుపనులు, పరిశుభ్రత – ఈ విషయాలకు సంబంధించిన అత్యావశ్యకమైన ప్రాధమిక సూత్రాల్ని స్త్రీలకు విధిగా బోధించాలి. వారు నవలా సాహిత్యం, కల్పనా రచనలపట్ల ఆసక్తి పెంచుకోకుండా చూడాలి. వారికి పుజా విధానాలు మాత్రం బోధించి ప్రయోజనం లేదు. వారికి మనం సమకూర్చే విద్య వారికవసరమైన అన్ని విషయాలపై అవగాహనను కల్గజేయాలి. ఆడపిల్లలకు ఆదర్శవంతమైన ప్రముఖ స్త్రీల పాత్రలను గురించిన వివరణలను తెలియచేయాలి. దాని వలన వారిలో నిస్వార్ధత, ఉన్నత భావాలపట్ల ఆసక్తి పెంపొందింపబడాలి. సీత, సావిత్రి, దమయంతి, లీలావతి, ఖానా, మీరా లాంటి ఉత్తమ స్త్రీల జీవితాల్ని ఉదాహరణగా తీసుకునే ఆలోచనలను పిల్లల మనస్సుల్లో చొప్పించాలి. వీరు కూడ తమ జీవితాల్ని ఆ సాధ్వీమణుల వలె మలచుకోటానికి ప్రభావితులౌతారు.

కాని యథార్ధంగా ప్రస్తుతం స్త్రీల కిస్తున్న విద్య మత ప్రాతిపదిక మీద కాకుండా నడుస్తోంది. ఆ కారణంగా ఈ విద్యావిధానంలో, సంస్కృతిలో ఏదో ఒక లోపం చోటు చేసుకుంటోంది. కనుక స్త్రీవిద్య మత విషయిక ప్రాధాన్యతతో విస్తరింపబడాలి. మిగతా విషయాల్లో శిక్షణకు ద్వితీయ స్థానం మాత్రమే ఈయాలి. మతపరమైన శిక్షణ, వ్యక్తిత్వ రూపకల్పన, పాతివ్రత్య ధర్మపరిపాలన – ఈ విషయాలకు ప్రాధాన్యత నీయాలి. ఇప్పటి వరకు అమలులో వున్న స్త్రీ విద్యయందు మతం ప్రధాన స్థానాన్ని ఆక్రమించలేదు.

# వ్యావహారిక భాష ద్వారా విద్య

మన దేశంలో ప్రాచీనకాలం నుండి విద్యాభ్యాసం సంస్కృత భాషలో జరిగినందు వలన విద్యావంతులైన వారి భాషకు వాడుక భాషకు విపరీతమైన అంతరం ఏర్పడింది. కాని బుద్ధుడు మొదలు చైతన్య, రామకృష్ణుల వరకు ప్రపంచాన్ని ఉద్ధరించటానికి వచ్చిన మహామహులందరు వారి వారి బోధనలను వాడుక భాషలోనే చేశారు. పాండిత్యం ఎలాగూ ఉత్కృష్టమైనదే. కాని పాండిత్య ప్రకర్ష క్లిష్టమైన, సర్వులకు అర్థం గాని, కృతకమైన గ్రాంధిక భాషలోనే సాధ్యమా? వ్యావహారిక భాషలో కళాత్మ కతకు స్థానం లేదా? సహజమైన వ్యవహారిక భాష స్థానంలో అసహజమైన భాషను సృష్టించి సాధించగల ప్రయోజనమేముంది? విద్యా సంబంధమైన పరిశోధనలను ఇంట్లో మాట్లాడుకునే వాడుక భాషలో నిర్వహించలేమా? అలాంటప్పుడు వ్రాయటానికి పూనుకొనినప్పుడు అస్వాభావికమైన, దుర్లభమైన భాషను ఎన్నుకోవాల్సిన ఆవశ్యకత ఏముంది? నీవు తత్త్వశాస్త్రాన్ని, విజ్ఞాన శాస్త్రాన్ని మనస్సులో ఒక భాషలో ఆలో చిస్తున్నావు; అదే భాషలో ఇతరులతో చర్చావేదికల్లో చర్చిస్తున్నావు, వాదిస్తున్నావు. కాని, తత్త్వశాస్త్రాన్ని, విజ్ఞాన శాస్త్రాన్ని వ్రాతరూపంలో ఇమిడ్చేటప్పుడు ఆ భాష పనికి రావటంలేదు. నీ మనస్సుతో ఆలోచించేటప్పుడు, ఇతరులతో విషయాల్ని విశ్లేషించేటప్పుడు, భిన్నమైన భాషతో వ్యవహరిస్తే ఆ ఆలోచనలు, సమర్ధనలు ఎలా సాధ్యమౌతాయి? మన భావాల్ని సహజంగా వ్యక్తీకరించాలన్నా, మన కోపతాపాల్ని, విషాదాన్ని, ఆప్యాయతల్ని ఇతరులకు అందజేయాలన్నా వాడుక భాష ఉపయుక్తమైనట్లు మరొకటి కాదు. మనం ఆ భాషనే, ఆ పద్ధతిలోనే మాట్లాడటానికి అంకితం కావాలి. వాడుక భాషలో వున్న సౌలభ్యత, సంక్షిప్తత, వ్యక్తీకరణ, సొంపు ఏ ఇతర కృత్రిమ భాషలకు రావు. భాష ఒక కల్తీ లేని ఉక్కులా రూపొందాలి. ఆ ఉక్కును ఎటువంచినా, త్రిప్పినా దాని స్వరూపం మారదు. అది ఒక్క దెబ్బలో, మొనపోకుండా రాతిని రెండు ముక్కలు చేస్తుంది. మన భాష సంస్కృత భాషను అనుకరించుటతో కృత్రిమంగా తయారవుతోంది. భాష జాతి యొక్క

ప్రగతిని వివరించే ముఖ్యమైన సాధనం, సూచిక అని మరువరాదు. భావాల్ని ప్రకటించడానికి భాష సాధనం. జన జీవనంలో ఆలోచనలదే ప్రధాన పాత్ర. వాటి తర్వాతనే భాష. భాషగాని, కళగాని, సంగీతంగాని భావరహితమైతే జీవం వుండదు; నిష్ప్రయోజనమౌతుంది. జాతి జీవనం పరిపుష్టతను సంతరించుకుంటే, భాష, కళ, సంగీతం కూడ అప్రయత్నంగానే భావపరంగాను, చేతనత్వంలోను మరింత సౌష్ఠవాన్ని సమకూర్చుకుంటాయి. మనం నిత్యం వాడే వాడుక భాషలోని రెండు మంచి మాటలు వెలువరించే అర్థాన్ని రెండు వేల వర్ణనల కూర్పు కూడ ప్రకటించలేదు.

ఒక ఉపాధ్యాయుని గొప్పతనం ఆయన వాడే భాషాసౌలభ్యం మీద ఆధారపడి వుంటుంది.

నేను మా గురువులు ఉపయోగించే అర్థసహితమైన వాడుక భాషనే ఆదర్శ భాషగా పరిగణిస్తాను.

# స్త్రీల సమస్యలు

భారతదేశ స్త్రీలకు ఆదర్శం సీత, సావిత్రి, దమయంతి. ఈ విషయాన్ని మనం మరువకూడదు.

భారతదేశంలో స్త్రీత్వం అంటే మాతృత్వమే. నిస్వార్థత, త్యాగశీలత, సహనము – ఈ గుణవిశేషాలతో విలసిల్లే స్త్రీ మూర్తియే మాతృమూర్తి.

ప్రాక్ దేశ నారీమణులను పాశ్చాత్య ప్రమాణాల నేపథ్యంలో విమర్శ చేయటం న్యాయం కాదు. పాశ్చాత్య దేశాల్లో స్త్రీ భార్య మాత్రమే. ప్రాక్ దేశాలలో స్త్రీ మాతృ మూర్తి.

భారతదేశంలో స్త్రీయే ప్రత్యక్ష దైవం. ఆమె తన జీవిత సర్వస్వాన్ని మాతృత్వ భావనకే అంకితం చేస్తుంది. ఆదర్శమూర్తికి పాతివ్రత్యమే మూలధనం.

మన స్త్రీలు అంత విద్యావంతులు గారు. కాని పవిత్రతలో వారికి వారే సాటి.

మన స్త్రీమూర్తులకు తమ భర్తలు తప్ప మిగతా పురుషలందరూ తమ సంతా నంతో సమానం. పురుషులందరూ తమ భార్యలను తప్ప మిగతా స్త్రీలను తల్లులుగా భావించాలి. నా చుట్టూవున్న పరిసరాల్ని పరిశీలించి స్త్రీ లోలత్వాన్ని గమనించినప్పుడు నా హృదయంలో జుగుప్స చెలరేగుతుంది. స్త్రీ పురుష భేదాన్ని విస్మరించి, అందరు మానవులు సమానులేయనే భావన మనకు రానంతవరకూ, స్త్రీజనోద్ధరణకు అవకాశం వుండదు. అంతవరకు స్త్రీలు ఆటవస్తువులుగానే పరిగణింపబడతారు. ఈ పరిస్థితులే విడాకుల సంస్కృతికి బాట వేస్తాయి. అవసరాన్నిబట్టి, అవకాశాన్ని పురస్కరించు కొని పురుషులు స్త్రీల సౌందర్యాన్ని

ఉత్ప్రేక్షిస్తుంటారు. మరుక్షణంలో వారినే తూల నాడుతారు. ఇది సరియైన సంస్కృతి కాదు. అది ఉత్తమ ఆదర్శాలకు దోహదం చేయదు.

మానవుల్లో పురుషులు వేరు, స్త్రీలు వేరు అనే భావనతో అసమానతలను పెంచిపోషించరాదు. మొత్తం మానవ జాతి ఒక్కటే. అందరూ సర్వసమానతా భావాన్ని ప్రోత్సహిస్తూ ఒకరి సహచర్యాన్ని మరొకరు అభిలషిస్తూ పరస్పర సహకారంతో సంచరిస్తే జీవితం ఆనందమయమౌతుంది.

## భారతదేశ పతనానికి స్త్రీలు నిర్లక్ష్యం చేయబడటమే కారణం

భారతదేశంలో రెండు దుష్ట సంస్కృతులు ప్రబలాయి. ఒకటి స్త్రీ జాతిని అణచివేయటం, రెండు కులంపేరుతో బీదవారిని పీడించటం.

అమెరికాలో స్త్రీలు ఉచిత స్థాయిలో గౌరవింపబడతారు. అందువలన ఆ జాతివారు విజ్ఞానవంతులై పూర్తి స్వేచ్ఛను అనుభవిస్తూ, పటిష్ఠులై సౌభాగ్యవంతులై యున్నారు. కాని మన దేశంలో దానికి విరుద్ధంగా ప్రజలు దాస్యంలో జీవచ్ఛవాలుగా మగ్గుతున్నారు. దీనికి కారణం మనం వెతుక్కోనక్కరలేదు.

శక్తి లేకుండా ప్రపంచంలో పునరుజ్జీవనం సాగదనేది నగ్న సత్యం. మన దేశం ప్రపంచ దేశాలన్నిటిలోను అమిత బలహీనమైందిగా, మిక్కిలి వెనుకబడిందిగా వుండటానికి కారణం కూడ ఇక్కడ శక్తిని ప్రజలు అగౌరవపరచటం వల్లనే.

# స్త్రీ పురుషుల మధ్య వివక్షభావం అక్రమం

అన్ని జీవుల్లోనూ మెలిగే అంతరాత్మ ఒక్కటే అని మన వేదాంతం ఘోషిస్తున్నా మన దేశంలో మాత్రం లింగ వివక్షతను చూపించటం హాస్యాస్పదం. పురుషుడు, స్త్రీ పట్ల అనుచితమైన వ్యాఖ్యానం చేస్తుంటాడు. కాని స్త్రీ జనోద్ధరణకై అతడు పాటు పడింది లేశమైనా లేదు. ఆత్మ పదార్ధంలో లింగ భేదం వుందా? కనుక స్త్రీ పురుషుల మధ్య వ్యత్యాసాన్ని కల్పించటం యుక్తం కాదు. ఆత్మ ఒకే ఒక తేజస్సుతో సర్వత్రా వ్యాపించివుంది.

# స్త్రీలు గౌరవింపబడాలి

స్త్రీల పరిస్థితిని మెరుగు పరచగల్గితే నీకు శ్రేయోదాయకమైన జీవితం లభించటానికి అవకాశం వుంటుంది. అలా కానప్పుడు నీ వెనుకబాటుతనం నిన్నే అంటిబెట్టుకొని వుంటుంది.

స్త్రీ యొక్క దైవత్వం చెక్కుచెదరదు. దాన్ని వంచించటం ఎవరికి సాధ్యం కాదు. ప్రతి సందర్భంలోను అది దాని ఉనికిని ధృవీకరించుకుంటుంది. మోసాన్ని, కపటత్వాన్ని అది నిశ్చయంగా కనిపెట్టగల్గుతుంది. సత్యం ఎక్కడున్నా అది స్పందిస్తుంది. అలాగే ఆధ్యాత్మిక తత్వం యొక్క తేజస్సును. నిర్మలత్వం యొక్క పవిత్రతను అది గుర్తిస్తుంది.

ఆత్మజ్ఞానాన్ని పొందవలెనంటే ఆ పవిత్రత యొక్క అవసరం ఎంతైనా వుంది.

ప్రపంచం యొక్క శ్రేయస్సును సంరక్షించుకోవాలంటే స్త్రీ యొక్క పరిస్థితి మెరుగు పరచుకోవాలి. పక్షి ఎన్నడూ ఒక రెక్క సహాయంతో ఎగురలేదు.

అందుచేతనే రామకృష్ణ పరమహంస, మనముందు అవతరించిన మహా పురుషుడు, స్త్రీని గురువుగా స్వీకరించారు. ఆ కారణంగానే ఆయన స్త్రీ వేషంలో స్త్రీత్వాన్ని అభ్యసిస్తున్నారు. మాతృమూర్తులైన మన నారీమణులందరూ జగన్మాత యొక్క అంశ కలవారని వారి బోధనలు ప్రకటిస్తాయి.

కనుకనే నేను స్త్రీల కొరకొక మఠాన్ని నా ప్రథమ యత్నంగా స్థాపించాలని నిర్ణయించాను. ఈ మఠం గార్గి మైత్రేయులకే కాక అంతకంటే ఉత్తములైన స్త్రీలకు కూడ స్థావరం కావలెనని నా ఆకాంక్ష.

శ్రీరామకృష్ణులు స్త్రీ ఏ కులానికి చెందినదైనా, ఎంత సంపద కల్గినదైనా, ఆమె జగన్మాత స్వరూపమే అని భావన చేశారు. అందువలన మీరందరూ శ్రీరామ కృష్ణుల

భావనను ఆదరించి ప్రతి పల్లెలోను బాలికల పాఠశాలలను స్థాపించి స్త్రీ జనోద్ధరణకై పాటుపడాలని నా కోరిక. స్త్రీలు ఉన్నత స్థాయిని సాధిస్తే వారి సంతతి వారి గొప్ప పనుల ద్వారా దేశానికి గౌరవ ప్రతిష్ఠలు తెస్తారు. ఆ విధంగా దేశంలో సంస్కృతి, విజ్ఞానం, సామర్థ్యం, దైవభక్తి జాగృతం చెందుతాయి.

స్త్రీలు విజ్ఞాన సముపార్జన విషయం లోను, భక్తి ప్రదర్శన లోను సామర్థ్యం చూపలేరని ఏ శాస్త్రాలు నిర్వచించలేదు. దేశం పతనావస్థలో నున్న కాలంలో బ్రాహ్మణులు, ఇతర వర్ణాల వారిని వేదాధ్యయనానికి అనర్హులుగా చేశారు. అదే సమయంలో స్త్రీలకున్న హక్కులనన్నిటిని వారికి లేకుండా చేశారు. మనం వేదకాలం లేక ఉపనిషద్యుగం నాటి జన జీవనాన్ని పరిశీలిస్తే మైత్రేయి, గార్గి మొదలైన ప్రతిష్ఠాత్మకులైన స్త్రీలు ఋషుల పాత్రను స్వీకరించి వారికున్న చాతుర్యంతో బ్రహ్మ పదార్థాన్ని గురించిన చర్చల్లో పాల్గొన్నారని విశదమౌతుంది. సుమారు వేయిమంది వేదపారంగతులైన బ్రాహ్మణులు పాల్గొన్న సభలో బ్రహ్మపదార్థ జిజ్ఞాస వచ్చినప్పుడు గార్గి యాజ్ఞవల్క్యుని ఎదుర్కొని సవాలు చేసింది. అలాంటి ఆదర్శ స్త్రీ మూర్తులు ఆధ్యాత్మిక విజ్ఞానానికి అర్హులైనప్పుడు నేటి స్త్రీలు అవే హక్కుల్ని ఎందుకు కల్గియుండ కూడదు? ఒక కాలంలో ప్రవర్తిల్లిన ధర్మాలు తిరిగి సంభవించవచ్చు. చరిత్ర ఎప్పుడూ పునరావృత మౌతుంది. అన్ని జాతులు స్త్రీలకు తగిన గౌరవం ఇచ్చుటచే గొప్ప ఉన్నతిని సాధించాయి. ఏ దేశంగాని, ఏ జాతిగాని స్త్రీకి సమున్నత స్థానాన్ని ఈయలేదో, అది ఉన్నత స్థాయిని పొందలేదు. భవిష్యత్తులోను పొందదు. శక్తికి సజీవ స్వరూపాలైన స్త్రీలను సగౌరవంగా చూడని కారణంగానే భారతజాతి హీన స్థితికి దిగజారింది. ఎక్కడైతే నారీ లోకం గౌరవింపబడుతుందో అచ్చటే దేవతలు హర్షంతో ప్రజలను దీవిస్తారు. వారెచ్చట నిరసింపబడతారో అచ్చట అన్నీ దుష్ఫలితాలే, స్త్రీల విలువను ఉచిత పద్ధతిలో అంచనా వేయకుండా వారిని దైన్య స్థితిలో ఉంచిన కుటుంబాలు గాని, దేశాలు గాని ఔన్నత్యాన్ని సాధించలేవు. కనుక ముందుగా అలాంటి కుటుంబాల్ని, దేశాల్ని మనం మెరుగుపరచాలి.

# స్త్రీల సమస్యల్ని విద్య పరిష్కరించగలదు

నేటి భారతదేశ నారీలోకం చాల తీవ్రమైన సమస్యల్ని ఎదుర్కొంటోంది. కాని ఎంత జటిల సమస్యలనైనా నిర్మూలించగల్గింది విద్య మాత్రమే.

స్త్రీలకు విద్యా సౌకర్యాన్ని కల్పించండి. మిగతా విషయాలు వారికే వదలండి. వారికేవిధమైన సంస్కరణల ఆవశ్యకత వుందో వారే నిర్ణయించి ప్రకటిస్తారు.

సరియైన శిక్షణతో విద్యావంతులైన స్త్రీలు వారి సమస్యల్ని వారే పరిష్కరించుకుంటారు. ఇంతవరకు నిస్సహాయత యందు, పరుల మీద దాస్య ప్రవృత్తితో ఆధారపడుట యందు స్త్రీలు తర్ఫీదు పొందియున్నారు. కనుక ఏదైన చిన్న సమస్యను కాని, ప్రమాదాన్ని కాని వారు ఎదుర్కోవలసి వచ్చినపుడు దుఃఖంతో ఏడ్వడం తప్ప మరేమీ చేయలేని స్థితిలో వున్నారు. కనుక వారు ఇతర విషయాలతోబాటు ధైర్యసాహసాల్ని, పోరాట పటిమను విధిగా సంతరించుకోవాలి. ప్రస్తుత పరిస్థితుల్లో స్త్రీలు ఆత్మ రక్షణ విధానాన్ని కూడా అలవరచుకోటం అత్యావశ్యకం. ఝాన్సీరాణి ఈ విషయంలో ఎంత మహోన్నత స్థానాన్ని పొందిందో మీకు తెలుసు.

ముఖ్యంగా ప్రతి స్త్రీ అవసర పరిస్థితుల్లో తన జీవనోపాధి తానే సమకూర్చుకోగల సామర్థ్యాన్ని సంపాదించుకోవాలి.

స్త్రీలకు విద్యా ప్రణాళికను పాతివ్రత్య ధర్మాలతో ప్రారంభించాలి. భారత స్త్రీలకు పాతివ్రత్యం ఆనువంశికంగా సంక్రమించిన అంశమగుటచే దానిని వారు సులభంగా అవగాహన చేసికోగలరు. పాతివ్రత్యంలో స్త్రీలకు నిశితమైన అధ్యయనం సమకూరిస్తే వారి నడత దృఢపడుతుంది. ఆ శక్తితో వారు జీవితంలో అన్ని దశలలోను ఎట్టి పరిస్థితులనైనా నిర్భయంగా ఎదుర్కొనగలరు. అట్టి స్త్రీలు తమ ప్రాణ త్యాగానికైనా సిద్ధపడతారు గాని వారి

పాతివ్రత్యాన్ని గాని, తాము ఎన్నుకొన్న ధర్మాన్ని గాని విడనాడరు.

జీవిత ధర్మాలతో బాటు స్త్రీలకు శాస్త్రవిజ్ఞానాన్ని, వారికి, సమాజానికి కూడ ఉపయుక్తమగు ఇతర అంశాలను బోధించాలి.

భారత స్త్రీలకు పాశ్చాత్యుల వివేక సంపద లభ్యం కావాలని నేను అభిలషిస్తాను. కాని ఆ వివేక సముపార్జనలో స్త్రీలు తమ పవిత్రతను కోల్పోకూడదు.

# భారత స్త్రీత్వానికి ఆదర్శమూర్తి – సీత

ఆదర్శ భారతావనిలో నారీలోకానికి సీత ఒక ప్రతీకగా భాసిస్తుంది. సీత అనే స్త్రీ అసలు జీవించిందా లేదా అనిగాని, అది ఒక కట్టుకథా లేక చారిత్ర్యక సత్యమాయని గాని మనం విమర్శించ పనిలేదు. కాని ఆమె ఆదర్శం భారతీయుల మనస్సుల్లో స్థిరపడింది. సీత నెలకొల్పిన ఈ ఆదర్శం జన జీవితంలో చొచ్చుకొనిపోయి, వారి హృదయాల్లో చెరగని ముద్రవేసి, ప్రతివారి రక్తనాళాల్లో జీర్ణించుకొని యుండటం అక్షరసత్యం. మరియే ఇతర పురాణగాధ జాతిని ఇంతగా ప్రభావితం చేయటం వినం. భారతదేశంలో మంచితనానికి, స్వచ్ఛతకు, పవిత్రతకు మారుపేరే సీత. పెద్ద వారెవరైనా ఒక స్త్రీని, ఒక బిడ్డను గాని ఆశీర్వదించే సమయంలో 'నీవు సీతవలె జీవించు' అని అంటారు. సహనశీలి, దుస్సహమైన కష్టాలను ఓర్చిన వ్యక్తి, పతి విశ్వాసాన్ని చూరగొన్న పరమసాధ్వి సీతవలె జీవించాలని భారత స్త్రీలు తీవ్రమైన కృషి చేస్తారు. సీత మూర్తీభవించిన భారత నారీరత్నం. ప్రతీకారదృష్టికి ఆమె ఎప్పుడూ దూరంగా వుండేది.

భారతదేశమే కాదు మొత్తం ప్రపంచ సాహిత్యం అంతా వెదకినా సీతను బోలిన సాధ్వి మనకు కన్పించదు. ఆమె ఒక విశిష్టమైన స్త్రీ. రాముడు లాంటి వ్యక్తుల్ని మరికొందర్ని మనం చూడవచ్చు. కాని సీతలాంటి మరొక స్త్రీ మనకు తటస్థించదు. భారతనారి యొక్క పవిత్ర ఆదర్శాలన్నిటిని పరిపూర్ణంగా పుణికి పుచ్చుకొన్న స్త్రీ రత్నంగా కొన్ని వేల సంవత్సరాలుగా ఆర్యావర్తంలోని నలుమూలల ప్రజలచే ఆరాధింప బడుతున్న సాధ్వీమణి సీత. స్వచ్ఛతకే వన్నె తెచ్చిన స్త్రీగా, సహనశీలిగా, కష్టజీవిగా సౌభాగ్యవతియైన సీత ప్రజల హృదయాల్లో నిరంతరం నివసిస్తుంది. అసంతృప్తికి లోనుగాకుండా అష్టకష్టాల్ని అనుభవించిన, పతివ్రతయైన సీత మనజాతికే ఆరాధ్య దేవతగా కలకాలం నిలిచిపోవాలి. మన పురాణ వాఙ్మయం అదృశ్యమగుగాక, మన వేదాలు నిష్క్రమించుగాక, మన సంస్కృత సారస్వతం నశించుగాక, కనీసం ఐదుగురు భారతీయులున్నచోట సీత యొక్క కథ సజీవంగా నిలుస్తుంది. సీత జాతి

హృదయాల్లో స్థిరంగా ప్రతిష్ఠింపబడ్డది. ఆమె ప్రతి భారతీయుని రక్తనాళాల్లో భాగమైపోయింది. భారతయువతిని సీత యొక్క ఆదర్శాలకు దూరంగా తీసికొని వెళ్లి ఆమెను అధునాతన స్త్రీగా మార్చదలచే యత్నాలన్నీ విఫలంగాక తప్పదు. ఇది నిత్యం మనం చూస్తూనే వున్నాం. భారత స్త్రీ, సీత అడుగుజాడలలో నడచి అభివృద్ధి మార్గంలో పయనించాలే తప్ప వేరు మార్గం లేదు.

సీతలాంటి సాధ్వికి జన్మనిచ్చిన జాతి స్త్రీ జాతి పట్ల, వేరొక చోట కన్పించని అవ్యాజమైన పూజ్యభావాన్ని ప్రదర్శిస్తుందని నాకు తెలుసు.

# ఆధునిక స్త్రీకి ఆదర్శమూర్తి శారదాదేవి

మన మాతృమూర్తి శారదాదేవి ఆధ్యాత్మిక శక్తికి నిలయం. ఐనా, ఆమె బాహ్య ప్రకృతి లోతైన సముద్రంవలె ప్రశాంతతనే ప్రదర్శిస్తుంది. భారతీయ జీవన స్రవంతిలో ఆమె ప్రవేశం దేశ చరిత్రలో నూతన అధ్యాయానికి సంకేతంగా నిలుస్తుంది. ఆమె తన జీవితంలో ప్రదర్శించిన, బోధించిన ఆదర్శ ధర్మాలు భారతదేశంలోని స్త్రీల విమోచనోద్యమాలకు పారమార్థికతను చేకూరుస్తాయి. అంతేకాదు, ప్రపంచ దేశాల్లోని యువతుల మనస్సుల్లో ప్రవేశించి వారిని అమితంగా ప్రభావితం చేస్తాయి. ముఖ్యంగా మన భారతదేశంలో స్త్రీత్వానికి పరాకాష్ఠ మాతృత్వమే. ఇది ప్రతి స్త్రీలోను ప్రకృతి సిద్ధంగా ఏర్పడిన స్వభావగుణము. దీని చిహ్నాలు మనం చిన్న పిల్లల్లో కూడ చూడవచ్చును.

ఈ పవిత్ర మాతృమూర్తిని స్ఫూర్తి కేంద్రంగా తీసికొని గంగానది తూర్పు ఒడ్డున ఒక మఠాన్ని స్థాపించవలసియుంది. ఇక్కడున్న మఠంలో బ్రహ్మచారులు, సాధువులు సుశిక్షితులౌతున్నట్లే ఆ మఠంలో బ్రహ్మచారిణులు, సాధ్వీనులు శిక్షితులు కావాలి.

ఇక్కడ వున్న మీరెవ్వరూ మాత యొక్క విశిష్ఠమైన జీవిత పరమార్థాన్ని అవగాహన చేసికొనియుండరు. క్రమంగా మీకే అర్థమౌతుంది. శక్తి లేకుండా ఈ ప్రపంచంలో పునరుత్పత్తి సంభవించదు. మన దేశం అన్ని దేశాల్లోను మిక్కిలి బలహీనమైందిగాను, వెనుకబడిందిగాను వుంది, ఎందువలన? శక్తి స్వరూపాన్ని మన దేశం గౌరవహీనంగా చూడటమే దీనికి కారణం. భారతదేశంలో శక్తిని పునరుజ్జీవింప చేయటానికే మాత జన్మించింది. ఆమెను ఆదర్శంగా తీసుకొని గార్గిలు, మైత్రేయులు తిరిగి జన్మించాలి. కనుక ఆమె మఠాన్ని నేను ముందుగా కావాలని కోరుతున్నాను. శక్తి కరుణ లేకుండా మనం ఏది సాధించలేము. అమెరికా, ఐరోపాలాంటి దేశాల్లో నేను చూసిందేమిటో తెలుసా? వారూ శక్తిని ఆరాధిస్తారు. కాని కామ దాహంతో మాత్రమే. ఆ విధంగా వారు వారి అజ్ఞానాన్ని ప్రదర్శిస్తారు. అలా కాకుండా అదే

శక్తిని పవిత్ర భావంతో, సాత్వికభావంతో మాతృమూర్తిగా ఎంచి పూజిస్తే వారికి లభించే సత్ఫలితాలు అమితంగా వుంటాయి. మాతను గూర్చిన విషయాలు ఏరోజుకారోజు ఎక్కువ స్పష్టతతో గోచరిస్తున్నాయి. నా అవలోకనం మరింత ఎక్కువగా వికసిస్తోంది. కనుక ఆమె మఠానికి ప్రాధాన్యత నిచ్చి శీఘ్రంగా దాన్ని నిర్మించాలి. మాతకు, ఆమె కుమార్తెలకు ప్రథమస్థానం, పితృదేవునికి ఆయన కుమారులకు తరువాతి స్థానం ఈయాలి. దీనికి కారణం వుంది. నాకు మాతృమూర్తి యొక్క అనుగ్రహం పితృదేవుని కరుణ కంటే కొన్ని వందల వేలరెట్లు ఎక్కువ విలువైంది. మాతృదేవత యొక్క దయ, ఆమె శుభాశీస్సులు నాకు సర్వోత్కృష్టమైనవి. మాత అంటే గుడ్డిప్రేమ ప్రదర్శిస్తున్నందుకు నన్ను మన్నించాలి. కాని ఆమె ఆజ్ఞల్ని పాలించి ఆమె కనుసన్నలలో మెలిగే శక్తులు ఏమైనా సాధించి పెట్టగలవు. నేను అమెరికాప్రయాణానికి సన్నద్ధుణ్ణి అయ్యేముందు మాతకు ఆమె శుభాశీస్సులనందించమని కోరుతూ ఉత్తరం వ్రాశాను. ఆమె ఆశీస్సులు లభించిన తక్షణమే నేను ఏకబిగువున సముద్రం దాటి అమెరికా చేరాను. ఇక్కడ భయంకరమైన చలిలో అమ్మ మఠనిర్మాణానికై ధనం సేకరించే యత్నంలో అన్ని ప్రదేశాలు పర్యటిస్తూ ఉపన్యాసాలు ఇస్తున్నాను.

బాబూరామ్ తల్లి వయోభారం కారణంగా విచక్షణా జ్ఞానాన్ని కోల్పోయివుంటుంది. అందువల్లనే ఆమె సజీవమైన మాతృమూర్తిని కాదని మృణ్మయ విగ్రహంలోవున్న దుర్గాదేవిని ఆరాధించనున్నది. విశ్వాసం సమకూర్చుకోవటం ఎంత కష్టమైనపనో లోకవిదితమే. సజీవంగా వున్న దుర్గను ఆరాధించటం ఎలాగో చూపిస్తాను.అది సాధించి నా పేరు నిలబెట్టుకుంటాను. మీరు ఒక స్థలాన్ని సేకరించి అక్కడసజీవంగా వున్న దుర్గ అనే మాతృమూర్తిని ప్రతిష్ఠిస్తే నాకు సంతృప్తి కల్గుతుంది.అంతవరకు నేను నా మాతృదేశానికి రాలేను. నేను పంపించే డబ్బుతో మీరా కార్యాన్నిపరిపూర్తి కావిస్తేనే, నా మనస్సుకు శాంతి లభిస్తుంది. నా మాతృమూర్తి దుర్గాదేవి ఉత్సవం జయప్రదంగా చేయుటకు తగిన సన్నాహాలు చేస్తారని ఆశిస్తాను. గిరీష్ఘోష్మాతను అద్భుత రీతిలో ఆరాధిస్తున్నాడు. అతడు అతని అనుయాయులు కూడధన్యులు. మాత నా మనస్సులోకి వచ్చినప్పుడు మాత ముందు రాముని

గొప్పతనం ఎంత అని అనిపిస్తుంది. దానికి కారణం నాకు ఆమెపై నున్న వెర్రిభక్తి కావచ్చు.రామకృష్ణుని ఒక అవతారపురుషునిగా అందరు భావించవచ్చు. కాని మాతపట్ల భక్తి భావం ప్రదర్శించని వారు గౌరవార్హులు కారు.

# స్త్రీల కొరకు మఠం ఏర్పాటు విషయంలో స్వామీజీ భావనలు

స్త్రీలను గురించిన సరియైన అవగాహనలేని పరిస్థితి, స్త్రీల దైన్య జీవనం ఏ కుటుంబంలో, ఏ దేశంలో ప్రవర్తిల్లుతాయో ఆ కుటుంబం, ఆ దేశం అభివృద్ధికి నోచుకోవు. అందువలన అలాంటి స్త్రీ జనోద్ధరణ ముందుగా జరగాలి. వారి కొరకొక మఠం స్థాపింపబడాలి.

దైవమాత ప్రతిరూపులైన స్త్రీ లోకాన్ని ఆరాధించుటకు నేనెప్పుడూ వ్యతిరేకిని గాను.

స్త్రీల బాహ్యరూపం మగవారిని ఆకర్షితులను చేసి పిచ్చివారిగా మారుస్తుంది. కాని వివేకము, భక్తి, విచక్షణజ్ఞానం, సమత్వభావం ఇవి స్త్రీలకు ఆంతరంగిక ప్రేరణములు. వీని ప్రభావంచే పురుషుడు సర్వజ్ఞుడై ఫల సాధకుడై బ్రహ్మజ్ఞానిగా తరిస్తాడు. స్త్రీ సంతుష్టురాలైనప్పుడు ప్రసన్నతను ప్రదర్శించి పురుషుని స్వేచ్ఛా జీవిగా చేస్తుంది. భక్తితో అణుకువతో మాతృమూర్తిని ప్రసన్నురాలిగా చేసికోకుండా బ్రహ్మ విష్ణువులు కూడా ఆమె బంధం నుండి విడిపోలేరు. స్వేచ్ఛను పొందలేరు. ఈ కుటుంబ దేవతల ఆరాధన కొరకు, వారిలోని బ్రహ్మత్వాన్ని ప్రదర్శింపచేయుటకు నేను స్త్రీల మఠాన్ని వ్యవస్థాపిస్తాను.

రామకృష్ణుల శిష్యులు స్త్రీలలో ఇప్పటికీ వున్నారు. నేను స్థాపించాలను కున్న మఠాన్ని వారి సహకారంతో ప్రారంభిస్తాను. పవిత్ర మాతృమూర్తి వారికి ఆరాధ్యదైవం. శ్రీరామకృష్ణుల భక్తుల ధర్మపత్నులు, కుమార్తెలు మఠవాసితులు కాగలరు. వారు అలాంటి మఠం యొక్క ప్రయోజనాల్ని సులభంగా అవగాహన చేసికోగలరు. వారి ప్రేరణతో ఇతర గృహస్థులు కూడ ఈ ఉత్తమమైన ఉద్యమానికి చేయూతనిస్తారు.

ప్రపంచంలో ఏ గొప్ప పనినైనా సాధించాలంటే కొందరి త్యాగం అవసరం. మర్రిచెట్టు యొక్క చిన్న మొలకను చూసి అది కాలగమనంలో అతిపెద్దదైన వటవృక్షంగా మారుతుందని

ఊహించగలమా? అలాగే నేను కొద్ది పరిమాణంతో ఈ మఠాన్ని స్థాపిస్తాను. ఒకటి రెండు తరాల కాలంలో ప్రజలు ఈ మఠం యొక్క విలువను గుర్తిస్తారు. నా శిష్యురాండ్రు మఠం అభివృద్ధి కొరకు తమ ప్రాణాల్నే అర్పిస్తారు. మీరు కూడ మీ పిరికితనాన్ని, భయాన్ని వదలి సర్వోత్కృష్టమైన ఈ ఉద్యమానికి చేయూతనీయండి. దీని ఉన్నతాదర్శాన్ని ప్రజలముందు నిలుపండి. అనతికాలంలో దాని ప్రకాశం దేశం నలుమూలలా ప్రజ్వరిల్లుతుంది.

గంగకు అవతలి ఒడ్డున పెద్ద స్థలం సేకరింపబడి అచ్చట అవివాహిత మహిళలు, బ్రహ్మచారిణులైన విధవ స్త్రీలు జీవించుటకై శరణాలయం ఏర్పాటు చేయబడుతుంది. భక్తులైన వివాహిత స్త్రీలు కూడ అప్పుడప్పుడు వచ్చి అక్కడ వుండటానికి అవకాశమీయబడుతుంది. పురుషులకెట్టి సందర్భంలోను ఆ మఠంతో సంబంధం వుండదు. వయోవృద్ధులైన సాధువులు ఈ మఠానికి దూరాన వుండి నిర్వహిస్తారు. ఈ స్త్రీల మఠానికి అనుబంధంగా ఒక బాలికల పాఠశాల వుంటుంది. ఆ పాఠశాలలో మత గ్రంథాలు, సారస్వతము, సంస్కృతము, వ్యాకరణం, వాటితో బాటు కొంత ఆంగ్లం కూడ బోధింపబడాలి. కుట్టుపనులు, వంట విధానాలు, గృహ సంబంధిత పనుల విషయంలో పాటించవలసిన నియమ నిబంధనావళి, పిల్లల పెంపకం మొదలైన ఇతర విషయాలు కూడ బోధింపబడతాయి. జపతపాదులు, పూజా విధానాలు, ధ్యానము మొదలైనవి విధిగా బోధింపబడాలి. గృహాన్ని, కుటుంబ బంధాల్ని వదలి, శాశ్వతంగా మఠంలో నివసించే వారికి మఠం అన్న వస్త్రాదులను సమకూరుస్తుంది. అలా చేయలేనివారు మఠ పాఠశాలలో మామూలు పగటి విద్యార్థి నిలుగా విద్య నభ్యసించవచ్చు. కొన్ని సమయాల్లో మఠాధిపతి అనుమతితో పగటి విద్యార్థినులు కూడా మఠంలో వుండవచ్చు. అలావున్నప్పుడు మఠమే వారి ఆలనా పాలనా చూస్తుంది. పెద్దవారైన బ్రహ్మచారిణులు, అవివాహితులైన పిల్లల శిక్షణా కార్యక్రమాన్ని నిర్వహిస్తారు. ఐదు, ఆరు సంవత్సరాల శిక్షణానంతరం ఆ పిల్లల సంరక్షకులు వారి వివాహాలను నిర్వర్తింపవచ్చు. అలాకాక, వారు యోగాభ్యాసానికి, మత ప్రచార జీవితానికి అర్హులని భావింపబడితే వారి సంరక్షకుల అంగీకారంతో వారిని మఠంలో నివసించటానికి అనుమతించవచ్చు. ఐతే వారు

బ్రహ్మచారిణులుగా జీవితం గడుపుటకు ప్రతిజ్ఞ తీసుకోవాలి. ఈ బ్రహ్మచారిణులైన సన్యాసినులే కాల క్రమంలో మఠంలో ప్రచారకులుగాను, బోధకులుగాను పరిణమిస్తారు. వారే పల్లె ప్రాంతాల్లో కేంద్రాల్ని తెరచి స్త్రీ విద్యావ్యాప్తికై పాటుపడతారు. ఆ విధంగా దేశంలో అంకిత భావంతో పనిచేసే ప్రచారకుల కృషితో నిజమైన స్త్రీ విద్యా విస్తరణ సాధ్య మవుతుంది. విద్యార్థినులు మఠంతో అనుబంధాన్ని కల్గియున్నంత వరకు బ్రహ్మ చారిణులుగానే వుండాలి. ఇది మఠం యొక్క ప్రాథమిక నియమం. పారమార్థిక చింతన, త్యాగనిరతి, ఆత్మ సంయమనం ఈ మూడు మఠంలోని శిష్యగణం యొక్క ప్రధానాశయాలు కావాలి. సేవా ధర్మమే వారి జీవిత ప్రమాణం ఐపోవాలి. అలాంటి ఉత్కృష్టమైన ఆదర్శాలని ఎన్నకొన్న మఠవాసుల్ని గౌరవింపని వారెవరుంటారు? వారిని విశ్వసించని వారూ వుండరు. ఈ దేశంలోని స్త్రీల జీవితాలు పై విధంగా మలచబడితే సీత, సావిత్రి, గార్గిలాంటి ఆదర్శ సాధ్వీమ తల్లులు తిరిగి మనకు దర్శనమిస్తారు. ప్రాంతీయ దురాచార విషవలయంలో చిక్కుకొని మన దేశ వనితలు ఎంత దుస్థితికి గురియౌతున్నారో, తత్ఫలితంగా వారు చైతన్యరహితులై ఎంత దీనతను చవిచూస్తున్నారో తెలుసుకోవాలంటే మీరు పాశ్చాత్య దేశాల్ని దర్శించాలి. వారి దైన్య స్థితికి కారణం మనమే. కనుక వారిని ఉద్ధరించి, ఉన్నత స్థితికి తీసికొని వెళ్లవలసిన బాధ్యత మనదే కనుక కృషి ఆరంభించండి.

స్త్రీలను విద్యావంతులు చేసి తరువాతి కార్యక్రమాన్ని వారికే వదిలేయండి. వారికేది ఉచితమని తోస్తే ఆ మార్గాన్ని ఎంచుకుంటారు. వివాహానంతరం జీవితంలో ప్రవేశించిన తర్వాత కూడా వారు వారి భర్తల్ని ఉన్నతాదర్శాల వైపు ప్రభావితుల్ని చేస్తారు. శౌర్యవంతులైన బిడ్డలకు జన్మనిస్తారు. స్త్రీల మఠంలోని విద్యార్థినులకు పదిహేను సంవత్సరాలు నిండకుండా వివాహప్రయత్నం చేయకూడదనే సదాశయాన్ని వారి సంరక్షకులు తప్పక పాటించాలి. విద్యావంతులైన, సమగ్ర విషయ పరిజ్ఞానం గల్గిన ఇచ్చటి యువతులకు జీవిత భాగస్వాములు లభించటం అంత దుర్లభం కాదు. ప్రస్తుత సమాజం బాల్య వివాహాలను ప్రోత్సహించే పాతాలకు చెవియొగ్గదు. భవిష్యత్తులో కూడ అది సంభవం కాదు.

# పురుషులారా! మీ జోక్యం వద్దు

స్త్రీలను విద్యావంతుల్ని చేయండి చాలు వారికి అవసరమైన సంస్కరణలను వారే రూపొందించుకుంటారు.

స్త్రీలకు విద్యావకాశాల్ని కల్పించటం వరకు మన పాత్రను పరిమితం చేయాలి. వారు వారి సమస్యల్ని వారికి నచ్చిన రీతిలో పరిష్కరించుకోటానికి తగిన పరిస్థితి నెలకొల్పబడాలి. ఆ కృషి అంతా వారికై వారే నిర్వహించాలి. మన భారతదేశ స్త్రీలు ఈ కార్యక్రమాన్ని నిర్వర్తించటంలో ఇతర ప్రపంచ దేశాల వారికి దీటైన సామర్థ్యాన్ని ప్రదర్శించగలరు.

# అభివృద్ధి సాధనకు స్వాతంత్ర్యం ప్రధాన ఆవశ్యకత.

'ఒక స్త్రీ యొక్క గాని ఒక బిడ్డ యొక్క గాని విమోచనం కొరకు నేను కృషి చేస్తాను' అని మీలో ఎవ్వరైనా చెప్పటానికి సాహసిస్తే అంతకంటే గొప్ప తప్పిదము మరొకటి వుండదు. వితంతు సమస్యను గురించి, స్త్రీ సమస్యను గురించి మీ అభిప్రాయమేమిటని నన్ను పదేపదే అడుగుతుంటారు. నేను వితంతువుని కాదు, స్త్రీని కాదు. నన్నెందుకు పలుమార్లు ఈ ప్రశ్నవేస్తారు? మనం ఎవరు స్త్రీల సమస్యల్ని పరిష్కరించటానికి? స్త్రీల సమస్యల్ని నివారించటానికి, వారిపై ఆధిపత్యం వహించ టానికి మీరేమైనా భగవత్స్వరూపులా? పురుషులారా! స్త్రీల సమస్యల్ని వారే ఎదుర్కొని పరిష్కరించుకొంటారు. మీ జోక్యం వద్దు.

# భారతదేశ స్త్రీలకు నా ప్రబోధము

ఈ దేశంలోని స్త్రీలకు కూడ నేను పురుషులకిచ్చిన సందేశాన్నే ఇస్తాను. భారతదేశం మీద, మన దేశ విశ్వాసాలపైన పూర్తి నమ్మకం వుంచండి. పటిష్ఠులు కండి. ఆశాజీవులై భారతీయులైనందుకు గర్వపడుతూ బ్రతకండి. హిందువులు తాము ఇతర జాతుల నుండి గ్రహించిన దాని కంటే కొన్ని రెట్లు అధికంగా వారికీయగల సామర్థ్యం కల్గియుంటారని మరువకండి.

గౌరీ మాత ఇప్పుడు ఎచ్చట వుంది? ఇతరులను ప్రభావితం చేయగల ఉన్నత ప్రవృత్తి గల అలాంటి మాతలు బహు సంఖ్యలో మనకు కావలసియున్నారు.

మనకు పురుషుల కంటే ఆడ సింహాలను పోలిన వనితలు అవసరం. వారే ముఖ్యంగా భారత స్త్రీల అభివృద్ధి కొరకు పాటుపడాలి.

అసలు ఆత్మతత్వానికి లింగ భేదం లేదు. ప్రపంచవ్యాప్తంగా సమాజాన్ని అభ్యున్నతి మార్గంలో నడపటానికి కృషి చేయగల పురుషులు, స్త్రీలు వేల సంఖ్యలో కావాలి. హిమాలయాల నుండి కేప్‌కామరిన్ వరకు, ఉత్తర ధృవం నుండి దక్షిణ ధృవం వరకు అన్ని ప్రాంతాలను పర్యటించగల కార్యశూరుల ఆవశ్యకత ఎంతైనా వుంది. సోమరితనాన్ని వదలి కృషి చేయగల సభ్యులతో ఒక సంస్థ వ్యవస్థీకరింపబడాలి.

ప్రపంచానికి వెలుగును ప్రసాదించాలి. ఆ పని ఎవరు చేస్తారు? గతంలో త్యాగమే ప్రధాన ధర్మంగా నడిచింది. ఇంకముందు కొన్ని యుగాల వరకు అదే కొనసాగుతుంది. ప్రపంచంలోని అతి సాహసికులు, అత్యున్నతులైన వారు చాలమంది ప్రజల శ్రేయస్సు కొరకు, ప్రపంచ ప్రజల మంచి కొరకు త్యాగాలను చేయాల్సి వుంటుంది. శాశ్వతమైన ప్రేమను, కరుణను పంచియిచ్చే బుద్ధులు కొన్ని వందల సంఖ్యలో మనకు అవసరం.

ప్రపంచంలో చాలా మతాలు నిర్జీవాలై అపహాస్యం పాలవుతున్నాయి. ప్రపంచా నికి కావల్సింది మానవుని నడత. ప్రేమతో జ్వలిస్తూ స్వార్థరహితమైన ప్రవృత్తి గల జీవితాన్ని ఆపేక్షించే మానవులు ప్రపంచంలో వర్ధిల్లాలి. ప్రేమాతిశయంతో ఇచ్చిన సందేశం విలువతో స్వీకరింపబడుతుంది.

సాహసోపేతమైన వచనాలు, అంతకంటే మిక్కుటమైన సాహసకృత్యాలు మనకు అవసరం. ప్రపంచం దైన్యస్థితిలో వుంది. కనుక మనం శాంతితో నిద్రపోలేము. జాగృతులు కండి. చైతన్యవంతులై కృషి చేయండి. 500 మంది పురుషులతో భారత దేశం విజయం సాధించటానికి యాబది సంవత్సరాలు పడితే అంతేమంది స్త్రీలతో అది కొన్ని వారాలలోనే సాధ్యమౌతుంది.

# నిజమైన మతం

## మతం యొక్క నిర్వచనం – దాని నిజ స్వరూపం

మూర్ఖుని మానవుని గాను, మానవుని దైవం గాను మార్చగల సాధనాన్నే మతం అంటాము. మన అందరి మనస్సుల్లోను మనలను కార్యోన్ముఖులను చేసే ప్రేరణ శక్తి ఒకటి వుంది. దాని వెనుక మరొక శక్తి నీవు పనిచేయవద్దు అని వారిస్తూ వుంటుంది. మన మనస్సుల్లోని కొన్ని భావపరంపరలు జ్ఞానేంద్రియాల ద్వారా బహిర్గతం కావటానికి ఉద్యమిస్తూ వుంటాయి. అలాగే వాని వెనుక సూక్ష్మాతిసూక్ష్మమైన మరొక శక్తిపై ప్రయత్నాన్ని నిరోధించే యత్నంలో వుంటుంది. ఈ పై రెండు ధర్మాల్ని సంస్కృతంలో అతి సుందరమైన 'ప్రవృత్తి', 'నివృత్తి' అనే మాటల్లో వర్ణిస్తాం. బాహ్య చేష్టల ప్రేరణను 'ప్రవృత్తి' యని, అంతర్ముఖ చైతన్య ప్రేరణను 'నివృత్తి' యని అంటాం. నివృత్తి ప్రక్రియతో మతం, ఆధ్యాత్మిక చింతన ఆరంభమౌతాయి. నివృత్తి పథం లోపించిన చోట మతం ఉత్పన్నం కాదు.

ప్రతి జీవిలోని ఆత్మ సుసౌష్ఠవమైన దైవత్వమే. మన ఆంతరంగిక బాహ్య ప్రవృత్తుల సంయమనం ద్వారా ఆ దైవత్వాన్ని లోపల ప్రతిష్ఠించటమే మనం సాధించ వలసిన అంతిమ లక్ష్యం. కర్మ నిష్ఠతో గాని, భక్తి యోగం ద్వారా గాని, మనస్సును నియంత్రించిగాని, వేదాంత పరిజ్ఞానం ద్వారా గాని – వీనిలో ఏ ఒక్క దాని ద్వారా గాని, లేక అన్నిటి ద్వారా గాని – పై గమ్యాన్ని సాధించి ముక్తుడవుగా. ఇదే మత సారాంశము. సిద్ధాంతాలు గాని, నిబంధనలు గాని, క్రతువులు గాని, గ్రంథాలు గాని, దేవాలయాలు గాని – ఇవన్నీ అప్రాముఖ్యమైన సాధనాలు మాత్రమే.

వ్యక్తిలో సహజసిద్ధంగా వున్న దైవత్వం యొక్క ఆవిష్కరణే మతం.

మతం అనేది గ్రంథాల్లోనూ, నిబంధనల్లోను, సిద్ధాంతాల్లోను, ఉపన్యాసాల్లోను, హేతువాదం లోను దర్శనమీయదు. మతం అంటే జీవించటం, మతం అంటే సాధించటం. మిత్రులారా! మీలో ప్రతివారు ఋషిత్వాన్ని పొంది, ఆత్మజ్ఞానానికి సంబంధించిన సత్యాలను ఎదుర్కొంటే తప్ప మీరు మతపరమైన జీవితంలో ప్రవేశించి నట్లు కాదు. మీ అంతరాత్మ మీ కొరకై పల్లవించి వికసిస్తే తప్ప, మతాన్ని మాటలతో సరిపెట్టుకోవలసిందే. గమ్యానికి మార్గాన్ని ఎంచుకొనే స్థితిలో వున్నట్లే. మీ ప్రలాపనలు కూడ ఇతరుల భావాలను వెల్లడి చేయునవి మాత్రమే అవుతాయి.

అన్నిటికంటే విశేషమైన విషయం మనం గుర్తించుకోవాల్సింది మరొకటి వుంది. మతం అంటే నిన్ను నీవు తెలుసుకోవటమే. 'ఒక సిద్ధాంతాన్ని నమ్ముకొని వ్యవహరించు, నీకు రక్షణ వుంటుంది', అని ఎవరూ మనకు బోధించకూడదు. అ సిద్ధాంతంలో మనకు విశ్వాసం ఉండదు. మీరు మీ కృషితో ఏ స్థితికి చేరగలరో ఆ స్థితే మీరు. భగవత్కృప వల్లను, మీ శ్రమ వల్లను పొందగల స్థితే మీరు. కొన్ని సిద్ధాంతాల్లోను, నిబంధనల్లోను విశ్వాసముంచటం వలన మీరేమీ సాధించలేరు. పరమార్థతత్వం మనముందు 'అనుభూతి' అనే శబ్దాన్ని వుంచింది. మన గ్రంథాలు మాత్రమే భగవం తుని దర్శించుకోవాలి అని పదేపదే ప్రకటిస్తున్నాయి. ఈ వచనాలు చాల సాహసోపేత మైనవే. కాని అవి కఠోర సత్యాలు. మతం అంటే అనుభూతి కాని కేవలం వినికిడిగాదు. మతం అంటే ఒక సిద్ధాంతాన్ని అభ్యసించటం కానే కాదు, బుద్ధితో ఆమోదించేది అంతకంటే కాదు. అది మనలో జీర్ణించుకొనిపోయి అనుభవైక్యం కావాలి. అలాగే భగవంతుడున్నాడనే సత్యానికి ఋజువు మన హేతువాదానికతీతమైంది. మన పూర్వీ కులు, ఆధునాతనులు కొందరు భగవత్సాక్షాత్కారాన్ని పొందారనే విషయమే భగవానుని ఉనికికి నిజమైన తార్కాణము.

నీ పవిత్రతను రక్షించుకో, స్వార్ధరహితుడవుకా — అదే మన మత సారాంశము.

మతం సిద్ధాంతాల్లో లేదు, అభ్యాసంలో, అనుభవంలో మాత్రమే గోచరిస్తుంది. మంచి నడతను అలవరచుకోవటం, ఇతరులకు మంచి చేయటం – వీనిలోనే మొత్తం మతం ఇమిడివుంది.

నిస్వార్థతే దైవత్వము. వ్యక్తి సింహాసనాన్ని అధిరోహించవచ్చు, బంగారు భవనంలో నివసించవచ్చు. ఐనా అతడు స్వార్థరహితుడైతే అతనిలో భగవంతుడున్నట్లే. మరొకడు పూరి గుడిసెలో వుండి జీర్ణవస్త్రాలు ధరించి నిరుపేద కావచ్చు. ఐనా అతడు స్వార్థపరుడైతే అతడు ప్రాపంచిక విషయాల్లో మునిగి తేలినవాడౌతాడు. అతడు దైవత్వానికి దూరుడే.

స్వార్థ ప్రయోజనాలకి ప్రాధాన్యమివ్వటం నేరం; స్వార్థపరత్వమే గొప్ప పాపం. నేను ముందు భుజిస్తాను, నేనే అందరికంటే ఎక్కువ ధనవంతుణ్ణి కావాలి, అందరికంటె ముందు నాకు స్వర్గప్రాప్తి కల్గాలి; ఇతరుల కంటే ముందు నాకు ముక్తి లభించాలి– ఇలా ఆలోచించేవాడు స్వార్థపరుడౌతాడు. అలాకాక 'స్వర్గానికి వెళ్లే వాళ్లలో నేను ఆఖరువాణ్ణిగా వుంటాను. నేను నరకానికి పోవటంవల్ల నేను నా తోటి సహచరులకు ప్రయోజనం సిద్ధిస్తే నేను నరక ప్రాప్తిని కూడ ఆహ్వానిస్తాను.' అని ఎవరు భావిస్తారో అతడు నిస్వార్థపరుడు. నిస్వార్థపరత్వమే నిజమైన మతావలంబకునికి గీటు రాయి. ఎవడు ఇతరులకంటే అధిక మోతాదులో నిస్వార్థతను ప్రదర్శిస్తాడో, అతడే ఎక్కువ పారమార్థిక చింతన కలవాడు, అతడే ఈశ్వరునికి చేరువౌతాడు.

మన అభివృద్ధికి దోహదం చేసేదే ధర్మం. మన పతనానికి దారి తీసేదే అధర్మం. మానవుడు త్రిగుణోపేతుడు. ఆ గుణములే : క్రూరత్వము, మానవత్వము, దైవత్వము. నీలోని దైవత్వాన్ని పెంపొందించేదే ధార్మిక గుణం. నీలోని క్రౌర్యాన్ని ఇనుమడింప చేసేది అధర్మ వర్తనము. నీ దుష్ట స్వభావాన్ని నశింపజేసి, ప్రేమ, దయ, దాక్షిణ్యాల కాలవాలమైన మానవత్వాన్ని సమకూర్చుకోవాలి. తర్వాత క్రమంగా ఆ స్థాయిని కూడ అధిగమించి స్వచ్ఛమైన బ్రహ్మానంద స్థితిని, సచ్చిదానంద పదవిని చేరాలి. అదే మంటలేని ప్రజ్వలనము,

అదే అవ్యాజమైన ప్రేమ. ఆ స్థితిలో ప్రేమకు మానవ ప్రేమకున్న బలహీనతలు ఉండవు. దైన్యమునకు తావుండదు.

మానవుడు ఎక్కడవున్నా, ఏ స్థితిలో వున్నా మతం అతని ఉద్ధరణకు ఉపకరించ నప్పుడు అది నిరుపయోగమే. అది కొద్ది మందికి మాత్రం సిద్ధాంత పరంగా మాత్రమే నిలిచివుంటుంది. మానవుడు సేవా వృత్తిలో వున్నా, స్వతంత్రుడుగా వున్నా, పతనా వస్థలో కూరుకుపోతున్నా లేక పవిత్రుడై ఉన్నత స్థాయిని చేరియున్నా – అన్ని పరిస్థితుల్లోను సమమైన చేయూత నిచ్చి ఉద్ధరించగల్గేదే మతం.

ఆత్మజ్ఞానం విషయంలోను, మానసిక వికాసం పట్ల, భౌతిక విషయాలలోను దౌర్బల్యాన్ని తెచ్చిపెట్టే దేనినైనా సరే విసర్జించు, నిరసించు. మానవునిలోని సహజ దార్ఢ్యతను ప్రస్ఫుటీకరింపచేసేదే నిజమైన మతం. మన చిన్న దేహంలో అనంతమైన శక్తి స్ప్రింగ్ రూపంలో అమరివుంది. అదే విస్తరిస్తుంది. ఆ విస్తరణ అతిశయిస్తూ వుంటే ఈ శరీరాలు భరించలేని స్థితి ఏర్పడుతుంది. ఆ స్థితిలో శక్తి ఆ దేహాల్ని త్యజించి వాటికంటే శ్రేష్ఠమైన వాటిని ఆశ్రయిస్తుంది. ఇదే మానవుని యొక్క, మతం యొక్క, నాగరికతను గురించిన ప్రగతి యొక్క యథార్ధ చరిత్ర.

# భగవంతుని చేరు మార్గములు

మానవులను నాల్గు వర్గాలుగా విభజింపవచ్చు : వివేకవంతులు, భావావేశ పరులు, మహిమాన్వితులు, శ్రమజీవులు. ప్రతివర్గం వారికి వారి వారి ఆరాధనా విధానాలు వారికి అనుకూలమైన పద్ధతిలో ఏర్పాటు అయివుంటాయి. వివేకవంతులు హేతుబద్ధమైన వైదిక ప్రమాణాలను అనుసరించే పూజావిధానాల పట్ల ఆసక్తి చూపుతారు. శ్రమ జీవులు వైదిక నిష్ఠా పరత్వాన్ని నిరసిస్తారు. తోటి మానవులకుప కరించే శ్రమదాన కార్యక్రమాన్ని చేపట్టటానికి ఇష్టపడతారు. ఆ కార్యక్రమమే వారికి ఆరాధన మార్గమౌతుంది. అలాగే జ్ఞానులకు, భావుకులకు వారి స్థాయికి తగ్గ ఆరాధనా విధానాలు వారికున్నాయి. ఈ అన్ని వర్గాల వారికి మతంలో వారి వారి విశ్వాసాలు వారికున్నాయి.

మానవాళికి అంతిమ లక్ష్యం, అన్ని మతాలకు గమ్యం, ప్రయోజనం – అన్నీ ఒక్కటే. అదే భగవంతునితో ఐక్యము. దానినే దైవత్వంతో పునస్సమాగమం అని కూడ చెప్పవచ్చు. ఈ దైవత్వమే మానవునిలో ప్రకృతి సిద్ధంగా ఇమిడియున్న నైజగుణం. అందరి లక్ష్యం ఒకటే ఐనా దాన్ని సాధించే మార్గాలు సాధకుల తత్వాలని బట్టి వేరువేరుగా వుంటాయి.

భగవత్సాన్నిధ్యాన్ని చేరటానికి మనం ఎంచుకునే గమ్యం, మార్గాలు రెంటిని కలిపి యోగ అంటాం. ఈ యోగ అనే పదం ఆంగ్లం నుండి 'గిళిదిలి 'అంటే కలుపుట అనే అర్థం కలిగిన మాట వలెనే సంస్కృతం నుండి ఉద్భవించింది. ఈ కలుపుట అనేది భగవంతునితో ఐక్యమగుట అను భావాన్ని, స్ఫురింప చేస్తుంది. ఈ యోగాల్లో పలు విధాలున్నాయి. అందులో ప్రముఖమైనవి : కర్మయోగము, భక్తి యోగము, రాజయోగము, జ్ఞానయోగము.

ప్రతి వ్యక్తి తన ప్రవృత్తిని బట్టి తన అభివృద్ధిని సాధిస్తాడు. ప్రతి విజ్ఞానశాస్త్రానికి దాని విధానాలు దాని కున్నట్లే ప్రతి మతానికి దాని పద్ధతులు దాని కేర్పడివుంటాయి. మతం దాని యొక్క అంతిమ లక్ష్యాన్ని సాధించే విధానాల్నే యోగమంటాం. మనం బోధించే యోగ

విధానాన్ని ఆయా వ్యక్తుల స్వభావ ప్రవృత్తుల కనుకూలంగా అనుసరింప చేయాలి. ఆ యోగ విధానాల్నే ఈ క్రింద సూచించినట్లు నాల్గు వర్గాలుగా విభ జిస్తాము.

1. *కర్మ యోగము :* వ్యక్తి కర్మలు, బాధ్యతలు నిర్వర్తించటం ద్వారా దైవత్వాన్ని పొందే విధానము.
2. *భక్తి యోగము :* వ్యక్తి తన ఇష్ట దైవం పట్ల చూపే భక్తి ప్రేమల ద్వారా దైవత్వాన్ని సాధించే పద్ధతి.
3. *రాజ యోగము :* మానసిక సంయమనం ద్వారా దైవత్వం సాధించుట.
4. *జ్ఞాన యోగము :* జ్ఞానం ద్వారా దైవత్వసిద్ధిని పొందే మార్గము.

ఈ మార్గాలన్నిటికి భగవంతుని చేరటమనే గమ్యం ఒక్కటే.

జ్ఞాన, భక్తి, రాజ, కర్మ యోగాలు మోక్ష సాధనకు నాల్గు మార్గాలు. వ్యక్తి ఈ నాల్గు మార్గాల్లో తన కనుకూలమైన మార్గాన్ని అనుసరించాలి. కాని ప్రస్తుత కాలంలో కర్మయోగం అధిక ప్రాముఖ్యాన్ని సంతరించుకుంది.

# జ్ఞానయోగం – జ్ఞాన మార్గం

అన్ని విషయాల్లోను భాసిల్లే ఏకత్వమే వేదాంతం యొక్క ప్రధాన ధర్మం. ఏ విషయంలోను ద్వంద్వ స్థితి లేదు. జీవితాలు రెండు లేవు. రెండు లోకాలకు రెండు రకాలైన జీవితం లేదు. ఒకే ప్రపంచం, ఒకే జీవితం, ఒకే అస్తిత్వం మనకున్నాయి. సృష్టిలో ప్రతిది ఆ ఒక నిత్యవస్తువులోని అంశమే. స్థాయీ భేదమే తప్ప గౌణికమైన మార్పు ఏమిలేదు. సూక్ష్మాతి సూక్ష్మమైన జీవికి, నాకు ఏమీ వ్యత్యాసం లేదు, స్థాయి భేదం తప్ప. అత్యున్నత స్థితిలోని జీవి యొక్క దృక్పథంలో ఈ వ్యత్యాసాలన్నీ మటు మాయమౌతాయి.

ఈ విషయంలో పరిపూర్ణత్వాన్ని సాధించటం అంటూ ఏమి వుండదు. వ్యక్తి ఇప్పటికే స్వతంత్రుడు, పరిపూర్ణుడు. మతం, భగవంతుడు, సత్యాన్వేషణలను గురించి తర్కిస్తాడు. ఎందువలన? మానవుడు భగవంతునిపై దృష్టిని ఎందుకు సారిస్తాడు? మానవుడు వ్యక్తిలోను, సమాజంలోను, జాతిలోను కూడ సుసంపన్నమైన ఆదర్శాలు ప్రవర్తిల్లాలని అభిలషిస్తాడు. ఎందువలన? వీటికి కారణం వివరిస్తాను. వ్యక్తిలో అంతర్గతంగా ఈ విషయాలన్నిటిపై మధనం జరుగుతూ వుంటుంది. వ్యక్తిలో వున్న భగవదాంశ ఈశ్వరతత్వాన్ని అన్వేషించి తెలుసుకొమ్మని అనుక్షణం ప్రేరేపించి కార్యోన్ముఖుణ్ణి చేస్తుంది. ఆ మార్గంలో పయనించి వ్యక్తి సతమతమౌతాడు. దేవాలయాలు, ప్రార్థనా మందిరాలను, పుణ్యక్షేత్రాలను దర్శిస్తాడు. చివరకు తనలోని ఆత్మయే దైవమని తెలుసుకుంటాడు. అదే వ్యక్తి యొక్క సహజస్వరూపం. వ్యక్తి తన సహజ స్థితిలో పవిత్రుడే, పరిపూర్ణుడే. కాని అజ్ఞానం అనే ముసుగు మనసును ఆవరించి అతని నిజస్థితిని తాను ఎరుగకుండ చేస్తుంది. కాని వ్యక్తి తాను ఆచరించే సత్క్రియాకాండ ద్వారాను, సద్భావనల ప్రభావం చేతను తనను ఆవరించిన అజ్ఞాన తిమిరాన్ని తనలో ఉదయించిన జ్ఞాన భాస్కరుని సహాయంతో చెదరగొట్టి ఆత్మజ్ఞానిగా భాసిస్తాడు.

వ్యక్తి అస్వతంత్రుడు కాడు. అతడు ఎప్పుడూ స్వతంత్రుడే. ఈ జ్ఞానాన్ని మనకు

ప్రసాదించేదే వేదాంతం. వ్యక్తి తాను అస్వతంత్రుడననే భావించటం చాల ప్రమాదకరం. అది గొప్ప తప్పిదమే కాదు, ఆత్మవంచన కూడ ఔతుంది. 'నేను అస్వతంత్రుడను, నేను బలహీనుడను, నేను నిస్సహాయుడను' అని భావించే వ్యక్తిని చూచి మనం జాలిపడాల్సిందే. ఆ విధంగా ఆ మనిషి తనకై తాను అదనంగా ఒక శృంఖలాన్ని చేర్చుకుంటాడు. కనుక వ్యక్తి ఆ భావనను దగ్గరకు రానీయకూడదు. ఆ తలంపును వెల్లడి చేయనూ కూడదు.

మానవుని బలహీనతే ప్రపంచంలోని అన్ని అరిష్టాలకు మూలకారణం. ఇది వేదాంత సూక్తి. మన బలహీనతే మనం అసత్యం చెప్పటానికి, దొంగతనం చేయటానికి, హంతకులుగా మారటానికి, ఇంకా ఇతర నేరాలు చేయటానికి కారణమౌతుంది. బలహీనులం కావటంచేత బాధలు అనుభవిస్తాం, మరణిస్తాం. మనల్ని బలహీనపరచే అవకాశాలు లేనంతవరకు మనకు బాధలుండవు, మరణముండదు. మనల్ని మాయ ఆవరించియున్నంతవరకు మనకు కష్టాలు తప్పవు. అరిష్టాలు అంతరించాలంటే మాయలో చిక్కుకోకూడదు.

సర్వోత్కృష్టమైన తాత్త్విక పరిజ్ఞానంతో శ్రేష్ఠమైన నైతిక ఆదర్శాల్ని, వానితోబాటు స్వార్ధరహితాన్ని సహజీవనం చేయించవచ్చు. కాని నీతి ధర్మాలకు సరియైన పునాదిని సాధించాలంటే మనకు వేదాంతపరమైన, విజ్ఞానపరమైన ఆలోచనల ఆవశ్యకత వుంటుంది. మానవుడు సేకరించే విజ్ఞానం అతని సుఖసౌభాగ్యాలను ఏ విధంగానూ భంగపరచదు. అసలు విజ్ఞానమే మానవుని జీవితంలో అన్ని అంశాలలోను అండగా వుండి కాపాడుతుంది. విజ్ఞానమే ఆరాధన; విజ్ఞానం ఎంత ఎక్కువ సంపాదిస్తే దాని వలన అంత ఎక్కువ మేలు సమకూరుతుంది. పరిమితం చేయకూడని అంశాల్ని పరిమితం చేయటం వల్లనే మనకు అనర్థాలు సంభవిస్తున్నాయని వేదాంతులు ప్రవచిస్తారు. ప్రేమ ఆరంభదశలో కొద్ది ప్రమాణంలో వుండి అదే క్రమంగాపెరిగి అంతిమ స్థాయిలో భగవత్స్వరూపంగా సాక్షాత్కరిస్తుంది. ప్రపంచంలో మనకు కనిపించే చెడు అంతా మనవల్లనే సంభవిస్తోందని వేదాంతం ఘోషిస్తోంది. దీనికై నిస్సహాయతను, నైరాశ్యాన్ని ప్రదర్శించకూడదు. మరొకరువచ్చి

మనకు చేయూతనిచ్చేదాక మనం ఈ దుస్థితి నుండి బయల్పడలేమని భావించరాదు. మన వేదాంతం ప్రకారం మనకు సహాయం బయట నుండి రాదు. ఆ దుస్థితిని అధిగమించే శక్తి మనలోపల నుండే మనకు లభిస్తుంది. విశ్వంలో వున్న దేవతలందర్నీ ప్రార్థించి ఆర్తిగా విలపించండి. నేను సంవత్సరాల పర్యంతం అలా విలపించాను. చివరకు నాకు సహాయం లభ్యమైంది. కాని ఆ సాయం నాకు నాలోపల నుండే లభించింది. కాని ఈ స్థితికి చేరక ముందు నేను ఎన్నో పొరపాట్లు చేశాను. ఎన్నో ఆశయాలతో నా ప్రయాణాన్ని ఆరంభించాను. వాటిలో సన్మార్గంలో నడచినవీ, వక్రమార్గంలో పయనించినవీ వున్నాయి. కానీ ఏమీ వృధా కాలేదు. మంచీ, చెడూ రెండు రకాల ఆశయాలు నాకు పురోగతిని సాధించిపెట్టి నన్నీ ప్రస్తుత స్థాయికి చేర్చాయి. నేను జీవితంలో ఎన్నో తప్పిదాలు చేశాను. ఆ తప్పిదాలే నాకుపకరించి నన్నీస్థితికి తెచ్చాయి. అవి చేసినందుకు నేను చాల సంతృప్తి పడుతున్నాను. ఇలా చెప్పానని నన్ను అపార్థం చేసుకొని కావాలని తప్పులు చేయవద్దు. పొరపాటున చేస్తే నిరుత్సాహపడవద్దు. చివరకు అన్నీ సవరింపబడుతాయి. వస్తుతః మన ప్రకృతి దోషరహితమైంది, పవిత్రమైంది. ఆ ప్రకృతిని ఏ శక్తీ నాశనం చేయలేదు. మనలోని మన ప్రధాన ప్రవృత్తి ఎల్లప్పుడు ఒకేలా వుంటుంది.

పాపాన్ని గురించి ఆలోచిద్దాం. 'ప్రపంచంలో ప్రతి వ్యక్తి పాపి' అనే వాదం ఒకటి వుంది. వేదాంతంలో నిర్ణయించిన ప్రకారం ప్రతివ్యక్తి ప్రకృతి సిద్ధంగా పవిత్రుడే. ఒక వాదన మానవునిలోని బలసంపదను సూచిస్తే, మరొక వాదన అతని బలహీనత లను ప్రకటిస్తుంది. మనలోని బలహీనతలను పట్టించుకోకుండా అభివృద్ధి సాధించ టానికి యత్నం చేయాలని వేదాంతం ప్రబోధిస్తుంది. వ్యక్తి జన్మించగానే రోగాలుకూడ అతనితోబాటే ప్రవేశిస్తాయి. అయితే మానవుడు తనకున్న రోగాల్ని గురించే పదేపదే ఆలోచించి, కృంగిపోకుండా, మందులు వాడి రోగాన్ని నివారించుకునే యత్నం చేయాలి. బలహీనతలను నివారించుకోవాలంటే, తరచు వానిని గూర్చే ఆలోచిస్తే ప్రయోజనం వుండదు. వానిని నిరోధించగల సౌష్ఠవాన్ని సమకూర్చుకునే ఆలోచనలు చేయాలి. మానవుల్లో అంతర్గతంగా

వున్న సత్తువను గురించి వారికి విశదీకరించాలి. వేదాంతం మానవులు పాపులని ప్రకటించదు. అందుకు భిన్నంగా మానవులలోని పవిత్రతను, పరిపూర్ణత్వాన్ని వారి దృష్టికి తెస్తుంది. వేదాంత పరిజ్ఞానం ప్రకారం పాపం మానవునికి సంబంధించింది కాదు. వ్యక్తి తన స్థాయిని దిగజార్చుకొని ప్రద ర్శించుటనే పాపమంటాం. కనుక వ్యక్తి తన ఆత్మస్థాయిని ఉన్నత స్థితిలో ప్రదర్శించుకునే ప్రయత్నం చేయాలి. అది అసాధ్యం అని భావించరాదు. వ్యక్తి సాధించలేనిది ఏమీ లేదు. కాలం, దూరం కూడ వ్యక్తి యొక్క నైజశక్తికి లోకువే. వ్యక్తి సర్వశక్తిమంతుడు. అతడు దృఢ సంకల్పంతో ఉద్యమిస్తే ఏదైనా సాధించగలడు.

ప్రతి జీవి విషయంలోను రెండు శక్తులు సమాంతరగతిలో పనిచేస్తుంటాయి. అందులో ఒకటి 'నేను' అని ప్రకటిస్తుంది. మరొకటి 'నేను' కాదంటుంది. ఈ తంతు మానవుల్లోనే గాదు, జంతుజాలంలోను, కీటకాల్లోను కూడ కొనసాగుతుంది. ఆడపులి మానవుని తన వాడి పంజాతో చీల్చి చండాడి వేడి నెత్తురు తాగటానికి విజృంభిస్తుంది. అదే పులి తనబిడ్డని సంరక్షించాల్సిన సందర్భంలో తన ప్రాణాన్ని సహితం త్యాగం చేస్తుంది. అతి కౄరాత్ముడైన పాపి తోటి మానవుల ప్రాణాన్ని హరించటానికి వెనుదీయడు. అదే వ్యక్తి ఆకలితో పస్తులుంటున్న భార్యాపిల్లల్ని కాపాడుకోటానికి తననితాను త్యాగం చేసుకోటానికి సిద్ధమౌతాడు. సృష్టిలో ప్రతి జీవిలోను ఈ రెండు విధాలైన ప్రవృత్తులు ఒకదాని ప్రక్క మరొకటి పనిచేస్తూనే వుంటాయి. ఆ రెండింటిలో ఒకటి స్వార్థపరత్వం, రెండవది నిస్వార్థత. ఒకటి ఆర్జన లేక సేకరణ ఐతే, రెండవది త్యాగం ఔతుంది. ఒకటి గ్రహిస్తుంది. రెండవది ఇస్తుంది. చిన్న సూక్ష్మజీవి నుండి పెద్ద జీవి వరకు మొత్తం విశ్వమంతా ఈ రెండు శక్తులూ క్రీడించే ఆటస్థలమే. దీనికి ప్రత్యేకమైన ఋజువులు అక్కర్లేదు. ఇది అందరకు తేట తెల్లమే.

కాని కొందరు విశ్వం యొక్క క్రియాకాండ, పరిణామక్రమం పై రెండు శక్తుల్లో ఒకటైన పోటీ, ప్రయాసలపై ఆధారపడి నడుస్తాయని భావిస్తారు. అది ఎంతవరకు 'సబబు?' అసలు విశ్వాన్ని నడిపించే ప్రధాన శక్తి నిస్వార్థత లేక త్యాగమే అని అందరు అంగీకరించక తప్పదు.

పోతే రెండవ శక్తి ప్రేమకు రూపాంతరమే. ఆ ప్రేమ స్వార్థతతో కూడి కలుషితమౌతుంది. ప్రేమ యొక్క శక్తి పోటీ భావాన్ని సృజిస్తుంది. స్వార్థత నుండి చెడు ఉత్పన్నమౌతుంది. వ్యక్తి మరొక వ్యక్తిని చంపాడంటే దానికి కారణం తన భార్యపిల్లల్ని రక్షించుకునే స్వార్థపరత్వమే. ఆ ప్రేమ తన భార్యాపిల్లలకే పరిమితమౌతుంది; పరిమితంగాని, అపరిమితంగాని అది కూడ ప్రేమే.

మొత్తం విశ్వాన్ని నడిపించే ప్రేరకశక్తి నిస్వార్థపరత్వం లేక త్యాగము. అది ఏ రూపంలోనైనా కనబడవచ్చు. ఆ ఒక శక్తిని గురించే వేదాంతులు ప్రస్ఫుటీకరిస్తారు.

అద్వైత సిద్ధాంతం మాత్రమే నైతిక విధానాన్ని గురించి విశదీకరిస్తుంది. ఇతరు లకు మంచిచేయటమే అన్ని నీతి విధానాల సారాంశమని మతాలన్ని ప్రబోధిస్తు న్నాయి. నిస్వార్థపరులై ప్రవర్తించటమే ఆదర్శజీవితం. కాని నేడు చాలమంది మానవులు అందుకు భిన్నంగా నడుచుకుంటున్నారు. ఎవరికి వారై, స్వార్థపరత్వంతో మన మత గ్రంథాల్లోని సూచనలు గాని, మహాత్ముల ప్రవచనాలుగాని లక్ష్యపెట్టక వారి త్రోవలో వారు నైతిక ధర్మాల్ని పాటిస్తూ సంచరిస్తున్నారు. వ్యక్తి నైతికపథంలో ఎందుకు ఎలా పయనించాలో ఆ సత్యాలను గీతా కావ్యం మనకు విశదీకరిస్తుంది. "ప్రతివ్యక్తి తనలో ఇతరులనందరిని, ఇతరులలో తనను చూడగల్గినప్పుడు అతడు ఇతరులకు హాని తలపెట్టడు. అందరిలో వున్న భగవత్స్వరూపం ఒక్కటే యన్న జ్ఞానం వ్యక్తిని మహర్షిగా మారుస్తుంది." ఇదే గీతా సందేశం. నీవు ఇతరులను హింసిస్తే, నిన్ను నీవు హింసించు కున్నట్లే – ఈ సత్యాన్నే అద్వైత సిద్ధాంతం మనకు బోధిస్తుంది. నీవు రాజభవనంలో రాజువైనా, వీథుల్లో బిచ్చమెత్తుకునే బిచ్చగాడివైనా, నీవు సర్వశాస్త్రపారంగతుడవైనా, చదువురాని మూర్ఖుడవైనా, బలిష్ఠుడవైనా, బలహీనుడవైనా, అందరిలోని చైతన్య పదార్థం ఒక్కటే యన్న జ్ఞానంతో ప్రవర్తించు. ఆ భావనే విశ్వసృష్టి పట్ల కరుణను ప్రదర్శింపచేస్తుంది. అందరు వ్యక్తుల్లో తనను చూసుకునే సంస్కారాన్ని అలవరచుకొనిన నాడు అతడు ఏరకమైన క్లేశానికి గురికాడు. ఈ రకమైన నైతిక విధానాన్ని అద్వైతం మాత్రమే వివరిస్తుంది. ఇతర సిద్ధాంతాలు దీన్ని బోధిస్తాయి గాని దాని హేతుబద్ధతని

విపులీకరించవు.

మనం వ్యక్తిగత ప్రమేయులం. మన ధోరణిలో వ్యక్తికి, వ్యక్తికి మధ్య బేధాల్ని సృష్టించుకొని అసలు సత్యాన్ని మరుగున పడేస్తాం. ఐతే అద్వైతం మానవుల్లో వున్న భేదాల్ని పరిగణించవద్దని అనదు. ఆ భేదాల నిజస్వరూపాన్ని తెలుసుకోమని ఉద్ఘాటిస్తుంది. మానవులందరూ యథార్థంగా ఆ అనంత చైతన్య శక్తికి భిన్నం కాదు. అందులోని అంశమే మనమందరం. ఈ భిన్న భిన్న అంశల యొక్క సమాహారమే ఆ అనంత చైతన్య స్వరూపం. ఆత్మపదార్థం యొక్క అనంతమైన శక్తి పరిణామ క్రమంలో అసంఖ్యాకములైన మార్పులతో రూపొందుతుంది.

జీవితం దోషభూయిష్టం. ప్రపంచం చెడు విషయాలతో నిండి వుంటుంది. దీనిని అనుభవజ్ఞులు కాదనలేరు.

ఐతే మన మతాలు ఈ స్థితి నుండి బయటపడటానికి సూచించిన నివారణోపాయమేమిటి? ప్రపంచం మిథ్యయనీ, దీనికి అతీతంగావున్న విషయమే నిత్యమైంది, సత్యమైందియని మతాలన్నీ ప్రతిపాదిస్తున్నాయి. ఇక్కడే వస్తుంది చిక్కు. ప్రత్యక్షంగా కనబడుతున్న విషయాలన్నీ మిథ్య అని నిర్ధారించటం సమర్ధనీయమా? కాని మన వేదాంతం మతాల ప్రతిపాదననే సమర్థిస్తుంది. దానిలోవున్న యథార్థ తత్వాన్ని మనం సవ్యమైన రీతిలో అర్థం చేసుకోవాలంటుంది.

యథార్థ్ధంగా వేదాంతం ప్రపంచం యొక్క అస్తిత్వాన్ని కాదనదు. మన వేదాంత బోధనల్లో పరిత్యాగశీలత అత్యున్నత స్థాయిని సమకూర్చుకుంటుంది. ఐనప్పటికి అది ఆత్మహత్యా సదృశమైన ప్రతిపాదనను నిర్దేశించదు. ప్రపంచం మనం ఉద్దేశించిన, మనకు తెలిసిన, మనకు కనిపించే స్థితిలోకాక, అది మొత్తం భగవత్స్వరూపమనే సత్యాన్ని మనం గ్రహించాలని వేదాంతం ఆదేశిస్తుంది. మన ప్రాచీన ఉపనిషత్తులలోని ఒక ఉపనిషత్తు

ఆరంభంలో ఈ ప్రపంచంలోని ప్రతిది భగవత్స్వరూపమని చెప్ప బడింది. ఈ సత్యాన్ని గ్రుడ్డిగా నమ్మటం కాదు. మనం విశ్వంలోని ప్రతి అణువునందు భగవంతుని చూడగల్గాలి. అలా ప్రపంచం మిథ్య అనే నిర్ధారణకు రావాలి. ప్రపంచం మిథ్య ఐనప్పుడు ఇక మిగిలేది భగవానుడే కదా. అంటే అంతా భగవన్మయమే అనే భావన రూఢియౌతుంది. వ్యక్తికి భార్యవుంటుంది. ప్రపంచం మిథ్య అన్నట్లు భార్య కూడ మిథ్య అని కాదు. భార్య కూడ భగవత్స్వరూపమని భావించాలి. అలాగే తనపిల్లల్ని వదిలివెయ్యి. అంటే వాళ్లని ఇంటి నుండి వెళ్లగొట్టమని కాదు. వారిలో కూడ దైవత్వాన్ని చూడమని భావం. అలా తనవారిని వెళ్లగొట్టటం మతం అనిపించుకోదు; అది పైశాచికం అవుతుంది. ఆ విధంగా ప్రతి వస్తువులోను, ప్రతి విషయంలోను దైవాన్ని దర్శించగల్గాలి. జీవితంలోను, మరణంలోను, సుఖంలోను, దుఃఖంలోను భగవానుడు ఒకే స్థాయిలో వుంటాడు. మొత్తం విశ్వమంతా ఆయన వ్యాపించి వుంటాడు. మన జ్ఞాన నేత్రాన్ని తెరచి ఆయన్ని దర్శించగల్గితే చాలు. మన దృష్టిని మాయ ఆవరించి యున్నంతవరకు మనకీ మిథ్యాప్రపంచమంతా సత్యమని తోస్తుంది. జ్ఞానోదయం కాగానే మాయ అనే అంధకారం పటాపంచలై నిత్యసత్యస్వరూపుడైన సర్వేశ్వరుడొక్కడే విశ్వవ్యాప్తుడైవున్నట్లు గోచరిస్తుంది. పిల్లవానిలోను, భార్యలోను, భర్తలోను, మంచి లోను, చెడులోను, పాపంలోను, పాపం చేసేవాడిలోను, జీవితంలోను, మరణంలోను – అన్నిటియందు ఆ భగవత్తత్వమే ఇమిడి వుందని ద్యోతకమవుతుంది.

# రాజయోగం – మానసిక నియంత్రణా మార్గం

ప్రకృతి మనల్ని శాసించి వశం చేసుకునే స్థితి నుండి మనల్ని విముక్తుల్ని చేయటమే సర్వమతాల లక్ష్యం. యోగి మనస్సును నియంత్రించటం ద్వారా ఈ లక్ష్యాన్ని సాధిస్తాడు. ప్రకృతి నుండి మనం స్వేచ్ఛను పొందేవరకు మనం బానిసలమే. ఆ స్థితిలో మనం ప్రకృతి ఆడించినట్లల్లా ఆడవలసిందే. మనస్సును వశం చేసికొన్న వ్యక్తి బయటి విషయాలను శాసించగలడని యోగి నిర్ధారిస్తాడు. ఆంతరంగిక ప్రకృతి బాహ్య ప్రకృతి కంటె అనేక రెట్లు ఉన్నతమైనది; దానితో వ్యవహరించటం కూడ కష్టతరమైన పని; దానిని వశం చేసుకోవడం దుర్లభం. కనుక ఎవరైతే ఆంతరంగిక ప్రకృతిని నియంత్రిస్తాడో, అతడు మొత్తం విశ్వాన్ని శాసించగలడు. విశ్వం అతని చెప్పుచేతల్లోకి వస్తుంది. దీనిని ఎలా సాధించాలనేది మనకు రాజయోగం నిర్దేశిస్తుంది.

మన అంతర్గత పరిస్థితులను పరిశీలించి అవగాహన చేసుకునే సాధనలను మొట్టమొదట రాజయోగశాస్త్రం ప్రతిపాదిస్తుంది. దానికి సాధనం మనస్సు. పరిశీలింపబడే వస్తువు కూడ మనలోపల వుండే మనస్సే. అంటే మనస్సుతో మనస్సును గూర్చి పరిశీలన జరగాలి. మనస్సుకు ఆలోచనా శక్తి వుందని మనకు తెలుసు. వ్యక్తి ఆలోచిస్తూనే అదే సమయంలో పనిచేస్తాడు. అప్పుడే మనస్సులోని ఒక భాగం వ్యక్తి చేసే ఆలోచనల్ని పర్యవేక్షిస్తుంది. చీకటి ఆవరించియున్న ప్రదేశాల్లోని రహస్యాలు సూర్యుని తీక్ష్ణ కిరణాల ద్వారా బహిర్గతం ఐనట్లు, మానసికశక్తుల కేంద్రీకరణతో మనస్సులో గుప్తమైయున్న ఆలోచనలు వెల్లడి కావాలి. ఈ విధానాన్నే రాజయోగం బోధించటానికి ఉపక్రమిస్తుంది. మనస్సును నిశ్చల స్థితిలో పెట్టటం, మన మనస్సుల లోని అంతరాంతరాలను పరిశోధించటం, వాటిలో నిక్షిప్తమైన విషయాల్ని క్రమపరచి వాటినుండి మన నిర్ణయాలను నిర్ధారించటం – ఇవే బోధనలకు లక్ష్యాలు.

వ్యక్తి తాను అపవిత్రుడనని భావిస్తే అతనిలోని ఆత్మ స్వరూపత్వం నశిస్తుంది. అతని మానసిక సౌష్ఠవం, నైతిక పటిష్ఠతకూడ సన్నగిల్లుతాయి. అందువల్లనే ఆధ్యాత్మిక జ్ఞానంలో మహాత్ములైన వారిని మన కందించిన ప్రపంచంలోని మత వ్యవస్థలన్నీ వ్యక్తుల పవిత్రత యొక్క ఆవశ్యకతను నిర్ధారించాయి. పర్యవసానంగా బ్రహ్మచర్య దీక్ష వహించిన సన్యాసులు విస్తరిల్లారు. అట్టివారు మనోవాక్కాయ కర్మల్లో పరిపూర్ణమైన పవిత్రతను సాధించివుండాలి. అది లోపించిన పక్షంలో రాజయోగ అభ్యాసం ప్రమాదానికి దారి తీస్తుంది. మానసిక వైకల్యం కూడ సంభవించవచ్చు. ఒకప్రక్క రాజయోగాన్ని ఆచరిస్తూ, మరొక వంక కలుషిత జీవనం సాగిస్తే, అట్టివారు యోగు లయ్యే ఆస్కారం వుండదు.

# భక్తియోగం (భక్తి మార్గం)

భగవంతునిపై గాని, మహాత్ములపట్లగాని, వ్యక్తి ఎక్కడైనా భక్తిని ప్రదర్శిస్తూనే వుంటాడు. భక్తి రూపంలో ఉపాసన సర్వత్రా అత్యున్నతమైందిగా వుంది. అంతేగాదు, జ్ఞానం కంటె భక్తిని సమకూర్చుకోటం సులభతరం. జ్ఞాన సిద్ధి కల్గాలంటే దానికి అనుకూల పరిస్థితులే గాక తదేక నిష్ఠతో చేసే అభ్యాసం కూడ అవసరం. యోగాభ్యాసం ఉచిత రీతిలో కొనసాగాలంటే శరీరారోగ్యం బాగుండాలి, ప్రాపంచిక వాసనలకు దూరంగా వుండాలి. కాని వ్యక్తి ఏ పరిస్థితిలో వున్నా భక్తిని సులభంగా అభ్యసించవచ్చు.

కాని కామ్యభక్తి భక్తి కాదు. వ్యక్తి పుత్రుణ్ణి అపేక్షించో, సంపదను అభిలషించో, స్వర్గప్రాప్తి కొరకో, నరకయాతనల నుండి రక్షించుకొనుటకో భగవంతుని భక్తితో ఆరాధిస్తే అది భక్తిగా పరిగణింపబడదు. భయంతోనో, అత్యాశతోనో ప్రేరేపింపబడి అలవర్చుకునేది కూడ భక్తి అనిపించుకోదు. “నాకు జ్ఞానం అవసరంలేదు; ముక్తిని కూడ ఆశించను. అందమైన భార్యపై కాంక్ష అసలే లేదు. పుడుతూ, మరణిస్తూ అనేక జన్మలు ఎత్తుతాను. కాని నాకు అన్ని జన్మల్లోను నీ సేవా భాగ్యాన్ని ప్రసాదించు” అని ఎవడు భావిస్తాడో అతడే నిజమైన భాగవతోత్తముడు. భారతదేశంలో ప్రజలు అవలంబించే భక్తి పాశ్చాత్యదేశాల్లో అనుసరించే భక్తికి చాల భిన్నంగా వుంటుంది. మన భక్తిలో భయానికి స్థానముండదు. భక్తి అంటే భగవంతుని ప్రేమించుటే. భక్తిని గురించి అతిప్రాచీనమైన ఉపనిషత్తులలో కూడ విశదీకరింపబడింది. ఆ ఉపనిషత్తులు క్రైస్తవుల బైబిల్ కంటే చాల పురాతనమైనవి. మన వేదాల్లో భాగమైన సంహితల్లో కూడ భక్తి యొక్క అంకురాలను గురించిన ప్రసక్తి వుంది. అసలు పాశ్చాత్య సంస్కృతిలో భక్తి అనే మాట కన్పించదు. శ్రద్ధ అనే మాట ద్వారా అది సూచింపబడుతుంది.

వారు కనీసపుస్థాయి ప్రేమను శాంతంగా అర్థం చేసుకుంటారు. ఒక వ్యక్తి ఉజ్జ్వలమైన

ప్రేమతోగాక, సాధారణ స్థాయి ప్రేమతో భగవంతుని ఆరాధిస్తే, ఆ ప్రేమను శాంతం అంటాం. ప్రపంచంలో కొంతమంది నిదానంగా సంచరిస్తారు. మరికొందరు ప్రచండవేగంతో సుడిగాలిలా గమనం సాగిస్తారు. శాంత స్వభావుడైన భక్తుడు నిదానాన్ని, నిశ్చలతను, సౌమ్యతను ప్రదర్శిస్తాడు.

దీనికి పై స్థాయి భక్తిని దాస్య భక్తి అంటాం. భక్తుడు భగవంతుని తన యజ మానిగా భావించి తానొక దాసుడుగా సేవిస్తాడు. అతడు అవలంబించే భక్తినే దాస్య భక్తి అంటాం. ఒక విశ్వాసపాత్రుడైన సేవకుడు తన యజమాని యెడల చూపించే అనుబంధమే దాస్యభక్తునికి ఆదర్శం.

పై దానికంటె ఉన్నత స్థాయి ప్రేమ సఖ్యతా భావం. 'నీవే నాకు అతి సన్నిహితుడ వైన సఖుడవు' అని భక్తుడు భగవంతుని సంబోధిస్తాడు. ఒక వ్యక్తి తన స్నేహితునితో తన మనస్సు విప్పి తన కష్టసుఖాలన్నీ చెప్పుకుంటాడు. ఆ స్నేహితుడు సానుభూతితో విని తనకు సహకరిస్తాడు. వారిరువురికి మధ్య సమాన ప్రేమ, స్నేహం ప్రదర్శింప బడతాయి. ఆ విధంగా భగవంతుడు భక్తునికి ఆత్మ సఖుడౌతాడు. భక్తుని కష్టసుఖాలు ఆలకిస్తాడు. దీనినే సఖ్య భక్తిగా చెప్తాము.

తర్వాత వాత్సల్యభక్తిని గూర్చి తెలుసుకుందాం. భగవంతుని తండ్రిగాకాక బిడ్డగా ప్రేమించటమే వాత్సల్య భక్తి స్వభావం. భగవంతుడనే భావననుండి అధికారం యొక్క ఆలోచనను తొలగించుటే వాత్సల్యత యొక్క ప్రధాన లక్షణం. అధికారమనే భావనతో భక్తిలో భయం చోటు చేసుకుంటుంది. కాని ప్రేమలో భయానికి తావుండకూడదు. వాత్సల్య ప్రేమలో భగవంతుని సర్వశక్తిమంతునిగా, గంభీరునిగా, మహిమాన్వితునిగా ఎంచి భయపడే మనస్తత్వాన్ని విడనాడటం కొరకే ఆయనను బిడ్డగా భావించి ఆరాధిస్తారు. తల్లిగాని, తండ్రిగాని బిడ్డ విషయంలో భయంతో సంచరించటం వుండదు. బిడ్డపట్ల గౌరవభావం ప్రకటించటం కూడ సంభవించదు. బిడ్డను వారు అడిగే కోరికలు ఏమీ వుండవు. బిడ్డ

ఎప్పుడూ తల్లిదండ్రుల నుండి సర్వము పొందే స్థితిలోనే వుంటుంది. తల్లిదండ్రులు బిడ్డకొరకు తమ సర్వస్వాన్ని, చివరకు ప్రాణాలను కూడ అర్పించటానికి వెనుదీయరు. ఈ విధంగా వాత్సల్యభక్తి ద్వారా భగవంతుడు బిడ్డగా ప్రేమింపబడతాడు.

మానవులకు సంబంధించినంతవరకు మరొక భక్తి విధానముంది. దానినే మధురభక్తి అంటాం. ప్రపంచంలో ప్రేమ ప్రదర్శనకు ఇంతకంటె మిన్నయైన విధానం లేదు. మనకు తెలిసినంతవరకు ఇంతకంటె గాఢతరమైన ప్రేమ మరొక విధానంలో కన్పించదు. వ్యక్తి యొక్క అణువణువున ప్రేమ వ్యాపించి ప్రేమపరవ శత్వంతో అతడు పిచ్చివాడై తన సహజ ప్రకృతిని మరచి భగవంతుని తన భర్తగా భావించి వ్యవహరిస్తాడు. ఆ మధురానుభూతిలో తన్మయుడౌతాడు. ప్రపంచంలో పురుషులుండరు. అందరు స్త్రీలే. భగవానుడొక్కడే పురుషుడు. మామూలుగ పురుషుడు స్త్రీకి, స్త్రీ పురుషునకు ఇచ్చే ప్రేమనంతను ఇచ్చట భగవంతునకు భక్తుడు సమర్పి స్తాడు.

నిజమైన జ్ఞానదృష్టి గల ప్రేమికుడు అంతటితో సంతృప్తి చెందడు. భార్యా భర్తల మధ్య మెలిగే ప్రేమ స్థాయి అతనికి చాలదు. అక్రమ సంబంధం ద్వారా స్త్రీ పురుషుల మధ్య నడిచే ప్రేమ అతిగాఢమైయుంటుంది గనుక భక్తుడు అట్టి సంబంధాన్ని ఆశ్రయిస్తాడు. దానిలోని అపసవ్యతను పరిగణించడు. ఆ ప్రేమ ఫలించటానికి అంతరాయాలు అనేకం ఏర్పడతాయి. అంతరాయాలు ఎక్కువైనకొద్ది ప్రేమను సాధించాలనే కోరిక యొక్క తీవ్రత కూడ ఇనుమడిస్తుంది. మామూలు భార్యాభర్తల మధ్య ప్రేమ ఎట్టి అభ్యంతరాలకు గురికాదు కనుక సరళంగా సాగుతుంది. కాని ఒక అమ్మాయి తానుకోరుకున్న ప్రేమికునిపై ప్రేమ కురిపించాలనుకుంటుంది. కాని తల్లిదండ్రులు ఆటంకపరుస్తారు. ఆటంకాలు దృఢతరమైన కొద్ది ఆమె ప్రేమ అతిశయిస్తూ వుంటుంది. కావున భక్తుడు అలాంటి అమ్మాయి పాత్రను స్వీకరించి భగవంతుడనే ప్రియునిపై ప్రేమను ప్రదర్శిస్తాడు. బృందావనంలో విహరించే గోపికలు అక్కడే వున్న కృష్ణునిపై చూపే గాఢ ప్రేమను వర్ణించటానికి మన భాషలో పదాలు

లభించవు. కృష్ణుని వేణునాదం వినగానే గోపికలు తమ వృత్తులను వదలి, ప్రాపంచిక విషయాలన్నిటిని మరచి తమ సర్వస్వాన్ని త్యజించి ఆ గోపీలోలుని పరిష్వంగంలో మైమరచి తనియిస్తారు. కాని మానవులమైన మనం భగవంతుని ప్రేమించాలని ప్రకటిస్తాం. కాని ప్రాపంచిక విషయాలపై ఆసక్తిని విడనాడలేము. కోరికలు చంపుకోలేము. మనకు చిత్తశుద్ధి వుందా అని ప్రశ్నించుకోవాలి. దైవమున్నచోట కోరికలకు స్థానం వుండదు. కోరికలుంటే దేవుడు లేడు. అవి రెండూ పరస్పర విరుద్ధాలు, వెలుతురు, చీకటివలె.

వ్యక్తి తన ప్రియురాలిపట్ల చూపే గాఢప్రేమను మనం భగవంతునిపై ప్రదర్శించవలసిన ప్రేమను నిర్దేశిస్తుంది. కృష్ణుడు భగవంతుడు; రాధ ఆయన్ని ప్రేమిస్తుంది. కాని ఎంత మంది ఈ విషయాన్ని అవగాహన చేసుకుంటారు? దుర్మార్గ ప్రవృత్తి గలవారు, నీతి వర్తనమంటే ఏమిటో ఎరుగని వారు రాధా కృష్ణుల మధ్య వున్న ప్రేమ నిజస్థితిని గ్రహింపలేరు. ప్రాపంచిక విషయవాసనల్ని తమ మనస్సుల నుండి పారద్రోలి నిర్మలమైన మనస్సుతో ఆధ్యాత్మిక వాతావరణంలో జీవిస్తున్న వారు మాత్రమే, వారు విద్యావంతులు కాకపోయినా, నిగూఢమగు ఆ ప్రేమ తత్వాన్ని అవగాహన చేసికోగలరు. కాని అట్టి వారు చాల కొద్ది మంది మాత్రమే వుంటారు.

ప్రతి వ్యక్తిలోను భక్తి అంతర్గతంగా వుంటుంది. దాన్ని మోహం – సంపద అనే ముసుగు ఆవరిస్తుంది. ఆ ముసుగును తొలగించిన మరుక్షణం భక్తి బహిర్గతం అవుతుంది.

ప్రేమ చాల ఉన్నతమైనది, దివ్యమైనది. కాని వ్యక్తి యొక్క ఛాందస భావాల వల్ల అది పూర్తిగా నశించవచ్చు.

మోక్ష సాధనకు భక్తి అతి సులభమార్గం. కాని తక్కువ స్థాయిలో అదే భక్తి వికృతమైన మతమౌఢ్యంగా తరచుగా పతనం చెందుతుంది. అదే భక్తి వలన వచ్చే దుష్పరిణామం.

చైతన్య ప్రభువు గొప్ప విరాగి. స్త్రీ సంపర్కం లేనివాడు; విషయ వాంఛలకు అతీతుడు.

కాని తరువాతి కాలంలో ఆయన శిష్యగణం స్త్రీలకు కూడ వారి ఆశ్రమంలో ప్రవేశం కల్పించి వారితో విచక్షణారహితంగా కలసి మెలసి, సంచరించి మొత్తం ఆశ్రమ జీవితాన్ని కలుషితం చేశారు. చైతన్య ప్రభువు తన జీవితం ద్వారా ప్రదర్శించిన అవ్యాజమైన ఆదర్శ ప్రేమ నిస్వార్ధమే గాక వ్యామోహ రహితమైంది. లైంగిక వాసనలేని ప్రేమ సామాన్యులకందుబాటులో వుండని ఆస్తి. కాని తరువాత వచ్చిన వైష్ణవ గురువులు వారి ఆచార్యులు వారి జీవితంలో ప్రముఖంగా ప్రదర్శించిన వైరాగ్యతత్వానికి ప్రాధాన్యత ఈయకుండా సామాన్యుల హృదయాల్లో ప్రేమతత్వాన్ని ప్రవేశబెట్టే ప్రయత్నంలో ఉత్సాహం చూపించారు. పర్యవసానంగా సామాన్యులు దివ్యమైన ప్రేమ యొక్క ఆదర్శ స్థాయిని అవగాహన చేసికొని జీర్ణించుకోలేక హీనమైన స్త్రీపురుష వ్యామోహ ప్రేరితులై పతనం చెందారు.

హృదయాన్ని వ్యామోహం ఆవరించియున్నంత వరకు అణుమాత్రమైన పవిత్రప్రేమకు అవకాశం వుండదు. వైరాగ్యంలో పరాకాష్ఠకు చేరినవారైనా కావాలి లేక మానవుల్లో అత్యున్నత స్థాయికి చేరినవారైనా కావాలి దివ్యమైన భక్తి ప్రేమను అలవరచు కోవాలంటే. అలాకాక ఆ మహోన్నత ప్రేమ భావాన్ని సామాన్య ప్రజల్లోకి చొప్పిస్తే, అది పరోక్షంగా మానవ సహజమైన స్రీ పురుష ప్రేమగా పరిణమించి ఆశించిన లక్ష్యాన్ని విస్మరిస్తుంది. పర్యవసానం అనర్ధదాయకమేగాని ప్రయోజనకరం కాదు.

మధుర భక్తి మార్గంలోకాక భగవంతుని ఆరాధించేందుకు ఇతర విధానాల్లేవా? మిగిలిన నాల్గు మార్గాలద్వారా మనం ప్రయత్నించవచ్చుకదా? హృదయ పూర్వకంగా భగవన్నామాన్ని జపించటం శ్రేయోదాయకం. హృదయాన్ని పరిపూర్ణంగా ఆవిష్కరిస్తే, మిగతా విషయాలన్నీ వాటంతటవే స్పందించి పురోగమిస్తాయి. కాని ఒక ప్రధానాం శాన్ని మరువకూడదు. హృదయం మోహావేశమైయున్నంత వరకు ప్రేమకు స్థాన ముండదు. కనుక వ్యక్తి విషయ వాంఛల నుండి విముక్తుడుకావాలి.

కీర్తన అంటే నృత్యగానం మాత్రమే కాదు. వ్యక్తి తనకు అనుకూలమైన రూపంలో

భగవానుని దివ్యనామ సంకీర్తనం ఏకాగ్రతతో చేయటం ముఖ్యం. వైష్ణవులు ప్రదర్శించే నృత్యగానాలు, తీవ్రమైన భావావేశాలు మంచివే; చూట్టానికి ఆకర్షణీయంగానే వుంటాయి. కాని వాటి అభ్యాసం వల్ల కలిగే ఉపద్రవం కూడ వుంది. దాని నుండి వ్యక్తి తనను రక్షించుకోవటానికి ప్రయత్నించాలి. ఒక ప్రక్క భావ ప్రకంపనలు తారాస్థాయికి చేరి నేత్రాలనుండి అశ్రుబిందువులు ప్రవహిస్తాయి; మత్తు పదార్థ సేవనలో వలె వ్యక్తి వివశుడై ప్రవర్తించటం జరుగుతుంది. మరొక ప్రక్క, సంకీర్తన ముగియగానే ఆ భావసముదాయం వ్యక్తిని ఎంత వేగంతో ఉత్తేజపరిచిందో అంతకంటె ఎక్కువ వేగంతో కృంగతీస్తుంది. సముద్రంలో అల ఎంత ఎక్కువ ఎత్తుకు లేస్తే, అదే వేగంతో అంత తక్కువ లోతుకు చేరుతుంది. ఆ స్థితిలో వ్యక్తి ఆ ప్రతిస్పందన యొక్క ఘాతాన్ని తట్టుకోటం దుస్సాధ్యం. వ్యక్తి విచక్షణాజ్ఞానియైతే తప్ప, వ్యామోహం యొక్క నీచ ప్రవృత్తిలో చిక్కుకోటం సంభవిస్తుంది.

జ్ఞాన దృష్టితో ప్రభావితమైన భక్తితత్వంతో ఈశ్వరుణ్ణి ఆరాధించాలి. భక్తితోబాటు విచక్షణా దృష్టిని జోడించి వుంచాలి. ఇదికాక చైతన్య ప్రభువు నుండి ఆయన యొక్క సహృదయత్వాన్ని, ఆయన కరుణామయ దృష్టిని, ఆయనకు భగవంతుని పై గల తీవ్ర భక్త్యావేశాన్ని మనం సమకూర్చుకోవాలి. అంతేకాదు ఆ ప్రభువు ప్రదర్శించిన వైరాగ్య ప్రవృత్తిని కూడా మనం ఆదర్శంగా ఎంచుకోవాలి.

# కర్మయోగం – కర్మమార్గం

మనం చేసే కర్మలకు మనం బద్ధులం కాకుండా, కర్తృత్వ భారాన్ని భగవంతునిపై మోపి, స్వేచ్ఛా జీవులవలె కర్తవ్యాలను నిర్వర్తించటం అలవరచుకోవాలి. మన కర్తవ్యాలన్నీ భగవంతునివే. ఫలాన్ని ఇచ్చే ఏ పనిగాని, క్రియగాని, ఆలోచనగాని కర్మగా పరిగణింపబడుతుంది. వ్యక్తి రాగరహితుడై కర్మను నిర్వర్తించుట సరియైన పద్ధతి. కర్మ నిర్వహణలో తన ప్రమేయం లేనట్లుగా భావించి తాను సాక్షీభూతంగా నిలచి కర్తవ్యాలను చేస్తూ పోవాలి. మా గురుదేవులు మాకు ఈ విధంగా చెప్పేవారు. "నీ బిడ్డలను ఒక దాదివలె ఆదరించు. నీవు నియమించిన దాది నీ పిల్లలను కూడ తన సొంత బిడ్డలవలె లాలనతో సాకుతుంది. కాని ఆమె నియామకాన్ని రద్దు చేస్తూ నీవు ఆమెకు సూచన ఈయగానే పిల్లల్ని వదలి మూటముల్లెతో నిశ్చింతగా వెళ్లిపోతుంది. నీ నియామకంలో వున్నంత వరకే నీ పిల్లలపై మమకారం చూపుతుంది. నీ వద్ద ఉద్యోగం విరమించిన మరుక్షణం నుండి నీ పిల్లల్ని గురించి ఆలోచించదు. ఆమె నీ పిల్లలతో పెంచుకొన్న అనుబంధాన్ని పూర్తిగా మరచిపోతుంది. ఆ విధంగానే నీవు కూడ నాది అనుకునే ప్రతి వస్తువుపై ప్రతి విషయంపై మమకారాన్ని, అను బంధాన్ని విడనాడాలి. నీవు కూడా ఒక ఆయావే. భగవంతునిపై నీకు విశ్వాసముంటే నీవు నీవి యని అనుకున్న సర్వస్వం భగవానునికి చెందినవే".

మనం ఎల్లపుడు మంచినే చేయాలి. ఎందుకంటే మంచి చేస్తే మనకు మంచికల్గుతుంది. స్వర్గప్రాప్తి కొరకు సత్కర్మను చేసినప్పటికి ఆ వ్యక్తి కర్మఫలంతో బంధితుడౌతాడని కర్మయోగి అంటాడు. స్వార్థప్రయోజన దృష్టితో మనం చేసే ప్రతికర్మ మనల్ని స్వేచ్ఛా జీవుల్ని చేయకపోగా, మరొక శృంఖలాన్ని మన పాదాలకి తగిలిస్తుంది.

మనం చేసే కర్మఫలితాలు మనల్ని బంధించకుండా వుండాలంటే మనం కర్మల్ని నిష్కామంతో చేయాలి. ఫలితాన్ని ఆశించకుండా చేసే ప్రతి కర్మ మనకు క్రొత్త బంధాన్ని

తగిలించకుండా వున్న బంధాల్లో ఒకదాన్ని తీసివేస్తుంది. అలాగే మనం ఫలితం పట్ల నిరాపేక్షతో ప్రపంచానికి అందించే ప్రతి సద్భావన మనకు మంచిని సమకూర్చి మన బంధాల్లో ఒక బంధాన్ని తొలగిస్తుంది. అలాచేసే ప్రతి సత్క్రియ మన పవిత్రతను పెంచుతూ మనల్ని మానవలోకంలో అధికతమ పవిత్రుల్నిగా చేస్తుంది.

ఏ కర్మ అయితే మనలోని ఆధ్యాత్మికతను పెంపొందిస్తుందో ఆ కర్మ మాత్రమే నిజమైన కర్మగా రాణిస్తుంది. భౌతికతత్వాన్ని పెంపొందించే కర్మ నిజమైన కర్మ కానేకాదు.

మానవ జీవితంలో ప్రతినిత్యం ఏదోఒక కర్మ చేయకుండా వ్యక్తి వుండలేడు. వ్యక్తి తప్పనిసరిగా కర్మను ఆచరించవలసి యున్నప్పుడు అతడు ఆ కర్మ ద్వారా ఆత్మజ్ఞానాన్ని పొంది విముక్తుడుకావాలని కర్మయోగం ప్రబోధిస్తోంది.

కర్మ ద్వారా మోక్ష ప్రాప్తిని సాధించదలిస్తే వ్యక్తి ఫలాపేక్షరహితంగా కర్మను ఆచరించటానికి ఉద్యమించాలి. ఆ విధమైన నిష్కామ కర్మ ద్వారా వ్యక్తి జ్ఞాని కాగలడు. జ్ఞానం మోక్షసాధనకు మార్గం కాగలదు. జ్ఞాన సిద్ధి కలుగకుండా కర్మత్యాగం చేసినచో వ్యక్తి దైన్యమును ఎదుర్కొనవలసివస్తుంది. ఆత్మ వికాసమునకై చేసిన కర్మ బంధాన్ని సృష్టించదు. వ్యక్తి సుఖాన్ని అపేక్షించి కర్మ చేయకూడదు. భీతితో కర్మను ఆచరించటం మానకూడదు. త్యాగశీలతతోగాని, భగవత్కైంకర్య భావనతోగాని కర్మను ఆచరించాలి. వేళ్ళు బురదలో వుండి కూడా, కమలం తన స్వచ్ఛతను కోల్పోని విధంగా, వ్యక్తి ప్రపంచంలో జీవిస్తూ ప్రపంచానికి సంబంధించనివాడుగా మెలగాలి. తోటి మానవులు తనపట్ల ఎలా ప్రవర్తించినా, వ్యక్తి వారి పట్ల ప్రేమ భావాన్ని మాత్రమే ప్రదర్శించాలి.

వ్యక్తి ఫలాపేక్ష రహితంగాను, స్వార్థప్రయోజనాలకు అతీతంగాను సత్కర్మలనాచరిస్తే, ఆ కర్మలే అతణ్ణి బంధవిముక్తుణ్ణి కావించటానికి సహకరిస్తాయి. అంతేకాని అలా ఆచరించిన సత్కర్మలు బంధాలను సృష్టిస్తాయనటం అవివేకం. స్వార్థపరత్వంతో చేసే కర్మలు కల్గజేసే

బంధాలను తొలగించుకోవాలంటే నిష్కామ కర్మే శరణ్యం; ఇతర మార్గాలు నిష్ప్రయోజనం.

శ్రీకృష్ణుని ఆయన నిజరూపంలో గీతలో అభివర్ణింపబడినట్లు చిత్రీకరించుకోవాలి. ఆయన పూర్ణరూపాన్నుండి గీతాహృదయం సందేశ రూపంలో ప్రజ్వరిల్లుతూవెలువడాలి.

పరిపుష్ట కర్మ వినియోగంలో శరీరం, నీలాకాశ సదృశమైన ప్రశాంతతను, ప్రసన్నతను ప్రకటిస్తున్న వదనం వ్యక్తి కల్గియుండాలని గీతా సందేశముఖ్యోద్దేశం. అన్ని పరిస్థితుల్లోను నిర్మలత్వాన్ని, దక్షశీలతను ప్రదర్శించేతత్వంతో పరమాత్మునిపాదపద్మాలను ఆశ్రయించే పరిశుద్ధ చిత్తంతో వ్యక్తి వుండాలని గీత ఆదేశిస్తుంది.

ఏ వ్యక్తి కర్మ నిష్ఠాగరిష్ఠుడై యుండి కూడా మానసిక ప్రశాంతతను స్థిరీ కరించుకోగలడో, ఏ వ్యక్తి బాహ్యకర్మలను విడనాడి కూడా పరబ్రహ్మచింతనా వాహినినిచైతన్య ప్రక్రియగా నిర్వహించగలడో అతడే పురుషుల్లో ప్రతిభాశాలి, అతడే నిజమైనయోగి, అతడే నిష్కళంక కర్మచారి.

ఫలాపేక్ష రహితంగా నిత్యం కర్మలను ఆచరించే ప్రవృత్తిని, అచంచల మనస్సుతోభగవానుని పాదపద్మాలను సేవించే అభ్యాసాన్ని ప్రతివ్యక్తి అలవరచుకోవాలి.

తాంత్రిక విధానంతో జరిపే ఆరాధన ప్రమాద భరితమైంది. తంత్రమయమైన విధానానికి అతీతమైన విధానాన్ని అనుసరించాలి. వేదాధ్యయనం చేయాలి. నాల్గు రకాల యోగాలమధ్య సమన్వయం సాధిస్తూ, పవిత్రతను పరిపూర్ణస్థాయిలోనెలకొల్పుకోవాలి.

సత్యాసత్యముల వివక్షత, సమత్వబుద్ధి, ఆరాధనాభావం, కర్మనిష్ఠ, చిత్త ఏకాగ్రతకొరకు అభ్యాసము – వీటిని సాధించాలి. వీటితోబాటు స్త్రీని గౌరవంతో చూసే మనఃప్రవృత్తిని పెంచుకోవాలి.

వనితలే మాతృదేవత యొక్క ప్రతినిధులు. మాతృదేవతను ఆరాధించుట

ప్రారంభించిననాడే దేశ సౌభాగ్యం వర్ధిల్లటం మొదలౌతుంది. మాతృదేవతా బలిపీఠంపై త్యాగం చేయటానికి ప్రతివ్యక్తి సన్నద్ధుడౌతాడు.

# మతాల మధ్య సామరస్యత

ప్రపంచంలో ప్రజలందరూ ఒకే మతాన్ని నిర్ధారించుకొని దాన్నే అవలంబిస్తూ, ఒకే ఆరాధనా విధానాన్ని అనుసరిస్తూ, ఒకే మూసలో పోసిన నైతిక ప్రమాణాల్ని ఆమోదించి సంచరించుట కంటే దురదృష్టకరమైన పరిణామముండదు. అలా సంభవించిన నాడు మతపరమైన, ఆధ్యాత్మికపరమైన ప్రగతి నశిస్తుంది. ప్రాజ్ఞులు ఈ దుష్పరిణామాన్ని అరికట్టాలి. మన మతసత్యాలే ఉత్కృష్టమైనవని వానినే ప్రపంచ ప్రజలందరూ అనుసరించాలనే ప్రచార ఉద్యమాల్ని మనం విరమించాలి. అలాగే ఒకే ప్రపంచ మతాన్ని వ్యవస్థీకరించి దాని ధర్మాల్ని, విధానాల్ని అనుసరించాలనే విశ్వాసం నుండి ప్రజలను విముఖుల్ని చేయాలి.

ప్రపంచ వ్యాప్తంగా సర్వమత సహనంలో మనకు విశ్వాసముండాలి. అంతే గాదు, ప్రపంచంలోని మతాలన్నీ నిజమైనవే, అనుసరణీయమైనవే. ప్రపంచంలో ఇతర జాతులవారిచే, ఇతరమతాల వారిచే బహిష్కరింపబడి పీడింపబడిన నిరాశ్రితు లకు మనదేశం ఆశ్రయమిచ్చి ఆదరించటం ముదావహం. అట్టి దేశానికి నేను ఒక పౌరుణ్ణి అయినందుకు గర్విస్తున్నాను.

మనం ఇతర మతస్థులపట్ల సహనం ప్రదర్శించటమే కాదు వారిని అభిమానించి అక్కున చేర్చుకోవాలి. ఆ భావనే, ఆ సత్యమే సర్వమతాలకు ప్రాణప్రతిష్ఠాపన మంత్రం కావాలి.

ఎవరిని నిరసించవద్దు. తోటివారికి చేయూతనీయగల్గితే మంచిదే. లేనిచో చేతులు జోడించి వారి శ్రేయస్సును ఆకాంక్షిస్తూ వారి త్రోవను వారిని పోనీయి. అంతేకాని తోటివారిని అభిశంసిస్తూ వారి ప్రయత్నాలకు ఆటంకాలుకల్పించి వారిని క్రిందికి లాగబూనటం ఉచితం కాదు. అది మంచి కర్మ అనిపించుకోదు. ఆ విధంగా ఎవరూ ఏమీ సాధించుకోలేరు. ఇతరులను నిరసించుటకు, అభిశంసించుటకు మన శక్తిని వృధాచేయకూడదు.

మానవులందరూ వీక్షించే వస్తువొక్కటే; అందరి గమ్యం ఒకే ఒక సత్యం. మధ్యలో మనం కల్పించుకొన్న విభేదాలు ఊహామాత్రాలే.

బాగా ఆలోచిస్తే విభిన్నమైన మతవిశ్వాసాల వలన ప్రజలకు మేలే కల్గుతుంది. ఏ విశ్వాసమైనా, వ్యక్తిని మతపరమైన జీవిత విధానంలో ఇమిడ్చి మంచిని కల్గచేస్తుంది కాని కీడు కల్గచేయదు. అంతేకాదు మత విధానాలు ఎన్ని ఎక్కువుంటే సమాజానికి అంత ఎక్కువ ప్రయోజనం కల్గుతుంది. వాని వలన వ్యక్తుల్లో దైవ ప్రవృత్తిని చొప్పించే ప్రబోధాలకు అవకాశాలు బాహుళ్యంగా లభిస్తాయి.

నా గురువర్యులు మతం ఒక్కటే అని నాకు బోధించారు. అసలు ఏ మతగురువైనా అదే బోధిస్తారు. అందరు మత ప్రవక్తలూ మతసూత్రాన్ని ఒక రూపంలో మన ముందుంచగల్గుతారు. ప్రతి ప్రవక్త వారికి పూర్వమున్న రూపానికి నూతనత్వాన్ని కల్పించి మనకు అందిస్తారు.

అన్ని మతాల్లోను అతీత శక్తి స్వరూపాన్ని గురించిన అవగాహన ఒకేరకంగా వుంటుంది. హిందువులు, క్రైస్తవులు, మహమ్మదీయులు, బౌద్ధులు, ఏ మతాన్ని అవలంబించని వారు – వీరందరికి దేహభ్రాంతిని అధిగమించిన స్థితిలో వారి అనుభవాలు ఒకేరీతిలో వుంటాయి.

క్రైస్తవుడు హిందువుకానక్కరలేదు. బౌద్ధమతస్థుడుగాను మారపనిలేదు. అలాగే హిందువుగాని, బౌద్ధుడుగాని క్రైస్తవుడుగా మారవలసిన అవసరం లేదు. ఏ మతస్థుడైనా పరమతం యొక్క ప్రధానాంశాన్ని జీర్ణించుకొని, తన ప్రత్యేక విశ్వాసాలను సంరక్షించుకొని, తన పురోభివృద్ధి ప్రమాణాన్ని తాను తన మార్గంలో అనుసరిస్తూ తన ఆత్మవికాసాన్ని సాధించుకోవాలి.

పవిత్రత, నిర్మలత్వం, దాతృత్వం, ఇవి ప్రపంచంలో క్రైస్తవ ప్రార్థనా మందిరాలకు

మాత్రమే పరిమితంకావు. ప్రతి మతంలోను సర్వోత్కృష్టులైన స్త్రీ పురుషులు ఉద్భవించారు. ఈ నేపథ్యంలో ఎవరైనా తన మతం మాత్రమే గొప్పదని, అది మాత్రమే సజీవంగా వర్ధిల్లుతుందని, మిగతా మతాలన్నీ నశిస్తాయని కలలు కంటే, అతని మూర్ఖత్వానికి మనం జాలిపడాలి. అలాంటివారి కనువిప్పుకొరకు ప్రతి మతకేతనం పైన 'సహకరించు – నిరోధించకు', 'స్వీకరణ మాత్రమే – వినాశంకాదు', 'సామరస్యం, శాంతి మాత్రమే, వ్యతిరేకత కాదు' అనే నినాదాల్ని ప్రస్ఫుటంగా లిఖించవలసి వుంటుంది.

ఎప్పటికైన విశ్వానికంతకు ఒకే మతం అంటూ వుండటం తటస్థిస్తే అది స్థలానికి, కాలమానానికి అతీతమైందిగా, భగవంతునివలె అనంతమైందిగా వుంటుంది. అలాంటి మతం దృష్టిలో కృష్ణుని అనుయాయులకు క్రీస్తు ప్రభువు శిష్యులకు భేదముండదు. పాపులకు, పుణ్యం చేసుకొన్నవారికి మధ్య అంతరం పరిగణింపబడదు. అది బ్రాహ్మణత్వానికి గాని, బౌద్ధమతానికి గాని, క్రైస్తవ మతానికి గాని, మహమ్మదీయ మతానికి గాని సంబంధించింది కాదు. అది పై మతాలన్నిటి యొక్క సమాహారం. ఐనను అభివృద్ధి కొరకు ఇంకా అనంతమైన అవకాశాన్ని ఏర్పరచుకొని వుంటుంది. దాని సర్వసమత్వ విన్యాస పరిధిలో సర్వమానవ కోటికి ఆశ్రయం లభిస్తుంది. పరమమూర్ఖుని మొదలు అత్యంత మేధాసంపత్తితో మానవాతీత సౌశీల్యతను ప్రదర్శించే మహర్షులవరకు అందరికి స్థానం వుంటుంది. ఆ మతం యొక్క పాలనావ్యవస్థలో అసహనానికి, పరమత పీడనానికి స్థానం వుండదు. ప్రతి స్త్రీ యందు, ప్రతి పురుషుని యందు దైవత్వాన్ని ఆ మతం గుర్తిస్తుంది. ఇంకా ఆ మతం మానవులందరూ తమ నిజస్థితిని, వారిలోని దివ్య ప్రవృత్తిని తెలుసుకునే మార్గంలో వారిని నడి పిస్తుంది.

అలాంటి మతాన్ని మనం ప్రపంచ ప్రజల ముందుంచగల్గితే అన్ని జాతులవారు దానినవలంబిస్తారు. మనల్ని అనుసరిస్తారు.

# జ్ఞాని యొక్క వ్యక్తిత్వ లక్షణాలు

వ్యక్తి పారమార్థిక చింతనలో ప్రవేశించాడనటానికి ప్రథమ నిదర్శనం అతడు ప్రకటించే ఉల్లాసమే. వ్యక్తి నిరుత్సాహంగా కనిపిస్తే దానికి కారణం మతం కానేరదు. దానికి దైహికమైన అనారోగ్యమే హేతువు అవుతుంది. ఒకని యొక్క దైన్యస్థితి అతడు చేసిన పాపాలవల్లనే సంభవిస్తుంది. వ్యక్తి నిరుత్సాహభరితుడై వుండి బయటకు పోరాదు. ఒక గదిలో ఏకాంతంగా గడపాలి. అంతేకాని తన దైన్యాన్ని ఇతరులకు వ్యాపింపజేసే హక్కు అతనికుండదు.

నిజమైన దైవచింతన కలవాడు విశాల హృదయుడై యుంటాడు. అతనిలోని ప్రేమ ప్రవృత్తి అతడు సర్వత్రా అలాగే మెలగటానికి ప్రేరణనిస్తుంది. మతాన్ని వ్యాపార పరంగా వినియోగించుకొనువారు పోటీతత్వాన్ని, వివాదపోకడలను, స్వార్థపరత్వాన్ని దానిలో చొప్పించి సంకుచితులు, దురాలోచనాపరులూ ఔతారు.

ఇతరులలో చెడును ఎందుకు చూస్తాం? ప్రపంచాన్ని మన దృష్టితో చూస్తాం గనుక. ఒక గదిలో ఒక చిన్న బిడ్డ, దానికి ఎదురుగా వున్న బల్లమీద బంగారంతో వున్న సంచి వుందనుకోండి. ఒక దొంగవచ్చి ఆ సంచిని అపహరిస్తాడనుకుందాం. ఆ చిన్న బిడ్డకు అది దొంగతనమనే భావనకల్గదు. మన అంతరంగంలో ఏ భావనవుంటే అదే బహిర్గతమౌతుంది. ఆ చిన్నబిడ్డకు అంతర్గతంగా దొంగ అనే భావనలేదు. కనుక బాహ్యంగా కూడ ఆ బిడ్డ దృష్టిలో దొంగలేదు. ఇదే నిదర్శనం మిగతా విషయాలన్నిటికి వర్తిస్తుంది. కనుక వ్యక్తి ప్రపంచంలోని దుర్మార్గాన్ని గురించికాని, ఇతర పాపకార్యాల్ని గురించికాని ప్రసంగించరాదు. దుర్మార్గాన్ని, పాపాల్ని చూడవలసి వచ్చినందుకు రోదించాలి. ప్రపంచ ప్రజల్ని ఉద్ధరించదలిస్తే, వారిని నిరసించకూడదు. వారిని మరింత బలహీనపరచరాదు. ప్రపంచంలో జరిగే చెడు అంతటికి కారణం ప్రజల్లోని బలహీనతే. మనం ఆ అనర్థాల్ని ఎత్తి చూపుతూ ప్రబోధాలు ప్రారంభిస్తే ఆ బలహీనతలే ఇంకా ఎక్కువౌతాయి. మానవులకు వారి బాల్యం నుండి వారిలోని

బలహీనతలను గురించి, పాపప్రవృత్తిని గురించి బోధనలు జరుగుతూనే వుంటాయి. కాని అది వారికి శ్రేయోదాయకం కాదు. కనుక వారిలోని అతిబలహీనుల నుద్దే శించి కూడ వారు చిరాయువులైన ప్రతిష్ఠాత్మక సంతతికి చెందిన వారని బోధించాలి. బాల్యం నుండి కూడ ఆశాజనకమైన ఆలోచనలతో, ప్రోత్సాహభరితమైన స్ఫూర్తితో వారు జీవించాలి. బలహీనపరచే భావనలను, నిర్వీర్యం చేసే ఆలోచనలను వారి దగ్గరకు రానీయకూడదు. 'నేనే భగవంతుణ్ణి' అని ప్రతి వ్యక్తి తన మనస్సుకు అహర్నిశలు ప్రబోధించాలి. చివరకు మరణ సమయంలోను అదే మన మనస్సుల్లో నినదించాలి. నా ఆత్మస్వరూపమే ఈశ్వరుడు. ఇదే పరమసత్యం. దాని యందు సంపూర్ణ విశ్వాసం నెలకొల్పుకొన్న వ్యక్తి అనంత శక్తిమంతుడౌతాడు. ఆ సత్యాన్వేషణలో వ్యక్తి అచంచల మైన ధైర్యంతో, పట్టుదలతో ముందుకు సాగాలి. గమ్యం దూరమైనా, జాగృతుడై లక్ష్యం సిద్ధించేవరకు పట్టుదల వీడక ప్రయత్నించాలి. ప్రపంచ చరిత్ర పరిశీలిస్తే ప్రవక్తల యొక్క శక్తి ఎక్కడ నిక్షిప్తమై యుందో తెలుస్తుంది. వారి ధీశక్తే వారిని ప్రతిభా వంతుల్ని చేసింది. వారిలో ఒక్కరు కూడ వేదాంతంపై ఒక గ్రంథాన్ని రచించలేదు. తార్కికశాస్త్ర సంబంధమైన ధర్మ సూత్రాలపై కూడ వారు గ్రంథాలు వ్రాయలేదు. వారు మిత భాషులు. నీవు కూడ నేనే క్రైస్తునని భావించు. నీకు క్రైస్తుతో తాదాత్మ్య భావం వస్తుంది. అలాగే నేను బుద్ధుణ్ణి అని తీవ్రంగా భావించు. నీవు బుద్ధుడవౌతావు. వ్యక్తి యొక్క భావనే అతనికి జీవాన్ని, బలాన్ని, శక్తిని కల్గజేస్తుంది. అది లేకుండా బుద్ధికుశలతనెంత వినియోగించినా భగవత్సాన్నిధ్యాన్ని చేరలేము.

వ్యక్తిలో సాహసమనేది రెండు విధాలుగా తన్నుతాను ప్రదర్శించుకుంటుంది. ఒకటి తుపాకిని ఎదుర్కొనే సాహసం, రెండవది ఆత్మ విశ్వాసం ద్వారా ప్రకటితమయ్యే సాహసం.

భారతదేశంపై దాడిచేసిన ఒక చక్రవర్తి తన గురూపదేశాన్ని అనుసరించి దేశంలోని మహర్షులను చూడాలని బయలుదేరాడు. బహుప్రాంతాల్లో అన్వేషించి చివరకు ఒకచోట ఒక రాతిపై కూర్చున్న ఒక వృద్ధమునీశ్వరుణ్ణి చూచాడు. చక్రవర్తి ఆయనతో క్లుప్తంగా సంభాషించి

ఆయన వివేకానికి ముగ్ధుడైనాడు. మునీశ్వరుణ్ణి తన దేశానికి రమ్మని ప్రాధేయపడ్డాడు. మునీశ్వరుడందుకు అంగీకరించలేదు. 'నాకు ఈ వనమే సంపూర్ణమైన సంతృప్తినిస్తుంది. నేనెక్కడికి కదలను' అని జవాబిచ్చాడు. 'నీకు కావలసినంత ధనాన్ని యిస్తాను. పదవిని సమకూరుస్తాను. నేనీ ప్రపంచానికే చక్రవర్తిని' అని చక్రవర్తి మునిని ప్రలోభపెట్టడానికి ప్రయత్నించాడు. ఐనా మహర్షి చక్రవర్తి కోరికను నిరాకరించాడు. చక్రవర్తి ఆగ్రహావేశుడై మునీశ్వరునితో, 'నీవు నా వెంట రాకపోతే నిన్ను చంపుతాను' అన్నాడు. ఆ వృద్ధముని చక్రవర్తి అజ్ఞానానికి నవ్వుకొని అతనితో 'చక్రవర్తీ, నీవు నన్ను చంపలేవు. అంతకంటే అవివేకమైన ఆలోచన మరొకటి వుండదు. నన్ను సూర్యుడు మాడ్చలేడు. అగ్ని దహించలేదు. ఆయుధం చంపనూలేదు. నా ఆత్మకు పుట్టుకలేదు. చావులేదు. అది నిత్యజీవి. సర్వశక్తిమంత మైనది. సర్వత్రా వ్యాపించి వుండేది' దానితో చక్రవర్తి నిరుత్తరుడైనాడు.

ఇదే ఆత్మస్థైర్యము. రెండవది సింహంగాని, పెద్దపులిగాని ప్రదర్శించే సాహసం. 1857 సిపాయి ముట్టడిలో ఒక మహాతపస్వియైన స్వామి వున్నాడు. ఆయనను ఒక మహమ్మదీయ తిరుగుబాటుదారుడు తీవ్రంగా గాయపరిచాడు. హిందూ తిరుగుబాటు దారులు ఆ మహమ్మదీయుని బంధించి స్వామి సమక్షానికి తెచ్చి అతన్ని చంపుతా మన్నారు. స్వామి వారిని వారించి 'అతనిలో కూడ భగవానుడున్నా' డని పలుకుతూ అసువులు విడిచాడు. ఇది మరొక నిదర్శనం.

# సజీవ స్వరూపుడైన ఈశ్వరుని ఆరాధించుట

మతం యొక్క అసలు రహస్యం ఆచరణ రూపంలో నిరూపితమౌతుంది గాని సిద్ధాంతాల్లో కాదు. మంచిగా నడచుకోవటం, మంచిని ఆచరించటం – అదే మత సారాంశం. భగవన్నామాన్ని బిగ్గరగా అరవటం మతం కాదు. భగవానుని నిర్ణయాలను అమలు చేయుటే నిజమైన మతం.

నైతిక పథంలో వ్యక్తి సంచరించాలి. వీరోచితంగా నడచుకోవాలి. హృదయ పూర్వకంగా కర్తవ్యాన్ని నిర్వహించాలి. సడలని నైతిక పథంలో, భయమెరుగని సాహసంతో వ్యక్తి జీవించాలి. మత సిద్ధాంతాలతో వ్యక్తి మనసుపాడు చేసుకోకూడదు. భీరువులు మాత్రమే పాపమాచరిస్తారు. ధీరులెన్నడూ మనోవాక్కాయ కర్మల్లో పాపం వంక పోరు.

వ్యక్తి పవిత్రాత్ముడైతే అతడు అపవిత్రతను దర్శించలేడు. దానికి కారణం అతని అంతరంగ ప్రవృత్తే బాహ్యంలో ప్రతిబింబించటం వల్లనే. మనలోపల మలినం వుంటే తప్ప బాహ్యప్రపంచంలో మలినాన్ని చూడలేము. వేదాంతంలో ఆచరణ యుక్తమైన ప్రధానాంశాల్లో ఇది యొకటి. ఈ విజ్ఞానాంశాన్ని ప్రతియొక్కరు తమ తమ జీవితాల్లో అనుసరించటం శ్రేయస్కరం.

పరోపకారం పరమోత్కృష్ట ధర్మం. అలాగే పరపీడనం పరమనికృష్టపాపకార్యం. దృఢత్వము, శౌర్యం సత్పురుష లక్షణాలు. బలహీనత, భీరుత్వం పాపుల లక్షణాలు. స్వతంత్ర జీవనం సుగుణ లక్షణమైతే, పరాధీనత కాపురుషలక్షణం. పరులను ప్రేమిం చుట ఉత్తమ లక్షణం కాగా, ఇతరులను ద్వేషించుట హైన్యము. దైవశక్తి యందు విశ్వాసం, ఆత్మ విశ్వాసం సద్గుణములౌతాయి. సంశయించే ప్రవృత్తి పాపంగా పరిగణింపబడుతుంది. సమైక్యభావం శ్లాఘనీయం. భేదభావం నైవ్యమౌతుంది.

సర్వజన సంక్షేమం, నైతికపథ గమనం సాధించాలంటే స్వార్థరాహిత్యాన్ని ముఖ్యంగా అవలంబించాలి. 'నీ కొరకు నేను, నా కొరకు కాదు' అనే భావాన్ని ప్రతి వ్యక్తి అలవరచుకోవాలి. స్వర్గం, నరకం – ఇవి వున్నవో, లేవో ఎవరికి పట్టనవసరం లేదు. ఆత్మపదార్థమనేది వుందో, లేదో ఆలోచించాల్సిన పనిలేదు. చిత్తు, సత్తు అంటూ వానిని గురించి వితర్కించుకోవాల్సిన అవసరం లేదు. మన ఎదురుగా కనిపించే ప్రపంచాన్ని గురించి మాత్రమే మనం విచారించాలి. ఈ ప్రపంచం అంతా దుఃఖ భూయిష్టంగా వుంది. బుద్ధుడులాగే మనం కూడ ప్రపంచంలో సంచరించి ప్రజల కష్టాల్ని రూపుమాపటానికి శాయశక్తులా కృషి చేయాలి. ఆ ఉద్యమంలో మనం ఆత్మాహుతికి కూడ సిద్ధమవ్వాలి. వ్యక్తి నాస్తికుడా, ఆస్తికుడా, భౌతికవాదా, వేదాంతా, క్రైస్తవుడా, మహమ్మదీయుడా అని విచారించపనిలేదు. తన్ను తాను మరచిపోవాలన్న అంశాన్ని ప్రథమంగా మననం చేసుకోవాలి. 'నేను' అనే అహంభావాన్ని విడనాడాలి. నిత్యమైన ఆత్మపదార్థాన్ని పరిశోధించాలి.

కఠోర నియమనిష్ఠలు అనుసరించిన తర్వాత భగవంతుడు ప్రతి జీవంలోను అంతర్భూతంగా వున్నాడని వేరే భగవంతుడెవరూ లేరనే సత్యాన్ని కనుగొన్నాను. కనుక కనిపించే జీవరాసులకు సేవచేస్తే భగవంతునికి నిజంగా సేవచేసినట్లే.

మనకు కనిపించే జీవరాసులన్నీ భగవానుని ప్రతిరూపాలే. ఎదుటనున్న వాటిని వదిలి పరమాత్ముని శోధిస్తూ ఎక్కడకు వెళ్తావు? ఏ వ్యక్తి ప్రతి జీవిని భేదభావం లేకుండా సమాదరణతో ప్రేమిస్తాడో అతడే భగవంతుని అత్యధిక భక్తితో ఆరాధించే వాడౌతాడు.

'మాతృదేవోభవ, పితృదేవోభవ' అని మనం పలుచోట్ల పఠించేవుంటాం. కనుక మనం మన తల్లిదండ్రులను దైవస్వరూపులుగా భావించి గౌరవించాలి. ఈ సందర్భం లోనే నేను మరొక ముఖ్యమైన సూక్తిని చెపుతాను. 'దరిద్రదేవోభవ, మూర్ఖదేవోభవ'. దరిద్రులను, నిరక్షరాస్యులను, అమాయకులను, బాధాపీడుతులను భగవత్స్వరూపులుగా ఎంచి ఆదరించండి. వీరికి చేసే సేవ సర్వోత్కృష్టమైనది.

సచేతనములైన జీవుల్లో భగవంతుని మనం ఆరాధించాలని వాంఛిస్తాం. మీరు, నేను కూడ ఈ సృష్టిలో ప్రతి జీవిలోను భగవంతుని చూస్తూనే వున్నాం. భగవానుడు ప్రతిచోట వుండి 'ఇక్కడ ఉన్నది నేనే' అని ప్రకటిస్తూనే వుంటాడు. అది మనం తెలుసుకొని మనలోను, అన్ని జీవరాసుల్లోను ఉన్న ఆ చైతన్య మూర్తిని దర్శించకుండా ఆయన్ని శోధిస్తూ వ్యధకు గురికావటం అవివేకం.

నరకప్రాయమైన ఈ ప్రపంచంలో ఒక వ్యక్తి హృదయానికి కనీసం ఒక రోజైనా శాంతిని, సంతోషాన్ని సమకూర్చగల్గితే అదే నిజమైన సేవ అవుతుంది. నా జీవిత మంతా శ్రమపడి నేను తెలుసుకొన్న పరమసత్యం ఇది. మిగతా మన ప్రయాసలన్నీ ఉత్తచంద్రకాంతి వెలుగుల్లాంటివే.

మనం నిర్వర్తించే పనుల వల్ల మంచి జరగాలని మనకు వుంటే మనం ఆర్భా టంతో ఆచరించే ఆచార కర్మకాండను త్యజించాలి. దానికి బదులుగా భగవత్స్వరూపు లైన జీవులుగా మన ముందు సంచరించే మానవులను ఆరాధించాలి. భగవంతుడు ప్రతి జీవిలోనేగాక, విశ్వవ్యాప్తుడై యున్నాడు. భగవంతుని విశ్వవ్యాప్త ప్రతిపత్తిని గుర్తించి విశ్వాన్ని ఆరాధించటం, మనం ఈ విశ్వానికి చేసే నిజమైన సేవ ఔతుంది. అంతేగాని ఆచారాల పేరిట మనం చేసే కర్మకాండలు నిజమైన సేవలు కాదు. వారణాసిలోగాని, బృందావనంలోగాని దేవాలయాల్లో దేవునిపేరుతో ఆయనకు చేసే బహువిధసేవల మిషతో రోజంతా జరిపే ఆర్భాటాలకి, క్రియాకలాపాలకు మనం లక్షలకొలది వెచ్చిస్తున్నాం. బయట మానవుని రూపంలో వున్న భగవంతుడు విద్యా భ్యాసానికి ధనం లేక, తిండితినటానికి ఆహారం లేక మరణిస్తున్నా మనం పట్టించు కోము. బొంబాయిలో వైశ్యులు కొందరు నల్లుల కొరకు ఆసుపత్రులు నిర్మిస్తున్నట్లు వింటున్నాం. మానవులు తిండిలేక మరణిస్తున్నా వారికి వారేమీ చేయరు. ఇంతస్వల్ప విషయాన్ని మన ప్రజలు అవగాహన చేసుకోబోవటం దురదృష్టకరం. ఇలాంటి ప్రజల మతుల చికిత్సకోసం అన్నట్లుగా మన దేశం నిండా మానసికచికిత్స వైద్యశాలలు ప్రబలుతున్నాయి.

మనం ప్రతి పురుషుని, స్త్రీని ఇతరమైన ప్రతిప్రాణిని, భగవంతునిగా పరిగణిం చాలి. మనం ఎవరికి సహాయం చేయలేము; కాని వారికి సేవలనందించగలం. భగవానుని సంతానానికి సేవచేస్తే అది భగవంతునికి చేసినట్లే. పరమాత్ముని బిడ్డలలో ఎవరికైనా మన సేవలను అందించే భాగ్యం మనకు ఆ కరుణామయుడు ప్రసాదిస్తే మనం ధన్యులమౌతాం. మనం మనలను గురించి గొప్పగా తలంచకూడదు. ఇతరులకు సేవచేసే మహద్భాగ్యం మనకు లభిస్తే, మనం గర్వపడి, ఆ సేవను ఆరాధనా భావంతో నిర్వర్తించాలి. నిరుపేదల్లో మనం భగవంతుని దర్శించాలి. మోక్ష ప్రాప్తిని సుకరం చేసుకోవాలంటే ఆ బీద ప్రజానీకాన్ని మనం ఆరాధించాలి. పరమాత్మయే నిరుపేదల రూపంలో, రోగులు, మతిబోయినవారు, వికలాంగులు, పాపుల రూపంలో వుండి, వారికి సేవచేసే అవకాశాన్ని మనకు కల్పిస్తున్నాడు. మానవసేవే మాధవసేవ అనే సత్యాన్ని మనం నిజం చేయాలి.

మన చుట్టూ వున్న ప్రాణులను ఆరాధనా భావంతో చూడటమే మనం చేసే పూజలలోకెల్లా ఉత్తమమైనపూజ. ఆ పూజయే విరాట్స్వరూపారాధన ఔతుంది. సంస్కృతంలో ఆరాధన అనే శబ్దానికి సరియైన ఆంగ్లపదం 'worship' మాత్రమే. మనల్ని పరివేష్ఠించియున్న మానవజాతి, జంతుజాలం, ఇవి అన్నీ మనకు దైవస్వరూ పాలే. మనం ఆరాధించవలసిన ప్రథమ దేవతలు మన దేశప్రజలే. ప్రజల్లో ఒకరిని చూచి మరొకరు అసూయపడుతూ, ఒకరితో మరొకరు పోట్లాడుతూ జీవించటానికి బదులుగా ఒకరిపై మరొకరు ఆరాధనా భావాన్ని ప్రదర్శిస్తూ జీవించటం శ్రేయో దాయకం.

మనం మన పవిత్రతను కాపాడుకుంటూ, ఇతరులకు మేలు చేయటమే మన ఆరాధనల్లోని సారాంశం. రోగుల్లోనూ, బలహీనుల్లోను, బీదజనంలోనూ శివుని చూడగల్గినవారు ఈశ్వరారాధాన నిజంగా చేసిన వారౌతారు. దేవాలయాల్లో శివుని రూపాన్ని మాత్రమే దర్శించగల వ్యక్తి యొక్క దైవారాధన చాల ప్రాథమిక దశలో వున్నట్లు పరిగణింపబడుతుంది. అలాగాక ఒక దీనజనుణ్ణి సమీపించి అతడు ఏ జాతికి, ఏ మతానికి, ఏ

కులానికి చెందినవాడోయనే వివక్షత లేకుండా అతనిలో శివుని దర్శించి అతనికి సేవలందించి, అతని దైన్యాన్ని నిర్మూలించే ప్రయత్నం చేసే వ్యక్తిని శివుడు ఎక్కువగా ప్రేమిస్తాడు, ఆదరిస్తాడు.

ఒక ధనికునకు ఒక తోట వుంది. దాని పాలన కొరకు అతని వద్ద ఇద్దరు తోటమాలులున్నారు. అందులో ఒక తోటమాలి పెద్ద సోమరి, వీసమెత్తుకూడ పని చేయడు. కాని యజమాని తోటని దర్శించటానికి వచ్చినపుడు అతన్ని సమీపించి అతి వినయం ప్రదర్శిస్తూ 'నీవు ఇంద్రుడివి, చంద్రుడివి' అని స్తోత్రపాఠాలు అడుగడుగునా వల్లిస్తూ ప్రవర్తిస్తాడు. రెండవ తోటమాలి అవసరమైనంతవరకూ మాట్లాడుతూ, అమితంగా శ్రమిస్తూ తోటలో సమస్తజాతి వృక్షాల్ని శ్రద్ధతో పెంచి పోషిస్తూ తోటలో ఫలించిన కాయగూరల్ని, ఫలాల్ని దూరంలో నివసిస్తున్న యజమాని ఇంటికి చేరుస్తాడు. ఈ ఇరువురి తోటమాలుల్లో యజమానికి హితుడెవ్వడు? తోట యజమానే శివుడు. తోటమొత్తం ప్రపంచం. తోటలో భిన్న భిన్నతత్వాలు గల ఇరువురు తోటమాలులు. అందులో ఒకడు పనిచేయని సోమరి. తాను ఆచరించకుండా శుష్క వేదాంతాల్ని వల్లించే వ్యర్థప్రలాపి. రెండవ తోటమాలి ప్రపంచమనే తోటలోని ప్రాణికోటియనే సమస్త వృక్షజాతుల్ని – అంటే బీదసాదల్ని, బలహీనుల్ని, జంతుజాలాన్ని – మొత్తం భగవత్సృష్టిని సంరక్షించే బాధ్యత వహిస్తాడు. వీరిరువురిలో శివుని ఆదరణకు అర్హుడెవ్వడో వేరే చెప్పనవసరంలేదు. పితృస్థానంలో వున్నవ్యక్తిని సేవించాలంటే ఆయన సంతానానికి ముందు సేవచేయాలి. అలాగే శివునికి ఉపచారాలందించాలంటే ఆయన సృష్టియైన మానవకోటికి, జంతుజాలానికి మన సేవలందించాలి. మనం ముఖ్యంగా మరువరాని విషయం మరొకటి వుంది. భగవత్సేవాపరాయణులను ఎవరు సేవిస్తారో వారే భగవంతునికి అతిప్రీతిపాత్రులైన సేవకులౌతారని శాస్త్రాలు ఉద్ఘోషిస్తున్నాయి. ప్రతి వ్యక్తి పవిత్ర హృదయంతో ఆర్తులై తన వద్దకు వచ్చిన వారికి శక్తివంచనలేకుండా సహాయపడాలి. కర్మల్లో ఇదే ఉత్తమ కర్మ అవుతుంది. దాని ప్రభావం వల్ల చిత్తశుద్ధి జరుగుతుంది. చిత్తశుద్ధి ద్వారా శివసాక్షాత్కారం లభిస్తుంది. అందుకు భిన్నంగా స్వార్థపరత్వంతో ఎన్ని పుణ్యక్షేత్రాలు, ఎన్ని దేవాలయాలు దర్శించినా, ఎన్ని పూజలు నిర్వర్తించినా శివునకు సన్నిహితుడు కాలేడు.

మానవుడే భగవదాశ్రయమైన అత్యున్నత స్థాయిదేవాలయం. నేను దేవాలయం లోని విగ్రహాల కంటే, బైబిల్ కంటే గూడ ఎక్కువ ఆరాధనా భావాన్ని మానవునిపట్ల చూపిస్తాను. కాని కొంతమంది ఛాందసులు ఈ అభిప్రాయాన్ని ఆమోదించరు. కాని మనకు ప్రత్యక్షంగా కనిపించే మానవునిలోని దైవత్వాన్ని తెలిసికొని ఆరాధించటం కంటే ఆచరణయోగ్యమైన విధానం మరొకటి వుండదు. మానవునిలోని భగవంతుని మనం చూడగలం, అనుభవించగలం, తెలుసుకోగలం. మానవ దేహంలోవున్న ఆత్మ శక్తి మాత్రమే మనం ఆరాధించవలసిన దైవం. అలాగే సమస్త జంతుజాలం కూడ ఆరాధనాయోగ్యమైన దేవాలయాలు. ప్రతి మానవ శరీరమనే దేవాలయంలో అధివసిస్తున్న దేవుణ్ణి గుర్తించి ఆ మానవుని ఎదుట పూజ్యభావంతో నిలబడిన క్షణం నుండి నేను బంధవిముక్తుణ్ణి అవుతాను. నాకు అప్పటి వరకు వున్న బంధాలన్ని తొలగి నేను విముక్తుణ్ణి అవుతాను.

పై విధంగా వ్యక్తికి జ్ఞానోదయం అయిన తర్వాత అన్నీ సత్ఫలితాలే సిద్ధిస్తాయి. మొత్తం ప్రపంచానికే మంచి జరుగుతుంది. అప్పటి వరకు వ్యక్తి తాను పెంచుకొన్న ప్రేమానుబంధాలన్నీ ఒక్కమారు అదృశ్యమౌతాయి. ఈ జన్మలోను, మరుజన్మలోను కూడ వ్యక్తి తనవి అనుకునే వస్తువులేమీ వుండవు. అంతవరకు ప్రవహించిన ప్రేమ ప్రవాహాలన్నీ సంపూర్తిగా ఇంకి, వ్యక్తి బంధవిమోచనుడౌతాడు. మొత్తం స్వార్థపరత్వం నశిస్తుంది. సార్థరహితులైన వారే ప్రపంచానికి విరివిగా సేవలందించగల్గుతారు. వ్యక్తి తాను ప్రేమించే వస్తువు అల్పమైంది కాదని, సర్వోత్కృష్టమైన, తేజోమయమైన ఈశ్వరతత్వమేనని తెలిసికొని సమస్త జీవకోటి పట్ల విస్తృతమైన ప్రేమను ప్రదర్శిస్తాడు. భార్య పెనిమిటిలో దైవాన్ని చూస్తుంది గనుక అతనిని అతిశయించిన ప్రేమతో ఆద రిస్తుంది. అలాగే భర్త తన భార్యలో భగవంతుని చూచి ఆమెను ఎక్కువగా ప్రేమిస్తాడు. ఆ విధంగానే తల్లి తన సంతానాన్ని, సంతానం తల్లిని ప్రేమానురాగాలతో పరస్పరం చూచుకుంటారు. అలా ప్రతి వ్యక్తి ఇతర వ్యక్తులను, వారు మంచివారైనాసరే, దుష్ట వర్తనులైనా సరే, ద్వేషించకుండా, అనురాగ భావంతో చూస్తాడు. ఏ వ్యక్తి తన వ్యక్తిత్వాన్ని చంపుకొని ఆ స్థానంలో భగవానుని నెలకొల్పుకొని సంచరిస్తాడో అతడు

ప్రపంచం మొత్తాన్ని చైతన్యవంతం చేస్తాడు. అతని విషయంలో మొత్తం ప్రపంచం క్రొత్త రూపాన్ని సంతరించుకొని దర్శనమిస్తుంది. వ్యధాభరితమైన, దైన్య పీడితమైన స్థితి కన్పించదు. కలతలన్నీ అదృశ్యమౌతాయి. వ్యక్తులు రాగద్వేషాలతో, పరస్పర కలహాలతో, జీవనభృతికై పోటీపడుతూ ప్రపంచాన్ని బందిఖానాగా చేసుకోకుండా, ఈ విశ్వాన్ని ఒక క్రీడాస్థలంగా మార్చుకోగల్గుతారు. విశ్వమంతా ఒక సుందర దృశ్యమై విరాజిల్లుతుంది. సమస్త జీవరాశిలోను పరమాత్మను దర్శించే యోగ్యతగల మానవునకే విశ్వమంతా సౌందర్యమయంగా భాసిస్తుంది. అలాగే ప్రతి మానవుడు ఆ యోగ్యతను సమకూర్చుకోగల్గితే ప్రపంచంలోని స్థితిగతులన్నీ మారుతాయి. కలతలు, కార్పణ్యాలు ప్రబలిన చోటే శాంతి స్థాపన జరుగుతుంది. ఇతరులకంటె అన్ని విషయాల్లోను ముందుండాలనే పోటీతత్వంతో చెలరేగే కౄరమైన తొందరపాటుతనం నశిస్తుంది. దాంతో ఘర్షణకు తావులేకుండా పోతుంది. ద్వేషం అస్తమిస్తుంది; అసూయ పూర్తిగా నివృత్తి అవుతుంది; చెడు అనేది మచ్చుకైనా కన్పించదు. మానవులంతా దేవతలౌతారు. భూలోకం స్వర్గధామంగా మారుతుంది. జీవులందరూ దైవ స్వరూపులైనప్పుడు ప్రపంచంలో చెడుకు స్థానం వుండదు. ప్రతిజీవిలోను మానవుడు దైవాన్ని సంద ర్శించినప్పుడు పైన చెప్పిన మహత్తర పరిణామాలన్నీ మనకు సాధ్యమౌతాయి. సమాజంలో మానవ శ్రేయస్కరమైన మార్పులు ఊహించని రీతిలో సమకూరుతాయి. మానవుని దుష్టశక్తిగా యోచించే అవకాశముండదు. తప్పు చేసిన వ్యక్తిపై ఆగ్రహం ప్రకటించే సన్నివేశముండదు. అసూయాద్వేషాలకతీతంగా మానవులు ప్రవర్తిస్తారు. శిక్షించే తలంపే మానవులకు జనించదు. ఆదర్శప్రదమైన ప్రేమ సర్వత్రా శక్తిమంతంగా ప్రవర్తిల్లుతుంది. సర్వశక్తిమంతమైన ఆ ప్రేమే మొత్తం మానవాళికి చోదకశక్తిగా వుండి వారిని సన్మార్గంలో నడిపిస్తుంది.

ప్రపంచంలోని స్త్రీ పురుషుల్లో బహుకొద్దిమందైనా ప్రశాంతంగా కూర్చొని కొన్ని నిముషాలపాటు సమస్త జీవరాశినుద్దేశించి 'మీరందరూ పరమాత్మ స్వరూపులే, జీవులందరిలోను వున్న భగవానుడొక్కడే' అని ప్రకటించగల్గితే మొత్తం ప్రపంచంలో

అనూహ్యమైన మార్పు లభిస్తుంది. ఈ మార్పునకు అరగంట కాలం కంటె ఎక్కువ పట్టదు. అంతవరకు ప్రజల్లో ప్రబలియున్న స్పర్ధ, అసూయ ద్వేషాలు మటుమాయమై మనందరిలోను వున్న భగవత్స్వరూపం ఒక్కటే యన్న భావం ఉత్పన్నమౌతుంది. మొత్తం ప్రపంచమంతా మంచితో నిండియున్నట్లు గోచరిస్తుంది. భావించే వానిలో చెడువర్తన వుంటే తప్ప అతడు ఇతరులలో చెడును చూడలేడు. వ్యక్తి తన హృదయాంత రాళాలలో దొంగను భద్రపరచుకుంటేనే అతడు బాహ్య ప్రపంచంలో దొంగను వీక్షిస్తాడు. అలాగే హంతకుణ్ణి కూడ. వ్యక్తి సద్భావనను స్థిరీకరించుకోగల్గితే అతనికి ప్రపంచంలో చెడు ఎదురవ్వదు. ఆ విధంగా విశ్వమంతా పరివర్తన చెందుతుంది. సమాజానికిది అమూల్యమైన ప్రయోజనకర పరిణామం.

ఈ విజ్ఞానమయ కాంతి పుంజాన్ని సర్వమానవాళిపై ప్రసరింపచేయాలి. ప్రతి మానవుడు దైవసాన్నిధ్యాన్ని చేరేవరకు ఈ ఉద్యమం ఆగకూడదు. ఈ విజ్ఞాన ప్రకాశాన్ని బీదలకంటె ఎక్కువ స్థాయిలో ధనవంతులకు, నిరక్షరాస్యులకంటె అధిక మోతాదులో విద్యావంతులకు ప్రసరింపచేయాలని మరువకూడదు. ప్రజలను విజ్ఞానవంతుల్ని చేయటం వరకే మన బాధ్యత. పై విషయాలు భగవానుడే చూసుకుంటాడు. 'కర్తవ్యం నిర్వహించటం వరకే మానవుని హక్కు. ఫలితాన్ని ఆపేక్షించే హక్కు అతనికి లేదు' అని భగవానుడే చెప్పాడు. మానవుడు కర్తవ్యాన్ని నిర్వర్తిస్తూనే వుండాలి. అయితే ఫలాన్ని ఆపేక్షించ కూడదు.

# ఆత్మవిశ్వాసం

విశ్వాసం – మనలో మనకి విశ్వాసం, భగవంతుని యందు విశ్వాసం వుంటే చాలు, ఉన్నత స్థితిని సాధించామన్నమాటే. మనదేశంలోవున్న మానవులు, అదనంగా ఇతర దేశాల నుండి వచ్చిన జనులు – వీరందరిలో ఉన్న దేవుళ్ల యందు మనకు విశ్వాసమున్నా మన యందు మనకి విశ్వాసం లేకపోతే మనకు మోక్షప్రాప్తి కల్గదు.

ఆత్మవిశ్వాసమున్న కొద్దిమంది జీవిత గాధల సంపుటీకరణమే వ్యక్తిలోని దైవత్వాన్ని వెలికితీస్తుంది. ఆ స్థితిలో వ్యక్తి సాధించలేనిది ఏదీ వుండదు. దైవత్వాన్ని చాలినంత స్థాయిలో ప్రదర్శించనప్పుడే వ్యక్తి విఫలుడౌతాడు. వ్యక్తిగాని, జాతిగాని విశ్వాసాన్ని కోలుపోయిన మరుక్షణం వారిని నిశ్చేష్టత ఆవరిస్తుంది.

తనలో తనకు విశ్వాసం లేనివాడు నాస్తికుడే. భగవంతుని ఉనికిని శంకించే వారే నాస్తికులని పురాతన మతాలు నిర్ధారించాయి. కాని ఆధునిక మతం ప్రకారం తనయందు తనకు విశ్వాసం లేని వ్యక్తి నాస్తికుడౌతాడు.

వ్యక్తి సాధించలేనిది ఒకటుంటుందని మనం ఎన్నడూ తలంచకూడదు. అంతకంటే తప్పిదం వేరొకటి వుండదు. వ్యక్తి తనను, ఇతర జనాన్ని అశక్తులుగా ఎంచుకోటం కంటె అతిశయించిన పాపం మరొకటి వుండదు.

వ్యక్తి తన్ను తాను ఎలా భావిస్తాడో అదే ఔతాడు. తాను బలహీనుణ్ణని ఎంచు కుంటే బలహీనుడౌతాడు. కాదు, బలవంతుణ్ణి అని భావిస్తే బలవంతుడౌతాడు.

కార్యసాధనా యత్నంలో సంభవించే ఆటంకాలను, పొరపాట్లను లక్ష్యపెట్ట కూడదు. ఓటములను లెక్కచేయకూడదు. తిరోగమనాలని కూడ సహించాలి. లక్ష్య సాధనకోసం వేయి ప్రయత్నాలు చేయవలసి వచ్చినా వెనుకాడకూడదు. అప్పటికీ లక్ష్యసాధన ఫలించకపోతే మరొక ప్రయత్నం చేయవలసిందే.

బలహీనతను నిర్మూలించుకోవాలంటే దాన్ని గురించే చింతిస్తూ కూర్చోటం సరికాదు. బలాన్ని సమకూర్చుకునే యత్నం చేయాలి.

యువకులారా ! శరీర సౌష్ఠవాన్ని సమకూర్చుకోండి. ఇదే నేను మీకిచ్చే ప్రబోధం. మీరు గీతాపఠనం ద్వారాకంటె ఫుట్‌బాల్ ఆట ద్వారా స్వర్గానికి ఎక్కువ సమీపంలో వుంటారు. ఇవి సాహసవచనాలే. ఐనా నాకు మీ యందున్న ప్రేమ కారణంగా ఈ విషయం చెప్పక తప్పుటలేదు. నేను సంపాదించిన కొద్ది అనుభవం ద్వారా నాకీ కీలక విషయం అర్థమైంది. మీ శరీర దార్ఢ్యత మెరుగైన స్థితిలో మీరు భగవద్గీతను ఎక్కువ సుళువుగా అవగాహన చేసికోగలరు.

వ్యక్తికి బలమే జీవనం; బలహీనత మరణ సదృశం. బలం శుభదాయకం. బలం జీవితానికి నిత్యత్వాన్నిస్తుంది. దుర్బలత్వము నిత్యప్రయాసను, దైన్యాన్ని కలుగజేస్తుంది. ఇవి చాల విలువైన సత్యాలు.

ఏపనినైనా సాధించాలంటే అకుంఠిత దీక్ష, పట్టుదలతో పాటు దృఢ సంకల్పం కూడ అత్యావశ్యకం. 'నేనీ సముద్రాన్ని ఆపోశనపట్టేస్తాను. నేనీ కొండల్ని పిండి పిండి చేస్తాను' అంటాడు, పట్టుదల గల వ్యక్తి. అలాంటి శక్తిని, దృఢసంకల్పాన్ని సమకూర్చుకొని గట్టి కృషిచేస్తే వ్యక్తి లక్ష్యాన్ని సాధించగల్గుతాడు.

'నిరాశకు తావివ్వకు. మార్గం సుగమం కాదు; అసిధారావ్రత చర్యతో సమానం. ఐనా ధైర్యాన్ని కోలుపోవద్దు. లేచి కార్యోన్ముఖుడవుకా; జాగరూకుడవై లక్ష్యాన్ని సాధించు; గమ్యాన్ని

చేరు' ఇదే నా ప్రబోధం.

ప్రజలు ఏం మాట్లాడినా పెడచెవిని బెట్టు. నీ విశ్వాసాలను సడలనీయకు. మొత్తం ప్రపంచం అంతా నీ పాదాక్రాంతమౌతుంది. ఇది నమ్ము. నిశ్చింతగా మసలుకో. 'ఆ వ్యక్తి యందు విశ్వాసముంచు, ఈ వ్యక్తిని నమ్ముకో' అని నీకు సలహా యిచ్చే వారుంటారు. కాని నేను చెప్పేది ఒక్కటే. 'నీయందు నీవు పూర్తి విశ్వాసముంచుకో. అన్ని శక్తులు నీలోనే వున్నాయి. అది తెలుసుకొని వానిని వినియోగించు.'

ఉత్సాహపూరితుడవైవుండు. భగవానుడు మనల్ని గొప్పకార్యాలు సాధించటానికి నియోగించాడనే విశ్వాసంతో కృషి చేయి. మన ప్రయత్నాలు తప్పక సఫలీకృత మౌతాయి.

ఇప్పుడు మనం పొందవలసింది ఇంతవరకూ మనకు లేనిది, మన పూర్వీకులకు కూడ లేనిది, కాని యవనులవద్ద వున్నది. అదే ఐరోపీయుల జీవనాడి. డైనమో నుండి విద్యుత్తు ప్రవాహం ప్రపంచం నలుమూలల ప్రసరించి ప్రజలను చైతన్యవంతుల్ని చేసే ఆ శక్తి మనకు కావాలి. మనం కూడ వారివలె శక్తిమంతులం కావాలి. స్వతంత్ర పిపాస మనలో ప్రజ్వరిల్లాలి. వారివలెనే మనం స్వావలంబనా స్ఫూర్తిని, చలించని మనఃస్థైర్యమును, పనియందు నైపుణ్య పటిమను, లక్ష్యసాధనలో ఐక్యతను, అభివృద్ధివైపు దృష్టిని సమకూర్చుకోవాలి. మన పాత చరిత్రను సమీక్షించుకునే యత్నాన్ని త్యజించి, పురోభివృద్ధిని కాంక్షించే విస్తృత ఊహాసంకల్పంతో పరిపూర్ణమైన చైతన్య స్ఫూర్తిని సంతరించుకోవాలి. ఇంకా మనం నైతిక పథాన్ని విడనాడకుండా అత్యంత స్థైర్యాన్ని, సాహసాన్ని సమీకరించుకోవాలి. మనఃస్ఫూర్తిగా కార్యాచరణకు పూనుకోవాలి. ఛాందస మత సిద్ధాంతాలను పాటించనవసరం లేదు. పిరికివారు మాత్రమే పాపం చేస్తారు. ధీరులు మనస్సులో కూడ పాపాన్ని తలపెట్టరు, పాపంజోలికిపోరు.

మనం ప్రజల ముందుకు వెళ్లి వారిని ఈ విధంగా ప్రబోధించాలి. "నిద్ర నుండి

మేల్కొనండి, జాగరూకులుకండి. మీ కష్టాన్ని రూపుమాపి, మీ అవసరాల్ని తీర్చగల శక్తి సామర్థ్యాలు మీలోని ప్రతివ్యక్తిలోను వున్నాయి. ఆ విశ్వాసంతో ప్రవర్తిస్తే ఆ శక్తి మీకు ప్రత్యక్షమై ఉపకరిస్తుంది."

ఆత్మ యొక్క సర్వోత్కృష్టతను ప్రజల ముందుకు వెళ్లి వేనోళ్ళ మనం ప్రకటిం చాలి. ప్రజల్లో నిర్భయత్వాన్ని చొప్పించాలి. 'జాగరూకులు కండు, చైతన్యవంతులు కండు, గమ్యాన్ని చేరేవరకు విశ్రమించవద్దు' అని మరల మరల ప్రబోధించాలి.

నేడు మనకున్న దుస్థితి మన స్వయంకృతాపరాధ పరిణామమే. దీనిని మనమే స్వయంకృషితో నివృత్తి చేసుకోవాలి. మనం సృష్టించుకొన్న దానిని మనమే ధ్వంసం చేసుకోగలం. కనుక ధైర్యంతో నిలబడి పటిష్ఠతను సమకూర్చుకొని, సంపూర్ణ బాధ్యతను మన భుజస్కంధాలపై వేసుకొని మన భవితవ్యాన్ని మనమే సృష్టించుకుంటామనే ఎరుకతో నడచుకోవాలి. ఈ సందర్భంలో మనకవసరమైన పటిమ, ప్రోద్బలం మనలోనే మనకు లభిస్తాయి.

మనలో మనకు విశ్వాసముండటం అత్యావశ్యకం. అదే మనల్ని అన్ని విధాలా రక్షిస్తుంది. ప్రజలందరు విస్తృతంగా ఆత్మవిశ్వాసాన్ని సాధించియుండి వుంటే, మనం ప్రస్తుతం అనుభవిస్తున్న కష్టాలు చాలా వరకు అంతరించివుండేవి. మానవ చరిత్ర పుటల్ని తిరగేస్తే ప్రసిద్ధులైన స్త్రీ పురుషుల జీవితాల్ని గరిష్ఠ స్థాయి పటిమతో నడిపింది వారి ఆత్మవిశ్వాసం తప్ప మరొకటికాదని స్పష్టమౌతుంది.

విశ్వాసం, కారుణ్యభావం, వీటిని తీవ్రస్థాయిలో సంతరించుకోగల్గితే జీవనం ఒక సమస్యకాదు. మరణాన్ని లక్ష్యపెట్టనక్కరలేదు. ఆకలి దప్పులకు భయపడపనిలేదు. భగవానుని కీర్తిస్తూ ఆయన నాయకత్వంలో వెనుక చూపు లేకుండా పురోగమించవచ్చు. అలా ముందుకు పయనిస్తుంటే మధ్యలో ఒకడు నిష్క్రమించవచ్చు. కాని వాని స్థానం మరొకడు స్వీకరిస్తాడు.

అనుకరణ :– భీరుత్వానికి ప్రతిరూపమైన అనుకరణ వలన మనం అభ్యున్నతిని సాధించలేము. యథార్థంగా అనుకరణ వ్యక్తి యొక్క తీవ్రపతనానికి నిదర్శనం. వ్యక్తి తన్నుతాను ద్వేషించుకొను స్థితికి దిగజారితే అతన్ని ఎవరూ ఉద్ధరించలేరు. కనుక మనం ఆత్మవిశ్వాసాన్ని పెంచుకొని మన పూర్వీకులను గురించి సిగ్గుపడకుండ, గర్విస్తూ జీవించాలి. అనుకరణ జోలికి పోకూడదు. ఇతరులకు లొంగితే మనం మన స్వతంత్ర ప్రతిపత్తిని కోల్పోతాము. పారమార్థిక విషయాల్లోనైనా పరుల ఆదేశాల్ని అనుసరిస్తే మనం మన ఆలోచనా శక్తితోబాటు అన్ని శక్తులను క్రమంగా కోల్పోతాము.మన స్వయంకృషి ద్వారా మనలో వున్న ప్రతిభలను వెలికి తీసుకొని రావాలి. అంతేకాని ఇతరులను అనుకరించకూడదు. వారిలోని మంచిని స్వీకరించాలి. మనం ఇతరుల నుండి నేర్చుకోవలసిన మంచి విషయాలు ఎన్నో వుంటాయి. ఇతరుల నుండి మంచినిస్వీకరించ నిరాకరించే వ్యక్తి మృతతుల్యుడే.

మనం గట్టిగా శ్రమించాలి. నిశ్చలత్వంతో పరమాత్మునిపై విశ్వాసంతో కృషి సాగించాలి. వారి మత విశ్వాసాల్ని కించపరచకుండా దీనజనోద్ధరణ ప్రధానాశయంగా మనం ఉద్యమించాలి.

మన పల్లెల్లో పూరిగుడిసెల్లో నివసించే జనులే మన జాతికి నిజమైన ప్రతినిధులు అని మరువకూడదు. కాని విచారమేమంటే వారి శ్రేయస్సు కొరకు పాటుపడినవారెవరూ లేరు. వారి పారమార్థిక ప్రవృత్తికి హానికల్గకుండా వారు పోగొట్టుకొన్న వ్యక్తిత్వాన్ని వారికి తిరిగి ఈయగలమా? మన హిందూ ధర్మాల్ని, హిందూ సహజప్రకృతిని విడనాకుండా, సమానతా భావంలోను, స్వేచ్ఛాజీవనంలోను, శ్రమించేసందర్భంలోను మనం పాశ్చాత్యుల్లో పాశ్చాత్యులం కాగలమా? అదిమనం సాధించాలి.సాధించి తీరుతాం. మనం దాన్ని సాధించటానికే జన్మించాం. ఆత్మవిశ్వాసాన్నివిడనాడకూడదు. గొప్ప విశ్వాసాలే ఘనకార్యాలకు మాతృకలౌతాయి.

మనలో ఏ కొద్దిమందైనా సంపూర్ణచిత్తశుద్ధితో, పవిత్రతతో, అత్యధిక వివేకస్ఫూర్తితో,

విజయలక్ష్యంతో కృషి చేయగల్గితే మొత్తం ప్రపంచంలో విప్లవాన్నిసృష్టించవచ్చు.

ఆత్మవిశ్వాసమే సాధనకు అత్యావశ్యకం. ఆత్మవిశ్వాసమే ఆధారంగా పటిష్ఠతనుసమకూర్చుకొని నిలబడదాం. అంతకంటే మించి మనకేమీ అవసరం లేదు.

ఒక వ్యక్తి తన్నుతాను కించపరచుకొని, రాత్రింబవళ్లు తాను ఒక దైన్యుణ్ణని, అసమర్ధుణ్ణని చింతిస్తూ కూర్చుంటే అతడేమీ కాలేడు; ఏమీ సాధించలేడు. మనం అందరం దేవుని బిడ్డలం. ఆ అనంతమైన దైవజ్వాలలోని కణాలం. మనం అనామకులం ఎట్లా అవుతాం? మనం సంపూర్ణ పురుషులం. మనం సాధించలేనిది ఏదీలేదు.మానవుడు సర్వం సాధించాలి.

ప్రాపంచిక సంపద విషయంలో నీవొక గొప్ప వాడివి కాదలిస్తే నీవాస్థితినిపొందినట్లే విశ్వసించు. మనలో ఒకరు ఒక నీటి బుడగ ప్రాయంలో వుండవచ్చు; మరొకరు ఉత్తుంగతరంగంలా భాసించవచ్చు. కాని వారిరువురకు అనంతమైనసాగరమే ఆధారమని గ్రహించాలి. అంతేకాదు, శక్తి సామార్థ్యాలకు నిలయమైనబ్రహ్మపదార్థం నుండి వారిరువురు వారుకోరుకున్న పరిమితిలో శక్తిని పొందవచ్చని తెలుసుకోవాలి. కనుక ఆత్మవిశ్వాసంతో మనం జీవించాలి.

# జాతీయ సమైక్యత

## సమైక్యత ఎందుకు?

సంకల్పమే శక్తి. మనకు తెలిసిన విషయాన్నే తీసుకుందాం. నాల్గుకోట్ల బ్రిటీషువారు ముప్పది కోట్ల భారతీయుల్ని పరిపాలించగల్గుతున్నారు. దీనికి మానసికపరమైనవివరణ ఏమైవుంటుంది? నాల్గుకోట్ల బ్రిటీషు ప్రజలు వారి సంకల్ప శక్తులను సమైక్యపరచుటతో అదే అనంతశక్తిగా పరిణమిస్తోంది. కాని ముప్పదికోట్ల భారతీయులు ఎవరి సంకల్పం వారిదిగా నడుచుకుంటున్నారు గనుక వారి సంకల్పశక్తి బలహీనమైంది. కనుక భారతీయులందరు సంఘటితమై తమ సంకల్పాన్ని సమన్వయ పరచుకొని సంయోగించుకొని శక్తిని కూడగట్టుకోవాలి.

ఈ సందర్భంలో నాకు అధర్వణవేదసంహితలోని శ్లోకం స్ఫురిస్తోంది. దాని అర్థం: 'మీ మనస్సులన్నీ ఐక్యం కావాలి. మీ ఆలోచనలన్నీ ఒకటి కావాలి. పురాణకాలంలో దేవతలందరు మానసిక సమైక్యత ప్రదర్శించారు గనుక తర్పణాలకు అర్హులైనారు.' మానవులు దేవతలను పూజించగల్గుతున్నారంటే దానికి కారణం దేవతలు ఏకమనస్కులు కావటమే. సమాజం సంఘటితం కావటానికి మానసిక సమైక్యతేపునాది. అలాగాక మనలో మనం ఆర్య, ద్రవిడ విభజనలతోను, బ్రాహ్మణ, అబ్రాహ్మణకుల తత్వాలతోను, చిన్న విషయాలపై వివాదాలు పెంచుకుంటూ పోరాట స్ఫూర్తితోమెలగితే శక్తిని కూడ గట్టుకోలేము. దీని ప్రభావం భారతదేశ భవిష్యత్తుపై పడుతుంది.ప్రజల సంకల్ప శక్తులను క్రోడీకరించి ఒకే దృక్పథానికి వానిని సమన్వయపరచినడపగల్గితే దేశ భవితవ్యం ఉజ్జ్వలమౌతుంది. చైనీయులు ఎవరికి వారుగా

సంకల్పిస్తారు. అదే జపాను వారు అందరూ ఏకమనస్కులై వ్యవహరిస్తారు. ఫలితం మనకుతెలుసు. ప్రపంచ చరిత్ర అంతా ఈ ప్రవృత్తులపై ఆధారపడి నడుస్తోంది. కనుక మానవులలోని ఈ వివాదవైఖరులు నశించాలి.

# పంజాబులో హిందువులు, సిక్కులతో స్వామీజీ

భారతదేశంపై జరిగినదాడులను, దండయాత్రను ప్రప్రథమంగా చవిజూసి, ఫలితాన్ని అనుభవించిన భూభాగం పంజాబే. మొరటు జాతులవారు బయట నుండి ఆర్యావర్తనంలోకి ప్రవేశించే సందర్భంలో వారి దాడులను ముందుగా ఎదుర్కొని ధైర్యసాహసాలు ప్రదర్శించిన శౌర్య సంపన్నమైన భూమి ఇది. అనేక కష్టనష్టాలు ఓర్చి ఈ ప్రాంతం ఇంకా తన పూర్వ సౌభాగ్యాన్ని, పటిమను పూర్తిగా కోల్పోలేదు. ఇచ్చటే తరువాతికాలంలో అతి సౌమ్యుడైన నానక్ మహాశయుడు ప్రపంచంపై తనకున్న అవ్యాజ ప్రేమను ప్రజలకు బోధించాడు. ఇచ్చటనే నానక్ తన విశాల హృదయంతో ప్రపంచ ప్రజలందర్నీ, హిందువుల్నేగాక మహమ్మదీయులను కూడ చేతులు చాచి ఆలింగనం చేసికొన్నాడు. ఈ భూమిపైనే మన జాతికి చెందిన ఉజ్జ్వల శౌర్యశాలి యనదగ్గ గురుగోవింద సింగ్ మతం కొరకు తనయొక్క, తన సన్నిహితుల యొక్క రక్తాన్ని ధారపోశాడు. ఐనా, ఆయన ఎవరి కొరకు రక్తం ధారపోశాడో వారందరు ఆయన్ని తిరస్కరించి విడనాడిపోగా ఆయన తన ప్రాంతాన్ని విడిచి దక్షిణప్రాంతానికి వెళ్లి గాయపడిన సింహంవలె హృదయవిదారకమైన పరిస్థితుల్లో అసువులు విడిచాడు. చనిపోయే సమయంలో దేశవాసు లెవరిని తప్పుపట్టలేదు.

ఈ పురాతన పవిత్ర ప్రదేశంలో, పంచనదులు ప్రవహించే ఈ ప్రాంత ప్రజల ముందు నిలబడియున్నాను. నేనొక ప్రబోధకునిగా మీముందు నిలబడలేదు; నేను బోధనలో ఆరితేరిన వాడను గాను. పశ్చిమ ప్రాంతంలో నివసిస్తున్న మిమ్మల్ని ఒక తూర్పు ప్రాంతవాసిగా పలుకరించి పరస్పర అవగాహన చేసికునే యత్నంలో మీ ముందు నిలచాను. మన మధ్యవున్న విభేదాలను చర్చించటం నా లక్ష్యం కాదు. ఇరు ప్రాంతాల వారి మధ్య అంగీకారయోగ్యమైన విషయాలను తెలిసికోటానికే మీ ముందున్నాను. మన మందరం సోదరులవలె జీవించటానికి దోహదం చేసే అంశాలను అవగాహన చేసికోటం కూడ నా కర్తవ్యం. నేను మీ కొరకు నిర్మాణాత్మక కార్యక్రమాన్ని మాత్రమే సూచిస్తాను. ఒకరినొకరు నిందించుకునే కాలం

గడచిపోయింది. ప్రస్తుతం కేవలం ప్రయోజనాత్మకమైన కార్యక్రమం పైనే మన దృష్టిని కేంద్రీకరించాలి.

ఆర్యులారా! నేను ఈ సంకల్పంతోనే మీ వద్దకు వచ్చాను. నేను ఏ పార్టీకి గాని, ఏ తెగకుగాని సంబంధించినవాడను కాదని ముందుగా మీకు తెలియజేసుకుంటు న్నాను. ఆ పార్టీలుగాని, తెగలు కాని నా దృష్టిలో గొప్పవే; ప్రతిష్ఠాత్మకమైనవే. వాటిని నేను ప్రేమిస్తాను. వాటిలోని మంచిని, సత్యదృష్టిని కనుగొనవలెనని నా జీవితమంతా ప్రయత్నిస్తూనే వున్నాను. భగవత్కృపవలన వాటిలోని భిన్నత్వ ధోరణులను సమన్వయ పరచే భూమిక లభిస్తే దానిని చేపట్టి అమలు చేసే కార్యక్రమాన్ని ఆరంభిద్దాం.

మన దేశంలో అనేక తెగలున్నాయి. భవిష్యత్తులో కూడ వుంటాయి. తెగలు వుండవలసిందే. కాని భిన్న మార్గాలు అభిలషణీయం కాదు. భిన్న మార్గానుసరణ ప్రపంచానికి మంచినీయదు. ఐనా భిన్నమతాలు (తెగలు) లేకుండా ప్రపంచం నడవలేదు. ఒకే ఒక వర్గీయులు అన్ని పనులు సాధించలేరు. ప్రపంచంలోని అనంత మైన శక్తుల్ని నియంత్రించాలంటే కొద్దిమంది ప్రజలకు సాధ్యం కాదు. కనుక శ్రమను పంచుకోవాల్సిన అవసరం ఏర్పడింది. దానిమీద ఆధారపడి వర్గాలు ఏర్పడ్డాయి. ఆ విధంగానే ఆధ్యాత్మిక శక్తుల్ని వినియోగించుకోటానికి మతవర్గాలు వుండవచ్చు. కాని ఈ వర్గాల్లో అంతర్గత కలహాలు వుండనక్కరలేదు. ఈ వర్గాల మధ్య విభేదాలు పైకి కనిపించటం వరకేనని మన ప్రాచీన గ్రంథాలు ఘోషిస్తున్నాయి. వర్గాలను అనుసం ధానంచేసి సమన్వయపరచే సద్భావనాతత్వం వానిలో అంతర్గతంగా వుంటుందని కూడ ప్రాచీన శాస్త్రాలు ఉద్ఘాటిస్తున్నాయి.

మత వర్గాల్లో విభేదాలు సృష్టించే వ్యక్తి తారసిల్లినప్పుడు మనం ఆయనను 'నీవు భగవంతుని చూచావా? నీవు ఆత్మను ఎరుగుదువా? లేనప్పుడు నీకు మత విషయాల్ని గురించి ప్రస్తావించే హక్కు ఎక్కడిది?' అని ప్రశ్నించాలి. ఆధ్యాత్మిక చింతన కలవారు ఎవరి

మతానుసారం వారు సత్యాన్వేషణలో నిమగ్నులై మన మహర్షులు ఋజువు పరచిన విధంగా ఆత్మజ్ఞానాన్ని పొందుతారు. ఆ స్థితిలో సర్వుల యెడ ప్రేమ ప్రవహిస్తుంది తప్ప ద్వేషభావానికి స్థానం వుండదు. ఆత్మజ్ఞానికి భగవత్ స్పర్శ లభిస్తుంది. భగవంతుడు ప్రేమ స్వరూపుడు గనుక ఆత్మజ్ఞాని ప్రేమమయు డౌతాడు. ఆ విధంగా వర్గపోరాటాలు సమసిపోతాయి.

# హిందూ మహమ్మదీయ సంబంధాలు

మన వేదాంత ప్రతిపాదిత మతసామరస్య ధోరణులు మహమ్మదీయ మతాన్ని మార్పుకు గురిచేసినాయి. భారతదేశంలో మహమ్మదీయ మతం ఇతర దేశాల్లోవలె గాక భిన్నమైన రూపంలో ప్రచారం పొందింది. ఇతర దేశాల నుండి మన దేశం వచ్చిన మహమ్మదీయులు ఇచ్చట నివసిస్తున్న వారి స్వమతస్థులను కలసి వారు పరమతస్థులతో మెలగవలసిన విధానాలను బోధించినప్పుడే మన దేశంలో మత కలహాలు ఏర్పడుతున్నాయి.

మనం మతాన్ని వేదాంతమన్నా మరొకటన్నా, అసలు అద్వైత సిద్ధాంతమే మతా లకు అంతిమ గమ్యం. ఆ స్థితిని చేరినప్పుడే మనం ఇతర మతాలను, తెగలను ప్రేమతో ఆదరించగల్గుతాం. ఆ అద్వైతమే భవిష్యత్తులో విజ్ఞానవంతులైన మానవాళికి మతం ఔతుంది. హిందువులు ఈ అద్వైతాన్ని మిగతా జాతులవారి కంటె ముందుగా అవలంబించే అవకాశాలున్నాయి. ఎందుకంటే, హిందువులు, హిబ్రూలు, ఆరబ్బుల కంటె ప్రాచీన జాతివారైయున్నారు కనుక. ఐనప్పటికి ఆచరణపరమైన అద్వైత సిద్ధాంతం బోధించినట్లు హిందువులు ఇతర మతస్థులను సమరస భావంతో తమ అంతరాత్మల ప్రతిరూపాలుగా భావించి చూడటం లేదు.

అసలు ఆ భావానికి సమీపంగా ఎక్కువ పరిమితిలో భేదరహిత తత్వాన్ని ప్రదర్శించిన మతం ఇస్లాం ఒక్కటేనని నా అనుభవంలో బోధపడింది.

ప్రజాబాహుళ్యానికి వేదాంత సిద్ధాంతాలు అవి ఎంత సున్నితమైనవైనప్పటికి ఆచరణయుతమైన ఇస్లాం మతంతో మేళవింపు లేకుండా – నిరుపయోగంగా పరిణ మిస్తాయి. కనుక మానవాళిని వేదాలుకాని, బైబిలు కాని, ఖురాన్‌గాని అనుసరించని స్థితికి తీసుకొని వెళ్లాలని మనం ఆకాంక్షించాలి. ఐనా, ఈ మూడు మతతత్వాల్ని సమన్వయ పరచి సరియైన వాతావరణాన్ని ప్రజలకు కల్పించాలి. అందరూ ఒక్కటే, అన్ని మతాల లక్ష్యం

ఒక్కటేయని బోధించేదే ఏకైక మతం. మిగతా మతాలన్నీ ఆ ఏకైకమతం యొక్క వివరణలు మాత్రమే.

మన మాతృభూమి కొరకు వేదాంతం, ఇస్లాం – ఈ రెంటి విధానాల కలయిక – అంటే వేదాంతమే మేధస్సుగాను, ఇస్లాం శరీరంగాను జోడింపబడినదే శరణ్యమని పిస్తుంది. భారతదేశం ప్రస్తుతమున్న క్లిష్ట కల్లోల పరిస్థితుల నుండి వేదాంతమే మస్తిష్కంగాను, ఇస్లాందేహంగాను భాసిస్తూ విజయవంతమైన, ప్రతిష్ఠాత్మకమైన సంపూర్ణదేశంగా భవిష్యత్తులో వెలువడగలదని నాకు స్పష్టంగా గోచరిస్తోంది.

# భిన్న భిన్న జాతుల సమాఖ్య – భిన్నత్వంలో ఏకత్వం

మన దేశాన్ని యథార్థమైన జాతి సంబంధిత ప్రదర్శనశాలగా భావించ వచ్చు. సుమత్రాలో కొద్దికాలం క్రింద కనిపెట్టబడిన సగం కోతి రూపంలో వున్న అస్థిపంజరాన్ని కూడ ఇక్కడ శోధించి వెలికి తీయవచ్చు. రాతిపలకలతో కూర్చిన బల్లలు, రాతి పనిముట్లను కూడ త్రవ్వి తీయవచ్చు. తటాక తీరవాసులు – లేదా నదీతీరవాసులు ఒకానొక కాలంలో ఎక్కువగా వుండేవారు. గుహల్లో వుండేవారు, ఆకుల్ని ధరించేవారు ఇప్పటికీ వున్నారు. అడవుల్లో నివశిస్తున్న ఆదిమజాతి వేట గాండ్లు మనదేశంలో చాలచోట్ల మనకు కనిపిస్తారు. ఇంకా చరిత్రకెక్కిన నెగ్రిటో కొలారియన్, ద్రవిడ, ఆర్యజాతులు కూడ దేశంలో వున్నారు. వీరికి తోడు మనకు తెలిసిన, తెలియని జాతులవారు అనేక మంది వున్నారు. వారిలో మంగోలాయిడు తెగలవారు, మంగోల్సు, తార్టార్లు, భాషావేత్తలైన ఆర్యులు వున్నారు. ఇంకా పర్షియన్లు, హూణులు, గ్రీకులు, యూదులు, పార్సీలు, అరబ్బులు, మంగోలులు ఇంకా అనేక జాతులవారితో సంపర్కమున్న దేశం ఇది. సంక్షిప్తంగా భారతదేశం లోని జాతుల చరిత్ర ఇది.

జాతి, మతం, భాష, ప్రభుత్వము – ఇవన్నీ కలిసి ఒకజాతిని నిర్మిస్తాయి. ప్రపంచంలోని ఇతరజాతుల్ని పరిశీలిస్తే వాటిలోని మూలకములు బహుకొద్ది మాత్రమే. కాని మనదేశంలో అవి మెండుగా వుంటాయి. ఇచ్చట ఆర్యులు, ద్రవిడులు, టార్టారులు, టర్కీవారు, మొగలులు, ఐరోపావారు – ఇలా ప్రపంచంలోని అన్ని జాతులవారి రక్తం మన భూమిలో ప్రవహించింది. ఇక భాషల విషయాని కొస్తే, ఇచ్చట వున్న విచిత్రమైన భాషా మిశ్రమం మరొక దేశంలో చూడం. ఆచారవ్యవహారాలని గూర్చి విచారిస్తే, దేశంలోని ఏ రెండు జాతుల వారి ఆచార వ్యవహారాలు పరికించినా వానిలో చాలా వ్యత్యాసాలు గోచరిస్తాయి. నిజంగా ప్రాక్ పశ్చిమ దేశాల జాతుల మధ్య కూడ అంత వైవిధ్యం వుండదు.

మనం అందరం అనుసరించే పవిత్ర సాంప్రదాయయుతమైన మతం ఒక్కటే జనాన్ని

సన్నిహితం చేస్తుంది. ఆ ప్రాతిపదిక మీదనే మనం ఐక్యతను సాధించాలి. ఐరోపా దేశంలో రాజకీయ భావనల ఆధారంగా జాతి సమైక్యత ఏర్పడుతోంది. భారత దేశానికి మంచి భవిష్యత్తు వుండాలంటే మతసమైక్యత అత్యావశ్యకం.

ఆసియాలో, ముఖ్యంగా భారతదేశంలో తెగల పరమైన, భాషాపరమైన, సామాజిక సంబంధమైన, జాతిపరమైన ఇబ్బందులన్నీ ఒకే మతం ద్వారా లభించే సమైక్య శక్తి వలన నిర్మూలింపబడతాయి. భారతీయుని దృష్టిలో మతాదర్శాల కంటె మించిన ఉత్కృష్ట ధర్మాలు ఏవీ వుండవు. భారతీయుని జీవితానికి అది అతి కీలక విషయం. ఘర్షణ అతితక్కువ పరిధిలో వున్న మార్గాన్ని ఎంచుకొని మనం నడవాలి. భారతీయుని జీవితంలోని ఈ సత్యాన్ని గ్రహించాలి. ఈ దేశంలో ఏ కార్యక్రమాన్ని తలపెట్టినా అది ప్రజలు గౌరవించే మతాదర్శాలను ఆశ్రయించే వుండాలి. అలా వుంటేనే అది జయప్రదమౌతుంది. కనుక వాటిని పటిష్ఠం చేసి, కార్యక్రమం సాగిస్తే తప్ప కృషి సఫలీకృతం కాదు. యుగయుగాలుగా పేరుకొనియున్న కాఠిన్యాన్ని తొలగించి భారతదేశం యొక్క భవిష్యత్తును తీర్చిదిద్దాలంటే ప్రజల్లోని మతధోరణులను ఏకీకరణ మొనరించాలి. ఇదే మనం ప్రప్రథమంగా చేయవలసిన యత్నం.

మన జాతీయ శ్రేయస్సు కొరకు మనం మన జాతికి సంబంధించిన మత ప్రబోధ శక్తులనన్నిటినీ కూడదీయాలి. మన పూర్వీకులు ఇదే బాటలో పయనించారు. మనం ముందుకూడ ఈ మార్గాన్నే అనుసరించాలి. దేశమంతా విస్తరించియున్న మతశక్తుల్ని ఒక చోట కలిపి సమైక్యత సాధించటంలోనే జాతి సమైక్యత ఇమిడి వుంది. మత ధర్మాలకు ఒకే శ్రుతిలో స్పందించే ప్రజల కూటమే భారతజాతిగా రూపొందాలి.

క్రైస్తవుడు హిందువుగాగాని, బౌద్ధుడుగా గాని మారవలసిన పనిలేదు. అలాగే హిందువుగాని, బౌద్ధుడుగాని క్రైస్తవుడయ్యే అవసరం లేదు. కాని ప్రతి మతస్థుడు ఇతరుల మతభావాల్ని జీర్ణించుకొని, తన వ్యక్తిత్వాన్ని నిలుపుకుంటూ, తన విశ్వాసాలను అనుసరిస్తూ ప్రగతిని సాధించుకోవచ్చు.

తెగలెన్నైనా ఉండవచ్చు. ఉండాలి కూడా. కాని భిన్నత్వ భావం ప్రబలకూడదు.

# ఏకీకరణకు మూలసూత్రం

మన మతంలో అన్ని వర్గాల వారికి అనువర్తింపచేయుటకు వీలైన కొన్ని సంప్రదాయాలున్నాయని మనకు తెలుసు. ఆ సంప్రదాయాల పరిధిలో మన మతం అత్యద్భుతమైన మార్పులను ఇమిడ్చుకోగలదు. అపరిమితమైన స్వాతంత్ర్యంతో మన ఆలోచనల్ని, మన జీవితాల్ని మనం నడుపుకునే అవకాశాన్ని మన మతం మనకి కల్గజేస్తుంది. కనుక మన మతంలోని సామాన్య ధర్మాల్ని మనలోని ప్రతివారు అవ గాహన చేసికొని వాటిని మన జీవితాల్లో అమలుపరచే కృషి చేయాలి. దీనిని ప్రథమ చర్యగా స్వీకరించాలి, అమలు చేయాలి.

అందరకు అంగీకారమైన ధర్మాల్ని మనం బోధించి, ప్రచారం చేయాలి. వివాదాంశాల్ని వాటికే వదలితే వాటంతటవే సర్దుబాటు అవుతాయి. ఒక గదిలో యుగాలుగా ఆవరించియున్న చీకటిని చూచి భయపడి 'అయ్యో చీకటి, చీకటి' అని ఆక్రందించినంత మాత్రాన చీకటి తొలగిపోదు. గదిలోకి తగినంత కాంతిని ప్రసరింప చేస్తే చీకటి పూర్తిగా అదృశ్యమౌతుంది. ఈ విషయాన్నే నేను భారతీయులకు పలు మార్లు చెప్పియున్నాను.

# మార్గదర్శకులు

## సత్యం యొక్క రెండు ఆదర్శాలు: శ్రుతి, స్మృతి

మన మతగ్రంథాల్లో రెండు ఆదర్శాలున్నాయి. మొదటిది నిత్యసత్య ప్రామాణికం; రెండవది అంత ప్రామాణికమైనది కాదు; కాని కొన్ని సందర్భాలలో కొన్ని సమయాలలో, కొన్ని ప్రాంతాలలో విధిగా అనుసరణీయమైనదే. ఆత్మ, పరమాత్మలను గురించిన తత్త్వజ్ఞానము, ఆ రెండు శక్తుల మధ్య వున్న నిత్యానుబంధము – ఈ విషయాలన్నీ శ్రుతులు లేక వేదాల్లో పొందుపరుపబడి వుంటాయి. మిగతా సత్యాలన్నీ స్మృతుల్లో లభిస్తాయి. ఈ స్మృతులు మనువు, యాజ్ఞవల్క్యుడు, ఇతర రచయితల మాటల్లో వుంటాయి. అంతేగాక పురాణాలు, తంత్రాలు కూడ స్మృతులుగానే పరిగణింపబడతాయి. ఈ రెండవ తరగతి ప్రమాణ గ్రంథాలు మొదటి తరగతి శ్రుతులకు లోబడి వుంటాయి. అంటే ఒక విషయాన్ని గురించి స్మృతులు శ్రుతులలో చెప్పిన దానికి భిన్నంగా సిద్ధాంతీకరిస్తే, ఆ సందర్భంలో శ్రుతులనే ప్రామాణికంగా స్వీకరించాలి. అది శాసనం. మానవుని లక్ష్యాన్ని, గమ్యాన్ని నిర్ధారించే ప్రణాళిక, వివరణలు శ్రుతులు లేక వేదాలు ప్రతిపాదిస్తాయి. పోతే దానికి కావలసిన సాధన సంపత్తి, అనుసరించ వలసిన మార్గాలు – ఈ విశేషాలను స్మృతులు, పురాణాలు సమకూరుస్తాయి. ఆత్మజ్ఞానానికి, మోక్షసాధనకు అవసరమైన పారమార్థిక తత్త్వజ్ఞానాన్ని మనం శ్రుతులలోనే పొందవచ్చు. ఐతే దాన్ని గురించి వివరణలు తేటతెల్లంగా మనకు స్మృతులు కాలానుగుణ్యంగా అందిస్తాయి.

శ్రుతులను గురించి మరొక విశేషం కూడ వుంది. శ్రుతుల యొక్క ప్రామాణిక

సత్యాలను మహాఋషులు – వారిలో ఎక్కువ మంది పురుషులు, తక్కువ మంది మాత్రమే స్త్రీలు – స్వీకరించి ఇతరులకు అందజేసారు. కాని వారిని గురించికాని, వారు జన్మించిన తేదీలను గురించి కాని, ఇతర వివరాలను గురించి కాని తెలుసుకునే ఆధారాలేమీ లేవు. కాని వారి అమూల్యమైన అభిప్రాయాలు, ఉత్కృష్టమైన పరిశోధనలు సురక్షితంగా మన పవిత్ర సారస్వతమైన వేదాల్లో గుప్తపరచబడ్డాయి. స్మృతుల్లో, అలాగాక వ్యక్తులను గురించిన విశేషాలు అశేషంగా కానవస్తాయి. అత్యద్భుతమైన, ముచ్చటగొలిపే వ్యక్తులు అతీత ప్రమాణంలో మనకు దర్శనమిస్తారు. వారి బోధనల కంటే వ్యక్తులే అతీతులుగా వున్నారనిపిస్తుంది. ఏది ఏమైనా మన మతం యొక్క పుట్టుకస్థానం మన వేదాలు లేక శ్రుతులలోనే వుంది. ఈ వేదాలు అపౌరుషేయాలు; ఏ వ్యక్తికి సంబంధించినవి కావు. భగవంతుని గొప్ప అవతారాలు గాని, ఇతర మహనీయులు గాని, మత ప్రబోధకులు గాని వీరందరూ స్మృతుల్లోనే మనకు తారసిల్లుతారు.

# ఋషులనగా ఎవరు?

వేదాంతం అని వ్యవహరింపబడే విజ్ఞాన సముదాయం ఋషులనబడే మహనీయులచే కనుగొనబడింది. ఋషికి మంత్రద్రష్ట అనే నిర్వచనం వర్తిస్తుంది. మంత్రద్రష్ట అంటే ఆలోచనని దర్శించేవాడు. ఐతే ఆలోచన ఆయన సృష్టికాదు. వేదంలోని ఒక మంత్రభాగం ఒక ఋషి నుండి వెలువడిందని ఎవరైనా, ఎప్పుడైనా అంటే అది ఆ ఋషి యొక్క స్వయంకృషి అనికాని, అతడే రాశాడని కాని భావించరాదు. అదివరకే వున్న పాతాన్ని కనుగొన్నాడని మాత్రమే తెలుసుకోవాలి. వేదాలు ఈ అనంత విశ్వంలో నిత్యం వుంటూనే వుంటాయి. ఋషులు ఆధ్యాత్మికజ్ఞాన పరిశోధకులు మాత్రమే.

ఉపనిషత్తులు సూచించినట్లు ఋషి మంత్రద్రష్ట. అతడు సామాన్య మానవుడు కాదు. మత ప్రమాణాల్ని దర్శించగలవాడే ఋషి. అతని దృష్టిలో మతం అంటే కేవలం గ్రంథపఠనం కాదు, వాదప్రతివాదాల ప్రక్రియ కూడ కాదు. భాషించటం అసలేకాదు. బుద్ధికి అతీతమైన నిత్యసత్యాల్ని అన్వేషించి లక్ష్యాన్ని సాధించటమే మతం. అదే ఋషిత్వం.

మనస్సు ఇంద్రియ ప్రేరణలకు పరిమితమై వర్తిస్తుంది. పారమార్థిక రంగంలో నిత్య సత్యాల్ని చేరాలంటే ఇంద్రియ ప్రేరణలకు అతీతంగా వ్యవహరించాలి. ఈ కాలంలో కూడ అలా వ్యవహరించి సత్యాన్వేషణలో విజయాన్ని సాధించిన మహాపురుషు లున్నారు. వారినే మనం ఋషులంటున్నాం. మన ఇంద్రియ జ్ఞానంతో భౌతిక ప్రపంచాన్ని ప్రత్యక్షంగా చూస్తున్నాం. ఇంద్రియాతీతమైన పారమార్థిక స్థితిని పొందిన అంతరాత్మతో ఆధ్యాత్మిక సత్యాల్ని దర్శించగల్గుతున్నాం. ఋషిత్వం కాలానికిగాని, ప్రదేశానికి గాని పరిమితం కాదు. అలాగే దీనికి స్త్రీ పురుష వివక్షగాని, జాతి వివక్షగాని లేదు. వాత్స్యాయనుడు సాహసోపేతంగా నిర్ధారించినట్లు ఋషిత్వం మహర్షుల యొక్క, ఆర్యుల యొక్క, అనార్యుల యొక్క, చిట్టచివరకు మ్లేచ్ఛుల యొక్క కూడ సంతతి వారి సొత్తుగా పరిణమించవచ్చు.

వేదాలకు సంబంధించినంత వరకు ఋషిత్వం ఒక పవిత్ర సంస్థ. భారతదేశం యొక్క మతానికి సంబంధించిన ఈ విశిష్ట ఆదర్శాన్ని మనం మనస్సులో వుంచు కోవాలి. ఇతర దేశాల వారు కూడా ఈ ఆదర్శాన్ని ఆదరిస్తే వారిలో తగవులాటలు, వివాదాలు సన్నగిల్లుతాయి. మతం గ్రంథాల్లోను, సిద్ధాంతాల్లోను, మూఢనమ్మ కాల్లోను, తార్కిక ప్రసంగాల్లోను ఇమిడి వుండదు. జీవించటం లోను, నడత లోను ప్రతిబింబించేదే మతం. మిత్రులారా! మీలో ప్రతి ఒక్కరూ ఋషిగా మారి పారమార్థిక సత్యాలను ఎదుర్కొనే వరకు మీలో ఆధ్యాత్మిక జీవితం అంకురించినట్లుగాదు.

గతంలో మన సమాజాలకు నాయకత్వం వహించి నడిపిన వారందరూ ఋషులే గాని, రాజులుగాని, సేనానాయకులుగాని కాదు. ఋషిత్వం ఒక కాలానికి గాని, ఒక ప్రాంతానికి గాని, ఒక కులానికి గాని, ఒక తెగకు గాని నిబద్ధమైనది కాదు. సత్యాన్ని వశం చేసుకోవాలంటే మనకు ఆత్మవిశ్వాసం వుండాలి. దాని బలంతో మనలో ఎవ్వరైనా దాన్ని సాధించవచ్చు. మనలో ప్రతివారు ఋషులు కావాల్సిన అవసరం ఏర్పడుతుంది. ఆత్మవిశ్వాసంతో మొత్తం ప్రపంచంలో సంచలనం సృష్టించ వచ్చు. ఆధ్యాత్మిక సత్యాలను మనం ఎదుర్కొని అనుభవంలోకి తెచ్చుకోవాలి. వాటిని గురించిన మన సంశయాల్ని నివృత్తి చేసుకోవాలి. పర్యవసానంగా ఋషిత్వాన్ని పొంది మనమందరం తేజోమయ స్వరూపులమై వెలుగొందుతాము. ఆ స్థితిలో మన నోట నుండి వెలువడే ప్రతి వాక్కు అతీతమైన సంరక్షణా పటిమతో భాసిస్తుంది.

# శ్రుతులు

మన మతం ఒక్కటి తప్ప ప్రపంచంలో అన్ని మతాలు ఎవరో ఒక వ్యవస్థాపకుని యొక్క గాని, వ్యవస్థాపకుల యొక్క గాని జీవితంతో లేక జీవితాలతో ముడిపడి వున్నాయి. క్రైస్తవ మతం జీసస్ క్రైస్తు జీవితం మీద, ఇస్లాంమతం మహమ్మద్ జీవితంపైన, అట్లే బౌద్ధ జైనమతాలు బుద్ధుడు, జైనుల జీవితాలపైన ప్రతిష్ఠింపబడ్డాయి. కనుక సహజంగా ఈ మతాలన్నిటిలోను తత్సంబంధిత వ్యవస్థాపకుల విషయంలో చారిత్ర్యక నిదర్శనాలను గురించిన వివాదాలు తప్పక తలయెత్తివుంటాయి. ఈ మహనీయుల అస్తిత్వాన్ని గురించిన చారిత్ర్యక సాక్ష్యాలు ఏ కాలంలోనైనా బలహీనపడితే అలాంటి మతసౌధాలు కూలి శిధిలమౌతాయి. కాని మన మతానికి అలాంటి ప్రమాదం లేదు. ఎందుకంటే మన మతం వ్యక్తుల మీదగాక ధర్మాల మీద ఆధారపడి వుంది గనుక. ఎవరో ఒక గొప్ప ఋషి యొక్క గాని, చివరకు కృష్ణపరమాత్మ యొక్కగాని ఆధిపత్యం ద్వారా మన మతం ఉద్భవించిందని మనం ఆ మతధర్మాల్ని అనుసరించటం లేదు. కృష్ణుడు వేదాలకు ప్రమాణంకాదు. వేదాలే కృష్ణునికి ప్రమాణాలు. వేదాల్ని ప్రబోధం చేయటంలో అత్యుత్తముడుగా కృష్ణుడు కీర్తినార్జించాడు. అదే విధంగా ఆయన మిగతా అవతారాలు గాని, మహర్షులు గాని మన మన్ననల నందుకుంటారు.

వ్యక్తి పరిపూర్ణుడౌటానికి, బంధవిమోచనుడౌటానికి ఆవశ్యకమైన ప్రామాణికధర్మాల్ని మన వేదాలు మనకు సమకూరుస్తాయి. దీన్ని మనం ఒక ప్రాథమిక సూత్రంగా పాటించాలి. వేదాల్లో మనకు లభించని క్రొత్త విషయాలు ఎక్కడా వుండవు. జ్ఞానం యొక్క అంతిమ లక్ష్యం ఆత్మ పరమాత్మల యొక్క ఐక్యతే. దాన్ని అధిగమించి సాధించేదేమీ వుండదు. 'తత్త్వమసి' అనే స్థితిని సాధించటంతో ఆధ్యాత్మిక జ్ఞానం పరిపూర్ణమైనట్లే. దీని నిరూపణ మన వేదాల్లో వుంది. ఐతే, అన్ని కాలాల్లోను, అన్ని ప్రాంతాల్లోను, పరిస్థితులకు, పరిసరాలకు అనుగుణంగా ప్రజలను సరియైన మార్గంలోనడిపించటం ఒక్కటే మనకు అవసరం. ఆ కర్తవ్యాన్ని

సఫలీకృతం చేయటానికేప్రవక్తలు, మహర్షులు ఉద్భవించారు. ఈ సత్యాన్నే కృష్ణ పరమాత్మ గీతలో 'పరిత్రాణాయసాధూనాం...' అనే శ్లోకంలో 'సజ్జనుల్ని రక్షించటంకొరకు, దుష్ట శిక్షణ కొరకు, ధర్మాన్ని పునరుద్ధరించటం కొరకు ప్రతి యుగంలోను జన్మిస్తాను' అన్న పవిత్రవాక్యాలుపైన చెప్పిన విషయానికి తార్కాణాలు. ఈ సత్యమే మన భారతీయులకు శిరోధార్యము.

మనకు భగవంతుడు వ్యక్తుడు, అవ్యక్తుడు కూడా. అలాగే మన మతం కూడ ప్రామాణిక ధర్మాల మీద ఆధారపడి వుంటుంది కనుక అవ్యక్తమౌతుంది. అదే సమయంలో వ్యక్తుల పాత్రకు కూడ అనంతమైన అవకాశాన్ని కల్గజేస్తుంది. కనుక మనమతం వ్యక్తి ప్రాధాన్యత కలదౌతుంది. ఎలాగంటే భగవదవతారాలకు, ప్రవక్తలకు, మహర్షులకు అనంతమైన అవకాశాలు మన మతం కల్గజేస్తుంది. భాగవతంలోచెప్పబడినట్లు మనం ఎన్ని కోరుకుంటే అన్ని అసంఖ్యాకమైన అవతారాలు మనకుప్రసాదించబడతాయి.

మన ప్రజానీకంలో ఎక్కువ మంది భగవంతుడు వ్యక్తిగా తమ ముందు గోచరించాలని అభిలషిస్తారని కూడ మన మహర్షులు ఎప్పుడో ఊహించారు. ఏదో రూపంలో భగవంతుడు వ్యక్తిగా దర్శనమియ్యాలి. భగవత్స్వరూపం లేదన్న బుద్ధుడుమరణించి యాబది సంవత్సరాలు నిండకముందే ఆయన శిష్యులు ఆయన రూపాన్నివిగ్రహాలుగా మలచి కొలిచారు. ఆ విధంగా చాల మందికి భక్తి కుదరాలంటే భగవంతుని స్వరూపం అవసరం. మన మతంలో ఊహాజనితమైన రూపానికి బదులు అప్పుడప్పుడు భగవానుడే మనలో ఒకడై మనముందు సంచరించటం చెప్పపడింది. మనం ఊహించుకొన్న ఒక రూపాన్ని పూజించటం కంటే నిజస్థితిలో మనముందు మనతోసంచరిస్తున్న భగవానుని పూజించటం సర్వోత్కృష్టం కదా. ఆ విధంగా కృష్ణుడు, బుద్ధుడూ మనలో జన్మించి మనతో మెలగి మనకు వారిని కొలిచే మహదవకాశాన్ని కల్పించారు.

ఈ సత్యాన్ని గ్రహించిన మహర్షులు మన ఇష్టం వచ్చిన మహాత్ముల్ని, అవతారాల్ని

పూజించుకోటానికి మనకు పూర్తి స్వాతంత్ర్యాన్ని ఇచ్చారు. 'ప్రపంచంలో ఎక్కడైనా సరే అసాధారణ స్థితిలో ఆధ్యాత్మిక శక్తి ఒక మానవునిలో ప్రదర్శింపబడి నప్పుడు అది నా నుండి వచ్చిన శక్తియని, దానిని నా అంశగా భావించి పూజింపవచ్చు' అని భగవానుడే చెప్పాడు. దీని ననుసరించి హిందూవైనవాడు భగవంతుని అవతారాలు ప్రపంచంలో ఏ దేశంలో వెలసినా వానిని పూజించవచ్చు. ఆ విధంగా హిందువు ఏ దేశానికి సంబంధించిన మహర్షినైనా, మునినైనా పూజించుటకు స్వేచ్ఛ కల్గియుంటాడు.

వ్యక్తి తన ఇచ్ఛవచ్చిన మతగురువును కాని, ప్రబోధకుని గాని తనకు మార్గ దర్శకునిగా ఎన్నుకోవచ్చు. ఆయనను పూజ్యభావంతో చూడవచ్చు. వ్యక్తి తన మత గురువునే మత గురువుల్లో అత్యధికునిగా భావింపవచ్చు. ఆయన్నే అవతారాల్లో అధికునిగా ఎంచి పూజింపవచ్చు. వ్యక్తి నిత్య సత్యధర్మాల్ని పాటించినడచుకున్నంత వరకు ఎవరిని ఏ రూపంలో కొలిచినా ప్రమాదం లేదు. ఏ అవతారాలైనా వేద ప్రవచిత ధర్మసూత్రాలకు నిదర్శనాలుగా వున్నంత వరకే వాటి శక్తి మనకు అనువుగా వుంటుంది. ఇది మనకొక ఆశ్చర్యకరమైన సత్యము.

# మన మతంలోని మహోన్నత వ్యక్తులు

ప్రతి జాతి యొక్క ఆధ్యాత్మిక జీవనంలో ఒడుదుడుకులు సంభవిస్తాయి. జాతి పతన సమయంలో ప్రతి అంశం శిధిలావస్థను చేరినట్లు కన్పిస్తుంది. తిరిగి పటిష్ఠతను పుంజుకొని ఉచ్ఛస్థితిని పొందుతుంది. ఉత్తుంగతరంగంవలె – కొన్ని సమయాల్లో ఉప్పెన కెరటం వలె ఉన్నతి కానవస్తుంది. అలాంటి కెరటం యొక్క అత్యున్నత స్థానంలో ఉజ్జ్వల తేజస్సుతో వెలిగే మహనీయుడు లభిస్తాడు. సృష్టికర్త యొక్క అంశతో జన్మించి మానవ జీవన సరళిని ఉత్తేజపరచి జాతిని ఉన్నత స్థితికి చేరుస్తాడు. సమాజం మీద అతని ప్రభావం అమితంగా వుంటుంది. ఆ సమాజమే ఆ వ్యక్తి ఔన్నత్యానికి దోహదం చేస్తుంది. అలాంటి వారే ప్రపంచంలోని మేధావులు; వారే ప్రపంచ మత ప్రవక్తలు; వారే జీవితాల్ని నడిపే దేవదూతలు. వారినే మనం భగవదవతారాలుగా స్వీకరిస్తాం.

# రాముడు, సీత

శౌర్య సంతతికి చెందిన పురాణకాలంలో దైవంగా ఆరాధింపబడ్డ వాడే రాముడు. సత్య, ధర్మాలకు అతడు నిలయమైనవాడు. అంతేగాదు, ఆదర్శ పతిగాను, ఆదర్శ సుతునిగాను, ఆదర్శ పితృమూర్తిగాను, అన్నిటికి మించి ఆదర్శ పరిపాలకునిగాను వాల్మీకి మహర్షి రాముని మనముందు ప్రదర్శిస్తాడు. ఇక సీతను గూర్చి వర్ణించాలంటే అటు పురాణ వాంఙ్మయాల్లోకాని, ఇటు ప్రపంచంలోని వాంఙ్మయాలన్నిటిలో కాని అలాంటి సీత మనకు కానరాదు. ఆమె ఒక అపూర్వ వ్యక్తి. అంతటి వ్యక్తిత్వముగల పాత్ర ఒకే పర్యాయం సృష్టింపబడ్డది. చరిత్రలో రాముని వంటి వారు మనకు లభించవచ్చు; కాని సీతవంటి పాత్ర మరొకటి లేదు. ఆదర్శ భారతనారికి ఆమె నిజమైన ప్రతీక. ఒక సంపూర్ణ పవిత్ర భారత స్త్రీకి వుండవలసిన ఆదర్శాలన్నీ సీత యొక్క జీవితం నుండి ఉద్భవించినవే. రాముడు వృద్ధరాజైన దశరథుని యొక్క అంతరాత్మ. ఐనా అతడు రాజు. ఆడినమాట తప్పనివాడు.

పాతివ్రత్యమే సీత. తన పెనిమిటి రాముని స్పర్శతప్ప, పరపురుషుని స్పృశించి యెరుగనిది.

'పవిత్రతకు పాతివ్రత్యానికి ప్రతీకయే సీత' అని రామునిచే ప్రశంసించబడింది.

రాముడు తన శరీరమును త్యజించిన తర్వాత పరలోకంలో సీతతో కలిశాడు.

భారతదేశంలో మంచికి, స్వచ్ఛతకు, పవిత్రతకు మారుపేరు సీత. స్త్రీలోని స్త్రీత్వానికి ప్రతిరూపం ఆమె. సహనమూర్తిగా, కష్టాలమయమైన జీవితాన్ని అనుభ వించిన వ్యక్తిగా, విశ్వసనీయమైన పవిత్ర ధర్మపత్నిగా విలసిల్లిన పరమసాధ్వియే సీత. దుర్భర కష్టాలను అనుభవిస్తూ కూడ భర్తను గురించి ఒక్క పరుషవాక్యాన్ని కూడ ఉచ్చరించని ఉత్తమ ఇల్లాలు ఆమె. తనకు బాధను కల్పించిన వారిపై ప్రతీకార చర్యను తలపెట్టని సహనశీలి ఆమె. భారత

స్త్రీలందరు సీతలు కావాలని నా ఆకాంక్ష.

# శ్రీకృష్ణుడు

శ్రీకృష్ణుడు ఒక అద్భుతమైన సన్యాసి, అంతకంటె మించిన గృహస్థు – రెండు అవస్థల్ని ఇముడ్చుకొన్న మహనీయుడు. ఆయనలో రజోగుణం, అధికారం అధిక ప్రమాణంలో దర్శనమిస్తాయి. అదే సమయంలో ఆయన మహనీయులైన సన్యాసుల మధ్య జీవించటం కూడ చూస్తాము. భగవద్గీతను అధ్యయనం చేసి మననం చేసికుంటే తప్ప మనకు ఆ పరమాత్మ నిజస్వరూపం అర్థం కాదు. ఎందుకంటే ఆయన బోధనల స్వరూపమే ఆయన గనుక. పరమాత్మ యొక్క ప్రతి అవతారం దానిలో బోధింపబడిన ధర్మాలకు సజీవ ఉదాహరణగా భాసిస్తుంది. భగవద్గీతను బోధించిన కృష్ణుడు ఆ అమరగీతానికి మొత్తం జీవితాన్ని ప్రతీకగా నిల్పుతాడు. బంధాలకు అతీతంగా నడచిన జీవితానికి ఆయనే నిదర్శనం. రాజరికాన్ని త్యజించి బయటకు వచ్చాడు. దాన్ని గురించి మరల ఆశించలేదు. భారతదేశానికి నాయకుడతడు. రాజులందరూ ఆయన కనుసన్నలలో మెలగేవారు. ఆయన సూచిస్తే చాలు, వారు తమ రాజ్య పీఠాల్ని త్యజించి వచ్చేవారు. ఐనా కృష్ణుడు రాజ్యాధికారం కొరకు వెంపర్లాడలేదు. ఆయన చివరి వరకు గోపకన్యలతో విహరించిన సామాన్య కృష్ణునిగానే మనకు గోచరిస్తాడు. మనలో ఆధ్యాత్మిక పరిపక్వత, స్వచ్ఛత సంపూర్ణస్థాయికి చేరితే తప్ప మనకు ఆయన జీవిత గమనాన్ని అవగాహన చేసికునే అర్హత ఏర్పడదు. బృందావనంలో రాసక్రీడా విలాసంలో గోపికల పట్ల కృష్ణుడు, ఆయన పట్ల గోపికలు వెలయించిన నిష్కల్మష ప్రేమతత్వాన్ని నిజస్థితిలో అర్థం చేసికోవాలంటే ప్రేమసుధావాహినిలో మునిగి ఉక్కిరి బిక్కిరైన వారికి తప్ప ఇతరులకు సాధ్యపడదు. ఇక మధురభక్తి ప్రేరితులైన గోపికల ప్రేమ వర్ణనాతీతం; సామాన్య మానవులకది అర్థం కాదు. వారికి స్వర్గంతో పనిలేదు. వారి దృష్టిలో ప్రపంచమంతా శూన్యం. కృష్ణునితో బంధించే వారి ప్రేమే వారికి సర్వస్వం. కృష్ణుని ఒక సృష్టికర్తగా గాని, పరమాత్మగా గాని, సర్వశక్తిమంతుడుగా గాని గోపికలు తెలుసుకోదలచుకోలేదు. ఆయన ఆ విధంగా వర్ణింపబడటాన్ని కూడ సహించలేకపోయేవారు. ఆయన్ని కేవలం ఒక అనంత

ప్రేమమూర్తిగా మాత్రమే వారు తెలిసికొన్నారు. గోపికలు కృష్ణుని బృందావన విహారిగానే గుర్తించారు. విశ్వానికే ప్రభువు, రాజాధిరాజైన కృష్ణుడు గోపికల దృష్టిలో మామూలు గోపాలుడు మాత్రమే. 'నాకు సంపదలతో పనిలేదు. విద్య యందు ఆసక్తిలేదు. స్వర్గప్రాప్తిని కూడ కోరను. నేను మళ్లీ మళ్లీ జన్మిస్తూ నిన్నే ప్రేమిస్తూ జీవించాలి. ప్రేమ కొరకే ప్రేమించటమనే ఆదర్శాన్ని పాటించాలి' అని ఒక గోపిక కృష్ణుని కోరుతుంది. మన మతంలోని పారమార్థిక ధర్మం ఈ సందర్భంలో ప్రకటితమౌతుంది. ప్రేమ కొరకే ప్రేమ, కృషి కొరకే కృషి, విధి నిర్వహణ కొరకే విధి అనే ఆదర్శ ధర్మాలు కృష్ణుని అవతారం ద్వారా భారత భూమిపై మానవ చరిత్రలో ప్రప్రథమంగా ప్రాచుర్యాన్ని సంతరించు కున్నాయి. మతపరమైన భయవ్యామోహాలు శాశ్వతంగా అంతరించాయి. నరకభీతి లేదు, స్వర్గంపట్ల ఆకర్షణాలేదు. 'ప్రేమ కొరకే ప్రేమ, పనికొరకే పని, బాధ్యత కొరకే బాధ్యత' అనే ఉత్కృష్టమైన ఆదర్శం ఆచరణీయమైంది.

ఫలాపేక్షరహితమైన ఆ పవిత్ర ప్రేమే నిజమైన ప్రేమ. గోపికల ప్రేమతత్వాన్ని అవగాహన చేసికోవటం ఎంత కష్టమో నేనిప్పుడే మీకు చెప్పియున్నాను. సంపద మీద, కీర్తి ప్రతిష్ఠలపైన, ఇతర ప్రాపంచిక విషయాల మీద వ్యామోహం వదలుకోవాలి. అప్పుడు మాత్రమే మనం గోపికల ప్రేమలోని నిజతత్వాన్ని తెలిసికోగలం. అంతేకాదు వారి ప్రేమలోని పవిత్రతను, నిస్వార్థపరత్వాన్ని గ్రహించాలంటే మన అంతరాత్మలు స్వచ్ఛతను సేకరించుకోవాలి; మనం సర్వసంగపరిత్యాగులం కావాలి. అంతేగాని, స్త్రీకాముకులు, ధనాపేక్షవదలనివారు, కీర్తికాంక్షులు గోపికల ప్రేమను విమర్శించ బూనటం సాహసమౌతుంది.

కృష్ణావతారం యొక్క సారాంశమంతా గోపికల ప్రేమ వృత్తాంతంలో ఇమిడి వుంది. గీతలో ప్రబోధింపబడిన వేదాంతం కూడ గోపికా వృత్తాంతానికి భిన్నంగా వుంటుంది. భగవద్గీతలో శిష్యునకు తత్త్వజ్ఞానబోధ క్రమ పద్ధతిలో నడుస్తుంది. కాని ఇచ్చట గోపికల విషయంలో పరాకాష్ఠకు చేరిన ప్రేమతత్త్వం తప్ప మరొక దానికి స్థానముండదు. గురువని

గాని, శిష్యులని గాని, గ్రంథాలు గాని, పఠనం గాని ఏదీ వుండదు. చివరకు భగవంతుడు, స్వర్గము, భయము, భక్తి అనే భావాలు – వీటి స్పృహ వుండదు. సర్వం ప్రేమమయమే. ప్రేమించే వ్యక్తి దృష్టిలో కృష్ణుడు తప్ప మిగతా జగత్తు అంతా శూన్యం. ఆ తాదాత్మ్య భావంలో తనలోని సర్వస్వం కృష్ణుడే. దీనినే కృష్ణ మహిమ అంటారు.

కృష్ణుని జీవిత కథనంలో చారిత్ర్యక వైరుధ్యాలు, కల్పనలు చోటు చేసుకొని వుండవచ్చు. అవి కూడ యథార్థాలు ఐతే కావచ్చు. కాని కృష్ణావతారంలో భక్తి తత్త్వానికి వచ్చిన అత్యద్భుత మార్పునకు ఆధారం వుండాలి కదా. మనం ఏ ఇతర మహర్షి యొక్కగాని, మతప్రవక్త యొక్కగాని జీవితాన్ని విశ్లేషిస్తే ఆయన ప్రబోధాలు లోగడ అమలులో వుండి ప్రస్తుతం దేశంలో నలుమూలల ప్రచారంలో వున్నవిగా గ్రహించవచ్చు. కాని పని కొరకే పనియని, ప్రేమకొరకే ప్రేమయని, కర్తవ్య నిర్వహణ కొరకే కర్తవ్యమనే ధర్మాలు అప్పటి వరకు ప్రచారంలో గాని, అమలులోగాని లేవు. కృష్ణుడు జన్మించే సమయానికి ఈ ధర్మాల ఆచూకి ఏ విధంగాను లభించదు. కనుక ఈ ధర్మాల ప్రబోధం, ప్రచారం కృష్ణుని ద్వారానే జరిగిందనటం నిర్వివా దాంశం. ప్రప్రథమంగా కృష్ణుడు వీనిని బోధిస్తే తర్వాత ఆయన శిష్యుడైన వ్యాసుడు వానిని మానవులకు అందించాడు.

అలా ప్రేమ తత్త్వాన్ని బోధించి ప్రచారం చేసి ఉన్నత స్థాయిని పొందిన కృష్ణుడు భగవద్గీత ప్రవక్తగా దాని దిగువ స్థాయిని ఆక్రమించాడు. వేదాలకు, వేదాంత ధర్మాలకు భగవద్గీతను మించిన వ్యాఖ్యాన గ్రంథం లేదు. శ్రుతులు, ఉపనిషత్తుల సారాన్ని అవగాహన చేసికోవటం కష్టసాధ్యమైనపని. దానిపై వ్యాఖ్యానాలు, వివరణలు పలువురు ప్రజ్ఞావంతులు, ఎవరి దృక్పథంలో వారు రచించటం బట్టే వానిలోని విషయాలు ఎంత జటిలమైనవో మనం ఊహించవచ్చు. ఈ నేపథ్యంలో ఈ సమస్యాపరిష్కారానికే అన్నట్లు కృష్ణుడు శ్రుతులపై, ఉపనిషత్తులపై వ్యాఖ్యాన గ్రంథంగా భగవద్గీతను ఆవిష్కరించటం హర్షణీయం. భగవద్గీతలో ఆయన ఇచ్చిన వ్యాఖ్యానం ప్రామాణికం, సర్వజన ఆమోదయోగ్యం. ఒక అద్వైత సిద్ధాంతి ఒక

ఉపనిషత్తును తీసికొని వ్యాఖ్యానం చేస్తే, ఆ ఉపనిషత్తులో తటస్థపడే ద్వైత అంశాల్ని తన వాదనకు అనుకూలంగా మలచి, దాని అసలు స్వరూపాన్ని హరింపచేసి తన సిద్ధాంతాన్నే అందులో నిలబెడ తాడు. అదే ఒక ద్వైతవాది ఆ ఉపనిషత్తుకు వ్యాఖ్య రాయవలసి వస్తే దానిలోని అద్వైత సిద్ధాంతాలను తన సిద్ధాంత ప్రమాణాలకు అనుగుణంగా మార్చి అద్వైతాంశాల్ని ధ్వంసం చేస్తాడు. కాని భగవద్గీతలో అటు అద్వైతాంశాలకు గాని, ఇటు ద్వైత భావాలకు గాని ఏవిధమైన హాని సంభవించకుండా వ్యాఖ్యానం సాగుతుంది.

భగవద్గీతలో కృష్ణుడే కీలకపాత్ర. భారతదేశంలో భగవంతుని అవతారాలన్నింటకంటే కృష్ణునికి ప్రజాదరణ అమితంగా వుండటాన్ని గమనిస్తాం. ఆయన అనుచరు లందరూ ఆయన అవతారాన్నే పరిపూర్ణమైందిగా, శ్రేష్ఠమైందిగా పరిగణిస్తారు. దానికి కారణం లేకపోలేదు. బుద్ధుడు వంటి ఇతర అవతారాల్ని పరిశీలిద్దాం. వారు కేవలం సన్న్యాసులు మాత్రమే. వారికి గృహస్థుల పట్ల కరుణభావం లేదు. వారికి వుండే అవకాశం లేదు, వారు గృహస్థులు కాదు కనుక. కాని కృష్ణునివైపు దృష్టిని మరలిద్దాం. కొడుకుగా గొప్పతనాన్ని సాధించాడు. ఒక రాజుగా, తండ్రిగా ఆయన జీవితమంతా ఆయన ప్రబోధించిన ధర్మాల్ని తు.చ. తప్పకుండా పాటించాడు. అమితమైన కర్తవ్య నిర్వహణల నడుమ కూడా ప్రశాంతతను సమకూర్చుకునే నేర్పు, అలాగే విశ్రాంతి వాతావరణంలో క్రియాశీలత్వాన్ని ప్రదర్శించే నైపుణ్యం ఆయనకు మాత్రమే సాధ్యం. బంధాలకు అతీతంగా వ్యవహరించటం ద్వారా అది సాధ్యమేనని కృష్ణుడు నిరూపిస్తాడు. నీ కర్తవ్యాలన్నిటినీ నిర్వహించు, కాని ఏ ఒక్కదానితోనూ సంబంధము పెట్టుకోవద్దు. నీ అంతరాత్మవే నీవు. పవిత్రుడవు, స్వేచ్ఛాజీవివి కూడ. కాని అన్నిటికి నీవు కేవలం సాక్షీభూతుడవు మాత్రమే. మనం నిర్వర్తించే పనులు మన దైన్యానికి కారణంగాదు. కాని మనం వాటిపట్ల ఏర్పరచుకొన్న మమకారం వల్లనే మనకు దుఃఖం సంభవిస్తోంది. ఉదాహరణకు ద్రవ్యం విషయం తీసుకోండి. ధనం సంపాదించటం గొప్ప విషయం, అభిలషణీయమైనదే. కష్టించి ధనాన్ని సంపాదించవలసిందేనని కృష్ణ భగవానుడు ఆదేశిస్తాడు. కాని దానిపై అనుబంధం పెంచుకోకూడదు. అది వుంటే విర్రవీగకూడదు; పోతే

బాధపడకూడదు. అలాగే దారాసుతులు, బంధువులు, కీర్తి ప్రతిష్ఠలు. దేనినీ మనం కాదనవలసిన పనిలేదు. మనం ప్రతిష్ఠించుకోవలసిన అనుబంధం ఒక్కరితో మాత్రమే. ఆ ఒక్కరే పరమాత్మ. ప్రాపంచిక విషయాల కొరకు, ప్రజల కొరకు శ్రమించాల్సిందే. అనేక విధాలైన త్యాగాలకు సంసిద్ధులం కావలసిందే. కాని దేనియెడల మమకారం అణుమాత్రం కూడ వుండకూడదు. కృష్ణుని జీవితం ఈ నిరాపేక్ష తత్వాన్నే ప్రస్ఫుటంగా విశదీకరిస్తుంది.

# గౌతమ బుద్ధుడు

భారతదేశంలో విచారకరమైన చరిత్ర ఇప్పుడే ప్రారంభమౌతుంది. భగవద్గీతలో వర్గాల మధ్య జరిగే సంఘర్షణను గురించి ధ్వనులు లీలగా వినవస్తాయి. వాటిని నివారించి వర్గాల్లో సమన్వయ ధోరణిని నెలకొల్పటానికి పరమాత్ముడు పాత్ర వహించ టాన్ని కూడ మనం వింటాం. శ్రీకృష్ణపరమాత్ముడు వర్గాల మధ్య సత్సంబంధాల గురించి బోధ చేయుటలో, ప్రచారం చేయుటలో అగ్రగణ్యుడు. 'ఈ వర్గాలన్నీ ఒకే దారానికి కూర్చబడిన ముత్యాలలాంటివి. ఇవి నాలోనే ఇమిడి వున్నాయి.' అని ఆయన అన్నాడు. వారిలో వారికున్న విభేదాలు దూరాన్నుంచే ధ్వనిస్తున్నాయి. ఒకప్పుడు వారందరూ సమరస భావంతో మెలగివుండవచ్చు. కాని ప్రస్తుతం రెండు శక్తివంతమైన వర్గాల మధ్య మత ప్రాతిపదిక మీదనే కాకుండా కులతత్వాల కారణంగా కూడ ప్రబలుతున్న ఘర్షణలు కానవస్తున్నాయి. ఈ బలమైన వర్గాలే క్షత్రియులు, బ్రాహ్మణులు. అత్యున్నత స్థాయి నుండి తన బోధనలతో దేశాన్ని సుమారు వేయి సంవత్సరాల కాలం ముంచెత్తిన ఒక మహాపురుషుడు ఈ సందర్భంలో మనకు దర్శనమిస్తాడు. ఆ మహాపురుషుడే గౌతమ శాక్యముని. ఆయన బోధనలు, ప్రచారాలు మనమందరం ఎరిగినవే. ఆయన్ని భగవదవతారంగా ఆరాధిస్తాం. ప్రపంచంలో నైతిక మార్గాల్ని ప్రబోధించిన అత్యుత్తమ సాహస ప్రచారకుడుగా ఈయన ప్రసిద్ధి చెందాడు. అంతేగాదు అత్యుత్తమ కర్మయోగిగా కూడ వ్యక్తీకరించుకున్నాడు. కృష్ణుడు తనకు తానే శిష్యుడై తన సిద్ధాంతాల్ని జీవితంలో అమలు చేసి చూపించేందుకు బుద్ధునిగా అవతరించినట్లు కూడ భావింపబడుతోంది.

బుద్ధుడు జన్మించే సమయానికి భారతదేశంలో ఒక మత ప్రవక్త రూపంలో ఆధ్యాత్మిక జ్ఞాన ప్రబోధకుని ఆవశ్యకత ఏర్పడివుంది. అప్పటికే సమాజంలో మతాచార్యుల ప్రభావం ప్రబలంగా విస్తరించియుంది. భగవంతుడున్నాడనే విశ్వాసం వారి కుండేది. అంతే కాదు, పరమాత్ముని గురించిన జ్ఞానాన్ని పొందాలన్నా, ఆయన్ని చేరాలన్నా వారి ద్వారానే సాధ్యమని

ప్రజలను వారు నమ్మించారు. ఆ విధంగా ఆచార్యులు సమాజంలో ఆధిపత్యం సాధిస్తుండగా, సన్యాసులుగా పిలవబడే మత ప్రచారక వర్గం కూడ వారితో బాటు వర్థిల్లుతూ వచ్చింది. ఈ వర్గం వారు ఆచార్యుల మార్గాల్ని, వారి సిద్ధాంతాల్ని ఖండిస్తూ, పారమార్థిక సత్యాన్ని ప్రజలకు నిరూపించేవారు. అలా, మతాచార్యుల ఆధిపత్యాన్ని భంగపరచటానికి వీరు కృషి చేశారు. కొంతవరకు విజయాన్ని సాధించారు. కాని ఆ పరిస్థితి ఎక్కువ కాలం సాగలేదు. రెండు సంతతుల కాలంలో వారి శిష్యులు ఆచార్యులు ప్రచారం చేసిన ఛాందస భావాల్ని, మార్గాల్ని స్వీకరించి వారు కూడ మతాచార్యులుగానే మారిపోయారు. మా ద్వారానే సత్యాన్ని తెలుసుకోవటం సాధ్యం అని వారు వాదించారు. సత్యానికి ఒక రూపం స్థిరపడింది. దాన్ని ఛేదించటానికి మళ్లీ మత ప్రచారకులు ఉద్భవించారు. ఈ రెండు భిన్న వర్గాల మధ్య ఘర్షణ సాగుతూనే వుంది. అలా సమాజంలో మానవుడు, మతప్రవక్త అనే ఇద్దరూ వుండవలసిందే. లేనిచో మానవత వర్థిల్లదు. సత్యాన్వేషణ విషయంలో మత ప్రవక్తల పాత్ర అనివార్యం. ప్రజలు సత్యాన్ని తెలిసికోలేరు కనుక సత్యానికి సంబంధిం చిన బోధనల్ని సులభతరం చేయాలి. ఉదాహరణకు క్రీస్తు యొక్క 'సెర్మన్ ఆన్ ది మౌంటు' గాని, పరమాత్మ చేసిన గీతా కావ్యాన్ని గాని పరిశీలిస్తే వాటి కంటే సులభతర మైన ప్రవచనాలు మనకు కన్పించవు. సామాన్య పరిజ్ఞానమున్న వ్యక్తి కూడ వాటిని అవగాహన చేసికోగలడు. అవి చాల ఉత్కృష్ట మైన గ్రంథాలు. వాటిలో సత్యనిరూపణ అతి సులభంగా, నేరుగా చేయబడ్డది. కాని సత్యావిష్కరణ సులభ సాధ్యమనే భావనను ఆచార్యులు ఆమోదించరు. వారి దృష్టిలో రెండు వేల స్వర్గాలు, మరి రెండు వేల నరకాలు వున్నాయి. ప్రజలు వారిని అనుసరించి వారి మార్గంలో పయనిస్తే స్వర్గప్రాప్తి కల్గుతుంది. అనుసరించని పక్షంలో నరకమే వారి గమ్యమౌతుంది. అని వారి ప్రతిపాదన.

కాని ప్రజలు సత్యాన్ని కనుగొని తీరాలి. ప్రజలకు సత్యం పూర్తిగా తెలిస్తే వారికి హాని కల్గుతుందని కొందరి విశ్వాసం. పూర్తి సత్యాన్ని నగ్న రూపంలో ప్రజల కీయకూడదని వారి అభిప్రాయం. కాని సత్యం విషయంలో సమాధానపడి భిన్న మార్గాలు అనుసరించటం

ప్రపంచానికి శ్రేయస్కరం కాదు. ప్రస్తుతమున్న దుస్థితి కంటే మించిన దుస్థుతి ఎలాగూ సంభవించదు. కనుక ప్రజల ముందు సత్యాన్ని ఆవిష్కరిద్దాం. అదే నిజమైన సత్యమైతే ప్రజలకు మేలు సమకూరుతుంది. దాన్ని కూడ ప్రజలు స్వీకరించకుండా, వేరే మార్గాల్ని ప్రతిపాదిస్తే, ఆ పేరుతో వారు కుహనా వాదాన్ని ఆశ్రయిస్తున్నట్లే.

బుద్ధుని కాలంలో ఇలాంటి ప్రయోగాలు విస్తృతంగా ప్రచారంలో వున్నాయి. మామూలు ప్రజానీకం జ్ఞానసముపార్జనకు అనర్హులుగా బహిష్కరింపబడ్డారు. ఒక వ్యక్తి ఒక చిన్న వేదమంత్రాన్ని శ్రవణం చేస్తే చాలు, అతడు తీవ్రమైన శిక్షకు గురియౌతాడు. మన ప్రాచీన హైందవులు శోధించి తెలుసుకొన్న ఆధ్యాత్మిక ధర్మ సూత్రాలు ఏ వేదాల్లో నిక్షిప్తమై యున్నవో అట్టి వేదాలు అధ్యయనం చేసే అర్హతను ఆచార్య పండితులు తమకే పరిమితం చేసుకున్నారు.

చివరకు ఒక మహానీయుడు మాత్రం ఈ పరిస్థితిని సహించలేకపోయాడు. ఈ విషవలయాన్ని చేదించే ప్రజ్ఞ, ధైర్యసాహసాలు, సంకల్పం ఆయనకున్నాయి. ఆయన హృదయం ఆకాశమంత విశాలమైంది. పండిత వర్గం పామరులను పావులుగా చేసి వారిపై ఎలా ఆధిపత్యం వహిస్తున్నదీ, వారి ఆధిపత్యాన్ని చూసుకొని పండితులెలా విర్రవీగుతున్నదీ ఆయన గమనించి తపన చెందాడు. దీనికి పరిష్కార మార్గాన్ని గురించి యోచించాడు. వ్యక్తుల మధ్య నెలకొనియున్న మానసిక, ఆధ్యాత్మిక శృంఖ లాల్ని ఛేదించటానికి ఉటంకించాడు. సమాజంలో చాల మందికి అలాంటి తలంపు కల్గవచ్చు. కాని దాన్ని కార్యరూపంలో పెట్టేందుకు అవసరమైన నేర్పు, ఆలోచన, సమర్థత వారిలో లోపిస్తాయి. కాని ఈ మహా పురుషునకు తోటి మానవుల మానసిక బంధాల్ని ఛేదించి వారిని విముక్తుల్ని చేసే కార్యాచరణ పథకాన్ని రచించే ప్రజ్ఞాపాటవాలున్నాయి. ప్రజలు కష్టాలకు ఎందుకు గురియౌతున్నారో తెలిసికొన్నాడు.వాటిని తొలగించే విధానాన్ని కూడ కనుగొన్నాడు. అతడు కార్య సాధకుడు. ఫలితాల్నిసాధించే కార్యక్రమాన్ని సమకూర్చుకున్నాడు. ప్రజలందరికి, హెచ్చు తగ్గుల

విచక్షణలేకుండా, తన బోధనలను వివరించాడు. జ్ఞాన సముపార్జన ద్వారా శాంతినిసాధించాలని వారు గుర్తించేటట్లు చేశాడు. ఆ మహామహుడే బుద్ధుడు.

వేదాల్లో వున్న వేదాంత సారాన్ని గొప్ప వార్కి, చిన్న వార్కి కూడ ఆయనబోధించాడు. తన బోధనల్ని మొత్తం ప్రపంచానికి విస్తరింపచేశాడు. సర్వమానవసమానత్వం ఆయన సందేశాల్లో అతి ప్రాముఖ్యమైనది. ఆయన సిద్ధాంతంలోసమాజంలో ఎవరికి ప్రత్యేకమైన వెసులుబాటు వుండకూడదు. స్త్రీ పురుషుల హక్కుల్లోవ్యత్యాసముండకూడదు. ఆధ్యాత్మిక జ్ఞాన సముపార్జన విషయంలో కూడ స్త్రీపురుషులకు సమాన అవకాశాలుండాలని బుద్ధుడు ప్రబోధించాడు. బ్రాహ్మణులకు ఇతర కులాలకు మధ్య వున్న వ్యత్యాసాలను రూపుమాపాడు. ఉన్నత గమ్యాల్ని సాధించటానికి సమాజంలోని అతి క్రింది స్థాయివారు కూడ అర్హులేయని ఆయనప్రతిపాదించారు. ఆ విధంగా ఆయన మోక్ష ద్వార ప్రవేశాన్ని సర్వులకు సుగమంచేశాడు.

బుద్ధుని సిద్ధాంతం ఇలావుంది. ప్రజల దుస్థితికి కారణం మానవుల్లోని స్వార్ధపరత్వమే. దానిని నిర్మూలించాలంటే మనలో అంతరాత్మ అనేది లేదని భావించటమే.అంతరాత్మకు అస్తిత్వం లేదనే బుద్ధుని వాదన. మనకు ప్రపంచంలో స్థూలంగాకనిపించేవే వున్నట్టు భావించాలి. జనన మరణాలనే చక్ర భ్రమణకు కారణ భూతమనిభావింపబడుచున్న ఆత్మకు ఉనికిలేదు. అది ఒక భ్రమ మాత్రమే. ఆలోచనా పరంపరలో ఒక దాని వెంట మరియొకటి జనిస్తూ, నశిస్తూ ఒక క్రమంలో పరిభ్రమిస్తూ వుంటాయి.వాటికి కర్త ఎవరూ వుండరు. ఆత్మ అనేదే లేదు. శరీరంలో ఎప్పుడూ మార్పులు సంభవిస్తూనే వుంటాయి. అలాగే మనస్సు, బుద్ధికూడ. అందువలన ఆత్మ అనేదిమన భ్రమా కల్పితమే. ఆత్మ లేదు కనుక దానిని ఆశ్రయించుకునే స్వార్థ పరత్వానికి స్థానం వుండదు. ఆత్మ లేదనే సత్యాన్ని మనం గ్రహించిన నాడు మన జీవితాలుసుఖమయమౌతాయి. వాటితోబాటు ఇతరులకు కూడ సుఖం కల్గుతుంది.

ఇదే బుద్ధుని బోధనల్లోని సారాంశం. ఆయన కేవలం బోధించటమే కాదు, తను నమ్మిన సిద్ధాంతాలకై ప్రపంచం కొరకై తన ప్రాణాల్ని అర్పించటానికి కూడ సిద్ధమైనాడు.

జంతువుల ప్రాణ రక్షణకై తన ప్రాణాన్ని అర్పించటానికి ఎల్లప్పుడూ సంసిద్ధుడైవున్న వ్యక్తి ఆయన ఒక్కరే. ఒక పర్యాయం ఆయన ఒక రాజుని ఉద్దేశించి ఇలా అన్నాడు. "ఓ రాజా, జంతుబలి వల్ల నీకు స్వర్గప్రాప్తి కల్గితే, నరబలి వల్ల అంతకంటేమిన్నయైన ఫలితం నీకు సిద్ధిస్తుంది. కనుక జంతువుకు బదులు నన్ను బలిగాసమర్పించు". ఆ మాటలకు రాజు ఆశ్చర్యచకితుడయ్యాడు.

ఆయన ఇంకా ఇలా అన్నాడు: "జంతుబలి మన సమాజంలో వున్న మరొక మూఢాచారం. భగవంతుడు, అంతరాత్మ అనేవి మనలోని గొప్ప మూఢవిశ్వాసాలు.భగవంతుడనే ఛాందస భావాన్ని మతాచార్యులు సృష్టించారు. వీరు బోధించినట్లుభగవంతుడే వుంటే, మానవాళికి ప్రపంచంలో ఈ దైన్యస్థితి ఎందుకు సంభవించాలి?ఆయన నావలెనే కార్యకారణ సిద్ధాంతానికి లోబడినవాడై వుండాలి. ఆ సిద్ధాంతానికి బద్ధుడు కాని వాడైతే సృష్టిని ఎందుకు సాగిస్తాడు? అలాంటి భగవంతుడు ఎవరినీ సంతృప్తిపరచలేడు. విశ్వాన్ని పరిపాలించే పాలకుడు స్వర్గంలో కూర్చొని తన ఇచ్ఛానుసారం పరిపాలిస్తుంటే భూలోకంలో ప్రజలు దైన్యంతో మరణిస్తుంటారు. ఐనా ఈ విషయం ఆయనకు పట్టదు. మానవ జీవితమంతా కష్ట పరంపరలమయం.భూలోకంలో అనుభవించే ఈ శిక్ష సరిపోదన్నట్లు, మరణించిన తర్వాత కూడక్రొత్త శిక్షల్ని అనుభవించటానికి ఇతర లోకాలకు వెళ్లాలి. ఐనా, ఇలాంటి సృష్టికర్తనుసంతృప్తిపరచటానికి మనం నిత్యం అనేక రకాల పూజావిధానాల్ని, క్రతువుల్ని ఆచరిస్తుంటాము.

ఈ క్రతువులన్నీ అర్థరహితమని బుద్ధుని వాదన. 'భ్రమల్ని నిర్మూలిస్తే సత్యమైనప్రమాణాలు నిలుస్తాయి.' ఇదే ప్రపంచ ప్రజలందరు పాటించవలసిన ఒకే ఒక్క ఆదర్శం. భ్రమల రూపంలోని మేఘాలు తొలగిపోతే వాస్తవ రూపమనే

సూర్యుడుతేజోవంతంగా ప్రకాశిస్తాడు. తర్వాత ఆత్మను నశింపచేయాలి. దాని కొరకై మనం పరిపూర్ణంగా స్వార్థరహితులం కావాలి. చివరకు ఒక చీమ కొరకు గూడ మన అసువుల్ని అర్పించటానికి సిద్ధపడాలి. మూఢ విశ్వాసాలకై కృషి చేయకూడదు. ఏ దేవుణ్ణో సంతృప్తి పరచటం కోసమో, ఏ కోరికలో సిద్ధించటం కోసమో పాటుపడకూడదు. ఆత్మను నశింపచేసి మనలను మనం విముక్తి చేసికోటానికే మనంనిరంతరం శ్రమించాలి. అంతేకాని ప్రార్థనలు, పూజలు, ఇవన్నీ నిరర్థకం. మనం భగవంతునికి కృతజ్ఞతలు తెల్పుకోటానికి అలవాటుపడ్డాం. కాని ఆయన వున్నాడో, లేడో, వుంటే ఎక్కడ వున్నాడో ఎవ్వరికీ తెలియదు. లేని భగవంతుణ్ణి గురించి మనం అతిగా ఆశించటం నిష్ప్రయోజనకరం.

కాని హిందువులు దేనినైనా వదులుకోగలరు గాని భగవంతుని మాత్రం వదలలేరు. భగవంతుడు లేడనేవాదనను ఆమోదించటం దైవభక్తినే ఆధారం చేసికొని నడుస్తున్న ప్రజల కాళ్ల క్రింద మట్టిని తొలగించి వారి పతనానికి ప్రోద్బలం చేయటమే ఔతుంది. హిందువులు భగవంతునికి, భగవద్భక్తికి అనుసంధింపబడి జీవిస్తారు.

ఐనా బౌద్ధమతం అతి వేగంగా నలుమూలలా విస్తరించింది. ఒక విశాల హృదయం నుండి వెల్లువగా ప్రవహించిన ప్రేమయే దానికి ప్రధాన కారణం. మానవ చరిత్రలో అదివరకెన్నడూ కనీవినని రీతిలో మానవ సేవకేగాక, మొత్తం ప్రాణికోటి సేవకు అంకితమైన ప్రేమాస్పద హృదయం మొత్తం జనాన్ని ఆకర్షించింది. మొత్తం జీవజాలం యొక్క బాధలను నివృత్తి చేయటమనే ఏకైక లక్ష్యం తప్ప ఆ ప్రేమ మరే విషయాన్ని పట్టించుకోలేదు.

అప్పటి వరకు మానవుడు భగవంతుని ప్రేమించి, తోటి మానవుణ్ణి నిర్లక్ష్యం చేశాడు. అతడు భగవంతుని పేరుతో తన జీవితాన్ని అర్పణ చేయటానికి సందేహించ లేదు. అదే భగవంతుని కొరకై తోటి మానవుణ్ణి చంపటానికి కూడ వెనుదీయలేదు. అది ప్రపంచంలో అప్పటి పరిస్థితి. భగవద్విలాసం కొరకు మానవులు తమ సంతతిని బలి ఇవ్వటానికి సంకోచించలేదు. జాతుల్ని కొల్లగొట్టటానికి వెనుదీయలేదు. వేలకు వేలు ప్రాణికోటిని

చంపటానికి సందేహించలేదు. భూమిని రక్తపాతం చేయటానికి కూడ వెనుకాడలేదు. బుద్ధుని మత ప్రచారంతో ప్రప్రథమంగా అసలు దేవుడైన మానవునిపై దృష్టి మరల్చాడు. తోటి మానవుణ్ణి ప్రేమించాలనే స్పృహ సమాజంలో నాటుకుంది. ఇదే మానవులపైకి ఎగసిన మొట్టమొదటి గాఢతర ప్రేమ తరంగం. ఇదే కల్మషరహితమైన విజ్ఞాన తరంగం కూడ. ఈ తరంగాలే భారతదేశంలో ఆవిర్భ వించి దేశదేశాలలో తూర్పు నుండి పశ్చిమానికి, ఉత్తరం నుండి దక్షిణానికి నలుదిశల వ్యాపించాయి.

నా జీవితమంతా నాకు బుద్ధుని యందు వ్యామోహం మిక్కుటంగా వుండేది. ఇతర వ్యక్తులకంటే మిన్నగా నాకు బుద్ధునిపై పూజ్యభావం వుండేది. ఆ ధైర్యం, ఆ నిర్భీకత, ఆ కరుణ అనన్యమైనవి. మానవ శ్రేయస్సుకై జన్మించిన అవతారమూర్తి ఆయన. ఇతరులు భగవదన్వేషణలోను, సత్యాన్వేషణలోను తమకై తాము కృషి చేయవచ్చు. కాని బుద్ధుడు తన కొరకై కూడ సత్యాన్ని తెలుసుకోవటానికి ఇష్టపడలేదు. ప్రజల దీన స్థితిని నివారించటానికి మాత్రమే ఆయన సత్యాన్వేషణకు పూనుకున్నాడు. వారికి చేయూత నివ్వటమే ఆయన ప్రధాన కర్తవ్యంగా స్వీకరించాడు. జీవితాంతం ఆయన మేలుని గురించి ఆయన ఆలోచించలేదు. ఆయన జీవించటంలోనే గాక నిర్యాణంలో కూడ గొప్పదనాన్ని ప్రదర్శించాడు. అమెరికన్ ఇండియన్సుతో సమమైన జాతికి చెందిన వ్యక్తి ఇచ్చిన ఆహారాన్ని స్వీకరించాడు. ఆ జాతివారు విచక్షణా రహితంగా ఏ ఆహారం పడితే ఆ ఆహారాన్ని తింటారు గనుక హిందువులు వారిని అస్పృశ్యులుగా భావిస్తారు. ఆ ఆహారాన్ని తినవద్దని తన శిష్యుల్ని వారించాడు. కాని ఆయన దాన్ని నిరాకరించ వీల్లేదని భుజించాడు. ఆ ఆహారం తినటం వల్ల తనకు ఈ పాంచ భౌతిక శరీరం నుండి విముక్తి కల్గుతోందని, ఆ విముక్తిని ప్రసాదించిన ఆ వ్యక్తికి తన కృతజ్ఞతలు తెలుపవలసిందని తన శిష్యులను బుద్ధుడు ఆదేశించాడు. బుద్ధుని అంతిమ దశలో ఒక వృద్ధుడు ఆయన దర్శనానికై మైళ్ల తరబడి దూరం నడచి వచ్చి ఆయన ప్రక్కన ఆసీనుడైనాడు. బుద్ధుడు తన ధర్మాలను ఆయనకు బోధించాడు. బుద్ధుని నిర్యాణ సమయంలో తన శిష్యుడొకడు రోదిస్తూ వుండటాన్ని గమనించి మందలిస్తాడు. అతనికి ఇంకా ఇట్లా బోధిస్తాడు.

“నా బోధనల ఫలితమిదేనా? ఈ కృత్రిమ బంధాల నుండి బయటపడు. నా మీద ఆధారపడవద్దు. ఈ అశాశ్వతమైన నా వ్యక్తిత్వాన్ని కీర్తించవద్దు. బుద్ధుడంటే వ్యక్తి కాదు. జ్ఞానావిష్కర ణకు అతడొక ప్రతీక. నీ ముక్తి కొరకై నీవు ఉద్యమించు”.

తన నిర్యాణ దశలో కూడ బుద్ధుడు తన కొక ప్రత్యేకతను వాంఛించలేదు. అందుకే నాకు ఆయనంటే పూజ్యభావం.

# శంకరాచార్య

బౌద్ధమత ప్రచారంలో ఒక ప్రమాదాంశం వుంది. ఆ మతమే ఒక సంస్కర ణోద్యమం. ప్రజల్లో అత్యద్భుతమైన ఆధ్యాత్మిక పరివర్తనను తెచ్చుటకు బుద్ధుడు వ్యతిరేక పద్ధతుల్లో మతబోధనలను చేయవలసి వచ్చింది. కాని ఏదైనా మతం వ్యతిరేక పార్శ్యంపై ఎక్కువ శ్రద్ధ చూపితే అది అంతిమంగా నశించే ప్రమాదానికి గురియౌ తుంది. ఏ సంస్కరణాత్మక మతమైనా కేవలం సంస్కరణలకు మాత్రమే పరిమితమైతే అది ఎక్కువ కాలం మనజాలదు. దానికి సంబంధించిన ప్రాథమిక ధర్మాలు మాత్రం సజీవంగా వుంటాయి. ఒక సంస్కరణను అమలులోకి తెచ్చి తర్వాత దానికున్న అనుకూల పార్శ్వం పైనే దృష్టి సారించి శ్రద్ధ చూపాలి. ఒక నిర్మాణం పూర్తి అయిన తర్వాత దానికి సహకరించిన సాధనాల్ని తొలగించాలి.

బుద్ధుని తర్వాత ఆయన అనుయాయులందరు ఆయన బోధనల యొక్క ప్రతికూల పార్శ్యానిపై అమితంగా శ్రద్ధ చూపి ప్రచారం చేశారు. తత్ఫలితంగా మతం క్రమంగా విచ్ఛిన్నం కాసాగింది. బౌద్ధ మతం యొక్క నీడలో ఉద్భవించిన జుగుప్సాకర పరిస్థితుల్ని మీకు వివరించాలనే కుతూహలంగాని, వివరించే సమయంకాని నాకు లేవు. నీచాతినీచమైన క్రతువులు, మానవ మేధస్సు ఎన్నడూ కల్పించని అతి హీనమైన భావాలను ప్రతిబింబించే గ్రంథాలు, అతి కౄరమైన వికృత రూపరచనలు పతనావస్థలో నున్న బౌద్ధమత సృష్టిలో ఆవిర్భవించాయి.

ఎన్ని సంభవించినా భారతదేశం తన స్థాయికి తగ్గట్టుగా జీవించాలి గదా.అందుకొరకై పరమాత్ముని ప్రతిరూపం మరల మన భూమిపై అవతరించింది. ధర్మానికి గ్లాని కల్గినప్పుడల్లా నేను వస్తానని భగవానుడు ప్రకటించిన ప్రకారం ఆయన తిరిగి ఉద్భవించాడు. ఈ పర్యాయం భారతదేశంలో దక్షిణ ప్రాంతంలో అవతరించాడు.బ్రాహ్మణ వంశంలో జన్మించిన ఆ బాలుడు బాల్యం నిండక ముందే సకల విద్యల్లోను ఉత్తీర్ణతను సాధించి పదహారు సంవత్సరాల

వయస్సుకే రచించ తలపెట్టిన గ్రంథాల నన్నింటిని పూర్తి చేశాడు. ఆ అత్యద్భుత బాలుడే శంకరాచార్యుడు. పదహారువత్సరాల ప్రాయానికే చేసిన ఆయన రచనలు ఈ అధునాతన ప్రపంచంలో అద్భుతసృష్టియనదగ్గవి. ఆ బాలుని ప్రతిభ కూడ అట్టిదే. అతడు భారతదేశం యొక్కపవిత్రతను, పూర్వ వైభవాన్ని పునరుద్ధరించ తలపెట్టాడు. కాని ఆయన ముందున్నమహత్తర కార్యాన్ని గురించి ఆలోచిస్తే అది ఎంత భయంకరమైనదో మనకు తెలుస్తుంది.తార్తారులు, బెలూచియన్లు, ఇంకా అనేక హీన జాతి ప్రజలు భారతదేశానికి వచ్చిబౌద్ధ మతావలంబకులై భారతీయులతో కలసిపోయారు. అంతేకాదు ఆయా జాతులభ్రష్టాచారాలను వారితోబాటు తెచ్చారు. తత్ఫలితంగా మన జాతి జీవితమంతా వారి ఆచారాలతో ప్రభావితమై భ్రష్ట పరిస్థితులకు నిలయమైంది. శంకరాచార్యులు అవతరించే సమయానికి మన దేశంలో నెలకొనియున్న పరిస్థితులు స్థూలంగా ఇవే. ఆ కాలం నుండి ఇప్పటి వరకు భారతదేశంలో జరిగిన ఉద్యమాలన్నీ అప్పటి బౌద్ధమతం ద్వారా మనకు సంక్రమించిన పతన దశ నుండి వేదాంత విజ్ఞానం ద్వారాదేశాన్ని పునరుద్ధరించుకోటానికే అంకితమైనాయి. ఆ కార్యక్రమం ఇప్పటికీ కొనసాగుతూనేవుంది. గొప్ప వేదాంతి యైన శంకరాచార్యుడు వచ్చి బౌద్ధమత సారానికి, వేదాంతానికి మధ్య అంత అంతరం లేదని ప్రజలకు నిరూపించాడు. అయితే బుద్ధునిశిష్యులు తమ గురువు యొక్క మత ప్రవచనాల్ని సవ్యంగా అవగాహన చేసికోకుండా పతనం చెందారని కూడ ఋజువు చేశాడు. ఆ స్థితిలో వారు భగవంతుని యొక్క, ఆత్మయొక్క ఆస్తిత్వాన్ని అంగీకరించక నాస్తికులైనారు. ఈ విషయాలను శంకరాచార్యులునిరూపించిన మీదట బౌద్ధులందరు వరుసగా ఆ మతాన్ని వదలి హిందూ మతంలోప్రవేశించటం ఆరంభించారు.

శంకరాచార్యుడు ప్రతిభావ్యుత్పత్తులలో అసమానుడే. కాని ఆయన హృదయం ఆయన ప్రతిభకు దీటైనది కాదు. శంకరాచార్యుల ప్రబోధాలకు పరిమిత దృష్టికల్పించటం సబబుకాదు. ఆయన రచనల్లో ఏ ఒక్కదానికి పరిమిత భావాన్ని ఆపాదించలేము. బుద్ధుని సిద్ధాంతాలతో పోల్చి శంకరాచార్యుని బోధలు కూడ అదే తరగతికిచెందినవని భావించటం

పొరపాటు. అది శంకరాచార్యుని బోధనల వల్ల జరిగిన తప్పుకాదు, ఆయన శిష్యవర్గం యొక్క అసమర్ధత వల్ల సంభవించిన అపవాదు.

# రామానుజులు

ఆ తర్వాత ప్రతిభావంతుడైన రామానుజులు జన్మించారు. ఆయన విశాలహృదయుడు. పీడిత ప్రజానీకం కొరకు పరితపించాడు. వారిని కరుణార్ధ్ర హృదయంతో కనికరించాడు. ఆయన సమాజంలో అమలులో వున్న క్రతువులను, కాల క్రమంలోవాటికి జత పడుతున్న అదనపు ఆచారాల్ని పరిశీలించి వాటిని పరిశుద్ధపరచాడు.అంతేగాక మరికొన్ని క్రతువుల్ని, పూజా విధానాల్ని ఎవరికి అత్యవసరమో వారికొరకు ఏర్పాటు చేశాడు. అదే స్ఫూర్తితో అత్యధిక ఆధ్యాత్మిక పూజా ప్రణాళికలోబ్రాహ్మణుల దగ్గర నుండి అస్పృశ్యులనబడేవారి వరకు – అందరకు అవకాశంకల్పించాడు. ఇదే రామానుజుల ప్రత్యేక కృషి.

రామానుజుల కాలం నుండి ఒక విశిష్టమైన అంశం మనకు గోచరిస్తుంది.అదే ఆధ్యాత్మిక విజ్ఞానాన్ని పొందుటకు కులమత విచక్షణ లేకుండా అందరు అర్హులనే పరిణామం.

# శ్రీ చైతన్య ప్రభువు

ఉత్తర భారతదేశంలో జన్మించి గోపికల వలెనే వెర్రి ప్రేమతత్వాన్ని అవలంబించిన తపస్వియే చైతన్య మహాపురుషుడు. ఆయన ఒక హేతు బద్ధ జీవనానికి అలవాటు పడిన నాగరిక బ్రాహ్మణ కుటుంబంలో పుట్టి తర్క శాస్త్రోపాధ్యాయ వృత్తినిచేపట్టాడు. అంతే గాక బాల్యం నుండి వాద ప్రతివాద విద్యలో ఆరితేరటమే జీవితలక్ష్యమని భావించాడు. ఐనప్పటికి ఒక తపస్వి యొక్క కరుణ వలన ఆయన జీవితంలో అనూహ్యమైన పరివర్తన సంభవించింది. వాద ప్రవృత్తిని మార్చుకొని, తర్క శాస్త్రబోధనా వృత్తిని త్యజించి భక్తి తత్వాన్ని బోధించటంలో కనీవినీ ఎరుగని రీతిలో అగ్రగణ్యుడయ్యాడు. ఆయన భక్తి మొత్తం బెంగాలు దేశం అంతా వ్యాపించి ప్రతిఒక్క పౌరునికి సుఖశాంతుల్ని ప్రసాదించింది. ఆయన ప్రేమకు అవధుల్లేవు. ఆయన తన ప్రేమను పంచే విషయంలో ఋషి పుంగవునకు, పాపికి తేడా చూపలేదు.పవిత్రులు, అపవిత్రులు, హిందువులు, మహమ్మదీయులు, వ్యభిచారిణులు, అతిసామాన్యులు, అందరూ ఆయన దృష్టిలో సమానులే. అందరూ ఆయన ప్రేమను, దయను చవిజూసిన వారే. ఈ రోజునకు కూడ ఆయన అనుయాయులు బీద జనానికి, పీడిత ప్రజానీకానికి, బలహీన వర్గాల వారికి, సమాజంచే వెలివేయబడిన వారికి –రక్షకులుగా నిలుస్తున్నారు. ఐతే అన్ని విషయాల్లో వలెనే వీరి వర్తనలోను కొంతపతనాన్ని వీక్షిస్తాం.

శ్రీ చైతన్య వైరాగ్య భావంలో పరాకాష్ఠ స్థితిని పొందారు. వారు స్త్రీ కాముకత్వం పట్ల, లైంగిక వాంఛల యెడ పరాఙ్ముఖులు. కాని వారి తర్వాత వారి శిష్యులు స్త్రీలకు వారి పీఠంలో ప్రవేశం కల్పించటమేగాక, వారితో స్వేచ్ఛగా విహరించి సంస్థను అప్రదిష్ఠపాలుజేసారు. చైతన్య ప్రభువు ప్రదర్శించిన పవిత్ర ప్రేమ స్వార్థరహితమైంది, మోహాతీతమైంది. లైంగిక వాంఛారహితమైంది. అది సామాన్య ప్రజల సొత్తు కావటం దుర్లభం. కాని తర్వాతి వైష్ణవ గురువులు చైతన్య ప్రభువు అవలంబించిన వైరాగ్య ప్రవృత్తి మీద దృష్టిని సారించకుండ ప్రేమ తత్వాన్ని మాత్రం సామాన్య ప్రజలకు బోధించటంలో అత్యంత శ్రద్ధాసక్తుల్ని చూపారు.

పర్యవసానంగా చైతన్య ప్రభువు అవలంబించిన నిష్కల్మష ప్రేమ తత్వంలోని దివ్యత్వాన్ని అవగాహన చేసికొని, ఆ స్థాయికి ఎదగలేక దానిని కనీసస్థాయికి దిగజార్చి స్త్రీ పురుషుల మధ్య ప్రేమగా మలచి ప్రజలు భ్రష్టులైనారు. మోహ ప్రేరితమైన ప్రేమ స్వచ్ఛమైన ప్రేమ కానేరదు. అలాంటి ప్రేమలోని ఒక అణువుకూడ హృదయజనితమైంది కాదు. దివ్యత్వమైన ప్రేమను ప్రదర్శించటానికి సర్వసంగపరిత్యాగులు, ఉత్కృష్టమానవులు తప్ప ఇతరులు అర్హులు గారు. అంతటి సర్వోత్కృష్టమైన ఆదర్శ ప్రేమను సామాన్య ప్రజల ముందు ఉంచితే అది వికృతరూపం దాల్చి లౌకికపరమైన స్త్రీ పురుషుల మధ్య ప్రవర్తిల్లే ప్రణయంగా పరిణమిస్తుంది. దివ్య సుందరమూర్తియైన భగవానుని తన నాయకునిగా భావించి ఆరాధించవలసి వచ్చినపుడు తన భార్య మాత్రమే తన మనస్సులో నిలచుట వల్ల వ్యక్తి ఆ ప్రయత్నంలో విఫలుడౌతాడు.

# శ్రీరామకృష్ణ

శంకరాచార్యులు ప్రతిభ అనన్యమైంది. అట్లే చైతన్య ప్రభువు యొక్క, రామానుజులు యొక్క హృదయం అతివిశాలమైంది. ప్రతిభలో శంకరాచార్యుని, హృదయ వైశాల్యంలో చైతన్యునితో పోల్చగల వ్యక్తి ఆవిర్భవించే సమయం ఆసన్న మైంది. ఆ మహావ్యక్తి ప్రతి మతస్థునిలోను ఒకే ఆత్మశక్తి, ఒకే దైవశక్తి అతణ్ణి నడిపిస్తున్నట్లే చూడగల్గాలి. అన్ని జీవులలోను వున్న దైవం ఒకడేయని గమనించాలి. బీదవారిపట్ల, బలహీనుల పట్ల, పీడిత ప్రజానీకం కొరకు వారు ఏ దేశంవారైనా, ఏ మతస్థులైనా – ఆ వ్యక్తి యొక్క హృదయం స్పందించాలి. ఆయన తన ప్రతిభా విశేషాల పటిమతో సర్వమానవ సౌభ్రాతృత్వాన్ని, సర్వమత సామరస్యాన్ని సాధించే ప్రణాళికను సమకూర్చాలి. ప్రపంచంలోని ప్రజలందరికి ఆమోదయోగ్యమైన విశ్వ మతాన్ని రూపొందించగల్గాలి. ఈ యోగ్యతలన్నీ కలిగియున్న మహామహుడు ఉదయిం చాడు. కొన్ని సంవత్సరాలపాటు ఆయన పాదసేవ చేసుకునే మహాద్భాగ్యం నాకు లభించింది. భారతదేశంలోని నగరాలన్నింటికంటే అధికంగా పాశ్చాత్య నాగరికతను ఇముడ్చుకొని, పాశ్చాత్య భావాల పరిధిలో వెఱ్ఱిగా పరుగులిడుతున్న ఒక మహానగర సమీపంలో ఈ మహాత్ముడు తన కార్యకలాపాలను విస్తరించటం ఆశ్చర్యకరం. పుస్తక పఠనం ఏమాత్రంలేని ఈ మహావ్యక్తి అనూహ్యామైన మేధాసంపత్తి గలవారు. వారి పేరును కూడ వారు వ్రాసికోలేరంటే ఆశ్చర్యపడనవసరం లేదు. (తర్వాత జరిపిన పరిశోధనల ఫలితంగా శ్రీరామకృష్ణులు పాశ్చాత్య ప్రమాణాల ప్రకారం నిరక్షరాస్యు లైనా, బెంగాలీభాష చదువగలరు, వ్రాయగలరని ఋజువైంది). కలకత్తా విశ్వవిద్యా లయంలోని ప్రతిభావంతులైన పట్టభద్రులందరు ఈ మహావ్యక్తిలోని అత్యధిక మేధా సంపత్తిని గుర్తించారు. ఆయన మన ఊహాకందని మహామనీషి. ఆ మహామహుడే శ్రీరామకృష్ణ పరమహంస.

ఆయన కలకత్తా నగర సమీపంలో తన నివాసాన్ని ఏర్పరచుకున్నారు. భారత దేశానికి అప్పుడు కలకత్తాయే ముఖ్య పట్టణం. దేశంలోని అతి ప్రముఖమైన విశ్వ విద్యాలయ నగరంగా

కలకత్తా ప్రాముఖ్యం వహించింది. ఈ విశ్వ విద్యాలయం నుండి ప్రతి సంవత్సరం బహుళ సంఖ్యలో భౌతికవాదులు, నాస్తికులు వెలువడేవారు. ఐనప్పటికి వీరిలో చాల మంది రామకృష్ణుని బోధనలను ఆసక్తితో వినుటకు వచ్చేవారు. వారి కీర్తి ప్రతిష్ఠలను విని నేను కూడ వారి ప్రవచనాల్ని వింటానికి వెళ్లాను. ఆయన చాల నిరాడంబరంగా నాకు కన్పించారు. ఆయనలో ఏ విధమైన బాహ్యపటాటోపమూ నాకు కన్పించలేదు. వారి బోధనల్లో వారు చాల సామాన్యమైన భాషను ఉపయోగిం చారు. ఈయన గొప్ప బోధకుడు కాగలడాయనే సందేహం నాకు కల్గింది. ఆయనకు చాల సమీపంగా జరిగి వారిని, లోగడ నా జీవితంలో చాల మందిని ప్రశ్నించిన విధంగానే ఇలా ప్రశ్నించాను. "స్వామీ, భగవంతుడున్నాడని మీరు విశ్వసిస్తున్నారా?" ఆయన అవునన్నారు. 'మీరు ఋజువు చేయగలరా?' అన్నాను. 'చేయగలను'. 'ఎలా' అని నేనన్నాను. "నిన్ను ఇక్కడ ఏ విధంగా చూస్తున్నానో, భగవంతుని నేను అంతకంటే స్పష్టంగా చూడగల్గుతున్నాను." ఆ జవాబుతో నేను వెంటనే ప్రభావితుడనయ్యాను. మొట్టమొదటిసారిగా భగవంతుణ్ణి నేను చూచాను, మతమనేది ఇతర ప్రాపంచిక విషయాలవలెనే అతి స్పష్టమైన ఉనికిగల్గి మనం భావించి, అనుభవించే యదార్థమైన విషయమని నిర్భయంగా ప్రకటించగల్గిన వ్యక్తిని కనుగొనగల్గాను. నేను ప్రతిరోజు ఆయన వద్దకు వెళ్లటం ఆరంభించాను. మతతత్వాన్ని ఒకరి నుంచి మరొకరు పొంద వచ్చని గ్రహించాను. ఒక స్పర్శ ద్వారా, ఒక దృక్కు ద్వారా ఒక మనిషి పూర్తి జీవితంలో పరివర్తనం సాధించవచ్చు. నేనా మహనీయుని స్వయంగా దర్శించిన మరుక్షణం నుండి నాలోని సంశయపు నీడలన్నీ పటాపంచలయ్యాయి.

మా గురువుల సమక్షంలో ఈ దేహాన్ని ధరించి గూడ మానవుడు ఉత్తీర్ణతను సాధించవచ్చని తెలుసుకున్నాను. ఆయన ఎవరిని దూషించి ఎరుగడు, ఎవరిని విమర్శించి ఎరుగడు. ఆయన దృష్టిలో చెడు అనేది లేదు. ఆయన మనస్సు చెడును గురించి ఆలోచించే శక్తిని కోల్పోయింది. ఆయన మంచిని తప్ప ఇతరాన్ని చూడగల్గే వారు కాదు. ఆయనలోని అత్యద్భుతమైన పవిత్రత, అనన్యమైన వైరాగ్యభావం ఆయన ఆత్మజ్ఞానిగా భాసించటానికి

దోహదం చేశాయి.

వ్యక్తి విరాగి కాకుండా ఆత్మజ్ఞాని కాలేడు. పారమార్థిక చింతనకు వైరాగ్య ప్రవృత్తి మూలస్తంభం. వైరాగ్య ప్రవృత్తి సన్నగిల్లిన కొద్దీ వాంఛాప్రవృత్తి ప్రబలమై ఆధ్యాత్మిక చింతనకు ప్రతిబంధకమౌతుంది. ఆ మేరకు ఆత్మజ్ఞానం కూడా క్షీణిస్తుంది.

వైరాగ్యానికి ప్రతిరూపమే ఆయన. మన దేశంలో సన్యాసాశ్రమం స్వీకరించ దలచిన వ్యక్తి సర్వసంగపరిత్యాగి అయి తీరాలి. మా గురువర్యులు అక్షరాల ఆ సూత్రాన్ని అమలు చేశారు. ఆయన బహుమానాలు స్వీకరిస్తే చాలు వేలకు వేలు ధనం ఇచ్చి ఆయన ఆశీస్సులు పొందటానికి అనేకులు సంసిద్ధతను చూపేవారు. కాని ఆయన అలాంటి వారికి దూరంగా వుండేవారు. ప్రాపంచిక వ్యామోహాలకు, ధన కాంక్షకు అతీతులై వాటిపై ఆధిపత్యాన్ని సాధించిన సజీవ పాత్రను ఆయన పోషించారు. వారి భావనలో కూడ విషయ వాంఛలకు తావులేదు. ఈ యుగంలో అలాంటి మహనీయుల ఆవశ్యకత ఎంతైనావుంది.

పాశ్చాత్య దేశాల్లో స్త్రీ ఆరాధింపబడుతున్నట్లు వింటాం. కాని ఆ ఆరాధన మామూలుగ ఆమె యౌవనానికి, సౌందర్యానికి మాత్రమే పరిమిత మౌతుంది. కాని ఈ మహనీయుడు స్త్రీని మాతృస్వరూపిణిగా ఎంచి ఆరాధించేవారు. సంఘ బహిష్కృతు లైన స్త్రీల ముందు నిలచి పాదాక్రాంతుడై అశ్రుతర్పణంతో వారితో ఇలా మాట్లాడటం నేను స్వయంగా చూచాను. "ఓ మాతృమూర్తీ, ఒక రూపంలో నీవు బజారులో దర్శన మిస్తావు. మరొక రూపంలో నీవే విశ్వమాతవు అవుతావు. ఎప్పటికీ నీవు మాతృమూర్తివే. నీకు శతాధిక వందనములు." మోహకలుషితమైన భావనలకు ఆయన మనస్సులో చోటు లేదు. ప్రతి స్త్రీ ముఖంలోను, లోక రక్షకియగు జగజ్జననిని దర్శించి ప్రేమించి ఆరాధించగల ఆ మహామహుని జన్మ చరితార్థము. వ్యక్తి ఆత్మజ్ఞాని కావాలంటే ఆయనకు అలాంటి పరిపూర్ణ స్వచ్ఛత సిద్ధించాలి.

ఇతరుల యెడ వాత్సల్యాన్ని ప్రదర్శించటం వారి జీవితంలో మరొక ఆదర్శం. మా

గురువుల జీవితంలోని ప్రథమాధ్యాయం తాను దైవజ్ఞానిగా రూపొందటానికి వినియోగింపబడితే, మిగిలిన జీవితకాలం ఆ జ్ఞానాన్ని మానవాళికి అందజేయటానికి ఉపయోగపడ్డది. ప్రజలు తండోపతండాలుగా ఆయన బోధనల్ని వినటానికి వస్తే ఆయన దినంలోని 24 గంటల్లో సుమారు 20 గంటలు వారికి బోధించటంలో గడిపేవారు. అలా నెలల పర్యంతం విరామం లేకుండా ప్రజలకు బోధించుటలో గడపుటచే ఆ ఒత్తిడిని తట్టుకోలేక శరీరారోగ్యం శిధిలమైంది. మానవులపట్ల ఆయనకున్న ప్రేమ అపారం. ఎంత తక్కువస్థాయి వాడు వచ్చి ఆయన సహాయాన్ని అర్థించినా కాదనకుండా, తన శక్తివంచనలేకుండా ఆయన ఆదరించేవాడు. చివరకు ఆయన గొంతులో తీవ్ర అపసవ్య పరిస్థితి ఏర్పడింది. ఐనప్పటికీ ఆయన తన బోధనా కార్యక్రమాల్ని ఆపలేదు. వలదని వారించే ప్రయత్నాలన్నీ విఫలమయ్యాయి. ఎవరైనా తన దర్శనాన్ని అర్థిస్తూ వస్తే, వారిని తన ఎదుటకు రప్పించి వారి సందేహాలను తీర్చే వరకూ విశ్రమించే వారుకాదు. వారి ఆరోగ్యాన్ని గురించి వారిని తన అంతేవాసులు హెచ్చరిస్తే వారిని లెక్కచేసేవారు కాదు. “నన్ను గురించి నేను జాగ్రత్త పడను. ఒక వ్యక్తికి సహాయం చేయుటకు ఇలాంటి శరీరాలు వేలు అయినా అర్పిస్తాను. ఒక వ్యక్తికి సహాయపడుటలో వున్న ఔచిత్యం గణనీయమైంది” అనే వారు.

ఈ రోజు నేను మీకు ఏదైనా ఒక ధర్మాన్ని చెప్పియుంటే అది మా గురువర్యుల కటాక్షమే. మీకు అసత్యాలు, అప్రమాణాలు, నిరుపయోగమైనవి చెప్పియుంటే అవి నా మాటలే. వాటికి బాధ్యత నాదే.

జాతి అభ్యున్నతి సాధించాలంటే దాని ముందు ఉన్నతాశయం వుండాలి. నిర్వికార బ్రహ్మతత్వమే మనకిప్పుడు ఆదర్శం. కాని మీరు నిరాకార ఉపాసన ద్వారా స్పందనను పొందలేరు గనుక సాకార ఆరాధనాదర్శం మీకు కావాలి. అది మీకు శ్రీరామకృష్ణుడనే వ్యక్తిలో లభిస్తుంది. ఇతర పురుషులు మనకు ఆదర్శం కాలేరు. ఎందుకంటే వారి చరిత్ర అంతరించింది. ప్రస్తుతం వేదాంత ధర్మాలు ప్రతివాని ఆచరణకు రావాలంటే ఇప్పటి మానవ

సంతతిని సమాదరించి ప్రేమించే వ్యక్తి వుండాలి. అలాంటి పురుషుడు మనకు శ్రీరామకృష్ణునిలో లభ్యమౌతాడు. కనుక మనం ఆయనను ప్రజలందరి ముందువుంచాలి; ఆయన్ని సాధువుగాగాని, అవతార పురుషునిగాగాని, ప్రజలు ఎలా ఆమోదించినా ఫరవాలేదు.

భగవంతుడు సర్వవ్యాపకుడైనా ఆయన్ని మనం తెలుసుకోవాలంటే ఒక మానవ రూపంలోను, మానవ రూపం ద్వారా మాత్రమే సాధ్యమవుతుంది. మానవు లలో రామకృష్ణునివలె పరిపూర్ణ ఆదర్శమూర్తి మనకు మరొకరు కన్పించరు. కనుక మన మందరం వారిని కేంద్రంగా నిలిపి వారికి సన్నిహితులం కావాలి. ప్రతివారు వారి వారి సంస్కారాన్ని బట్టి వారి ఇచ్ఛవచ్చిన రీతిలో ఆయన్ని భగవంతునిగానో, రక్షకునిగానో, గురువుగానో, బోధకునిగానో భావించి గౌరవించాలి. సంకుచితమైన సమాజంలో ఆధ్యాత్మికత బలీయంగా వుంటుంది. తక్కువ వెడల్పులో ప్రవహించే ప్రవాహానికి వేగం యెక్కువ. ఒక సంపూర్ణ సమాజంలో విశాల దృక్పథం గోచరిస్తుంది. కాని భావనలలో లోతు, దార్ఢ్యత అంతేమేరకు లోపిస్తాయి. కాని రామకృష్ణుని జీవితం చారిత్ర్యక సత్యాల్ని తలక్రిందులు చేస్తుంది. రామకృష్ణునిలో సముద్రం కంటే లోతైన, ఆకాశం కంటే విశాలమైన భావసముద్రం నెలకొని వున్నాయి. ఇదియొక అపురూప సృష్టి.

శ్రీరామకృష్ణుని అనుభవాల్ని ఆధారంగా చేసికొని మనం వేదాల్ని వ్యాఖ్యానించు కోవాలి. ప్రాచీనకాలంలో వేదాంత ధర్మాల్లోని పరస్పర వైరుధ్యాల్ని శ్రీకృష్ణపరమాత్ముడు గీత ద్వారా కొంత వరకు నివృత్తి చేశాడు. వాటినే పూర్తిగా నిర్మూలించటానికి ఈ యుగంలో శ్రీరామకృష్ణుని రూపంలో భగవానుడే అవతరించాడని భావించవచ్చు. కనుక వేదాల్ని, వేదాంతాన్ని సవ్యంగా అవగాహన చేసికోవాలంటే శ్రీరామకృష్ణుని ప్రవచనాలను దృష్టిలో పెట్టుకొని వాటిని అధ్యయనం చేయాలి. శ్రీరామకృష్ణులు తన జీవితంలో ఆ ధర్మాల్ని అనుభవించి బోధించాడు. “పరస్పర వైరుధ్యాలనబడేవి మన ధర్మశాస్త్రాల్ని లాంఛనప్రాయంగా పైపైన చదివిన వారికే గోచరిస్తాయి. జిజ్ఞాసువుల్లో భిన్న భిన్న స్థాయిల

వారికి అనుగుణంగా శాస్త్ర ధర్మాల్ని పరిణామ క్రమంలో ఏర్పాటు చేశారు". అని రామకృష్ణ తమ బోధనల్లో వ్యక్తీకరించారు.

శ్రీరామకృష్ణులు స్త్రీ వ్యామోహం, ధనాకాంక్షలను పరిత్యజించాలని ప్రబోధించే వారు. అదే విధంగా భగవంతుని సర్వవ్యాపకత్వాన్ని పరిమితం జేసి తగుమాత్రపు పరిధుల్లో ఆయన్ని స్థాపించుకోవాలని కూడ వారు అంతే శ్రద్ధతో సూచించేవారు.

వారిలాంటి విలక్షణమైన వ్యక్తి, కర్మ, భక్తి జ్ఞాన, వైరాగ్యాలకు నిధియైన మహామనీషి మనకు మానవుల్లో ఇంతవరకు తటస్థపడలేదు. ఒకే వ్యక్తిలో అతి విశాలదృక్పథం, అనంతమైన సామరస్యభావం, అమితమైన శ్రద్ధ – ఈ గుణాలన్నీ ఇమిడి వుండవచ్చని మనకు శ్రీరామకృష్ణుని జీవితం ఋజువు చేస్తుంది. వ్యక్తుల కూటమే సమాజం కనుక అలాంటి సమాజాన్ని నిర్మించుకోవచ్చని కూడ ఆయన జీవితం ప్రస్ఫుటీకరిస్తుంది.

ఏ వ్యక్తి యొక్క నడత పరిపూర్ణ స్వచ్ఛతను సమకూర్చుకొని, బహుముఖంగా వికసిస్తుందో అతడే శ్రీరామకృష్ణుని నిజమైన శిష్యుడు, అనుయాయుడు. అలాంటి స్వచ్ఛమైన నడతను అలవరచుకొనుటే ఈ యుగానికి అత్యంతావశ్యకమైన ఆదర్శం.

కనుక శ్రీరామకృష్ణునికి సముడైన మరొక వ్యక్తి లేడని ఇంతవరకు మనం చేసిన చర్చల సారాంశమని నిర్ధారితమైంది. ప్రపంచంలో మరెక్కడా కూడ ఆయనలోని సంపూర్ణత్వం, దయార్ద్రత, ఆర్తజనవాత్సల్యం మనకు కన్పించవు.

వేదాలుగాని, వేదాంతాలుగాని, భగవద్గీతగాని, ఇతర పురాణాలు గాని – వీటి యొక్క మర్మాలను అవగాహన చేసికోవాలంటే ముందు మనం రామకృష్ణ పరమహంసను, ఆయన బోధనలను అధ్యయనం చేయాలి. ఆయన జీవితమే ఒక అనంతశక్తిగల కాంతిదీపం. దాని ఉజ్జ్వల తేజోకిరణాలు భారతీయ ఆధ్యాత్మిక విజ్ఞాన భావసముదాయంపై ప్రసరిస్తూనే వుంటాయి. వేదవిజ్ఞానానికి, లక్ష్యానికి ఆయన జీవితమే ఒక సజీవ వ్యాఖ్య. ఒకే ఒక జీవితంలో

భారతదేశంలోని జాతీయ ఆధ్యాత్మిక జీవన పరంపరను మొత్తం ఆయన ప్రతిబింబింప చేశాడు.

రామకృష్ణ పరమహంస ప్రేమకు, జ్ఞానవైరాగ్యాలకు, సామరస్యతకు, మానవ సేవకు నిలయమై, పరిపూర్ణుడైన వ్యక్తిగా భాసించిన వారిలో ఆఖరివారు. కనుక ఆయనతో పోల్చదగినవారు మనకు కానరారు. ఆయన్ని అర్థం చేసికోలేని వ్యక్తి జీవనం వ్యర్థం. నా జన్మపరంపరలో నేనాయనకు సేవకునిగా జీవించటమే నా మహద్భాగ్యమని భావిస్తాను. వేద, వేదాంగాల్లోని సూక్తులకంటే నాకు ఆయన నోటి నుండి వెలువడే వాక్కు ఎక్కువ బలీయమైంది. నేను ఆయన దాసులయొక్క దాసులకు సేవకుణ్ణి. కాని సంకుచిత మతమౌఢ్యం ఆయన సిద్ధాంతాన్ని వ్యతిరేకిస్తుంది. అదే నాకు చాల బాధాకరమైన అంశం. అంతకంటే ఆయన పేరు పాతాళంలోకి క్రుంగినా ఫరవాలేదు. వారి బోధనలు మాత్రం ఫలవంతమైతే చాలు. ఆయన కీర్తి ప్రతిష్ఠల కొరకు ఎన్నడూ తలవంచలేదు, ఉబలాటపడలేదు.

ఆధునిక భారతదేశం యొక్క ప్రగతి, దాని స్వర్ణయుగం శ్రీరామకృష్ణుని జన్మతోనే ఆరంభమయ్యాయి.

రామకృష్ణుని అవతార కాలంలో అంతులేని విజ్ఞాన సంపద, మితిమీరిన ప్రేమ, అవధుల్లేని కార్యదీక్ష, జీవులపట్ల అపారమైన కారుణ్యభావం సమాజంలో పరిఢవిల్లాయి. ఆయన పటిమను సంపూర్ణంగా అర్థం చేసుకున్నవారు తక్కువే. మొత్తం భారతజాతి కొన్ని యుగాల కాలంలో యోచనచేసిన విషయాలను ఆయన తన ఒక్క జన్మలో ఆచరించి చూపించారు. అన్ని జాతుల మతప్రామాణిక గ్రంథాలకు ఆయన జీవితమే ఒక సజీవ విమర్శ.

భారతదేశం, దానితోబాటు నిత్యప్రామాణికమైన మతం దీర్ఘకాలం పతనాన్ని చవిజూసింది. కాని భగవానుడు దయామయుడు. ఆయన తన సంతతిని రక్షించ టానికి పూనుకున్నాడు. భారతజాతి పతనస్థితి నుండి తనను పునరుద్ధరించుకోటానికి అవకాశం

లభించింది. భరతజాతి పునరుత్థానం సాధించాలంటే శ్రీరామకృష్ణుని పాదపద్మాల్ని ఆశ్రయించాలి. ఆయన జీవిత విశేషాల్ని, ప్రబోధాల్ని సర్వత్రా విస్తరింప చేయాలి. వానిని సమాజం యొక్క అణువణువులోను చొప్పింపచేయాలి. దాన్ని ఎవరు సాధిస్తారు? రామకృష్ణుని సందేశమనే పతాకాన్ని ప్రపంచం నలుమూలల ఎగురవేసి ప్రపంచ ప్రజల విముక్తికి ఎవరు దోహదం చేస్తారు? ఎవరు తమ ధనమాన ప్రాణాలను త్యాగం చేసి ఈ పతన వెల్లువను అరికట్టి జాతుల్ని పునరుద్ధ రిస్తారు? ఈ బృహత్కార్యానికై పరమాత్ముడు ఎవరిని నిర్దేశిస్తాడో ఆ వ్యక్తికి మన జోహార్లు.

రామకృష్ణ పరమహంస ప్రపంచ శ్రేయస్సుకై ఉద్భవించిన కారణజన్ములు. ఆయన్ని మనషి అనండి, భగవంతుడనండి లేదా అవతారపురుషుడనండి. మీ దృష్టితో ఆయన్ని చూచి మీమీ ప్రవృత్తులననుసరించి ఆయన్ని స్వీకరించండి. ఎవరు ఆయన ముందు మోకరిల్లి ఆయన ఆశీస్సులను పొందుతారో వారాక్షణం నుండి పవిత్రమూర్తు లౌతారు. యువకులారా, మీరీ సందేశాన్ని తీసికొని గడప గడపకు వెళ్లి ప్రచారం చేయండి. మీలో రగులుతున్న అశాంతి అలజడులు మాయమౌతాయి.

సమాజాన్ని, కాదు మొత్తం ప్రపంచాన్ని చైతన్యవంతం చేయాలి. వ్యర్థప్రలాప నలుగాని, ఫలరహిత క్రతువులుగాని నిష్ప్రయోజనం. ఒక బ్రహ్మాండమైన ఆధ్యాత్మిక వెల్లువ ప్రవహించనున్నది. ఎవరు తక్కువ స్థాయిలో వుంటారో వారు ఉన్నతులౌతారు. ఎవరు అజ్ఞానులుగా వుంటారో వారే విద్యాధికుల యొక్క బోధకులౌతారు. ఇది అంతా పరమాత్మ కరుణవల్ల సాధ్యమౌతుంది. కనుక ఉత్థానులు కండి, జాగరూకులు కండి. గమ్యాన్ని చేరేవరకు విశ్రమించకండి. ఎప్పుడూ విస్తరించేదే జీవితం. కుంచిం చుకుపోవటమే మరణం. ఎల్లప్పుడు తన యోగక్షేమాలు మాత్రమే పరిరక్షించుకుంటూ, సోమరిగా జీవితం గడిపే స్వార్థపరునికి నరకంలో కూడ స్థానం లభించదు. ఎవరైతే సర్వప్రాణుల యెడ కారుణ్యాన్ని ప్రదర్శించి వాటి రక్షణలో అహర్నిశలు తమ్ము తాము త్యాగం చేసికొని శ్రమిస్తారో వారే శ్రీరామకృష్ణుని

నిజమైన బిడ్డలు. తదితరులు అనాగరికులే. ఈ ఆధ్యాత్మిక పునరుత్థాన తరుణంలో ఎవరు దృఢ సంకల్పంతో నిలబడి పరమహంస యొక్క సందేశాన్ని వాడవాడలా, పల్లెపల్లెలా విస్తరిస్తారో వారే ఆయనకు వారసులు, నాకు సోదరులుగా భావింపబడతారు. ఇది ఒక పరీక్ష. రామకృష్ణుని వారసుడు తన స్వలాభాన్ని అపేక్షించదు. తన ప్రాణత్యాగాన్ని కూడ లెక్క పెట్టక పరుల యోగక్షేమాలకై పాటుపడుటకు యోచిస్తాడు.

నేను ఈ రోజు ఇలా వున్నా, ప్రపంచమంతా ఒక రోజు ఉచ్ఛస్థితిలో వున్నా దానికి కారణం మా గురువర్యులైన శ్రీరామకృష్ణులే.

# దివ్య ప్రబోధాలు

సాహస వచనాలు, అంతకుమించిన సాహసకృత్యాలు మనకు అత్యావశ్యకాలు. ప్రపంచం దీనస్థితిలో కుమిలిపోతోంది. అందరు లేవండి, మేల్కొనండి. నిద్రకు ఇది సమయం కాదు. నిద్రిస్తున్న దేవతలను మేల్కొలపాలి. మన దీనాలాపాలు వారు వినాలి. మనలోని దైవం జాగ్రదావస్థలోకి రావాలి. మన జీవితాలకు ఇంతకంటే సార్ధకత ఏముంటుంది? ఇంతకంటే మనం నిర్వర్తించవలసిన కర్తవ్యమేముంటుంది?

పిరికివారు, బలహీనులు మాత్రమే పాపాలు చేస్తారు, అసత్యాలు వల్లిస్తారు. ధీరులన్నివేళలా నీతిని పాటిస్తారు. కనుక నైతిక ధర్మాన్ని విడనాడవద్దు. ధీరులుగా వుండటానికి ప్రయత్నించండి. కారుణ్యాన్ని ప్రదర్శించండి.

బయటకు రండి. మానవత్వాన్ని నిలుపుకోండి. మీ గృహ కూపాల్లోంచి బయట పడి బాహ్య ప్రపంచాన్ని పరిశీలించండి. జాతులన్నీ అభ్యున్నతి పథంలో ఎలా పయ నిస్తున్నాయో చూడండి. మానవుల్ని, దేశాన్ని ప్రేమించే మీరు మంచికొరకు ఉన్నతి కొరకు సమిష్టిగా శ్రమించాలి. వెనుక చూపువద్దు. మీ ఆత్మీయులు మీ కొరకు రోదిస్తున్నా లెక్క చేయవద్దు. పురోగమనమే మన లక్ష్యం.

భారతదేశం కనీసం ఒక వెయ్యిమంది యువకుల త్యాగాన్ని కోరుతోంది. ఆ యువకులు కూడ మనసున్నవారు కావాలి, అవివేకులు కాదు.

మీ కర్తవ్యాన్ని మీరు ఆర్భాట రహితంగా, ప్రశాంతంగా నిలకడతో నిర్వర్తించాలి.

పేరుప్రతిష్ఠలను గాని, పత్రికల ద్వారా ప్రచారాన్ని గాని కాంక్షించకూడదు.

సమత్వ దృష్టిలోను, స్వేచ్ఛా ప్రవృత్తిలోను, కార్యనిర్వహణలోను, శక్తి ప్రదర్శన లోను పాశ్చాత్యుల్లో పాశ్చాత్యుడవుగాను, మతసంస్కారాలు, ప్రవృత్తుల విషయంలో అసలుసిసలైన హైందవునిగాను నడచుకోగల్గాలి. ఇది నీవు తప్పక సాధిస్తావు. మీలో మీకు ఆత్మవిశ్వాసం వుండాలి. మన విశ్వాసాలే మన ఘనకార్యాలకు జన్మనిచ్చే మాతృరూపాలు. పేదలపై, పీడిత ప్రజానీకంపై కరుణను ప్రసరింపజేస్తూ లక్ష్యసాధనకై మనం పురోగమిద్దాం.

ఏ జాతినైనా, ఏ మానవున్నైనా ఉన్నత స్థితికి చేర్చాలంటే మూడు ధర్మసూత్రాలను పాటించాలి. అవి :

1. మంచితనానికున్న శక్తుల్లో విశ్వాసం
2. అసూయగాని, అనుమానంగాని లేకుండా వుండటం
3. సన్మార్గులకు, మనకు మంచి చేసే వారికి చేయూత నివ్వటం.

దేనికొరకు, ఎవరికొరకు వేచియుండకూడదు. మనకున్న శక్తితో కార్యాన్ని నిర్వర్తించాలి. ఇతరులపై ఆశను పెంచుకోకూడదు.

గొప్ప ఫలితాలు సాధించాలంటే త్యాగాలు ఘనంగా వుండాలి. స్వార్థపరత్వానికి, పేరు ప్రతిష్ఠల కొరకు ప్రాకులాడే యోచనకు తావుండకూడదు. సాహసంతో, దీక్షతో పనికి మీరందరూ అంకితం కావాలి. పేరుకోసం, ప్రచారం కోసం తాపత్రయపడి ఆగవద్దు. స్వార్థాన్ని త్యజించి శ్రమించండి.

మిత్రులారా, 'గమ్యం చేరేవరకు ఆగవద్దు. జాగృతులు కండి' అని వేదాలుచెప్తున్నాయి. దీర్ఘ అంతమౌతోంది. పగలు సమీపిస్తోంది. చైతన్యపుటల లేస్తోంది.ఉవ్వెత్తున ఉప్పొంగే ఉప్పెన తీవ్రతను ఎవరూ నిరోధించలేరు. ఆవేశపూరితులు కండు; ప్రేమతత్వాన్ని వీడవద్దు;

విశ్వాసాన్ని, నమ్మకాన్ని సడలనీయకండి. భయం విడనాడండి.భయమే పెద్ద పాపం.

ఆరంభం అతి స్వల్పంగా వుందని నిరాశపడవద్దు. ఘనమైన ఫలితాలు క్రమంగాసమకూరుతాయి. సాహసాన్ని ప్రదర్శించండి. మీ సహచరులకు నాయకత్వం వహించేతలంపువద్దు. వారికి మీ సేవలను అందించండి. ప్రజలపై ఆధిపత్యం నెరపాలనేవ్యసనం జోలికి పోవద్దు. ఆ వ్యసనం వల్ల సమాజమనే నౌకలు జీవితమనే వారధిలోమునిగిపోయిన నిదర్శనాలు ఎన్నో వున్నాయి. కనుక ఈ విషయంపై శ్రద్ధ చూపండి.మరణించేవరకు నిస్వార్థపరత్వంతో కృషి చేయండి.

గట్టి కృషి చేస్తూ పవిత్రంగా, నిష్కల్మషంగా నడచుకుంటే ఆవేశజ్వాల మీలోప్రవేశిస్తుంది.

యోధులారా, మీరు ఉత్కృష్టఫలితాల్ని సాధించటానికే జన్మించారని విశ్వసించండి. చిన్న చిన్న అరుపులకు భీతిచెందవద్దు. అంతేకాదు పెద్ద పెద్ద ఉరుములను కూడ లెక్కచేయొద్దు. స్థిరంగా, ధైర్యంగా నిలబడి కృషి సాగించండి.

ప్రజలు మిమ్మల్ని గురించి ఏమి మాట్లాడినా సరే నిరుత్సాహపడవద్దు. మీ విశ్వాసాలకు మీరు బద్ధులుకండి. ప్రపంచమంతా మీకు పాదాక్రాంతమవుతుంది.మీరు నిశ్చింతగా వుండవచ్చు. 'వారిని నమ్ముకో, వీరిని నమ్ముకో' అని మీకు సలహాలుచాల మంది ఈయవచ్చు. కాని నేను మీకు చెప్పేది ఒక్కటే. మీపై మీకు విశ్వాస ముండటమే ముఖ్యం. ఆ విశ్వాసంతోనే ముందుకు నడవండి.

'నేను అన్నిటిని సాధించగలను' అనే ధీమా ప్రదర్శించు. విషసర్పం యొక్క విషం కూడ నిన్నేమీ చేయలేదు, ఆ విషం నన్నేమీ చేయలేదని నీవు ధైర్యంగా ప్రకటించగల్గితే, భయరహితంగా నీశక్తి సామర్థ్యాలను వినియోగించి శ్రమిస్తే నీకు తిరుగువుండదు. నిన్ను ఆపగల శక్తి ఎవరికి వుండదు. భయాన్ని పారద్రోలు.

వైరాగ్యాన్ని, దాని ఆవశ్యకతను గురించి మీరందరూ ప్రజలకు బోధించాలి. మీ బోధనల్లో దీనికి ఎక్కువ ప్రాముఖ్యత ఇవ్వాలి. ప్రాపంచిక విషయాలపట్ల వ్యక్తి విరక్తుడైతే తప్ప అతని ఆధ్యాత్మిక ప్రవృత్తి బలపడదు.

సాహసంతో అన్నీ క్రమక్రమంగా సమకూరుతాయి. మీరందరూ మీ శ్రేయస్సునే, మీ ఆధిక్యతనే పెంపొందించుకునే యత్నం మానాలి. అలాగే ముతాతత్వాన్ని, అసూయా ద్వేషాల్ని విసర్జించాలి. భూదేవితో పోల్చగల సహనాన్ని మీరు అలవరచుకోవాలి. వీటనన్నిటిని మీరు సాధించగల్గితే ప్రపంచాన్ని జయించినట్లే.

మిమ్మల్ని గురించి ఇతరులు ఏ విధంగా భావిస్తారో అనే విషయాన్ని మీరు పట్టించుకోవద్దు. వారేమనుకున్నా మీ పవిత్రత యొక్క, నైతిక ప్రవృత్తి యొక్క, ఈశ్వర భక్తి యొక్క ప్రమాణాల్ని దిగజార్చుకోవద్దు. భగవంతుని ప్రేమించి ఆశ్రయించిన వారెవ్వరూ ఏ మాయాజాలానికి వశులుగారు. పవిత్రత ఈ లోకంలోనే గాక, స్వర్గ లోకంలో కూడ అత్యున్నతమైన, దివ్యతమమైన శక్తిగా భాసిస్తుంది.

ఒక విధవరాలి దైన్యాన్ని నివృత్తి చేయలేని, ఒక అనాథ యొక్క ఆకలిని తీర్చలేని మతవ్యవస్థపైన, భగవంతునిపైన నాకు విశ్వాసముండదు. ఒక మతం యొక్క సిద్ధాంతాలు ఎంత పవిత్రంగా వున్నా, దాని తాత్త్వికత ఎంత పటిష్ఠంగా నిర్మింపబడ్డా అది కేవలం గ్రంథాలకు, పిడివాదాలకు పరిమితమైయుంటే నేను దాన్ని మతంగా అంగీకరించను. దృష్టినిచ్చే కన్ను మన ఫాలభాగంపై వుంటుంది గాని, వీపుమీద వుండదు. కనుక మీరు ముందుకు సాగండి. ఇది మాదియని సగర్వంగా ప్రకటించుకునే మతాన్ని మాత్రమే అనుసరించి కార్యోన్ముఖులు కండి. భగవంతుని ఆశీస్సులు మీకు ఎప్పుడూ వుంటాయి.

ఏ వ్యక్తి, ఏ జాతి ఇతరులను ద్వేషించి మనజాలదు. మన మేధావులు మ్లేచ్ఛ శబ్దాన్ని సృష్టించి ఇతరులతో కలసిమెలసి జీవించటం ఏ రోజున మానినారో ఆ రోజునే భారతదేశం

యొక్క పతనం నిర్ణయమైంది. కనుక ఆ స్థితి నుండి మనం జాగ్రత్త పడాలి. వేదాంతాన్ని గురించి మాట్లాడటం తేలికేగాని దాని కనీస ధర్మాన్ని కూడ ఆచరణలో పెట్టటం దుర్లభం.

తన సహచరులకు మంచిని చేసే యోచనలేని సన్యాసి ఒక మూర్ఖుడుగాని, సన్న్యాసికానేరదు.

విద్యావంతుడై శ్రామికుల, బీదప్రజల శ్రమ ఫలితంగా సుఖాల్ని అనుభవిస్తూ ఆ పీడిత ప్రజానీకాన్ని గూర్చి ఆలోచించని వ్యక్తిని నేను దేశద్రోహిగా పరిగణిస్తాను. ధనికులు, జమిందారులు, మతాధికారులు, రాజులు తమ సంపద, అధికారం బీదప్రజల కాయకష్టం వల్లనే సమకూరాయని గుర్తించి ఆ ప్రజల యోగక్షేమాన్ని గురించి ఆలోచించినట్లు చరిత్రలో ఏ కాలంలోనైనా మీరు గమనించారా?

ఈ లక్షలాది దీనజనోద్ధరణకై పాటుపడాలనే తలంపు ఎవ్వరికి కల్గుతుంది? జాతి అంటే కొద్దివేల మంది పట్టభద్రులు, బహుకొద్ది మంది ధనికుల సముచ్చయం కాదు. మన దేశంలో వున్న సదుపాయాలు తక్కువేనని నేను అంగీకరిస్తాను. ఐనా మనం ప్రయత్నిస్తే ముప్పదికోట్లపైన వున్న ప్రజలకు ఆహారాన్ని, బట్టను సమకూర్చి వారి సుఖజీవనానికి తోడ్పడటం దుర్లభంకాదు.

అది సాధించాలంటే ప్రజలపై వాత్సల్యాన్ని, సానుభూతిని పెంచుకోవాలి. ప్రేమ కంటే మించిన భగవదారాధన లేదు.

ఒక వ్యక్తి గాని, జాతిగాని ఇతరులతో సంబంధబాంధవ్యాలు పెట్టుకోకుండా, తామే గొప్పని, తమ మతం తమ ఆచారవ్యవహారాలు శ్రేష్ఠమని భావించి ఏకాకి జీవితాన్ని ఏర్పరచుకుంటే, అదే ఆ వ్యక్తికి, జాతికి పతనకారణమౌతుంది.

ఇచ్చిపుచ్చుకునే ధర్మాన్ని అవలంబించాలి. భారతదేశం తిరిగి ఔన్నత్యస్థితి

సాధించాలంటే తనకున్న సంపదను ప్రపంచంలోని ఇతర జాతులకు అందుబాటులో వుంచాలి. ఆయాజాతుల సంపదను మనకు అవసరమైనంత వరకు స్వీకరించటానికి సిద్ధంగా వుండాలి. విస్తరణే జీవితం; సంకుచిత తత్వమే మరణం. అలాగే ప్రేమతత్వమే జీవ చిహ్నం, ద్వేషభావం మరణ సదృశం.

ఇతరులకు స్వేచ్ఛను ఈయకపోతే తాను దాన్ని అనుభవించటానికి అనర్హు డౌతాడు. మనం వృధావ్యధలకు ప్రయాసలకు లోనై మన శక్తిని వ్యర్థం కావించకుండా మన సిరితో ప్రశాంతంగా నిర్మాణాత్మకమైన కార్యక్రమం తీసికొని శ్రమిద్దాం. వ్యక్తికి తన అర్హతను బట్టి ఫలాన్ని అనుభవించే హక్కువుంది. ఆ హక్కును ప్రపంచంలో ఏ శక్తి నిరోధించలేదని నేను విశ్వసిస్తాను. మన గతం చాల యోగ్యమైనదే. కాని మన భవిష్యత్తు కూడ అంతకుమించి యోగ్యదాయకంగా పరిణమిస్తుందని నా నమ్మిక.

పరోపకారమే జీవితం. ఇతరులకు మంచి చేయని వాడు మృతునితో సమానం. నూటికి తొంబదిమంది మూర్ఖమానవులు మృతులే. ఎవరు తోటి మానవులను ప్రేమిస్తారో వారే చైతన్యవంతులైన జీవులు. మిగిలిన వారు నిశ్చేతనులైన మృతులతో సమానమే. మనం అందరం బీదల కొరకు, అమాయకుల కొరకు, పీడిత ప్రజల కొరకు హృదయం ద్రవించేవరకు ఆవేదన చెందవలసినదే.

మానవ జీవితంలో ప్రముఖపాత్ర వహించేవి ధనం కాదు, పేరు ప్రతిష్ఠలు అంతకంటే కాదు; విజ్ఞానం కూడ కాదు. జీవితంలో రాణించేవి ప్రేమ, దానితోబాటుదుర్భేద్యమైన కష్టాల కట్టడాలను ఛేదించి ముందుకుసాగే నడత.

ఈ లోకంలో నన్ను తిండికి మాడ్చి, స్వర్గలోకంలో నాకు సర్వసుఖాల్ని శాశ్వతంగా సమకూర్చే భగవంతునిపై విశ్వాస ముంచలేను.

భారతదేశంలోని బీద ప్రజల కందరకు చాలినంత ఆహారాన్ని సమకూర్చాలి.దేశంలో

విద్యావ్యాప్తి విస్తృతంగా జరగాలి. మత ప్రచారకుల దుర్నీతిని తొలగించాలి.వీటిని సాధించుట ద్వారా దేశ అభ్యున్నతిని ఆర్జించాలి. సాంఘిక దౌర్జన్యానికి, మత ప్రచారకుల కుతంత్రానికి స్థానముండకూడదు. ఆహారం సమృద్ధిగా వుండాలి. ప్రజలందరూ జీవించటానికి అవకాశాలు మెండుగా వుండాలి.

మనలోని చైతన్య జ్యోతి ప్రజ్వరిల్లాలి. ఆ కాంతి నలుమూలలా వ్యాపించి మనలను కార్యోన్ముఖులను కావించాలి. ప్రజలకు నాయకత్వం వహించేటప్పుడువారికి సేవకులవలె మనం నడచుకోవాలి. స్వార్థాన్ని విడనాడి కృషి చేయాలి. చెప్పుడు మాటలకు చెవి యొగ్గకూడదు. వీటన్నిటితోబాటు అపరిమితమైన సహనాన్ని అలవరచుకుంటే విజయం మన పాదాక్రాంతమౌతుంది.

వీరులవలె ముందుకు సాగాలి. ధనం యొక్క ప్రశ్నలేదు. ప్రజల సహకారంకోసం చూడకూడదు. హృదయాల్ని ప్రేమతో నింపండి. భగవంతునిపై విశ్వాసముంచండి. ప్రగతి మార్గంలో నడవండి. మిమ్మల్ని ఏ శక్తీ నిరోధించలేదు.

పని సాధించేటప్పుడు తొందరపాటుతనం పనికిరాదు. పవిత్రత, సహనం, పట్టుదల, అన్నిటిని మించి ప్రేమభావం, ఇవి ప్రధానంగా వుంటే మనం సాధించలేనిది ఏదీ వుండదు. మనకు సమయం సమృద్ధిగా వుంది. వేగిరపాటుకు ఆవశ్యకత లేనేలేదు.మనం నిష్కల్మషంగాను, సత్సంకల్పంతోను నడచుకుంటే అన్నీ సవ్యంగా సిద్ధిస్తాయి. ఈ విధంగా సమాజాన్ని ప్రభావితం చేస్తూ ప్రజల్లో నూతన చైతన్యాన్ని, పుష్టినిసమకూర్చే యోధులు బహుళ సంఖ్యలో మనకు కావాలి.

మనం వార్తా పత్రికల దుష్ప్రచారాలకు, విమర్శలకు చెవియొగ్గకూడదు.చిత్తశుద్ధితో కర్తవ్య నిర్వహణ చేస్తే అన్నీ సవ్యంగా సమకూరుతాయి. సత్యానిదే ఎప్పుడూ అంతిమ విజయం.

మన సర్వస్వాన్ని – అంటే మనస్సును, శరీరాన్ని, భాషణను – ప్రపంచశ్రేయస్సుకై అర్పించాలి. మన మందరం గ్రంథాల్లో చదివేవుంటాం 'మాతృదేవోభవ, పితృదేవోభవ' అని. కాని నేనంటాను 'బీదలు, నిరక్షరాస్యులు, అమాయకులు, బాధాపీడితులు, వీరిలో మనం భగవంతుణ్ణి చూడాలి' అని. వీరిసేవే భగవంతునికి అమిత ప్రియమైనదని మనం గ్రహించాలి.

మనం పరిపాలకులుగా వుండాలని ఆశించకూడదు. ప్రజాసేవను అత్యంతదీక్షతో చేసే వారే నిజమైన పరిపాలకులు. ఆమరణాంతం సత్యాన్ని మనం పాటించాలి.మనకు ధనాశలేదు, పేరు ప్రతిష్ఠల అవసరం అసలే లేదు. మనకు కావలసిందినిరంతరకృషి మాత్రమే.

మీరందరూ నా సంతానమే అయితే మీకు దేన్ని గురించీ భయముండదు.మిమ్మల్ని ఏదీ ఆటంకపరచలేదు. మీరు పరాక్రమంలో సింహాలవంటి వారు, మీరు భారతదేశం యొక్క, మొత్తం ప్రపంచం యొక్క ఔన్నత్యాన్ని సాధించాలి.పిరికితనానికి స్థానం వుండకూడదు. నేను చెప్పినవాటినన్నిటిని స్వీకరించాలి. చనిపోయేవరకు నిజాయితీతో బ్రతకండి. మీ విజయాలకు ఆధారమైంది మీ గురుభక్తే.గురువుయందు విశ్వాసాన్ని తుది వరకు నిలుపుకోండి.

మీలో ఏవరైనా పరిపాలన చేపట్టవలసి వస్తే ఆ వ్యక్తి ప్రజలకు సేవకునిగావర్తించటం అవసరం.

ఆత్మకు లింగబేధం లేదని గుర్తుంచుకోండి. మన కార్యక్రమానికి వేలకువేలు పురుషులు, స్త్రీలు కూడ కావాలి. వారు మన దేశప్రజల్లో, ప్రపంచంలోని ప్రజల్లో అటు హిమాలయాల నుండి కేప్ కామరిన్ వరకు, ఇటు ఉత్తర ధృవం నుండి దక్షిణధృవం వరకు అందరిలోను ఆశాజ్యోతిని వెలిగించగల్గాలి. ఇచ్చట ఆషామాషీగా వ్యవహరించటానికి అవకాశం లేదు. అలాంటి ప్రవృత్తి గల వారు ఉద్యమం నుండి తొలగిపోవాలి. లేదా వారు దుఃఖానికి గురికావలసి వస్తుంది.

పేదరికానికి, మతఛాందసుల కౌటిల్యానికి, దౌర్జన్యానికి ఎరయైన భారతదేశపీడిత

ప్రజానీకం శ్రేయస్సుకొరకు మనం అహర్నిశలు భగవంతుని ప్రార్థిద్దాం. నేను నా మత ప్రబోధాల్ని ధనవంతులకు, ఉన్నత స్థితిలో నున్న వారికి గాక, బీదప్రజలకుచేయటానికి శ్రద్ధ వహిస్తాను. నేను తార్కికుడను కాని, వేదాంతిని కాని, ఋషిపుంగవుణ్ణికాని కాదు. నేనొక సామాన్య మానవుణ్ణి. పేద వారిని అభిమానిస్తాను.

మన దేశంలో లక్షలాది ప్రజలు అన్నవస్త్రాలు లేకుండా అమాయకులుగాజీవిస్తున్నంతవరకు, వారి స్థితికి బాధ్యులైన ప్రతివానిని దేశద్రోహిగా నేను పరిగణిస్తాను.బీద ప్రజల కాయకష్టం ద్వారా వీరందరూ విద్యావంతులై కూడ వారిగోడు పట్టించుకోరు. పేదవారి శ్రమతోనే ధనికులైన వారందరూ విలాసాలలో తేలియాడుతూ, ఆకలితో నకనకలాడుతూ అనాగరికుల్లా జీవిస్తున్న ఇరువదికోట్ల బీద ప్రజానీకానికి ఏవిధంగాను సహాయపడని వీరు దేశద్రోహులు కాక మరేమౌతారు.

ప్రతిజాతి జీవితంలోను ఒక ప్రధానమైన ప్రవాహముంటుంది. భారతదేశంలో అది మత రూపంలోవుంది. కనుక మనం దాన్ని పటిష్ఠం చేయాలి. ప్రవాహం యొక్క రెండు వైపుల నీరు దానితో బాటు ప్రవహించాలి.

ప్రతిజాతి తన్ను తాను రక్షించుకోవాలని గుర్తుంచుకోండి. అలాగే వ్యక్తి కూడ ఇతరులపై ఆధారపడకుండ తన్నుతాను సంరక్షించుకోవాలి.

నాలోని జ్యోతిని మీరు తీసుకోవాలి. పరిపూర్ణమైన చిత్తశుద్ధితో మీరందరూ మెలగాలి. జీవిత రణరంగంలో మీరందరూ వీరమరణాన్ని ఆహ్వానించాలి. ఈ పరిణామం కొరకే నేను (వివేకానంద) అనవరతం ప్రార్థన చేస్తాను.

ప్రజలందర్ని సంతృప్తిపరచే మార్గం నాకింతవరకు లభించలేదు. నేను, నేనుగా మాత్రమే వుండగలను. యౌవనం, సౌందర్యం నశిస్తాయి; జీవితం, సంపదకూడ నిర్గమిస్తాయి, పేరు ప్రతిష్ఠలు నిష్క్రమిస్తాయి. పర్వతాలు కూడ పిండియై దుమ్ములో

కలుస్తాయి. పరిచయాలు, ప్రేమలు కూడ అస్తమిస్తాయి. ఒక సత్యం మాత్రమే కలకాలం వర్థిల్లుతుంది.

పెద్ద ప్రణాళికలు రచించి భంగపడవద్దు. చిన్న తరహాలో ఆరంభించండి. స్థిమితపడిన తర్వాత క్రమపద్ధతిలో పై స్థాయిలను సాధించండి.

వ్యక్తి తన అంతరాత్మ ప్రబోధించిన విధంగా కృషి చేయాలి. ఆ మార్గం సవ్య మైందిగా పరిణమిస్తే సమాజం దాన్ని అనుసరిస్తుంది. ఆయన పేరు చిరస్థాయిగా నిలు స్తుంది. మనం మన శరీరాన్ని, మనస్సును, హృదయాన్ని మూడింటిని మనం చేసే పని యందు లగ్నం చేయాలి. ఒక కార్యాన్ని ఫలప్రదం చేయాలంటే మనం అన్ని త్యాగాలకు సిద్ధపడాలి.

సంపన్నుడైనవాడెన్నడైనా ఒక ఘనకార్యాన్ని సాధించినట్లు చరిత్ర మనకు చెపుతుందా? కార్యం సాధించాలంటే మంచి మనస్సు, మంచి హృదయం అవసరం. అంతేగాని సంపదకాదు.

మనం ఒక పనిని నిర్వర్తించేటప్పుడు బలహీనతను ప్రదర్శిస్తే అది మనల్ని, మన లక్ష్యాన్ని కూడ హానికి గురిచేస్తుంది. కనుక అచంచలమైన ఆత్మవిశ్వాసం, అపరిమితమైన దార్ఢ్యత కార్యసాధనకు అత్యావశ్యాకాలు.

అకుంఠితదీక్ష, పవిత్రహృదయం, అత్యధిక వివేక సంపద, దృఢ నిశ్చయం – ఈ గుణాలు కల్గిన ఏ కొద్దిమంది కృషి చేసినా మొత్తం ప్రపంచంలో పరివర్తన సాధించవచ్చు.

'సత్యమేవ జయతే'. అసత్యం ఎన్నడూ జయించదు. సత్యం ద్వారా మాత్రమే దివ్యపథంలో మనం గమనించగలం. అసత్యానికి సత్యపు మెరుగులు దిద్ది సత్యంగా ప్రచారం చేయదలచినవారు తమ ఆలోచన పొరపాటని గ్రహించాలి. ఎందుకంటే ఒక పదార్థం మొత్తాన్ని ఒకే ఒక్క విషబిందువు విషపూరితం చేస్తుంది. అలాగాక పవిత్ర హృదయంతో

సాహసంతో మనం ఏ పనినైనా సాధించగలం.

భారతదేశం యొక్క పుష్టి అది అవలంబించే మతంలో వుంది. భారతజాతి తన పూర్వీకులకు సంక్రమించిన అమూల్య ఆధ్యాత్మిక సంపదను గురించి మరవనంత వరకు ప్రపంచంలో ఏ శక్తి కూడ ఆ జాతికి హాని కల్గించలేదు.

మనం మన విశ్వాసాలని వదులుకోకుండా నమ్రతాభావాన్ని అలవరచుకోవాలి. మనకంటే శ్రేష్ఠులైన వారి పట్ల మనం నమ్రతను ప్రదర్శిస్తే తప్ప కేంద్రీకరణ సాధ్యం కాదు. వ్యష్టిశక్తులను సమిష్టీకరిస్తే తప్ప గొప్పకార్యాల్ని సాధించలేము.

అసూయ, అహంకారాల్ని మనం త్యజించాలి. ఇతరులతో కలసి ఇతరుల కొరకు కృషి చేయటం నేర్చుకోవాలి. మన దేశంలో ఇది అత్యంత ఆవశ్యకం.

ఒక మంచి ఉద్యమం ఫలప్రదం కావాలంటే అమితమైన ఓర్పు, అత్యంత పవిత్రత, అకుంఠిత దీక్ష మనలో పెంచుకోవాలి.

'వంట వాళ్లు ఎక్కువైతే పదార్థం పాడవుతుంది' అనే సామెతవుంది. భారత దేశంలో కలసి పనిచేసే యోగ్యత, వ్యవస్థీకరణశక్తి ప్రధానంగా లోపిస్తాయి. ఈ రెండూ వుండాలంటే నమ్రతవుండాలి.

ధైర్యంతో ముందుకు సాగాలి. విజయం ఒక రోజులోనో, ఒక సంవత్సరంలోనో వస్తుందని ఆశించకూడదు. ఉన్నత ప్రమాణాలని ఏదశలో వదలకూడదు. స్థిరత్వాన్ని సమకూర్చుకోవాలి. స్వార్థాన్ని, అసూయను చేరనీయకూడదు. నమ్రతతో సత్యంకొరకు, దేశంకొరకు, మానవతకొరకు కృషి చేస్తే ప్రపంచంలో సంచలనం సృష్టింపవచ్చు.

మన చుట్టూ వున్న నీడలు దట్టమైనకొద్దీ, మనం ఆశించిన ఫలితాలు ఆసన్న మౌతాయి. జీవితం అంటే ఒక భ్రమ లేక స్వప్నం అనే యథార్థస్థితి మనకు గోచర మౌతుంది.

అంతేగాదు, ఈ సత్యాన్ని ఎవరూ గ్రహించలేదని మనకు అవగాహన అవుతుంది. దానికి కారణం వారు అర్ధరహితమైన వాటినుండి అర్థాన్ని గ్రహించాలని యత్నించటమే. 'యద్దృశ్యంతన్నశ్యం' అన్నట్లు మనకు కనిపించేది అంతా అదృశ్య మయ్యేదే, అన్నీ పరివర్తన చెందేవే. ఇది గ్రహించి జ్ఞానులైన మహర్షులు సుఖ దుఃఖాలకు అతీతులై, ఈ ప్రాపంచిక దృశ్యాన్ని సాక్షీభూతంగా పరిశీలిస్తూ విషయ వాంఛలకు బద్ధులు కాకుండా జీవిస్తారు.

సంఖ్యాబలం, అధికారబలం, ధనబలం, విజ్ఞానబలం, వాక్పటిమ – ఇవేవి మనకు అక్కరకురావు. పవిత్రత, జీవితానుభవం లేక అనుభూతి, ప్రాప్తిజ్ఞానము – ఇవే మనకు అమూల్యమైన సాధనాలు. దాస్యశృంఖలాలు తెంచుకొని, ఆత్మజ్ఞానులై, సంపదలను, అధికారాన్ని, కీర్తి ప్రతిష్ఠల్ని లెక్కచేయక మోక్షపథంలో నడిచే పురుష సింహాలు ప్రతి దేశంలోనూ కొద్ది మందైనా చాలు, మొత్తం ప్రపంచంలో సంచలనాన్ని సృష్టిస్తారు.

కీర్తికాంక్ష, అధికారకాంక్షలను త్యజించి కృషి చేద్దాం. మోహం, ఫలాపేక్ష, ఆగ్రహం – ఈ మూడింటిని విసర్జించి జీవిస్తే సత్యం మనతో సహజీవనం చేస్తుంది.

గొప్ప కార్యాల్ని తేలిగ్గా సాధించలేం. సమయం, సహనం, అకుంఠితకార్యదీక్ష లతో మాత్రమే సాధించగలం. మీ హృదయాలు ఉప్పొంగటానికి నేను చాల విషయాలు చెప్పగలను. కాని చెప్పను. నాకు అచంచలమైన దృఢసంకల్పం, దృఢచిత్తం కలవారు కావాలి. పిరికితనాన్ని నేను నిరసిస్తాను. ధైర్యహీనులతోను, అర్ధరహితమైన రాజకీయాలతోను నాకు పనిలేదు. రాజకీయాలంటే నాకు విశ్వాసం లేదు. పరమాత్మ, సత్యం ఈ రెండే ప్రపంచానికి అవసరమైన రాజకీయాలు. మిగిలినవన్నీ వ్యర్థాలే.

నాకు కావలసినవి మూడే మూడు. అవి : పవిత్రత, పట్టుదల, పటిష్ఠత. పవిత్రత, సహనం, కార్యదీక్ష వుంటే చాలు, ఇవి అన్ని ఆటంకాల్ని అధిగమిస్తాయి. గొప్ప కార్యాలన్నీ నిదానంగానే ఫలిస్తాయి. 'ధైర్యసాహసాలతో, ఓర్పుతో, స్థిరచిత్తంతో కృషిచేయ్యాలి. అది ఒకటే

మార్గం.

ఇతరులు చెప్పినదాన్ని ఆచరించే యోగ్యత వున్నవారే ఇతరులపై ఆధిపత్యాన్ని నెరపగల్గిన వారైయుంటారు. మొదట ఇతరులను అనుసరించటం నేర్చుకోవాలి. మనకు మనమే ముఖ్యులం అనుకుంటే మనం సాధించేది ఏమీ వుండదు. అత్యధికమైన చొరవ, అపరిమితమైన సాహసం, ఎక్కువ శక్తి, అన్నిటికంటే మించి నమ్రత – ఈ లక్షణాలు వ్యక్తి యొక్క, జాతి యొక్క అభ్యుదయానికి దోహదం చేస్తాయి.

సామాన్య ప్రజలకు విద్యాబోధన సమకూర్చగల్గితే దాని వలన కొంత ప్రయోజనం వుంటుంది. విజ్ఞానాన్ని మించిన బలవత్తరమైంది మరొకటి లేదు. ఏ దేశంలోను ధనవంతులు సమాజంలో ఎవరికి సహాయ మందించినట్లు చూడము. అన్ని దేశాల్లోను మధ్యతరగతి వారే సమాజసేవకై ఘనంగా పాటుపడటం గమ నిస్తాం.

ఇతరులు కొనసాగించే ఉద్యమాలను నీరసపరచకూడదు. విమర్శ వాంఛనీయం కాదు. సవ్యమైన మార్గంలో కృషి చేసే వారికి చేయూతనివ్వాలి. కృషిలో పొర బాట్లను గమనించినప్పుడు, ఆ పొరపాట్లను సున్నితంగా వారి దృష్టికి తేవాలి. ఒకరినొకరు విమర్శించుకోవటం వల్ల చాల సంస్థలు నష్టాలకు గురియై మూతపడు తున్నాయి.

మోసంతో మనం సాధించగల్గిందేమీ వుండదు. ప్రేమవలన, సత్యదృష్టి వలన, శక్తి వినియోగం వల్ల ఉద్యమాలు ఫలవంతమౌతున్నాయి. కనుక అందరూ మాన వత్వాన్ని ప్రదర్శించి కృషి చేయండి. మనం ఏమీ సాధించలేము. ఇతరులు ఏదైనా చేస్తుంటే దానిని నిరసిస్తాం. ఈ ధోరణే ఒక జాతిగా మన పతనానికి కారణభూతమైంది. సానుభూతి లేకపోవటం, శక్తి నశించటం – ఈ రెండు కారణాల వల్ల జాతి దైన్యాన్ని అనుభవిస్తోంది. ఈ రెండు లోపాలను మనం సవరించుకోవాలి.

మనకు ముందుచూపు తప్ప వెనుకచూపు పనికిరాదు. మనకు శక్తి, ఉత్సాహం, ధైర్యం,

సహనం అధికమైన ప్రమాణంలో కావాలి. అప్పుడే మనం గొప్ప కార్యాల్ని సాధించగలం.

ప్రజాసేవలో ఎవడు పరిపూర్ణత సాధిస్తాడో అతడే ప్రజలకు నాయకుడౌతాడు. పెద్ద, చిన్న అనే తారతమ్యం ఎవరైతే తన ఆచరణలో ప్రదర్శిస్తాడో అతడు ప్రజానాయ కుడు కాలేడు. ఎవడు పెద్ద, చిన్న తారతమ్యం లేకుండా అనంతమైన ప్రేమను ప్రజలపై కురిపిస్తాడో అతన్ని ప్రపంచం ఆరాధిస్తుంది.

ప్రపంచంలోని మతాలన్నీ మృతప్రాయమైన ప్రహసనాలుగా పరిణమించాయి. ప్రపంచానికి కావాల్సింది సద్వర్తన. స్వార్థరహితం, ప్రేమ ఎవరిలో ప్రజ్వరిల్లుతాయో అలాంటి వ్యక్తులు ప్రపంచానికి అవసరం. ప్రేమతో ఉచ్చరించే ప్రతిపదం మారుమ్రోగి హృదయాంతరాళాల్లోకి ప్రవేశిస్తుంది.

మనం నిర్మలత్వంతో, చిత్తశుద్ధితో మెలగుతూ దైవం మీద విశ్వాసాన్ని ఒక క్షణం ఐనా సడలనీయకుండా వుంచితే మన జీవితాలు కాంతివంతమౌతాయి. ఏది సత్యమో అది చిరస్థాయిగా వుంటుంది. సత్యం కాని దాన్ని ఎవరు ఎంత ప్రయత్నించినా జీవింపచేయలేరు.

కండపుష్టిగల్గి, శరీరసౌష్ఠవంతో చిత్తస్థైర్యమున్న వ్యక్తులు కావాలి. 'క్షాత్రవీర్య బ్రహ్మతేజ' – అంటే వీరత్వంలో క్షత్రియులుగా తేజస్సులో బ్రాహ్మణులుగా వుండేవారు అవసరం.

మన ఆదర్శాన్ని మనం విడనాడకూడదు. ఇతరులపై ఆధిపత్యం వహించాలని ప్రయత్నించటం దూష్యం. దానికి బదులుగా పరులకు సేవచేసే విధానాన్ని అనుస రించటం యోగ్యం.

ఇతరులను గురించి పరోక్షంగా చెడుగా మాట్లాడటం గొప్పపాపం. దాన్ని పూర్తిగా నిరసించాలి. పరుల లోపాలను గురించి మన మనస్సుల్లో చాలా మెదలవచ్చు. వానిని

బహిర్గతం చేస్తే గోరంతలు కొండంతలుగా ధ్వనిస్తాయి. కనుక వానిని మరిచిపోవాలి. లేకపోతే క్షమించాలి.

పరోపకార దృష్టితో చేసే సేవ మాత్రమే నిజమైన మతం. మిగతావన్నీ లాంఛనప్రాయమైన క్రతువులే. తన మోక్షసాధనకై పడేపాట్లు కూడ అర్ధరహితాలే. ఎవరైతే తమ సర్వస్వాన్ని పరుల కొరకు త్యాగం చేసి లక్ష్యంపై దీక్షతో కృషి చేస్తారో వారి కొరకే మోక్షం వేచియుంటుంది. అలాగాక అహర్నిశలు స్వార్థంతో 'నాకు మోక్షం కావాలి' అని జపిస్తూ అతని భవిష్యద్వర్తమాన శ్రేయస్సును భంగపరచుకొని సంచరించే వానికి మోక్షం సిద్ధించదు.

ఇతరులకు 'మంచి చేయటం పుణ్యం; హానిచేయటం పాపం; దార్ఢ్యత, పురుషత్వం పుణ్యం; దుర్బలత, భీరుత్వం, పాపం. పరులను ప్రేమించటం పుణ్యం; ద్వేషించటం పాపం. స్వేచ్ఛ పుణ్యం; పరాధీనత పాపం. భగవంతుని యందు, తనయందు పూర్తి విశ్వాసం కల్గియుండటం పుణ్యం; విశ్వాసరాహిత్యం పాపం. మానవులందరూ ఒకటేయనే భావన పుణ్యం; మానవుల్లో తారతమ్యాన్ని ఎంచటం పాపం.

మన కృషి ఇప్పుడే ప్రారంభమైంది. ఏ పరిస్థితుల్లోను నిస్పృహ చెందకుండా శ్రమ చేస్తూనే వుండాలి.

నా తర్వాత యువకులంతా నాకంటే వేయి రెట్లు అధికులు కావాలని ఆకాం క్షిస్తాను. ప్రతి మనిషి ఒక మహోన్నత వ్యక్తి కావాలి. అణకువ, సంసిద్ధత, తలపెట్టిన కార్యంపై మమకారం వుంటే మన ప్రగతిని ఎవ్వరూ అడ్డుకోలేరు.

ధనం కాని, ఇతర సాధనాలు గాని వాటంతటవే సమకూరతాయి. కృషి చేసే వ్యక్తులు కావాలి, కాని ధనంకాదు. వ్యక్తి దేనినైనా సాధిస్తాడు. ధనం ఏమీ చేయలేదు.

వ్యక్తులు ప్రపంచంలోని మొత్తం ధనసంపద కంటే విలువైనవారు. ప్రేమకు అపజయం లేదు. అలాగే, ఎప్పటికైనా సత్యమే జయిస్తుంది. మనం మనతోటి మాన వుల్ని ప్రేమించాలి. భగవంతుణ్ణి వెతుక్కుంటూ పోనక్కరలేదు. మన చుట్టూ వున్న బీద ప్రజలు, బలహీనులు, దీనులు వారే భగవత్స్వరూపులు. వారిని ముందు ఆరాధించాలి. గంగాతీరంలోనే బావి త్రవ్వాలనే తలంపు అనావశ్యకం. ప్రేమ సర్వశక్తిమంతమైనదని గ్రహించాలి. కీర్తికోసం కాంక్షించకూడదు. వార్తాపత్రికల్లోని ప్రచురణలను నేనెన్నడూ చూడను. ఇతరులను ప్రేమించే సద్గుణం కల్గియుంటే మనం సర్వశక్తిమంతులమౌతాం. అలాగే నిస్వార్థతను అలవరచుకుంటే మనకు ఎదురుండదు. మనం ఎక్కడకు వెళ్లినా మన ప్రవర్తన మనకు విలువనిచ్చి ఉపకరిస్తుంది. సముద్ర గర్భంలో వున్న తన సంతతిని కూడా కడతేర్చే బాధ్యత భగవంతునిదే. మన దేశంలో యోధుల ఆవశ్యకత ఎంతైనా వుంది. కనుక అందరూ వీరులుగా తయారు కావాలి.

మనం ఆమరణాంతం కృషి చేస్తూనే వుండాలి. నేను కూడ మీతో వుంటాను. నేను మరణించిన తర్వాత నా ఆత్మ మీతో వుంటుంది.

# స్వామి వివేకానంద జీవితంలోని మరపురాని సంఘటనలు

నరేంద్రనాథుని తల్లి భువనేశ్వరి దేవి ఉన్నత భావాలు గల వ్యక్తి. తన మేధాసంపత్తికి తన మాతృమూర్తియే కారణమని స్వామి వివేకానంద పలు మార్లు చెప్పేవారు. ఈ క్రింది ఘటన అదే విషయాన్ని ప్రస్ఫుటంగా విశదీకరి స్తుంది.

ఒక పర్యాయం నరేంద్రుడు తన పాఠశాలలో తాను చేయని నేరానికి శిక్షింప బడతాడు. ఆ రోజు భూగోళశాస్త్రం బోధించే ఉపాధ్యాయుడు నరేంద్రుడ్ని ఒక ప్రశ్న అడుగుతాడు. ఆ ప్రశ్నకు సరియైన సమాధానాన్నే నరేంద్రుడు ఇస్తాడు. కాని ఉపాధ్యాయుడు అది తప్పని భావించి అతన్ని శిక్షిస్తాడు. నరేంద్రుడు బాల్యంలో కూడ నిర్భయంగా ప్రవర్తించేవాడు. అతడు ఉపాధ్యాయునితో, "నేను మీరడి గిన ప్రశ్నకు సరైన సమాధానాన్ని ఇచ్చాను గదా. నా వల్ల తప్పేమిట" ని వాది స్తాడు. దానితో ఉపాధ్యాయుడు కోపావేశుడై నరేంద్రుడ్ని నిర్దాక్షిణ్యంగా బెత్తంతో కొడతాడు.

నరేంద్రుడు ఖిన్నుడై అశ్రునయనాల్తో ఇంటికి చేరి తల్లితో జరిగిందంతా చెప్పాడు. భువనేశ్వరి కొడుకుని అనునయించి, 'నరేంద్రా, నీవు తప్పు చేయనప్పుడు ఎందుకు బాధపడతావు? అనవరతం సత్యాన్ని అనుసరించు. ఏది ఏమైనా లెక్కచేయకు', అని చెప్పింది.

తన గురువైన శ్రీరామకృష్ణులు, తల్లి తనకు బోధించి అలవరచిన ధర్మానికి ప్రతీకగా నరేంద్రనాథుని హృదయంలో ముద్రవేశారు. శ్రీరామకృష్ణులు, సత్యాన్ని అన్ని విధాలా

అలవరచుకోవాలని ఉద్బోధించేవారు. 'కలియుగంలో సత్యాన్ని వీడకుండా యుంటే ఆ వ్యక్తి భగవంతుని చేరగల్గుతాడు' అని కూడ బోధించేవారు. తాను బోధించిన విషయాన్ని శ్రీరామకృష్ణులు తు.చ. తప్పకుండ పాటించేవారు.

బాల్యంలో తన తల్లి తర్వాత తన గురువర్యులు సత్యంపట్ల ప్రకటించిన అచంచల విశ్వాసాన్ని గమనించిన వివేకానందుని ప్రతిచర్యలోను ఆ ధర్మం ప్రస్ఫుటంగా కానవచ్చేది. కనుక ఆయన ప్రపంచ ప్రజలకు తన సహజమైన రీతిలో, 'సత్యం కొరకు అన్నిటిని త్యాగం చేయాలి, కాని దేనికొరకు సత్యాన్ని త్యాగం చేయకూడదు' అని ప్రబోధించారు.

ఆయన తల్లి ఆయనకొక మారు ఈ హితబోధ చేశారు. "పవిత్రంగా వుండు; స్వచ్ఛమైన జీవితాన్ని జీవించు. ఆత్మగౌరవాన్ని సంరక్షించుకో. ఇతరులను గౌరవంగా చూడు. సరళస్వభావుడవై నిరాడంబరంగా మెలుగు. కాని అవసరమైనచోట దృఢత్వాన్ని ప్రదర్శించటానికి వెనుకాడకు".

మాతృమూర్తి యొక్క ఈ ప్రగాఢ నీతి వచనాలు నరేంద్రుని ప్రవర్తనపై ప్రభావం చూపి ఆయన్ని సన్మార్గంలో నడిపించాయి. బాల్యం నుండి ఆయన తన ఆత్మగౌరవాన్ని సమర్థించుకునేవాడు. ఇతరులను గౌరవించటానికి ఆయన సందేహించేవాడు కాదు. ఐనా ఇతరులు కారణం లేకుండా తన్ను అవమానపరచదలిస్తే సహించేవాడు కాదు. ఒక రోజున తన తండ్రి యొక్క స్నేహితుడొకరు తనను అహేతుకంగా కించపరచటం గమనించి సంభ్రమానికి లోనయ్యాడు. అలాంటి నిరాదరణ అతడు ఎన్నడూ అనుభ వించలేదు. అతని తల్లిదండ్రులు కూడ అతడు చిన్నవాడైనా ఆదరణతో చూచేవారు. 'నా తండ్రి కూడ నన్ను చిన్న చూపు చూడదు. తండ్రి స్నేహితుడొకరు నన్ను నిరాద రించటం సహించలేను' అని తలంచి ఆయన ఎదుట తోకత్రొక్కిన త్రాచువలె నిలబడి, 'వయస్సుతో బాటు వివేకం పెరుగుతుందని

మీవలె భావించేవారు చాలమంది వుంటారు. కాని అది సరికాదు' అని దృఢంగా చెప్పాడు. దానితో ఆ పెద్దమనిషి తన తప్పును గ్రహించి నరేంద్రకు విచారం వ్యక్తం చేశాడు.

కఠోపనిషత్తులో నచికేతుని వృత్తాంతం చదివితే ఆయన యొక్క ధీరత్వం, ఆత్మస్థైర్యం మనకు విశదమౌతాయి. 'నేను అందరి కంటె ఉత్తముణ్ణి కావచ్చు, కాక పోవచ్చు; కనీసం చాలమంది కంటె ఎక్కువ ఉత్తముణ్ణి ఐనా అవుతాను. కాని అందరి కంటె అధముణ్ణి మాత్రం కాదు' అని నచికేతుడు ప్రకటించుకున్నాడు. స్వామి వివేకానంద నచికేతుణ్ణి ప్రశంసించేవాడు. ఆయన్ని ఆదర్శంగా తీసుకునేవాడు.

నరేంద్రుని తండ్రి విశ్వనాథదత్తా దాతృత్వంలో ఖ్యాతి చెందాడు. ఆయన ద్వితీయ కుమారుడు మహేంద్రదత్తా తండ్రిని గురించి 'పేదప్రజలకు సహాయం చేయాలనే సహజ ప్రకృతి ఆయన విషయంలో ఒక వ్యసనంగా పరిణమించింది' అని వ్రాశాడు. ఆయన పరిసరాల్లో నివిసించేవారందరూ ఆయన్ని 'ధర్మదాత విశ్వనాథ్' అని పిలుచుకునేవారు. ఆయన ఆపదలో వున్న వారిని చూచినపుడు నాకెందుకని మిన్న కుండే వారు కాదు. వారి దూరపు బంధువుల పిల్లల విద్యాభ్యాసం కొరకు కూడ నిస్సంకోచంగా ధన సహాయం చేసేవారు. అంతేగాదు, ఇరుగుపొరుగువారు బీదరికంతో బాధపడుతుంటే వారికి ఎంతైనా సహాయం చేసేవారు. ఇంకా విశేష మేమంటే దాతృత్వంలో ఆయన విచక్షణ చూపేవారు కాదు. చివరకు మత్తుమందు సేవించే వారికి గూడ ధనసహాయం చేసేవారు. నరేంద్రుడిది పరికించి, ఆ విధంగా ధనం దుర్వ్యయం అవటం మంచిదికాదని తండ్రికి సూచించాడు. దానికి తండ్రి 'జీవితం వేదన భరితమైంది. పెద్దవాడవైన తర్వాత నీవే స్వయంగా తెలుసుకుంటావు. జీవితంలో దుర్భరమైన వ్యధలకు గురియైన ప్రజలు ఆ బాధలను మరిచిపోవటానికి వ్యసనాలకు బానిసలౌతారు. ఆ మత్తులో తాత్కాలికపు ఉపశమనాన్ని

పొందుతారు' అని నరేంద్రునకు నచ్చజెప్పారు.

తన తండ్రి ప్రతిపాదించిన ఈ కారుణ్య భావమే శ్రీరామకృష్ణుని బోధనలోను, జీవితంలోను వ్యక్తీకరింపబడటాన్ని నరేంద్రుడు కనుగొన్నాడు.

శ్రీరామకృష్ణులు తన సహజమైన కారుణ్యభావాన్ని అందరిపట్ల, అన్ని వస్తువుల పట్ల ప్రేమగా, ఆదరణగా మలచి ప్రదర్శించారు. కేవలం దయచూపటంతోనే సరిపోదని రామకృష్ణులు నరేంద్రునికి సూచించారు. "మానవుడంటే ఒక సజీవ దైవం. మనం దైవం విషయంలో కరుణ చూపాలని ఆలోచిస్తామా? లేదు. ఆయనకు సకల ఉప చారాలు చేసి ఆరాధించి సంతృప్తి పడతాం. కనుక జీవునికి కూడ శివునికి వలెనే అన్ని విధాలైన సేవలు చేయాలి. మానవుల్ని దేవుని ప్రతిరూపాలుగా భావించి సేవించాలి. ఎవరి యందు ద్వేషభావం ప్రకటించకూడదు. పాపికూడ దైవ స్వరూపుడే. నారాయణుడే దొంగరూపంలోను, అమాయకుని ఆకృతిలోను, అలాగే సజ్జనుని ఆకారంలోను, నాగరికునిగాను దర్శనమిస్తాడు" అని కూడా బోధించారు.

పతితునితో సహా ప్రతివ్యక్తిని సాదరంగా చూడాలని శ్రీరామకృష్ణుల నుండి స్వామి వివేకానంద నేర్చుకున్నారు. 'దుర్మార్గుడైన భగవానుడు, పాపియైన దేవుడు' అని వివేకానందుడు తరచు అనేవారు. 'ఈ నరకప్రాయమైన ప్రపంచంలో ఏ ఒక్క వ్యక్తి హృదయానికైన కనీసం ఒక రోజైనా ప్రశాంతతను సమకూర్చగల్గినవాడే ధన్యుడు. అతనిదే నిజమైన సేవ. ఈ సత్యాన్ని నేను నా జీవితమంతా శ్రమపడిన తర్వాత నేర్చుకున్నాను' అని ఆయన అనేవారు.

నరేంద్రుడు కథలు చెప్పటంలో దిట్ట. ఆయన వాక్కు ఆయన రూపంవలెనే చాల

ఆకర్షణీయం. ఆయన సంభాషిస్తుంటే ప్రతివారు వారి, వ్యాపకాలను మరచి తదేకదీక్షతో ఆయన మాటల్ని వినేవారు. ఒకరోజున పాఠశాలలో విరామసమయంలో తరగతి గదిలోని తోటి విద్యార్థులతో నరేంద్రుడు ఆవేశపూరితంగా ఒక కథ చెపుతున్నాడు. ఇంతలో ఉపాధ్యాయుడు వచ్చి తన పాఠాన్ని బోధించటం ఆరంభించాడు. కాని విద్యార్థులందరూ నరేంద్రుడు చెప్పే కథలో నిమగ్నులై ఉపాధ్యాయుడు చెప్పే పాఠాన్ని వినటం మానేశారు. ఉపాధ్యాయుడు విషయాన్ని అవగాహన చేసికొని కోపగించాడు. విద్యార్థులందరిని వరుసగా తాను బోధించే విషయంపై ప్రశ్నించాడు. ఏ విద్యార్థి సమాధానం చెప్పలేకపోయాడు. కాని అత్యంత మేధావియైన నరేంద్రుడు సవ్యమైన, సంపూర్ణమైన సమాధానాన్ని చెప్పగల్గాడు. ఆయన మనస్సు రెండు విధాలుగా పనిచేయగల్గింది. ఒక వైపు తాను చెప్తున్న కథలోను, మరొక వైపు ఉపాధ్యాయుడు బోధించే విషయంపైనా మనస్సును లగ్నం చేసి నరేంద్రుడు ఉపాధ్యాయుని ప్రశ్నకు సమగ్రంగా సమాధానమీయగల్గాడు. అప్పుడు ఉపాధ్యాయుడు 'ఇప్పటి వరకు మాట్లాడుతున్న విద్యార్థి ఎవర' ని వారిని ప్రశ్నాంచాడు. అందరూ నరేంద్రుని చూపారు. కాని ఉపాధ్యాయుడు దానిని విశ్వసించక నరేంద్రుని తప్ప మిగతా వారిని బెంచి ఎక్కమని ఆదేశించాడు. అప్పుడు నరేంద్రుడు లేచి, 'ఇప్పటి వరకు ఇక్కడ మాట్లాడింది నేనేనని అంగీకరించి తానుకూడ శిక్షను అనుభవిస్తా' నని బెంచిపై నిలబడ్డాడు.

నరేంద్రుడు కాలేజిలో చదువుతున్నప్పుడు బి.ఎ. పరీక్ష రుసుము కట్టవలసిన గడువు తేదీ సమీపించింది. నరేంద్రుడు, అతని సహవిద్యార్థులందరు ఆ రుసుమును సకాలంలో చెల్లించారు. హరిదాస చటోపాధ్యాయ అనే బీద విద్యార్థి మాత్రం చెల్లించలేదు. అతడు కూడ పరీక్ష రుసుమునకు సరిపడ సొమ్మును కష్టపడి సమకూర్చుకున్నాడు. కాని కాలేజి జీతం బాకీ యున్నందున, ఆ మొత్తం కూడ కడితే తప్ప పరీక్ష రుసుము స్వీకరించమని కాలేజి యాజమాన్యం నిర్దేశించింది. ఆ విధంగా హరిదాస్ పరీక్షకు కూర్చునే అవకాశాలు

నేలకూలాయి.

ఆ విషయం నరేంద్రనాధ్ దృష్టికి వచ్చింది. అతడు చాల బాధపడి ఉపాయం వెదకనారంభించాడు. కొన్ని ప్రత్యేకమైన సందర్భాలలో కాలేజి జీతం బకాయిలు చెల్లించకుండానే పరీక్ష రుసుము స్వీకరించుటకు అవకాశమున్నదని ఆయన తెలిసికున్నాడు. ఐతే ఈ విషయంలో రాజకుమార్ బాబు అనే వయోవృద్ధుడైన కాలేజి గుమాస్తా తలచుకుంటే హరిదాసుని గట్టెక్కించగలడని నరేంద్రుడు భావించాడు. ఆ ఆశతోనే అతడు హరిదాసునకు ధైర్యం కలిగించి తన ప్రయత్నాలు ఆరంభించాడు. ఒక రోజు నరేంద్రుడు రాజకుమార్‌బాబు వద్దకు వెళ్లి హరిదాస్ తరుపున ఆయనకు నచ్చజెప్పటానికి ప్రయత్నించాడు. హరిదాసు చాల బాగా చదివే విద్యార్థియని, పరీక్షకు పంపితే ప్రథమ శ్రేణిలో ఉత్తీర్ణుడౌతాడని చెప్పాడు. కాని రాజకుమార్‌బాబు ఆగ్రహా వేశుడై హరిదాసునకు సహాయం చేయటానికి నిరాకరించాడు. నరేంద్రుడు ఖిన్నుడై ఎటూతోచని స్థితిలో ఆలోచనలో నిమగ్నుడైనాడు. అప్పుడతనికొక ఉపాయం తోచింది.

రాజకుమార్‌బాబుకు నల్లమందు అలవాటువున్నదని నరేంద్రునకు తెలుసు. ప్రతిరోజు సాయంత్రం ఆ మందు తీసుకోటానికి రహస్యంగా ఒక మారుమూల ప్రదేశానికి వెళ్తాడని కూడ తెలుసుకున్నాడు. కాలేజి టైం అయిన తర్వాత నరేంద్రుడు ఆ రోజు రాజకుమార్‌బాబు నల్లమందు సేవించే ప్రదేశానికి వెళ్లి చీకటి పడేవరకు అక్కడే ఒక రహస్య ప్రదేశంలో వుండి అక్కడికి వచ్చేపోయే వారిని గమనించటం ఆరంభించాడు. అలా కొంత సమయం గడిచిన తర్వాత నల్లమందు కొట్లవైపు రహ స్యంగా నడుస్తున్న రాజకుమార్ బాబు నరేంద్రుని కంటబడ్డాడు. అదే సరియైన సమయమని ఎంచిన నరేంద్రుడు రాజకుమార్‌బాబునకు అకస్మాత్తుగా ఎదురుబడ్డాడు. రాజకుమార్ బాబు దోషివలె చకితుడయ్యాడు. నరేంద్రుడు హరిదాస్ విషయం గుర్తుచేసి, ఆయనకు తప్పక సహాయం చేయాలని కోరాడు. సహాయాన్ని నిరాకరిస్తే రాజకుమార్‌బాబు వ్యసనాన్ని గురించి ప్రచారం చేస్తానన్నాడు.

రాజకుమార్‌బాబు తనపట్ల పొంచివున్న ప్రమాదాన్ని పసిగట్టి, నరేంద్రునితో ఆదరణతో మాట్లాడి హరిదాసునకు తప్పక సహాయం చేస్తానని వాగ్దానం చేశాడు. తన ఉద్యమం జయప్రదంగా ముగిసినందుకు ఆనందభరితుడై నరేంద్రుడు ఇల్లుజేరాడు.

మర్నాడు ఉదయం అతడు హరిదాసు ఇంటికి వెళ్లి ఆ క్రిందటి సాయంత్రం జరిగిందంతా వివరంగా చెప్పి అతన్ని ఉత్సాహపరిచాడు. హరిదాసు కాలేజి బకాయి జీతం చెల్లించకుండా పరీక్ష రుసుము చెల్లించి పరీక్షలకు హాజరుకాగలిగాడు.

ఈ క్రింది సన్నివేశం స్వామిజీ దేశాటనం చేసే రోజుల్లో సంభవించింది. స్వామీజీ అప్పుడు వారణాసిలో ఉంటున్నారు. ఒకరోజు ఆయన దుర్గ గుడికి వెళ్లి తిరిగి వస్తుండగా కోతుల గుంపు ఆయన్ని వెంటాడింది. వాటి బారి నుండి తప్పించుకోటానికి స్వామీజీ పరుగెత్తటం ఆరంభించాడు. కాని కోతులు మించిన వేగంతో పరుగెత్తి ఆయనమీద దాడిచేశాయి. ఆ సమయంలో ఒక వృద్ధ సన్యాసి ఆ దారిన వెళుతూ అంతా పరికించి స్వామీజీని తన వద్దకు పిలిచి "పరుగెత్తవద్దు. జంతువుల్ని ధైర్యంగా ఎదురించు" అని సలహా ఇచ్చాడు. స్వామీజీ ఆ సలహాను పాటించి కోతుల్ని ఎదురించి నిలబడ్డాడు. అప్పుడు కోతులు ఆయన్ని చికాకుపెట్ట కుండా నిష్క్రమించాయి.

ఈ చిన్న సంఘటన నుండి స్వామీజీ విలువైన సత్యాన్ని గ్రహించాడు. 'ఏదైనా సమస్యగాని, ప్రమాదంగాని మనకు ఎదురైనప్పుడు దానిని మనం ధైర్యంతో ఎదుర్కో వాలి; పిరికితనం ప్రదర్శించి పారిపోకూడదు'. ఈ నీతిని స్వామీజీ అలవరచుకున్నాడు. స్వామీజీ ఇదే విషయాన్ని, చాలాకాలం తర్వాత న్యూయార్కులో ఉపన్యసిస్తూ, అచ్చటి ప్రజల దృష్టికి తెచ్చారు. అది జీవితంలో ఎల్లప్పుడూ ఉపకరించే సత్యం. ఎంత భయంకర సన్నివేశాన్నైనాసరే సాహసంతో ఎదుర్కోవాలి. పిరికితనంతో పారిపోకుండా ధైర్యంతో ఎదుర్కొంటే జీవితంలో

తటస్థించే కష్టాలన్నీ కోతుల్లాగా లొంగిపోతాయి. మనం స్వాతంత్ర్యాన్ని సంపాదించాలంటే ప్రకృతినే జయించాలి. పిరికి పందలు ఎన్నడూ విజయాల్ని సాధించలేరు. మనం భయం నుండి, క్లిష్ట పరిస్థితుల నుండి, అజ్ఞానం నుండి విముక్తి పొందాలంటే వాటిని సాహసంతో ఎదుర్కోవాలి.

సన్న్యసించిన వారు తన దేశంతో ఎలాంటి బంధంపెంచుకోకూడదని ఒకరు ఒక సందర్భంలో స్వామీజీతో అన్నారు. అంతేగాక, అన్ని దేశాలు తనవేననే భావాన్ని కూడ అలవరచుకోవాలని ఆయన సూచించారు. స్వామీజీ దాన్ని వ్యతిరేకించి ఆయనకు ఇలా సమాధాన మిచ్చారు. "తన తల్లిని ప్రేమించి పోషించలేని వ్యక్తి ఇతరుల తల్లులను పోషించలేడు. సన్న్యాసులు కూడ తమ మాతృదేశాన్ని ప్రేమించాలి. తన దేశాన్ని ప్రేమించలేని వ్యక్తి ప్రపంచాన్ని ప్రేమతో చూడటం దుర్లభం. దేశభక్తి ముందు, తర్వాతే ప్రపంచ దృష్టి."

స్వామీజీ హిమాలయాల్లో ఒకసారి పర్యటిస్తుండగా బాగా అలసి సొలసి నిస్సహాయంగా పైకి ఎక్కలేని స్థితిలో నిలబడియున్న ఒక వృద్ధుణ్ణి చూచాడు. నిరాశ నిస్పృహలు తాండవిస్తుండగా ఆ ముదుసలి స్వామీజీతో, "అయ్యా ఇంతవరకు కొండ ఎక్కిరాగల్గాను. ఇక అడుగు ముందుకు వేయలేను. గుండె ఆగిపోతున్నట్లున్నది" అన్నాడు.

స్వామీజీ ఓర్పుతో ఆయన మాటల్ని విని ఇలా ధైర్యం చెప్పాడు. "నీవు నడచి వచ్చిన దూరాన్ని ఒక మారు పరికించు. ముందున్న మార్గం కూడ అలాంటిదే. ఇంతవరకు నడచినట్లుగానే ముందుకు సాగిపో." ఆ మాటలు విని ఆ ముదుసలి ధైర్యం తెచ్చుకొని తన

ప్రయాణాన్ని కొనసాగించాడు.

అది 1888 సంవత్సరం ఆగష్టు నెల. స్వామీజీ ఆగ్రా నుండి బృందావనం వెళ్లే మార్గంలో వున్నాడు. ఆ పట్టణ సమీపంలోకి వస్తుండగా రోడ్డు ప్రక్కన కూర్చొని ఉల్లాసంగా హుక్కా పీలుస్తున్న ఒక వ్యక్తిని స్వామీజీ చూచాడు. స్వామీజీ అప్పటికే చాలదూరం నడచియుండటం చేత బాగా దస్సివున్నాడు. పొగత్రాగి కొంతసేపు విశ్ర మించాలనే ప్రేరణ ఆయనకు కల్గింది. ఆ రోడ్డు ప్రక్కన వున్న వ్యక్తి వద్దకు వెళ్లి నీ హుక్కాను పీల్చుకోనిస్తావాయని అడిగాడు. దానికి అతడు "అయ్యా మీరు సన్న్యాసులు, నేను భంగీ కులస్థుణ్ణి. నా వృత్తి నీచమైంది. కనుక నేను ఉపయోగించిన హుక్కాను మీ బోటివారు వాడటానికి అంగీకరించలేను. క్షమించండి" అని స్వామీజీని వారించ టానికి ప్రయత్నించాడు.

స్వామీజీ బదులు చెప్పకుండా కొంచెందూరం ముందుకు సాగిపోయాడు. అప్పుడాయనకు హఠాత్తుగా ఒక ఆలోచన తట్టింది. "నేను సర్వసంగ పరిత్యాగినైన సన్న్యాసిని కదా. నాకు కులం పట్టింపులు వుండకూడదు. కుటుంబ గౌరవం గాని, స్థాయీ బేధాలు కాని అసలే వుండకూడదు. అతడు భంగీ అయినంత మాత్రాన అతడు పీల్చిన హుక్కాను నేను వద్దనుకోటం సిగ్గుచేటు" అని భావించి భంగీ దగ్గరకు వెళ్లి పొగాకు పొడిచేయించి హుక్కాను ఆనందంగా పీల్చాడు.

1890, ఏప్రిల్ 13 వ తేదీన స్వామీజీ వారణాసిలో వుండగా తన తోటి శిష్యు డైన బలరాం బోసు మరణించినట్లు వార్త వచ్చింది. ఆ వార్త ఆయన్ని నిశ్చేష్టుణ్ణి చేసింది. దుఃఖాన్ని

ఆపుకోలేకపోయాడు. అక్కడే వున్న పేరొందిన ప్రముఖ సాహిత్యవేత్త యైన ప్రమదదాస్ మిత్రా స్వామీజీ దుఃఖించటాన్ని గమనించి "స్వామీజీ మీరు సన్యాసులు గదా. ఈ విధంగా కన్నీళ్లు పెట్టుకోటం ఉచితం కాదు" అని వ్యాఖ్యానిం చాడు.

స్వామీజీ ఆ విమర్శకు తీవ్రంగా స్పందించారు. "ప్రమదబాబూ, నేను సన్యాసినై నంత మాత్రాన నాకు హృదయముండదా? నిజమైన సన్యాసి హృదయం మామూలు మానవుల హృదయం కంటె అతి సున్నితంగా వుంటుంది. మనమందరం మానవులం. మీదు మిక్కిలి బలరాంబాబు నాతో మెలగిన సోదర శిష్యుడు. ఆర్తితో స్పందించని, కరుణలేని వ్యక్తులుగా తయారు చేసే సన్యాసాన్ని నేను ఇష్టపడను" అని మందలించారు.

పరుల శ్రేయస్సుకు పాటుపడనివారు సన్యాసులుగా పరిగణింపబడకూడదని స్వామీజీ తన శిష్యులకు తరచుగా బోధించేవారు. సన్యాసి ఎల్లప్పుడు పరుల కొరకు జీవించాలని, ఆపదలో వున్న వారికి సుఖశాంతుల్ని ఈయాలనీ, బిడ్డను కోల్పోయిన తల్లిగాని, విచారగ్రస్తయైన వితంతువుగాని, తటస్థపడినప్పుడు వారిని అనునయించాలని పదే పదే ఆదేశించేవారు. ఇంకా, 'సన్యాసి అనే వాడు మానవుల యొక్క ప్రాపంచిక కష్టాలను నివారిస్తూ, వారి యొక్క పారమార్థిక చింతనను ఉత్తేజపరచాలి' అని కూడ బోధించేవారు.

స్వామీజీకి పావాహరిబాబా అంటే అమిత గౌరవం. వ్యక్తిగతంగా ఆ యోగి ఈయనకు బాగా పరిచయం. స్వామీజీ ఘాజీపూర్‌లో వుండగా బాబాగారి పర్ణశాలలో ఒక దొంగ ప్రవేశించి వారికున్న కొద్ది వస్తువుల్ని దొంగిలించటానికి ప్రయత్నించాడని విన్నారు. దొంగ వస్తువుల్ని పట్టుకొని బయటకు పోయే ప్రయత్నంలో వుండగా బాబా నిద్ర నుండి లేచారు. అది చూచి దొంగ భయపడి వస్తువుల్ని అక్కడే వదలి పరుగెత్తటం ఆరంభించాడు. బాబా ఆ వస్తువుల్ని వెంటనే ప్రోగుచేసి దొంగను అనుస రించారు. అలా వేగంగా పరుగెత్తి దొంగను

పట్టుకొని ఆ వస్తువుల్ని తీసికోమని ప్రాధేయపడ్డారు. ఆ దొంగను 'నారాయణ' యని సంబోధించి 'ఈ వస్తువులన్నీ నీవే, స్వీకరించు' అని బాబా దొంగను కోరారు. దానితో దొంగ దిగ్భ్రాంతుడైనాడు.

కొన్ని సంవత్సరాల తర్వాత స్వామీజీ హిమాలయాలలో తిరుగుతుండగా ఒక రోజున ఆయనకు దివ్యతేజస్సుతో ప్రకాశిస్తున్న ఒక సాధువు కనిపించాడు. స్వామీజీ ఆయన్ని సమీపించి సంభాషించి ఆయన మహిమగల ఉత్తమ సాధువని గ్రహిస్తారు. తర్వాత ప్రస్తావన వశంగా ఆ సాధువు మహర్షి బాబా పర్ణశాల నుండి వస్తువుల్ని దొంగిలించ ప్రయత్నించింది నేనేనని చెప్పాడు. ఆ మాటలు విని స్వామీజీ ఆశ్చర్య చకితుడౌతాడు. ఆ సాధువు తన కథను ఇంకా పొడిగిస్తూ, "పావాహరి బాబా తన వస్తువుల్ని అన్నిటిని ఆనందంతో నాకు ఇస్తూ, నన్ను 'నారాయణా' అని సంబో ధించారు. దానితో నాలో తీవ్ర పరివర్తన సంభవించి నా నేర ప్రవృత్తిని విడనాడి, భౌతిక సంపదలపై వాంఛను త్యజించి ఆధ్యాత్మిక విలువల్ని పరిశోధిస్తూ జీవిస్తున్నాను" అని పూర్తి చేశాడు. ఆ కథ విన్న స్వామీజీ హృదయం అమితంగా స్పందించింది. 'పాపులే పటిష్ఠులైన యోగులవుతారు' అని తరచు ఆయన చెపుతూ వుండేవారు.

స్వామి వివేకానంద పరివ్రాజకుడుగా జీవనం గడుపుతున్నప్పుడు ఒక ఆసక్తికరమైన సన్నివేశం సంభవించింది. అది బాహుశః 1890 సంవత్సరం, నవంబరు రెండవ వారం కావచ్చు. స్వామీజీ మీరట్ నగరానికి వెళ్లారు. అచ్చట ఆయనవలెనే తీర్థయాత్రలు చేస్తున్న తోటి సన్న్యాసులు కలిశారు. చాలాకాలం తర్వాత అలా సమా వేశం అయినందుకు వారందరూ చాలా ఆనందపడ్డారు. అందరూ ఒకేచోట నివాసం యేర్పరచుకొని ఆ స్థలాన్ని మరొక బారానగరు మఠంగా మార్చారు.

స్వామీజీకి గ్రంథ పఠనం అంటే అమిత ఆసక్తియని అందరకు తెలుసు. మీరట్‌లో ఎక్కువ సమయం ఆయన పుస్తక పఠనంలో గడిపారు. స్వామీజీ ఆజ్ఞను సారం స్వామి అఖండానంద స్థానిక గ్రంథాలయానికి వెళ్లి సర్‌జాన్‌ల్యూబక్ రచించిన గ్రంథ సంపుటాల నుండి ఒక్కొక్క సంపుటాన్ని ప్రతిరోజు తెచ్చి స్వామీజీకి ఇచ్చేవాడు. ఆ సంపుటాన్ని స్వామీజీ ఒక రోజులోనే పూర్తిచేసి మరునాడు దానిని గ్రంథాలయానికి పంపి మరొక సంపుటాన్ని తెప్పించుకునేవారు.

ఈ విషయం గ్రంథాలయాధికారి మనస్సులో పెద్ద సందేహాన్ని కలిగించింది. స్వామీజీ ఇతరులకు తనపై మంచి అభిప్రాయం కల్గటానికి గ్రంథాలయాన్నుంచి పుస్తకాలు తెప్పించుకొంటున్నాడే గాని, అసలు ఆయన గ్రంథాలను చదవటల్లేదని తలంచాడు. ఒక రోజున తన సందేహాన్ని స్వామి అఖండానందకు బహిర్గతం చేశాడు. అఖండానంద ఈ విషయాన్ని స్వామీజీకి చెప్పాడు. తర్వాత ఒక రోజున స్వామీజీ తానే స్వయంగా గ్రంథాలయాధికార్ని కలిసి, 'అయ్యా నేను గ్రంథాలన్నిటికి శ్రద్ధగా పఠించాను. మీకు ఇంకా సందేహముంటే ఆ పుస్తకాల్లో విషయాలను గురించి మీ ఇష్టం వచ్చిన ప్రశ్నలను నన్ను అడగవచ్చును' అని నమ్రతతో చెప్పాడు. గ్రంథాలయాధి కారి స్వామీజీని చాల ప్రశ్నలు వేశాడు. వాటన్నిటికి స్వామీజీ సవ్యమైన సమాధానాలు ఇచ్చారు. గ్రంథాలయాధికారి ఆ సమాధానాలు విని ఆశ్చర్యపోయాడు. అంతకు ముందు ఎప్పుడూ స్వామీజీలాంటి ప్రతిభాశాలిని ఆయన చూడలేదు.

స్వామీజీ అనుసరించే గ్రంథ పఠనం తీరును గమనించిన ఖేత్రిరాజా కూడ ఆశ్చర్యచకితుడయ్యాడు. స్వామీజీ ఒక పుస్తకం తీసికొని దాని పుటలన్నీ ఒకమారు వేగంగా చూస్తారు. అంతే మొత్తం గ్రంథంలోని విషయమంతా ఆయన మెదడులో ప్రవేశించినట్లే. రాజా అది ఎలా సాధ్యమవుతోందని స్వామీజీని ప్రశ్నించాడు. స్వామీజీ ఒక పిల్లవాడు అక్షరాభ్యాసం నుండి మొదలుపెట్టి ఒక వాక్యాన్ని చూడగానే చదవగల్గిన స్థాయికి ఎదగటాన్ని వివరించారు.

అలాగే ఒక వ్యక్తి తన కేంద్రీకరణశక్తిని క్రమంగా అతిశయింపచేసుకుంటూ పోతే అతడు ఒక పుటను కన్నుమూసి తెరచేలోపల చదవ గల స్థితికి వస్తాడు. అదే విధానాన్ని తాను అభ్యసించానని, అసలు ఈ సామర్థ్యాన్ని సాధించటానికి ముఖ్యంగా మూడు విషయాలు అత్యావశ్యకాలు అని చెప్పారు. ఆ మూడు విషయాలు : ధారణాపటిమ, అభ్యాసం మరియు ఏకాగ్రత. ఈ మూడు విషయాల్లో ప్రావీణ్యత గడిస్తే ఈ సామర్థ్యాన్ని అందరూ పొందవచ్చని కూడ నొక్కి వక్కాణించారు.

ఒకసారి స్వామీజీ బెల్గాం ఫారెస్టు ఆఫీసరైన హరిపాదమిత్రా ముందు డికెన్సు యొక్క 'పిక్ విక్ పేపర్సు' నుండి చాలా భాగాన్ని అనర్గళంగా వల్లించారు. స్వామీజీ జ్ఞాపకశక్తిని గమనించిన హరిపాదమిత్రా యొక్క సంభ్రమాశ్చర్యాలకు అంతులేదు. ఆ పుస్తకాన్ని కేవలం రెండు పర్యాయాలే చదివానని స్వామీజీ చెప్పినప్పుడు హరి పాదబాబు మరింత ఆశ్చర్యపడ్డాడు. ఏకాగ్రత, ధారణ – ఈ రెండు శక్తులు కలసి మేధస్సును సునిశితం చేస్తాయని కూడ స్వామీజీ మిత్రాకు విశదీకరించాడు.

స్వామీజీ బేలూరు మఠంలో వుండగా ఒకమారు అస్వస్థులైనారు. ఒకరోజు ఆయన శిష్యుడు శరత్‌చంద్ర చక్రవర్తి ఆయన్ని చూడటానికి గదిలో ప్రవేశించాడు. ఆ గదిలో 'ఎన్ సైక్లోపెడియా ఆఫ్ బ్రిటానికా' సంపుటాలన్నీ క్రొత్తవి ఆయనకు కనిపించాయి. 'ఆ సంపుటాలన్నిటిని పూర్తి చేయాలంటే ఒక వ్యక్తి జీవితకాలం సరిపోదు' అని స్వామీజీతో శరత్ చంద్ర అన్నాడు. కాని స్వామీజీ ఆయనతో ఏకీభవించలేదు. 'ఆ పది సంపుటాలు నేను చదివేశాను. వాటిల్లో నీ ఇష్టం వచ్చిన చోట నుండి నీ ఇష్టం వచ్చిన ప్రశ్నను అడుగు' అని స్వామీజీ అన్నారు.

శిష్యుడు ప్రతి సంపుటాన్ని తీసికొని అనేక ప్రశ్నలు స్వామీజీని అడిగాడు. స్వామీజీ అన్ని ప్రశ్నలకు సమాధానం ఇచ్చి ఆ పరీక్షలో నెగ్గారు. అంతేగాకుండా, స్వామీజీ ఆ గ్రంథాల్లోని చాలా విషయాల్ని యథాతథంగా చెప్పి అతన్ని ఆశ్చర్యపర చారు. చివరిగా

శిష్యునిలో ఆత్మ విశ్వాసం కల్గజేయటం కొరకు స్వామీజీ, "చూడు నాయనా, నీవు మనోనిగ్రహాన్ని క్రమంగా పాటించగల్గితే నీవు కోరుకున్న దానిని దేనినైనా సాధిస్తావు. నేను సాధించినట్లుగానే జ్ఞాపకశక్తిని కూడ సుళువుగా సంపాదిస్తావు" అని హితవు చెప్పారు. జర్మను వేదాంతియైన పాల్ డ్యూసెన్ స్వామీజీ యొక్క అసాధారణ ధారణాశక్తిని ప్రశంసించినపుడు కూడ ఆయనకు స్వామీజీ ఇదే విషయాన్ని వెల్లడించారు.

1891 లో స్వామీజీ మౌంట్‌ఆబూలో ఒక మహమ్మదీయ న్యాయవాదికి అతిథిగా ఉన్నారు. ఒక రోజున ఖేత్రి మహారాజు ఆంతరంగిక కార్యదర్శి న్యాయవాది భవనానికి వచ్చి అక్కడ హిందూ సన్న్యాసియైన స్వామీజీని చూచి నివ్వెరపోయాడు. ఆయన తన ఆశ్చర్యాన్ని కప్పిబుచ్చుకోలేక స్వామీజీతో, "స్వామీజీ మీరు హిందూ సన్న్యాసులు కదా. మహమ్మదీయుని అతిథిగా ఎలా వుంటున్నారు?" అని అడిగాడు.

ఎవరైనా కులభేదాల్ని గురించి చర్చించినా, మత వివక్షతో మాట్లాడినా, ప్రాంతీయభావాల్ని వెల్లడించినా స్వామీజీ సహించే వారు కాదు. అందుచేత ఆ సమస్యను లేవదీసిన కార్యదర్శితో చాల నిష్కర్షగా, "చూడండి, నేనొక సన్న్యాసిని. మీరు పాటించే సాంఘిక మర్యాదలకు అతీతుణ్ణి. నేను అంటరాని వారితో కలసి భుజిస్తాను. అందుకు నేను భగవంతుణ్ణి కూడ లెక్కచేయను. ఎందుకంటే ఆయన నేను చేసేదాన్ని హర్షిస్తాడుగనుక. అలాగే ధర్మశాస్త్రాలను గురించి కూడ భయపడను. ఎందుకంటే అవి నా కార్యక్రమాన్ని సమర్థిస్తాయి గనుక. కాని నేను మీ బోటివార్ని, మీ సమాజాన్ని చూచి భయపడతాను. మీకు భగవానుని గురించి గాని, ధర్మశాస్త్రాలను గురించి గాని ఏమీ తెలియదు. నేను పరమాత్మను అన్ని చోట్ల దర్శిస్తాను. ఆఖరుకు హీనమైన క్రిమికీటకాల్లో కూడ ఆయన ఇమిడి వుంటాడు. నా దృష్టిలో ఉన్నతి లేదు, క్రింది స్థాయి లేదు. అన్నీ సమానమే. అంతా శివమయమే" అని

జడివానలా మాటలవర్షం కురిపించారు. రాజుగారి కార్యదర్శి మహోన్నతుడైన స్వామీజీ ముందు అవాక్కయి నిలబడ్డాడు.

ఒకరోజు సాయంత్రం ఖేత్రిరాజా తన ఆస్థానంలోని నాట్యకత్తె యొక్క గానాన్ని విన కుతూహల పడ్డాడు. ఆ రోజుల్లో రాజులకు అదొక ఆచారంగా వుండేది. ఆ సమయంలో స్వామీజీ అజీత్ సింగ్‌జీ అతిధిగా ఖేత్రి భవనంలోనే వుంటున్నాడు. ఖేత్రిరాజు నాట్యకత్తె గానాన్ని వినటానికి స్వామీజీని కూడ ఆహ్వానించాడు. కాని సన్న్యాసిగా అలాంటి కార్యక్రమాలకు తాను హాజరు కాకూడదని తెలియజేస్తూ ఆయన ఆహ్వానాన్ని స్వామీజీ నిరాకరించారు.

ఈ వార్త విని గాయకురాలు చాల ఖిన్నురాలైంది. కాని స్వామీజీ నిర్ణయానికి సమాధానంగా అన్నట్లు ఆమె వైష్ణవ యోగియైన సూరదాసు యొక్క భక్తిగీతాన్ని గానం చేయటం ఆరంభించింది. ఆ చల్లటి సాయంత్రపు నిర్మల వాతావరణంలో ఆమె మధురమైన భక్తిగానం స్వామీజీ వీనులవిందుచేసింది. ఆ పాటలోని సందేశాత్మక విషయం ఇలా వుంది. “ఓ దేవా! నా చెడు గుణాలను పరిగణించవద్దు. నీ దివ్యనామం సమదృష్టిని ప్రసరిస్తుంది. ఒక ఇనుపముక్క దేవాలయంలోని విగ్రహ రూపంలో వుంటుంది. మరొక ఇనుపముక్క మాంస విక్రేత చేతిలో కత్తిగా వుంటుంది. కాని ఆ రెండు ముక్కలు పరుసవేది (స్పర్శ వేది)ని స్పృశించగానే రెండూ సమానంగా బంగారంగా మారుతాయి. కనుక ఓ పరమాత్మా! నాలోని దుర్గుణాలను పరికించ వద్దు.”

భగవంతుడు ప్రతివారిలోను, ప్రతివస్తువులోను వసిస్తాడనే సత్యాన్ని ప్రకటించిన ఆ నర్తకి పాడిన గీతం స్వామీజీ హృదయాన్ని కదలించింది. ఆయన తన్ను తానే దూషించుకున్నారు. ‘నీవు వేరు, ఆ స్త్రీ వేరు అనే భావనను వదలలేని నీవు కూడ ఒక

సన్న్యాసివేనా?' అని తన అంతరాత్మ ఆయన్ని మందలించినట్లు తలంచారు. ఆ గీతం ఆయనకు ఒక గొప్ప నీతి పాఠాన్ని నేర్పింది. అందరిలోను ఉన్న అంతరాత్మ ఒకటే గనుక ఎవరిని విసర్జించకూడదనే నిర్ణయానికి స్వామీజీ వచ్చారు. అప్పుడాయన గాయని పాడే స్థలానికి వేగంగా వెళ్లి గీతాన్ని శ్రద్ధగా విన్నారు. తర్వాత స్వామీజీ ఆ గాయనిని 'మాతా' అని సంబోధించి, తన అమర్యాదకర ప్రవర్తనకు ఆమెకు క్షమాపణలు తెల్పారు.

సన్న్యాసి అనే పదానికి సరియైన నిర్వచనం స్వేచ్ఛాజీవి. ఒక నదిలాగా అతడు ఎప్పుడూ ఉన్నచోట వుండకుండా కదుల్తూనే వుంటాడు. కొన్ని సమయాల్లో రాత్రిళ్లు సమాధుల మధ్య గడుపుతాడు. మరికొన్ని కాలాల్లో రాజ భవనాల్లో నిద్రిస్తాడు. కొన్ని సమయాల్లో రైల్వే స్టేషన్లలో విశ్రాంతి తీసుకుంటాడు. అతడు ఎక్కడ ఎలా గడిపినా సుఖంగా వుంటాడు. మన స్వామీజీ అలాంటి సన్న్యాసి జీవితాన్నే గడుపుతూ ప్రస్తుతం రాజస్థాన్‌లోని ఒక రైల్వేస్టేషనులో మకాం పెట్టియున్నారు. ఐనా ప్రజలు రోజంతా ఆయన్ని దర్శించటానికి వస్తూనే వున్నారు. వారు తమకున్న మతసంబంధమైన, ఇతరములైన సమస్యలను స్వామీజీకి విన్నవించుకుంటే, స్వామీజీ వారికి అనునయ ధోరణిలో సమాధానాలిస్తున్నాడు. ఆ విధంగా మూడు పగళ్లు, మూడు రాత్రులు గడిచాయి. ఆధ్యాత్మిక విషయ ప్రసంగాలలో స్వామీజీ పూర్తిగా నిమగ్నులై తన ఆహారం విషయం కూడ పట్టించుకోలేదు. ఆయన చుట్టూ చేరిన ప్రజలు కూడ ఆయన ఆహారాన్ని గురించి విచారించలేదు.

మూడవరోజు రాత్రి సందర్శకులందరు నిష్క్రమించిన తర్వాత ఒక బీదవాడు స్వామీజీని సమీపించి, ఆప్యాయంగా "స్వామీజీ, మీరు మూడు రోజులుగా విసుగూ, విరామం లేకుండా ప్రసంగిస్తూనే వున్నారు. గుక్కెడు మంచినీళ్ళు కూడ మీరు తీసుకోలేదు. దీనినంతా నేను గమనిస్తూనే వున్నాను. మీ విషయం తలచుకుంటే నాకు బాధగావుంది" అన్నాడు.

భగవంతుడే ఈ బీదవాని రూపంలో తన ముందు ప్రత్యక్షమయ్యాడని స్వామీజీ భావించారు. ఆయన బీదవాని వంక చూచి "నాకు తినేందుకు ఏమైనా ఈయ గలవా?" అని ప్రశ్నించారు. ఆ బీదవాడు వృత్తిపరంగా చెప్పులు కుట్టేవాడు. అందు వలన సందేహిస్తూ "స్వామీజీ, మీకు ఈ రొట్టెను ఈయవలెనని నా హృదయం తొందరపెడుతోంది. కాని దాన్ని నేను స్పృశించాను గదా. మీకెట్లా ఈయను? మీరు అనుమతిస్తే మీ కొరకు కొంత పిండిని, పప్పును తెచ్చి ఇస్తాను. మీరు వానిని మీ ఇష్ట ప్రకారం తయారు చేసికోవచ్చు" అని అతి ప్రేమతో చెప్పాడు.

'అలా కాదు నాయనా, నీవు కాల్చిన రొట్టెను ఇవ్వు. అది తినటానికే నేను ఇష్టపడతాను' అని స్వామీజీ అన్నారు. కాని ఆ బీదవాడు మొదట చాల భయపడ్డాడు. ఒక సన్యాసి కొరకు తక్కువజాతి కులస్థుడు ఆహారాన్ని తయారు చేసి ఇచ్చాడని రాజుకు తెలిస్తే తాను రాజదండనానికి గురి అవుతానేమోనని భయభ్రాంతుడయ్యాడు. కాని ఆకలిగా వున్న ఒక సన్యాసికి తన సేవల నందించగల్గుతున్నాననే ఉత్సాహం తన భయాన్ని అణచివేసింది. ఇంక ఆలస్యం చేయకుండా ఇంటికి వెళ్లి తాజాగా కాల్చిన రొట్టెతో స్వామీజీ వద్దకు తిరిగి వచ్చాడు. ఆ బీదవాని యొక్క కారుణ్యభావం, నిస్వార్థ సేవాపరాయణత స్వామీజీ హృదయాన్ని కదలించాయి. ఆయన కళ్లవెంట అశ్రుధారలు కారాయి. మన దేశంలో పూరిగుడిసెల్లో నివసించే వారిలో ఇలాంటి కరుణామయులు ఎంతమంది ప్రజల గుర్తింపులేకుండా వున్నారో అనే ఆలోచన స్వామీజీకి ఉద్భవించింది. వారు సంపదపరంగా బీదవారే. అందరూ భావించినట్లు తక్కువ కులంలో జన్మించినవారే. ఐనా వారి హృదయాలు విశాలమైనవి, ఉన్నత మైనవి.

ఇది ఇలా వుండగా స్వామీజీ ఒక చెప్పులు కుట్టే హీనజాతి మానవుడు సమర్పించిన ఆహారాన్ని భుజించటాన్ని కొంతమంది పెద్ద మనుషులు గమనించి వ్యధకు గురియైనారు. వారు స్వామీజీ వద్దకు వచ్చి హీనజాతి వ్యక్తి నుండి ఆహారాన్ని స్వీకరించటం ఉచితం కాదని

వెల్లడించారు. స్వామీజీ వారి మాటలను ఓర్పుతో విని వారితో, "మీరందరూ మూడు రోజులుగా నాకు విశ్రాంతి నీయకుండా నా చేత సంభాషింపచేశారు. మీలో ఒక్కరు కూడ నా ఆహారాన్ని గురించిగాని, నా విశ్రాంతిని గురించికాని శ్రద్ధ తీసికోలేదు. మీరందరూ పెద్ద మనుష్యులుగా అగ్రకులానికి చెందిన వారుగా విర్రవీగుతున్నారు. ఇంతకంటే సిగ్గుచేటైన విషయం మరొకటి వుండదు. పైగా ఇతడు హీనజాతి కులానికి చెందిన వాడని నిరసిస్తున్నారు. అతనిలోని మానవత్వాన్ని, కరుణార్ద్ర హృదయాన్ని గుర్తించకుండా అతనిని ద్వేషించటానికి మీరు సిగ్గుపడడం లేదా?" అని ఆవేశంతో మందలింపుగా మాట్లాడారు.

ఆధ్యాత్మిక చింతనలో పై స్థాయికి చేరిన మహాపురుషులు అప్పుడప్పుడు తీవ్ర అసంతృప్తికి గురియౌతారు. స్వామీజీ కూడ వారిలో ఒకరు. ఆయన పర్యాటక సన్యాసిగా జీవితం సాగిస్తున్నపుడు ఒక పర్యాయం తన లక్ష్యాన్ని సాధించలేకపోయాననే మనో వ్యధకులోనైనారు. భగవత్సాక్షాత్కారం కొరకేగాదా తాను సర్వసంగపరిత్యాగియై తపించు చున్నది. ఆ లక్ష్యాన్ని సాధించలేనపుడు ఈ జీవితమూ వృధాయనే తలంపునకు ఆయన వచ్చారు. ఆహారపానీయాల్ని త్యజించి భగవద్ధ్యానంలో నిమగ్నమైతే శరీరం శుష్కించి ఎండుటాకు లాగా ఎప్పుడో రాలిపోతుంది గదా అనే నిర్ణయానికి వచ్చారు.

ఆ తలంపుతో స్వామీజీ దోవతెన్నూలేని ఒక అడవిలో ప్రవేశించి రోజంతా ఆహారం లేకుండా కాలినడకతో పర్యటించారు. సూర్యాస్తమయ సమయానికి బాగా అలసిపోయి, ముందుకు సాగలేక ఒక చెట్టు క్రింద శయనించారు. కొంత సమయం గడిచిన తర్వాత దొంగ చాటుగా తనవైపు వస్తున్న ఒక పెద్దపులిని ఆయన చూచారు. ఒక ఆకలిగొన్న పెద్దపులికి ఆహారంగా ఉపయోగపడేందుకు తనకు మంచి అవకాశం వచ్చిందని యెంచి స్వామీజీ నిశ్చలంగా పరుండిపోయారు. 'ఇలాంటి సదవకాశం మళ్లీ నాకు వస్తుందని నమ్మకం లేదు'

అని కూడ ఆయన తలంచారు. పెద్దపులి తనమీదకు దూకి తన్ను హతమారుస్తుందని నమ్మి ప్రశాంతతతో ఆయన వేచి యున్నారు. పెద్దపులి స్వామీజీకి అతి దగ్గరగా వచ్చి ఊహించని రీతిలో వెనుదిరిగి చీకటిలో కనిపించకుండా అడవిలో అదృశ్యమైంది. స్వామీజీ తన కళ్లను తానే నమ్మలేకపోయారు. పెద్దపులి తిరిగి తన వద్దకు రావచ్చని తలచుకుంటూ ఆ రాత్రంతా ఆ వృక్షం క్రిందే గడిపారు. కాని పెద్దపులి తిరిగిరాలేదు.

మైసూరు మహారాజు చామరాజేంద్ర వడయార్, ఇతర సంస్థానాధీశ్వరుల వలెనే, స్వామీజీ యొక్క దివ్యతేజోమయరూపానికి, ఆయన అసమాన ప్రతిభా పాటవాలకు ఆకర్షితుడయ్యాడు. ఆ సమయంలో స్వామీజీ ఒక పర్యాటక సన్యాసిగా జీవితం గడుపుతూ మైసూరు చేరారు. అనతి కాలంలోనే వారిరువురి మధ్య సాన్ని హిత్యం పెంపొందింది. ఒక రోజున మహారాజు తన ఆస్థాన ఉద్యోగులను గురించి స్వామీజీ అభిప్రాయాన్ని అడిగాడు. ఆ ప్రశ్న అడిగినప్పుడు ఆస్థాన ఉద్యోగులందరు అక్కడే వున్నారు. స్వామీజీ చాల నిర్మొహమాటి. అందుచేత 'ఆస్థాన ఉద్యోగులు ఎక్క డైన ఆస్థాన ఉద్యోగులే' అని సంశయించకుండా జవాబిచ్చారు.

స్వామీజీ మాటల్లోని అంతరార్థం మహారాజు గ్రహించాడు. స్వామీజీ చెప్పింది యథార్థమేనని మహారాజు తన వివేక దృష్టితో తెలిసికున్నాడు. ఐనా స్వామీజీ అభి ప్రాయంతో తాను పూర్తిగా ఏకీభవించటల్లేదని నటించేయత్నంలో తన ఆస్థాన ఉద్యో గుల గౌరవాన్ని సమర్థిస్తున్నట్లు కనిపించాలని మహారాజు ఇలా మాట్లాడాడు : "స్వామీజీ, మీరు చెప్పిందంతా నిజం కాదు. మిగతా మా పరివారం సంగతి ఏమైనా, మా దివాన్ మాత్రం అటువంటి వాడు కాదు. ఆయన మేధావి, విశ్వసనీయుడు" దానికి స్వామీజీ, "మహారాజా, దివాన్ అంటే మహారాజు నుండి సొమ్మును సంగ్రహించి బ్రిటీష్ ప్రభుత్వ రాజకీయ ప్రతినిధికి

సమర్పించువాడే" అని సమాధానమిచ్చాడు.

స్వామీజీ విషయాన్ని చాల దూరం సాగతీస్తున్నాడని గ్రహించి మహారాజు చర్చను మరో దిశకు మళ్లించాడు. తర్వాత కొంత సేపటికి స్వామీజీని తనలోపలి గదిలోనికి తీసుకొని వెళ్లి, "స్వామీజీ, ఉన్నదున్నట్లు మాట్లాడే మీ ధోరణి అన్ని వేళల మేలును కల్గచేయదు. మా ఆస్థాన ఉద్యోగుల ముందు ఇప్పుడు మాట్లాడిన ధోరణిలోనే సంభాషణ కొనసాగిస్తే, వారిలో ఎవరైనా మీకు అపాయం తలపెట్టవచ్చు" అని మహారాజు సలహాపూర్వకంగా చెప్పాడు. దానికి స్వామీజీ తీవ్రంగా ప్రతిస్పందించి, "మహారాజా, ఒక నిజాయితీపరుడైన సన్యాసి సత్యాన్ని ప్రకటించటానికి వెరవడు. ఆ ప్రయత్నంలో తన ప్రాణాన్ని సహితం త్యాగం చేయటానికి సిద్ధపడతాడు. మీ కుమారుడే వచ్చి 'మా తండ్రిని గురించి మీ అభిప్రాయమేమిటి, స్వామీజీ' యని నన్ను ప్రశ్నిస్తే, మీకు లేని సుగుణాలను మీకు ఆపాదించి, అసత్య ప్రకటనలతో ఆత్మద్రోహం చేసుకోగలనా? అది అసంభవం."

స్వామీజీ ఉన్నదున్నట్లు సంభాషించే వారయినప్పటికి, ఏ వ్యక్తిని గురించి ఆయన పరోక్షంలో విమర్శించరు. ఒక వ్యక్తి తప్పు చేసాడని తాను భావించినప్పుడు, అతని ఎదుటే స్వామీజీ తన విమర్శను వెల్లడిస్తారు. అతని పరోక్షంలో అతని గుణ విశేషాలను కీర్తిస్తారే తప్ప, అతని లోపాలను ఏ విధంగానూ ప్రస్తావించరు.

స్వామి తురీయానంద (హరి మహారాజ్) మనకొక ఆసక్తికరమైన సంఘటన గురించి చెప్పారు. స్వామీజీ యాబూరోడ్ స్టేషన్‌లో వుండగా తాను స్వామి బ్రహ్మానందతో కలసి స్వామీజీని కలిశారు. స్వామీజీ, తురీయానందతో, "హరిభాయ్! నేనెంత ఆలోచించినా మీరు మతం అని చెప్పుకునే దాన్ని గురించి నాకేమి అవగాహన కావటం లేదు" అని ఆరంభించి విషయం పూర్తి చేయకముందే దుఃఖావేశులై మాటలు ఉచ్చరించలేకపోయారు. తర్వాత

నిదానంగా ప్రశాంతులై "తోటి మానవుల ఆర్తిని పరికించినప్పుడు నా హృదయం తల్లడిల్లిపోతుంది", అని బాధాభరిత హృదయంతో వెల్లడించారు.

అలా సంభాషిస్తూనే స్వామీజీ మరల దుఃఖాక్రాంతులై కన్నీరు కార్చటం ఆరంభించారు. ఆ దృశ్యం చూచిన తురీయానంద నిశ్చేష్టుడయ్యాడు. "బుద్ధ భగవానుడు కూడ దీనజనులను గూర్చి పరితపించి స్వామీజీ పలికిన పలుకులనే వెల్లడించారు" అని జ్ఞప్తికి తెచ్చుకున్నాడు. స్వామీజీ హృదయంలో లక్షలకొలది దుఃఖీతుల దైన్యం మెదలి అమితమైన అలజడిని సృష్టించిన వైనాన్ని తురీయానంద కనుగొనగల్గాడు. సర్వమానవుల యొక్క బాధలనన్నింటిని నివారించే దివ్యౌషధాన్ని ఉత్పత్తి చేసే పవిత్ర స్థానంగా స్వామీజీ హృదయం విలసిల్లింది.

స్వామీజీ ఆత్మగౌరవాన్ని చాల జాగ్రత్తగా కాపాడుకునేవారు. అంతేకాదు, భారతీయులందరూ అదే మార్గాన్ని అనుసరించాలని ఆకాంక్షించారు. వారు పాశ్చాత్య దేశాలకు వెళ్లక ముందు సంభవించిన ఈ క్రింది సంఘటన స్వామీజీ ఆత్మగౌరవానికి ఎంత ప్రాధాన్యత ఇచ్చేవారో విశదీకరిస్తుంది.

యాబూరోడ్డు స్టేషనులో బొంబాయి వెళ్లబోతున్న ఒక రైలు పెట్టెలో జగమోహన్‌లాల్ తో కలసి స్వామీజీ కూర్చొనియున్నారు. స్వామీజీ అభిమానియైన ఒక బెంగాలీ వారిని సాగనంపటానికి వచ్చి ఆ పెట్టెలోనే వారి ప్రక్కన వున్నాడు. ఇంతలో ఒక ఆంగ్లేయ టిక్కెట్టు కలెక్టరు ఆ పెట్టెలో ప్రవేశించి ఆ బెంగాలీ పెద్ద మనిషితో దురుసుగా మాట్లాడి పెట్టె నుండి దిగిపొమ్మని ఆజ్ఞాపన శైలిలో చెప్పాడు. ఆ పెద్దమనిషి కూడ రైల్వే ఉద్యోగే. తానేమీ చట్టవిరుద్ధంగా నడచుకోలేదని టికెట్టు కలెక్టరుకు నచ్చచెప్పాలని ప్రయత్నించాడు. కాని టికెట్టు కలెక్టరు ఆయన మాటల్ని వినకుండా తీవ్రమైన వాగ్వివాదంలోకి లంఘించాడు.

అప్పుడు స్వామీజీ జోక్యం చేసుకొని టికెట్టు కలెక్టర్ని సమాధానపరచటానికి ప్రయత్నించాడు. కాని టికెట్టు కలెక్టరు స్వామీజీని ఒక సాధారణ సన్యాసిగా భావించి, నీవు, నీవని సంబోధిస్తూ నీ జోక్యం అనవసరమని మాట్లాడాడు.

అతి సన్నిహితులైన వారిని గాని, తనకంటె తక్కువ స్థాయి వారిని గాని సంబోధించినప్పుడు 'నీవు' శబ్దాన్ని ఉపయోగిస్తారు. తనతో సమాన స్థాయిలో వున్న వారిని గాని, తన కంటె అధికులైన వార్నిగాని సంబోధించవలసి వచ్చినపుడు 'మీరు' అనే శబ్దాన్ని వాడటం మర్యాద. ఇచ్చట టికెట్టు కలెక్టరు స్వామీజీని 'నీవు' అని అగౌరవంగా సంబోధించటంతో స్వామీజీ ఆగ్రహావేశులయ్యారు. "మొదటి తరగతి, రెండవ తరగతి ప్రయాణీకులతో వ్యవహరిస్తున్నావు. వారితో గౌరవంగా నడచుకోవటం నేర్చుకో. సమాజంలో ఎవరితో ఎలా మాట్లాడాలో కూడ నీకు తెలియదనిపిస్తోంది. 'మీరు' అని గౌరవనీయులైన ప్రయాణీకుల్ని సంబోధించనవసరం లేదా?" అని స్వామీజీ ఆ టికెట్టు కలెక్టర్ని మందలించారు. అప్పుడు టికెట్టు కలెక్టరు తన తప్పిదానికి విచారం వ్యక్తం చేసి, తన భాషాజ్ఞానం కూడ లోపమయమైందని అంగీకరిస్తూనే, నేనా బెంగాలి పెద్దమనిషిని మాత్రమే ఉద్దేశించానని తప్పుకొనబోయాడు. అతని అమర్యాదకర ప్రవర్తనను గురించి అతనిపై అధికారుల దృష్టికి తెస్తానని స్వామీజీ టికెట్టు కలెక్టరును హెచ్చరించారు. అప్పుడా ఆంగ్లేయ టికెట్టు కలెక్టరు భయాక్రాంతుడై ఆ పెట్టె నుండి దిగి వెళ్లిపోయాడు.

అతడు వెళ్లిపోగానే స్వామీజీ జగమోహన్‌లాల్ వైపు తిరిగి, "మనం ముఖ్యంగా తెల్లవారితో వ్యవహరించేటప్పుడు మన ఆత్మగౌరవాన్ని నిలుపుకోవాలి. ఇతరులు వారి స్థాయిని గురించి ఎంత జాగ్రత్తగా ఆలోచిస్తారో, మనం కూడ మనహోదా విష యంలో అంత శ్రద్ధ చూపాలి. కాని మనం ఈ విషయంలో అశ్రద్ధ చూపుతాం. అందువలన ఇతరులు మనల్ని నిరాదరణతో చూట్టానికి వెనుకాడరు. అన్ని విధాలా మనం మనవిలువల్ని కాపాడుకోకపోతే, మనల్ని ఇతరులు చులకన భావంతో చూసి అవమానించటం ఖాయం. సమాజంలో

విస్తరిస్తున్న అవినీతికి, మనకు ఎదురవుతున్న కీడులకు కూడ పిరికితనమే మూలకారణం అని తెలుసుకోవాలి. హిందువులు నాగరికత విషయంలో ప్రపంచంలో ఎవరికి తీసిపోరు. అయినా వారు వారిని గురించి చాల తక్కువ అంచనా వేసుకుంటారు. ఆ కారణంగానే ప్రతి అనామకుడు మనల్ని కించపరచ టానికి సాహసిస్తాడు. మనం ఆ అవమానాన్ని నిశ్శబ్దంగా సహిస్తాము.''

ఆ విధంగా స్వామీజీ భారతీయులకు, తమ దేశాన్ని ఎలా ప్రేమించాలో, ఏ విధంగా గౌరవించాలో నేర్పారు. ప్రపంచానికి పాశ్చాత్య భౌతిక విజ్ఞానం కంటె భారతీయ ఆధ్యాత్మిక సంపద ఎక్కువగా అవసరమని స్వామీజీ విశ్వాసం. ఆ విశ్వాసం వల్లనే ఆయన పాశ్చాత్య నాగరికత యొక్క మెరుపులకు చకితుడు కాలేదు. సరికదా పాశ్చాత్యులముందు తాను తక్కువనే భావాన్ని కూడ దరిజేరనీయలేదు. ఆ అచంచల విశ్వాసపటిమతోనే ఆయన భారతదేశ సంస్కృతీ నాగరికతల ఘనతను ప్రపంచానికి ప్రస్ఫుటంగా ప్రకటించారు. ఆయన ధీరత్వం, పటిష్ఠమైన విశ్వాసం కోట్లకొలది పశ్చిమదేశవాసుల దృష్టిని భారతదేశంవైపు మరల్చి, వారు భారతదేశాన్ని, దేశనాగరి కతా సంపదలను ప్రేమించేటట్లు, గౌరవించేటట్లు చేశాయి. 'పార్లమెంటు ఆఫ్ రెలిజియన్సు' సభల్లో పాల్గొన్న ప్రపంచమేధావి వర్గం స్వామీజీ ఉపన్యాసాలు విని ఆయన్ని గురించి ఎలా భావించారో తెలుసుకోవాలంటే ఆ సందర్భంలో ప్రకటించిన అనీబీసెంట్ అభిప్రాయాల్ని పరికించాలి.

డా ॥ బీసెంటు ఈ విధంగా రాశారు : "షికాగో నగరంలో నెలకొన్న నిగూఢ వాతావరణంలో కాషాయ వస్త్రాలు ధరించి, అతిశయించిన ఠీవితో, తీక్ష్ణ

మైన దృష్టితో, భాను తేజ ప్రభాసమానుడై ప్రజ్వరిల్లుతున్న ఒక మహావ్యక్తిగా స్వామి వివేకానంద ప్రపంచ సర్వమత మహాసభకు వచ్చిన ప్రతినిధుల కొరకు ఏర్పాటు చేసిన గదులలోని ఒక దానిలో నాకు దర్శనమిచ్చారు. అక్కడి వారందరూ ఆయన్ని సన్యాసిగా పరిగణించి సంబోధించారు. ఆయన నిజంగా సన్యాసియే. ఇంకా చెప్పవలసి వస్తే పోరాట

పటిమగల సన్యాసి. అతి పురాతనమైన హిందూమతానికి ప్రతినిధిగా, జాతిగౌరవాన్ని, దేశగర్వాన్ని ప్రతిబింబింపచేసే దర్పాన్ని అణువణువునా ప్రదర్శిస్తున్న వ్యక్తి ఆయన. భారతదేశ దూతగా విచ్చేసిన ఆయనను పరిశీలించిన వారెవ్వరూ అతిశయంతో విర్రవీగుతున్న పాశ్చాత్యదేశాల ముందు భారతదేశ ఔన్నత్యాన్ని తక్కువగా అంచనా వేయలేరు. స్వామీజీ దేశం పేరుతో దేశం యొక్క సందేశ సారాన్ని ప్రపంచ ప్రజలముందుంచారు. స్వామీజీ ప్రాతినిధ్యం వహించిన భారతదేశం యొక్క రాజసాన్ని, దర్పాన్ని అచ్చటివారు కలకాలం స్మృతిపథంలో ఉంచుకునే రీతిలో ఆయన ఉపన్యసిం చారు. మానవుల్లో పురుషపుంగవుడుగా, ఒక లక్ష్యంతో, ప్రతిభాపాటవాలతో, ప్రజలను తనవైపు త్రిప్పుకొను సామర్థ్యం గల వ్యక్తిగా వివేకానంద భాసించారు."

పార్లమెంట్ ఆఫ్ రెలిజియన్సు మహాసభల్లో స్వామీజీ మొదటి ప్రసంగం అత్యద్భుతంగా సాగింది. షికాగో నగరంలోని ప్రముఖులు పలువురు ఆయన్ని తమ గృహాలకు ఆహ్వానించారు. ప్రతి వ్యక్తి ఆయనకు ఆతిధ్యం ఈయాలని కుతూహల పడ్డాడు.

పార్లమెంటు మొదటి రోజు సభలు ముగిసిన తర్వాత స్వామీజీని ఒక కోటీశ్వరుని రాజప్రాసాదానికి తీసికొని వెళ్లారు. అచ్చట ఆయనకు రాజలాంఛనాలతో కూడిన స్వాగతం లభించింది. ఆ గృహయజమాని స్వామీజీకి సకల సదుపాయాలు వైభవో పేతంగా సమకూర్చాడు. కాని స్వామీజీకి కీర్తి ప్రతిష్ఠలపై గాని, శారీరక సౌఖ్యాల యందు గాని ఆసక్తి లేదు. అందుచేత ఇన్ని వైభవాలుగాని, సహజ రీతిలో పెల్లుబికిన అమెరికన్ ప్రజల హర్షధ్వానాలు గాని స్వామీజీని సంతృప్తిపరచలేదు. ఆ సమయంలో కూడ తన దేశ ప్రజల దుస్థితిని జ్ఞప్తికి తెచ్చుకొని ఖిన్నుడైనారు. భారతదేశం కొరకు ఆయన హృదయం పరితపిస్తూనే వుంది. హంసతూలికా తల్పంలాంటి శయ్యపై పవళించినా ఆయనకు నిద్రపట్టలేదు. ఆ రాత్రి

అంతా ఆయన నేలమీదనే పరుండి బిడ్డవలె శోకించారు. మాతనుద్దేశించి ఇలా ప్రార్థన చేశారు. "ఓ మాతా! నా దేశ ప్రజలు బీదరికంలో మగ్గిపోతుంటే నేను ఈ భోగాలు గాని, కీర్తిని గాని లక్ష్యపెట్టలేను. మా దేశంలో ఇనుపగజ్జెల తల్లి వికటాట్టహాసంతో విలయతాండవం చేస్తోంది. కోట్లాది ప్రజలు తిండిలేక మరణిస్తున్నారు. ఇక్కడ ప్రజలు తమ సుఖాలకొరకు, భోగాల కొరకు ధనం విచ్చలవిడిగా వెచ్చిస్తున్నారు. భారతీయుల్ని వారి దీనస్థితినుండి ఉద్ధరించే వారెవరు? వారికి కడుపునిండా తిండి ఏ విధంగా లభిస్తుంది? నేను నా ప్రజలకు ఎలా సాయపడగలను?". భారతదేశంపట్ల స్వామీజీకి వున్న ప్రేమ ఆవిధంగా జ్వలిం చేది.

ఇలాంటి సన్నివేశమే ఒకటి స్వామీజీ పశ్చిమదేశ యాత్రనుండి తిరిగి వచ్చిన తర్వాత బేలూరు మఠంలో సంభవించింది. స్వామీజీ సహచరుడు స్వామి విజ్ఞానానంద బేలూరు మఠంలో స్వామీజీ బసచేసే గదికి ప్రక్కగదిలో వుంటున్నాడు. స్వామీజీ ఆయన్ని ప్రేమించేవారు. మఠ జీవిత స్వీకారానికి పూర్వం ఆయన నామధేయం హరిప్రసన్న. స్వామీజీ ఆయనను ఆప్యాయంగా పెశాన్ అని పిలిచేవారు. ఒక రాత్రి విజ్ఞానానందకు నిద్రాభంగం జరిగింది. ప్రక్కగది నుండి రోదన ధ్వని వెలువడుతోంది. వెంటనే స్వామీజీ గదిలో ప్రవేశించి ఆ రోదన స్వామీజీదేనని తెలుసుకున్నాడు. ఇంత జరిగినా స్వామీజీ తన గదిలోనికి తన సహచరుడు వచ్చినట్లు గమనించలేదు.

"స్వామీజీ, మీ ఆరోగ్యం బాగాలేదా?" అని విజ్ఞానానంద ప్రశ్నించాడు. స్వామీజీ నివ్వెరపోయాడు. "పేశాన్, నీవు నిద్రిస్తున్నావని తలచాను. నా ఆరోగ్యం బాగానే వుంది. నా దేశ ప్రజలు బాధలకు గురియై యున్నంతకాలం నాకు నిద్రపట్టదు. మనకు మంచి రోజులు రావాలని, వెంటనే అవి వచ్చేటట్లు చేయమని గురువర్యులు శ్రీరామకృష్ణులను వేడుకుంటున్నాను."

భారతదేశమన్నా, దేశప్రజలన్నా స్వామీజీకి అవ్యాజమైన ప్రేమ. అంతేకాదు ఆయన పరిచయాని కొచ్చిన ప్రతివారిలోను ఆ భావాన్ని చొప్పించేవారు. ఈ సందర్భంలో సిస్టర్

క్రిష్టైను ఇలా వ్రాశారు. "ప్రప్రథమంగా స్వామీజీ 'ఇండియా' అనే మాట ఆవేశంతో ఉచ్చరించినప్పుడే మాకు భారతదేశం అంటే ప్రేమానురాగాలు ఉదయించాయి. 'ఇండియా' అనే చిన్న మాటలో అంతటి భావప్రకంపల్ని చొప్పించ టాన్ని మేము విశ్వసించలేక పోయాం. ఆ చిన్న మాటలో ప్రేమ, గర్వం, ఆకాంక్ష, పూజ్యభావం, దుఃఖం, శౌర్యం విరివిగా ప్రజ్వరిల్లి మమ్మల్ని ప్రేరితులను చేశాయి. పెద్దపెద్ద గ్రంథాలు కూడ ఇతరులలో అంతటి ప్రభావాన్ని సృష్టించలేవు. స్వామీజీ నోట ఆ మాటవిన్న ప్రతివారు ఉత్తేజితులై భారతదేశం యొక్క ప్రతి అణువునుప్రేమించ నారంభించారు. భారతదేశానికి సంబంధించిన ప్రతిది – అంటే భారతప్రజలు, దాని చరిత్ర, శిల్పకళ, దేశ ఆచారవ్యవహారాలు, దాని నదులు, పర్వతాలు, సంస్కృతి, ఆధ్యాత్మిక ప్రమాణాలు, మత గ్రంథాలు – అన్నీ వారికి అమూల్యాలే, పూజనీయాలే".

లండన్ మహానగరంలో జరిగిన స్వామీజీ ఉపన్యాసాలు బహుళ ప్రజానీకాన్ని ఆకర్షించాయి. ఒక సాయంత్రం ఆయన 'రాజయోగం' పై ప్రసంగించారు. శ్రోతలు అమిత శ్రద్ధతో ఆలకించారు. కాని మంచి విషయాల్ని అందరూ అంత సులభంగాస్వీకరించలేరు. ఆంగ్లో–ఇండియన్ ఒకరు స్వామీజీ ప్రసంగాలపై అర్థరహితమైనవ్యాఖ్యలు చేయటం ఆరంభించాడు. కాని స్వామీజీ ప్రారంభంలోనే ఆ వ్యక్తినిలక్ష్యపెట్టకుండా తన ప్రసంగాన్ని భావావేశంతో కొనసాగించారు. మిగతా శ్రోతలందరూ ఆ కువ్యాఖ్యలు చేస్తున్న వ్యక్తి పట్ల నిరసనను ప్రదర్శించారు. కాని స్వామీజీ ఆ విషయాన్ని పట్టించుకోకుండా వుండటాన్ని గమనించి వారు కూడ నిశ్శబ్దతనుపాటించారు. దాంతో ఆ ఆంగ్లో ఇండియన్ గళాన్ని పెంచి సౌమ్యతా ప్రమాణాల్నికూడ అధిగమించి వ్యవహరించటం ప్రారంభించాడు. స్వామీజీ బుద్ధుణ్ణి కొనియాడినప్పుడు అతడు బుద్ధుణ్ణి నిరసించాడు. అలాగే స్వామీజీ సన్యాసులను పొగడగానే, సన్యాసులందరు దొంగలనీ, మాయావేషధారులనీ దూషించాడు. అంతిమంగా

స్వామీజీబెంగాలీయని తెలుసుకొని, బెంగాలు ప్రజలను చెడ్డవారిగా వర్ణించి బ్రిటీషువారినిశ్లాఘించటం ఆరంభించాడు.

ఆ విధంగా పలుమార్లు ఆ ఆంగ్లో–ఇండియన్ తన ఉపన్యాసానికి అడ్డుపడటాన్ని సహించలేక స్వామీజీ ఆయననుద్దేశించి బ్రిటీషువారి నేర ప్రవృత్తిని ఋజువుపరచే ఉదాహరణలను చారిత్రక ఆధారాలతో వ్యక్తీకరించారు. అలా ఒక భారతీయుడైన సన్యాసి నిర్భయంగా బ్రిటన్ గడ్డమీద బ్రిటీషు ప్రజల దుర్వృత్తిని గురించి ప్రకటించటాన్ని ఆ ఆంగ్లో–ఇండియన్ తట్టుకోలేక ఖిన్నుడైనాడు. స్వామీజీ, తన ఔదార్యాన్ని ప్రదర్శిస్తూ, అచ్చట ఏమీ జరగనట్లుగా భావించి తన మామూలు ధోరణిలో ప్రసంగాన్ని కొంతసేపు కొనసాగించి ముగించారు.

ఒకసారి స్వామీజీ అమెరికాలో పశ్చిమానవున్న ఒక పట్టణంలో తన ప్రవచనాన్ని ఇస్తూ, "నిత్య సత్యాన్ని ఎరింగిన మహనీయుడు ఏ పరిస్థితుల్లోనైనా ఒకే ప్రవృత్తిని ప్రదర్శిస్తాడు; బాహ్య సంఘటనలేవీ ఆయన్ని ప్రభావితం చేయలేవు, ఆయన ప్రశాంతతకు భంగం కల్గించలేవు" అని ప్రతిపాదించారు. ఆ సమావేశంలో వున్న కొందరు పల్లెటూరు పశుకాపరులు ఆ ఉపన్యాసాన్ని విని స్వామీజీని పరీక్షించాలని నిర్ణయించుకున్నారు. తర్వాత స్వామీజీ వారి గ్రామంలో ఉపన్యసించటానికి వెళ్లినపుడు, వారు స్వామీజీని తిరగవేసిన తొట్టెపై నిలబడి ప్రసంగించమని కోరారు.

స్వామీజీ అలాగే నిలబడి తన ఉపన్యాసంలో పూర్తిగా నిమగ్నుడై సంభాషిస్తు న్నారు. అప్పుడా పశుల కాపర్లు దగ్గరలో నిలబడి గుండ్లను పేల్చటం మొదలుపెట్టారు. అవి పెద్ద ధ్వనితో స్వామీజీ చెవులను దూసుకొని పోతున్నాయి. ఐనా స్వామీజీ తన ప్రశాంతతను వీడక తన ప్రవచనాన్ని కొనసాగించారు. ఉపన్యాసం పూర్తికాగానే పశుల కాపర్లు స్వామీజీని

చుట్టుముట్టి కరచాలనం చేసి ఆయనపట్ల తమ పూజ్య భావాన్ని వెలిబుచ్చారు. "స్వామీజీ, మీరు నిజమైన మహనీయులు. మీరు ఏది బోధిస్తారో దానిని ఆచరణలో పెట్టగల సాధుపుంగవులు" అని వారందరూ స్వామీజీని పొగడారు.

స్వామీజీ అమెరికా ప్రజలకు చాల సన్నిహితులైనారు. ఒక పర్యాయం స్వామీజీ ఒక రైలు బండి దిగగానే ఆ స్టేషనులో ప్రజలు ఆయనకు ఘన స్వాగతమిచ్చారు. అచ్చటే వున్న ఒక నీగ్రో కూలి స్వామీజీని సమీపించి కరచాలనం చేసి "మీకు నా అభినందనలు. మా జాతికి చెందిన ఒక వ్యక్తి ఇంత ఖ్యాతిని సంపాదించటం అమెరికాలో వున్న మా నీగ్రో జాతికే గర్వకారణం" అని ప్రశంసించాడు. స్వామీజీ అతనికి అతి దగ్గరగా వెళ్లి కరచాలనం చేసి 'సోదరుడా, నీకు నా కృతజ్ఞతలు' అని చెప్పారు. అంతేగాని తాను నీగ్రోను కాను అని చెప్పటానికి ఇష్టపడలేదు.

స్వామీజీ నీగ్రో అని భావించి అమెరికాలోని దక్షిణప్రాంతంలోని ప్రజలు ఆయన్ని అవమానించారు, చిన్న చూపుచూచారు, చివరకు హోటల్సులో ప్రవేశం కూడ నిరాకరించారు. కాని ఆయన ఏ సందర్భంలోను ఎవరినీ తప్పుపట్టలేదు; తాను భారతీయుణ్ణి అని ప్రకటించుకునే ప్రయత్నం చేయలేదు. పాశ్చాత్యుడైన శిష్యుడొకడు "అంత క్లిష్టసందర్భాలను ఎదుర్కొంటూ కూడ మీరు భారతీయుణ్ణి అని ఎందుకు ప్రకటించుకోరు?" అని ప్రశ్నించాడు. దానికి సమాధానంగా స్వామీజీ, "నేను ఇతరులను అణచి ఉచ్ఛస్థితికి పోవాలని కోరుకోను. నేను ఆ ఆశయంతో జన్మించలేదు. నా స్వయంశక్తే నన్ను ఉద్ధరిస్తుంది" అని ఉద్ఘాటించారు.

మేడమ్ ఎమ్మాకాల్వే ఫ్రాన్సు దేశంలో చాల ప్రసిద్ధి చెందిన రంగస్థల గాయనీ మణి. ఆమెకు, అమెరికాలో కూడ ఘనమైన ప్రజాదరణ వుంది. ఆమె వృత్తిపరంగా విజయాన్ని సాధించినా, వ్యక్తిగత జీవితంలో దైన్యాన్ని చవిజూచింది. ఆమె యొక్క మొండిపట్టుదల, క్షణిక కోపావేశం ఆమెకు ఇబ్బందిని కలుగజేశాయి. అంతేగాక ఆమె యిష్టానిష్టాలు తీవ్రస్థాయిలో వుండేవి. తత్ఫలితంగా ఆమెకు మనశ్శాంతి వుండేదికాదు. ఇలా వుండగా 1894 మార్చి మాసంలో ఆమె కుమార్తె షికాగోలో ఒక ప్రమాదంలో మరణించింది. ఈ దుర్ఘటన తర్వాత ఆమె మానసిక సమతౌల్యాన్ని పోగొట్టుకుంది. అలాంటి పరిస్థితిలో ఆమె మిత్రుడొకడు ఆమెను స్వామీజీ దగ్గరకు తీసికొని వెళ్లే ప్రయత్నం చేశాడు. కాని మేడమ్ కాల్వే అందుకు అంగీకరించలేదు. ఆమె తన మానసిక స్థితికి ఆత్మహత్య యొక్కటే శాశ్వత పరిష్కారమన్నట్లు యోచించింది. అలా ఆలోచించి నాలుగు పర్యాయాలు ఆత్మహత్యా ప్రయత్నాలు చేసి విఫలమైంది. తుట్టతుదకు స్వామీజీ దర్శనమే శరణ్యమనే నిర్ణయానికి వచ్చింది. స్వామీజీ తన స్నేహితులను కొందరిని వారి వారి కష్టాల నుండి గట్టెక్కించినట్లు కూడ ఆమె తెలుసు కొన్నది.

స్వామీజీ వసిస్తున్న ప్రదేశానికి ఆమె వెళ్లింది. ఆయన సమ్ముఖంలోనికి ఆమెకు ప్రవేశం కల్పింపబడింది. గంభీరాననుడై సమాధి నిష్ఠలో ఆసీనుడైయున్న స్వామీజీని ఆమె ప్రథమంగా దర్శించింది. ఆయన ధరించిన కాషాయ వస్త్రాలు నేలమీద పడు తుండగా, తలపాగా ధరించిన ఆయన శిరస్సు ముందుకు వంగి, దృక్కులు నేలపై సారింపబడివున్నాయి.

స్వామీజీ పైకి చూడకుండానే ఆమెతో వాత్సల్యంతో మృదువుగా, "అమ్మాయీ, నీవు చాలా క్లిష్టపరిస్థితుల్లో చిక్కుకొని వున్నావు. నీవు ప్రశాంతంగా వుండటం అత్యవ సరం" అన్నారు. తన పుట్టుపూర్వోత్తరాలు గాని, కనీసం తనపేరు కూడ ఎరుగని స్వామీజీ, తన రహస్య సమస్యల్ని, ఆవేదల్ని గురించి విపులంగా మాట్లాడగల్గటం చూచి మేడమ్ కాల్వే ఆశ్చర్యచకితురాలైంది. తన సన్నిహిత స్నేహితులకు కూడ తెలియని విషయాలను గురించి కూడ ఆయన ప్రస్తావించారు. చివరకు ఆమె స్వామీజీ దగ్గర శెలవు తీసికొని వెళ్లే సమయంలో

ఆయన ఆమెను ఆశీర్వదించి, "నీవు ఇక నుండి సుఖశాంతులతో కాలం గడుపు. ఆరోగ్యాన్ని మెరుగుపరచుకో. నీ బాధల్ని గురించి తలంచుకొని నీలో నీవు కుమిలిపోవద్దు" అని ఉపదేశించారు. ఆ తర్వాత కొద్దిసేపటికే మేడమ్ కాల్వే తన బాధలన్నీ నివృత్తి అయినట్లు, తన ఆవేదనలన్నీ అస్తమించినట్లు భావించింది. ఆమె మాటల్లోనే చెప్పాలంటే, "స్వామీజీ నా మనస్సును ఆవేశించియున్న జాడ్య పరిస్థితిని తొలగించి దాని స్థానంలో వారి స్వచ్ఛమైన పవిత్ర భావాలను ప్రవేశపెట్టారు".

మేడమ్ కాల్వే తన స్నేహితురాలైన మేడమ్ పాల్ వెర్దియర్‌తో స్వామీజీని అమెరికన్ కోటీశ్వరుడైన జాన్ డి. రాక్‌ఫెల్లర్ కలసినప్పుడు జరిగిన సంఘటనను గురించి ఈ క్రింది విధంగా చెప్పింది.

ఆ వృత్తాంతాన్నే మేడమ్ వెర్దియర్ వ్రాతల నుండి గ్రహించటమైంది. రాక్ ఫెల్లర్ స్వామీజీ యొక్క ఘనతను గూర్చి తన స్నేహితుల ద్వారా విన్నాడు. వారందరూ అసాధారణ ప్రతిభగల స్వామీజీని కలియమని ఆయనకు పదేపదే చెప్పారు. కాని రాక్‌ఫెల్లర్ ఆయన్ని కలవటానికి యిష్టపడలేదు. ఆయన చాల ధృడచిత్తుడు అవటంచేత ఆయన నిర్ణయాన్ని మార్చటం దుర్లభం. కాని ఒక రోజున షికాగోలో స్వామీజీ నివసిస్తున్న తన స్నేహితుని ఇంటికి వెళ్లాలనే ప్రేరణ రాక్‌ఫెల్లర్‌కు కల్గి అక్కడికి వెళ్లాడు. అచ్చట తనకు తలుపు తెరచిన బంట్రోతును కూడ ప్రక్కకు నెట్టి హిందూసన్యాసి ఎక్కడ చూపించమని ఆదేశించాడు.

బంట్రోతు ఆయన్ని హాలులో ప్రవేశపెట్టాడు. స్వామీజీ ఆ ప్రక్కగదిలోనే బల్లముందు కూర్చొని యున్నారు. రాక్‌ఫెల్లర్ తన రాకను తెల్పుకోకుండానే స్వామీజీ గదిలో ప్రవేశించాడు. స్వామీజీ తన దృష్టిని వచ్చిన వ్యక్తిపై మరలించకుండా వుండ టాన్ని గమనించి రాక్ ఫెల్లర్ ఆశ్చర్యపడ్డాడు. అలా కొంత సమయం గడచిన తర్వాత స్వామీజీ కార్వేకి చెప్పిన విధంగానే,

రాక్‌ఫెల్లర్ యొక్క పుట్టుపూర్వోత్తరాలు, నిగూఢ రహస్యాల్ని యథాతథంగా వెల్లడించారు. అతడు అప్పటివరకు ఆర్జించి కూడబెట్టిన ద్రవ్యం ఆయనకు చెందదనీ, ఆ ధనానికి ఆయన ఒక ప్రసార కేంద్రం మాత్రమేనని, ప్రపంచం శ్రేయస్సుకొరకు పాటుపడడం ఆయన కర్తవ్యమనీ, భగవంతుడు ఆ ధనాన్ని ప్రజోపయోగం కొరకు వినియోగించటానికే ఆయనకు ప్రసాదించాడని కూడా చెప్పారు. తనను గురించి ఆ విధంగా మాట్లాడటాన్ని రాక్‌ఫెల్లర్ సహించలేకపోయాడు. ఆయన అహందెబ్బతిన్నట్లయి స్వామీజీకి వీడ్కోలు చెప్పకుండానే ఆ గదినుండి ఆగ్రహావేశంతో నిష్క్రమించాడు. కాని ఒక వారం గడిచిన తర్వాత, రాక్‌ఫెల్లర్ మరల స్వామీజీ గదిలో పూర్వపు పద్ధతిలోనే ప్రవేశించి స్వామీజీ ముందున్న బల్లపై ఒక కాగితాన్ని వుంచాడు. ఆ కాగితంలో ఒక ప్రజాసంస్థ వినియోగం కొరకు ఆయన విరివిగా దానం చేయతలపెట్టిన ప్రణాళికను గురించి వివరణయున్నది.

ఆ పత్రాన్ని అక్కడ వుంచుతూ, స్వామీజీని ఉద్దేశించి, "ఇప్పటికైనా నీవు సంతృప్తిపడివుంటావు; నాకు కృతజ్ఞతలు చెప్పుకోవచ్చు" అని రాక్‌ఫెల్లర్ గర్వంగా పలికినిలబడ్డాడు. స్వామీజీ తన తలను ఎత్తనైనను లేదు. ఆ పత్రాన్ని చదివి, "నీవే నాకుకృతజ్ఞతలు తెల్పాలి" అని రాక్‌ఫెల్లర్‌తో దృఢంగా చెప్పారు.

ప్రజాశ్రేయస్సు కొరకు రాక్‌ఫెల్లర్ ప్రప్రథమంగా ఇచ్చిన భూరి విరాళం అదే.తర్వాత ఆయన విశ్వదాతగా జగత్ప్రసిద్ధుడైనాడు.

ఈ పర్యాయం కూడ స్వామీజీ రాబర్టు ఇంగర్‌సాల్‌ను కలుసుకుంది షికాగోలోనే. ఇంగర్‌సాల్ ప్రసిద్ధి చెందిన వక్త, అజ్ఞేయవాది. వారిరువురు ఒకరు ఉత్తర ధృవమైతే, రెండవ వారు దక్షిణ ధృవం. స్వామీజీ ఆధ్యాత్మిక తత్వానికి ప్రతిరూపం.నిత్యసత్యంపై అచంచల విశ్వాసం గలవారు. ఐతే మతమౌఢ్యాలనూ, అసత్య ప్రమాణాల్ని నిరసించేవారు. అందుకు

భిన్నంగా ఇంగర్‌సాల్ మతవిశ్వాసాలను వ్యతిరేకించే వాడు. నిత్యమైన దివ్యశక్తి ఆస్తికతను శంకించినవాడు. ఐనప్పటికి వారిరువురు చాలసార్లు కలిశారు. కలిసినప్పుడు వేదాంత విషయాలపై, మత విషయాలపై చర్చలు కొనసాగించారు.

ఒక పర్యాయం ఇంగర్‌సాల్ స్వామీజీతో, “ఈ కనిపించే భౌతిక ప్రపంచంమాత్రమే సత్యమైనది. దాని నుండి ఎంత ఎక్కువ పొందుటకు అవకాశ ముందో అంతా పొందుట యందు నాకు పూర్తి విశ్వాసముంది” అని అన్నాడు.

దానికి సమాధానంగా స్వామీజీ ఇలా అన్నారు : “ఈ ప్రపంచం నుండి నీవుపొందే దాని కంటే ఎక్కువ ప్రమాణంలో లబ్ధిని పొందుటకు నా వద్ద మార్గాలున్నాయి.నాకు మృత్యువు లేదని నేనెరుంగుదును. అందుచేత నేను తొందరపడకుండా ఈ భౌతిక శక్తులను అమితంగా తరచి ఎక్కువ లబ్ధిని రాబట్టగలను. నాకు బాధ్యతలులేవు. భార్యాబిడ్డల జంఝాటమూ లేదు. ఆస్తిపాస్తుల బెడద అసలే లేదు. కనుకనేను విశ్వంలోని అన్ని ప్రాణులను ప్రేమిస్తాను. ప్రతి జీవిలోను భగవంతుని చూడటంలోని ఆనందాన్ని అంచనావేయలేము. కావున నీవు కూడ నీ దృష్టిని ఇటువైపు మరల్చి ఈ భౌతిక ప్రపంచమనే నారింజపండును తుదివరకు పిండి రసాన్ని చివరి చుక్కవరకు గ్రహించు”.

స్వామీజీ లండన్ నగరం వదలి వెళ్లక ముందు ఆంగ్లేయ మిత్రుడొకడు ఆయన్ని కలసి “స్వామీ, వైభవోపేతమైన, పేరుప్రతిష్ఠలు గల పటిష్ఠమైన పాశ్చాత్యదేశాల పర్యటనలో మీరు పొందిన అనుభవాల నేపథ్యంలో మీ మాతృదేశాన్ని మీరు ఎలా అంచనా వేస్తారు?” అని ప్రశ్నించాడు. దానికి స్వామీజీ, “భారతదేశం నుండి వచ్చే ముందు నా దేశాన్ని ప్రేమించాను; ఇప్పుడు నా దేశం యొక్క దుమ్ము, ధూళి, గాలి సర్వస్వం నాకు పవిత్రమైనవిగా భాసిస్తాయి. మొత్తం భారతదేశాన్ని ఒక పునీతమైన యాత్రాస్థలంగా, దివ్యక్షేత్రంగా భావిస్తాను,” అని

అన్నారు.

ఒక రోజున కలకత్తాలో స్వామీజీ తన శిష్యుడైన ప్రియానాథ్ సిన్హాతో, వ్యక్తి తన మతాన్ని ప్రేమించినప్పుడే అతడు స్థిరచిత్తుడుగా సాహసికుడుగా పరగణింపబడతా డని, మతం పట్ల అట్టి దృఢమైన ప్రేమ ద్వారానే భారతీయులలో లోపించిన సమైక్యత పెంపొందగలదని ఉద్ఘాటించారు.

ఈ సందర్భంలో తాను భారతదేశం తిరిగివచ్చేటప్పుడు ఓడలో జరిగిన ఒక సన్నివేశాన్ని వివరించారు.

ఆ ప్రయాణంలో ఇరువురు క్రైస్తవ మత ప్రచారకులు ఆయన వద్దకు వచ్చి హిందూ క్రైస్తవ మతాలకు సంబంధించిన మంచి చెడులను చర్చించాలని పట్టుబట్టారు. ఆ చర్చలో తమ వాదనలు స్వామీజీ వాదనల ముందు పేలవంగా పరిణమించటాన్ని గమనించిన ఆ క్రైస్తవులు దురుసుదనాన్ని ప్రదర్శిస్తూ, హిందువులను, హిందూమతాన్ని దూషించటం ప్రారంభించారు. స్వామీజీ చాలసేపు సహనం వహించారు. చివరకు ఆయన వారిరువురను సమీపించి, ఒకరి చొక్కాను పట్టుకొని "నీవు మరొకసారి మా మతాన్ని దూషిస్తే నిన్ను ఓడ నుండి నీటిలోకి త్రోసేస్తాను" అని చాల దృఢచిత్తంతో హెచ్చరించారు. ఆ క్రైస్తవ ప్రచారకుడు భయకంపితుడై అలాంటి తప్పిదాన్ని మరల ఎన్నడు చేయనని తెల్పుతూ మిన్నకున్నాడు. ఆ తర్వాత వారు స్వామీజీని కలసినప్పు డల్లా వారిపట్ల అమిత గౌరవాన్ని ప్రదర్శించారు.

తన శిష్యునకు ఈ సంఘటనను చెప్పి, "నీ మాతృమూర్తిని ఎవరైనా పరాభవిస్తే నీవేమి చేస్తావు?" అని ప్రశ్నించారు. దానికి సమాధానంగా ప్రియానాథ్, "ఆ వ్యక్తి మెడబట్టి దేహశుద్ధి చేసి బుద్ధిచెప్తాను" అన్నాడు. శిష్యుని సమాధానంతో తృప్తిచెందిన స్వామీజీ, "సిన్హా, అలాంటి

గౌరవ భావాన్నే నీవు నీ మతం పట్ల ప్రదర్శిస్తే, నీవు నీతోటి హిందూ సోదరులు క్రైస్తవ మతాన్ని స్వీకరించటాన్ని సహించవు. మన మతం మన తల్లి వంటిది. ప్రతినిత్యం హిందువులు క్రైస్తవు మతావలంబకులుగా మారటాన్ని గమనిస్తూ కూడ హిందువులు స్పందించటం లేదు. వారి విశ్వాసాలు, వారి దేశభక్తి ఏమైనట్లు? క్రైస్తవ మత ప్రచారకులు హిందూమతాన్ని అన్ని వేళలా దూషిస్తూనే వుంటున్నారు. ఆ దూషణలు తమ ఎదుట చేస్తున్నా, చాల మంది హిందూమతాన్ని సమర్థిస్తూ వారి వాదనలను ఖండించే ప్రయత్నం చేయటం లేదు".

లోగడ చెప్పియున్న స్వామీజీ యొక్క సముద్ర ప్రయాణ సమయంలో ఆయనతో ఆయన ఆంగ్లేయ శిష్యులు చాలమంది వున్నారు. వారి ఓడ ఏడెన్ రేవులో ఆగివున్న ప్పుడు స్వామీజీ ఓడ దిగి అచ్చటికి మూడుమైళ్ల దూరంలో వున్న కొన్ని ప్రదేశాలలోని విశేషాలను తిలకించటానికి వెళ్లారు. వారి శిష్యులు వారిని అనుసరించి వెళ్లారు.

వారందరూ అచ్చట సంచరిస్తుండగా స్వామీజీ అక్కడ తమల పాకులు విక్ర యిస్తున్న ఒక భారతీయుణ్ణి చూచారు. స్వామీజీ తన సహచరుల్ని వదలి దూరంలో కూర్చొనియున్న ఆ భారతీయుని అతివేగంతో సమీపించారు. చాలాకాలం తర్వాత ఒక భారతీయుణ్ణి కలసి అతనితో సంభాషించటంలో అమిత ఆనందాన్ని పొందారు.

అది అలావుండగా స్వామీజీ శిష్యులు ఆయన కొరకు అన్వేషించటం ఆరంభిం చారు. స్వామీజీ ఎటు వెళ్లిందీ వారు గమనించలేదు. తర్వాత కొంత సమయానికి తమలపాకులు అమ్మేవాని ప్రక్కన ఉల్లాసంగా కూర్చొనియున్న స్వామీజీని వారు చూచారు. అది యొక అత్యద్భుత దృశ్యంగా వారికి గోచరించింది. స్వామీజీ తమల పాకులు విక్రయించే వాని హుక్కాను అడిగి తీసికొని పీల్చటం ఆరంభించారు. అలా హుక్కా త్రాగుతూ స్వామీజీ పొందుతున్న సంతృప్తిని కాంచిన ఆయన శిష్యులు, కెప్టెన్ సేవీయర్ కూడ ఆయన

నిరాడంబరత్వాన్ని, భారతీయుడైన ఒక సామాన్యుని పట్ల ఆయనకున్న అనురాగాన్ని అమితంగా శ్లాఘించారు.

పాశ్చాత్య దేశ పర్యటన ముగించి భారతదేశం తిరిగి వచ్చిన తర్వాత స్వామీజీ ఆరోగ్యం సంతృప్తికరంగా లేదు. రోజు రోజుకు ఆయన ఆరోగ్య పరిస్థితి క్షీణించటాన్ని గమనించిన ఆయన తోటి సన్యాసులు, హితులు ఆయన్ని విశ్రాంతి కొరకు డార్జిలింగ్ వెళ్లమని సలహా యిచ్చారు. స్వామీజీ వారి సూచనను పాటించి డార్జిలింగ్ చేరారు.

ఒకరోజు ఉదయం స్వామీజీ బయట నడుస్తుండగా ఒక భూటియాజాతి స్త్రీ మోయలేని బరువుతో క్రుంగి నడుస్తున్న దృశ్యం ఆయన కంటబడింది. ఆ స్త్రీ యొక్క వేదనను గాంచిన స్వామీజీ హృదయం ఆమె కొరకు తల్లడిల్లటాన్ని ఆయనతో వున్నవారు గమనించారు. హఠాత్తుగా ఆ స్త్రీ తొట్రుపాటుతో వీపుమీది బరువుతో సహా క్రింద పడ్డది. దానితో ఆమె ప్రక్క ఎముకలు తీవ్రగాయాలకు గురియైనాయి. అదే సమయంలో స్వామీజీ తన ప్రక్క ఎముకల్లో భరించలేని బాధను అనుభవించారు. ఆయన ముందుకు నడవలేక బాధతో అక్కడే నిలబడిపోయారు. "మీకు బాధ ఎక్కడ, స్వామీజీ" అని ఆయన సహచరులు ప్రశ్నించారు. 'ఇచ్చటే' అని స్వామీజీ తన ప్రక్క ఎముకల్ని చూపారు. "మీరా స్త్రీ యొక్క గాయాన్ని, వేదనను పరిశీలించలేదా?" అని ఆయన తన సహచరులను ప్రశ్నించారు.

తోటి మానవులపై సానుభూతిని ప్రదర్శిస్తూ, వారి బాధలకు స్పందించే మహనీయుల విషయంలో ఇలాంటి అనుభవాలు అరుదుగానైనా సంభవిస్తూనే వుంటాయి. శ్రీరామకృష్ణుల జీవితంలో కూడ ఇలాంటి సంఘటనలు వుండేవి. ఒక రోజు శ్రీరామ కృష్ణులు ఒక పడవ సరంగు మరొక పడవ సరంగును తీవ్రంగా కొట్టడాన్ని చూచి బాధతో విలపించారు.

స్వామీజీ గొప్పవారై వేలకు వేల శిష్యులతో, భక్తులతో పూజింపబడే స్థితిలో కూడ తన స్నేహితుల పట్ల పూర్వపు నరేన్‌గానే వ్యవహరించేవారు.

ఆయన లాహోరులో వుండగా ఆయన బాల్యమిత్రుడైన మోతీలాల్‌బోసును అనుకోకుండా కలియటం జరిగింది. గ్రేట్ ఇండియన్ సర్కస్‌కు అధిపతియైన మోతీలాల్ తమ ప్రదర్శన నిర్వహణ సందర్భంలో అచ్చట వున్నాడు. చాలా సంవత్సరాల తర్వాత తన బాల్య మిత్రుణ్ణి కలిసికొన్న ఆనందంలో స్వామీజీ అతనితో చాలసేపు సంభాషించారు. మహోన్నత స్థితిలో వున్న స్వామీజీ ప్రక్కన నిలబడి మాట్లాడటానికి మోతీలాల్ చాల ఇబ్బందికి గురియై, "సోదరా, నిన్ను 'నరేన్' అని పిలవాలా లేక 'స్వామీజీ' యని సంబోధించాలా" అని అడిగాడు.

ఆ ప్రశ్న వింటూనే స్వామీజీ నవ్వి, "మోతీ నీకేమైన పిచ్చిపట్టిందా? నేనేమీ మారలేదు. నీవు నాకు బాల్యమిత్రుడవైన 'మోతీ' వే, నేను నీకు 'నరేన్' నే." స్వామీజీ నోటి నుండి వెలువడుతున్న ఆ పలుకుల్లోని ఆప్యాయత, ఆర్ద్రత, మార్దవం మోతీలాల్‌ని ముగ్ధుణ్ణి చేశాయి. స్వామీజీ పట్ల అతనికప్పటివరకు వున్న భయం పటాపంచలైంది.

స్వామీజీ అమెరికా నుండి తిరిగవచ్చిన తర్వాత తనకు సన్నిహితులైన స్నేహితు లను, శిష్యులను కలుసుకోటానికి అల్వార్ పట్టణం వెళ్లారు. అక్కడ హృదయం స్పందించే సన్నివేశం ఒకటి సంభవించింది. ఆల్వార్ రైల్వే స్టేషన్ వద్ద స్వామీజీ యొక్క అభిమానులు, స్నేహితులు, హోదాగల వ్యక్తులు చాలమంది ఆయనను స్వాగతించటానికి గుమిగూడారు. అచ్చటకు చేరిన స్వామీజీ దృష్టి ఈ గుంపునకు ఎడంగా నిలబడియున్న ఒక అతిసామాన్యునిపై పడింది. అతని వస్త్రధారణ కూడ సవ్యంగా లేదు. ఐనా అతడు చాలాకాలం తర్వాత స్వామీజీని దర్శించటం

చేత అమితమైన ఆనందాన్ని పొందాడు. అతడు కూడ స్వామీజీని సమీపించి నిలబడాలని ఆకాంక్షించాడు. కాని అచ్చట సమావేశమైన సమూహాన్ని ఛేదించి ముందుకు చొచ్చుకుపోవటానికి అతనికి ధైర్యం చాలలేదు. ఇదంతా పరికించిన స్వామీజీ అతని వైపు చూచి 'రామస్నేహి' అని బిగ్గరగా పిలిచారు. అప్పుడా జనసమూహం ఆ నిరాడం బరుడు స్వామీజీని చేరుటకు త్రోవను కల్పించారు. అప్పుడతను ఆనందంతో స్వామీజీని సమీపించి అభినందనలు తెల్పాడు. స్వామీజీ అతి వాత్సల్యంతో అతన్ని దగ్గరకు తీసికొని సంభాషించారు.

ఆల్వార్‌లో వున్న కొద్ది రోజుల్లో స్వామీజీని ఆయన భక్తులైన ధనికులు విందుకు ఆహ్వానించారు. కాని స్వామీజీ ఒక వృద్ధురాలి ఆహ్వానాన్ని మన్నించి ఆమె ఆతిధ్యం స్వీకరించారు. ఆ వృద్ధురాలు చాల బీదరికం అనుభవిస్తున్నా స్వామీజీ పర్యాటకుడుగా భోజనానికి ఇబ్బంది పడుతున్న రోజుల్లో ఆమె ఆయన్ని ఆదరించి ఆతిధ్యమిచ్చింది. ఆ విషయం స్వామీజీ మరువలేదు. ఆయన ఆల్వార్ చేరగానే తనకు గతంలో ఆమె తయారు చేసి పెట్టిన చపాతీలను తినాలనే వాంఛిస్తున్నట్లు ఆమెకు కబురు పంపారు.

ఆ వార్తవిన్న వృద్ధురాలి ఆనందానికి అవధుల్లేవు. స్వామీజీ ఇచ్చప్రకారం ఆమె చపాతీలను శ్రద్ధగా తయారు చేసి ఆయన కొరకు, ఆయన శిష్యుల కొరకు ఆసక్తితో వేచి వుండి, వారు రాగానే అతి ప్రేమతో వారికి అతిసామాన్యమైన ఆ పదార్థాలను సమర్పించింది. స్వామీజీ ఆమె యొక్క ఆత్మీయతకు, ఆదరణకు ముగ్ధుడై ఆమెపట్ల తనకున్న గౌరవాన్ని తన శిష్యులకు ప్రకటించాడు. ఆయన ఆ ఊరు వదిలి వెళ్లే ముందు ఆ ఇంటి యజమానికి వంద రూపాయలు ఇచ్చి ఆ సొమ్మును ఆ వృద్ధురాలికి అందజేయమని ఆదేశించారు.

1890 సంవత్సరంలో స్వామీజీ స్వామి అఖండానందతో పాటు హిమాలయాల్లో సంచరించారు. ఆ యాత్రలో ఆల్మోరాకు రెండు మైళ్ల దూరంలో వుండగా ఒక రోజున స్వామీజీ ఆకలితో నీరసించి నడిచే ఓపికలేక పడిపోయే పరిస్థితికి వచ్చారు. ఆ సమీపంలోనే నివసిస్తున్న ఒక మహమ్మదీయ ఫకీరు ఆయన్ని చూచారు. స్వామీజీ ఆయనకు పరిచితుడు కాదు. ఐనా ఆయన పరిస్థితిని గమనించి ఆ ఫకీరు ఒకదోసపండును వెంటనే తెచ్చి స్వామీజీకి ఇచ్చాడు. కాని స్వామీజీ ఆ ఫలాన్ని ఎత్తి ఆరగించే స్థితిలో లేరు. అప్పుడా ఫకీరే తన చేతులతో ఆ పండును స్వామీజీ చేతతినిపించాడు. అది ఆరగించిన తర్వాత స్వామీజీకి కొంత స్వస్థత సమకూరింది.

ఏడు సంవత్సరాల తర్వాత స్వామీజీ మరల ఆల్మోరా వెళ్లటం సంభవించింది.ఆ ఊరిలోని ఆయన అభిమానులు ఆయన గౌరవార్థం ఒక సమావేశాన్ని ఏర్పాటు చేశారు. ఆ కార్యక్రమం నడుస్తుండగా స్వామీజీ దృష్టి జనసమూహంలో వున్న ఒకవ్యక్తిపై పడింది. ఆ వ్యక్తి ఎవరో కాదు. ఏడు సంవత్సరాలకు పూర్వం స్వామీజీయొక్క అసువుల్ని కాపాడిన ఆ మహమ్మదీయ ఫకీరే. స్వామీజీ ఆయన్ని గుర్తించిసభావేదికపైకి తీసికొని వచ్చి ఆ ఫకీరు తనను ఒకానొక సమయంలో ఏ విధంగా కాపాడిందీ సభికుల ముందు ప్రకటించారు. తనవద్ద నున్న కొంత సొమ్మును కూడ ఆ ఫకీరునకు సమర్పించారు. కాని ఫకీరు మాత్రం స్వామీజీని గుర్తించలేదు.

ఒక శీతాకాలంలో స్వామీజీ తన సహచరుడు స్వామి నిరంజనానందతో కలసిదేవఘర్ వెళ్లారు. ప్రియానాథ్ ముఖర్జీ అనే వారు వీరికి ఆతిధ్యం ఇచ్చారు. ఒకరోజు తన సహచరునితోబాటు బయట విహరిస్తుండగా బాధతో విలవిలలాడుతూ రోడ్డుప్రక్కన నిస్సహాయంగా పడియున్న వ్యక్తిపై స్వామీజీ దృష్టి పడింది. స్వామీజీ అతన్నిసమీపించి అతడు

అతిసార వ్యాధితో బాధపడుతున్నట్లు గమనించారు. వైద్యసహాయం అతనికి అవశ్యం సమకూర్చాలి. కాని ఆ ప్రదేశాన్నుండి ఒక మంచి స్థలానికి అతన్ని వెంటనే తరల్చాలి. ఎక్కడకు తీసికొని వెళ్లటం అని మధనపడి చివరకు తనకు ఆతిధ్యం ఇస్తున్న ప్రియానాథ్ ఇంటికే తీసికొని వెళ్లారు. అచ్చట అతనికి ప్రక్క ఏర్పాటుచేసి తానే సకల ఉపచారాలు నిర్వర్తించి ఆ బాధితుని రోగాన్ని నివృత్తి చేయగల్గారు. స్వామీజీ యొక్క మానవసేవా తత్పరతను, ఆయన కారుణ్య భావాన్ని స్వయంగావీక్షించిన ప్రియానాథ్ ముఖర్జీ స్వామీజీని వేనోళ్ల శ్లాఘించాడు. అంతేకాని ఒక అపరిచిత వ్యాధిగ్రస్తుణ్ణి తన ఇంటికి తెచ్చినందుకు స్వామీజీ పట్ల చికాకునుప్రదర్శించలేదు.

గోసంరక్షణ సంఘ ప్రచారకుడొకరు ఒక పర్యాయం స్వామీజీని కలసి ఆర్థిక సహాయాన్ని అర్థించారు. ఆ సంఘం తల్లి ఆవుల్ని కసాయి వారి నుండి రక్షించటానికి దేశంలో పలుప్రాంతాల్లో గోసంరక్షణ శాలల్ని స్థాపించిందని ఆయన చెప్పాడు. ఆయన మాటల్ని స్వామీజీ సావధానంగా విని ఆయన్ని ఒక ప్రశ్నవేశారు. “మధ్య భారతదేశంలో ప్రబలమైన కరువుకాటకాల కారణంగా సుమారు తొమ్మిది లక్షల మంది ప్రజలు మరణించినట్లుగా భారత ప్రభుత్వం ప్రకటించింది. అచ్చటి ప్రజానీకం సహాయార్థం మీ సంఘం ఏమైనా చేసిందా?” దానికి సమాధానంగా ఆ ప్రచారకుడు, “మా సంఘం కేవలం గోవులను సంరక్షించుటకు ఏర్పడింది. కనుక కరువుతో బాధపడే మానవులకు మేము ఏమీ చేయనవసరం లేదు. అంతేగాదు, అచ్చటి ప్రజలు వారు చేసికొన్న కర్మఫలితాల్ని వారు అనుభవిస్తున్నారు” అని తెలిపాడు.

దయారహితమైన ఆయన వివరణ స్వామీజీకి ఆగ్రహం కల్గజేసింది. ఐనా స్వామీజీ తన ఆవేశాన్ని అణచుకొని ఆయనతో దృఢమైన స్వరంతో “తోటి మానవుని విషయంలో

స్పందించని, ఆకలితో అలమటిస్తూ అసువుల్ని పోగొట్టుకుంటున్న ప్రజలను రక్షించుటకు ఉద్యమించని సంఘాలపట్ల నాకు రవంతయైన ఆదరణ భావం జనించదు. మానవ సంరక్షణను నిర్లక్ష్యం చేసి, జంతువులకు, పక్షులకు దయాదాక్షిణ్యాలపేరుతో ఆహారాన్ని సమృద్ధిగా సమకూర్చే సంఘాలు సమాజానికి నిరర్ధకాలు. నీవు చెప్పిన కర్మ సిద్ధాంతాన్ని గోవులకు కూడ అనువర్తింపచేస్తే, అవి కసాయి వారి చేత చంప బడటం అవి చేసుకున్న కర్మానుభవంగా సమాధానపడాలి కదా" అని ప్రశాంతంగానే సెలవిచ్చారు.

ఆ ప్రచారకునకు అప్పుడేమి మాట్లాడాలో స్ఫురించలేదు. ఐనా తన వాదనను బలపరచుకునే ప్రయత్నంలో, "స్వామీజీ మీరు ప్రకటించిన సిద్ధాంతం సత్యమైనదే. ఐనా మన శాస్త్రాలు గోవును మాతగా అభివర్ణించినాయి గదా" అని సమాధాన మిచ్చాడు. దానిపై స్వామీజీ వ్యంగ్య ధోరణిలో, "అవును, నీవు చెప్పిందీ యథార్థమే. సర్వజ్ఞులైన సంతతిని ప్రసాదించటం గోవులకు తప్ప మరెవరివల్ల సాధ్యమౌతుంది?" అని చమత్కరించారు.

స్వామీజీ మాటల్లోని అంతరార్ధం ఆ ప్రచారకుడు గ్రహించలేక తమ గో సంరక్షణ సంఘానికి ధన సహాయం చేయమని మరల అర్ధించాడు. స్వామీజీ, "నేనొక సన్యాసిని, కాసులు లేని ఫకీరుని. నేను నీకు ఆర్ధిక సహాయం చేయటం అసాధ్యం. ఐనా భవిష్యత్తులో నా చేతికి ధనం లభించినప్పుడు మానవుల కొరకు ముందు వెచ్చిస్తాను. మానవ సంరక్షణ ప్రముఖమైంది. మానవునకు ఆహారం, విద్య, ఆధ్యాత్మిక చింతన అవశ్యంగా సమకూర్చాలి. మానవుని అవసరాలను తీర్చగా మిగిలిన ధనం మీ సంఘం వినియోగం కొరకు ఈయగలను" అని బదులిచ్చారు.

'హితవాది' పత్రిక యొక్క ప్రసిద్ధి చెందిన సంపాదకుడు పండిట్ శఖరమ్ గణేశ్ దియోస్కర్, ఆయన మిత్రులిద్దరు కలసి స్వామీజీని దర్శించటానికి వచ్చారు.ఆ ఇరువురి

స్నేహితులలో ఒకరు పంజాబియని తెలుసుకున్న స్వామీజీ పంజాబులోప్రబలియున్న తీవ్ర ఆహారకొరతను గురించి ఆర్తితో దీర్ఘంగా ప్రసంగించారు. ఆసమయంలో భారతదేశంలో విస్తరించియున్న కరువుకాటకాల పరిస్థితి స్వామీజీమనస్సును పూర్తిగా ఆకట్టుకుంది. అందుచేత ఆయన వచ్చిన వారితో ఆధ్యాత్మిక విషయాలను గురించి చర్చించలేదు. స్వామీజీ వద్ద వీడ్కోలు తీసుకునే సమయంలోపంజాబీ చాల అసంతృప్తిని వెలిబుస్తూ ఇలా అన్నాడు. “స్వామీజీ, మతపరమైనవిషయాలపై మీ విలువైన భాషణ వినాలని చాల ఆసక్తితో ఈ రోజు ఎదురు చూచాం.కాని దురదృష్టవశాత్తు మన ప్రసంగం ప్రాపంచిక విషయాలపై మరలింది. మన సమయం అంతా వృధా అయిందని భావిస్తాను.”

ఆ మాటలు వినగానే స్వామీజీ ఆవేశపూరితుడై ఆ పంజాబీతో, “అయ్యా, నాదేశంలో మామూలు వీధి శునకం తిండిలేక నకనకలాడుతున్నా, నా మనస్సు చలిస్తుంది.ఆ కుక్కకు ఆహారాన్ని సమకూర్చి దాని రక్షణను చూడటమే అప్పటికి నా మతం అవుతుంది. మిగతా వ్యాసంగం అంతా మతరాహిత్యమే అవుతుంది” అనిభావావేశంతో ఉద్ఘాటించారు. వచ్చిన ఆ ముగ్గురకు స్వామీజీ పలుకులు ఒక సందేశజ్వాలవలె భాసించాయి. స్వామీజీ పరమపదించిన కొన్ని సంవత్సరాల తర్వాత పండిట్‌దియోస్కర్ ఆ సంఘటనను ముచ్చటిస్తూ, స్వామీజీ ఆ సందర్భంలో పలికిన వచనాలుతన మనస్సులో గాఢంగా నాటుకొని దేశభక్తి అంటే యథార్థమైన నిర్వచనాన్ని ప్రప్రథమంగా విశదీకరించాయని కీర్తించాడు.

ఉత్తర భారతీయుడు, వేదాంతంలో నిష్ణాతుడైన పండితుడొకడు స్వామీజీ వద్దకువెళ్లాడు. వేదాంత విషయాలపై స్వామీజీతో చర్చించి పాండిత్యంలో ఆయనకంటేతాను మిన్నయని నిరూపించుకోవాలని ఆ పండితుని ఆకాంక్ష. కాని స్వామీజీమానసికంగా వేదాంత విషయాలు చర్చించటానికి అప్పుడు సిద్ధంగా లేరు. దేశ వ్యాప్తంగా విస్తరించియున్న

తీవ్రకరువుకాటకాల ఒత్తిడిలో కునారిల్లుతున్న ప్రజలదుస్థితి స్వామీజీ మనస్సును కలచివేస్తున్నది. ఆ స్థితిలో ఆయన ఆ పండితునితో, "పండిట్‌జీ, ముందుగా మీరు మన దేశ ప్రజల ఆహార పరిస్థితిని చక్కదిద్ది, వారిక్షుద్బాధను నివారించటానికి కృషి చేయండి. తర్వాత మనం వేదాంత చర్చలకు ఉపక్రమించవచ్చు. క్షామ పీడిత ప్రజలను ఆకలి చావులనుండి రక్షించుటకై ఉద్యమించితన సర్వస్వాన్ని త్యాగం చేయటం కంటే మిన్నయైన మతధర్మం మరొకటి వుండదు. ఇదే మన వేదాంతంలోని మత సారాంశం" అని ధృవపరిచారు.

స్వామీజీ కాశీపూర్‌లో గోపాల్‌లాల్ సీల్ అనే ఆయన తోటలోని ఇంట్లో బస చేసియున్నారు. ఒక రోజున ఆయన వద్దకొక యువకుడు వచ్చి, "స్వామీజీ, జీవితపరమార్థాన్ని తెలుసుకోవాలనే ప్రయత్నంలో నేను దర్శించని ప్రదేశం లేదు. మతపెద్దలు చాలమంది యొక్క పరిచయ భాగ్యం కూడ నాకు కల్గింది. కాని అసలు సత్యాన్ని తెలుసుకోలేకపోయాను. ప్రతి నిత్యము ఏకాంత ప్రదేశంలో ధ్యాన ప్రక్రియలో నిమగ్నుడనౌతాను. ఐనా నాకు మనశ్శాంతి లభించటంలేదు. ఇలా ఎందువలన జరుగు తోందో సెలవీయండి" అని ప్రాధేయపడ్డాడు.

అతడు చెప్పిందంతా ఓర్పుతో విని స్వామీజీ "వత్సా, నీకు మానసిక ప్రశాంతత చేకూరాలంటే ఇప్పటి వరకు నీవు ఆచరిస్తున్న కార్యక్రమానికి వ్యతిరేకంగా నడచు కోవాలి. నీవు ఏకాంతవాసాన్ని పరిత్యజించి, నీ పరిసరాల్లో వున్న సమాజాన్ని, వారి జీవితాల్ని వీక్షించాలి. సమాజంలో ఎంత మంది పీడిత ప్రజానీకం నీ చేయూతకొరకు అర్రులు చాచి నిరీక్షిస్తున్నారో గమనించాలి. వారికి అవసరమైన సేవల్ని నీ శాయ శక్తులా అందించాలి. తోటి మానవుల బాధలను నివారించుటకు చేసే కృషిలోనే ఆనందం ఇమిడి వుంటుంది. నీవు అన్వేషించే ప్రశాంతత విరివిగా లభ్యమౌతుంది."

దేవఘర్ నుండి తిరిగి వచ్చిన మర్నాడే స్వామీజీ తన తోటి సన్యాసుల్ని ఉద్దేశించి

మీరందరూ మన గురువుగారి సందేశాన్ని ప్రపంచం నలుమూలల ప్రచారం చేయ టానికి సంసిద్ధులుగా వుండాలని ఆదేశించారు. మన ప్రచారం బుద్ధుని శిష్యులు బౌద్ధమతాన్ని విస్తరింపచేసిన రీతిలో సాగాలని కూడ సూచించారు. ఈ ఉద్యమం కొరకు ప్రప్రథమంగా స్వామి విరజానందను, స్వామి ప్రకాశానందను ఎన్నుకొని వారిని తూర్పు బెంగాల్ (ప్రస్తుతపు బంగ్లాదేశ్)కు వెళ్లమని నిర్దేశించారు.

దానిపై స్వామి విరజానంద తనకు విషయపరిజ్ఞానమేమీ లేదని, ఆ స్థితిలో ప్రచారం చేయటం అసాధ్యమని స్వామీజీకి విన్నవించుకున్నాడు. స్వామీజీ "నీవా సంగతినే అచ్చటి ప్రజలకు నచ్చజెప్పు. అదే ఒక విలువైన సందేశం ఔతుంది" అని సమాధాన మిచ్చారు.

కాని విరజానంద స్వామీజీ యొక్క సమాధానంతో సంతృప్తి పడలేదు. తాను ఆత్మజ్ఞాన పరిశోధనలో ఇంకా కృతకృత్యుడు కాలేదని, ఆ సాధనలో ఇంకా కృషి చేయుటకు అవకాశమీయమని స్వామీజీని వేడుకున్నాడు. ఆ యువశిష్యుని ధోరణిని స్వామీజీ నిరసించారు. అతనితో, "నీవు నీ ఆత్మసాక్షాత్కారానికి మాత్రమే ప్రయత్నిస్తే స్వర్గానికి బదులు నరకాన్ని చేరతావు. కనుక ముందుగా ఆ కోర్కెను విరమించుకో. అది చాల కఠినమైన చర్య. నీకు నిజంగా మోక్ష మార్గాన్ని అధిరోహించే తలంపు వుంటే తోటి మానవులు మోక్షం సాధించేందుకు గట్టిగా సహకరించు" అని ప్రబోధించారు.

తర్వాత స్వామీజీ అనునయధోరణిలో మృదుస్వరంతో "వత్సలారా! ఫలాపేక్షరహి తంగా ప్రజాశ్రేయస్సు కొరకు హృదయపూర్వకంగా కృషి చేయండి. పరులకు మేలు జరిగే సందర్భంలో మీరు నరకానికి వెళ్లినా ఇబ్బంది లేదు. మీరు మీ కొరకు మాత్రమే స్వర్గప్రాప్తిని కాంక్షించటం కంటే ఈ మార్గమే ఉత్తమం" అని ఉపదేశించారు.

స్వామీజీ బలరామ్ బసు ఇంట్లో బసచేసి యుండగా ఒక రోజున తన శిష్యుడైన శరత్ చంద్ర చక్రవర్తి ఎదుట వేదాంత విషయాల్ని గురించి అమిత ఉత్సాహంతోప్రసంగిస్తున్నారు. ఆ సమయంలో అచ్చట రామకృష్ణ పరమహంస నివసించిన గృహయజమాని, ఆయన శిష్యుడు ఐన గిరీష్ చంద్రఘోష్ కూడ వున్నారు. హృద యాన్ని ఆకట్టుకునే స్వామీజీ ప్రవచనాన్ని, విషయవివరణను వారిరువురు అత్యంతశ్రద్ధతో ఆలకిస్తున్నారు. ఆ ప్రసంగం అలా కొంతసేపు సాగిన తర్వాత గిరీష్ ఆయనతో "నరేన్, నిన్నొక ప్రశ్న అడుగుతాను. నీవు వేదాలు, వేదాంత ధర్మాలు సునిశితంగా అధ్యయనం చేశావు. దేశంలో ప్రజలు దారిద్ర్యంతో బాధపడుతున్నారు, కడుపునిండా ఆహారం లేక కృశిస్తున్నారు, ఇంకా ఇతర ఈతిబాధలతో కృంగిపోతున్నారు. ప్రజలను ఈ బాధలనుండి విముక్తి చేసే మార్గాలను మన ధర్మశాస్త్రాలు సూచిస్తాయా? ప్రతిరోజుకనీసం యాబది మందికి ఆహారం వండి సమకూర్చే ఒక గృహిణి మూడు రోజులుగాపస్తులుంటోంది. మరొక గృహిణిని రౌడీలు హింసించి చంపివేశారు. మరొకనిస్సహాయురాలైన ఒక వితంతువు యొక్క సంపదనంతను ఆమె బంధువులుదౌర్జన్యంతో గ్రహించి అనుభవిస్తున్నారు. మీ వేదాలు ఈ బాధితులందరికి న్యాయంచేయగలవా? నీ ధర్మశాస్త్రాలు వారి బాధలను నివృత్తి చేయగలవా? సమాజంలో అలాంటి దురాగతాలు, దీనపరిస్థితులు పునరావృతం కావని మీ పవిత్ర గ్రంథాలుహామీ ఈయగలవా?" అని అన్నాడు.

అలా గిరీష్ సమాజంలో ప్రవర్తిల్లుతున్న దుస్థితిని ఏకరువు పెట్టాడు. స్వామీజీనిరుత్తరుడై దిగులుతో కూర్చున్నారు. శోకతప్తులై కన్నీరు కారుస్తూ ఆ ప్రదేశాన్ని వదలి వేగంగా బయటకు వెళ్లారు. అప్పుడు శరత్ చంద్రతో గిరీష్ ఇలా అన్నాడు. "మీ గురువుగారి హృదయం ఎంత ఉదాత్తమైందో గమనించావా? వేదవేదాంగ పారంగతుడని మీ గురువును ప్రేమించను. తోటిమానవుల పట్ల ఆయన ప్రదర్శించే కరుణామయదృష్టి, వారి బాధలకు స్పందించే ఉదార మానసిక ప్రవృత్తి మీ గురువు గారిలో మెండుగా వున్నాయి గనుక నేను ఆయన్ని ఎక్కువగా గౌరవిస్తాను. సారాంశ మేమంటే వేదాలుగాని, వేదాంత ధర్మాలుగాని

వివేకానందున్ని శాసించలేవు. మానవుల పట్ల ప్రేమ, కారుణ్య భావం – ఇవి మాత్రమే ఆయన జీవితానికి కరదీపికలు."

పాశ్చాత్యదేశాల నుండి తిరిగి వచ్చిన తర్వాత స్వామీజీ యొక్క ఆరోగ్యం అతివేగంగా క్షీణించింది. ఆయనకు పూర్తి విశ్రాంతి అత్యావశ్యకం అని ఆయన వైద్యులు సలహా ఇచ్చారు. ఆ సలహాను పాటించి ఆయన డార్జిలింగ్ వెళ్లారు. కాని కొద్ది రోజులు గడిచిన తర్వాత కలకత్తాలో ప్లేగు వ్యాధి తీవ్రస్థాయిలో ప్రబలింది. ఆ వార్త స్వామీజీకి కూడ చేరింది. దానితో ఆయన వ్యాకులత చెంది 1898 ఏప్రిల్ 29 వ తేదీన జోసెఫైన్ మేక్లౌడ్ అనే ఆమెకు ఒక ఉత్తరం వ్రాశారు. ఆ లేఖలోని విషయాలు చదివితే తన ప్రజలకు సంభవించే బాధలకు స్వామీజీ ఎంత తీవ్రంగా స్పందిస్తారో మనకు తెలుస్తుంది. తాను పుట్టి పెరిగిన కలకత్తా నగర వాసులు వ్యాధిగ్రస్తులై పీడింపబడుతుండగా తాను విశ్రాంతితో కాలం గడపలేనని, వెంటనే అక్కడకు వెళ్లి బాధితుల సేవలో తన ప్రాణంతో సహా సర్వం సమర్పించుకుంటానని, అదే స్వర్గప్రాప్తికి తనకు ఉచితమైన మార్గమని ఆ లేఖలో వ్రాశారు. తదనుగుణంగా వెంటనే స్వామీజీ కలకత్తా చేరి అచ్చటి ప్రజల పరిస్థితిని అవగాహన చేసికొన్నారు. వ్యాధికంటె కూడ దానిని గురించిన భయం అచ్చటి ప్రజల మనస్సుల్ని కల్లోలపరుస్తోంది. ప్రజలు భీతావహులై తమ నివాసాల్ని వదలి వెళ్తున్నారు. పరిస్థితిని క్షుణ్ణంగా అర్థం చేసుకొన్న స్వామీజీ ప్రజల భయాన్ని నిర్మూలించే ప్రయత్నంలో ప్లేగ్–కరపత్రం అనే పేరుతో ఒక ప్రకటనను ముద్రించి ప్రజలందరకు అందచేశారు. రామకృష్ణ మిషన్ వ్యాధి గ్రస్తులకు అన్ని రకాల సేవలను విరివిగా అంద చేస్తుందని ఆ కరపత్రంలో ప్రకటిం చారు. నగరంలో పలుచోట్ల సేవా కేంద్రాల్ని నెలకొల్పాలని కూడ స్వామీజీ నిశ్చయిం చారు. ఈ మొత్తం కార్యక్రమానికి అవసరమైన ధనం ఎలా వస్తుందనే సంకోచం ఆయన అనుయాయులకు కల్గింది. అంత పరిస్థితి ఏర్పడితే మనం నివశిస్తున్న మఠాన్ని విక్రయించి ఆ ధనాన్ని వ్యాధి బాధితుల కొరకు

వినియోగిద్దాం. మనం సన్యాసులం కనుక చెట్ల నీడలో నివసించి భిక్షాటనంతో బ్రతుక వచ్చని కూడ స్వామీజీ అన్నారు.

కాని అట్టి పరిస్థితి రాకుండానే వారికి చాలినంత ధనం వదాన్యుల దాతృత్వం ద్వారాను, ఇతర మార్గాల్లోను లభించింది. ఈ సందర్భంలో మనం గమనించవలసింది స్వామీజీ తోటి మానవుల పట్ల కురిపించిన అపార కృపారసం, అవ్యాజప్రేమ. తాను అహర్నిశలు శ్రమించి సమకూర్చుకొని, తన జీవితాశయంగా నెలకొల్పిన మఠాన్ని సహితం ప్రజా శ్రేయస్సుకొరకు, బాధితుల రక్షణ కొరకు, విక్రయించటానికి స్వామీజీ ఈషణ్మాత్రం సంకోచించలేదు. మానవ సేవే మాధవసేవయని విశ్వసించిన మహాత్ము డాయన.

స్వామీజీకి ప్రజలంటే వల్ల మాలిన ప్రేమ, ఆయన ఏకాంతంగా వున్నప్పుడల్లా ప్రజల దీనగాథల్ని తలచుకొని విలపించేవారు. ఆయన మొదటిసారి అమెరికా వెళ్లి తిరిగి వచ్చిన తర్వాత జరిగిన ఒక సంఘటనను గురించి తెలుసుకుందాం. స్వామీజీ బలరాం బసు నివాసంలో బస చేసియున్నపుడు ఒక రోజున స్వామి తురీయానంద ఆయన్ని దర్శించటానికి వెళ్లాడు. ఆ సమయంలో స్వామీజీ ఒంటరిగా ఇంటి వరండాలో ఏదో ఆలోచనలో నిమగ్నుడై నడుస్తున్నారు. పరధ్యానంలో వున్న ఆయన అచ్చట నిలుచున్న తన తోటి సన్యాసిని కూడ చూడలేదు. అలా కొన్ని క్షణాలు గడిచిన తర్వాత స్వామీజీ మీరాబాయి పాటను తక్కువ స్వరంతో గానం చేస్తూ తన్మయత్వం చెందుతున్నారు. ఆయనకు తెలియకుండానే చెక్కిళ్లపై అశ్రుధారలు ప్రవహిస్తున్నాయి. అప్పుడాయన తన రెండు చేతులతోను ముఖాన్ని మరుగు పరచుకొని గోడకు అమర్చియున్న చువ్వలపై ఆనుకొని పాటను కొనసాగించారు. పాట పాడు కుంటూ తనలో తను ఇలా అనుకున్నారు. "నా మనోవ్యధకు హేతువు ఎవరూ తెలుసు కోరు. ప్రజల దైన్యాన్ని చూచి స్పందించని వారికి ఇతరుల బాధలు అర్థం కావు." ఈ సన్నివేశాన్ని

గూర్చి తెల్పుతూ అప్పటి స్వామీజీ పాట తన హృదయాన్ని కలచి వైచి కన్నీటిని స్రవింపజేసిందని స్వామి తురీయానంద బాధపడ్డాడు. స్వామీజీ యొక్క మనోవ్యధకు కారణం తురీయానందకు మొదట అర్థం కాలేదు. విశ్వమానవాళి లోని బాధితులు, పీడిత ప్రజానీకం యొక్క ఇక్కట్లను తలంచుకొని స్వామీజీ కరుణార్ద్ర హృదయం కలత చెందిందని తురీయానంద తర్వాత గ్రహించాడు.

స్వామీజీ రెండవ సారి అమెరికా వెళ్లినప్పుడు ఒక ఆసక్తికరమైన సన్నివేశం సంభవించింది. ఒక రోజున స్వామీజీ ఒక నదీ తీరం వెంబడి నడుస్తుండగా కొందరు యువకులు నదిలోని నీటి మీద వేగంగా కదులుతున్న చిప్పల వరుసను తుపాకీలతోగురి చూసి కొడుతున్న దృశ్యం ఆయనకు కన్పించింది. యువకులందరూ వరుస వారీగా ప్రయత్నిస్తున్నారు. కాని ఒక్కరూ లక్ష్యాన్ని కొట్టలేదు. స్వామీజీ ఇదంతాగమనిస్తూ తనలోతాను నవ్వుకుంటున్నారు. ఆ యువకుల్లో ఒకరు స్వామీజీ యొక్క పరిహాసాన్ని గమనించి పౌరుషంతో స్వామీజీని ఉద్దేశించి “మీరు ఆ లక్ష్యాన్ని గురిచూసి కొట్టండి, చూద్దాం. అది మీరు అనుకున్నంత సులభమైన పనికాదు” అన్నాడు.

స్వామీజీ మారు మాటాడక ఆ యువకుని చేతిలోని తుపాకిని తీసికొని వరుసగాపన్నెండు చిప్పలను కొట్టారు. ఆ యువకులు ఆశ్చర్యచకితులై ఆయన నైపుణ్యాన్నిశ్లాఘించారు. ఆ యువకుల మనస్సును గ్రహించిన స్వామీజీ తానిదివరకెన్నడూతుపాకీని తాకలేదని, తన చిత్తైకాగ్రత సామర్థ్యమే తన విజయానికి మూల కారణమని వారికి విశదీకరించారు.

ఒక పర్యాయం స్వామీజీ విదేశాల నుండి భారతదేశానికి తిరిగివస్తూ కైరోనగరంలో ఆగారు. ఆయనతో బాటు ఆయన పాశ్చాత్య శిష్యులు, ఇతర స్నేహితులుకూడ పలువురు వున్నారు. ఒక రోజున వారందరూ కలసి నగరంలో కాలి నడకతో విహరిస్తూ త్రోవ తప్పి వ్యభిచార గృహాలు వుండే ప్రాంతంలో ప్రవేశించారు. కాని వారు తాము రాకూడని పాపపంకిలమైన ప్రదేశానికి చేరామని గ్రహించి స్వామీజీని అచ్చటి నుండి తీసికొని వెళ్లాలని ప్రయత్నించారు. కాని స్వామీజీ వారితో సహకరించకుండా అచ్చట రోడ్డు ప్రక్కన ఒక బల్లపై అర్ధ నగ్నంగా కూర్చొనియున్న యువతులవద్దకు వెళ్లారు. వారి వైపు దయార్ద్ర హృదయంతో దృష్టిని సారించి స్వామీజీ హీనస్వరంతో, "ఈ అమాయకులు, నిస్సహాయులైన జీవులు తమ సౌందర్యాన్ని అమ్ముకొని అపవిత్రులౌతున్నారు" అని అంటూ విలపించటం ఆరంభించారు. అంతవరకుస్వామీజీ పట్ల అసభ్యపు చేష్టలు ప్రదర్శిస్తూ వున్న వనితలు స్వామీజీ తమ వైపుప్రసరిస్తున్న కరుణాదృష్టికి చలించి సిగ్గుతో తలలు వంచుకున్నారు. స్వామీజీనిదైవత్వాన్ని ఇముడ్చుకున్న ఒక మహనీయునిగా భావించి ప్రస్తుతించారు. ఒక యువతిస్వామీజీ యొక్క ఉత్తరీయపుటంచును ముద్దిడికొని 'స్వామీజీ మీరు భగవత్స్వరూపులు' అని కొనియాడింది. మరొక యువతి పశ్చాత్తాపంతో తన ముఖాన్ని కప్పుకుంది.

స్వామీజీ ఒకసారి రైలులో ప్రయాణిస్తుండగా, వేయించిన పప్పులు అమ్ముకునే ఒక బీద మహమ్మదీయుడు ఆ పెట్టెలోకి ఎక్కాడు. స్వామీజీతో పాటు ఒక బ్రహ్మచారికూడ పయనిస్తున్నాడు. స్వామీజీ అతనితో పప్పులు ఆహారంగా తింటే బలం చేకూరుతుందని ప్రబోధిస్తూ, పప్పులు అమ్ముకునేవాని వైపు చూపిస్తూ బ్రహ్మచారితో 'ఈపప్పులు తిందామా?' అని ప్రశ్నించారు. స్వామీజీ పప్పులు అమ్ముకునే ఆ బీదవానికిసహాయం చేయాలనే సంకల్పంతో వున్నారని గ్రహించిన బ్రహ్మచారి వాని వద్ద పైసా ఖరీదు చేసే పప్పులు కొని అతనికి నాల్గు అణాలు ఇచ్చాడు.

అంతా గమనిస్తున్న స్వామీజీ ఎంత డబ్బు ఇచ్చావని ఆ బ్రహ్మచారిని అడిగారు. నాల్గు అణాలిచ్చానని బ్రహ్మచారి బదులు ఇచ్చాడు. అందుకు స్వామీజీ వాత్సల్య దృష్టితో బ్రహ్మచారి వైపు చూసి "కుమారా, నీవిచ్చింది చాల స్వల్పం. అతనికి ఇంటి వద్ద భార్యా బిడ్డలున్నారు. ఒక రూపాయి ఇవ్వు" అన్నారు. స్వామీజీ ఆదేశానుసారం బ్రహ్మచారి అతనికి ఒక రూపాయి ఇచ్చాడు. ఈ వ్యవహారమంతా నిర్వహించిన స్వామీజీ మాత్రం తాను ఆ పప్పులను తిననేలేదు.

స్వామీజీ యొక్క మానవాతీత స్ఫురణశక్తిని నిరూపించే ఒక సంఘటనను స్వామి విజ్ఞానానంద వెలిబుచ్చారు. బేలూరు మఠంలో స్వామీజీ నివసించే గది ప్రక్క గదిలో స్వామి విజ్ఞానానంద వుండేవారు. ఒక రోజు రాత్రి రెండు గంటలకు విజ్ఞానా నంద నిద్రలేచి బయటకు రాగానే తన గది ముందు చికాకుతో అటు, ఇటు సంచరిస్తున్న స్వామీజీ కంట బడ్డారు. ఆయన స్వామీజీని సమీపించి "స్వామీజీ, మీకు నిద్రరావటం లేదా? ఇంతవరకు శయనించలేదేమి?" అని ప్రశ్నించారు.

"నేను గాఢంగా నిద్రపోతున్నాను. కాని హఠాత్తుగా ఒక విధమైన 'షాక్' నన్ను తట్టి లేపింది. ప్రపంచంలో ఎక్కడో ఒక ప్రమాదం తప్పకుండ సంభవించియుంటుంది. చాలమంది ప్రజలు ప్రాణాలు కోల్పోయి యుంటారు" అని స్వామీజీ అన్నారు.

స్వామి విజ్ఞానానంద ఆయన మాటల్ని అంత లక్ష్యపెట్టలేదు. శయనించి నిద్రించుచున్న స్వామీజీకి ఎక్కడో దూరాన జరిగే సంఘటనను గురించి తెలియటం అసాధ్యమని ఆయనకు తోచింది. కాని మర్నాడు ఉదయం వార్తా పత్రికలో ఫిజినగరం వద్ద అగ్ని పర్వతం బ్రద్దలైందని, చాలమంది ప్రజలు ప్రాణాలు కోల్పోయినారని ప్రకటింపబడింది. ఆ అగ్ని పర్వతం బ్రద్ధలవటం, స్వామీజీ 'షాకు' అనుభవించటం ఒకే ముహూర్తంలో జరగటం ఆశ్చర్యకరం. ఈ వార్త చదువుతూనే స్వామి విజ్ఞానానంద స్వామీజీ యొక్క అపూర్వ

దివ్య స్ఫురణ శక్తికి జోహారులర్పించారు.

స్వామీజీ తన శిష్యులకు తరచుగా భారత దేశ పూర్వోన్నత్యాన్ని, వైభవాన్ని గురించి తెలియజేస్తూ వుండేవారు. భారతదేశ భవిష్యత్తు గతంకంటె ఇనుమడించిన సౌభాగ్య సంపదలతో తులతూగుతుందని కూడ ఆ సందర్భంలోనే చెప్పేవారు. ఒకరోజున బేలూరు మఠంలో ఆయన వారితో, "రానున్న నాల్గైదు శతాబ్దాలలో భారతదేశంలో జరుగనున్న సంఘటనల దృశ్యం నాకు విశదంగా కన్పించింది. దీనిని మీరు విశ్వసించాలి" అన్నారు.

మరొక సందర్భంలో ఆయన ప్రపంచ దేశాల భవితవ్యాన్ని గురించి సంచల నాత్మకమైన ప్రకటనలు చేశారు. "భారతదేశం యాబది సంవత్సరాలలో స్వాతంత్ర్యాన్ని అసాధారణ మార్గంలో సముపార్జించుకుంటుంది. వచ్చే ఇరువది సంవత్సరాలలో ఒక గొప్ప ప్రపంచ యుద్ధం సంభవిస్తుంది. పాశ్చాత్యదేశాలు తమ భౌతికవాదాన్ని విడనాడకపోతే మరొక ప్రపంచ యుద్ధం అనివార్యమౌతుంది" అని స్వామీజీ సూచనలు చేశారు. "భారతదేశం స్వతంత్ర్య దేశం అయిన తర్వాత పాశ్చాత్యుల భౌతికవాదాన్ని ఆశ్రయిస్తుంది. భౌతిక సంపదలో తన గత చరిత్రను అధిగమించే స్థాయికి చేరుతుంది. అమెరికాలాంటి దేశాలు ఆధ్యాత్మికతవైపు పయనిస్తాయి. దానికి కారణం లేకపోలేదు. భౌతిక సంపద సముపార్జన విషయంలో ఆ దేశాలు అత్యున్నత స్థాయిని పొందాయి. ఐనా వారికి నిశ్చలమైన శాంతి లభించటం లేదు" అని కూడ స్వామీజీ ప్రకటించారు.

బ్రిటీషువారు భారతదేశాన్ని విడచి వెళ్లితే, ఆ సమయంలో చైనా వారు మన దేశాన్ని జయించే ప్రమాదమున్నదని స్వామీజీ మరొక సందర్భంలో అన్నారు.

జోసఫైన్ మెక్లౌడ్ స్వామీజీని అమితంగా ప్రశంసించేది. ఆయన్ని తన స్నేహి తుడుగా భావించేది. "స్వామీజీ, మీకు నేను ఏ విధంగా ఎక్కువ స్థాయిలో సాయపడ గలను?" అని ఆమె ఆయన్ని ప్రశ్నించేది. దానికి సమాధానంగా స్వామీజీ "భారత దేశాన్ని ప్రేమించు" అనేవారు.

భారతదేశం యొక్క సంక్షిప్తరూపమే తానని ఒకసారి స్వామీజీ తనను అభి వర్ణించుకొన్నారు. యథార్థంగా భారతదేశంపట్ల స్వామీజీ యొక్క ప్రేమ అపారం. చివరకు భారతదేశమే తాననే తాదాత్మ్యభావం అణువణువునా ఆయన్ని ఆక్రమించింది. వివేకానందయే భారతదేశం; భారతదేశమే వివేకానంద. సిస్టర్ నివేదిత ఈ సత్యాన్నే తన మాటల్లో ఈ విధంగా ప్రతిధ్వనింపచేసింది: "భారతదేశమే స్వామీజీ యొక్క ఆత్మస్పందన. ఆయన గుండె చప్పుళ్లు భారతదేశాన్నే ధ్వనిస్తాయి. ఆయన నాడిలో భారతదేశం సవ్వడిస్తుంది. ఆయన కన్న కలలన్నీ భారతదేశం గురించే. అంతేకాదు తానే భారతదేశం ఐనారు. చివరకు మొత్తం భారతదేశాన్ని తన శరీరంలో ధరించిన మహానుభావుడాయన. ఇంకా చెప్పవలసివస్తే భారతమాత ఆధ్యాత్మికత, ఆమె నిర్మలత్వం, ఆమె జ్ఞానసంపద, ఆమె శక్తి, ఆమె దృక్పథం, ఆమె లక్ష్యం – వీటన్నిటికిస్వామీజీ ప్రతీకగా భాసించారు."

స్వామీజీ జీవితాన్ని మనం అధ్యయనం చేస్తే ఆయన అన్ని విషయాల్లోనూ ఒక విలక్షణ వ్యక్తిగా మనకు సాక్షాత్కరిస్తారు.

దేశాన్ని ప్రేమించటం విషయంలోనేమి, దేశాన్ని గురించి గర్వపడే విషయంలోగాని, దేశశ్రేయస్సు కొరకు కృషి చేసే అంశంలోగాని ఆయనకు ఆయనేసాటి.భారతీయుల నిర్వీర్యత, భీరుత్వం, అసమర్థత – వీటిని గురించి కఠినంగా, తీవ్రపదజాలంతో నిరసించింది కూడ

స్వామీజీయే. భారతీయులను గురించి అతిసన్నిహితంగా ఆయనకు తెలిసినట్లు మరొకరికి తెలియదు. ఆ కారణంచేతనే ఆయనభారతీయుల మంచిని, చెడును కూడ గరిష్ఠస్థాయిలో అభివర్ణించారు. ఒక తల్లి తనబిడ్డ మనోభావాల్ని ఎంత సునిశితంగా పరికించగలదో, అంత సునిశితంగా స్వామీజీభారతీయుల మానసిక స్థితిని దర్శించగల్గారు. భూత, వర్తమాన, భవిష్యత్ కాలాల్లోనిభారతదేశ పరిపూర్ణ ఆకృతిని స్వామీజీ భావ ప్రకటనల ననుసరించి మనం దర్శించవచ్చు. అందువల్లనే రవీంద్రనాథ్ ఠాగూరు, రొమైన్ రొలెండు అనే ఆయనతో "భారతదేశాన్ని గురించి తెలుసుకోవాలని ఆకాంక్షిస్తే వివేకానందుని జీవితాంశాన్ని అధ్యయనం చేయండి" అని అన్నారు.

## విషయసేకరణ చేసిన గ్రంథాలు

*బెంగాలి:* 'యుగనాయక్ వివేకానంద' – స్వామి గంభీరానంద, I, II, III సంపుటములు – మూడవ కూర్పు;

'విశ్వవివేక్' – అసిత్ కుమార్ బందోపాధ్యాయ, శంకరి ప్రసాద్ బాసు, మరియు శంకర్ – రెండవ కూర్పు.

"ప్రత్యక్ష దర్శిర్ స్మృతిపతి, స్వామి విజ్ఞానానంద" జ్యోతిర్మయి బాసురే మరియు సురేష చంద్ర దాసు మొదటి కూర్పు; 'స్వామీజీ స్మృతిసంచయన్' స్వామి నిర్లేపానంద, మొదటి కూర్పు; 'శివానంద స్మృతి – సంగ్రహ' – మొదటి సంపుటము, రెండవ కూర్పు; 'ఉద్బోధన్' – 62 వ సంపుటం – నెం. 10.

*ఆంగ్లం:* 'ది లైఫ్ ఆఫ్ స్వామి వివేకానంద' – ఈస్టర్న్ అండ్ వెస్టరన్ డిసైపిల్స్ –

సంపుటములు I & II – 5 వ కూర్పు; 'రెమినిసెన్సెస్ ఆఫ్ స్వామి వివేకానంద' — ఈస్టర్న్ అండ్ వెష్టరన్ అడ్మైరర్సు — మొదటి కూర్పు; 'స్వామి వివేకానంద ఇన్ అమెరికా : న్యూడిస్కవరీస్' — మేరిలూయి బర్క్, మొదటి సంపుటం — మూడవ కూర్పు.

# స్వామీజీని గురించి ప్రముఖుల ప్రస్తావన

## లియోటాల్‌స్టాయ్

మధ్యయుగం నాటి భారతీయ తాత్త్వికవేత్తలలో శంకరాచార్యుని గురించి, సన్నిహిత కాలంలో రామకృష్ణ పరమహంస, ఆయన శిష్యుడు స్వామి వివేకానందల గురించి టాల్ స్టాయి సునిశితంగా అధ్యయనం చేసినట్లు అలెగ్జాండర్ షిఫ్‌మన్ వ్రాశాడు.

టాల్‌స్టాయ్ తన చివరి దశలో రామకృష్ణుని రచనల్ని గురించి ఎక్కువగా లక్ష్యపెట్టలేదు. తాను అంతకు పూర్వం సమీకరించిన పురాతన ధర్మాల సంపుటిలో మాత్రం రామకృష్ణుని రచనల నుండి సేకరించిన కొన్ని భాగాలను చొప్పించాడు. ఆ సమయంలో ఆయన వివేకానందుని బోధనల పట్లే ఎక్కువ ఆసక్తి ప్రదర్శించాడు.

వివేకానంద తాత్త్విక పరిజ్ఞానంతో 1896 సంవత్సరం సెప్టెంబరు నుండి టాల్‌స్టాయికి పరిచయం వుంది. భారతీయ సంస్కృతిపైన ఒక అందమైన రచన ఆయనకు ఆ సమయంలో పంపబడినట్లు దానిని ఆయన పఠించినట్లు టాల్‌స్టాయి తన డైరీలో వ్రాసికొన్నారు. ప్రాచీన భారతీయ తత్త్వజ్ఞానంపై వివేకానంద 1895 –96 శీతాకాలంలో న్యూయార్కు నగరంలో ఇచ్చిన ప్రవచనాల పరంపరనే ఈ గ్రంథంలో పొందుపరిచారు. ఈ గ్రంథాన్ని టాల్‌స్టాయికి పంపిన విద్యావేత్త ఎ.కె.దత్త ఈ క్రింది విధంగా వ్రాశారు.

"అతి ప్రాచీన కాలంనాటి భారతీయ తాత్త్విక ధర్మ సూత్రాలతో మీ సిద్ధాంతాలు పరిపూర్ణ సాన్నిహిత్యం కలిగియున్నాయి" (ఈ ఉత్తరం ప్రచురింపబడలేదు. కాని టాల్‌స్టాయి

యొక్క పత్రాలతో బాటు భద్రపరచబడింది.) ఆ రచన యొక్క గ్రంథనామం "ది ఫిలాసఫి ఆఫ్ యోగ (రాజయోగ)" – రచించిన వారు స్వామి వివేకానంద (న్యూయార్కు 1896). 1911 సంవత్సరంలో ఆ గ్రంథం రష్యన్ భాషలోనికి అనువ దింపబడింది.

ఆ జాబుకు సమాధానంగా టాల్‌స్టాయి ఒక ఉత్తరం రాశారు. దానిలో ఆ గ్రంథం తనకు బాగా నచ్చిందని, అందులోని 'ఆత్మజ్ఞాన' విషయకమైన తార్కిక చర్చ తనకు ఆమోదయోగ్యంగా వుందని ఉటంకించాడు. (కంప్లీట్ కలెక్షన్ ఆఫ్ వర్క్స్ ఆఫ్ టాల్‌స్టాయి వాల్యూం 69 పేజి 146).

సమకాలీన పెట్టుబడి దారీ విధాన సంస్కృతిపై వివేకానంద ప్రకటించిన నిరసనలు, భౌతిక సంపదపై ఆధ్యాత్మిక శక్తి కున్న ఆధిక్యతను నిరూపిస్తూ ఆయన చేసిన వివరణలు ప్రాచీన భారతీయుల బోధనలకు, వేద ప్రమాణాలకు అనుస్వరాలుగా విరాజిల్లుతూ టాల్ స్టాయి భావనాసరళికి అనుకూలంగా వున్నాయి.

వివేకానంద ఆంగ్లంలో రచించిన 'Speeches and Articles' యొక్క సంపుటి టాల్‌స్టాయి చదివిన రెండవ గ్రంథము. ఈ గ్రంథాన్ని వివేకానంద సహచరుడు ఐ.ఎఫ్. నజీవిన్ 1907 వ సంవత్సరంలో టాల్‌స్టాయికి పంపాడు. ఈ గ్రంథాన్ని పంపేముందు నజీవిన్ టాల్‌స్టాయిని దాన్ని పంపమంటారా యని ప్రశ్నించాడు. దానికి టాల్‌స్టాయి, "ఆయన రచించిన పుస్తకాన్ని తప్పక పంపండి. అలాంటి గ్రంథాల పఠనం సంతృప్తితోబాటు ఆత్మవికాసాన్ని కూడ ప్రసాదిస్తుంది" అని 7 –7–1907 తేదీన సమాధానమిచ్చాడు. (కంప్లీట్ కలెక్షన్ ఆఫ్ వర్క్స్ ఆఫ్ టాల్‌స్టాయి–వాల్యూం 77 పేజీ 151).

1908 సం ॥ లో ఇ.ఎఫ్. నజీవిన్ 'Voice of the peoples' అనే పేరుతో కొన్ని వ్యాసాల సంపుటిని ప్రచురించాడు. వాటిలో వివేకానంద ప్రణీతమైన 'The Hymn of the peoples', 'God and Man' అనే వ్యాసాలు కూడ చేర్చబడియున్నవి. వాటిలో రెండవ

వ్యాసం 'God and Man' టాల్‌స్టాయికి ఎక్కువగా నచ్చింది. దాన్ని చదివిన తర్వాత ఆయన నజీవిన్‌కు లేఖ వ్రాస్తూ, “ఇది చాల అసాధారణమైంది” అని ప్రశంసించాడు. (కంప్లీట్ కలెక్షన్ ఆఫ్ వర్క్స్ ఆఫ్ టాల్‌స్టాయి వాల్యూం 78 పేజి 84).

భగవంతుని గురించి స్కోపెన్ హోవర్ అనే వేదాంతితో వివేకానంద చేసిన వాదనా కుశలతను ఒకసారి టాల్‌స్టాయి శ్లాఘించాడు. వివేకానందుని ఆంగ్ల రచనా సౌరభ్యాన్ని గూర్చి వ్రాస్తూ, “వివేకానందుని ఆంగ్లం అత్యద్భుతం. ఆయన ఆ భాష యొక్క సౌకుమార్యాలను క్షుణ్ణంగా అధ్యయనం చేశారు” అని సూచించాడు. (డి.పి.మకోవిట్‌స్కీ, యస్నయ పోటియాన నోట్సు ఎంట్రీ ఆఫ్ 3 –7–1908).

మార్చి 1909 టాల్‌స్టాయి ప్రజలు అభిమానించే గ్రంథాల జాబితా తయారు చేస్తూ రామకృష్ణ, వివేకానందుల యొక్క మహత్తర సందేశాల్ని కూడ ప్రచురణ పథకంలో చేర్చాడు. (వర్క్స్ ఆఫ్ టాల్‌స్టాయి – వాల్యూం 57, 40 వ పేజీ). 1909 ఏప్రిల్ మాసంలో ఎన్ .యి.ఇన్‌హారిన్ అనే ప్రాక్ దేశస్థునితో “నేను అమితంగా అభిమానించే వివేకానందుని అమూల్య భావాల్ని సంకలనం చేసి ప్రచురించ నున్నాను” అని టాల్‌స్టాయి చెప్పాడు. (వర్క్స్ ఆఫ్ టాల్‌స్టాయి – వాల్యూం 79, 142 వ పేజి) కాని దురదృష్టవశాత్తు ఈ ప్రచురణ కార్యరూపాన్ని తాల్చలేదు.

# రవీంద్రనాథ్ టాగూర్

భారతదేశాన్ని గురించి తెలుసుకోవాలంటే వివేకానందుడ్ని అధ్యయనం చేయండి. ఆయనలో అంతా పురోగామిత్వమే ద్యోతకమౌతుంది. తిరోగమనానికి నైరాశ్యానికి, 'తావుండదు'.

"ప్రతి వ్యక్తిలోను పరబ్రహ్మ శక్తి ప్రజ్వరిల్లుతుంటుంది. పేద ప్రజానీకానికి సేవ చేయటం ద్వారా ప్రజలు తనకు కైంకర్యాన్ని అందజేయాలని పరమాత్మ ఆకాం క్షిస్తాడు" ఈ సూక్తి ఎవరిదోకాదు, వివేకానందునిది. ఇది నా అంచనా ప్రకారం దివ్యసూక్తి. ఈ పవిత్ర సత్యాన్ని పాటించి వ్యక్తి తన స్వార్థ పరత్వపు సంకుచిత దృష్టి నుండి పరిపూర్ణ విముక్తిని సాధించగల్గుతాడు. ఇది ఒక క్రియాకలాపానికి సంబం ధించిన ధర్మ ప్రబోధం కానే కాదు. వ్యక్తి యొక్క బాహ్య జీవన విధానాన్ని శాసించే సంకుచిత నిర్దేశం అంతకంటే కాదు. అస్పృశ్యతను వ్యతిరేకించే ధర్మసూత్రం దీనిలో ఇమిడియుంది. దాని వలన రాజకీయ స్వాతంత్ర్యం సాధించే తలంపులేదు. కాని దాని ద్వారా వ్యక్తిని తక్కువ చేసి నిరాదరించే తత్వాన్ని రూపుమాపే మహత్తర సందేశం వుంది. మనిషి మరొక మనిషిని తక్కువస్థాయి వానిగా భావించి నిరాదరించటం ఆ సమాజానికే సిగ్గుచేటు.

వివేకానందుని సందేశం మొత్తం మానవజాతిని జాగృతం చేసింది. ఆ స్ఫూర్తితో యువతరం తమ కృషి, త్యాగాల ద్వారా సమాజంలోని అసమానతలను నిర్మూలించ టానికి వివిధమైన ఉద్యమాలను చేపట్టింది.

సన్నిహితకాలంలో భారతదేశంలో కర్తవ్యం, అకర్తవ్యం అనే నిబంధనలతో బంధింపబడని సందేశాన్ని సమాజానికి వివేకానంద మాత్రమే ప్రబోధించారు. జాతిలో ప్రతి ఒక్కరిని సంబోధిస్తూ స్వామీజీ, "మీలో ప్రతివానిలోను పరమాత్ముని శక్తి ఆవిర్భవించియుంది. పేద జనంలోని పరమాత్మకు మీరందరూ సేవలందించాలని పరమాత్మ

ఆశయం" అని అన్నాడు. ఈ సందేశం మొత్తం యువతరం హృదయాల్ని విస్తృతంగా ఉత్తేజపరచింది. అందువల్లనే ఈ సందేశం ఫలవంతమై జాతికి అనేక మార్గాల్లో, అనేక త్యాగాల రూపంలో ప్రయోజనం సిద్ధింపచేసింది. అదే సమ యంలో ఈ సందేశం వ్యక్తి యొక్క గౌరవాన్ని, స్థాయిని, వాటితోబాటు శక్తి సామర్థ్యాల్ని పెంపొందించింది. అలా పెంపొందిన శక్తి సామర్థ్యాలు ఒక అంశానికి మాత్రమే పరిమితం కాలేదు. అతని జీవితాన్ని వివిధ రంగాల్లో ప్రజ్వరిల్ల చేయటానికి ఆవశ్యకమైన అత్యద్భుత చైతన్యాన్ని సమకూర్చినాయి. నేటి బెంగాలు యువజనుల సాహసచర్యలకు వివేకానందుని సందేశం ఉత్ప్రేరకమైంది. ఆయన సందేశం వ్యక్తి యొక్క భౌతిక శక్తులను రక్షించదు. అది అతని ఆత్మను ఉత్తేజపరుస్తుంది.

# శ్రీ అరవిందులు

భారతదేశం యొక్క ఆత్మ మతం ద్వారానే జాగృతమైంది. మన చరిత్రలో ఎన్ని సంకేతాలు, భవిష్యద్సూచికలు కన్పట్టినా, విద్యావేత్తలైన బెంగాలు యువతారలు ఒక పాశ్చాత్య నాగరికతతోగాని, విజ్ఞానంతోగాని సంపర్కం లేని స్వయంప్రకాశకుడు, మాహత్తర శక్తులు గల ఒక యోగిపుంగవుని ముందు మోకరిల్లి గౌరవించిన నాడే మనకు విజయం ప్రాప్తించిందని చెప్పాలి. మొత్తం ప్రపంచాన్ని తన చేతుల మీదుగా నడిపి, సత్ఫలితాల్ని సాధించగల సామర్థ్యం వివేకానందునిలో ఆయన గురువర్యులు గమనించారు. భారతదేశం చైతన్యవంతమై, తాను జీవిస్తూ, విజయపరంపరలో సాగి పోగలదని ప్రపంచానికి ప్రథమ సంకేతం ఆనాడే ఈయబడింది. మతపరంగా ఆత్మవికాసాన్ని సంతరించుకొన్న జాతికి తాత్త్విక వ్యాసంగాన్ని, వైజ్ఞానిక కార్యక్రమాన్ని జాతి జీవనంలో మలచుకోవటం, వాటి మీద పట్టు సాధించటం దుర్లభం కాదు. కొంత సమయం, కొన్ని అవకాశాలు లభిస్తే చాలు.

వివేకానందుని ధైర్యసాహసాలు అసమానం; ఆయన పురుష సింహంగా వెలుగొందారు. ఆయన వదలివెళ్లిన కార్యక్రమం ఆయన సృజనాత్మకశక్తి, పటిమలతో పోలిస్తే అత్యల్పం. ఆ మహనీయుని దివ్యశక్తి యొక్క ప్రభావం ఇప్పటికీ అత్యున్నత స్థాయిలో మనపై ప్రసరిస్తూనే వుంది. అది ఎక్కడ ఏరూపంలో వుందో మనం ఊహించలేము. కాని అది చాల పటిష్ఠమైందిగా, ఉత్కృష్టమైందిగా భారతావని యొక్క ఆత్మలో భాగంగా భాసిస్తోంది. ఆ విధంగా వివేకానంద తన మాతృభూమి యొక్క, ఆమె సంతతి యొక్క హృదయాల్లో నివసిస్తూనే వున్నారు.

ఒక వంద లండన్ కాంగ్రెసులు సాధించలేని ఫలితాన్ని స్వామి వివేకానందుని అమెరికా సందర్శనం, తర్వాత వారి అనుయాయులు నిర్వహించిన ప్రచారాలు భారతదేశానికి సమకూర్చాయి. భారతజాతి గర్వించదగిన ప్రాచీన సంప్రదాయాల్ని గురించి, ఆ సంస్కృతిని,

యోగ్యతలను ఇప్పటి ప్రజలు కూడ సంరక్షించుకొంటున్న వైనం వివేకానందుని ద్వారా, ఆయన అనుయాయుల ద్వారా ప్రపంచజాతుల ముందు వివరింపబడటం ముదావహం. భారతజాతి ఇతర ప్రపంచదేశాలకు ఈయదగిన సంస్కృతి కల్గియున్నదని, స్వతంత్రదేశంగా భాసించే యోగ్యతలను పొందియున్నదని వివేకానంద నిరూపించారు; స్వాతంత్ర్య సముపార్జన అభ్యర్ధనల ద్వారా గాక శౌర్యంతో, పురుషకారంతో భారతీయులు చేయగలరని ఋజువు చేశారు.

# బ్రహ్మబాంధవ ఉపాధ్యాయ

నేను కొద్ది రోజులు బోల్‌పూర్‌లో గడపటానికి వెళ్లాను. నా తిరుగు ప్రయాణంలో హౌరా స్టేషన్‌లో దిగాను. అచ్చట ఎవరో స్వామి వివేకానంద దివంగతులైనారని చెప్పారు. ఆ పిడుగు లాంటి వార్త నా హృదయాన్ని కలచివేసింది. గుండెలో ఎవరో బాకు పెట్టి పొడిచినట్లయింది. నిదానంగా ఆ బాధ తీవ్రత సమసిపోయిన తర్వాత ఆలోచించసాగాను. 'వివేకానంద ఆరంభించిన ఉద్యమం ఎలా కొనసాగగలదు? సుశిక్షితులైన, విద్యావంతులైన ఆయన శిష్యులున్నారు. వారు దీక్షతో ఆ కార్యక్రమాన్ని నిర్వహించగలరు' అని నాకు నేను సమాధానం చెప్పుకున్నాను. ఐనా నాలో ఒక భావావేశం ఉత్పన్నమై 'నీకు సాధ్యమైనంత కృషిని సమకూర్చి, పాశ్చాత్యులను మనవైపు త్రిప్పుకునే యత్నంలో స్వామీజీ కన్న కలలను కార్యరూపంలో పెట్టు' అని నన్ను ప్రబోధించినట్లనిపించింది. అదే క్షణంలో నేను వెంటనే ఇంగ్లండు వెళ్లాలనే నిర్ణయం తీసికొన్నాను. అంతవరకు నేను ఇంగ్లండు వెళతానని కలలో కూడ తలంచలేదు. కాని ఆ రోజు హౌరా స్టేషనులో నేను ఇంగ్లండు వెళ్లి మన వేదాంతాన్ని అచ్చట ప్రచారంచేసి స్థాపించాలనే దృఢ నిశ్చయానికొచ్చాను. ఆ సమయంలో వివేకానంద ఒక మహాత్ముడని నాకు ద్యోతకమైంది. ఒక సామాన్య మానవుడనైన నాలో ప్రేరణను కల్పించి సముద్రాలు దాటే ప్రయత్నానికి పురికొల్పగల శక్తి సామాన్యులకుండదు. కొద్ది దినాల తర్వాత కలకత్తా వదలి ఇంగ్లండుకు ప్రయాణమయ్యాను. అప్పుడు నా వద్ద కేవలం 27 రూపాయలు మాత్రమే వున్నాయి. చాలా శ్రమచేసి ఎట్టకేలకు ఇంగ్లండు చేరి ఆక్సఫర్డు, కేంబ్రిడ్జి విశ్వవిద్యాలయాల్లో మన వేదాంతంపైన ఉపన్యాసాలు ఇచ్చాను. అచ్చట ప్రఖ్యాతులైన ఆంగ్లేయ విద్యావంతులు నా ప్రవచనాలను విని ప్రభావితులైనారు. మన వేదాంత విజ్ఞానాన్ని బోధించగల హిందూ విద్యావంతుల్ని నియమించుకొని అధ్యయనం చేయాలనే ఆకాంక్షను వారు వెలిబుచ్చారు. ఆ సందర్భంలో వారు మన వేదాంతాన్ని ప్రశంసిస్తూ నాకు వ్రాసిన లేఖలను ఇక్కడ ప్రకటించటం లేదు. ఆ లేఖలు చదివితే ఇంగ్లండు విద్యావేత్తలను మన

వేదాంతం ఏ స్థాయిలో ప్రభావితం చేసిందో విశదమౌతుంది. ఒక అతిసామాన్యుడనైన నా చేత ఇంత మహత్తర కార్యాన్ని సాధింపచేసిన మహోజ్జ్వల శక్తి వివేకానందునిది తప్ప నాది కాదు. అందువల్లనే వివేకానంద ఒక సామాన్య మానవుడు కాదని ఆయన నా ఊహకందని దివ్య పురుషుడనే విశ్వాసం నాలో బలపడింది. అలాకానిచో ఒక మహోన్నత కార్యక్రమాన్ని సాహసోపేతంగా ప్రారంభించటం సామాన్య మానవుని వల్ల కాని పని.

ఒకానొక సందర్భంలో కలకత్తాలోని హేదుయా పార్కువద్ద వివేకానందుడ్ని నేను కలియటం తటస్థించింది. అప్పుడాయనతో, "సోదరా! మీరు మౌనంగా వుండ టాన్ని నేను సహించలేను. కలకత్తాలో వేదాంతాన్ని గురించి మీ ప్రవచన భేరిని మోగించండి. అవసరమైన ఏర్పాట్లు నేను చేస్తాను. మీరు ప్రజల ముందు దర్శనమిస్తే చాలు" అని అన్నాను. దానితో వివేకానందుని కంఠస్వరం విచారంతో రుద్ధమయింది. ఆయన నాతో ఇలా అన్నారు : "సోదరా, భవానీ, నేను ఎక్కువ కాలం జీవించను. (ఇది ఆయన ఇంకా 6 నెలలకు మరణిస్తారనగా జరిగిన సంఘటన.) నేను ప్రస్తుతం మఠ నిర్మాణం విషయంలోనూ, దాని సక్రమ నిర్వహణ విషయంలోనూ నిమగ్నమై యున్నాను. ప్రస్తుతం నాకు విశ్రాంతి లభించటం లేదు". కరుణార్ద్రతతో కూడిన నిజాయితి ఆయన వాక్యాల్లో ధ్వనించింది. ఆ మాటల వెనుక నిబిడీకృతమైన ఆయన ఆవేదన, వేదన నాకు అవగతమయ్యాయి. ఆవేదన ఎవరికొరకు? వేదన దేని నిమిత్తం? ఆవేదన, వేదనలు కూడ దేశం కొరకే. ఆర్ష విజ్ఞాన సంస్కృతులు నలిగి నశిస్తున్నాయి. అనార్య ప్రవృత్తి ప్రబలి సున్నితమైన ఆర్యనాగరికతను పీల్చిపిప్పి చేస్తోంది. ఐనా ప్రజల్లో స్పందనలేదు. జాతి యొక్క ఈ నిర్లిప్త స్థితి వివేకానందుని హృదయాన్ని వేదనకు గురిచేసింది. ఇదే విషయం అమెరికాలోను, ఐరోపాలోను సరియైన జాగృతిని విస్తరింపచేసింది. తన దేశ శ్రేయస్సుకొరకు తపనబడే తాదాత్మ్య భావం కల్గిన మహనీయుడే వివేకానంద. ఆ సత్యాన్ని గ్రహించిన వాడే వివేకానందుని నిజ స్వరూపాన్ని అవగాహన చేసికోగలడు.

"స్వామీజీ, నేను నీ బాల్య మిత్రుణ్ణి. నీ సహచర్యంలో నేను ఉల్లాసంగా, వినోదాలతో కాలం గడిపాను. నీతో అనేక విహారయాత్రల్లో పాల్గొన్నాను. మనం అప్పుడు పరస్పర సంభాషణల్లో మునిగితేలేవాళ్లం. కాని నీలో ఇంతటి కార్యదక్షత, దేశం కొరకు అనునిత్యం అలమటించే ఉన్నత హృదయం వుందని నేనప్పుడు గమనించలేదు. ఈ రోజు, నాకున్న ఈ కొద్ది సామర్థ్యంతో నీ బాటను అనుసరించ టానికి ఉద్యుక్తుడనయ్యాను. ఈ క్లిష్టమైన ఉద్యమ పంథాలో నిరాశా నిస్పృహలు నన్నావరించినప్పుడల్లా మా ముందు నీవుంచిన మహదాశయాన్ని జ్ఞప్తికి తెచ్చుకొని, సాహసోపేతమైన నీ శక్తిని, నీ దేశ సేవాతత్పరతను మననం చేసుకొని, ఆ స్ఫూర్తితో నా బలహీనతలను అధిగమిస్తాను. ఒక దివ్యజ్యోతి, ఒక అపూర్వశక్తి ఆ సమయంలో నాకు సహకరించి నా మనస్సుకు, హృదయానికి ఊరటను, సంతృప్తిని ప్రసా దిస్తాయి".

# బాలగంగాధర తిలక్

శ్రీ వివేకానంద స్వామి పేరు తెలియని హిందువెవరూ వుండరు. 19 వ శతాబ్దంలో భౌతికశాస్త్ర విజ్ఞానం అపరిమితంగా పురోగమించింది. అలాంటి పరిస్థితుల్లో భారతదేశంలో వేల సంవత్సరాలుగా ప్రచారంలో వున్న ఆధ్యాత్మిక విజ్ఞానాన్ని పాశ్చాత్య విద్యావేత్తల ముందు ప్రవచించటం, వారి మన్ననలు, ప్రశంసలు పొందటం, వానితో బాటు తాత్త్విక విజ్ఞానానికి పుట్టినిల్లయిన భారతదేశం పట్ల వారి సానుభూతిని ఆర్జించటం కేవలం ఒక మానవాతీత శక్తికే సాధ్యం. ఆంగ్ల విద్యావ్యాప్తితో భౌతిక విజ్ఞానం ఎల్లలు లేకుండా విస్తరించిన నేపథ్యంలో ఆ శక్తిని ఎదుర్కొని, దాని దిశను మార్చటానికి అత్యద్భుత సాహసం, అసమాన ప్రతిభ అత్యావశ్యకం. స్వామి వివేకానం దకు ముందు ఈ మహత్తర కార్యాన్ని Theosophical Society అనే మతసంస్థ ప్రారంభించింది. కాని పాశ్చాత్యుల భౌతిక శాస్త్రవిజ్ఞానానికి సవాలుగా హిందూమత పతాకాన్ని నలుదిశల ఎగురవేసి దానికి ఉన్నత స్థాయిని నెలకొల్పినది స్వామి వివేకా నంద మాత్రమే అనేది నిర్వివాదాంశం. ప్రపంచంలో వివిధ దేశాల్లో హిందూమతం యొక్క ఘనతను నిరూపించే బృహత్కార్యాన్ని స్వామి వివేకానంద తన భుజస్కంధాలపై మోపుకున్నారు. ఆయన తన ప్రతిభాసౌష్ఠవంతో, వాక్పటిమతో, అధిక ఉత్సాహంతో, మనఃస్థైర్యంతో తాను ప్రారంభించిన ఉద్యమానికి పటిష్ఠమైన పునాదుల్ని నెలకొల్పారు. 12 శతాబ్దాలకు పూర్వం శంకారాచార్యులు మన మతం యొక్క ఔన్నత్యాన్ని, పవిత్రతను గురించి ప్రవచిస్తూ, మన మతమే మన సంపద అని, మనకు అండగా నిలుస్తుందని ప్రతిహిందువు తన మతాన్ని గురించి ప్రచారం చేయవలసిన ఆవశ్యకత వుందని ప్రబోధించారు. దాన్ని వివేకానంద ఆచరణలో పెట్టి చూపించారు. స్వామీజీ 19 వ శాతాబ్ది ఉత్తరార్ధంలో జీవించి శంకరాచార్య స్థాయికి ఎదిగిన వ్యక్తి.

# బిపిన్ చంద్రపాల్

## I

వివేకానంద మనకు ఒక్కరుగా దర్శనమీయడు. ఆయన గురువర్యులు పరమహంస రామకృష్ణతో ఆయన నిత్యం అనుబంధితుడు. ఒక భారతదేశంలోనే గాదు, మొత్తం ప్రపంచంలోని అధునాతన మానవునికి సంబంధించినంత వరకు వారిరువురిలో మౌలికమైన తాదాత్మ్యత దర్శనమిస్తుంది. నేటి నాగరికుడు పరమహంసను వివేకానంద ద్వారా అవగాహన చేసికోవచ్చు. అలాగే వివేకానందను ఎరుగవలెనంటే పరమహంస జీవితాన్ని అధ్యయనం చేస్తే చాలు. గురువు ఒక మహోన్నతమైన ఆధ్యాత్మిక శక్తి. నేటి హేతువాద ప్రచోదితులైన ఆధునికులకు అర్థంకాని వ్యక్తి. ఆధ్యాత్మిక జీవనానికి విశ్వాస ప్రేరిత దర్శనాభావమే ఆధారం. అది హేతువాద తత్వంలో మౌలికంగా లుప్తమౌతుంది. ఇచ్చట భావన అంటే ఊహించటం కాదు. భౌతిక శక్తులకు, ధీశక్తికి అతీతమైన నిత్యసత్య పదార్థాన్ని యథాతథంగా గుర్తించగల్గటం అని అర్థం. రామకృష్ణుల కాలంలోని ప్రజలు ఈ రకమైన భావనాశక్తిని పొందియుండ లేదు. అందుచేత వారికి ఆ మహనీయుడు ఊహకందని వ్యక్తిగా మిగిలాడు. కనుక రామకృష్ణుల తత్త్వాన్ని, ఆయన జీవిత సందేశాన్ని సమకాలికులకు వారి కర్థమయ్యే రీతిలో వివరించాల్సిన బాధ్యత స్వామి వివేకానంద స్వీకరించారు.

రామకృష్ణ పరమహంస ఒక కులానికి గాని, ఒక వర్గానికి గాని సంబంధించిన వ్యక్తిగారు. మరొక విధంగా చెప్పాలంటే ఆయన అన్ని జాతులకు, అన్ని వర్గాల వారికి, భారతీయులు గాని, అన్యదేశస్థులు గాని – అందరకు చెందిన వ్యక్తి. ఆయన నిజమైన విశ్వమానవుడు. ఆయన విశ్వమానవీయత ఒక విశిష్టతను సంతరించుకుంది. తన విశ్వజనీన మతాన్ని రూపొందించటంలో ఏ మతం యొక్క ముఖ్యాంశాల్ని తోసిరాజనలేదు. సర్వమత సమన్వయ సిద్ధాంతంగా ఆయన మతం రాణిస్తుంది. నిజ జీవితంలోని ప్రధాన భావపరంపరల

నుండి క్రోడీకరింపబడిన సిద్ధాంత సము చ్ఛయమే ఆయన కల్పించిన విశ్వమానవతా మతం. వివేకానంద తన గురువర్యుల సిద్ధాంత సాధనలను ఆధునిక మానవతావాద పరిభాషలోకి అనువదించి ప్రజల కందించాడు.

రామకృష్ణ పరమహంస నిర్వచించిన పరమాత్మ అటు తార్కికవాదం చేత, ఇటు వేదాంత ప్రమాణాల చేత నిరూపింపబడిన పరమాత్మకు భిన్నమైనవారు. ఆయన నేరుగా, వ్యక్తిగతంగా పొందిన ఆత్మానుభూతియే భగవత్స్వరూపం. రామకృష్ణులు భగవ త్సాక్షాత్కారానికి ప్రాచీనమత గ్రంథాల నిర్ధారణలపై గాని, అనుశృత సాంప్రదాయాలపై గాని విశ్వాసముంచక తన వ్యక్తిగత అనుభూతులనే సాక్ష్యాధారాలుగా స్వీకరించారు. ప్రప్రథమంలో శక్తి పూజలో శిక్షణ పొందియున్నారు గనుక ఆయన వేదాంతిగా పరిగ ణింపబడతారు. బెంగాలులో శక్తిపూజ వేదాంత సిద్ధాంతాల ఆధారంగానే రూపకల్పన పొందింది. కాని రామకృష్ణుల వేదాంతం అటు శంకరాచార్య ప్రతిపాదిత వేదాంతానికి, ఇటు వైష్ణవ సిద్ధాంతాలకు కూడా భిన్నమైంది. మేధావుల ఊహాపరంపరల నుండి వెలువడిన ప్రతిపాదనలను తమ మతంగా స్వీకరించేవారి వర్గానికి రామకృష్ణ పరమహంస చెందిన వారు కాదు. ఆయన వేదాంతి కాదు; శాస్త్రాలు పఠించిన పండితుడంతకంటేకాదు; చివరకు తార్కికుడు కూడా కాదు. అతడొక సాధారణ ప్రవక్త మాత్రమే. ఆయన చూచినదాన్నే ఆయన విశ్వసించారు.

ప్రవక్త ఎప్పుడూ మన మాహకందని దివ్యజ్ఞాని. పరమహంస ఆ కోవకు చెందినవారే. అలాగే జీసస్, ఇతర తాత్త్విక ప్రవక్తలు కూడ. కాని వారి సమకాలీన వేదాంతులు, మేధావులు వారి నిజతత్త్వాల్ని అవగాహన చేసికోలేదు. ఐనా వేదాంతులు దర్శించలేని నిత్యసత్యాలను ఈ మహనీయులు వెల్లడించారు. జీసస్ క్రైస్తుకు వలెనే పరమహంసకు కూడ తన సందేశాన్ని తన ప్రజలకు విశదీకరించే వ్యాఖ్యాత అవసరమయ్యాడు. జీసస్‌కు సైంటుపాల్ వ్యాఖ్యాత ఐనట్లే, రామకృష్ణ పరమహంసకు వివేకానంద లభించాడు. కనుక పరమహంస రామకృష్ణుల తాత్త్విక

సందేశాల నేపథ్యంలో మనం వివేకానందను అర్థం చేసుకోవాలి.

## II

వివేకానందుని మత మార్పిడిని గురించి ఇంతవరకు మనం ప్రస్తావించలేదు. కాని ఈ నమ్మశక్యం గాని పరిణామం ఎలా సంభవించిందో ఎవరికి తెలియదని నా విశ్వాసం. వివేకానంద ప్రధానంగా హేతువాది; భగవంతుని ఉనికి సహేతుకంగా నిరూపింపబడితేనే ఆయన విశ్వసించేవాడు. ఐనా తాను భగవంతునిపై విశ్వాసమున్న వ్యక్తిననే భావించుకునేవాడు. ఆయన తొలిరోజుల్లో బ్రహ్మ సమాజంతో సంబంధం పెట్టుకున్నాడు. ఆ సమాజ సభ్యులు యోగుల పైన, మత ప్రవక్తలపైన విశ్వాస ప్రకటనల్ని హర్షించేవారు కాదు. ఆ స్థితిలో కూడ బ్రహ్మ సమాజ సభ్యులు చాలమంది రామకృష్ణ పరమహంస యొక్క దివ్య మానసిక శక్తుల ద్వారా ఆయన వైపు ఆకర్షితు లైనారు. పరమహంస యొక్క తీవ్ర భగవద్భక్తి కూడ వారిని ప్రభావితుల్ని చేసింది. కాని పరమహంస యొక్క జీవిత పరమార్థాల్ని, సాధనామహిమల్ని వారు తెలుసుకోలేక పోయారు. వారు వారి మేధస్సు ద్వారా మాత్రమే పరమహంసను పరికించగల్గారు. ఆయన అంతర్గత దివ్యత్వ రహస్యాలు వారి అవగాహన పరిధిలోకి రాలేదు. ఆ దివ్యానుభూతిని పరమహంస ఒక్క వివేకానందునికే అనుగ్రహించారు.

వివేకానందుని ఆంతరంగిక ప్రవృత్తిని, సంస్కృతిని పరమహంస గుర్తించి, తన జీవిత సందేశాన్ని స్వీకరించగల యోగ్యతలు అతనిలో వున్నవని నిర్ధారించు కున్నారు. వివేకానందుని మానసిక ప్రవృత్తిలో సంభవించిన ఈ పరిణామం ఆయన జీవిత లక్ష్యం యొక్క దిశను నిర్దేశించింది. సాల్ అనే ఆయనకు కల్గిన పరివర్తన కథ కూడ ఇలాంటిదే. ఐతే అచ్చట ఆయన మానసిక నేపథ్యం మాత్రం వేరు. వివేకా నంద తాను తన గురువువైపు ఏ విధంగా ఆకర్షితుడైనాడో ఆయన ఎరుగడు. గురువుల యొక్క దివ్య ఆత్మశక్తి యొక్క ప్రభావమే వివేకానందను ఆయన ఆశ్రయానికి చేర్చింది. ఒక ఆత్మ మరియొక ఆత్మను ఆధ్యాత్మిక స్థాయిలో స్పృశిస్తే ఆ రెండు విడదీయలేని తాత్త్విక బంధనలతో అనుసంధింపబడతాయి. ఆ

విధంగా ఆ రెండు ఆత్మలు ఒక టౌతాయి. గురువు తన శిష్యుని ద్వారా వ్యవహరిస్తున్నా, శిష్యుడు తాను, తన గురువు ఆదేశాలను ఆచరిస్తున్నాననే స్పృహకల్గి వుండడు. దానినే ప్రజలు ప్రేరణ అంటారు. వివేకానందలో పరివర్తన సంభవించిన తదాది ఆయన తన గురువర్యుల ప్రేరణతో వ్యవహరించారు.

## III

వివేకానందుని సందేశం జనామోదమైన తాత్త్విక పరిభాషలో వెలువడినా, అది ఆయన గురువర్యులు ఆధునికుల కొరకు నిర్దేశించిన ప్రవచన పాఠమే. వివేకానందుని సందేశం నూటికి నూరుపాళ్లు ఆధునిక మానవతా సందేశాన్ని సరిపోలు తుంది. తోటి మానవులను 'మీరు మానవులుగా సంచరించండి' అని మాత్రమే ఆయన ప్రబోధించారు. భారతదేశంలో మతావలంబికులు మధ్యయుగాలనాటి మానవుల్లాగా ప్రవర్తించేవారు. వారి మతం ప్రస్తుత ప్రాపంచిక ధోరణులకు భిన్నంగా వుండేది; పారలౌకిక ప్రమాణాన్ని ప్రతిపాదిస్తూ. వ్యక్తి లౌకిక ప్రవృత్తిని విసర్జించి, సామాజిక బాధ్యతల్ని విస్మరించి సర్వసంగపరిత్యాగియై సంచరించాలని శాసిస్తుంది. కాని రామకృష్ణ పరమహంస యొక్క సందేశం మాత్రం వేరుగా వుంది. ఆయన ఎంత వైష్ణవుడో అంత తాత్త్వికుడు. పరస్పర విరుద్ధాలైన ఈ రెండు సిద్ధాంతాల సమన్వయమే పరమహంస యొక్క పవిత్ర ఆదర్శ సందేశం. మాతృభావాంకితమైన ఆయన సిద్ధాంతం భగవద్భక్తి ప్రాతిపదికగా నిర్మితమైంది. బెంగాలీ వైష్ణవులకువలెనే పరమహంస దృష్టిలో కూడ నిత్య సత్య పదార్థం ఊహాజనితమై నామరూపాలు లేనిది కాదు. అది భావానికి మాత్రమే పరిమితమైంది అసలే కాదు. స్థూలరూప సహితమైంది. దాని యథార్థ స్వరూపం మానవాకృతే. కాని అది మన స్థూలదృష్టికి గోచరమయ్యే భౌతిక ఆకర్షణల కనువైన మానవరూపం కాదు. మానవ దృష్టికి అతీతమై ఆత్మావలోకనానికి సాధ్యమయ్యే తాత్త్విక రూపంలో మాత్రమే అది భాసిస్తుంది. ఆ విధంగా పరమాత్మ, మానవుడు ఒకటే యనే నిరూపణ స్థిరమౌతుంది.

తన మౌలిక దివ్యత్వాన్ని సాధించటంలో మానవునకు ఉపకరించటమే మన మత సంస్కృతి లక్ష్యం. వివేకానందుడు తోటి ప్రజల్ని మానవులుగా సంచరించ మనటంలోని అంతరార్థం ఇదే. బ్రాహ్మణుడు నిత్యం ఆచరించే పూజా కార్యక్రమంలో విషయం ఇలా వుంటుంది: "నేను భగవదంశ సంభూతుణ్ణి. నేను పరమాత్మ కంటె భిన్నమైన వాడనుకాను. నన్ను ఏ రకమైన విషాదం, వియోగ క్లేశం అంటవు. నేను నిత్యసత్య పదార్థానికి సంబంధించిన వాడను. ఆత్మజ్ఞానిని. నేను సహజసిద్ధమైన స్వాతంత్ర్యాన్ని కలిగియున్నవాడను." ఈ సందేశమే వివేకానందుని గురువు ప్రకటిం చారు. దానినే వివేకానందుడు ఆధునిక ప్రపంచానికి అందచేశాడు.

ఇది విమోచనా సందేశం. దీన్ని తిరోగమన భావంలో అర్థం చేసుకోరాదు. ఇది కేవలం పురోగమన సూచకం. ఈ సందర్భంలో విమోచనం అంటే బాహ్య బంధనా రహితమనే చెప్పుకోవాలి. కాని మనమున్న పరిస్థితుల్లో ప్రకృతి శక్తుల రూపంలో గాని, సామాజిక ధర్మాల రూపంలోగాని మనల్ని చుట్టియున్న బాహ్య బంధనాల నుండి మనం విడిపోలేము. అలాంటి ఒంటరితనం వల్ల భౌతికపరమైన, ఆధ్యాత్మికమైన నశింపు సిద్ధించటం ఖాయం. కనుక సమాగమం, సహకారం మాత్రమే జీవిత ధర్మాలు; ఒంటరితనం, సహకార నిరాకరణం కానేకావు. నిజమైన స్వాతంత్ర్యం సంపాదించాలంటే శాంతి మార్గాన్ని ఆశ్రయించాలి, యుద్ధాన్ని కాదు. ఐతే పోరాటానికి, వైరాగ్యానికి కూడ మన జీవిత ప్రణాళికలో స్థానం లేకపోలేదు. అంతిమ లక్ష్యం సాధించటంలో వీటి పాత్ర తాత్కాలికంగా వుంటుంది. జీవితంలో పరిభ్రమించే పరిణామాల మధ్య సంఘర్షణల నివారణ పథకంలో కూడ వీటికి తాత్కాలిక స్థానం వుంటుంది. విమోచనం కూడ చివరి స్థాయిలో ఒక్కటే. మన అంతిమ లక్ష్య సాధనలో వాంఛలు, అభిరుచుల ఆధిపత్యం నుండి విమోచనం సాధించటం మొదటి చర్య అవుతుంది. తోటి మానవుని ద్వారా సంభవించే భయోత్పాతాన్ని తొలగించుకోటం రెండవ చర్య. బాహ్యపరమైన ఆధిపత్య శక్తుల నుండి రక్షణ కల్పించుకోవటం తర్వాతి చర్య అవుతుంది. ఈ విధంగా సామాజిక స్వాతంత్ర్యం, రాజకీయ స్వాతంత్ర్యాల ద్వారా, వ్యక్తి

స్వాతంత్ర్యాన్ని పొంది అంతిమంగా సంపూర్ణమైన పారమార్థిక స్వాతం త్ర్యాన్ని సాధించాలి. ఆ స్థితిని పొందిన స్థాయిలో మానవుడు తాను భగవంతునితో తాదాత్మ్య స్థితిని సమకూర్చుకున్నట్లు భావిస్తాడు. వివేకానందునిచే వివరించబడిన వేదాంత సందేశం ఇదే. ఇది యథార్థంగా ఆయన గురువర్యులు ఆధునిక ప్రపంచానికి ఇచ్చిన సందేశం.

స్వామి వివేకానంద ఇంగ్లండులో చేసిన ప్రవచనాలు ఎక్కువ సత్ఫలితాల్ని సాధించలేదని, ఆయన సన్నిహితులు మాత్రం ఆయన కృషిని ఉత్ప్రేక్షించి ప్రచారం చేశారని భారత దేశంలో కొంతమంది అభిప్రాయబడ్డారు. కాని నేను ఇంగ్లండు వెళ్లినపుడు పలు ప్రాంతాల్లోని ప్రజలపై ఆయన ప్రభావం మిక్కుటంగా ప్రసరించిందని తెలిసికొన్నాను. నేను చాల ప్రదేశాలకు తిరిగి అచ్చటి ప్రజలను కలిశాను. వారందరు వివేకానందునిపై అత్యధికమైన గౌరవభావం ప్రదర్శించారు. నేను వివేకానందుని మతానికి చెందిన వాడనుగాను. ఆయనతో నేను చాలా విషయాల్లో విభేదిస్తాను. అయినప్పటికి వివేకానంద ఆ దేశంలోని చాల మంది ప్రజల్ని విజ్ఞానవంతుల్ని చేశాడు; వారి హృదయాల్ని వికసింపచేశాడనేది అక్షరసత్యంగా నేను భావిస్తాను. ప్రాచీన హిందూ ధర్మశాస్త్రాల్లోని నిగూఢమైన, అద్భుతమైన తాత్త్విక సత్యాల్ని అచ్చటి ప్రజల్లోని బహు సంఖ్యాకులు గాఢంగా విశ్వసించటం జరిగింది. ఇదంతా వివేకానందుని ప్రచార ప్రభావం వల్లనే సాధ్యమైంది. అంతకుమించి, ఇంగ్లండు, భారతదేశాల మధ్య అత్యంత సన్నిహిత బాంధవ్యం ఏర్పడింది. హావీస్ యొక్క 'The Dead Pulpit' నుండి వివేకానందతత్వం అనే అంశాన్ని నేను ఇదివరకే ఉటంకించాను. దాన్ని బట్టి వివేకానందుని సిద్ధాంతాన్ని జీర్ణించుకొన్న చాలమంది పౌరులు క్రైస్తవ మతాన్ని వదలివేసినట్లు మీకు తెలిసియే వుంటుంది. ఇంగ్లండులో ఆయన ప్రచారం ఎంత తీవ్రస్థాయిలో, ఎంత విస్తారంగా నడిచిందో ఈ క్రింది సంఘటన మనకు వివరిస్తుంది.

నిన్న సాయంత్రం లండన్‌లోని దక్షిణ ప్రాంతంలో వున్న ఒక మిత్రుని సందర్శించ

టానికి వెళ్తూ మార్గం మరచి ఒక వీధిమూల నిలబడి ఏ దిశలో పోవాలా అని ఆలోచిస్తున్నాను. అప్పుడొక పిల్లవానితో కలసి అటువెళ్తున్న స్త్రీ నన్ను సమీపించి, "అయ్యా మీరు మీ గమ్యానికి త్రోవ తెలియక ఇబ్బంది పడుతున్నట్లున్నది. నేను మీకు త్రోవచూపించనా" అని అడిగింది. నాకు త్రోవ చూపించి, "ఈ రోజు వార్తా పత్రికలో మీరు లండన్ వస్తున్నట్లు ప్రకటింపబడింది. మిమ్మల్ని చూడగానే మీరు వివేకానంద అని నా కుమారునకు చెప్పాను" అని నాతో అన్నది. అప్పుడు రైలు అందుకునే హడావిడిలో వుండటంచేత నేను వివేకానందని కాదని ఆమెతో చెప్పలేక నా త్రోవను నేను వేగంగా వెళ్లిపోయాను. వివేకానందను ఆమె వ్యక్తిగతంగా ఎరుగకపోయినా, ఆయనపట్ల ఆమెకున్న పూజ్యభావానికి నేను ఆశ్చర్యచకితుడనయ్యాను. ఆ సన్నివేశాన్ని నేను మరువలేను. నా తలపై వున్న కాషాయి తలపాగా నాకు ఇంత గౌరవాన్ని ఆర్జించి పెట్టిందని దానిని ప్రశంసించాను. అచ్చటి చాలమంది ఆంగ్లేయ విద్యావేత్తలు కూడ భారతదేశాన్ని గౌరవించటం, హిందూ మతధర్మాల్ని, ఆధ్యాత్మిక ప్రమాణాల్ని అత్యంత శ్రద్ధగా ఆలకించటం గమనించాను.

# మహాత్మా గాంధి

ఈ రోజు స్వామి వివేకానంద జన్మదినోత్సవ వేడుకల సందర్భంలో స్వామీజీని స్మరించి నా గౌరవాభివందనాన్ని సమర్పించటానికి ఈ బేలూరు మఠానికి విచ్చేశాను. (స్వామీజీ జన్మదినం 1921 సంవత్సరం ఫిబ్రవరి 6 వ తేదీన జరుపుకుంటున్నారు.) ఆయన గ్రంథాల్ని క్షుణ్ణంగా పఠించాను. అవి చదివిన తర్వాత మాతృదేశంపట్ల నాకున్న ప్రేమ వెయ్యి రెట్లు అధికమయింది. ఇచ్చట సమావేశమైన యువకులకు నా సందేశం ఇదే : "స్వామి వివేకానంద జీవించి మరణించిన ఈ పవిత్ర స్థలం యొక్క అంతరంగాన్ని జీర్ణించుకొని వ్యవహరించండి. అంతేగాని రిక్తహస్తాలతో, శూన్యహృదయాలతో వెనుతిరగవద్దు."

# జవహర్‌లాల్ నెహ్రూ

భారతదేశం యొక్క ప్రాచీన నాగరికతలో పరిపూర్ణ విశ్వాసం కలిగి, దేశానికున్న సమున్నత గౌరవస్థానాన్ని గురించి గర్విస్తూ కూడ వివేకానంద మానవ జీవిత సమస్యలపై అధునాతన భావాల్ని ప్రసరింపచేశాడు. ఆ విధంగా ఆయన భారతదేశ సనాతనత్వానికి, అధునాతనత్వానికి మధ్య అనుసంధాన కర్తగా వ్యవహరించాడు. ఆయన సర్వహంగులు కల్గిన ఆకర్షణీయమైన పురుషపుంగవుడు. ఆయనలోని సమతుల్యత, ఠీవి నిరుపమానం. అసమానమైన ఆత్మవిశ్వాసం, తాను నిర్వహించవల సిన ఉద్యమాన్ని గురించి సంపూర్ణ అవగాహన, కార్యదక్షత, నిర్విరామ క్రియాశీలత కలిగియున్న ఈ మహానీయుడు భారతదేశాన్ని పురోగమన గతిలో పయనింపచేయగల ధీరుడు. నిర్వీర్య స్థితిలో వేదనాభరితమైయున్న హిందువుల మనస్సుల్ని ఉత్తేజపరచి, వారిలో ఆత్మవిశ్వాసాన్ని పునరుద్ధరించిన మహాపురుషుడు ఈయనే. దేశ ప్రాచీన వైభవాన్ని కూడ ప్రజల ముందుంచాడు.

నేటి యువకులు ఎంతమంది స్వామి వివేకానందుని భాషణలను, గ్రంథా లను పఠించారో నాకు తెలియదు. కాని నా సమకాలికులపై ఆయన ప్రభావం గణనీయమైన స్థాయిలో వుందనటం నిర్వివాదాంశం. ఆయన బోధనలు నేటి యువతకు కూడ అత్యంత ప్రయోజనకరమైనవి. ఆయన రచనల నుండి, ప్రవచనాల నుండి వారు నేర్చుకోవాల్సిన అంశాలు చాల వున్నాయి. స్వామి వివేకానంద హృద యాన్ని, మనస్సును ప్రజ్వలింపచేసిన అగ్ని జ్వాలను గురించిన అవగాహన కూడ వారి రచనల పఠనం వలన యువత సమకూర్చుకోగల్గుతుంది. అదే జ్వాల చివరకు ఆయన అకాలమరణానికి కారణమైంది. ఆయన హృదయవేదన జ్వాలనుండి ఉత్పన్న మైన సమున్నత భావపరంపరలతో గూడిన ఆయన ప్రసంగాలు లక్ష్యసాధనకై ఉద్దేశింప బడినవేకాని, శుష్కప్రియాలు మాత్రంకాదు. ఆయన పలికిన ప్రతి వాక్యంలోను ఆయన హృదయం, అంతరాత్మ ఆవిష్కరిస్తాయి. దానికి

తోడు ఆయన ప్రగాఢ విశ్వాసాలు, చిత్తశుద్ధి ఆయన్ని గొప్ప ప్రవక్తగా రూపొందించినాయి. అంతేగాని వక్తృత్వానికి ఆకర్షణనిచ్చే మెరుపులు, ప్రతిభలు ఆయన్ని ప్రవక్తగా చేయలేదు. ఆ విధంగా ఆయన భారతదేశంలో చాలమంది ప్రజలను అమితంగా ప్రభావితం చేశారు; రెండు, మూడు తరాల యువకులు, యువతులు ఆయనచేత ప్రభావితులైనారంటే అతిశయోక్తి కాదు.

అంతకుముందు చాల క్లిష్టమైన పరిస్థితుల్లో భారతదేశ అభివృద్ధికై, మంచికై పాటుపడిన వారిని మరిపించే విధంగా వివేకానందుని కృషి, దాని ఫలితాలు ప్రజ్వ రిల్లాయి. వివేకానందుని రచనలు, ఉపన్యాసాలు చదివితే అవి ఇప్పటికిని – అంటే 56 సంవత్సరాల తర్వాత కూడ (నెహ్రూ ఈ ఉపన్యాసాన్ని 1949 లో చేశారు) వాటిలో పాతదనం కన్పించదు. దానికి కారణం లేకపోలేదు. ఆయన రచనలలో గాని, భాషణలలోగాని భారతదేశం యొక్క, ప్రపంచం యొక్క ప్రాథమిక సమస్యలను గురించి, ప్రధానమైన అంశాల్ని గురించిన సమగ్రమైన వివరణలున్నవి. కనుక వాటిని ఈ రోజున చదివినా నూతనత్వాన్ని ప్రదర్శిస్తాయి.

మనకు సంక్రమించిన ప్రాచీన సంస్కార సంపదను తలంచుకొని మనం గర్వపడే అవకాశాన్ని వివేకానంద మనకు సంప్రాప్తింపచేశారు. ఆయన మన బలహీనతల్ని, లోపాల్ని మరుగుపరచకుండా తేటతెల్లంగా బహిర్గతం చేశారు. మనం మన లోపాలను సవరించుకోవాలనే ఉద్దేశ్యంతోనే ఆయన వాటిని ఎత్తి చూపించారు. మనదోషాల్ని తీవ్రంగా విమర్శిస్తూ కూడ, భారతదేశం సాధించిన ఘనకార్యాల్ని ప్రశంసించారు. పతనావస్థలో వున్న కాలంలో కూడ దేశం తన ఔన్నత్యాన్ని వీడని సందర్భాలను ఆయన ఉటంకించారు.

కనుక స్వామీజీ రచనలు, ప్రవచనాలు మనందరకు ఆసక్తిదాయకంగా వుంటూ, మనలను ఇంకా చాల కాలంవరకు ప్రభావితం చేస్తూనే వుంటాయి. ఆయన మామూలు రాజకీయవేత్తల కంటె అతీతుడు. అంతేకాదు ఆధునిక జాతీయ ఉద్యమ వ్యవస్థాపకుడు, సారథిగా కూడ పరిగణింపదగినవాడు. ఆయన తర్వాత జాతీయ ఉద్యమంలో చురుకుగా పాల్గొన్న నేతలందరు స్వామి వివేకానంద నుండి స్ఫూర్తిని పొందినవారే.

ప్రత్యక్షంగాగాని, పరోక్షంగాగాని ఆయన మొత్తం భారతదేశాన్ని ప్రభావితం చేశాడు. నేటి యువత అమూల్యమైన ఆయన విజ్ఞాన, వివేక సంపదల నుండి, ఉత్సాహ ఉద్దీపనల నుండి ప్రయోజనం సాధించుకోగలరని నా విశ్వాసం.

శ్రీరామకృష్ణ పరమహంస, స్వామి వివేకానంద, మహాత్మాగాంధి లాంటి యుగపురుషులు సమాజ ఐక్యతకు శక్తి ప్రదాతలు; వారే ప్రపంచం మొత్తానికి నిర్మాణాత్మక ప్రతిభాశాలురు. వారు వారి ప్రతిభను తమ బోధనలకు మాత్రమే పరిమితం చేయలేదు. వారి అభినివేశం, దీప్తి మొత్తం ప్రపంచ ప్రజలందరిపైన ప్రభావం చూపింది. ఆ పరిణామాన్ని వారు ఆశించివుండవచ్చు, వుండకపోవచ్చు.

# సుభాష్ చంద్రబోస్

19 వ శతాబ్దంలోని ఎనుబది దశకంలో ఇరువురు ప్రముఖులైన తత్త్వజ్ఞానులు ప్రజల ముందు అవతరించారు. దేశంలో ప్రజ్వరిల్లుతున్న వినూత్న చైతన్యంపై వారి ప్రభావం వుండి తీరుతుంది. వారే యోగియైన శ్రీరామకృష్ణులు పరమహంస, మరియు ఆయన శిష్యాగ్రగణ్యుడు స్వామి వివేకానంద. రామకృష్ణులు అన్ని మతాల సమైక్యతను గురించి, మతాల మధ్య చెలరేగే కలహాల నివారణను గురించి ప్రబోధించారు. ఆయన పరమపదించక ముందు ఆయన ప్రతిపాదించిన మత ధర్మాలను భారతదేశం లోను, ప్రపంచం నలుమూలల ప్రచారం చేసే కర్తవ్యాన్ని, తన దేశ ప్రజలలో జాగృతిని నెలకొల్పే బాధ్యతను తన శిష్యులకు విధించారు. గురువుల ఆజ్ఞానుసారం స్వామి వివేకానంద సుశిక్షుతులైన సన్యాసులతో రామకృష్ణ మతాన్ని స్థాపించాడు. హిందూ మతాన్ని పవిత్ర ప్రమాణాలతో అవలంబించి భారతదేశంలోను, విదేశాల్లోను, ముఖ్యంగా అమెరికాలోను ప్రచారం చేయాల్సిన కార్యక్రమం ఆ సన్యాసులు సాగించ వలసి వుంది. సౌష్ఠవమైన జాతీయ కార్యక్రమానికి ప్రజలను ఉత్తేజపరచే ప్రణాళికను స్వామీజీ చేపట్టారు. ఆయన చేతిలో మతం జాతీయ చైతన్యం సాధించే ఒక సాధనం. నూతన సంతతి ప్రజలు భారతదేశ పూర్వ వైభవాన్ని తెలుసుకొని గర్వించాలి; దేశ భవిష్యత్తులో పూర్తి విశ్వాసం కల్గియుండాలి. ఆత్మగౌరవాన్ని, ఆత్మవిశ్వాసాన్ని పెంపొం దించుకోవాలి. ఈ అంశాలన్నిటిపై ఆసక్తి పెంచుకునే మనస్తత్వాన్ని ప్రజల్లో స్వామీజీ ప్రతిష్ఠించారు. ఆయన రాజకీయపరమైన సందేశాల్ని ఎన్నడూ ఈయలేదు. ఐనా ఆయనతో సంపర్కం వున్నవారు, ఆయన రచనల్ని చదివినవారు దేశభక్తిని, రాజకీయ మనస్తత్వాన్ని అలవరచుకున్నారు. బెంగాలుకు సంబంధించినంత వరకు అధునాతన జాతీయ ఉద్యమానికి స్వామి వివేకానంద స్ఫూర్తిదాయకుడైన పితృదేవతగా పరిగణింప బడ్డారు. ఆయన 1902 లో పిన్నవయస్కుడుగానే స్వర్గస్థులైనారు. ఐనా ఆయన మరణానంతరం ఆయన ప్రభావం ద్విగుణీకృతమైంది.

ఆయన్ని గురించి వ్రాసినప్పుడల్లా నేను ఆనందసాగరంలో మునిగితేలుతాను. ఆయన సన్నిహితులతో సహా ఎవ్వరూ ఆయన్ని పరిపూర్ణంగా తెలుసుకోలేకపోయారు. ఆయన వ్యక్తిత్వం చాల ఉత్కృష్ఠమైంది, పరిపూర్ణతను, క్లిష్టతను కూడ కల్గివుండేది. ఆయన వ్యక్తిత్వం, ఆయన బోధనలకు, రచనలకు అతీతంగా వుండేది. దేశప్రజలు, ముఖ్యంగా బెంగాలీ వాసులపై ఆయన వ్యక్తిత్వ ప్రభావం అమితంగా వుండేది. బెంగాలీ ప్రజలకు ఆయన వ్యక్తిత్వం నచ్చినట్లుగా మరొకరిది నచ్చలేదు. అవధుల్లేని త్యాగం, నిర్విరామకృషి, అంతులేని వాత్సల్యం, పరిపూర్ణమైన, సమగ్రమైన వివేకం, పుష్కల స్థాయిలో స్పందనలు, నిర్దాక్షిణ్యమైన పోరాటపటిమ, పసివాని అమాయకపు మనస్తత్వం — ఈ సద్గుణరాశితో విరాజిల్లు స్వామీజీ ఈ విశ్వంలో అద్వితీయుడు.

స్వామీజీ పరిపూర్ణ పురుషత్వమున్న ఉజ్జ్వలమూర్తి. ఆయన దేహంలో అణు వణువు పోరాట పటిమను ప్రదర్శించేది. తదనుగుణంగా ఆయన శక్తిని ఆరాధించే వారు. దేశప్రజల ప్రగతిని సాధించటానికి ఉపకరించే పద్ధతిలో ఆయన వేదాంతాన్ని ఆచరణయోగ్యమైన శాస్త్రంగా విశదీకరించారు. ఇలా గంటల తరబడి సంభాషించినా నేను ఆయనకు వీసమెత్తు న్యాయాన్ని సమకూర్చలేను. ఆయన అంత ఉన్నతుడు, అంత పరిపూర్ణుడు, అంత క్లిష్టమైన వ్యక్తి. అత్యున్నతమైన ఆధ్యాత్మిక స్థాయిగల యోగి ఆయన. నిత్య సత్య పదార్థంతో ఆయనకు సాన్నిహిత్యం వుంది. ఐనా తన జాతి యొక్క, మొత్తం మానవాళి యొక్క అభ్యుదయంకొరకు, వారి నైతిక, తాత్త్విక స్థాయిని పెంచటం కొరకు తన జీవిత సర్వస్వాన్ని అంకితం చేసిన మహనీయుడు ఆయన. ఆయన్ని గురించిన నా అభిప్రాయం ఇదే. ఆయన జీవించియుంటే నేనాయన పాదాల వద్ద స్థానాన్ని అభిలషించేవాణ్ణి. ఆధునిక బెంగాల్ దేశం ఆయన సృష్టియే.

శ్రీరామకృష్ణులకు, స్వామి వివేకానందకు నేను ఎంత ఋణపడియున్నానో మాటల్లో చెప్పలేను. నా జీవితం వారి దివ్యప్రభావ మహిమచేత ప్రప్రథమంగా జాగృతమైంది. రామకృష్ణ, వివేకానంద ఆ ఇరువురు ఒకే వ్యక్తి యొక్క రెండు విడ దీయరాని అంశాలు అని

నివేదిత భావించింది. నేను కూడ ఆ విషయంలో ఆమెతో ఏకీభవిస్తాను. స్వామీజీ ఈ రోజు సజీవుడైయుంటే, ఆయన నాకు గురుస్థానంలో వుండేవారు. అంటే వారిని నేను నా గురువర్యునిగా ఆమోదించి పూజించేవాణ్ణి. నేను జీవించియున్నంత వరకు రామకృష్ణ – వివేకానందలకు సేవకునిగా, భక్తునిగా వుండగలను.

స్వామి వివేకానందుని బహుముఖ ప్రజ్ఞాపాటవాల్ని వివరించటానికి నేను అశక్తుడను. స్వామి వివేకానంద తన రచనల ద్వారా, ప్రసంగాల ద్వారా మా కాలపు విద్యార్థుల్ని ప్రభావితం చేసినట్లు దేశంలోని ఏ ఇతర నాయకులు చేసియుండలేదు. ఆయన వారి ఆశలను, ఆశయాల్ని పరిపూర్ణంగా అవగాహన చేసికొని వివరించారు. ఐనప్పటికి ఆయన్ని సరైన రీతిలో తెలిసికోవాలంటే శ్రీ శ్రీ పరమహంస మహనీయు నితోబాటు అధ్యయనం చేయాలి. నేటి స్వాతంత్రోద్యమానికి పునాదులు స్వామీజీ యొక్క సందేశంతో ఏర్పడినాయి. భారతదేశం స్వాతంత్ర్యాన్ని పొందాలంటే అది కేవలం హిందూరాజ్యంగానో లేక ఇస్లాం రాజ్యంగానో రాణించలేదు. అన్ని మతకూట ములు ఒకే ఒక జాతీయ భావప్రేరణతో సమైక్యమై మనవలసి యుంటుంది. అది సాధించాలంటే భారతీయులందరూ సర్వమత సామరస్య సిద్ధాంతాన్ని శిరసావహిం చాలి. ఈ సిద్ధాంతాన్నే రామకృష్ణ – వివేకానందలు మనకు ప్రబోధించారు.

స్వామీజీ భూత వర్తమాన కాలాలకు సంబంధించి మత పరంగాను విజ్ఞాన పరంగాను కూడ ప్రాక్పశ్చిమాలను సామరస్యంతో సమన్వయపరచాడు. అందువల్లనే ఆయనను మనం ఒక మహాపురుషునిగా కీర్తిస్తున్నాం. ఆయన బోధనల ద్వారా మన దేశ ప్రజలు పూర్వమెన్నడులేని ఆత్మవిశ్వాసాన్ని, ఆత్మగౌరవాన్ని, వ్యక్తిత్వాన్ని సమకూర్చుకున్నారు.

రామకృష్ణులు తన జీవిత ధ్యేయంగా ఎంచి సాధించిన సర్వమత సామరస్యమే స్వామీజీ జీవితానికి ప్రధాన ఆదర్శమైంది. ఈ ఆదర్శమే భావిభారతదేశం యొక్క జాతీయతా భావానికి మూలస్తంభమైంది. భిన్నమార్గాల్లో అతలాకుతలమౌతున్న మన దేశంలో మత సామరస్యం, వర్గసహనం ప్రవర్తిల్లనిచో జాతీయ భావానికి తావుండేది కాదు.

రామమోహన్‌రాయ్ కాలం నుండి ప్రజల్లోని స్వాతంత్రేచ్ఛ అనేక ఉద్యమాల రూపంలో ప్రకటితమైంది. ప్రజల యొక్క ఈ వాంఛ వారి ఆలోచనలలోను, సంఘ సంస్కరణోద్యమాల్లోను, 19 వ శాతాబ్దిలోనే ప్రదర్శింపబడ్డది. కాని అప్పుడు అది రాజకీయ రంగానికి విస్తరించలేదు. భారతదేశాన్ని బ్రిటీషువారు జయించటం భగవంతుని చిద్విలాసంగా భావించి, ఆ భావమైకం నుండి ఇంకా మన దేశప్రజలు తేరుకోకపోవటమే దానికి మూలకారణం. సంపూర్ణ స్వాతంత్ర్యాన్ని గురించిన ఆలోచన 19 వ శతాబ్ది చివరిలో రామకృష్ణ – వివేకానందలకు ఉద్భవించి ప్రకటితమైంది. 'స్వేచ్ఛ, స్వేచ్ఛ – ఇది యొక ఆత్మరోదన – ఈ సందేశం వివేకానంద అంతరంగం లోంచి వెలువడి మొత్తం జాతిని వశంచేసికొని పిచ్చివాళ్లని చేసింది. ఆయన రచనలు, జీవితం, భాషణలు, ప్రసంగాలు, అన్నీ ఆ సత్యంతో నిండియుండేవి.

స్వామి వివేకానంద ఒకవైపు మానవుని అన్ని రకాల బంధనాల్లోంచి వెలువడిన నిజమైన వ్యక్తిత్వం గల మనిషిగా జీవించమని ప్రబోధిస్తూ, మరొకవంక సర్వమత సామరస్య ధర్మాన్ని బోధిస్తూ స్వచ్ఛమైన జాతీయతకు పునాది నిర్మించారు.

# వినోబాభావే

వివేకానంద మన దేశప్రజల గొప్ప గుణాల్ని ఉద్ఘాటిస్తూ మనలోని బలహీనత లను, లోపాలను కూడ వెల్లడించారు. భారతదేశం ఆ సమయంలో అజ్ఞాన తిమిరాంధ కారంలో దోవ తెలియక తడబడుతోంది. తన బలహీనతను వైరాగ్యంగాను, శాంత కాముకతగాను అభివర్ణించుకొని అపమార్గంలో పయనిస్తోంది. దానిని నిర్మూ లించే యత్నంలో వివేకానంద నిశ్చేష్టత, సోమరితనాల కంటె నేరతత్వం మంచిదని వెల్లడించేంతవరకు వెళ్లాడు. ప్రజల అజ్ఞాన స్థితిని గురించి వారికి తెలియ చెప్పి, దాని నుండి బయటపడాల్సిన అవసరాన్ని గుర్తుచేశారు. అంతేగాక స్వయంప్రతిభతో ఆధ్యాత్మిక శక్తిని వారి జీవిత కాలంలోనే సంతరించుకోవచ్చని కూడ విశదీకరించారు. అలసత్వ భావంతో వేదాంత గ్రంథాల్ని, శాస్త్రగ్రంథాల్ని పఠించి ఆనందించే వైభవంకన్నా ఫుట్‌బాల్ ఆడుకొని వినోదించటం మిన్నయని ఆయన నుడివారు. కొన్ని ప్రామాణిక ధర్మసూత్రాల ప్రబోధం ద్వారా భారతదేశ ఆత్మ యొక్క కీర్తి ప్రతిష్ఠల్ని పునరుద్ధరిస్తూ, దేశాన్ని ఆవరించి కీర్తికాంతుల్ని మ్రింగివేసిన అజ్ఞానాంధకారాన్ని గురించి వివరించారు. "మానవులందరిలోను సంచరించే అంతరాత్మ ఒక్కటే. ఈ సత్యాన్ని ఆమోదించిననాడు తోటిమానవుల్ని సహోదరులుగా భావించి అందరూ మానవసేవను విధిగా స్వీకరిం చాలి" అని స్వామీజీ మనకు బోధించారు. తత్త్వజ్ఞానాన్ని పొందుటకు అందరకు సమాన అర్హతలున్నా, దైనందిన వ్యవహారాల్లో, సంబంధబాంధవ్యాల్లో హెచ్చుతగ్గుల తారతమ్యాల్ని పాటించాలని ప్రజలు ఆకాంక్షిస్తారు. కాని మన సహచరులతో నిత్యం వ్యవహరించే సందర్భాలలో అవసరపడని తత్త్వజ్ఞానం నిరుపయోగం, అర్థరహితమనే సత్యాన్ని స్వామీజీ మనకు తెలియచేశారు. అందుచేతనే మనం దరిద్రనారాయణుని (కోట్ల సంఖ్యలో వున్న క్షుత్పీడితుల, అనాధలలో వుండే భగవానుని) సేవకు అంకితం కావాలని ఆయన సలహా యిచ్చారు. 'దరిద్రనారాయణ' అనే శబ్దాన్ని వివేకానంద రూపొందించారు; దాన్ని గాంధీజీ ప్రచారంలోకి తెచ్చారు.

# రోమైన్‌రోలండు

వివేకానంద శక్తికి ప్రతిరూపం; మానవులందరు కార్యదీక్షాపరులు కావాలని ఆయన సందేశం. బీథోవన్‌కు వలెనే ఆయనకు కూడ కార్యదీక్షే సకలసద్గుణాలకు మూలం.

ఆయనలో ప్రముఖంగా రాజసం ప్రజ్వరిల్లుతూ వుండేది. ఆయన పుట్టుకతోనే మహారాజు. భారతదేశంలోగాని, అమెరికాలోగాని ఆయన ఠీవికి తలవంచకుండా ఎవరూ ఆయన్ని సమీపించేవారు కారు.

షికాగోలో 1893 సెప్టెంబరులో మతాల సంసత్తును కార్డినల్ గిబ్బన్సు ప్రారంభించారు. అప్పుడీముప్పది ఏండ్లు వయస్సుగల అజ్ఞాత వీరుడు ప్రారంభోపన్యాస సభ ముందు ప్రత్యక్షం కాగా సభికులందరి దృష్టి ఆయనమీదే పడింది. ఆయనతో వచ్చిన మిగతాసభ్యులందరూ స్వామీజీ సన్నిధిలో దివిటీముందు దీపాల్లాగా కాంతి హీనులైనారు. ఆయన అంగసౌష్ఠవం, సౌందర్యం, ఆయనలోని ఠీవి, దర్జా, ఆయన దృక్కుల్లోని ప్రకాశం, దేదీప్యమానమైన ఆయన ఆకృతి, ప్రసంగం ఆరంభంకాగానే తొణికిసలాడిన ఆయన కంఠమాధుర్యం, గంభీరనాదం అచ్చట సమావేశితులైన అమెరికన్ ఆంగ్లో శాక్సన్సు యొక్క హృదయాల్ని ఉత్తేజపరచాయి. అచ్చటి పాశ్చాత్య శ్రోతలు అంతకు పూర్వమైతే స్వామీజీ నల్లజాతికి చెందినవాడని ఈసడించుకున్నారు. భారతదేశానికి చెందిన ఈ శౌర్యసంపన్నుడైన ప్రవక్త యొక్క దర్శనం అమెరికా ప్రజలపై చెరగని ముద్రవేసింది.

ఆయన ఏ రంగంలో విహరించినా అన్ని చోట్ల ఆయనది ప్రథమ స్థానమే గాని ద్వితీయ స్థానమనేది ఆయన ఎరుగడు. ప్రతివాడు ఆయన్ని దర్శించినంత మాత్రానే ఆయనలో ఒక నాయకుని గుర్తించేవారు; ఆయన భగవంతుని ప్రతినిధిగా, ప్రజలపై ఆధిపత్యం నిర్వహించటానికి అర్హతలున్న మహనీయునిగా భాసించారు. ఆయన హిమాలయాల్లో ఒకసారి పయనిస్తుండగా ఒక బాటసారి ఆయన్ని గుర్తించ కుండా దాటివెళ్లి కొంతదూరాన ఆగి

విస్మయంతో 'శివా శివా!' అని అరిచాడు. ఆయన ఇష్టదైవం తనముద్రను స్వామీజీ నుదుటిపై ముద్రించాడా అన్నట్లుగా ప్రజలు ఆయనలో దైవత్వాన్ని దర్శించేవారు.

ఈ శౌర్యనిధి 40 సంవత్సరాలు నిండకుండానే అమరుడై చితిమీద పరుండబెట్ట బడినాడు.

కాని ఆ చితి జ్వాలలు నేటి వరకు ప్రకాశిస్తూనే వున్నాయి. ప్రాచీన కాలపునాటఫోనిక్సుకువలెనే, ఈయన చితాభస్మం నుండి భారతదేశ అంతరాత్మ జాజ్వల్య మానంగా, క్రొత్తదనంతో వెలువడింది. వేదకాలం నాటి ఆర్షజాతి ప్రజలు కలలుగని జన్మనిచ్చిన ఉత్కృష్ట సందేశం దానిలో ఇమిడి వుంది. దేశ సమైక్యత యందు పూర్తి విశ్వాసం కూడ అది ప్రకటిస్తుంది.

కొలంబోలో స్వామీజీ చేసిన ప్రసంగాలు, రామేశ్వరంలో ఆయనచేసిన బోధనలు హృదయాల్ని కదిలించేవిగా వున్నాయి. తర్వాత అధికస్థాయిలో ఆయన భద్ర పరచి వుంచిన సూక్తి సుధను చవిజూచేవంతు మద్రాసు ప్రజలకు దక్కింది. ఆ నగరవాసులు ఆయన కొరకు చాలా దినాలుగా అత్యావేశపూరితులై ఉత్సుకతతో నిరీక్షిస్తున్నారు.

ప్రజల మితిమీరిన ఆసక్తిని సంతృప్తిపరచే యత్నంలో స్వామీజీ భారతదేశానికి ఇచ్చిన సందేశాన్ని ఉత్కంఠతో వారికి వినిపించారు. రాముడు, కృష్ణుడు, శివుడు అవతరించిన భూమి యొక్క ప్రాచీన వైభవాన్ని పునరుజ్జీవింపజేసి, శౌర్యాన్ని కూడగట్టుకొని, నశింపులేని ఆత్మలతో యుద్ధసన్నద్ధులు కావాలని ఆయన ప్రబోధం ఇచ్చారు. తన ఉద్యమ పథకాన్ని ప్రజలకు వివరించి వారిని మూకుమ్మడిగా స్పందించ మని ఉద్బోధించిన సైన్యాధిపతి ఆయన.

"నా భారతదేశమా! లేచి పురోగమించు" అనేదే ఆయన నినాదం.

వచ్చే యాబది సంవత్సరాల కాలంలో మన మనస్సుల నుండి మనం వృధాగా

పూజించే దేవుళ్లను నిష్క్రమింప చేయాలి.

మన జాతే మనకు దైవం. మన చుట్టూ వున్న జీవరాసులే విరాట్ రూపంలో మనకు దర్శనమిస్తాయి. ఆయన బాహువులు నలుమూలలా విస్తరించి యుంటాయి. ఆయన పాదాలు, శ్రోత్రేంద్రియాలు సర్వం సర్వత్ర వ్యాపించియుంటాయి. మిగతా దేవుళ్లందరు నిద్రావస్థలో వుంటే విరాట్పురుషుడు మాత్రం సర్వ వ్యాపకుడై చైతన్యంతో విరాజిల్లుతుంటాడు. కాబట్టి మన చుట్టూ సంచరించే సర్వ ప్రాణుల్ని ఆరాధిస్తే విరాట్పురుషుని ఆరాధించినట్లే. మన దేశ ప్రజలే మనం పూజించవలసిన ప్రధాన దేవతలు.

ఈ వాక్యాల ధ్వని ఎంత శక్తివంతమైందో, అది ఏ విధంగా నలుమూలలా మారు మ్రోగిందో మనం ఊహించలేము.

స్వామీజీ సందేశమనే పెనుతుపాను మైదానాలపై జలపాతాలుగా విస్తరిం చింది. మానవ హృదయాన్ని చలింపచేసింది. మానవునిలో నిద్రాణమైయున్న దైవ త్వాన్ని మేలు కొలిపి అతనిలోని అపరిమితమైన శక్తుల్ని జాగృతం చేసింది. ఆయన దివ్యవాణి మన దేశంలోనే గాక ప్రపంచ దేశాల్లో అన్ని మతాల వార్ని ప్రభావితం చేసింది.

స్వామీజీ వచనాలు ఆలకించిన భారతీయులు ఉత్తేజితులై దేశమాత పిలుపుకు స్పందించారా? ఆమె ఆక్రందనలు కార్యరూపాన్ని ధరించాయా? ఆ సమయానికి ఆయన సందేశ జ్వాలలు పొగబారినట్లై తేజస్సును కోల్పోయినాయి. రెండు సంవత్సరాల తర్వాత తన ఉద్యమానికి అవసరమైన పోరాటపటిమగల యువజనులు భారతదేశం నుండి వెలువడలేదని వివేకానంద తీవ్రంగా వాపోయాడు. స్వప్నావస్థలో కూరుకుపోయి, రాగద్వేషాలకు వశులై, కార్యభారాన్ని వహించలేని ప్రజలలో ఒక్క మారుగా పరివర్తన సాధించటం దుర్లభం. కాని ఒక మంచి ముహూర్తంలో స్వామీజీ యొక్క తీవ్ర వ్యధ దేశాన్ని స్వప్నం నుండి జాగృతం చేసి, ప్రజల్ని ప్రగతి పథంలో కార్యోన్ముఖులను చేసింది. దేశానికి ఆ రోజు మరువలేనిది.

అప్పటినుండి దేశాన్ని పట్టి పీడించిన అలసత్వ పెనుభూతం అదృశ్యమైంది. వివేకానంద మరణించిన మూడు సంవత్సరాల తర్వాత బెంగాలులో సంభవించిన తిరుగుబాటును గాని, తిలక్, గాంధీలు ఆరంభించిన ఉద్యమాలకు నాందిని గాని, సంఘటిత పడిన సామాన్యజనుల సమిష్టి కృషిని గాని ఆ సంతతి వారు దర్శించగల్గారంటే దానికి ఆ రోజున మద్రాసు నుండి స్వామీజీ ఇచ్చిన ఉత్కంఠభరితమైన సందేశమే కారణం.

ఆ సందేశానికి జాతి పరంగా ఒక అర్థం, అంతర్జాతీయ పరంగా మరొక అర్థం వున్నాయి. ఆ అద్వైత మహర్షి దృష్టిలో అంతర్జాతీయ పరంగా ఉద్దేశించిన భావమే బలీయమైంది. ఐనప్పటికి, జాతీయ పరమైన సందేశం యొక్క అర్థం దేశ పటిష్టతను తిరిగి సుప్రతిష్ఠించింది.

స్వామీజీ యొక్క వచనాలు మధుర స్వరాలు. పద సముచ్చయం బీథోవన్ సరళిలో హాండెల్ యొక్క భావ ప్రకంపనలతో కూడిన సమిష్టి గానప్రక్రియను పోలివుంటాయి. ముప్పది సంవత్సరాల తర్వాత కూడ ఆయన రచనల్లోని ప్రవచనాలను స్పృశిస్తేనే చాలు నా దేహం విద్యుద్ఘాతం తగిలినట్లుగా ప్రకంపనలతో ఝల్లుమం టుంది. దీన్ని బట్టి అప్రతిహత ప్రతిభా యోధుడైన స్వామీజీ ఆ సందేశాల్ని స్వయంగా ఉచ్చరించినప్పుడు వాటి ప్రభావం ఎంత వుందో ఊహించవచ్చు.

శతాబ్దాలుగా అస్తవ్యస్తంగా కొట్టుమిట్టాడుతున్న భారతదేశం ఆ దేశవాసియైన ఒక యోగి పుంగవుని కృషి ద్వారా ఆ స్థితి నుండి వెలువడగల్గింది. తత్ఫలితంగా అంతవరకు నిద్రాణమై అణగిమణగియున్న తాత్త్విక సంపద అలలు అలలుగా పెల్లుబికి కార్యరూపం దాల్చింది. ఆ విధంగా కట్టలు తెంచుకొని వెలువడిన అద్భుత శక్తుల ప్రభావాన్ని పాశ్చాత్య దేశాలు గుర్తించే వుండాలి.

అలా జాగృతమైన భారతదేశంతో ముఖాముఖీ సంపర్కాన్ని పాశ్చాత్య దేశాలు

చవిజూస్తాయి. దేశం యొక్క శరీరం భూభాగం అంతా విస్తరించి బాహువుల్ని చాచి చెల్లాచెదురైయున్న శక్తుల్ని కూడగట్టుకుంటోంది. గత శతాబ్ది కాలంలో విలసిల్లిన మహనీయుల గణనీయమైన మేలుకొలుపుల ద్వారా జాతి జాగృతమైంది. ఈ మహనీయులలో రామమోహన్ రాయ్ పాత్ర చెప్పుకోతగింది. అంతకంటే మించిన పాత్రను స్వామీజీ తన కొలంబో, మద్రాసు నగరాల్లో ఇచ్చిన ప్రసంగాల ద్వారా పోషించారు.

ఈ ప్రయత్నాలన్నిటియందు సమైక్యతా ప్రబోధం ప్రధాన లక్ష్యంగా భాసిం చింది. భారతదేశంలోని స్త్రీ పురుషుల ఐక్యతే గాక ప్రపంచవ్యాప్తమైన సమైక్యత కూడ ఇందులో ఇమిడివుంది. అంతేగాక ఈ సమైక్యతలో భావ స్వారూప్యం, తాత్త్విక శక్తుల సమన్వయం, కృషి ఐక్యత మొదలగు అంశాలన్నీ అంతర్భాగంగా వుంటాయి. భారతదేశంలోని బహుళ జాతులు, వారి వివిధ భాషలు, ఆచార వ్యవహారాలు, ఒకే మత కేంద్రాన్నుండి ఉద్భవించిన దేవతలు, వారి ఆరాధన ప్రక్రియలు – వీని యొక్క సమైక్యతను సాధించి, వర్తమానాన్ని, భవిష్యత్తును పునర్నిర్మించే కార్యక్రమం చేపట్ట బడింది. ఈ బృహత్ ప్రణాళికలో ప్రధాన పాత్రలు వహించిన రామకృష్ణ పరమహంస, వివేకానంద, రామమోహన్‌రాయ్, బ్రహ్మ సమాజాలు అవలంబించిన విధానాల్లో విభేదాలున్నాయి. ఈ సందర్భంలో భారతదేశం తన సాంప్రదాయాల్ని, సంస్కృతీ సంపదలను విడనాడకుండా, పాశ్చాత్య నాగరికతకు స్థానం ఈయకుండా దేశీయమైన భావాల్ని సంరక్షించుకుంటూ వ్యవహరించింది. తన సంస్కృతీ సంపద ద్వారా పాశ్చా త్యులు ప్రయోజనం పొందాలని అభిలషించింది. పాశ్చాత్యుల విజ్ఞాన రంగంలోని విజయాలను మనదేశం స్వీకరించటానికి సిద్ధ పడేవుంది. అసంపూర్తిపరమైన, అరకొరగా ఏర్పడిన నాగరికతను ఆమోదించి అమలు చేసుకునే కాలం గతించింది. ఆసియా, యూరప్ దేశాలు ప్రపంచ దేశాల్లో ఉన్నత స్థాయి భూభాగాలుగా రాణిస్తూ సమాన పరిమాణంలో ముఖాముఖీ నిలబడ్డాయి. ఈ ఖండాలు వివేకంతో వ్యవహరిస్తే, కలిసి కృషి కొనసాగించి ఫలితాల్ని ఐక్యతా భావంతో అనుభవించవచ్చు.

నూతన శోభలతో వెలుగొందే భారతదేశ ప్రగతిని ప్రజల నుండి మరుగు పరచిన ఖ్యాతి రాజకీయ నాయకులకు, విద్యావంతులకు దక్కుతుంది. ఐనా, రామకృష్ణుని ఆత్మను తనలో నింపుకొని ఔనత్యాన్ని సాధించిన దేశం దాని ఫలితాల్ని ప్రస్ఫుటంగా ప్రకటిస్తోంది. పరమహంస, ఆయన సిద్ధాంతాలను ఆచరణలో పెట్టిన వివేకానంద – ఈ ద్వయం నేటి భారతదేశ భవితవ్యాన్ని శాసిస్తూ మార్గదర్శకు లైనారు. వారి దివ్యతేజస్సు భారత భూభాగం మీద ప్రసరిస్తూ దాన్ని ఫలవంతం చేస్తోంది. నేటి భారతదేశ నాయకులు – అరవింద ఘోష్, టాగూరు, గాంధీజి – ఒకరు భావనా ప్రపంచంలో మకుటంలేని మహారాజు, రెండవ వారు కవుల్లో అత్యున్నతుడు, మూడవవారు మహాత్ములు – వారు తమ ఔన్నత్యాలను, సాఫల్యతలను, రామకృష్ణ పరమహంస, వివేకానందల ఉజ్జ్వల ఉద్దీపన ద్వారానే సాధించారు. ఈ విషయాన్ని అరవిందులు, గాంధీ మహాత్ముడు బహిరంగంగా ప్రకటించారు.

టాగూరుకు సంబంధించినంత వరకు, గోయత్ సదృశమైన ఆయన ప్రతిభ భారతదేశ నదుల సంగమ స్థలంలో వసించి ప్రజ్వరిల్లుతుంది. ఆయనలో తన తండ్రి మహర్షి ద్వారా సంక్రమించిన బ్రహ్మసమాజ సంస్కృతి, రామకృష్ణ, వివేకానందల నూతన తాత్త్వికత రెండు మేళవించి సమన్వయింపబడ్డాయి. రెంటిలోను ప్రావీణ్యతను, స్వేచ్ఛను గడించిన టాగూరు ప్రాక్ పశ్చిమాల సంస్కృతులను తన ధోరణిలో సంయోగించాడు. సామాజిక, జాతీయ రంగాలకు సంబంధించి, వివేకానంద స్వర్గస్థుడైన నాల్గు సంవత్సరాల తర్వాత 1906 సంవత్సరంలో స్వదేశీ ఉద్యమ ఆరంభంలో టాగూరు తన భావాల్ని బహిరంగంగా బహిర్గతం చేశాడు. ఆయన ముందు జీవించిన వివేకానంద యొక్క భావోద్దీపనలు టాగూరులోని పరివర్తనకు నిస్సంశయంగా దోహదపడి వుంటాయి.

కొద్ది రోజుల క్రితమే గాంధీజి యొక్క కంఠ స్వరం వినగల్గినందుకు నాకుచాల ఆనందంగా వుంది. ఆయన మనస్తత్వం రామకృష్ణ వివేకానందుల ధోరణులకు వ్యతిరేకంగా వున్నప్పటికి సర్వమత సామరస్యం విషయంలో వివేకానంద బాటనే ఆయన కూడ

అనుసరించారు. విశ్వమానవ సౌభ్రాతృత్వం అనే పవిత్ర ఆదర్శాన్నిగాంధీజి కూడ ప్రవచించాడు.

మత ఛాందసులు, వివేకవంతులు కూడ విభిన్న మనస్కుల్ని సమన్వయ ధోరణిలోనడుపుతూ, మానవ పరివర్తన సాధిస్తున్న ఈ దశలో అందరి హృదయాలు సర్వమత సహన భావంతో నింపబడియుండటం అత్యావశ్యకం. ప్రపంచంలోని ప్రతి మత విశ్వాసానికి దాని మనుగడను నిల్పుకునే హక్కు వుంటుంది. అలాగే తన ఇరుగుపొరుగు వారు ఏ విశ్వాసాన్ని ఆదరిస్తారో దానిని ప్రతి వ్యక్తి కూడ గౌరవించాలి.వీనినే ఆదర్శ ధర్మాలుగా మానవులు స్వీకరించి ప్రచారం చేయాలి. గాంధీజీ ఈధర్మాల్ని ప్రకటించటం ద్వారా ఆయన రామకృష్ణుని వారసుడుగా ప్రదర్శించు కున్నాడు.

ఈ ధర్మాన్ని మనమందరం హృదయపూర్వకంగా ఆస్వాదించాలి. ఈ వ్యాస కర్తనైన నేను నా జీవితమంతా ఈ ధర్మాన్ని అధ్యయనం చేయటానికి కొంతైనా కృషిచేస్తాను. నా ఆశయాలు ఎన్ని వున్నా, నాలోని లోపాలు బహుళంగా వున్నాయి.గాంధీజీ చేసిన బోధనలకు నేను ఆయనకు ఋణపడి వున్నాను. ఇవే ధర్మాలు వివేకానంద బోధించారు. అంతకంటే మిన్నగా రామకృష్ణులు కూడ చేసియున్నారు.

# విల్‌డ్యురాంటు

వేదకాలం నుండి ఏ హిందూ మత ప్రవక్త చేయలేని పటిష్టమైన మత విశ్వాసాలను స్వామి వివేకానంద తన దేశ ప్రజలకు ప్రబోధించాడు.

“మానవ నిర్మితమైన మతమే మనకు అభిలషణీయం. మనలను బలహీనపరచే అతీత శక్తులకు, నిగూఢ సత్యాలకు దూరంగా వుండండి. ఆ విధంగా సౌష్ఠవంచేకూర్చుకోండి. రానున్న యాబది సంవత్సరాల వరకు కల్పిత దేవతలకు మనహృదయాల్లో స్థానం వుండకూడదు. మన స్వజాతే మనకు పరమాత్మ. ఆయనసర్వవ్యాపకుడై విలసిల్లాలి. మన చుట్టూవున్న మానవులు, జంతుజాలం మనకు దైవస్వరూపులు. మన దేశ ప్రజలను ఆరాధించటమే మన ప్రధాన దేవతలను పూజించటమౌతుంది. ఇదే మన ప్రథమ కర్తవ్యం”.

గాంధీజిని సమీపించటానికి ఇదే ఒక సోపానం.

## సి. రాజగోపాలాచారి

స్వామి వివేకానంద హిందూ మతాన్ని, భారతదేశాన్ని కూడ సంరక్షించారు. ఆయన కృషి లేకపోతే, మనం మతాన్ని పోగొట్టుకునే వాళ్లం, మనకు స్వాతంత్ర్యం సిద్ధించేది కాదు. ఆయనకు మనం సర్వత్రా ఋణపడివుంటాం. ఆయన మనకు సంక్రమింప చేసిన అమూల్య సంపద మన వద్ద సురక్షితంగా వుండాలంటే, ఆయన ప్రగాఢ విశ్వాసం, ధైర్యసాహసాలు, వివేక సంపద మనకు స్ఫూర్తిదాయకాలుగా వుండాలి.

# సర్వేపల్లి రాధాకృష్ణన్

దేశ చరిత్ర పరంగాను, ప్రపంచ చరిత్ర పరంగా కూడ మనం సంక్లిష్ట పరిస్థితుల్లో వున్నాం. చాల మంది దృష్టిలో మనం ఒక లోతైన లోయ అంచున జీవిస్తున్నాం. విలువలన్నీ అస్తవ్యస్తమయ్యాయి. ప్రమాణాలు దిగజారాయి, బాధ్యతారాహిత్యం ప్రబలుతోంది; జన బాహుళ్యంలో విచ్చలవిడి ఉద్రిక్తతలు ప్రజ్వరిల్లుతున్నాయి. ఈ దుస్సహపరిస్థితుల్లో ప్రజలు నిరాశా నిస్పృహలకు, దైన్యానికి లోనై చేష్టలుడిగి వ్యవహ రిస్తున్నారు. ప్రజలను ఎదుర్కుంటున్న సమస్యలివే. ఇలాంటి ఆత్మ విశ్వాసరాహిత్యం మనిషి వ్యక్తిత్వానికే తీరని ద్రోహం. అది మానవుని నైజ స్వభావాన్ని కించ పరుస్తుంది. యథార్థంగా మానవునిలోని సహజ చైతన్యమే ఇప్పటివరకు ప్రపంచంలో సంభ వించిన శ్రేయస్కర పరిణామాల్ని ఎన్నింటినో సాధించింది. మన ఆధ్యాత్మిక సంపదపై పూర్తి విశ్వాస ముంచి జీవించమనే ప్రబోధాన్నే వివేకానంద మనకు ఇచ్చియున్నారు. ఆయన ఆత్మస్థైర్యం అమోఘం, తిరుగులేనిది. మానవ జీవితానికి ఒక నిర్దిష్టతవుంది. ఈ ప్రపంచంలో మనం అడ్డుకోలేనిది ఏదీలేదు. మనల్ని పీడిస్తున్న తీవ్ర ప్రమాదాల నుండి అశక్తతల నుండి సంరక్షించుకునే శక్తి సామర్థ్యాలు మనకున్నాయి. మనలోని నైరాశ్యభావాన్ని తొలగించుకుంటే చాలు. బాధలు అనుభవించే స్థితిలో మనకు అవసరమైన స్థైర్యాన్ని, కష్టాల నుండి తేరుకునేందుకు కావలసిన ఆశాస్ఫూర్తిని, నిస్పృహను నివారించే మనఃస్థైర్యాన్ని వివేకానంద మనకు సమకూర్చారు. ఆయన ఇంకా ఇలా చెప్పారు. "బాహ్యవేషాల్ని చూచి భ్రమపడవద్దు. మనుజులందరకు అంతర్గతంగా ఒక దివ్యశక్తి వుంటుంది. ఈ విశ్వానికి ఒక లక్ష్యం వుంటుంది. ఆ లక్ష్యంతో మనం సహకరించి దాన్ని ఫలప్రదం చేయటానికి సర్వశక్తులూ వినియోగించి శ్రమించాలి".

# ఆర్.సి. మజుందార్

1893 వ సంవత్సరంలో కొలంబసు అమెరికా కనుగొన్న సంఘటనకు నాల్గు వందలవ వార్షికోత్సవ వేడుకల సందర్భంలో షికాగో నగరం (అమెరికా) లో నిర్వహిం చిన పార్లమెంటు ఆఫ్ రెలిజియన్సులో ప్రసంగిస్తూ వివేకానంద హిందూ మత ధర్మాల్ని పటిష్టంగా సమర్ధించారు. ఆ సమావేశానికి ప్రపంచంలోని అన్ని దేశాల నుండి పలు మతాల ప్రతినిధులు హాజరైనారు. వారందరి సమక్షంలో మన వేదాంత ధర్మాల్ని గురించి, హిందూ మత ఔన్నత్యాన్ని గురించి అందరిని ఒప్పించే సరళిలో తన వాగ్ధాటిని ప్రదర్శించి ఆయన ప్రసంగించాడు. ఆయన వాక్పటిమతో సమావేశితుల నందర్ని సమ్మోహితుల్ని చేశాడు. ఆధునిక ప్రపంచ సాంస్కృతిక చిత్రపటంలో హిందూమతానికి ప్రముఖ స్థానాన్ని వివేకానంద సమకూర్చాడంటే అది అతిశయోక్తి కానేరదు. పశ్చిమ దేశాల్లోని నాగరిక జాతులన్నీ హిందూమతం అంటే అది యొక ఛాందసభావాల సముచ్చయమని, అధర్మ సంస్థల సముదాయమని, నేటి నాగరిక ప్రపంచం తలదించుకునే రీతిలో వున్న భ్రష్టాచార సమన్వితమని అప్పటి వరకు నిరసన భావంతో దాన్ని చూచారు. ఇప్పుడు మొదటి సారిగా వివేకానంద ప్రవచించిన హిందూమత ఉన్నత ఆదర్శ ధర్మాల్ని హృదయపూర్వకంగా ఆమోదించి ప్రశంసించ టమే గాకుండా, ఆ మతానికి ప్రపంచ సంస్కృతీ నాగరికతల్లో ఉత్తమస్థానాన్ని ఇచ్చారు. ఈ పరిణామం యొక్క పరోక్ష ప్రభావం హిందూ సమాజం మొత్తం మీద ఏ స్థాయిలో వుండగలదో మనం మాహించగలం. హిందూ సమాజం లోని, హిందూ మతంలోని లోపాలను గురించి పాశ్చాత్యులు, అందునా ముఖ్యంగా వారి మత ప్రచారకులు చేసే విమర్శలను హిందువులలోని ప్రతిభావంతులు కూడ తట్టుకునే స్థితిలో లేరు. పాశ్చాత్యుల హేతు బద్ధ దృక్పథం ముందు మన హిందూ సమాజంలోని లోపాలను సమర్ధించుకునే అవకాశం హిందువులకు లభ్యపడలేదు. కనుక వారి విమర్శలను ఆమోదించక తప్పలేదు. పాశ్చాత్య నాగరికత యొక్క, హిందూ నాగరికత యొక్క విలువలను అంచనా వేసి పోల్చిన

సందర్భాల్లో హిందువులు తల ఒగ్గవలసిన పరిస్థితి ఏర్పడేది. పాశ్చాత్య విద్యావేత్తలు ధృవీకరించి ప్రకటించిన వారి సంస్కృతి ముందు హిందూ నాగరికత తక్కువ స్థాయికి చెందిందని హిందువులు అంగీకరించక తప్పలేదు. కాని ప్రస్తుతం హఠాత్తుగా పాశ్చాత్యదేశాల ప్రతినిధులందరూ హిందూమతం యొక్క నిగూఢ మహిమల్ని ఏకకంఠంతో కొనియాడటం జరిగింది. ఆ విధంగా అప్పటి వరకు హిందూమతాన్ని గురించి పాశ్చాత్యులలో వున్న నిరసన భావం ఒక్కమారు తారుమారైంది. అంతేగాక హిందువులలో వారి సంస్కృతి, నాగరికతల యందు పూర్తి ఆత్మవిశ్వాసం పునరుద్ధరింపబడింది. దేశభక్తి, తమ జాతియంటే గర్వభావం ప్రజల్లో ఉత్పన్నమైనాయి. భారతదేశంలోని హిందువులందరు, ఇటు కేప్‌కామరిన్ నుండి అటు హిమాలయాల వరకు చాల ప్రదేశాల్లో వివేకానంద స్వదేశాగమన సందర్భంలో అనేక బహిరంగ సభలు ఏర్పాటు చేసి ఆయన్ని అభినందన లతో ముంచెత్తారు. హిందూ జాతీయతకు వివేకానంద కృషి అమితంగా దోహదం చేసింది.

భారతదేశం తిరిగి వచ్చిన తర్వాత వివేకానంద హిందూ నాగరికత యొక్క ఆధ్యాత్మిక ఆలంబనను గురించి బోధించాడు. అంతేగాక, ఆయన రచనల్లో, ప్రసం గాలలో భారతదేశం యొక్క తత్త్వజ్ఞానం అమూల్యమైందని, సామాజిక శ్రేయస్సుకు దాని ప్రాముఖ్యం తక్కువేమీ కాదని, పై మెరుపులతో ఆకర్షించే పాశ్చాత్య భౌతిక వాదాలకి అన్ని విషయాల్లోను మిన్నయని వ్యక్తీకరించాడు. పాశ్చాత్యుల వైభవాలవైపు, ఆడంబరాలవైపు ఆకర్షితులు గాకుండ, భారతీయులు తమ ఆదర్శ ధర్మాలపై తమ వ్యవస్థలపై దృష్టి మరల్చాలని పదేపదే ఉద్ఘాటించాడు. భారతీయ సంస్థల్ని, హిందూ ధర్మాల్ని పాశ్చాత్యుల వాటితో పోల్చి మన సంస్కృతి యొక్క ఔన్నత్యాన్ని, ఆధిక్యాన్ని నిర్ధారించి, మన విలువైన సువర్ణాన్ని మెరిసే లోహం కొరకు మార్పిడి చేయవద్దని తన దేశ ప్రజలకు హితవు చెప్పాడు.

కాని వివేకానందకు పాశ్చాత్య దేశాలపై ద్వేషం లేదు. ఆ దేశాలు సాధించిన ఫలితాల విలువను ఆయన గ్రహించకపోలేదు. భారతీయ సంస్కృతిలోని లోపాలను, అసంపూర్ణతను

ఆయన నిర్మొహమాటంగా అంగీకరించాడు. భారతదేశం తన నిజ స్వరూపాన్ని త్యాగం చేయకుండా పాశ్చాత్యుల నుండి అధ్యయనం చేయవలసిన అంశాలు చాల వున్నాయని కూడ ఆయన సూచించారు.

వివేకానంద ఒక గొప్ప యోగి మాత్రమే కాదు; ఒక తీవ్ర జాతీయవాది కూడ. ఆయన భారత జాతీయతను ఉన్నత పీఠానికి చేర్చాడు. గత కాలంలో దేశానికున్న గౌరవాన్ని పునరుద్ధరించాడు. ఆయన తలపెట్టిన జాతీయ ఉద్యమంలో ఉన్నత వర్గీయులు, తక్కువ స్థాయివారు, ధనవంతులు, బీదలు అందరూ కోట్లాది ప్రజలు తమ తారతమ్యాలను విస్మరించి పాల్గొన్నారు. దేశ ప్రజల్లో జాతీయతా భావాన్ని మేల్కొలుపటానికి ఆయన తన జీవితాన్నే అంకితం చేశాడు. దేశంలో ఈ రోజుకు కూడ ఆయన నెలకొల్పిన జాతీయ భావనలు ప్రజలను స్పందింప చేస్తున్నాయి.

ఆయన యోగిగా జీవించినా, దేశభక్తులకు దేశభక్తునిగా రాణించాడు. దేశ ప్రజలలో నిద్రాణమైయున్న పరిపుష్టతను పునరుద్ధరించటం ద్వారా భారతదేశం యొక్క పవిత్ర ఘనతకు పూర్వస్థాయిని సమకూర్చే ఆలోచన ఆయన మనస్సులో ప్రథమ స్థానాన్ని ఆక్రమించింది.

తన ఆధ్యాత్మిక గురువైన శ్రీరామకృష్ణుని పిలుపుతో తన లౌకిక బంధనాల్ని విడనాడిన ఈ యోగిపుంగవుడు ఆధ్యాత్మిక పరిజ్ఞానం యొక్క నిగూఢతత్వాన్ని శోధించాడు. నేటి భారతదేశానికి కావాల్సింది మతం, వేదాంతం కాదని, ఆకలితో అలమటిస్తున్న కోట్లాది బీదప్రజలకు చాలినంత ఆహారము, బడుగు వర్గాలకు సామాజిక న్యాయం, నిర్వీర్యమైన జాతికి పరిపుష్టత, ప్రపంచ జాతుల్లో భారతజాతికి గౌరవస్థానం అత్యావశ్యకములని వివేకానంద నిర్విరామంగా ఉద్బోధించాడు. తమలో జీర్ణించి యున్న పిరికితనాన్ని, అన్ని రకాల భయాల్ని త్యజించి, శక్తి సామర్థ్యాల్ని, సౌష్ఠవాన్ని సమకూర్చుకొని వ్యవహరించాలని స్వామీజీ భారత ప్రజలకు పిలుపునిచ్చాడు. మన వేదాంతం ప్రబోధించినట్లు, ప్రజలందరూ దైవాంశ సంభూతులేయని వారికి పదే పదే గుర్తు చేశారు. ఆయన ధర్మసూక్తులు, ఆయన ఉదాహరణ,

జాతీయ జీవిత ప్రవాహాన్ని ఉద్దీపింపచేసి, క్రొత్త ఆశలను, క్రొత్త స్ఫూర్తిని చొప్పించాయి. అంతేగాక మాతృదేశ సేవను మతస్థాయికి చేర్చాయి.

భారతీయ జాతీయతకు స్వామి వివేకానంద ఆ విధంగా ఒక ఆధ్యాత్మిక ప్రాతిపది కను సమకూర్చాడు. వేదాంత ధర్మాలు, భగ వద్గీత ప్రవచనాలు జాతీయ వాదుల జీవితాల్లోను, క్రియా కాండలోను గాఢంగా విస్తరించాయి. త్యాగధనులెందరో ఆయన బోధనల్ని విని ఉత్తేజితులై తీవ్రబాధల్ని సహనంతో, ప్రమోద హృదయంతో స్వీకరిం చారు. కొన్ని సందర్భాల్లో వారిపై ప్రయోగింపబడిన అమానుష హింసల్ని, చివరకు మరణాన్ని కూడ నిర్భయంగా ప్రశాంత చిత్తంతో స్వాగతించారు.

# సునీతికుమార్ ఛటర్జీ

మానవకోటి, ముఖ్యంగా భారతజాతి ప్రజల ఆక్రందనలకు చలించే ఉత్తమ పురుషుడుగా వివేకానంద నా హృదయంలో నిలిచాడు. మధ్య తరగతి, ఉన్నత తర గతి సమాజ ప్రజలపై వివేకానంద ఈ సందర్భంలో చేసిన అధిక్షేపణలు మా హృద యాల్ని బాగా కలచివేశాయి. భారతదేశ సమాజంలో నాగరికులచే తిరస్కరింపబడి, ద్వేషింపబడిన బడుగుజాతి ప్రజల్లోని మానవతను, వారి గొప్పతనాన్ని ఆయన పరిశో ధించి మనకొరకై వెల్లడించారు. అదే విధంగా వేదాంతంలో ప్రవచించినట్లు ఉత్కృష్ట స్థాయిలో మూర్తీభవించిన పవిత్రతతో విరాజిల్లే భారతీయ భావనాపటిమను, దాని విలువను మనకు విశ్లేషించి విశదీకరించాడు. మన ప్రాచీనులు మనకు సంక్రమింప చేసిన వేదాంత ధర్మాలు మన భారతదేశ ప్రజలకే గాక మొత్తం మానవాళికి శాశ్వతమైన అమూల్య సంపదయని స్వామీజీ మనకు నచ్చచెప్పారు. ఈ ప్రబోధం మన చిత్తాల్ని మేల్కొలిపి చైతన్యవంతుల్ని చేసింది. మొత్తం మానవ ప్రపంచానికి సేవలందించి మానవాభ్యుదయానికి ఉద్యమించాల్సిన పవిత్ర కర్తవ్యం మనపై వుందనే భావన మనల్ని ప్రేరితులను చేసింది. భారతీయులు తమ ధైర్యాన్ని కోలుపోయి, నిర్వీర్యు లౌతున్న తరుణంలో వివేకానంద ధైర్యపటిమను పునఃవ్యవస్థీకరించి ఉద్ధరించాడు. ముఖ్యంగా క్రైస్తవ మత ప్రచారకుల వైపునుండి మన జీవిత విధానాలపై, ఆచార వ్యవహారాలపైన అనాలోచిత, వ్యర్థ వ్యాఖ్యలు వెలువడ్డాయి. వాటిని వివేకానంద తీవ్రంగా ఖండించి మటుమాయం చేశాడు. ఆయనలోని ఈ గుణాల్ని పరిశీలించిన తర్వాత ఆయన మనకొక ఆత్మీయుడుగా, గొప్ప ప్రవక్తగా, మానవకోటిని వీర్యవంతు లుగా జేసి సన్మార్గంలో నడిపించటానికి భూమిపై అవతరించిన ఒక అవతార పురు షుడుగా మన హృదయాల్లో భాసిస్తాడు.

ప్రప్రథమంగా వివేకానంద హిందూ సామాజిక జీవన స్రవంతి నుండి అసంగత మాలిన్యాన్ని ప్రక్షాళనం చేశాడు. ప్రజల దృష్టిని అశాశ్వతమైన సాంఘిక ఆచారాల వైపునుండి

మరల్చి శాశ్వతమైన ప్రామాణిక సత్యాల్లో లగ్నంచేసే మార్గాన్ని నిర్దేశించాడు. భారతదేశంలో నేడు ప్రబలంగా విస్తరించియున్న కులతతత్వానికి ఆయన బద్ధ శత్రువు. అస్పృశ్యతను, ఆయన సన్యాసిగాను, మామూలు హిందువుగాను కూడ నిరసించాడు. ఆంగ్లేయ భాషలో సామాన్యంగా వాడబడుచున్న 'Don't touchism' (నన్ను ముట్టవద్దు) అనే మాటను ఆయన వాడుకలో ప్రవేశపెట్టారు. ప్రతి ప్రాణిలోను పరమాత్మను దర్శించే వేదాంత ధర్మాన్ని ఆయన విశ్వసించాడు. ఆ నమ్మకంతోనే సామాన్య ప్రజానీకంపై ఆయన ప్రేమను, కరుణను అపరిమితంగా హృదయం నుండి ప్రవహింప చేశాడు; వారి సేవలో ఆయన అత్యంతాసక్తిని ప్రదర్శించాడు. మన దేశభాషలకు ఒక వినూత్న శబ్దాన్ని కూడ ఆయన సృష్టించాడు. అదే 'దరిద్ర నారాయణ' అనే పదం. అంటే పేదలలోను, దీనులలోను వసించే పరమాత్మ అని అర్థం. మొత్తం భారతదేశం ఆ పదాన్ని ఆమోదించింది. సామాన్య మానవుడు నిర్వర్తింపవలసిన బాధ్యతను ఆ పదం స్ఫురింప చేస్తుంది. ప్రతివ్యక్తి సమాజంలోని, అన్నార్తులను, విధివంచితులను సానుభూతితో పరామర్శించి వారు కూడ దేవుని అంశలని భావించి సేవలను అందించాలి. 'మానవసేవే మాధవ సేవ' అనే సూక్తిని మరువకూడదు. మహాత్మాగాంధి, గుజరాత్‌లోని వైష్ణవ కవులు గుజరాతి భాషలో రూపొందించిన 'హరి—జన' (భగవంతుని సంతానం) అనే నానుడిని వెలికి తీసారు. అదికూడ ఒక ఉత్తమమైన భావాన్ని ప్రకటించే సూక్తియే. కాని 'దరిద్ర నారాయణ' అనే పదం వ్యక్తికి తోటి మానవుని పట్ల తనకున్న బాధ్యతను నిర్దేశిస్తుంది. వ్యక్తి భగవంతుని సేవించాలంటే తన తోటి దీనజనులకు విధిగా చేయూత నివ్వాలి.

స్వామి వివేకానంద ఒక గొప్ప మత ప్రవక్తగా సర్వజనులచేత పరిగణింప బడుతున్నాడు. ఆయన హిందూ మతానికి, హిందూ వేదాంతానికి కూడ వాటి అధ్యయనం విషయంలో చాల కృషి చేశాడు. అంతేగాక మన వేదాంత విజ్ఞానాన్ని నలుదిశల వ్యాపింపచేయటానికి, పలువురు దీనిని అవగాహన చేసికొని ఆమోదించ టానికి కూడ ఆయన అపారంగా శ్రమించాడు. వేదాంత సిద్ధాంతాల్ని గురించి, వాటి అభ్యాసాన్ని గూర్చి ఆయన

చేసిన రచనలు ప్రపంచవ్యాప్తంగా ఆసక్తిని రేకెత్తించాయి. కాని ఆయన ఒక మత ప్రచారకుడుగా కాక ప్రజాబంధువుగా, దీనజనసేవలో నిమగ్నుడైన మహాత్ముడుగా ప్రజల హృదయాల్లో నిలుస్తాడు. ఈ విధంగా మనం వివేకానంద వ్యక్తిత్వాన్ని విశ్లేషించుకుంటూ పోనవసరం లేదు. మానవుని సేవలోనే భగవదారాధన ఇమిడివుందని ఆయన జీవితం నుండి తెలుసుకోవలసిన ఉత్తమ ధర్మం. ఒక నాణానికి భగవంతుడు బొమ్మైతే, మానవుడు బొరుసు. రెండు అంశాల్లో వివేకానంద ఒక నూతన సృష్టికర్త అని చెప్పాలి. ఆయన ప్రముఖ శిష్యురాలు సిస్టర్ నివేదిత సూచించినట్లు ఆధునిక యుగంలో హిందూమతం ఒక భావనా వ్యవస్థకు, జీవిత విధానానికి రూపకల్పన చేసిన ఒక ప్రామాణిక తత్వమని వివేకానంద ప్రతిపాదించాడు. వివేకానంద సాధించిన మొట్టమొదటి గొప్ప విషయంగా దీనిని భారతీయుల మైన మనం గుర్తించాలి. పాశ్చాత్యుల్లో మతావగాహనను గురించి క్రొత్త తరహా ఆలోచనల్ని, విశ్వాసం అనే అంశాన్ని అర్థం చేసికోవటంలో క్రొత్త మార్గాన్ని వివేకానంద ప్రవేశపెట్టాడు. ఇది ఆయన సాధించిన రెండవ ఫలితం. అంతేగాక ఆధునిక భారతా వనిలో, భావనా ప్రపంచంలో అగ్రగామిగా రాణించిన వివేకానంద ఆధునిక భారతీయ సంస్కృతికి ఒక స్థాయిని నిర్దేశించి ఆ ఘనతను కూడ ఆయనే దక్కించుకున్నాడు. ప్రపంచ ప్రజలందరికి ఆమోదయోగ్యమై, ఆచరణయుక్తమైన ఏకైక రూపంలో వివిధ మతాలు, సంస్కృతులు సంలీనం కావాలనే భావనకు ఆయన నాంది పలికారు.

1893 లో షికాగోలో జరిగిన అఖిల ప్రపంచ మత మహాసభలలో వివేకానంద పాల్గొని తనదైన రాజస ఠీవిలో చేసిన సుమధురమైన, హేతుబద్ధమైన ప్రసంగాలు చరిత్రాత్మకతను సంతరించుకొన్నాయి. ఆధునిక యుగంలో విజ్ఞాన చరిత్ర యందు ఆ సంఘటన చాల ప్రాముఖ్యమైనది. వివేకవంతమైన మత సమన్వయం, మత సహనం ప్రపంచ వ్యాప్తంగా విస్తరిల్లాల్సిన ఆవశ్యకతను గురించి ఆయన ప్రప్రథమంగా ఆ సభలో ప్రకటించాడు. వైజ్ఞానిక రంగంలోను, సాంకేతిక పరంగాను, సంపదలోను, ఆధిపత్యంలోను, ప్రజాహితాల్ని విడనాడ కుండా పురోగమించే అమెరికా ముఖ్యంగా ఈ మత సమన్వయ

ధోరణిని, సహనశీలతను పాటించితీరాలని కూడ స్వామీజీ నొక్కివక్కాణించారు. కాని అమెరికాలోని న్యూ ఇంగ్లండు పరిధిలోని కొద్దిమంది ప్రముఖుల్ని మినహాయిస్తే మిగతా ప్రాంతాల్లోని మత నేపథ్యం అనాగరికమైందిగాను, అసంగతంగాను వుంది. బైబిల్ వ్యాఖ్యలు కేవలం స్థూల దృష్టికి పరిమితమై, పిడివాదా లకు, మతమౌఢ్య విశ్వాసాలకు ప్రాధాన్య మిచ్చే ధోరణిలో సాగాయి. ఈ అనాగరిక మత ఛాందసం అచ్చటి మేధావి వర్గానికి, పరిశోధనాత్మక చింతన కలవారికి ఆమోద యోగ్యంగా లేదు. అలాంటి వారికి వివేకానందుని ప్రవచన సందేశం ఎండి బీటలు వారిన భూమికి వర్షపాతంలాగా రాణించింది.

ఈ విధంగా అమెరికాతో సహా పాశ్చాత్యదేశ వాసుల మనస్సుల్లో ఆధ్యాత్మికత విషయంలో వినూత్న భావనలు పొడసూపాయి. ఈ పరివర్తన విస్తారంగా మేధావి వర్గానికి చెందిన స్త్రీ పురుషుల్లో సంభవించింది. అలా వివేకానంద ద్వారా వేదాంత చింతనలో వచ్చిన మార్పును పలుచోట్ల మనం గమనిస్తాం. డి.హెచ్. లారెన్సు రచించిన 'The Plumed Serpent' మెక్సికన్ల జీవితాల్ని విశ్లేషించింది. ఆ గ్రంథంలో కాథలిక్ మతానికి ముందు వున్న అజ్‌టెక్ మతం పునరుద్ధరించబడి మెక్సికోలోని ఒక వర్గానికి చెందిన రాజకీయ ప్రచారకులలో అమలులో వున్నట్లు వివరింపబడింది. ఈ ఉద్యమ నాయకుల్లోని కొందరు ప్రదర్శించిన మానసిక ప్రవృత్తి అత్యాధునికంగా వుండటం మనల్ని ఆశ్చర్యచకితుల్ని చేస్తుంది. ఆ నవలలోని నాయక పాత్రధారి రామన్ రోమన్ క్యాథలిక్ బిషప్‌తో జరిపిన సంభాషణలోని భావనలు వివేకానంద రచనల్లోని అభిప్రాయాలకు నూటికి నూరుపాళ్ళు నకళ్ళుగా ఎంచవలసి వుంటుంది. మామూలు ప్రజానీకానికి ఈ విషయాలు తెలియకపోయినా, వివేకానంద 1893 లో షికాగోలోను, తదనంతరం అమెరికా, ఇంగ్లండు, భారతదేశాల్లో ఇచ్చిన సందేశం ప్రజల మత సంబంధమైన దృక్పథంలో వారి మానసిక ప్రవృత్తి ఉదారతను సంతరించుకోవటానికి అమితంగా దోహదం చేసింది.

షికాగాలో ప్రపంచ రాజ్యాల ముందు వివేకానంద హిందూమత ధర్మాల్ని గురించి

ఇచ్చిన వివరణ భారతదేశానికే గాక, ఒక విధంగా మొత్తం మానవజాతికి అమితమైన ప్రయోజనాల్ని సిద్ధింపచేసింది.

పరుల అన్యాయాలకు, అక్రమాలకు గురియై బాధితులైన ప్రజలపట్ల వివేకానంద వాత్సల్యం ప్రదర్శించి వారి వ్యక్తిగత గౌరవ ప్రతిష్ఠలను పునరుద్ధరించాడు. భారతదేశం బానిసత్వంలో మగ్గిన రోజుల్లో ప్రజల్లో ఆధ్యాత్మిక చైతన్యం నశించింది, ఆత్మవిశ్వాసం సన్నగిలింది; ఏమీ సాధించలేని నిస్సహాయ స్థితి ఏర్పడింది. అట్టి పరిస్థితుల్లో స్వామి వివేకానందలాంటి ఒక అద్భుతచైతన్య శక్తి దేశంలో ఉద్భవించి ప్రజలను కార్యోన్ముఖు లను చేయటం ఒక మహత్తర సన్నివేశం. దేశ భవితవ్యం అంధకార బంధురంలో చిక్కియున్న తరుణంలో భగవంతుడు కరుణామయుడై, నిస్సహాయులైన ప్రజలను ఉద్ధరిస్తాడు. గీతలో చెప్పినట్లు అధర్మం ప్రకోపించి ధర్మం నశించినప్పుడు ధర్మాన్ని రక్షించటానికి పరమాత్మ అవతరిస్తాడు. ఈ సత్యాన్ని నిజం చేయటం కోస మన్నట్లు స్వామి వివేకానంద మనలో అవతరించి మనల్ని మోక్షమార్గంలో నడిపించే కృషిని చేపట్టారు. ఆ దృష్టితో పరికిస్తే వివేకానంద భగవదంశ సంభూతుడుగా ఉద్భవిం చిన ఒక మహానాయకుడు. ఆ విధంగా ఆయన భారతదేశ ప్రజలకేగాక యావత్తు మానవకోటికి దైవదత్తమైన దివ్య పురుషుడుగా పరిగణింపబడతాడు.

# ఎ.ఎల్. బాషమ్

నరేంద్రనాథ్ దత్తా స్వామి వివేకానందుని అసలు నామధేయం. ఆయన జన్మించిన నూరు సంవత్సరాల తర్వాత కూడ ప్రపంచ చరిత్ర పరిగణనలో ఆయన యొక్క ప్రాధాన్యతను అంచనా వేయలేని పరిస్థితిలో మనం వున్నాము. ఆయన మరణ సమయంలో పాశ్చాత్య చరిత్రకారులు గాని, భారతదేశ చరిత్రకారులు గాని చేసిన వ్యాఖ్యల కంటే అది అతీతమైందిగా వుంటుంది. ఈ కాలక్రమంలో జరుగుతున్న, జరిగిన వివిధ సన్నివేశాల్ని, ఊహాతీతమైన సంఘటనలను పరికిస్తే, రానున్న శతాబ్దా లలో ఆధునిక ప్రపంచ నాగరికతను తీర్చిదిద్దిన మహనీయులలో ఒక ప్రముఖ వ్యక్తిగా వివేకానందను ప్రజలు స్మృతిపథంలో పదిలపరచుకుంటారనిపిస్తుంది. ముఖ్యంగా ఆసియాకు సంబంధించినంతవరకు, దీనిని ఎవరు కాదనలేరు. భారతదేశ మతచరిత్రను విశ్లేషిస్తే, వివేకానందుని ప్రాముఖ్యత మహాప్రవక్తలైన శంకరాచార్య, రామానుజులతో సరితూగగలదని మనకు గోచరిస్తుంది. ఇక కబీరు, చైతన్య, దక్షిణ భారతంలోని నాయన్మార్లు, ఆల్వార్ల స్థాయి స్థానిక ప్రాధాన్యత గల మత ప్రచారకులతో పోలిస్తే స్వామీజీ యొక్క ఆధిక్యత గణనీయంగా వుంటుంది.

ప్రపంచ చరిత్రలో ఒక విశిష్ట వ్యక్తిగా వివేకానంద ప్రజలచే పరిగణింపబడతాడని నా విశ్వాసం. డా ॥ సి.ఇ.ఎం. జోడ్ ఒకానొక సమయంలో అభివర్ణించినట్లుగా ప్రాక్‌దేశ ప్రతివాద సమరాన్ని ప్రారంభించిన వ్యక్తి వివేకానంద అగుటయే దానికి కారణం. అంతకు వేయి సంవత్సరాలకు పూర్వం ఆగ్నేయ ఆసియా దేశాల్లోను, చైనా లోను బౌద్ధమతాన్ని, హిందూమతాన్ని ప్రచారం చేస్తూ పర్యటించిన భారతదేశ మత ప్రచారకుల కాలం నుండి పర్యవేక్షిస్తే, భారతీయేతర ప్రాంతాల్లో ప్రజల హృదయాల్లో భారతదేశ మత ప్రవక్తగా రాణించిన వ్యక్తి వివేకానంద మాత్రమేనని రూఢియౌతుంది.

# ఇ.పి. ఛెలిసేవ్

వివేకానందుని రచనలు పఠిస్తుంటే చదివినప్పుడల్లా క్రొత్త విషయాలు మనకు ఆవిష్కరిస్తాయి. ఆ పఠనంవల్ల భారతదేశాన్ని గురించి, దాని తాత్త్విక విజ్ఞానాన్ని గురించి, భూతవర్తమాన కాలాల్లో ప్రజల యొక్క ఆచారవ్యవహారాలను గురించి, భవిష్యత్తుపట్ల వారు కనే కలలను గురించి మనకు అవగాహన కల్గుతుంది. భారతీయ సంస్కృతీ స్వరూపాన్ని ఇముడ్చుకొన్న ఉన్నత మానవతా ధర్మాలను తన బోధనల ద్వారా ప్రగతి పథంలో నడపటం వివేకానంద మానవాళికి అందించిన అమూల్యసేవ.

సమకాలీన భారతీయ సాహిత్యం చదివినప్పుడల్లా వివేకానంద ప్రవచించిన మానవతాదర్శాల ప్రభావం చాలమంది గ్రంథకర్తల రచనలపై అమితంగా వుందని నేను తెలుసుకున్నాను. నా అంచనా ప్రకారం వివేకానందుని మానవతావాదం, క్రైస్తవ ధర్మాలతో ఏ విధమైన సామ్యాన్ని కల్గివుండదు. క్రైస్తవ ధర్మాలు వ్యక్తిలో నిష్క్రియాపర త్వాన్ని ఉత్ప్రేరించి, అన్నిటికి భగవానునిపై ఆధారపడే ధోరణిని ప్రబోధిస్తాయి. జాతీయ ప్రయోజనాల సాధనకే మతాదర్శాలు అంకితం కావాలని ఆయన ప్రయత్నించారు. ఇంకా వాని ద్వారా తోటి మానవుల దాస్య శృంఖలాలు ఛేదింపబడాలని కూడ ఆయన ఆశించారు. వలస రాజ్యాధినేతలు భారతదేశంలో ప్రార్ధనా మందిరాలను విస్తా రంగా నిర్మిస్తున్నారని, ప్రాక్ దేశవాసులకు మతంకంటె ముందు ఆహారం అత్యావశ్యక మని వివేకానంద తన రచనల్లో ఉటంకించాడు. ప్రజలు మత మౌఢ్యులుగా మార కుండా, పూర్తిగా నిరీశ్వర వాదులుగా పరిణమిస్తారని, దానిని త్వరలోనే చూడగలనని ఆయన భావించాడు. వ్యక్తికి ఉన్నత స్థాయిని కల్పించే తలంపుతో అతడు భగవ త్స్వరూపుడని వివేకానంద నిర్ధారించాడు.

వివేకానంద ప్రతిపాదించిన మానవతావాదంలోని ధార్మికతను మనం ఆమో దించనప్పటికి, మానవుని ఉన్నతిని సాధించే ఆకాంక్షను ప్రదర్శించే చైతన్యవంతమైన

మానవతాంశాలను అది కలిగియుండటాన్ని మనం గుర్తిస్తాం. ఆ ఆకాంక్ష మానవుని ఉన్నతితోబాటు, అతనిలో ఆత్మగౌరవం పట్ల స్పృహ, తన లక్ష్యాన్ని, తోటి మానవుల లక్ష్యాన్ని సాధించే బాధ్యతాయుతవర్తన, సదాశయాల సాధనకు చేయవలసిన కృషి యందు అనురక్తి, పీడితుడుగా జీవించటం పట్ల నిరసన భావం – వీటన్నిటికి ప్రేరణ కల్పిస్తుంది. వివేకానందుని మానవతా ధర్మాలకు, గోర్కీ యొక్క వ్యక్తి ప్రవృత్తికి సామీప్య సామ్యం గోచరిస్తుంది.

ఆ విధంగా మానవతావాద దృష్టితో నిర్దేశింపబడిన మానవ ప్రవృత్తి సారం వివేకానందుని ప్రాపంచిక దృష్టిలో ప్రజాస్వామ్య స్వభావాన్ని నిరూపిస్తుంది.

కాలం గతించవచ్చు; మానవుల్లో తరాలు మారవచ్చు; వివేకానంద జీవించిన యుగం కాలగర్భంలో కలియవచ్చు, కాని మానవాభ్యుదయానికి నిత్యం కలలుగని, సమకాలీన దేశప్రజలు అన్యాయానికి, కౄరత్వానికి గురికాకుండ సంరక్షించుకుంటూ దేశం ముందుకు సాగే యత్నంలో కార్యోన్ముఖులను చేయటానికి తగిన స్ఫూర్తిని ప్రసాదించిన వివేకానందుడ్ని మన స్మృతుల నుండి చెరిపివేయలేము.

తుఫానుల నుండి, పెనుగాలుల నుండి, అలల తాకిడి నుండి, తీరమైదానాన్ని రాతి కొండలు ఏ విధంగా రక్షిస్తాయో, అదే విధంగా వివేకానంద శత్రువుల నుండి మాతృదేశాన్ని కాపాడటానికి అహర్నిశలు నిస్వార్థతతో ధైర్యసాహసాలతో వారితో పోరాటం సల్పాడు.

వివేకానందుని రచనలు సోవియట్ రష్యాలో ప్రచురింపబడటంవల్ల అచ్చటి ప్రజలు కూడ భారతదేశ ప్రజలతోబాటు మొత్తం మానవాళి యొక్క అభ్యుదయానికి కృషి చేసిన దేశభక్తుడు, ప్రజాతంత్రవాది, మానవతావాదియైన వివేకానందుని స్మృతిని తమ హృదయాల్లో పదిలపరచుకుంటారు.

# హ్యుయాంగ్ క్సిన్‌చుయాన్

ఆధునిక చైనా దృష్టిలో ఒక అద్వితీయ తాత్త్వికుడుగా, సామాజిక వ్యక్తిగా వివేకానంద విరాజిల్లుతాడు. ఆయన తాత్త్విక, సామాజిక స్ఫురణలు, చారిత్రాత్మక దేశభక్తి భారతదేశంలో జాతీయోద్యమానికి స్ఫూర్తిని సమకూర్చటమేగాక విదేశీయుల్ని కూడ ప్రభావితం చేశాయి. వివేకానంద కాంటన్ పట్టణాన్ని, దాని పరిసరాల్ని దర్శిం చాడు. చైనా యొక్క నాగరికతను, చరిత్రను కూడ కొంతవరకు ఆయన అవగాహన చేసికొన్నాడు. ఆయన రచనల్లో, ప్రసంగాల్లో చైనా ఘనతను తరచుగా శ్లాఘించాడు. భవిష్యత్తులో చైనా తన సంస్కృతిని ఊహాతీతంగా పునరుద్ధరించు కొంటుందని ఆయన సూచించాడు. ప్రాక్ పశ్చిమ సంస్కృతులను ఏకీకరించే ఉద్యమానికి కూడ చైనా బాధ్యత వహిస్తుందని ఆయన అంచనా. ఆయన జీవిత చరిత్రను రచించిన రోమైన్ రోలండు ఈ అంశంపై వివేకానందుని ఆలోచనా క్రమాన్ని విశదీకరిం చాడు. వివేకానంద మొదటిసారి అమెరికా వెళ్లినపుడు ఆ దేశం ఈ ఉద్యమంలో కృతకృత్యతను సాధిస్తుందని భావించాడు. కాని అమెరికాను గురించిన తన అంచనాలు సరికావని, తాను డాలరు సామ్రాజ్యవాదం చేత మోసగింపబడ్డానని ఆయన ద్వితీయ యాత్రా సమయంలో తెలుసుకున్నాడు. అందుచేత అమెరికా ఈ బృహత్కార్యాన్ని సాధించలేదని, దానిని ఫలప్రదం చేసే అర్హత ఒక్క చైనాకు మాత్రమే వుందని ఆయన తీర్మానించాడు.

సామ్రాజ్య పరిపాలనా విధానం యొక్క, భూస్వామ్య విధానం యొక్క ఉక్కు పాదాల క్రింద సతమతమై జీవిస్తున్న చైనా ప్రజలంటే వివేకానందకు అమితమైన సానుభూతి. ఐనా వారి అభివృద్ధిపైన ఆయనకు అమితమైన విశ్వాసం. ఆయన చైనా సందర్శించిన తర్వాత ఆసక్తికరమైన ఒక వ్యాఖ్యను వెలిబుచ్చాడు. చైనా బాలుడు ఒక తాత్త్వికుడని, అతి బాల్యంలోనే ఏదో ఒక పనిలో నిమగ్నుడౌతాడని, ఆ వయస్సులో భారతదేశంలో బాలుడింకా పాకే స్థితిలోనే వుంటాడని ఆయన ప్రకటించాడు. ఆ చైనా బాలునికి జీవితావసారాలను గురించిన అవగాహన పరిపూర్ణంగా వుంటుందని కూడ ఆయన చెప్పారు. దీనినిబట్టి పాత సమాజంలో

చైనా పిల్లల దైన్యస్థితి పట్ల వివేకానంద ప్రగాఢమైన కారుణ్యభావాన్ని ప్రదర్శించాడని తెలుస్తుంది.

ఆయన ఊహల్లో చిత్రించుకొన్న సామ్యసామాజిక వ్యవస్థను గురించి విశదీ కరిస్తూ వివేకానంద ఒక ఆసక్తికరమైన సత్యాన్ని ప్రకటించాడు. భవిష్యత్తులో సమాజాన్ని శ్రామికవర్గం పరిపాలిస్తుందని, ఆ విధానం ప్రప్రథమంగా చైనాలోనే సంభవిస్తుందని ఆయన సూచించాడు. అలాగే భారతదేశంలో అధునాతన వ్యవస్థలో కాల ప్రభావం వల్ల బ్రాహ్మణులు, ఇతర అగ్రవర్ణాల వారు కూడ శూద్రుల స్థాయికి దిగజారుతారని, శూద్రులు ఉన్నత వర్గాల స్థానాన్ని ఆక్రమిస్తారని ఆయన ఆశను వెలిబుచ్చారు. “మన కళ్లముందే అతి శక్తివంతమైన చైనా అనూహ్యమైన వేగంతో శూద్రస్థాయికి దిగజారటం గమనిస్తున్నాం. కాని తమ శ్రామిక ప్రభావంతోనే శూద్రులు ఉన్నత స్థాయికి ఎదిగే కాలం తప్పక వస్తుంది. ఈ పరివర్తన ప్రతిదేశంలోనూ సంభవించే సమయం వస్తుంది. అప్పుడు ప్రతి సమాజంలో శూద్రులే ఆధిపత్యాన్ని సంపాదించు కుంటారు. సామ్యవాదం, అరాచకత్వం, మతరాహిత్య విధానం తదనుగుణమైన ఇతర వ్యవస్థలు వర్ధిల్లి సామాజిక విప్లవానికి నాయకత్వం వహిస్తాయి.” అని వివేకానంద ముందు రానున్న పరిస్థితులను సూచించాడు.

పై విషయాలని, ఆయన జీవితాన్ని, రచనలను సమగ్రంగా పరికిస్తే, సామ్రాజ్య వ్యవస్థలోను, భూస్వామ్య వ్యవస్థ ద్వారాను పరిపాలింపబడుతున్న చైనా ప్రజలపట్ల వివేకానంద అపారమైన అభిమానాన్ని ప్రదర్శించాడని మనకు తెలుస్తుంది. వారి అభ్యున్నతిపై ఆయనకు పరిపూర్ణ విశ్వాసం వుండేది. కాని చైనాలోను, రష్యాలోను ఒక నిర్ణీత చారిత్రక సమయంలో సంభవించిన విప్లవ విజయాలకు వివేకానందుని భవిష్యత్ వాణియే మూలకారణమని నిర్ధారించిన బి.ఎన్. దత్తాతో మనం ఏకీభవించ లేము. ఆయన అభిప్రాయాన్ని మనం ఆమోదిస్తే వివేకానంద ఒక మానవాతీత శక్తులున్న దివ్య పురుషుడుగా మన భావంలో మిగులుతాడు. సామాజిక సంఘటనల నియతి నియమాల పట్ల వివేకానందుని అవగాహన

అశాస్త్రీయంగా వుండటాన్ని మనం గమనించాం. చారిత్రక ప్రగతిలోని వివిధ ఘట్టాలను, సన్నివేశాలను అతి వివరంగా ఊహించి యధాతథంగా ప్రజల ముందుంచటం ఒక మేధావి వల్ల కాని పని. కనుక వివేకానందను యథార్థ సన్నివేశాల నుండి సత్యాన్ని అన్వేషించే వ్యక్తిగా మాత్రమే అంచనా వేయాలి.

పర్యవసానంగా భారతదేశంలోని ప్రజాస్వామ్య దేశభక్తుల్లో వివేకానంద ఒక అద్వితీయ మహనీయుడుగా మనకు గోచరిస్తాడు. సర్వోత్కృష్టమైన మన దేశ సంస్కృతిని ఆయన ఘనంగా కీర్తించాడు. శ్రమజీవులైన చైనా ప్రజలను ఆయన అమితంగా ప్రేమించాడు.

అట్టి మహనీయుని పట్ల మనం వినమ్రత పాటిద్దాం.

# అనుబంధం – *I*

## లియోటాల్‌స్టాయి (1828–1910)

ఈయన రష్యాదేశస్థుడు, గొప్ప నవలా రచయిత. ఈయన 1852 నుండి 1854 వరకు రష్యా సైన్యంలో పని చేశాడు. 'War And Peace' (1865-69) మరియు 'Anna Karenina' (1875-77) అనే గ్రంథాలు రచించాడు. 1876 తర్వాత క్రైస్తవ మత స్వేచ్ఛావాదాన్ని విస్తరింపచేసి సంఘ సంస్కరణోద్యమంలో జీవితం గడిపాడు.

## రవీంద్రనాథ్ టాగూర్ (1861–1941)

ఈయన విశ్వవిఖ్యాతి గాంచిన సాహితీవేత్త, వేదాంతి, విద్యావేత్త. 'గీతాంజలి' ఆంగ్లేయ అనువాదానికి ఈయనకు 1913 లో నోబెల్ బహుమతి బహూకరింపబడింది. ఆ బహుమానాన్ని అందుకున్న మొట్టమొదటి ఆసియావాసి ఈయనే. బెంగాలీ భాషలో రచింపబడిన కవితా సంపుటియే ఈ 'గీతాంజలి' గ్రంథం. 1919 లో జరిగిన జలియన్ వాలాబాగ్ సైనిక భయానక హింసలకు నిరసనగా ఆయన తన 'నైట్‌హుడ్' ను త్యజించాడు.

# శ్రీ అరవింద (1872–1950)

అరవింధ ఘోష్ ఐ.సి.యస్. పరీక్షలో ఉత్తీరుడైనప్పటికి ప్రభుత్వ ఉద్యోగాన్ని స్వీకరింపక స్వాతంత్ర్య సమరోద్యమానికి సేవలందించాడు (1902–1910). తర్వాత రాజకీయాల్ని విడనాడి పాండిచ్చేరి చేరి జీవితాంతం అచ్చటే గడిపాడు. ఆయన రచనల్లో ప్రముఖమైనవి 'The Life Divine' మరియు 'The Synthesis of Yoga'.

# బ్రహ్మబాంధవ ఉపాధ్యాయ (1861–1907)

ఈయన పూర్వనామధేయం భవాని చరణ్ బందోపాధ్యాయ. ఈయన నరేంద్రనాథ్ దత్తా (ఈయనే తర్వాత స్వామి వివేకానంద) కు జనరల్ అసెంబ్లీ యొక్క సంస్థలో సహపాఠకుడు. తర్వాతి కాలంలో ఈయన శ్రీరామకృష్ణ, కేశవ చంద్రసేన్‌ల సహచర్యంలో సంచరించాడు. హిందూమతం పట్ల విముఖుడై ప్రప్రథ మంగా 'ప్రొటెస్టెంట్' తర్వాత క్యాథలిక్ మతాల్ని అవలంబించాడు. అప్పుడే అనగా 1894 లో ఆయన 'సోఫియా' ను ప్రారంభించాడు. ఆయనే తర్వాత 'స్వరాజ్' మరియు 'సంధ్య' లను కూడ ఆరంభించాడు. 'అమర భారత ఉద్ధార్', 'సమాజతత్వ', 'బేలతజాత్రి సన్యాసిర్ చితి' మొదలైన గ్రంథాలను కూడ ఈయన రచించాడు.

# బాలగంగాధర్ తిలక్ (1856–1920)

రత్నగిరిలో జన్మించిన తిలక్ మహాశయుడు భారతస్వాతంత్ర్యోద్యమానికి ప్రథమశ్రేణి నాయకుడుగా కీర్తిగాంచాడు. భారతజాతి ఆందోళన పితగా ఈయన విశ్వవిఖ్యాతి గాంచాడు. స్వామి వివేకానంద, స్వామి దయానందుల ప్రబోధనలతో ప్రభావితుడై ఈయన వేదాంతతత్త్వ జ్ఞానాన్ని విస్తృతంగా అధ్యయనం చేశాడు. సంస్కృత వాఙ్మయంలోను, గణిత శాస్త్రంలోను ఈయన ప్రావీణ్యత అమోఘం. 'గీతారహస్యం', 'ది ఆర్కెటిక్ హోమ్ ఇన్ ది వేదాస్' అనే గ్రంథాలు కూడ ఈయన రచనల్లోవే.

# బిపిన్ చంద్రపాల్ (1858–1932)

స్వాతంత్ర్య సమరోద్యమంలో అగ్రగణ్యుడుగా ఈయన ఖ్యాతి గాంచాడు. రాజకీయాల్లో ఈయన తిలక్, లజపతిరాయి, అరవిందలతో కలసి కృషిచేశాడు. ఈయన 1906 లో 'వందేమాతరం' అనే దినపత్రికను, 1913 లో 'Hindu Review' అనే మాసపత్రికను ఆరంభించాడు. బాల్యంలో ఈయన 'బ్రహ్మో' మతాన్ని స్వీక రించాడు. కాని తరువాతి జీవితంలో శంకరాచార్యుని తత్త్వబోధనలచేత, వైష్ణవ వేదాంతం చేత మిక్కిలిగా ప్రభావితుడైనాడు. ఆయన ప్రబోధాలు సంచలనాత్మకం; ఆయన బహుళ గ్రంథ రచయిత; అంతేగాదు, భావుకతలో అగ్రగామి. ఆయనను ఒక సౌష్ఠవమైన జాతీయతా ప్రవక్తకునిగా అరవిందులవారు అభివర్ణించారు.

# మోహన్‌దాస్ కరమ్ చంద్ గాంధి (1869–1948)

ఈయన భారతజాతీయవాది. ప్రజల హృదయాల్లో 'బాపూజీ' గాను, 'జాతిపిత' గాను స్థిరపడ్డ మహనీయుడీయన. 1888–91 సంవత్సరాలలో ఈయన లండన్‌లో న్యాయశాస్త్రాన్ని అభ్యసించాడు. 1893 లో భారతదేశంలో న్యాయవాదవృత్తి చేపట్టాడు. 1893 లోనే దక్షిణ ఆఫ్రికాలోని నల్లజాతీయుల సమస్యల నిర్మూలనం కొరకు ఉద్యమించాడు. 1925–34 కాలంలో భారత జాతీయ కాంగ్రెసుకు అధ్యక్షత వహించాడు. 'హింద్ స్వరాజ్' అనే గ్రంథాన్ని 1909 లో రచించాడు. తర్వాత 'The Story of My Experiments with Truth' మరియు ఇంకా ఇతర గ్రంథాలు రచించాడు.

# జవహార్‌లాల్ నెహ్రూ (1889–1964)

ఈయన భారత జాతి గర్వించతగ్గ రాజకీయవేత్త; స్వతంత్ర భారతదేశానికి ప్రప్రథమ ప్రధాన మంత్రి ఈయనే. గాంధిగార్ని అతిసన్నిహితంగా అనుసరించిన అగ్రనాయకుల్లో ఈయన ఒకడు. భారతదేశం యొక్క విదేశీ వ్యవహారాలను రూపుదిద్దిన దిట్ట ఈయనే. బహు గ్రంథ రచయితగా పేరు పడ్డ మహనీయుడు. ఆయన 'ఆత్మకథ', 'Discovery of India', 'Glimpses of World History', Letters from a Father to the Daughter' మొదలైన గ్రంథాలు ఈయన రచనల్లో ఘనంగా పేర్కొన తగ్గవి. 1955 లో ఈయనకు 'భారతరత్న' బిరుదు ఈయబడింది.

# సుభాస్ చంద్రబోసు (1897–1945)

ఈయన భారతదేశ రాజకీయ నాయకుడు. గాంధీజి ఉద్యమాన్ని బలపరిచాడు. 1923 లో స్వరాజ్ పార్టీలో చేరాడు. 1924 లో కలకత్తా నగరానికి ప్రధాన కార్య నిర్వాహకుని పదవినలంకరించాడు. 1927 లో బెంగాలు కాంగ్రెసుకు అధ్యక్షుడుగా ఎన్నికైనాడు. 1928 లో ఆ సంస్థ తరుపున జాతీయ కాంగ్రెసును కలిసిన ఒక రాయబార వర్గానికి ఆయన నాయకత్వం వహించారు. భారతదేశానికి సంపూర్ణ స్వాతంత్ర్యమే కావాలని వాదించాడు. జైలు శిక్షను పలుసార్లు అనుభవించాడు. 'The Indian Struggle', 'Taruner Swapna' అనే గ్రంథాల్ని 1935 లో రచించాడు. 1938 లో భారత జాతీయ కాంగ్రెసుకు అధ్యక్షుడయ్యాడు.

# వినోబాభావే (వినాయకభావే) (1895–1982)

ఈయన జాతీయ నాయకుడు, సంఘ సంస్కర్త. జాతీయోద్యమ సమయంలో ఈయన గాంధీజీకి ప్రధాన మద్దతుదారుగా తన జీవనాన్ని సాగించాడు. భారతదేశం స్వాతంత్ర్యాన్ని పొందిన తర్వాత 1951 లో భూదాన ఉద్యమాన్ని ఆరంభించాడు; దానికొరకు భారతదేశం నలుమూలల కాలినడకతో సంచరించి భూస్వాములను, ధనికులైన రైతులను అనునయించి వారు పేదరైతులకు స్వచ్ఛందంగా భూదానాన్ని చేసేటట్లు ప్రయత్నించాడు. గోవధ నిషేధాన్ని అమలుచేసే యత్నంలో దేశం నలు మూలలా ప్రచారం చేశాడు.

# రోమైన్ రోలండు (1866–1944)

ఈయన సాహిత్యవేత్తయైన ఫ్రాన్సు దేశస్థుడు. 'Jean Christophe' (190412) అనే నవలా గ్రంథం, 'An-dessus de lamelee' (1915) అనే శాంతి ప్రమాణాల సంపుటిని రచించినందుకు ఈయనకు 1915 లో సాహిత్యపరంగా నోబెల్ బహుమతి ప్రదానం జరిగింది. ఈయన ఇతర రచనలు : 'L'ame-Enchantee (1922-33) అనే నవల, 'Le Theatre de la revolution' మరియు 'Les Tragedies de la foi' (1913) అనే చారిత్ర్యక, తాత్త్విక నాటక సంపుటి 'Beethoven' (1903), Michel-Angelo (1905), Tolstoi (1911) మరియు 'Mahatma Gandhi' (1924) అనే జీవిత చరిత్రలు. ఐన్‌స్టీన్, ష్వీట్జరు, బెర్ట్రండ్ రసెల్, శ్రీరామకృష్ణ, స్వామి వివేకానంద, రవీంద్రనాథ్ టాగూర్‌లతో ఈయన ఉత్తర ప్రత్యుత్తరాలు జరిపాడు. సాహసోపేతమైన ఆదర్శవాదాన్ని ప్రబోధించే ప్రచారకుడుగా ఈయన ప్రసిద్ధుడైనాడు. ఐరోపాదేశం యొక్క అంతర్జాతీయ పర్యవేక్షణా పథకాన్ని స్థాపించటంలో ఈయన సాయపడ్డాడు (1923).

# విల్లియం డ్యూరాంటు (1885–1981)

అమెరికన్ చరిత్రకారుడైన డ్యూరాంటు, విల్లియమ్ జేమ్సు న్యూయార్కు నగరంలోని హాబరు టెంపుల్ స్కూలులో ఉపాధ్యాయుడుగా పనిచేశాడు (1914–27). ఆయన రచించిన 'The story of Philosophy' జయప్రదమైన తర్వాత ఆయన సతీమణి ఏరియల్ డ్యూరాంటుతో కలసి 11 సంపుటాలు కల్గిన 'Story of Civilisation' ను రచించాడు. ఆ 11 సంపుటాలు: Our oriental Heritage (1935), The life of Greece (1939), Caesor and Christ (1944), Age of Faith (1950), Renaissance (1953), Reformation (1957), Age of Reason Begins (1961), Age of Louis XIV (1963), Age of Voltaire (1965), Rousseau And revolution (1967, Pulitzer Prize), Age of Napolean (1975). ఇదిగాక Dual Biography (1977) కూడ రచించాడు.

# సి. రాజగోపాలాచారి (1879–1972)

ఈయన భారతదేశ జాతీయవాది. 1918 నుండి గాంధీజీకి సన్నిహితుడుగా మెలిగాడు. ఇండియన్ నేషనల్ కాంగ్రెస్ కమిటీలో 1922 నుండి 1942 వరకు సభ్యుడు. మద్రాసు రాష్ట్రానికి ముఖ్యమంత్రి (1937–39; 1952–54); భారతదేశ

గవర్నరు జనరల్ (1948–50); సాంప్రదాయ నిబద్ధమైన స్వతంత్రపార్టీ వ్యవస్థాపకుడు (1959).

# యస్. రాధాకృష్ణన్ (1888–1975)

ఈయన తాత్త్వికుడు, మానవతావాది, విద్యావేత్త, ప్రాక్దేశవాది. భారతదేశానికి ఉపాధ్యక్షుడుగా ఎన్నుకోబడ్డాడు (1952); భారతదేశ సర్వసత్తాకవ్యవస్థకు అధ్యక్షుడుగా ఏకగ్రీవంగా ఎన్నికైనాడు (1962–67), ఆయన ప్రధాన రచనలు : The Philosophy of the Upanishads (1924), Eastern Religions and Western Though (1939), East And West (1955)

# రమేష్ చంద్ర మజుందార్ (1888–1980)

ఇతడు ప్రసిద్ధ చరిత్రకారుడు, విద్యావేత్త. 'History of Mankind: Cultural and Scientific Development' ప్రచురణ నిర్వహించిన అంతర్జాతీయ సంస్థకు ఉపాధ్యక్షుడు. కలకత్తా విశ్వవిద్యాలయం, రవీంద్రభారతి విశ్వవిద్యాలయం, జాదవ్‌పూర్ విశ్వవిద్యాలయాల నుండి D.Litt గౌరవ డిగ్రీని పొందాడు. ఈ క్రింద పేర్కొన్న గ్రంథాలు ఆయన ప్రచురణలలోనివే : History and Culture of the Indian People (11 సంపుటాలు), History of Freedom Movement in India (3 సంపుటాలు), Ancient Indian Colonies in Far–East, Swami Vivekananda, History of India (4 సంపుటాలు) మొదలైనవి.

# సునీతికుమార్ ఛటర్జీ (1890–1977)

ఈయన అంతర్జాతీయ ప్రఖ్యాతి గాంచిన విద్యావేత్త. బహు భాషాకోవిదుడు. విద్యారంగంలో అసాధారణ ప్రతిభను ప్రదర్శించిన వ్యక్తి. ఈయన ఆంగ్లంలో ప్రచురించిన గ్రంథాలు : Bengali Self-taught, A Bengali Phonetic Reader, Indo-Aryan And Hindi, Languages and Literatures of Modern India, Africanism, Balts and Aryans in their Indo-European Back ground, India and Ethiopia from the Seventh Century B.C., ఇంకా పరిశోధనాత్మక పత్రాలు, మోనోగ్రాపులు.

# ఎ.ఎల్. బాషామ్ (1914–1986)

ఈయన సోవియట్ రష్యాకు చెందిన ప్రఖ్యాత ఇండోలజిష్టు. బ్రిటను, అమెరికా, భారతదేశం, పాకిస్థాన్, శ్రీలంక దేశాలలో ఆహ్వానితుడై పర్యటించిన ఆచార్యవర్యుడు. 1985 లో విశ్వభారతి విశ్వవిద్యాలయం నుండి 'దేశికోత్తమ' అనే బిరుదును గ్రహిం చాడు. కలకత్తా ఏషియాటిక్ సొసైటీ యొక్క ఆచార్యుడు. రామకృష్ణ – వివేకానంద ఉద్యమానికి అధ్యక్షుడు. ఈయన రచనల్లో 'The Wonder that was India' చాల ప్రసిద్ధి చెందినది.

# ఇ.పి. ఛెలిషేవ్ (1921–)

ఈతడు సోవియట్ రష్యాకు చెందిన ప్రసిద్ధ ఇండోలజిష్టు. సమకాలీన భారతీయ సారస్వతంలో – ముఖ్యంగా హిందీ సాహిత్యంలో – కీర్తిగడించిన పండితుడు. జవహర్‌లాల్ నెహ్రూ శాంతి బహుమాన గ్రహీత; గత ముప్పది సంవత్సరాలుగా వివేకానంద సంస్కృతి పరిశోధనలను విస్తృతంగా ప్రచారం చేసిన ఉద్యమంతో ఈయనకు సంబంధం వుంది. Committee for comprehensive study of Ramakrishna – Vivekananda Movement కి ఉపాధ్యక్షుల్లో ఒకరు.

# హ్యుయాంగ్ క్సిన్ ఛుయాన్

చైనాలోని బీజింగ్ విశ్వవిద్యాలయంలో చరిత్ర విభాగానికి ఈయన ఆచార్యుడు. బీజింగ్‌లోని Institute of Asian Studies at the Academy of Social Sciences లో ఈయన ఉపసంచాలకుడుగా వ్యవహరించాడు. స్వామి వివేకానంద మీద చైనా భాషలో 'The Modern Indian Philosopher, Vivekananda – A Study' అనే గ్రంథాన్ని రచించాడు. Committee for Comprehensive Study of Ramakrishna – Vivekananda Movement కు ఉపాధ్యక్షులలో ఈయన ఒకరు.

# “ఆత్మనో మోక్షార్థం జగద్ధితాయచ”

**(ఆత్మ విమోచనం కొరకు, విశ్వమానవ శ్రేయస్సు కొరకు)**
**రామకృష్ణ మిషన్ శతవార్షికం (1897–1997)**

“శాశ్వతమైన, ఘనమైన ప్రయోజనాల్ని సాధించాలంటే సంఘటితమైన వ్యవస్థల ద్వారానే సాధ్యమవుతుందని నా పలుదేశ పర్యటన అనుభవాల దృష్ట్యా నేను నిర్ణయించుకున్నాను. ఏ మహామహుని నామోచ్చారణతో మనమందరము సన్న్యాసాశ్రమాన్ని స్వీకరించామో, ఏ మహాత్ముని దివ్యత్వాన్ని ఆదర్శంగా గృహస్థాశ్రమ వాసులు తమ జీవితాల్ని తీర్చిదిద్దుకుంటున్నారో, ఏ మహిమాన్వితుని పవిత్రనామం వారి అసమాన జీవితోపదేశ ప్రభావం ఆయన నిర్యాణానంతరం ద్వాదశవర్ష కాల పరిమితంలోనే ప్రాక్పశ్చిమ దేశాల్లో అనూహ్య పరిమాణంలో విస్తరించాయో అట్టి దివ్యపురుషుని నామమే ఈ సంస్థ పేరుగా విలసిల్లాలి. కనుక ఈ సంస్థకు ‘రామకృష్ణ మిషన్’ అని నామకరణం చేద్దాం. మన మందరం ఆ మహాప్రభువు శ్రీరామకృష్ణుని యొక్క సేవకులం మాత్రమే. ఈ ఉద్యమంలో మీ అందరి సంపూర్ణ సహకారం సంస్థకు లభించగలదని ఆశిస్తాను.”

1987 మే నెల 1 వ తేదీన ఉత్తర కలకత్తా నగరంలోని బలరాం బోసు ఇంట్లో సమావేశితులైన కొలది మంది శ్రీరామకృష్ణ మఠానికి చెందిన సన్న్యాస శిష్యుల్ని ఉద్దేశించి స్వామి వివేకానంద పై భావాల్ని ప్రకటించారు. ఈ సమావేశం లోనే “రామకృష్ణ మిషన్” పేరుతో ఒక సంస్థ స్థాపన జరిగింది. మే నెల 5 వ తేదీన జరిగిన ద్వితీయ సమావేశంలో “మిషన్” యొక్క నియమ నిబంధనావళి రూపొందించబడింది.

గత శతాబ్ది కాలంలో 'మిషన్' యొక్క ఉద్యమ కార్యక్రమాలు బహుళంగా విస్తరించాయి. దాని ప్రధాన కార్యాలయం పశ్చిమ బెంగాలులోని బేలూరు మఠంలో స్థాపితమైయుండగా, దానికి ప్రస్తుతం భారతదేశంలోను, ఇతర దేశాల్లోను కలిపి 150 శాఖలు వున్నాయి. సంస్థ పాఠశాలల్ని, కళాశాలల్నే గాక, ఆసుపత్రు లనూ, చికిత్సాలయాల్ని కూడా నిర్వహిస్తోంది. అంతేగాక క్షామ పీడుతులకు ప్రకృతి వైపరీత్యాల వల్ల నిరాశ్రయులైన వారికి ఆశ్రయం కల్పించి ఆదరిస్తుంది. నిరుపేదలకు, సమాజపరంగా వెనుకబడ్డ వారిని ఆదుకొని వారికి స్వయంసమృద్ధి కల్పించటంలో చేయూతనిస్తుంది.

## మిషన్ బోధించే ప్రధానాదర్శాలు క్లుప్తంగా ఇవే:

1. అన్ని మతాలు సత్యమైనవే. 2. మానవులందరూ ప్రకృతి సిద్ధంగా దివ్యత్వ మున్నవారే. ఐతే మనుజుల్లోనే దైవత్వాన్ని తెలుసుకోవడమే మానవ జన్మ యొక్క ప్రధాన లక్ష్యం. 3. మానవ సేవే మాధవ సేవ యని గుర్తెరుగవలెను. తదనుగుణంగా తాత్త్వికుడు ప్రప్రథమంగా పరులను ప్రేమించి ఆదరించే వ్యక్తియై వుండాలి. 4. కృషియే భగవదారాధన. 5. పరులను భగవత్స్వరూపులుగా ఎంచి వారికి సేవలొన రించటం, ఆరాధనా భావంతో ప్రతి పనిని నిర్వర్తించటం ద్వారానే వ్యక్తి తనలోని దైవత్వాన్ని సులభంగా తెలిసికోగలుగుతాడు.

రామకృష్ణ మిషన్ కేవలం సన్యాసుల కొరకు మాత్రమే ఏర్పడిన సంస్థ కాదు. అది ఒక మత సంస్థ ఐనప్పటికి, నేటి సమాజానికిది బహుళార్ధ సాధక వ్యవస్థగా పరిగణింపబడాలి. ఒక సార్థక జీవిత లక్ష్యాన్ని సమకూర్చే ఉద్యమ నిలయంగా దీనిని భావించాలి. ఈ ఉద్యమ ప్రాధాన్యతలు ఇంకా ప్రజల ముందు ప్రస్ఫుటంగా దేదీప్యమానంగా ఆవిష్కరింపబడాలి.

స్వామి వివేకానంద స్థాపించిన రామకృష్ణ మిషన్ అనతికాలంలో నూరవ సంవత్సరములోకి ప్రవేశించింది. ఈ శతవార్షిక మహోత్సవాన్ని జరుపుకునే ప్రయత్న భాగంగా ఈ 'మై ఇండియా ది ఇండియా ఎటర్నల్' అనే గ్రంథం కూర్పును విడుదల చేస్తున్నాము.